TIGHT BINDING BOOK

UNIVERSAL
LIBRARY
OU_204252
UNIVERSAL
LIBRARY

OUP—552—7-7-66—10,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T84/D24M Accession No. 7119

Author దివాకర్ల సుధీ.

Title మహాకవి కాళిదాసు.

This book should be returned on or before the date last marked below.

శ్రీకృష్ణపరబ్రహ్మణే నమః.

శ్రీ మహా భారతము

ఆంధ్ర వచనము.

శాంతిపర్వము (1-389.)

దేవరాజనుధీ ప్రణీతము.

మద్రాసు

ఆనందముద్రణాలయమునందు

ముద్రితము.

ఆర్. వేంకటేశ్వర్ అండ్ కంపెనివారిచే ప్రకటితము.

1915.

ALL RIGHTS RESERVED.

All Rights Reserved.

Copyright 1915—By **R. Venkateshwar & Co., Madras.** This book is fully protected by an Indian and Foreign Copyright. No one will be permitted to reproduce this book in whole or in part or translate it into any other language and offer it for sale. A substantial copy of the words, ideas or illustrations contained herein constitutes an infringement of a copyright, and notice is hereby given that suit will be filed in every case of infringement.

కాపీరైట్ 1915 వ సం॥ ఆర్. వేంకటేశ్వర్ అన్డ్ కంపెనివారు కాపీరైట్‌దార్లు. ఈ పుస్తకము ఇండియా కాపిరైటుచేతను పరకీయమైన కాపీరైటుచేతను సురక్షితమైనది. ఎవరుగాని యీపుస్తకమును సంపూర్ణముగాఁగాని లేక యిందొకభాగమునుగాని తాము వేఱుగా ప్రకటించుటకును, మఱి యొకభాషయందు తర్జుమాచేసి క్రయమునకు నిచ్చుటకును, హక్కు ఇయ్యఁబడదు. ఇందుఁ గలపద్యములనుగాని భావములనుగాని పటములనుగాని ఏమాత్రమైనను కాపీచేసినయెడల అది కాపిరైటును నుల్లంఘించిన ట్లగుటచే అట్టివారు దావాకు లోనగుదురని దీనిచే తెలియనగును.

విషయసూచిక.

గంగాతీరమందు ధర్మరాజుకడకు బుషులు వచ్చుట. నారదుని ధర్మపుత్రుఁడు కర్ణవృత్తాంతము నడుగుట 1

కర్ణుఁడు బ్రహ్మాస్త్రవిద్యనిమ్మని ద్రోణుని వేఁడి యతఁడొల్లక పోఁగా పరశురామునికి శిష్యుఁడగుట. కర్ణునికి బ్రాహ్మణ శాపము ... 6

పరశురాముఁడు కర్ణుని తొడపయి నిదురించునపు డొకపురువు వాని తొడను తొలుచుట. పరశురాముఁడు కర్ణుని శపించుట ... 9

దుర్యోధనుఁడు స్వయంవరమున కళింగరాజు కన్యనువరించుట. కర్ణుఁడు దుర్యోధను వెంటఁ దలపడినరాజుల నోడించుట ... 13

కర్ణుని పరాక్రమమును వర్ణించుట 15

కుంతి కర్ణునిఁగూర్చి దుఃఖించుచు ధర్మరాజు నాఱడించుట. ధర్మరాజు స్త్రీలకు రహస్యమును దాఁచుట లేకుండుఁగా తెమని శపించి రాజ్యమునందు విరక్తుఁడగుట 16

ధర్మరాజు దుఃఖించుట 18

అర్జునుఁడు ధర్మరాజును దేర్చుట 23

ధర్మరాజు రాజ్యమువలన వెగటునొందుట 28

ధర్మరాజును భీముఁడు తేర్చుట 32

అర్జునుఁడు ధర్మరాజునకు గృహస్థధర్మము శ్రేష్ఠమని యుపపాదించుట 35

ధర్మరాజునకు నకులుఁడు చెప్పుట 39

సహదేవుఁడు ధర్మరాజునకుఁ జెప్పినది 45

ద్రౌపది ధర్మరాజునకుఁ జెప్పినది 47

అర్జునుఁడు ధర్మరాజునకు జెప్పినది 61

భీముఁడు ధర్మరాజునకుఁ జెప్పినది 67

ధర్మరాజు వైరాగ్యమే గొప్పదియని భీమునకుఁ జెప్పుట ... 71

అర్జునుఁడు ధర్మరాజునకు, జనకునకును నతని భార్యకును జరిగినసంవాద
మును జెప్పి కర్తవ్యము నుపదేశించుట 74
ధర్మరాజు సన్న్యాసమే యుత్తమమని యర్జునునకుఁ జెప్పుట ... 79
దేవస్థానుఁడు ధర్మరాజునకు యాగముచేయుమని చెప్పుట ... 83
దేవస్థానుఁడు ధర్మరాజునకు స్వధర్మము ననుష్ఠించుటయే యుత్తమమని
చెప్పుట 85
అర్జునుఁడు క్షత్రియధర్మము మేలయినదని ధర్మరాజునకుఁ జెప్పుట 87
వ్యాసుఁడు ధర్మరాజునకు శంఖలిఖితోపాఖ్యానమునుజెప్పి శ్రోత్రధర్మ
మును గయికొనుమని బోధించుట 89
వ్యాసుఁడు ధర్మరాజునకు రాజధర్మమును జెప్పి రాజ్యపాలనము చేయ
నియోగించుట 94
వ్యాసుఁడు ధర్మరాజునకు సేనజిత్తు చెప్పినది చెప్పి రాజధర్మముల నుప
దేశించుట 99
ధర్మరాజు ధనము యాగదానాదులకే కాని భోగములకుఁ బగదని
యర్జునునకుఁ జెప్పుట 104
ధర్మరాజు నిర్వేదించుటనుజూచి వ్యాసుఁడు రాజ్యపాలనము సేయ
విధియించుట 109
వ్యాసుఁడు ధర్మరాజునకు నక్షజనకసంవాదమును జెప్పి శ్రోత్రధర్మ
మును విధించుట 112
నారదుఁడు సృంజయునకుఁ జెప్పిన షోడశరాజచరిత్రమును కృష్ణుఁడు
ధర్మరాజునకుఁ జెప్పుట 120
కృష్ణుఁడు ధర్మరాజునకు నారదపర్వతోపాఖ్యానము చెప్పుట ... 136
నారదుఁడు ధర్మరాజునకు సువర్ణష్ఠీవిచరిత్రము చెప్పుట .. 140
వ్యాసుఁడు ధర్మరాజునకుఁ దత్త్వోపదేశముసేయుట. ధర్మరాజు వ్యాసుని
నాశ్రమముల మేలిమినడుగఁగా నతఁడు చెప్పుట ... 144
వ్యాసుఁడు యుద్ధమృతులయిన రాజులసంతతులను వారివారి రాజ్యములఁ
బట్టముగట్టి యశ్వమేధము చేయుమని ధర్మరాజునకుఁ జెప్పుట... 150

వ్యాసుఁడు ధర్మరాజునకుఁ బ్రాయశ్చిత్తములకుఁ దగుపాపములను వాని ప్రాయశ్చిత్తములను జెప్పుట 154

వ్యాసుఁడు ధర్మరాజునకుఁ బాపములకుఁ బ్రాయశ్చిత్తములను జెప్పుట 158

వ్యాసుఁడు ధర్మరాజునకు భక్ష్యాభక్ష్యములను బాత్రాపాత్రములను దెలుపుట 165

వ్యాసుఁడును గృష్ణుఁడును జెప్పినట్లు ధర్మరాజు మనసున శాంతినొంది హస్తినాపురమును బ్రవేశించుట 173

పురజనులు పాండవులను బొగడుట. ధర్మరాజు రాజసభాప్రవేశము. ధర్మరాజును నిందించిన చార్వాకుఁ డనురాక్షసుఁడు బ్రాహ్మణ కోపముచేత నశించుట 178

కృష్ణుఁడు ధర్మరాజునకుఁ జార్వాకరాక్షసుని పూర్వవృత్తాంతమును జెప్పుట 182

ధర్మరాజు రాజ్యాభిషేకము 183

ధర్మరాజు భీమాదులను వారివారికిఁ దగిన యౌవరాజ్యము మొదలయిన యధికారములందు నియోగించుట. 186

ధర్మరాజు మృతులయిన జ్ఞాతులు మొదలగువారికి శ్రాద్ధాదులుగావించి వారిబంధువులను రక్షించుట 188

ధర్మరాజు కృష్ణుని శతనామముల స్తోత్రముచేయుట. ... 189

ధర్మరాజు భీమాదులకు దుర్యోధనాదుల గృహాముల నొసంగుట ... 191

ధర్మరాజు ప్రజలకును బంధువులకును ధనాదులొసంగి కృష్ణునిఁ గుశల ప్రశ్నము చేయుచు స్తుతించుట 193

కృష్ణుఁడు ధర్మరాజును ధర్మములు వినుటకై భీష్మునికడకుఁ బొమ్మనిచెప్పి తాను నతనిప్రార్థనచే భీష్మునికడకుఁ బోవఁ బూనుట ... 196

భీష్ముఁడు కృష్ణునిఁ బలుమాఱు స్తుతించుట ; కృష్ణధర్మపుత్రాదులు భీష్ముని కడకునేఁగుట ; భీష్ముఁడు కృష్ణుని దర్శించి ముక్తినొందుట ... 200

భీష్మస్తవరాజము 204

కృష్ణుఁడు పరశురాముని పరాక్రమము చెప్పఁగా భీష్ముఁడు దానిని వివరింపుమని కృష్ణుని వేఁడుట 217

కృష్ణుఁడు ధర్మరాజునకు పరశురాముని వృత్తాంతమును జెప్పుట ... 219
ధర్మరాజు మొదలగువారు భీష్మ నాశ్రయించుట; కృష్ణుఁడు భీష్మునకు
నుపచారోక్తులుచెప్పి ధర్మరాజునకు ధర్మోపదేశమునేయు వేడుట 229
భీష్ముఁడు కృష్ణునిఁ బ్రశంసించుట ; కృష్ణుఁడు ధర్మోపదేశము చేయుమని
చెప్పుట 233
భీష్ముఁడు తనకు శస్త్రబాధచే ధర్మోపదేశమునకుఁ బటుత్వము లేదనఁగా
కృష్ణుఁడతనికి శరీరదార్ఢ్యాదు లొసంగుట; అంత సాయంకాలము
కాఁగా వారువారు తమతమ నెలవుల కరుగుట ... 236
కృష్ణుఁడును ధర్మరాజు మొదలగు వారును గాల్యకరణీయములం దీర్చు
కొని భీష్మునికడకుఁ బోవుట 240
కృష్ణుఁడు భీష్మునితో ధర్మములను చెప్పమనుట 242
కృష్ణుఁడు భీష్మునితో ధర్మరాజుసంకను జెప్పఁగా భీష్ముఁడు ధర్మరాజు
నకు సమాధానముచెప్పి ధర్ముల నడుగ ననుమతియిచ్చుట ... 246
భీష్ముఁడు ధర్మరాజునకు రాజధర్మమును జెప్పుట 249
భీష్మని యుపదేశము ప్రారంభము 250
భీష్ముఁడు ధర్మరాజునకు రాజధర్ములను జెప్పుట 258
భీష్ముఁడు మొదటినాఁడు ధర్మరాజునకు రాజధర్ములుచెప్పుట ; నాటి
సాయంకాలము కృష్ణాదులు తమతమ నెలవులకుఁ బోవుట ... 265
భీష్ముండు ధర్మరాజునకు రాజులయుత్పత్తిని బ్రహ్మాదివించిన దండనీతి
శాస్త్రవృత్తాంతమును పృథురాజు చరిత్రమును జెప్పుట ... 269
భీష్ముఁడు ధర్మరాజునకు చతుర్వర్ణముల ధర్ములను జెప్పుట ... 288
భీష్ముఁడు ధర్మరాజునకు నాలుగాశ్రమముల ధర్ములను జెప్పుట ... 299
భీష్ముఁడు ధర్మరాజునకు బ్రాహ్మణ ధర్ములను జెప్పుట ... 302
భీష్ముఁడు ధర్మరాజునకు బ్రాహ్మణునికిఁ బ్యాజ్యములగు ధర్ములనుజెప్పి
రాజధర్మమును బ్రశంసించుట 305
భీష్ముఁడు రాజధర్మమును బ్రశంసించి యింద్రునకు మాంధాతకు నయిన
సంవాదమును జెప్పుట 310

భీష్ముఁడు ధర్మరాజునకు నింద్రరూపియగు విష్ణువు మాంధాతకుఁ జెప్పిన రాజధర్మాదులను జెప్పుట 315
భీష్ముఁడు ధర్మరాజునకు వర్ణాశ్రమ ధర్మములను జెప్పుట ... 320
భీష్ముఁడు ధర్మరాజునకును లోకమునకు రాజుండుటవలని గుణమును, లేమి వలని దోషమును నిరూపించుట 326
భీష్ముఁడు సనత్సుజాతునకు బృహస్పతిచెప్పిన రాజగుణములను ధర్మరాజునకుఁ జెప్పుట 330
భీష్ముఁడు ధర్మరాజునకు రాజనీతిని చెప్పుట 337
భీష్ముఁడు ధర్మరాజునకు కృతము మొదలయిన నాలుగుయుగముల గుణములు నిరూపించుట 348
భీష్ముఁడు ధర్మరాజునకు రాజునకు వలయు ముప్పదియాఱు గుణములను జెప్పుట 352
భీష్ముఁడు చింతలేకుండుటకు ధర్మముతప్పుట లేకుండుటకును నుపాయమునుపదేశించుట 354
భీష్ముఁడు బ్రాహ్మణులగుణములును నాలుగువర్ణములకుఁ బరస్పరము గల తారతమ్యమును ధర్మరాజునకుఁ జెప్పుట 358
భీష్ముఁడు పురోహితలక్షణాదులను నిలకశ్యప సంవాదమును జెప్పుట ... 362
భీష్ముఁడు ముచుకుందుని చరిత్రమును దృష్టాంతీకరించి పురోహితునివలన మేళ్లను ధర్మరాజునకుఁ జెప్పుట 373
రాజ్యస్వీకార మధర్మమని ధర్మరాజు శంకింపఁగా భీష్ముఁడది ధర్మయుక్తమని సమర్థించి దాని నతనికి విధించుట 376
భీష్ముఁడు ధర్మరాజునకు బ్రాహ్మణులకు నిషిద్ధములయిన కర్మములును రాజధర్మములును జెప్పుట 381
భీష్ముఁడు ధర్మరాజునకుఁ గేకయరాజోపాఖ్యానము జెప్పుట ... 384

పటముల పట్టిక.

ధర్మరాజు శ్రీకృష్ణునితోడ హస్తినాపట్టణమును ప్రవే
శించుట 177

శ్రీకృష్ణుఁడు ధర్మజుని పట్టాభిషిక్తునిగాఁ జేయుట ... 184

ధర్మపుత్రాదులు శరతల్పగతుఁడైన భీష్మునికడకు వచ్చి
ధర్మోపదేశమును బడయుట 251



శ్రీరామచన్ద్రాయపరబ్రహ్మణే నమః.

శ్రీ మహా భారతము

శాంతి పర్వము.

శ్రీవేదవ్యాసాయ నమః.

శ్లో॥ నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతోజయ ముదీరయేత్ ॥

రాజధర్మానుశాసనపర్వము.

గంగాతీరమందు ధర్మరాజుకడకు ఋషులు వచ్చుట. నారదుని ధర్మపుత్రుడు కర్ణవృత్తాంతము నడుగుట.

వైశంపాయనుఁడు జనమేజయునితో 'సుహృదుల కందఱకును జలతర్పణములు చేసినపిదప, పాండవులును, విదురుఁడును, ధృతరాష్ట్రుఁడును, భరతవంశపు స్త్రీలందఱును, మహాత్ములయిన యాతకిన కారవులును, శౌచము చేసికొనువారై, పట్టణమునకు వెలుపల, నా గంగాతీరమందు నొకమాసము వసించి యుండిరి. అట్లు తర్పణములు తీర్చియున్న ధర్మాత్ముఁడగుయుధిష్ఠిరునికడకు మహాత్ములును తపస్సిద్ధులును బ్రహ్మర్షిసత్తములునగు

*'యుద్ధముజరిగిన పదునెనిమిది దినములందును ఆయానాఁటి మరణములకు ఆయానాఁడే శుద్ధియగుచున్నది. (వనస్థలి. ౫-ఆ.౯౨-శ్లో) పదునెనిమిదవ

వ్యాసుఁడు నారదుఁడు మహర్షియగుదేవలుఁడు, దేవస్థానుఁడు, కణ్వుఁడు, నుత్తమ లయినవారిశిష్యులును వచ్చిరి. మఱియు వేద విదులును జ్ఞానసంపన్నులును స్నాతకులును గృహస్థులు నయిన బ్రాహ్మణులును గురుసత్తముఁ డగుధర్మరాజును జూచిరి. ఆమహర్షులు మహాత్ముఁ డయినధర్మరాజునుజేరి విధ్యుక్తముగఁ బూజితు లై మిక్కిలి గొప్పవియగు నాసనములందుఁ గూర్చుండిరి. అంత న ట్లాబ్రాహ్మణు లక్కాలమునకుఁ దగినపూజం గయికొని పవిత్ర బగుగంగాతీరమున శోకవ్యాకులచిత్తుఁ డయియున్న ధర్మరాజు నూఱడించుటకై వేలకొలఁదిని బరివేష్టించి తమతమ యంతరువుల నెఱిఁగొప్పున నలుప్రక్కలఁ గూర్చుండిరి. నారదుఁడు వ్యాసుఁడాదిగాఁగలుగుఋషులతో మాటలాడుచు ధర్మరాజును జూచి తగుసమయమున 'ఓధర్మరాజా! అ..ని భుజపరాక్రమముచేతను శ్రీకృష్ణుని యనుగ్రహముచేతను, ధర్మముచేతను, నీ భూమియంతయు జయింపఁబడినది. లోకమునకు భయంకర మయినయీయుద్ధమునుండి భాగ్యవశమున విడివడితివి. పాండవా! క్షత్రధర్మమునం దాసక్తుఁడ వై యున్నావని సంతోషించుచున్నావేకద. రాజా! నీపు శత్రుపులనెల్లఁ బొరిపుచ్చితివి. మిత్రులను సంతసింపఁ జేయుచున్నావేకదా? ఈసంపదను బొందినపిదప

దినము సౌప్తికపర్వమునందు మృతు లయినవారికొఱకు పండ్రెండుదినములు ఆశౌచము అనుష్ఠింపవలయును. యుద్ధదినములు పదునెనిమిది, ఆశౌచదినములు పండ్రెండు, రెండునుజేరి ముప్పదిదినము లనియొకపక్షముగలదు' అనియు 'కొన్నిసమయములందు కపటయుద్ధాదులు చేయుటవలని దోషము నివర్తించుటకై పుణ్యనదీతీరమందు ఒకమాసము వసించిరేకాని ఆశౌచనివృత్తికిఁగాదు' అనియు పూర్వవ్యాఖ్య.

నిన్ను శోకము బాధింపదేకదా ? " అని యడిగెను. అందులకు యుధిష్ఠిరుఁడు 'మహాత్మా ! కృష్ణునిబాహుబలము నండగొనియు బ్రాహ్మణుల ప్రసాదముచేతను, భీమార్జునుల బలముచేతను నీ భూమియంతయు జయింపఁబడినది. అయినను, నామనసునం దీమహాదుఃఖము నిత్యమును వేఁచుచున్నది. చూచుటకు భయం కరమయిన యీ జ్ఞాతినాశమును మిక్కిలియుఁ జేసియు, గారా బుకొడుకులగు సుభద్రకుమారుని ద్రౌపదిపుత్రులను జంపించు కొనియుఁ బడసినయీజయ మపజయముగానే నాకుఁ దోఁచుచు న్నది. ద్వారకయందున్న నామఱఁదలు సుభద్ర, కృష్ణు డిక్కడ నుండిపోఁగానే యేమిచెప్పునో కదా ! ద్రౌపది యిది తనకన్నకొ డుకులందఱును హతులై బంధుపులును హతులై వెతలుగుడు చుచుండి యు మరల మాకుఁ బ్రియమును హితమునే జరుపుచుం డుట నన్నుఁ బీడించుచున్నట్లే యున్నది. మహాత్మా ! మఱియు మీకు ని దొకటి చెప్పెదను. కుంతీ రహస్యమును దాఁచినందున నాకు దుఃఖమును గూర్చినదయ్యె. లోకమునఁ బదివేలయేనుఁ గుల బలిమిగలవాఁడై, యుద్ధంబున నెదురులేక, సింహముంబోలి గరువంపు నడగలిగి, జయశీలుఁడై, వ్రతనియతిదప్పక, ధృతరా ష్ట్రునిపుత్రుల కెల్లఁ బ్రాపయి, మానియు, నుగ్రమయిన పరా క్రమముగలవాఁడునై, పగవారికి సయింపక, యెప్పుడును నుర వడించుచు, ఒక్కొక్కయుద్ధమందును మమ్ము నెగఁజిమ్ముచు, నతి వేగములయిన యస్త్రములుగలిగి, చిత్రభంగులయుద్ధముసేయు చు, సమర్థుఁడై, యద్భుతపరాక్రముఁడును గుంతికిఁ గూఢముగా బుట్టిన పుత్రుఁడు నయినయాకర్ణుఁడు మాకన్నయఁట ! ఆసమ యమున, తర్పణమునిడుచునపుడు కుంతి యతనిని సకలగుణసం

పన్నుఁడును తొల్లి జలమునందువిడువంబడినవాఁడు నగు కర్ణుఁడనియుఁ దనకుమారుఁడనియు నాకుఁ జెప్పెను. ఎవనిని మందస యందుంచి గంగాప్రవాహమందు మునుంగఁజేసెనో, ఎవనిని సూతపుత్త్రుఁడనియు రాధకొడుకనియు లోకము తలంచినదో, ఆకర్ణుఁడు కుంతియందు సూర్యునకుఁ బుట్టినవాఁడు; తల్లివంకను బట్టి మా కన్నదమ్ముఁడయినవాఁడు. రాజ్యమునందు పేరాసగలిగి యేమియుఁ దెలియక నేనతనిని యుద్ధమునఁ జంపించితిని. అది యే, అగ్ని దూదిప్రోవునుంబోలె, నామేను నెరియించుచున్నది. అర్జునుఁడును నతని నన్నయని యెఱుఁగఁడయ్యెఁ; నేను నెఱుఁగను. భీముఁడు నెఱుఁగఁడు. నకులసహదేవులు నెఱుఁగరు. అతఁడో మమ్మమాత్రము గలరూపున నెఱింగికొనెను. కుంతి మాకు సంధినిగోరి యతనికడకు 'నీవును నాకొడుకివే' యని చెప్పుచుఁ బోయినదని మాకువినికి. పిదప నతఁడు మహాత్ముఁడుగాన కుంతి కోరికను గావింపఁడయ్యెఁ. అతఁడు 'తల్లీ ! మిక్కిలి తగనిమాటలు పలికితివి' అనియు 'దుర్యోధనుని యుద్ధసమయమున దిగవిడుచుటకు నేను శక్తుఁడనుగాను. దిగవిడిచితినా, అపూజ్యతయు, క్రూరత్వమును, నెనరులేమియు నాకు సంభవించును. నీమతము చొప్పున ధర్మరాజుతో సంధిగావింతునేని, నన్ను యుద్ధమునం దర్జునునకు వెఱచినాఁడని లోకము తలంచును. అట్లేని, కృష్ణసహితుండయినయర్జునుని యుద్ధమునజయించినపిదప ధర్మరాజుతోడ కలసికొనెదను' అని చెప్పెను. కుంతి మరల విశాలవక్షుండగునతనితో 'నలువురకు నభయ మిమ్ము. ఇచ్చచొప్పున నర్జునునితోడఁ బోరాడుము' అని చెప్పినదఁట. అతఁడు బుద్ధిమంతుఁడుగాన వడఁకుచున్న తల్లినిజూచి చేయిమోడ్చి 'దేవీ ! నీనలువురు

కొడుకులును నాబారినిబడఁగాఁ ద్రోసిపుచ్చక వారిని జంపవల
సియుండినను వారినిజంపను. కర్ణుఁడు హతుఁడయ్యెనా యర్జునునిఁ
గూడియో, అర్జునుఁడు హతుఁడయ్యెనా కర్ణునిఁగూడియో నీకుఁ
బుత్రులేవురే తిరముగానుండఁగలరు" అనెను. అంతఁ దల్లి కొడు
కులయందు మిక్కిలి మక్కువగలదిగాన మరల నతనితో 'నీవే
తోఁబుట్టువులకు మేలుసేయఁగోరెదవైనా వారలకు క్షేమముగా
వింపుము' అనెను. ఇట్లు చెప్పి కుంతి యతనిని వీడుకొని యిటి
కిఁబోయెనఁట. తోడఁబుట్టిన యన్నయగు నావీరుఁడు తమ్ముఁడ
యినయర్జునునిచే హతుఁడయ్యెను. ఋషీశ్వరా! కుంతిరహస్య
ము బయలువడదయ్యె. అతనిరహస్యమును బయలుపడదయ్యె.
కాఁబట్టి మేటివిలుకాఁడయినయాశూరుఁడర్జునునిచే యుద్ధము
నఁగూల్పఁబడెను. బ్రాహ్మణోత్తమా! పిపపఁ గుంతి మాటవలనఁ
గర్ణునిసహోదరుఁడనియు,ముందుగా బుట్టుటచేనన్నయనియునేను
దెలిసికొంటిని. కాఁబట్టి యన్ననుజంపికొన్న నాకు మనసు పుర
పురఁబొక్కుచున్నది. కర్ణునిని నర్జునుఁ దోడుగాఁబడసితినేని, నేనిం
ద్రునిసయితము గెలుతునే! దుష్టబుద్ధులయిన ధృతరాష్ట్రపుత్ర
లచే సభయందుఁబీడితుఁడనై సపుడుతోడనే నాకు వెలికురవడించి
నకోపము కర్ణునిమొగముచూడఁగానే యాఱిపోవును.సభయందు
జూదమాడునపుడు కర్ణుఁడు దుర్యోధనుని హితముగోరి తొడంగిన
పుడె కటువులై మిక్కిలి బిరుసుగాఁ బలుకుమాటలు విన్నప్పుడు
నాకుఁ గలిగినకోపము, అతనియడుగులను జూడఁగానే యుడిగిపో
వును. కర్ణునిపాదములు కుంతిపాదములకు సాటియైనవని నాతలఁ
పు. కుంతికిని నతనికిని బోలికయుండుటకుఁ గారణము నెంతవెద
కియు, ఎంతయూహించియు, ఏవిధమునను నాకుఁ దెలిసినది

కాదు. యుద్ధమునందు భూమి యతనితేరిచక్రమును మ్రింగుట యెట్లు? నాయన్న యేవిధమున శాపమునొందెను? ఇందలి కథ రూపునుజెప్ప నీవేయర్హుండవు. మహాత్మా! కలిగినది కలిగినట్లుగా నీవలననుండి యంతయును వినఁగోరుచున్నాను. నీవు సకలమును దెలిసిన విద్వాంసుఁడవు. లోకమునఁ జేసియైనదియుఁ జేయఁబోవునదియు నెఱుఁగుదువు' అనెను. ఇది ప్రథమాధ్యాయము.

రాజధర్మపర్వము.

కర్ణుఁడు బ్రహ్మాస్త్ర మిమ్మని ద్రోణుని వేఁడి యతఁడొల్లక పోఁగా పరశురామునికిశిష్యుఁడగుట. కర్ణునికి బ్రాహ్మణ శాపము.

ధర్మరాజిట్లడుగఁగా మాటకారి యగునారదుం డపుడా కర్ణునికి శాపమగలిగిన విషయమంతయుఁ జెప్పఁదొడఁగి 'భారతా! నీవు చెప్పినది సరియే. కర్ణునికి నర్జునునికిని యుద్ధమున జయింపఁదరముగానిది యొకటియుఁ గలుగదు.అయినను రాజా! దేవరహస్యమయిన దీనిని నీకుఁ జెప్పెదను. తొల్లి యి దెట్లు జరిగెనో తెలియుము. క్షత్రియజాతి యాయుధములచేతఁ బరిశుద్ధమై యెట్లు స్వర్గము నొందునని యాలోచించి యందులకై కన్యయగు కుంతియందు వైరాగ్నిని బుట్టించుచు నట్టిగర్భమును దేవతలు కలిగించిరి.ఆగర్భమునం గలిగినబాలుఁడు తేజంబుతోఁ గూడినవాఁడై సూతపుత్రుఁడు నయ్యెను; ఆంగిరసకులులలో మేటియు నీకు గురువు నయిన ద్రోణునివలన ధనుర్వేదము సభ్యసించెను. రాజోత్తమా! వాఁడు భీమసేనుని బలమును, అర్జునుని యస్త్రసామర్థ్యమును, నీదుబుద్ధినిని, అట్లె నకులసహదేవుల

వినయమును, అర్జునునికి నెలప్రాయమునసే కృష్ణునితోడఁ గలి
గిన స్నేహమును 'ప్రజల యనురాగమును, జింతించుచు మిక్కిలీ
యెరియుచుండెను. వాఁడు స్వభావమువలనను దేవతలసంకల్ప
మువలనను మితోడ నెప్పుడు వైరము పూనియున్నదుర్యోధ
నునితోడ బాల్యమందు స్నేహమునొందెను. పిదపఁ గర్ణుఁ డర్జు
నుని ధనుర్వేదమందు విద్యాధికుఁ డనియెఱింగి రహస్యమున
ద్రోణునికడకుఁబోయి యతనితో 'బ్రహ్మాస్త్రమును దానిప్రయో
గోప సంహారక్రమములతోఁ దెలిసికొనఁ గోరుచున్నాను. యు
ద్ధమునం దర్జునునితోడ సమానుఁడుగా నుండవలయునని నాత
లంపు. మీకుఁ బుత్రులయందును శిష్యులయందును స్నేహము
సమముగానుండుట నిశ్చయము. మీయనుగ్రహమువలన నన్ను
స్త్రాభ్యాసము లేనివాఁడని తెలిసినవారు చెప్పకుందురుగాక'యం
చెను. అందులకు ద్రోణుఁ డర్జునునియందు మక్కువగలవాఁడు
గావునను గర్ణుని దుష్టబుద్ధి తెలిసియున్నఁదుననను వానిని జూచి
'విధ్యుక్తముగా వ్రతమునాచరించిన బ్రాహ్మణుఁడు బ్రహ్మాస్త్ర
మును దెలిసికొనఁదగినవాఁడు. లేక మిక్కిలీ తపముగల క్షత్రి
యుఁడును దెలిసికొనఁ దగినవాఁడు. తక్కినవాఁ డేవిధమునను
దెలిసికొనఁ గర్హ్యుఁడుగాఁడు' అనెను. అంతఁ గర్ణుఁ డాంగిరసవరుం
డయిన ద్రోణునిఁబూజించి వీడుకొని మహేంద్రమనుపర్వత
మునకుఁ దొడనేపోయెను. అకర్ణుఁడు పరశురాముని జేరి తల
సోక మ్రొక్కి-'నేను భృగువంశమునం బుట్టిన బ్రాహ్మణుఁడను'
అని గౌరవముగాఁ జెప్పికొని యభివందనము చేసెను. పరశు
రాముఁడు గోత్రము మొదలగు వానినెల్ల నడిగి యతనిఁ గయి
కొని 'నీకు స్వాగతము, ఇచ్చట నుండువచ్చును' అనిచెప్పి మిక్కి-

లియుఁ బ్రీతిగలిగియుండెను. స్వర్గమునకు సమానంబగు నమ్మ హేంద్ర పర్వతమునఁ గర్ణుఁడు వసించియుండఁగా నతనికి గంధర్వ్వ లతోను రాక్షసులతోను, యక్షులతోను, దేవతలతోడను సమా గమము కలిగెను. వాఁడచ్చట యథావిధిని బరశురాముని వలన బాణములను నస్త్రములను నభ్యసించెను; దేవతలకును, నసు రులకును రాక్షసులకును మిక్కిలి ప్రియుఁడై యుండెను. ఆ కర్ణుఁడు తా నొకప్పుడు సముద్రమునకు సమీపమునం దున్న యాశ్రమము పొంత సంచరించుచు నొంటిమెయి విల్లును ఖడ్గ మును గేలందాలిచి విహరించుచుండెను.అపు డగ్నిహోత్రముచే యుచుండిన యొక బ్రహ్మవాది యగు బ్రాహ్మణుని * హోమధే నువును (దూడను) దెలియక ద్వైవికముగాఁ జంపెను. కర్ణుఁడు తాను దెలియక చేసిన దానిని దెలిసి బ్రాహ్మణునకుఁ దెలిపెను. వాఁ డతనికిఁ గోపము లేకుండునట్లు చేయఁ దలఁచి యతనితో 'మహాత్మా! నీధేనువగు దీనిని నేను, వలయునని తెలిసికాక తెలి యక చంపితిని. అవిషయమై నాయం దనుగ్రహింపవలయును' అని మాటిమాటికి వేఁడెను. ఆబ్రాహ్మణుఁడు క్రుద్ధుఁడై కర్ణుని మాటలచే నదల్చువానివలె ' దురాచారా! నీవు వధకు నర్హుఁ డవు. దుర్మతీ! ఇందులకుఁ దగిన ఫలము పొందంగలవు పో! పాపీ! నీవెవ్వనితోడ నెప్పుడును మచ్చరించుచుందువో, ఎవ్వని కొఱకు నెపుడు జతనపడుచుందువో,యట్టి వానితోడ యుద్ధము సేయునపుడు నీదు రథచక్రమును భూమి మ్రింగఁగలదు. మను జాధమా! అంత చక్రము భూమియందుఁ గ్రుంగఁగాఁ, దోడనే

* కర్ణపర్వమందుఁ జెప్పఁబడి యున్నట్లు ధేను వనఁగా నిట వశ్శ్సు (దూడ) గాఁ దెలియునది.

నీవు తత్తఱపడుచుండునపుడు పగవాఁడు నీతలను పరాక్రమించి కొల్వఁగలఁడు.మూఢా!పద! నేనుపరాకున నుండఁగా నాగోవును దీనిని నీవెట్లు చంపితివో యట్లె పరాకున నీవుండఁగా, నామాటచేతనే నీతలను వాఁడుగొల్వఁగలఁడు' అని శపించెను. కర్ణుఁడట్లు శప్తుఁడై యాబ్రాహ్మణుని గోవులను ధనములను రత్నములను నిచ్చి ప్రసన్నునిఁ గావించెను. అతఁడు వానినిజూచి మఱల 'ఈ నాచెప్పినమాట బ్రహ్మలోకమందును జెప్పఁబడనిదిగాఁ (పొల్లుగాఁ) జెయఁదరముగాదు. నీవు పోయిననుబో; నిలిచిన నిలువు. లేక యేమిచేయవలయునో చేసికొనుము' అనెను. బ్రాహ్మణుఁడిట్లుచెప్పఁగాఁగర్ణుఁడు దుఃఖమునఁ దలవాంచి మనస్సున దానినే తలంచుకొనుచు భయమునొంది పరశురాముని కడకువచ్చెను. ఇది రెండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

పరశురాముఁడు కర్ణుని తొడపయి నిదురించునపుడొకపురువు వానితొడను తొలుచుట. పరశురాముఁడు కర్ణుని శపించుట.

పరశురాముఁడు, కర్ణునిబాహువీర్యమునకు వినయమునకును దమమునకును గురుశుశ్రూషకును సంతసించెను. అంత మహాతేజుండును బరమతపస్వియు నయినయా గొప్పప్రాజ్ఞుఁడు కనికరమునకుఁ బాత్రుఁడయినయాకర్ణునకు బ్రహ్మాస్త్రమును,ఉపసంహారముతోఁగూడ నుపదేశించెను. కర్ణుఁడట్లస్త్రమునెఱింగి యాభృగువర్యునాశ్రమమందుఁ గ్రీడించుచు నద్భుతపరాక్రముఁడై ధనుర్వేదము నభ్యసించుచుండెను. పిదప నొకప్పుడు పరశు

రాముఁడు కర్ణునిం గూడి యాశ్రమముసమీపమున సంచరించుచుండెను. ఆ గురుఁడు పరశురాముఁ డుపవాసముచే స్రుక్కి మనఁబు వికాసంబులేక వాఁడువాఱి నమ్మికవలనినెయ్యంపుఁ బెంపుచే నాకర్ణునొడియందుఁ దలయిడి నిదురపోయెను. అంత శ్లేష్మమయ మయినయొకపురుగు కర్ణుని యొద్దకువచ్చెను. దానికి మాంసమును రక్తమునే యాహారము. కాన యది చేయుపని భయంకరమగుటయే కాక దాని పొడయనుజూడ బెట్టిదముగానే యుండెను. అది వానితొడను దారసించి నెత్తురు ద్రావఁగోరి దానిని దొలువఁజొచ్చెను. కర్ణుఁడు గురువులని భయమున దానిని జమ్మివై చుటకుశక్తుఁడు గాకుండెను. అట్లాపురుగుకఱచుచుండియు నాకర్ణుఁడు గురువ్రమేలుకనుటకు వేచిదాని నుపేక్షించి నవాఁడయ్యె. కర్ణుఁడు సహింపనలవిగాని యావేదనను దాలిమిచే నడంచుకొని కదల్పకయు గాసి పెట్టకయుఁ బరశురాముని దాల్చియుండెను. ఆ గురుఁడు లేన దేహమంతయు రక్తము తాఁకు వడఁగా మేలుకొని చూచి సంరంభించి'అక్కటా! అశుచి నాకుఁ గలిగినది! ఏమిది నీవుచేసినది? భయమని దాఁపక జరిగినది జరిగినట్లు నాకుఁ జెప్పము' అని యడిగెను. కర్ణుఁడు తన్నాపురుగట్టు కఱచిన దని చెప్పెను. పరశురాముఁడును పందివలె నాకారము గలయా పురుగును గాంచెను. దానికి నెనిమిదికాళ్లును వాఁడులయిన కోఱపండ్లునుండెను; మేనంతయు సూదులవంటి వెండ్రుకలచేఁ గప్పంబడియుండెను. దాని యవయవములు ముడుంగుకొని యుండెను. రాముఁడు చూడఁగానే యాపురు వానెత్తుటనే తోఁగుచు నసుఁవిడిచెను. అది యొక యాశ్చర్యమువలె నుండెను. అంత నాకాశమున సకలరూపములు నెత్తుకొనఁ జాలిన

వాఁడును క్రూరాకారుఁడును నగు నొకరాక్షసుఁడుకనుపట్టెను. వాని కుత్తుక యెట్టిగాను దక్కిన దేహమంతయు నల్లగాను నుండెను. వానికి మేషమువాహనమై యుండెను. వాఁడు చేతులుమోడ్చి నిండుమనంబునఁ బరశురాముని జూచి 'భృగుసింహమా ! మీకు స్వస్తియగుఁగాక. నేనువచ్చినదారినే పోయెదను. మునిసత్తమా ! నరకమునుండి నీచేత విముక్తుఁడనయితిని. నీకు భద్రంబును సిద్ధియుఁ గలుగుఁగాత.నాయిష్టము నీచేత సమకూడినది'అనెను. పరశురాముఁడు వానినిజూచి 'నీవెవ్వఁడవు? ఎందువలన నరకమొందితివి? దానిని జెప్పము' అనియడిగెను. వాఁడు 'తండ్రీ ! తొల్లి కృతయుగమందు దంశుఁ డనుగొప్పయసురను; భృగువునకుఁ జెలివలె నున్నవాఁడను. భృగువునకు మిక్కిలి ప్రియురా లయినయిల్లాలిని నేనుబలవంతముగా నపహరించితిని. ఆమహర్షి యందులకు శపింపఁగాఁ బుడువయి భూమియందుఁ బడితిని. నీకుఁ బూర్వ పితామహుం డయిన యాభృగువు కుపితుండై నన్నుఁజూచి 'పాపాత్మా! మూత్రమును శ్లేష్మమును గుడుచుచు నరకమును బడయుఁగలవు' అని శపించెను. అంత నేనతనితో 'బ్రాహ్మణోత్తమా ! శాపమునకు నంతము దయసేయుము' అని వేఁడికొనఁగా నతఁడు 'భృగువంశమునఁ బుట్టు రాముని వలన విముక్తిగలుగును' అని చెప్పెను, సాధూత్తమా ! నేను కుశలరహితుఁడు పొందునట్లు యీగతిని బొంది మిమ్ముఁ జేరినపిదపఁ బాపయోనివలన విడివడితిని' అని చెప్పి రాముసికి మ్రొక్కి వాఁడుపోయెను. రాముఁడు కోపంబునఁ గర్ణునిఁ జూచి 'మూఢా ! ఈమహాదుఃఖమును నొకప్పుడును బ్రాహ్మణుఁడు సయింపఁడు. క్షత్రియునకుంబోలె నీకు ధైర్యము చూ

పట్టుచున్నది. కపటమువాని కలరూపుఁ జెప్పము" అనెను. అంతఁ గర్ణుఁడు శాపముకలుగునని భయపడి యతనినిఁ బ్రస న్నునిఁ గావించుటకై 'ఓభార్గవా! బ్రాహ్మణునకును క్షత్రియునకు వేఱయినచోటఁబుట్టిన సూతజాతివానిఁగా నన్నుఁదెలియుము. భూమియందు నన్నురాధకొడుకయిన కర్ణుఁడని జనులాడుదురు. నేనస్త్రమందుఁ బేరాసగలిగి యిటుసేసినందులకు నాయందనుగ్ర హింపుము. వేదవిద్యను నొసంగసమర్థుఁడయినగురుఁడు పిత యనుటకు సందేహములేదు. కాఁబట్టి మీకు భార్గవుఁడనని నేను గోత్రము చెప్పితిని " అనెను. ఇట్లు భూమిపయింబడి శోకంబున దురపిల్లుచు వడవడవడంకుచు నంజలిగీలించి యున్నయా కర్ణునిఁ జూచి రాముఁడు కోపంబునఁ గాల్చువానింబోలెఁ జుఱచుఱఁ జూచి 'మూఢా ! నీవస్త్రమునందుఁ బేరాసగొని యిచటనన్నుఁ బొల్లుగా నుపచరించితివి. కావున యీ బ్రహ్మాస్త్రము సమానుఁ డయినవానితో యుద్ధముసేయునపుడును నీదువధకాలమందుఁ ద ప్పఁ దక్కినకాలమునను, దోఁపకుండుఁగాత. బ్రాహ్మణుఁడు కాని వానియం దొకప్పుడును బ్రహ్మాస్త్రము నెలకొనియుండదు పో. ఇప్పుడు దబ్బఱకాఁడవగు నినుబోఁటి కిటుచోటులేదు. యుద్ధమున నీకు సాటియైన క్షత్రియుఁడు భూమియందుఁగలుగఁడు "అనెను. అంతఁ గర్ణుఁడు న్యాయముచొప్పున నమస్కారములు గావించి దుర్యోధనునిఁ జేరి 'అస్త్రముల నాఱితేఱితి ' నసెను. ఇది మూఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

దుర్యోధనుఁడు స్వయంవరమున కళింగరాజు కన్యనుహరించుట. కర్ణుఁడు దుర్యోధను వెంటఁ దలపడినరాజుల నోడించుట.

ఓ! భరతసత్తమా! పరశురాముని వలన నిట్లు కర్ణుఁడస్త్రమును బడసి దుర్యోధనునింగూడి మునంబునఁ బొదలుచుండెను. రాజా! పిదప నొకకాలమందుఁ గళింగదేశమునఁ జిత్రాంగదరాజు స్వయంవరమున రాజులువచ్చి చేరిరి. ఆదేశమందు సిరిపెంపారు చున్న రాజపురమను పట్టణమునకు నందలి కన్యకుఁగాను రాజులు వందలకొలఁదిని వచ్చిచేరిరి. అచ్చట రాజులందఱును వచ్చిచేరి యున్నారని విని దుర్యోధనుఁడు కర్ణునిఁగూడి బంగారుకండ్లతోఁ గూడిన రథమునెక్కిపోయెను. రాజోత్తమా! అంతఁ బెక్కు దేశములనుండి మహారథు లయినరాజులు కన్యానిమిత్తమా స్వయంవరమునకు వచ్చిచేరిరి. దక్షిణదిక్కునందలి శిశుపాలుఁడు జరాసంధుఁడు, భీష్మకుఁడు, వక్త్రుఁడు, కపోతరోముఁడు, నీలుఁడు, రుక్మి, స్త్రీరాజ్యమున కధిపతియైన సీగాలుఁడు, విశోకుఁడు, శతధన్వుఁడు, భోజుఁడు, వీరుఁడును మఱియుఁ బెక్కండ్రు రాజులును, అల్లె తూర్పునను నుత్తరమునను గల మ్లేచ్ఛరాజులును ఆర్యరాజులును వచ్చిరి. వారందఱును బంగారు బావుపురులు దొడిగి యచ్చపుఁగడానిబంగరు చాయగలిగి, జిగిదొలఁకాడు చున్న మేనులతో, బెబ్బులులవలెఁ జలంబున విజృంభించుచునుండిరి. అంత నారాజులు కూర్చుండఁగానే యాకన్య, దాదితోడను హెచ్చడులతోడను నా స్వయంవరరంగమును బ్రవేశించెను. పిదప రాజులపేళ్లను వేఱువేఱఁ దెలుపునపు డావరవర్ణిని ధృతరాష్ట్రసుపు

త్రుఁడయినదుర్యోధనునిఁగడచిపోయెను. కురువంశతిలకుండయిన యాదుర్యోధనుఁడో యట్లు దన్నుఁగడచిపోవుట కెంతమా త్రము సయింపఁడయ్యె. అతఁడు తక్కినరాజులను నవమానించుచు నా కన్నియను వారింపను వారించెను. అతనికి భీష్ముఁడును ద్రోణుఁడును నత్తియుంఱుటంబట్టి వీర్యంపుఁ గొవ్వునమదించి యాకన్నియను రథమునందుఁబట్టి యెక్కించుకొని రాజులను యుద్ధమునకుఁబిలిచెను. ఆయుధధారులందు మిన్నయైన కర్ణుఁడు రథారూఢుండై ఖడ్గమును గేలంబట్టి వ్రేలికి నుడుపతోలియత్తె మునుదొడిగి దుర్యోధనుని వెంబడించి పోయెను. పిదప రాజులు రథములుఁ బూన్చువారును కవచములు దొడుగుకొనువారును పోరాడనుంకించువారునై యురవడింపఁగా రారాపు మిక్కిలియుఁ గలిగెను. ఆరాజులు మిక్కిలియుఁ గుపితులై శరవర్షములను గురియించు మేఘములు రెండుపర్వతముల పయినడరునట్లు కర్ణదుర్యోధను లిరువురపయి నేయఁదలపడిరి. కర్ణుఁడట్లు తమపయిఁబేగముస నడచుచున్నయారాజులవిండ్లను బాణసమూహములను దా నొక్కొక్కబాణముచేఁ గాఁడనేసి భూమింగూల్చెను. ఆకర్ణుఁడు యుద్ధంబుసేయువారియందెల్ల మిన్న గావ్రనఁ గొంద అ విల్లునునిమియు కొందఱవిండ్లను నిలువ్రనే నిలిపి, కొందఱ బాణముల దిగవైపించి, కొందఱను రథములును శక్తులను గదలను దూలునట్లుచేసి పెక్కండ్రకు సారథులు లేకుండఁజేసి, మిక్కిలి వ్యాకులపెట్టి వారినందఱను జుల్కఁగా జయించెను. ఆరాజులు మనంబులుదూల తామే గుఱ్ఱములను దోలుకొనుచు 'పదపద' యని చెప్పుచు యుద్ధముమాని పలాయితులయిరి. అట్లు దుర్యోధనుఁడు కర్ణునిచే రక్షితుండై సంతోషమునొంది

కన్నియనెత్తికొని హస్తినాపురము జేరినవాఁడన్యో. ఇది నాలు గవయధ్యాయము.

రాజధర్మపర్వము.

కర్ణుని పరాక్రమమును వర్ణించుట.

"కర్ణుఁడట్లు యుద్ధమునఁ దనబలిమిని వెలిపుచ్చఁగా మగధ రాజయిన జరాసంధుఁడు రథారూఢుఁడై వానిని యుద్ధమునకుఁ బిలిచెను. ఆయిరువ్రురును దివ్యాస్త్రములఁ దెలిసినవారు కాన వెక్కలాయుధము లొండొరులపయి వర్షించుచు దెప్పర ముగాఁ బోరాడిరి. అమ్మహాబలు లిరువ్రురును బాణములన్ని యుఁ దూలి, విండ్లన్నియు నశించి, కత్తు లెల్లవిఱిగినపిమ్మట నేల పయినిలిచి బాహుయుద్ధమునకుఁ దారసించిరి. జరయను దాని చేత సంధింపఁబడిన జరాసంధుని మేనిసంధిని గర్ణుఁడు బాహు కంటకమను మల్లయుద్ధబంధముచేత ద్రీల్చెను. ఆరాజు తన మేనిచీలిన వికారమును జూచి వైరమును దూరమునకుఁ ద్రోసి, 'ప్రీతుండ నయితి' నని కర్ణునిఁజూచి చెప్పెను. పిమ్మట నతఁడు కర్ణునియందుఁ గలసంతోషముచేత మాలిని యనుపట్టణమును నతనికొసంగెను. పగవారినిగెలుచు దిట్టయగు నాకర్ణుఁడు, అంగ దేశమునకు రాజుగా నుండెను. వాఁడామహోత్సాహనుని నుతము చొప్పున సకలవర్ణముల వారిని బరిపాలించుచు వచ్చెను. అది నీకును దెలియును. ఇట్లా కర్ణుఁ డాయుధముల వేఁడ్రముచేత భూమియందుఁ బ్రసిద్ధుఁడయ్యెను. దేవేంద్రుఁడు మీకుశలమును గోరి యాకర్ణుని కవచకుండలములను యాచింపఁగా దేవమాయ చేత మోహితుఁడై దివ్యములను దనతోడఁబుట్టినవియు,

మిక్కిలి పూజితములు నయినకుండలములను సహజం బగుకవచ మును నిచ్చిపుచ్చెను. కర్ణుడు కుండలములును సహజకవచ మును బాసి, బ్రాహ్మణశాపముచేతను, మహాత్ముఁ డయినపరశు రాముని శాపముచేతను, కుంతికి వరమిచ్చుటచేతను, ఇంద్రుని మాయచేతను, రథికులను కొలఁది యిడుకాలమున భీష్ముఁ డర్ధ రథుఁడనిచెప్పి యవమానించుటచేతను, శల్యుఁడు తేజముగుం దించుటచేతను, కృష్ణుని నీతిచేతను, కృష్ణుఁడు చూచుచుండఁ గా సర్జునునిచే యుద్ధంబున హతుఁడయ్యెను. రుద్రుఁడు దేవేం ద్రుఁడు, యముఁడు, వరుణుఁడు, కుబేరుఁడు, ద్రోణుఁడు, కృ పుఁడు ననువీరల దివ్యము లయినయస్త్రములనుబడసి గాండీవ మను విల్లుదాల్చి యర్జునుఁడు సూర్యునివలె ధగధగ ప్రకా శించుచుండు నాసూర్యపుత్రుని కర్ణుని యుద్ధమున వధించెను. ఇట్లు పెక్కండ్రచే శపింపఁబడియు, వంచింపఁబడియు నీ యన్న యగు కర్ణుఁడు యుద్ధమున హతినొందెను. అందులకు నీవు దుఃఖింపవలదు " అనెను. ఇది యేనవయధ్యాయము.

రాజధర్మపర్వము.

కుంతికర్ణునిఁగూర్చి దుఃఖించుచు ధర్మరాజు నూఱ డించుట. ధర్మరాజు స్త్రీలకు రహస్యమును దాఁ చుట లేకుండుఁగా తమని శపించి రాజ్యమునందు విరక్తుఁ డగుట.

దేవర్షి యగునారదుఁ డింతవఱకుఁ జెప్పి యూరకుండెను. రాజర్షి యగుధర్మరాజు శోకంబునఁ జేలుచు, చింతయందు మునిఁగియుండెను. కుంతి శోకంబు మేనంతయు నలమికొన,

దుఃఖమున మనసు వెంపుదూలిన దగుచు, మనసువిన్నవై తల వాంచి కుందుచు, సర్వముపవలె నిట్టూర్పులుపుచ్చుచు, కన్నుల యందుఁ గన్నీరు దొరఁగుచుండ, నున్న ధర్మరాజును జూచి యప్పటికిఁ దగినట్లు లర్థవంతములగు నింపయిన మాటల 'మహాబాహూ! ఈకర్ణునిఁగూర్చి నీవు శోకించుట దగదు. మిక్కిలి ప్రాజ్ఞుండవు. నీకుఁ దెలియనిదిలేదు ; దుఃఖమును దిగవిడువుము. నేను జెప్పమాట వినుము. *ఆకర్ణుని మున్ను నేనును దండ్రియగు సూర్యుఁడును నీకుఁ దెలుపుటకొఱకు బతిమాలుకొంటిమి. వాఁడు ధర్మవిదులలఁదు మిన్న. వానికి సూర్యుఁడు, మేలుగోరు వాఁడును సంపత్తినభిలషించువాఁడు నయిన యొకఁడుసుహృదుల కేదిచెప్పవలయునో దానిని, దాను స్వప్నమునందును నాసమ యమందును జెప్పెను. వానిని, స్నేహకారణములచేత మునుపే సీతోడ నొరిమగలిగియుండఁ జేయుటకుఁగాని యుపశమింపఁజే యుటకుఁగాని సూర్యునకును శక్యముగాదయ్యె; నాకును దరము గాదయ్యె. అంత వానికి వైరమును వెలిపుచ్చుటయందే కన్ను గావునను, మృత్యువుచే గ్రస్తుఁ డగుటంబట్టియు, మీకు విరోధము చేయువాఁ డగుటవలనను, నేను వాని నుపేక్షించితిని' అనెను.ధర్మరాజు, కన్నీటిచేఁగలగుండువడుచుఁ, దల్లియుల్లు చెప్పఁగానే, శోకంబున మిక్కుటముగాఁ గుందుచు 'రహస్యమునుగప్పి యుంచుటవలన నీచేత నపుడు మేము మిక్కిలియు వంచితుల మయితిమి' అని చెప్పి మిక్కిలి యూఱటపడుచు 'సమస్తలోక ములందు నిదిమొదలుగా స్త్రీలు రహస్యమును దాఁచి పెట్టు

* 'యాచితః సమయాపూర్వం భ్రాత్రా' మని పా. నీవు నీతోఁబుట్టు లనమును నెఱపవలయునని వేఁడితినని యర్థము.

కొన కుందురుగాక' అని శాపముపెట్టెను. అతఁడుతఁబుత్రులను, బౌత్రులను, సంబంధులను, జెలికాండ్రను దలంచుకొని మనస్సు తల్లడిల్ల, బుద్ధికలంగినవాఁడయ్యె. ఇట్లతండు దుఃఖమొంతయు నావరింపఁగా,పొగతోఁగూడిన యగ్నివలెఁ బొగులుచుఁ, దాపంబునఁ బురబురఁబొక్కుచు, రాజ్యమునందు విరక్తినొందినవాఁడయ్యె. ఇది యాఱవయధ్యాయము.

రాజధర్మపర్వము.

ధర్మరాజు దుఃఖించుట.

ధర్మరాజు దుఃఖమున మనసు పల్లటిల్లఁగా మహాభక్తుఁడయిన కర్ణునిఁ దలంచికొని, పరితపించుచుండెను. అతఁడు దుఃఖశోకములు పయికొన మాటిమాటికి నిట్టూర్పులునిడుచుచు, మిక్కిలియు స్రుక్కుచును నర్జునునిఁజూచి 'మనము వృష్ణులయు నంధకులయు దేశమున భిక్షాచరణము చేసికొనుచుందుమేని, జ్ఞాతులందు మగపించము లేకుండఁజేసిన యీమగ్నతిని బొందియుండకుందుము. కురువంశమువారి పసపోయినది. మనపగవారి పసపెంపు సొంపారినది. మనము మనలఁజంపుకొంటిమేని యేధర్మమువలని పస పొందఁగలము? ఇస్సీ ! క్షత్రియుల యాచారము పాడయిపోవుగాక. ఇస్సీ ! సేనయుఁ బౌరుషమును అర్థమును నిత్యములు ! అర్థమనెడి కారణమునుబట్టి మనమిట్టి యాపదనొందితిమి. వనమందు సంచరించువారికి నోరుపు, అడఁకువ,శుచి, పగలేకుండుట, మత్సరములేమి, అహింస, సత్యవచనము ననెడియివి యెప్పుడు నుండవలసిన ధర్మములు. ఇవి మిక్కిలియు మంచివి. మనమో లోభమువలనను, అవివేకమువలనను, గర్వము

నహంకారమును బొంది, రాజ్యమందలి కష్టముల ననుభవింపఁ గోరి, యీ యవస్థను బొందితిమి. భూమియందు భోగములను గోరిన మనలను, వధింపఁబడిన బంధువులనుం, జూడఁగా ముల్లోకములను రాజ్యముచేసినను మనల నొకఁడును గొనియాడఁడు. ఇట్టి మనము పుడమికొఱకుఁ జంపఁదగినవారిని జంపి బంధువులను మాలియు, ధనములనుమాలియు భూమియందు బ్రదికియున్నారము. ఒకమాంసపు ముక్కకై పేరాసగల కుక్కలకుంబోలె మనకుఁ (బంధువధరూపమయిన) యశుభకర్మము సంభవించినది. అయినను, అవి పోరి తుద కాయామిషము ననుభవించుచున్నవి. మనకో యదికలిగియుఁ దుదకు నిష్టమేకాక మఱి నష్టమేయయ్యె. హతులయిన యీజనులను, ఈభూమియంతటి లాభమువచ్చినను దిగవిడువఁ దగదే; బంగరురాసులకుఁ గానును, సకలగజతురగములకుఁ గానును, దిగవిడువఁ దగదు. పేరాసయుఁ బెనుశోకమును గ్రమ్మొనఁగాఁ గోపమును మచ్చరమును గలిగియుండినవారై, వారు, మృత్యువను వాహనము నెక్కి, యమునిపురమును బోయిచేరిరి. తండ్రులు తపంబువలనను బ్రహ్మచర్యమువలనను బెద్దలకు వందనముచేయుటవలనను, ఓరుపువలనను, బహుకల్యాణ యుక్తులగు బుత్రులను బడయఁ బ్రయత్నింతురు. తల్లులో, యల్లె యుపవాసములచేతను దైవపూజనములచేతను వ్రతములచేతను నుత్సవములచేతను మఱియుఁ దక్కిన శుభకర్మములచేతను, గర్భములను బడయుదురు. ఆగర్భములను బదినెలలు దాల్తురు. అట్లు వారా బిడ్డలకై వెతలుగుడుచుచు ఫలము నెదురుచూచుచు 'వారు క్షేమముగాఁ బుట్టుదురా? పుట్టి బ్రతికియుందురా! బ్రతికి

గౌరవమును బలమునుగలిగి మన కివామందును బరమందును సుఖము గావింతురా !' యని యువ్విళ్లూరుచుందురు. ఆ తలి దండ్రులు పడ్డపాట్లంతయు మిక్కిలియు నిష్ప్రయోజనముగా ముగిసినది. ఈ తల్లులు కాచిమోచి కన్నపుత్రులు, మెఱుఁగిడ్డ కుండలములను దాల్చి వయసుకాండ్రయి వెలుంగుచుండిన వార, లిట్లు చంపఁబడిరి; మఱి భూమియందలి భోగముల ననుభవింపకయుఁ, బితరులయు దేవతలయు ఋణములను దీర్పకయు యమునివీటికి బోయిరి. అమ్మా ! *ఈరాజులు తాము మంచి బలిమియు సంపదయునొంది, తలిదండ్రులు తమకోర్కలు కొనసాగించుకొనఁజూచు సమయమునఁ జంపఁబడిన వారయిరి. వీరలాశయుఁ జూపోపమియు నెప్పుడును గలిగి కోపంబున నుట్టి పడుచు నుబ్బునఁజెలరేఁగుచు నుండిరి. కాఁబట్టి వీరెచ్చటఁగాని యెప్పుడేని జయమువలని ఫలము నించుకయిన ననుభవింపఁ గలుగుట యుండదు. పాంచాలురలోను గౌరవులలోను యుద్ధ మందెవరు హతులయిరో వారు (క్రోధాదులచే నిట్టి పాపకృత్య ములు చేసి స్వర్గదూరులయిరి గాన) నశించినవారే యగుదురు; కానిచో వారిని జంపినవాఁడును నిట్టికర్మములవలన సమస్తము లయిన పుణ్యలోకములను బడయవలయును గదా. ఈ లోక మునకుఁ గలిగిన నాశమునకు మనలనే కారణముగాఁ దలంచెదరు. కాని యందులకుఁ గారణమంతయు ధృతరాష్ట్రుని కొడు

---

* 'యదేషామమ్బపితరౌ జాతకామావుభావపి। సంజాతబలరూపేషు తదైవ నివృతాన్నపాఃʼ అని ఉత్తరదేశకోశపాఠము. 'పితరౌ జాతకర్మకరావివ। సంజాతబాలరూపేషు' 'వీరల తలిదండ్రులు, పుట్టి బిడ్డలరూపునందుఁడు వీరికి జాతకర్మముచేసినపుడే వీరు చంపఁబడిన వారయిరి' అని దాక్షిణాత్యకోశము.

కులందే యున్నది. దుర్యోధనుని మనస్సు మనలను వంచించుట యందే నాసక్తమై యుండెను. వాఁడెప్పుడును మనలను ద్వేషించుచు మనయందు మాయలుపన్నుటయే బ్రతుకుగానుండెను. వానికి మనమొకప్పుడును నపకారము చేయకుండినను మనయెడలఁ గపటముగానే నడచుచుండినాఁడు. కోఁక్కలు మనకు నీడేరి నవిగావు. వారికినిగావు. మనమును వారిని జయించినారము గాము. వారును మనలను జయించినారుగారు. ధార్తరాష్ట్రులీ భూమిని ననుభవింపలేరయిరి. పడఁతులను వాద్యములను ననుభవింప నేరరయిరి. వారు మంత్రులయు సుహృదులయు విద్వాంసులయు మాటలను బాటింపరయిరి. వారు తమ మేలయిన రత్నములను, బరిపూర్ణములయిన బొక్కసములను విరివియైన రాజ్యములను ననుభవింపఁజాలరయిరి. మనవలని పగచేత నెరియుచు వారు సుఖమును స్నేహమును జెందరయిరి. మనయందుఁ గలపెంపు సొంపునుజూచి వాఁడు వన్నెనూతియు వెలుకఁబాటియుఁ గృశించియు నుండెను. దీనిని శకుని ధృతరాష్ట్రునకుఁ దెలిపెను. అతఁడు కన్నకడుపు గాన కొడుకు నంటలి మక్కువచేతఁ, దన తండ్రియగు భీష్ముఁడును నన్నెల విదురుఁడును జెప్పిన హితమువినక, దుష్టవర్తనుఁడగువానికి లోనయ్యెను. రాజయిన యీధృతరాష్ట్రుఁ డశక్తుఁడును, లోభియుఁ గామ పరతంత్రుఁడు నయినకొడుకు నడంపక సందేహము లేక మన నెట్లో యట్లే పోయినవాఁడయ్యె. దుర్యోధనుఁడు మనయం దెప్పుడును బగకలిగి తపించుచుఁ బాపబుద్ధినూఁది ప్రకాశించుచున్న పొగడ్తను దిగవిడిచి తోడఁబుట్టినవారిని జంపించి ధృతరాష్ట్రగాంధారు లనెడియీ ముదుసండ్లను దుఃఖాగ్ని

యందుఁద్రోచి తానునుబోయెను. వీఁడు పోరితముచేయవలయు ననియే యువిళ్లూరుచుండినందున, కృష్ణుని సన్నిధానమున మాటలాడినటువంటి మాటలను, మంచికులమునఁ బుట్టియు బంధువయ్యునుండు మనుష్యుఁడువ్వఁడు స్నేహితునియెడమాటాడును? తేజంబుచే సకలదిక్కులను గాల్చు సూర్యులవలె మనము దుర్యోధను దోషమువలన మిక్కిలియుఁ గలకాలము నాశము నొందితిమి. దుర్మతియు మనవైరపురుషుఁడు నగువాఁడు మనకు దుష్టగ్రహముగానుండెను. దుర్యోధను నిమిత్తముగా మనకుల మిది మిక్కిలియు నశించునట్లు గావింపఁబడినది. చంపఁదగిన వారినిజంపి లోకమునందు నిందింపఁదగిన స్థితిని బొందియున్నారము. దుష్టబుద్ధియు నీకులము నాశమునకుఁ గారణభూతుఁడును పాపాత్ముఁడు నయిన దుర్యోధనుని రాజయిన ధృతరాష్ట్రుఁడు రాజ్యమున కధిపతిగాఁ జేసి యిపుడు దుఃఖపడుచున్నాఁడు. శూరులు హతులయిరి. పాపముచేసియైనది. ఈదేశము నాశితమైనది. చంపినపిదప మనకుఁ గోపముడిగినది. ఈశోకము నన్నువీల్చుచున్నది. అర్జునా! చేసినపాపము మంచిచేయుటచే పోఁగొట్టఁబడుచున్నది; వెలిపుచ్చి చెప్పుటచేతఁగాని, తపముచేతఁగాని. విరక్తిచేతఁగాని, పుణ్యస్థలములకుఁబోవుటచేతఁగాని, శ్రుతిస్మృతులను జపించుటచేతఁగాని తొలఁగింపఁబడుచున్నది. త్యాగము (నివృత్తి) గలవాఁడు మరలఁబాపముసేయఁ జాలఁడనియు జననమరణములను బొందఁడనియు శ్రుతిచెప్పుటంబట్టి త్యాగమార్గము నొందినవాఁడు జ్ఞానముఁబడసి యపుడె బ్రహ్మమగును. పరంతపా! అర్జునా! నేను మిమ్మందఱనువేఁడి సుఖదుఃఖాది ద్వంద్వములను మాలి జ్ఞానముతోఁ గూడినవాఁడనై మునినై యడవికిఁ

బోయెదను. త్యాగమువాని పరిగ్రహము (నివృత్తిలేక విషయ సంగము) గలవానికి-అనఁగా గృహస్థునకు, సమస్తధర్మములు పూర్ణముగాఁ బడయఁదరముగాదని వేదము చెప్పుచున్నది. ఇది నాకుఁ బ్రత్యక్షసిద్ధము. నేను జేసినది పాపమేచుమీ. పరిగ్రహమునుగోరు మనుష్యునకు జననమరణములకు నిమిత్తమయిన ధర్మమేపడయఁగూడునని వేదముచెప్పెడిని. కాఁబట్టి నేను బరిగ్రహమును రాజ్యమును,సమస్తమగు సుఖములను దిగవిడిచి, విముక్తుఁడను శోకరహితుఁడును, దేనియందును మమతలేనివాఁడనై పోయిచేరెదను. కురువంశ్యా! రాజ్యముచేతఁగాని భోగముల చేతఁగాని, నాకుఁ బ్రయోజనములేదు. కాన యకంటకమై యున్న యీరాజ్యమును క్షేమముగా మీరు పరిపాలింపుఁడు' అనిచెప్పి యంతట నూరకుండెను. అంతఁ జిన్నవాఁడగు నర్జునుఁ డతనికిట్లనియె. ఇది యేఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

అర్జునుఁడు ధర్మరాజును దేర్చుట.

అంతఁ బలుకుదిటయు దృఢపరాక్రమమునుగల యర్జునుఁడు గద్దింపఁబడిన యొకచూపోపనివానివలెఁ దన్నుఁదోఁపించుచుఁ దేజంబు రాజిల్లుచుండ, పెదవులు నాకొనుచుఁ, జిఱునవ్వు నవ్వుచు, మిక్కిలి నీతియుక్తంబయిన మాటల ధర్మరాజుం జూచి 'అమానుషమయిన కార్యముచేసి తీర్చి యెనలేని సిరికలుగఁగా దిగవిడిచెదవే! అయ్యో! ఏమిదుఃఖమిది! ఔరా! ఏమిసంకటము! ఇంతటి యాడంగితన మెందునుగలుగునా;

ఔరా ! పగవారిని జంపి స్వధర్మముచేతఁ బడలిన యీపుడ మిని బొందియు నెట్లు దిగవిడిచెదవు ? ఇది బుద్ధిచుల్కనకదా? పితికిగుండెకు రాజ్యమెక్కడిది ? సోమరికిఁ గాని యెక్కడిది ? రాజ్యమొల్లవేని క్రోధమునఁదెలివిమాలి రాజుల నెందులకుఁ జంపి తివి ? ఏమనుష్యుఁడు సుఖములుమాలి వేదవడి సకలలోకము లందును బ్రఖ్యాతినొందక, పుత్రులను బంధువులునులేక యుం డునో వాఁడు బిచ్చమెత్తి బ్రతుకఁగోరును; కాని తన పౌరు షముచే మఱియెవ్వనియేని యర్థములనుగాని పడయఁగోరఁడు. నీవో సుఖములన్నియుఁ గలిగి సంపన్నుఁడవై సర్వలోకములఁ బ్రఖ్యాతుఁడవై పుత్రాది సంపత్తియుఁ గలిగ పౌరుషముచేఁ బరులయర్థములంబడసి బిచ్చమెత్తఁగోరుట తలక్రిందుగాను న్నది ! సమృద్ధమయిన రాజ్యమును దిగవిడిచి మిక్కిలియుఁ గుచ్చితమయిన బిచ్చపుఁ గవ్వెర నెత్తువృత్తినిబొంది పొట్టఁ బ్రోచికొనఁ జూచునిన్ను నీ లోకముచూచి యేమనును ? ప్రభూ ! సమస్తము లయినధర్మాదిప్రయత్నములను ద్రోసి పుచ్చి సుఖంబులను వీడి యేమియులేక వేదవడిసమూఢుని వలె నెందులకుఁ దిరిపమెత్తఁగోరెదవు ? రాజకులంబునం బుట్టి భూమినంతయు గెలిచినపిదప ధర్మార్థము లన్నిటినిదిగనాడి మూఢత్వముచేత నెందులకు వనమునకు బయలువెడలెదవు ? నీవు లేకపోవుటచేత దుష్టులగువా రీహావిస్సులను జెఱుపుదురేని యాపాపము నిన్నేపొందును. 'ఆకించన్యము (ఏమియులేకుం డుట) మునులకు ధర్మము' (కాని రాజులధర్మముగాదు.) ధనములేనపు డందులకై క్రూరంబగు కార్యముచేసి (బ్రతు

కుదురని) నహుషుఁడు *'ఇస్సీ! ధనము లేమి మిక్కిలి నింద్యము' అనెను. † ఆశ్వస్తన్యవృత్తి ఋషులకుమాత్రమే చెప్పఁబడి యున్నది. అది నీవెఱుఁగుదువు. ధర్మమని ప్రసిద్ధముగా దేనిని జెప్పుదురో యది ధనముచేతఁ గొనసాఁగుచున్నది. ఎవనిధనము నెవఁడపహరించుచున్నాఁడో వానిధర్మమును వాఁడపహరించు చున్నాఁడు. ధనము నపహరింపఁబడి పోవుచుండఁగా మన మెందులకు శక్తులమగుదుము ? లోకులు ప్రక్కనున్నదరిద్రుని దోషవంతునిఁగాఁ జూతురు.లోకమున ధనము లేమి (దారిద్ర్యమే) పాతకము. దానిని గొనియాడుటకుఁ దగువాఁ డెవఁడు ? పతితుఁడు దుఃఖపెట్టఁబడుచున్నాఁడు. వేదవాఁడును దుఃఖపెట్టఁబడు చున్నాఁడు. కాఁబట్టి పతితునకును బీదకును భేదముదోఁపకున్నది. అందందునుండి సంపాదించి కూర్చి మిక్కుటముగా వృద్ధిఁబొందింపఁబడిన ధనములవలననే, పర్వతములనుండి నదులు ప్రవహించునట్లు, సమస్తకార్యములును బ్రవర్తించుచున్నవి. అర్థమువలననుండి ధర్మమును గామమును స్వర్గమును సిద్ధించు చున్నవి. లోకమందలి దేహయాత్రయు ధనము లేక సిద్ధి నొందదు. అర్థమునుండి వీడిన యల్పమతి యగుమనుష్యునకు సమస్తకార్యములును వేసవికాలమునందలి చిన్నయేళ్లవలెఁ దూలిపోవును. ఎవనికి ధనముగలదో వానికిస్నేహితులు గలరు; ఎవనికి ధనముగలదో వానికిబంధువులు గలరు ; ఎవనికి ధనము గలదో వాఁడే లోకమునఁ బురుషుఁడు. ఎవనికి ధనముగలదో

---

* ధనము లేనందువలన నే క్రూరకార్యము చేయఁబడుచున్నది గాన ధనము లేమిని నిందించినాఁడనుట.

† ఆశ్వస్తన్యమనఁగా మఱి నాఁటికి ఏమియు లేకుండుట.

వాఁడే విద్వాంసుఁడు. ధనకాముఁడయినవానికి ధనము లేనిచో ధనము సంపాదింప శక్యముగాదు. ఏనుఁగులచేత పెద్దయేనుఁగులు కట్టువడునట్లు ధనములచే ధనములు కట్టువడుచున్నవి. రాజా! ధర్మము, కామము, స్వర్గము, సంతోషము, కోపము, శ్రుతము, దమము ననెడియివియన్నియును నర్థమునుండి కలుగుచున్నవి. ధనమువలనఁ గులము గౌరవమొందుచున్నది. ధనమువలన ధర్మము వర్ధిల్లుచున్నది. ధనము లేనివానికి నిహమును లేదు; పరమును లేదు. ధనము లేనివాఁడు ధర్మకార్యములు కలరూపునఁ జేయఁజాలఁడు. పర్వతమునుండి నదివలె ధనములనుండియే ధర్మము. స్రవించుచున్నది. ఎవనికి ధనమును, బశువులును, భృత్యులును, నతిథులును, గృశించియుండునో వాఁడే కృశుఁడనఁబడునుగాని శరీరము కృశించిన వాఁడుగాఁడు. రాజా! న్యాయమును జూడు. దేవతలును, అసురులు నెట్లున్నారుచూడుము. దేవతలు, జ్ఞాతులవధము వలని ధనముదక్క మఱి దేనినిగోరుచున్నారు? పరునిసొమ్ము నపహరింపరాదేని ధర్మమెట్లు చేయనగును? సూక్ష్మధర్మములయిన వారు వేదములనుండి వీనినే సిద్ధాంతీకరించియున్నారు. అవియేవనఁగా 'నిత్యమును వేదము నధ్యయనముచేయవలయును. పండితుఁడు తప్పక కావలయును. అన్నివిధముల ధనమార్జింపవలయును. పటుపడి యజ్ఞములను యజింపవలయును' అనియె. దేవలోకమునందుఁగల పదవులన్నియు జ్ఞాతిద్రోహము వలననే దేవతలు పడసిరి. దేవతలు తమ యిష్టసిద్ధిని బొందినందులకుఁ గారణము జ్ఞాతిద్రోహము గాక మఱేమి? ఇట్లు దేవతలు నిశ్చయము చేసికొని యుండుటకాక యిట్లు చేయఁదగునని వేదవాదములును

శాశ్వతముగా నున్నవి. అధ్యయనముచేసెదరు; చేయించెదరు; యజ్ఞములను యజించెదరు, యజింపించెదరను. లోకమునంగల వస్తువులన్నియును బరులనుండి పొందినవే. అవియే మంచిగతికి మూలము. పరులకపకారము లేక కలిగిన ధనమెద్దిగాని యెక్కడ నేని మనకుఁ జూపట్టినదిగాదు. ఈ చందమునఁనే రాజు లీ భూమిని పాలించుచున్నారు. వారలు గెలిచిన పిదప, పుత్రులు తండ్రిధన మునుపెప్పనట్లు 'ఇది నాది' యని చెప్పుదురు. ఆ రాజర్షులును స్వర్గమున కర్హులేయగుదురు. ఏలన వీరల ధర్మము మేలయినదిగాఁ జెప్పంబడుచున్నది. పరిపూర్ణమయిన సముద్రమునుండి నీరు పదిదిక్కులను బ్రవహించునట్లె రాజకులమునుండి ధనమును భూమియందుఁ బర్వుచున్నది. ఈ పుడమి దిలీపునిదిగా నుండెను; నృగునిదిగా నుండెను; నహుషునిదిగా నుండెను; అంబరీషునిదిగా నుండెను; మాంధాతదిగా నుండెను. అదియే నీయందు నున్నది. రాజా! సమస్త విధములయిన దక్షిణలుగలదై మిక్కిలియు ద్రవ్యమువెచ్చించి చేయునట్టి యొకయాగము నీకుఁ బ్రాప్తించియున్నది. నీవు దానినియజింపకపోయితివా రాజ్యమువలని పాపము నీవు పొందుదువు. ఎవ్వారిరాజు దక్షిణలతో నశ్వమేధమనెడి యాగముచేయునో వారందఱు నతని యవబృథంబునందుఁ బరిశుద్ధులగుదురు. విశ్వరూపుఁడయిన యీశ్వరుఁడు నశ్వమేధ మనెడిమహాయాగమందు సమస్తప్రాణులను ప్రేశ్చాను. అట్లెతన్నును దాను ప్రేల్చుకొనెను. ఇదియె శాశ్వతమయిన విభూతిమార్గము. దీనికంతము లేదని వినుచున్నారము. రాజా! మహాజనులు పోయినదారినే పొమ్ము. చెడుదారిని పోకుము' అనెను. ఇది యెనిమిదవయధ్యాయము.

ధర్మరాజపర్వము.

ధర్మరాజు రాజ్యమువలన వెగటునొందుట.

ధర్మరాజ జగ్గునునిఁజూచి 'మనస్సును జెవిని నంతరాత్మయందు లీనముచేసి మొదట గడియసేపు మనసు నొకటే దిటగా నిలిపి యుండుము. పిదప వింటివేని నామాట నీకు రుచించును. గ్రామ్యసుఖములను దిగవిడిచి, పెద్దలసమూహము పోవం దగిన మార్గమును బొందనున్నాను. నీకొఱకు మరల నా రాజ్య మును నొకప్పుడును బూనను. క్షేమకరమయినదియు నొంటరిగఁ బోవఁదగినదియు నయినమార్గ మేమున్నదని నన్నడుగుము. అ ట్లడుగ నొల్లవేని నీవడుగకున్నను నే నయిచెప్పెదను వినుము. విషయ సుఖముల నాచరించుట విడిచి, పెనుతపము సలుపుచు నడవియందు, ఫలమూలములఁ దినుచుఁ, గాలముదప్పక యగ్నిని శ్రద్ధల్చుచు, రెండుపూఁటలును స్నానముచేయుచు, శరీరము కృశించి, కొలఁది యాహారముగలిగి, తోలును నారచీరలును జడలునుదాల్చి, చలిగాలి యెండలకోర్చి, యాఁకలిదప్పులను బడలికలను దాళికగలిగి, శాస్త్రోక్తమయిన తపమున శరీరమును శోషింపఁ జేయుచు, మనస్సునకును జెవికి నింపయిన యడవిమృగ ములయుఁ బక్షులయుఁ బలువగల యుల్లాసంపుఁ బలుకుల నెప్పు డును వినుచును, పూఁచిన వ్రాఁకులయుఁ దీఁగలయుఁ గమ్మని తావులు మూకొనుచును, నానారూపములు గలిగి సొగసులు గులుకుచునున్న యడవులందలి జంతువులను జూచుచు, నరణ్య మందు మృగములతోడ సంచరించెదను. నదీ తీరములందు వసించు వానప్రస్థజనులను దర్శించుటయేకాక, వారలకేమియు

నప్రియమును జేయుననఁగా నీక గ్రామమున వసించు వారివిషయమై యప్రియముచేయుననుట చెప్పవలయునా? రహస్యమున యోగాభ్యాసముచేయుచు, ధ్యానము సలుపుచుఁ, బక్వమైనట్టియు కానట్టియు పదార్థములచే బ్రదుకుచుఁ, బితరులకును దేవతలకును నడవియందలి వస్తువులచేతను వాక్కులచేతను(వేదమంత్రములచేతను) జలములచేతను, దృప్తిగావించుచు, నింత క్రూరమును నింతకంటెను గ్రూరమునయిన యరణ్యవాసుల శాస్త్రములవిధి ననుష్ఠించుచు, నీ మేనిముగియిక నెదురు చూతును. లేక నేను బ్రత్యేకముగా నొక్కొక్కవృక్షముక్రిందను నొక్కొక్కనాఁడు భిక్షమెత్తుచు ముండనముచేసికొన్న సన్న్యసినై శరీరమును నశింపఁ జేసికొనెదను. దుమ్ములు మేసంతయు బ్రుంగియుండఁ,బొడుపడినయింట నిలుచుచుఁ,జెట్టుక్రిందేయునికి పట్టుగాఁగొని, ప్రియములయినవానిని నప్రియములయిన వాని నన్నిటిని విడిచి, శోకమును లేక సంతోషమును లేక, నిందించి నను నన్ను స్తుతించినను సముముగాఁ గొనుచు, ఆశయుడిగి, మమకారమునువదలి, ద్వంద్వమువీడి, పరిగ్రహముమాని, యాత్మస్వరూపమందు రమించుచు, మనస్సు కలంకవీడి,జడునివలెను గ్రుడ్డివానివలెను గుంటివానివలెను జూపట్టుచు, పరులతో నేనమయమందుఁగాని యెట్టి సల్లాపమును జేయకయు, జంగమములు స్థావరములు జరాయుజములు మొదలు నాలుగువగలుగానున్న సమస్తప్రాణులకును హింసగావింపక, స్వధర్మములందుఁ దప్పక వర్తించుచు, నింద్రియముల శోషింపఁజేయుచు, నున్నప్రజలయందు సమబుద్ధిగలిగి, దేనిని బరిహసింపకయు, నేవిషయమును గుఱించియు బొమలు ముడువకయు, ఎప్పుడును దెలివితోఁ

గూడిన మొగముగలిగి, సమస్తములయిన యింద్రియములను లెస్సగాఁ గట్టువఱచియుండును. మఱియు నెవ్వనిమార్గమును నేమి యని యడుగక, యెవ్వనితోడను గలియక పలానినని గుర్తించి యొక దేశమునకు నొక దిక్కునకును బోవఁగోరక, దిక్కును దేశ మును నిదియదియని యుద్దేశించుకొని పోవక, పోవుటయందు నపేక్ష లేక, మరలియుఁ జూడక, సత్యము పలుకుచు, ధ్యానము తోడఁ బోవుచు, స్త్రీరూపమును వర్జించుచు సంచరింతును. పూర్వకృత కర్మవాసనారూపమైన స్వభావము ముందఱ పోవు చున్నది. వలయు నాహారములు దొరకుచున్నవి. అయినను విరో ధులయిన యీద్వంద్వముల నన్నింటిని జంతింపక, భుజింపఁదగి నది కొంచెమైనను, జవిగలదైనను, ఒకవేళ మొదటిపట్టున దొర కక పోయినను, వేఱుచోటుల దొరకినవానిని దినుచు, దొరకక పోయినయెడ నేడుచోట్లయందు నిండించుకొనుచు, పొగలే నట్టియు, ఓఁకటి దంపకములేనట్టియు, నిప్పారినట్టియు, జనములు దినియైనట్టియు, పాత్రముల సంచారము కడచిపోయినట్టియు, చిచ్చుగాఁడు లేనట్టియు, కాలమున రెండిండ్లయందో, లేక మూఁ డిండ్లనో యవికానిచో యైదిండ్లనో యొకసారి భిక్షయెత్తుచు, స్నేహపాశమును విడఁదీసికొని, యీభూమియందుఁ ద్రిమ్మరుచును దొరకినను దొరకక పోయినను రెంటిని సమముగాఁజూచుచు గొప్పతపము సలుపుచు, బ్రతుకవలయుననికాని చావవలయునని కాని కోరునట్టి వానివలె నొకటియుఁ జేయకయు జీవనమును గాని మరణమునుగాని మెచ్చకయు రోయకయు, బొడిసతో నొకచేతిని జెక్కువానికిని జందనముతో నొకచేతిని బూయు వానికిని సెబ్బరగాని మంచిగాని తలంపకయు, బ్రతుకువాఁడు తన

యభివృద్ధికై చేయవలయు కార్యము లెవ్వియో వాని నన్నిటిని దిగవిడిచి, తెప్పపాటు మొదలయిన త్రోసిపుచ్చరాని వానిని మాత్రము వర్తించుచు, వానియందును నెప్పుడును బట్టులేక, సకలములయిన యింద్రియవ్యాపారములన్నియు దిగవిడిచి, మన న్నునందలి సంకల్పమును బోయినదారిని విడువక 'బుద్ధికలుష ములను జక్కఁగా శుద్ధముగావించి, సమస్తమయిన సంగముల నుండి విడివడుదును. మఱియు వలలనన్నింటిని గడచి, యొకని వశమందును లేక, వాయువువలకు సాటిరాని ధర్మముగలిగి, రాగములనుడిగి, యిట్లు గ్రుమ్మరుచు మనసునకు వలయుతుష్టిని బడయుదును. అజ్ఞానమువలనఁ గలిగెడి పేరాసచేత నేకదా మహా పాపముచేసినవాఁడనై తిని. కొందఱు మనుష్యులు సేమము గలవియు సేమముగానివియుఁ బుణ్యపాపములు గలసినవియు నయినకర్మములను గావించి కార్యకారణ సంబంధము గల జనులను (అనఁగా తమకార్యములకుఁ గారణభూతులుగాను, వారికార్యములకుఁ దాము గారణముగాను నుండుజనులను) బోషించెదరు. ఒకఁ డాయుష్మంతుని బ్రాణము తీసిచిన యీ శరీరమును విడిచి యీపాపము ననుభవించుటకై చేసికొనును. ఏలనఁగా నాకర్మపుఫలము కర్తకేకదా. ఇట్లు రథచక్రమువలెఁ బుట్టుచున్న సంసారచక్రము దీప్రాణిసమూహము కార్యము నిమిత్తమై ప్రాణిసమూహముతోఁ గలియుచున్నది. జన్మము మృత్యువు, ముసలితనము, వ్యాధి, వేదనయును వీనిచేఁ బీడి తమై దరిలేని సముద్రముంబోలి నిలుకడలేకున్న సంసారమును విడనాడువానికి సుఖముగలదు. స్వర్గమునుండి దేవతలు పడుట కును, మహర్షులు తమపదవిమాలి నశించుటకును వాస్తవ

మయిన కారణమును దెలిసికొన్న మనుష్యుఁడెవఁడు పుట్టుక (సంసారమున) కువ్విళ్ళులూరును? రాజు, ఇహసుఖమందాస గలిగి యుండుటచే బహువిధ లక్షణములుగలిగి నానావిధ ము లయినకార్యములను జేసికదా యల్పులయిన రాజులచే కట్టువడుచున్నాఁడు. కాబట్టి తెలిసియనెడి యీ యమృతము బహుదినములుగా నన్నుఁ బొందియున్నది. దానిని బడసి యవ్యయమును శాశ్వతమును నేకరూపంబునగు పదవినిగోరు చున్నాను. నే నిట్టిధైర్యముతోడ నెప్పుడును సంచరించుచు నిర్భ యమయిన మార్గమునొంది జన్మమరణ జరావ్యాధి వేదనము లచేఁ బీడితమయిన దేహమును దుదముట్టించెదను" అనెను. ఇది తొమ్మిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

ధర్మరాజును భీముఁడు తేర్చుట.

భీముఁడు ధర్మరాజుతో 'రాజా! క్షత్రియుఁడు మందుఁడై యర్థంపుఁ దెలివిలేనివాఁడగునేని గ్రుడ్డిపాఠముచే వానిబుద్ధికొ ట్టువడును. అట్లు నీబుద్ధియు విషయమును గలరూపునఁ గనుఁగొ నకున్నది. భరతసత్తమా! సోమరితనమందు బుద్ధినిజెల్లించి నీవు దానిచే రాజధర్మములందు నసూయగలిగి యున్నవాఁడ వు. ఇట్టి నీకు ధృతరాష్ట్రునికొడుకుల నాశముసేయుటవలనఁ గలి గిన ఫలమేమి? క్షత్రియులకుఁ దగుమార్గమునఁ బ్రవర్తించు వానికెవ్వనికిని, బంధువుగానుండినను, నీకుండునట్లు ఓరుపును, జాలియు, కరుణయు, మొగమోటమును నిట్లుండదు. నీదుబుద్ధి యిటువంటిదని మునుపే తెలిసికొనియుందుమేని మే మాయుధ

మును ముట్టియేయుండము; దేహమును విడుచుపర్యంతము భిక్షా టనమునే చేయుదుము. రాజులకు భయంకరమయిన యీయుద్ధ మును జరిగియుండదు. సూక్ష్మదృష్టిగలవారు, ఈజగమంతయు బలిమిగలవానికి నన్నము (భోగ్యము) అని తెలియుదురు. స్థావ రజంగమములన్నియు బలవంతుఁడగువానికి భోగ్యవస్తువులగును. క్షత్రధర్మము నెఱింగిన ప్రాజ్ఞులు, 'రాజ్యమును గయికొనువా రికి విరోధులెవరో వారినిజంపవలయును' అని తెలిపెదరు. మన యన్నమునకు విరోధులును. గావునసే దోషవంతులు నయిన యాదుర్యోధనాదులు మనచేత హతులయిరి. వారిని నీవు ధర్మమునసే చంపితివిగాన యీభూమి ననుభవింపవలయును.ఒక మనుష్యుఁడు బావినిద్రవ్వి నీటినిబడయకపోవ్రుక్కాక బురద చేతఁ బూయుంబడినవాఁడునై మగలఁ బడినట్లు మన యీకార్య మగుచున్నది. పెద్దమ్రానిపయినెక్కి యక్కడనుండి తేనియ నుగొనివచ్చి దానినిగ్రోలక మృతినొందుటకు సాటిగా మన యీకార్యమున్నది.ఒకమనుష్యుఁ డాశచే దూరపుదారినిఁబోయి వాఁడే యాశ యొడఁగూడక తిరుగుకొనుటకు సరిగా మన యీకార్యమున్నది. ఒకపురుషుఁడు బగవారిని బొరిపుచ్చి పిదపఁ దన్నును జంపికొనుటకు నెనఁగా మన యీకార్యమున్నది. పసి గొన్న వాఁ డన్నమునుబడసియు నే కారణముచేతనేని దానిని భుజియింపకయుండుటకును, తాను గానించిన మించుఁబోఁడిని బడసియు నిచ్చలు ననుభవింపకుండుటకును, బురుడుగా మనయీ కార్యమున్నది? నీవు మందమతివి. ఇట్టి నిన్ను 'ఇతఁడన్నగదా' యని పెంబడించు చున్నమమ్మే యీవిషయమున నిందింపఁదగి యున్నది. మేము చేతుల బలిమిగలవారము. విద్యలనెల్లఁ గఱి

చినవారము. మనస్సును మాకుగొప్ప. ఇట్టివారమయ్య నశక్తు లుఁబోలె మగతనములేని నీబోఁటి మాటకుఁ గట్టువడియున్నార మే! దిక్కులేని వారికిని దిక్కయి కాచునట్టి మేమే ధనము నష్ట మయిన వారమయితిమేని, జనులు ధనము సమకూరుకొఱకు నే విధమున నాలోచింపకుందురు? ఇది యెటువంటిదో కనుఁగొను ము. ముసలితనము గ్రమ్మినవాఁడును, పగవారిచే దుర్గతిపాలయిన వాఁడును, నాపత్కాలమందే కదా సన్న్యాసము చేయఁదగునని చెప్పఁబడుచున్నది. కాఁబట్టి మిక్కిలిప్రాజ్ఞులయినవారు క్షత్రి యులయందు సన్న్యాసమును గొనియాడుటలేదు. సూక్ష్మదర్శు లగువారు సన్న్యాసమును ధర్మవ్యతిక్రమముగానే తలంచెదరు. క్షత్రియజాతియందుఁ బుట్టి, యందే నెలకొనియుండి దానినే యాశ్రయించి, యాజాతిధర్మమునే నిందించిపలుకుట యెట్లు? అధర్మమును గఱపినదానినే (ద్వైషమునే) యేల నిందింపరాదు? సన్న్యాసము వేదముతెలియనివారిచేతను, ధనము లేనివారి చేతను, నాస్తికులచేతను సమర్థింపఁబడునది. అది వేదము నర్థ వాదముచేత నెలువడినది. అది సత్యమువలెఁ బయికిఁదోఁచునే కాని యసత్యమే. సన్న్యాసమునుబూని తన్నుఁదానే భరించు వాఁడు మిథ్యాధర్మమును నూఁదిమడియునేకాని బ్రతుకనేరఁడు. పుత్రపౌత్రులను, దేవతలను, ఋషులను, అతిథులను, పితరు లను, తృప్తిపఱుపక యొంటిమెయి నడవులయందు హో యిగాజీవించుట కలవియగునేని, యక్కట్లు మనుచున్న యడవి మృగములు స్వర్గమును జయింపవేల? పందులును జయింపవేల? పక్షులు గెలువవేమి? ఒంటిమెయి నున్నజనులు సయితము (ప శుపక్ష్యాదులకులేని) మఱియొకప్రకారమునఁ దమకుఁ బుణ్యము

గలుగుటను జెప్పకొనలేదే? రాజుగానుండువాఁడు సన్న్యాసముచే సిద్ధినిబొందునేని పర్వతములును వృక్షములును శీఘ్రముగా సిద్ధిబొందఁగూడును. ఇవియు స్త్రీసంగము లేనివిగాను, దేహయాత్రకు వలయువస్తువొక్కటియు లేనివిగాను, ఉపద్రవము మాలిన వివిగాను నిత్యసన్న్యాసులుగాను గనఁబడుచున్నవే? కాఁబట్టి ప్రాణులు తమభాగ్యములవలన సిద్ధినిబొందవలయును. పరులకర్మములచే సిద్ధినిబొందఁ శక్యముగాదు. కావున, కర్మమే యాచరింప వలయును. కర్మము లేనివానికి సిద్ధిలేదు. కర్మము లేనివానికిని సిద్ధిగలుగునేని, జలమందున్న చేఁపలు మొదలయినవియు, స్థావరములయిన జంతువులును సిద్ధిని బొందవచ్చును. వానికి నాత్మయొక్కటియే రక్షింపవలయునది; కాని వేఱొక్కటి లేదేని లోకమెట్లున్నదో చూడుము. ప్రాణులు తమ తమ కర్మములవలననే నానావ్యాపారములు చేయింపఁబడుచున్నవి. కాఁబట్టి కర్మమే కర్తవ్యము. కర్మమును విడిచినవానికి సిద్ధిగలుగదు' అని చెప్పెను. ఇది పదియవయధ్యాయము.

రాజధర్మపర్వము.

అర్జునుఁడు ధర్మరాజునకు గృహస్థధర్మము శ్రేష్ఠమని యుపపాదించుట.

అర్జునుఁడు ధర్మరాజునుజూచి 'భరతసింహమా! కర్మము మేలా? సన్న్యాసము మేలా? యనెడి విషయమునఁనే యింద్రునకును ఋషులకును సంవాదరూపముగా జరిగిన పురాతనమయిన యితిహాసము నుదాహరించెదను. మంచి కులమునఁబుట్టి సంపత్తి

పెంపుగలిగి, ధర్మ మాచరింపఁదగువారయిన కొందఱు బ్రాహ్మణులు మతి తక్కువయగుటచే మీసలు మొలవనిప్రాయమందే సన్న్యసము మంచి ధర్మమనియు, దానివలన నడవులందు సుఖముగా జీవింపఁగూడుననియుఁ దలంచి తోఁబుట్టువులను దలిదండ్రులను గృహములను దిగవిడిచి యడవికిఁబోయిరి. వారియెడ నింద్రునకుఁ గనికరము కలిగెను. అతఁడు బంగారుమయమయిన యొకపిట్టయై యాబ్రాహ్మణులనుజూచి 'హోమముచేయఁగా మిగిలిన విఘసమును భుజించు మనుష్యులు చేయునట్టి పుణ్యమును మఱియెవ్వరికిని జేయ శక్యముగాదు. వారల కర్మము పుణ్యమయినను జీవితమును బ్రశస్తమయినది. వారలు కోరినవి సిద్ధినొందువారు. కర్మమును ముఖ్యముగా నూఁదినవారే యుత్తమమయిన గతినిబొందుచుఁరు' అనెను. అందులకు (విఘసమనఁగా నెండిరాలిన తృణపర్ణఫలాదులు గాన దానిని భుజించుతా'మే విఘసాశనులని యర్థము గ్రహించికొని) 'ఆహా! సంతోషము! ఈ పక్షి విఘసమును భుజించువారిని బొగడుచున్నది. కాన యిది మనలనే తెలుపుచున్నది. సందేహములేదు. మనము విఘసమును భుజించువారము' అని మాట్లాడుకొనిరి. అందులకాపక్షి 'నేను మొంపిపూఁతగలిగి దుమ్ములబ్రుంగుచు నెంగిలినిదిను చును బుద్ధిహీనుఁడై యున్నమిమ్ముఁ బొగడలేదు. విఘసమును భుజించువారు వేఱు' అనెను. ఋషులు 'మేమిది మేలయిన దారియని తలంచియుంటిమి. పక్షీ! నిన్ను నమ్మెదము. మాకెద్ది మేలయినదో చెప్పుము' అని యడిగిరి. పక్షి 'మీరు లోపల నొకటిగాను వెలుపల నొకటిగాను నున్నట్లు మిమ్ము రెండునిశ్చయముగా వేఱుపఱుచుకొని నన్నుగుఱించి సందేహింపక యుందురేని

మీకు యథార్థమును హితమునయినమాట చెప్పెదను' అనెను. అందులకు ఋషులు 'ఓధర్మాత్మా! నీకు శ్రేయస్సుమార్గములు తెలిసియున్నవి. కాన నీమాటను వినెదము. నీకట్టడయందే నిలిచియుండఁ గోరుచున్నారము. మమ్ముఁ గఱపుము' అనిరి.

షష్టి వారలతో 'నలుకాలివానియందు గోవు హెచ్చు. లోహములందు బంగారుమేలు. శబ్దములందు మంత్రము (వేదము)మేలు. రెండుకాళ్లవానియందు బ్రాహ్మణుఁడు మిన్న. బ్రాహ్మణునకు జన్మము మొదలుకొని మరణమువఱకు, నయ్యె కాలముల కనుగుణముగా, జాతకర్మము మొదలుకొని శ్మశానమునందుఁ గావింపఁబడు నంతకార్యము వఱకుఁగల యన్ని మంత్రోక్త సంస్కారములు విధింపఁబడియున్నవి. బ్రాహ్మణునకు వేదమునందు విధింపఁబడిన కర్మములు, స్వర్గమునకుఁ బడయుటకయిన మార్గము లన్నింటియందును మేలయినమార్గము. కర్మములన్నియు మంత్రసిద్ధములని వేదవాక్యములు దృఢముగాఁ జెప్పుచున్నవి. అట్లు యీ కర్మమార్గమందుఁ బశు(దైవత)ములు మాస(దైవత)ములు, ఋతుదైవతములు మొదలయిన దేవతలను బురస్కరించుకొని చంద్రమండలమనెడు పితృలోకపదవి, సూర్యమండలమనెడు దేవలోకపదవి, సంసారమునుత్తరింపఁజేయు పరమాత్మపదవి యనెడు మూఁడువిధములయిన సిద్ధులు పడయంబడుచున్నవి. ప్రాణులు కర్మమునే యనుభవించుచున్నవి. కర్మపద్ధతినె కొనియాడువారికి నీకర్మము సమస్తసిద్ధులను బడయఁగూడినపుణ్యక్షేత్ర మగును. ఈ కర్మపద్ధతియే పెద్దయాశ్రమము. ఈ పైనుకర్మపద్ధతిని నిందించి వే ఱొకచెడుతెరువును బొందినట్టి మూఢులును నర్థహీనులు నయినయట్టిమనుష్య

లకుఁ బాపమేకలుగును. పూర్వోక్త మయినకర్మసద్ధతిని వదలి శాశ్వతములయిన దేవపదవి పితృపదవి బ్రహ్మపదవి యనెడుస్థితు లను దిగవిడిచి యుండువారు మూఢులగుదురు. వార లా కారణ ముంబట్టి కుక్క నక్క పులు మొదలయినవాని పుట్టుకకుఁదగిన యశుద్ధములగు మార్గములను బొందుదురు. 'ఇచ్చెదను' అని వేదవాక్యముచే విధింపఁబడిన యీకర్మగతి యుపాసనముతో గూడి మీరుండవలయును. కాఁబట్టి యీకర్మసద్ధతియుఁ దుండు వారే తపస్వులని వేదమునందుఁ జెప్పఁబడుచున్నది. శాశ్వతము లయిన దేవకార్య పితృకార్య బ్రహ్మకార్యములను గురుకార్య మును విభజించి, చేయునట్టికర్మమే దుష్కరమయిన తపమని చెప్పఁబడుచున్నది. దుష్కరమయిన కర్మమునుజేసియే దేవతలు మేలయిన విభవమును బొందిరి. కాఁబట్టి దుష్కరమయిన గృహ స్థాశ్రమమును మీరు చాల్పవలయునని మీ కుపదేశించు చున్నాను. ప్రజలకు (సంతానములకు) నీకర్మమే మూలము. కాఁబట్టి యిదిగొప్పది. ఇందులకు సందేహములేదు. కుటుంబ విధిచొప్పున నీకర్మమం దన్నియునెలకొనియున్నవి. ద్వంద్వము లను దిగవిడిచి మాత్సర్యము లేకయుండు బ్రాహ్మణులు, ఈ గృహస్థాశ్రమమును దపస్సని తెలియుదురు. లోకనులందు వనమధ్యమునందుఁ జేయునట్టి తపము దీనికిఁ బిమ్మటిదేయని చెప్పఁబడుచున్నది. విఘసాశులగువారు పరులకుఁబొంద నలవి గానిపదమును బొందెదరు. తమకుటుంబమందు దేపునుమాపును రెండుపూటలును విఘ్యక్తముగానన్నమునువిభజించి,అతిథులు, దేవతలు, పితరులు, స్వజనులను వీరికినిడి మిగిలినదానిని భుజించు వారు విఘసాశు లనిచెప్పఁబడుదురు. కాఁబట్టి తమకు స్వధర్మ

మయిన కర్మమార్గమందుండి సుప్రశస్తులును, సత్యవాదులును, లోకమునకు గురువులునయి సంశయములు మాలియుందురు. దుష్కర మయినకర్మమార్గమును గావించుజనులు మూఢులవది యగు నింద్రలోకమునుబొంది స్వర్గలోకమందు మచ్చరముపీడి పెక్కుకాలము వాసముచేయుదురు' అనెను. ధర్మార్థసహితము నుహితమునయిన యీమాటలనువిని వారు నాస్తికబుద్ధిని విడిచి గృహస్థధర్మమును గయికొనిరి. కాబట్టి నీవు సర్వజ్ఞుడవు; పురుషతిలకుండవు. నీకుఁదెలియని దేమున్నది. నీవు సయితము దృఢధైర్యము నవలంబించి శత్రువులందఱును హతులయి యకంటకముగానున్న యీ భూమినంతయుఁ బరిపాలింపుము' అనెను. ఇది పదునొకండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

ధర్మరాజునకు నకులుఁడు చెప్పుట.

అర్జునుఁడు చెప్పినది విని యంత సమస్తధార్మికులయందును మిన్న యగుధర్మరాజును జూచి, మిక్కిలిప్రాజ్ఞుడును విశాలవక్షుండును మహాభుజుండును మితభాషియు నగునకులుండు దుఃఖమున మొగ మెఱ్ఱఁబాఱి, నన్నయగు నర్జునుని చిత్తము వొప్పననుసరించి 'మహారాజా! విశాఖయూపమను క్షేత్రమందు సమస్తదేవతలును గట్టిన యీయాగాగ్నిస్థలము లిటికలతోఁగట్టంబడినవి యిప్పటికిని జూపట్టుచున్నవి. కాబట్టి దేవతలు కర్మఫలమునందు నెలకొన్నవారని తెలియుము. (దేవత్వమును గర్మఫలమేచుమీ.) ఆస్తికులుకాని ప్రాణులకుసయితము (వర్షమూల

మున) నన్నమునిచ్చు తండ్రులయిన దేవతలును గర్మమునే చేసెదరు. రాజా! విధియెట్టిదో చూడుము. అర్జునుడుదాహరించిన వేదమును దిగవిడిచిన యాబ్రాహ్మణులను మిక్కిలియు నాస్తికులని యెఱుంగుము. బ్రాహ్మణుడు వేదమందుఁ జెప్పఁబడినది దిగవిడిచి తక్కిన సమస్తకర్మములచేతను దేవయానమను మార్గమున స్వర్గముమీఁదిమేరయగు బ్రహ్మలోకమును బొందఁజాలఁడు. వేదముల నిశ్చయము తెలిసినవాఁడు శాస్త్రములను జక్కఁగాఁ గఱచినవారు నయినబ్రాహ్మణు లీ గృహస్థాశ్రమము సమస్తములయిన యాశ్రమములకంటె శ్రేష్ఠమయినదని చెప్పెదరు. వారివలన నీ విది తెలియుము. ధర్మముచేతఁ బొందఁబడు ధనముల నుత్తమములయిన యాగములందుఁ దానముచేయుమనుష్యుఁడే మనస్సును జయించినవాఁడు. ఆ మనుష్యుఁడె యన్ని విధములైనత్యాగము గలవాఁడు. మహారాజా! గృహస్థ ధర్మమందు సుఖభోగమును బాటింపకయల్లే యడవియందు గొప్పనిష్ఠను బొందినవాఁడై శరీరమును విడుచువాఁడు * తామస త్యాగియగును. ఇల్లుమాలి, బిచ్చమునకుఁ దిరుగాడుచు వృక్షమునీడయే పట్టుగాఁగొని మననముచేయువాఁడును, ఎప్పుడును యోగముగలవాఁడును, పరులను యాచింపనివాఁడును, నగువాఁడు, సన్న్యాసమునకుఁ దగిన (భిక్షుకున కగు) త్యాగముగలవాఁడు. కోపమును సంతోషమును విడిచి, విశేషించి పరులదూషించుటయుమాని, బ్రాహ్మణుఁడెవఁడు వేదము నధ్యయనముచేయునో, వాఁడు గురుపూజకుఁ డయినత్యాగియగును. రాజా!

---

* 'స త్యాగీ తాపసో మతః' అని పాఠాంతరము. 'తామసోమతః' అని యిట పాఠము కయికొనఁబడినది.

ఎఱుకగలవారు సమస్తము లయినయాశ్రమములనుఁ ద్రాసునందుఁ దూఁచి మూఁడాశ్రమము లొకప్రక్కను గృహస్థాశ్రమమొకప్రక్కను దూఁగునని చెప్పుదురు. కామమునుస్వర్గమును సమముగానుండుటనుజూచి, లోకవృత్తము నెఱింగిన మహర్షులకు నీగృహస్థాశ్రమమే మంచిమార్గమనియును మంచిగతియనియు నెవఁడుభావించునో వాఁడు త్యాగియగును.భరతసత్తమా ! ఒకఁడు గృహములను దిగవిడిచి యడవికిఁ బోయి నపిదప మూఁడునివలె నొకసమయమున భోగములను దలంచుకొనునేని, వాఁడు ధర్మావేషమును బూనినవాఁడగును. వీనిని మృత్యువు తనపాశముచేఁ గంఠమునఁ గట్టి యీడ్చును. మహారాజా! ఆశను మున్నిడుకొని చేయుకర్మము ఫలములేనిదని చెప్పఁబడును. ఆశను ద్యజించి చేయుకర్మమంతయు మహాఫలము గలదగును.శమము,దమము, ధైర్యము, సత్యము, శౌచము, ఆర్జవము, యజ్ఞము, ధృతి, (ఉత్సాహము) ధర్మము ననెడియివి ఋషులకు వలయు నిత్యవిధియని చెప్పఁబడుచున్నది. ఈ గృహస్థాశ్రమమందు పితరులు, దేవతలు, అతిథులు ననెడి వీరికొఱ కనుతలంపునఁజేయు ప్రయత్నము శ్లాఘింపఁబడుచున్నది. మహారాజా ! గృహస్థధర్మమనెడి యీ మార్గమందే ధర్మార్థకామములు మూడింటిఫలమునుఁ దప్పక కలదు. అభిమానమును విడిచి బ్రాహ్మణులనుప్రీఁచెడి యీ విధిచొప్పనఁ బ్రవర్తించువానికి నెయ్యెడను నాశముగలుగదు. ధర్మాత్ముఁడును గల్మషరహితుండును నగుబ్రహ్మ పలువిధములయిన దక్షిణలు గలయాగములచే మనల నారాధింతురని కదా ప్రాణులను సృజించెను. యాగముకొఱకే చెట్లను జేమలను నోషధులను నల్లే పరిశుద్ధములయిన పశువులను, హవిస్సులను

సృజించెను. యాగమనెడి యీకర్మము గృహస్థాశ్రమముగలవా
నికే చేయఁదగినది. కాఁబట్టి గృహస్థాశ్రమ మొక్కటియే పొం
దుటకును జేయుటకు నరిదియైనది. అటువంటి గృహస్థాశ్రమము
నుబొంది పశువులను ధాన్యములను ధనములను బడసి యెవరు
యాగముచేయరో వారలయందుఁ బాపము నెలకొనియుండును.
కొందఱు ఋషులు వేదాధ్యయన మనుయజ్ఞమే చేయుదురు.
మఱికొందఱు జ్ఞాన మనుయజ్ఞముచేయుదురు. వేఱుకొందఱు
మనస్సునందే యోగమనెడి పెనుయజ్ఞమును జేయుదురు.
మహారాజా! విద్వాంసులు నాకు మఱియొకటిని జెప్పియున్నా
రు.అదియేమనఁగా—ఈజగము నిలుచుటకుఁ బూర్వము, భూమి,
అప్పు, తేజస్సు, వాయువు,సూర్యుఁడు చంద్రుఁడు,నక్షత్రములు
దిక్కులు, కాలము, శబ్దము,స్పర్శము, రూపము,రసము గంధమ
నునివి యొక్కటియుఁ గలుగవు. వీనిని దెలుపునట్టి ప్రత్యక్షము
అనుమానము, ఉపమానము, ఆగమము, అర్థాపత్తి, ఐతిహ్యా
ము, అను ప్రమాణములును దృష్టాంతమును లేవు. ఎందును
సందేహమును నిశ్చయమును లేవు.ధర్మమును నధర్మమును గలు
గవు. దేవతలు, మనుష్యులు, స్థావరము, జంగమము, జాతి
విభాగములును, ఆశ్రమ విభాగములును, చేయునాఁడును,
కోరువాఁడును, ధనమును, సంపత్తియు, వానిఫలము నొక్కటి
యుఁగలుగదు. ఈలోకమంతయుఁ బ్రకాశముమాలి చీఁకటిగా
నేయుండెను. ఆత్మయుండియు మనస్సుతోడి కూడికను గోరిన
దిగాదు. మనస్సు జ్ఞానములేనిది. ఆత్మయొక్కటియే జ్ఞానముగ
లది. ఈప్రపంచమంతయు వ్యాపించియుండు నొక్కండగు నీశ్వ
రుండు ప్రాణులకును మంత్రములకును దగిన రూపమును గలి

గాపలేదు. మాత్రములకు దేవతలయి వెలుంగు సృష్టికర్త లని వేరొందిన కొందఱు ఋషులక్కాలమం దీశ్వరునిచేఁ గల్పింపఁ బడిరి. వా రీశ్వరునివలననుండి తగిన జ్ఞానమునుబడసి యీబ్ర హ్మాండమును గల్పించి విశ్వసృజమనెడి యాగమును గావించి పితామహుండను నొకనిని బుట్టించిరి. ఆ పితామహుఁ డీశ్వరు నియనుగ్రహముబలన నీలోకసృష్టికిఁ దొడంగెను. ఈలోకపు జ్ఞానమంతయు నీశ్వరుని జ్ఞానమే. ఈశ్వరుండయిన యాశంభుఁడు తనశక్తిచే నీజగమునంతయు వ్యాపించియున్నాఁడు. ఆ యీశ్వ రునిచేఁ బ్రలయకాలమందు బ్రహ్మకు ధర్మార్థ కామ మోక్షము లుపదేశింపఁబడి యున్నవి. జ్ఞానము మాలినవియు, శక్తిలే నివియు సుఖదుఃఖములకుఁ బట్టుబడినవియు నగుటచే జంతువు లీశ్వరునిచేఁ బ్రేరితములయి స్వర్గమును నరకమును బొందుచు న్నవి. ప్రాణులీశ్వరునిచేతను మనస్సుచేతను విషయములచే తను గర్మములచేతను బ్రేరితములై ప్రకృతిని బురుషునిని సుఖ దుఃఖములను నొందుచున్నవి. దేవతలు, అసురులు, గంధర్వ లను వీరితోడఁ గూడిన యీలోకమును సృజించిన యీశ్వ రుఁడే జాతిని, ఆశ్రమములను వీని యంతర్భేదములు నేర్పఱచి యున్నాఁడు. మహారాజా! నీవును దక్కినవారును నేవిధమునఁ జూచినను గాని యీశ్వరుని వశమం దుండు వారలేకాని వేఱు గాఁరు. ప్రాణులన్నియు నా యీశ్వరునివశమం దుండియే జీవమును మరణమును బొందుచున్నవి. దేవతలు ప్రాణు లను నీలోకమును జంపి యాగముచేసెదరు. వారు పాపము నెంతమాత్రమును బొందరు. దేవతలకయినను, ఋషులకయినను, గృహస్థాశ్రమమును బొందినవా రెవరికిఁగాని కర్మములు హింస

గలవిగానే యున్నవి. ఆకర్మమును జేయు గృహస్థు లుత్తమ మయినగతిని బొందెదరు. తొల్లిరాజులు ప్రజలకును దమకును హితముగోరి పెక్కుచోట్ల శత్రుపులను గూల్చియున్నారు. రాజా ! అందుఁ బాపముగలదేని వారెట్లు స్వర్గమునుబొందిరి ? అట్టి పాపములచేతఁ జుట్టంబడియే నరకమును బొందరయిరి ? కాఁబట్టి గృహస్థాశ్రమములందుదోషమొకటియుఁ గలుగదు.అది గొప్పది ! యని యిట్లు మనస్సునకు సమాధానము చేసి కొని యీ కర్మమార్గమం దుండి బ్రహ్మను బొందువారగు బ్రాహ్మణులు మొద లయినవారినిఁ జూచి దేవతలు నట్టి వారిస్థితికి నాశపడుదురు. అంతయు నీవెఱుంగుదువు. అందందు సంపాదించి తెచ్చిన విచిత్రములగు రత్నములను యజ్ఞములందు దానముసేయుటకుఁ బ్రయత్నింపక నాస్తికవాదములు పలుకు చున్నావే ! రాజా ! కుటుంబమును జెందినవానికి త్యాగము కలుగుట యరిది. కాబట్టి బ్రాహ్మణులు మిక్కిలి పూజించునట్టి రాజసూయము, అశ్వమేధము, సర్వమేధము మొదలుగాఁగల తక్కిన యజ్ఞములను దేవరాజగు నింద్రునివలె యజింపుము. ప్రాలుమాలిక యనెడు తనదోషముచేత, దొంగలు దోఁచు కొని బాధించుచున్న ప్రజలను రక్షింపకుండు రాజెవఁడో యతఁడె కలియనఁబడును. మనమో దాయాదుల పట్లమనసున మచ్చరముగొని యింతలు సేసిన వారము.ఇందులకుఁగాను అలం కరింపఁబడిన గుఱ్ఱమును, ఏనుఁగును, గోవులను, దాసీలను, గ్రామములను, పల్లెలను, క్షేత్రములను, గృహములను, బ్రాహ్మణులకు దానముసేయక యుందుమేని రాజులని చెప్పఁబడు కలులు కాఁగలము. ఇట్లు మనమొకరికిని బెట్టక యెవరినిని గావక వట్టి

రాజపాపములకుఁ బొలయి యుండుము గాన దుఃఖమునే కుడువఁగలము! కాని సుఖమును బడయుట గలుగదు. ప్రభూ! మహాయజ్ఞములును బితృశ్రాద్ధములును జేయక, బుణ్యతీర్థములందుఁ గ్రుంకులిడక, యూరువిడిచి సన్న్యాసివై పోవుదువేని, యిహమున కును బరమునకును రెంటికిని దొలఁగి పిశాచమవై గాలిచిమ్మఁగా చెల్లాచెద రయినమేఘమువలె నాశమును బొందఁగలవు. లోపలఁగాని వెలుపలఁగాని మనసునకుఁ జింతగలిగించు వస్తువును దేనిని గాని మనస్సుచేతఁ దిగవిడిచినవాఁడు త్యాగి (సన్న్యాసి) యగును. ఇల్లువిడిచి వెలువడినవాఁడు సన్న్యాసికాఁడు. మహారాజా! బ్రాహ్మణులును నుపాసించునట్టి యీ కర్మమార్గమందు వర్తించువానికి నెచ్చటను జెఱుపుగలుగదు. యుద్ధమం దింద్రుఁడసురసైన్యమును హతముగావించునట్లు పెంపుసొంపారు శత్రువులను బలిమిమెయిం దునుమాడి, పూర్వులచేఁ బ్రోక్తమయినదియు శిష్టులయిన రాజులచేత ననుష్ఠింపఁబడినదియు నయిన స్వధర్మమం దాసక్తుఁడయి యుండువాఁ డెవఁడిట్టిశోకమును బొందును? క్షత్రియధర్మముచొప్పునఁ బరాక్రమము మెఱసి యీ భూమినిగెలిచి, వేదవిదులకు దానములొసంగి యానుకృతమువలన నాకపృష్ఠమును బొందఁగలవు ఇట్టి సమయమున నీవు శోకించుట యెంతమాత్రముతగదు!' అనెను. ఇది పండ్రెండవయధ్యాయము.

—◆—

రాజధర్మపర్వము.

సహదేవుఁడు ధర్మరాజునకుఁ జెప్పినది.

సహదేవుఁడు ధర్మరాజునుజూచి 'రాజా! (దారపుత్రాదుల

యిన) బాహ్యవస్తువులను విగవిడుచుటవలన సిద్ధిగలుగదు. శరీర మందుఁగల (కామక్రోధాదులగు) వస్తువులను విడుచుటచే సిద్ధి కలిగినను గలుగవచ్చును. బాహ్యవస్తువులనుండి విడివడినను, శరీరమందలి వస్తువులందు సక్తిగలవానికి నేధర్మమును సుఖము ను గలుగునో యాధర్మమును సుఖమును, నట్లె మనవిరోధులకుఁ గలుగుఁగాత. శరీరమందలి వస్తువులను విడిచి భూమిని బాలించువానికిఁ గల ధర్మమును సుఖమును నట్లె మనసుహృదులకుఁ గలుగుఁగాత. * రెండక్షరములుగలది. మృత్యువు (మార్గము) అగును. మూఁడక్షరములుగలది శాశ్వత మయినబ్రహ్మమార్గ మగును. 'మమ' (నాది) అను రెండక్షరములు గలది మృత్యువు. 'న మమ' (నాదికాదు) అను మూఁడక్షరములుగలది శాశ్వత మయిన బ్రహ్మము. కాఁబట్టి రాజా ! బ్రహ్మము మృత్యువుననెడి యీరెండును గానంబడకయే మఱిఁగి ఒద్దియఁదు నెలకొని యుండి ప్రాణులను దమవశము చేసికొనుచున్నవి. సందేహము లేదు. శరీరమునకు నాశముకలిగిననను గాని శరీరమునందుఁగల (యీకర్తృత్వధర్మముగల) బుద్ధికి నాశములేదనుట నియత మేని శరీరమును విడుచుటవలనఁ బ్రాణులకు నేహింసయుఁ గలుగరాదు. ఈశరీరముతోఁ గూడనే బుద్ధికిని నుత్పత్తివినా శములు గలుగునేని యీశరీరము పోయినతోడనే బుద్ధియుఁ బోయినదగును. అట్లగునేని, యీకర్మపథము వ్యర్థమేయగును. కాఁబట్టి తెలివిగలవాఁ డిందొక నిశ్చయమును గయికొనక పూ

---

*ఇందులకుమూలము 'ద్వ్యక్షరస్తు భవే న్మృత్యు స్త్ర్యక్ష్యరం బ్రహ్మ శాశ్వతమ్ । మమేతి ద్వ్యక్షరో మృత్యు ర్న మమేతిచ శాశ్వతమ్' అని తెలియు. నది 'మమ' అని స్వీకారము. 'నమమ' అని పరిత్యాగము.

ర్వులును వారికిఁ బూర్వులును నయిన సత్పురుషు లనుష్ఠించు మార్గమునే సేవింపవలయును, ఈకర్మమార్గ మధమముగా నుండినదేని స్వాయంభువమనువును నక్లే తక్కిన పెక్కండు చక్రవర్తులును నేల దీనిని ననుష్ఠించిరి? కృతయుగము త్రేతాయుగము మొదలయిన కాలము బహుతరముగా మంచిగుణములు గలవి. ఆకాలములందుఁ గలరాజులు విశేషముగా నీ భూమిని పాలించిరి. స్థావరజంగమములతోఁగూడ నీ భూమిని బడసియు దీనిని లెస్సగా ననుభవింపనిరాజు బ్రతికియుండి ఫలమేమి? లేక యడవికిఁబోయి యందలి వస్తువులచే బ్రతుకు మనుష్యునికి ద్రవ్యములందు మమతగలుగునేని వాఁడు మృత్యువు నోరఁ జిక్కినవాఁడగును. లోపలను వెలుపలను గలవస్తువుల స్వభావమును జూడుము. ఎవరు దాని కలరూపును గనుదురో వారు మహాభయమునుండి విడివడుదురు. నాకుఁ దండ్రియుఁ దల్లియుఁ దోఁబుట్టువును గురువు నన్నియు నీవే. దుఃఖముచేఁ బ్రేలిన నాపలుకులను నీవు సయింపవలయును. భరతసత్తమా! నే నాడిన దంతయు తథ్యముకానీ, యతథ్యముకానీ, యవి, భక్తిచేతఁ జెప్పఁబడినవని మాత్రము తెలియుము' అనెను. ఇది పదుమూఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

ద్రౌపది ధర్మరాజునకుఁ జెప్పినది.

ధర్మరాజు తనతోఁబుట్టువులు నానావిధములయిన యాయా వేదసిద్ధాంతములను జెప్పుచుండఁగాఁ దానేమియుఁ బలుకకుం

డెను. అదిచూచి గొప్పకులమునఁ బెంపారఁబుట్టిననారీరత్నము, వాలుంగన్నులు గలశ్రీనుంతులురాలు ద్రౌపది యతినితోఁ బలుకఁ దొడంగినదయ్యె. సింహములును బెబ్బులులుంబోని తమ్ములు తన్నుబలసి యుండఁగా నేనుంగులు బలసియున్న యూథపతివలె వెలుంగుచు నారాజవృషభుఁ డుదాసీనుండై యుండెను. ఆబిడకు విశేషించి యతనియందభిమానము గలిగియుండును. ఆ రాజు నాచెలువను నెప్పుడును లాలించుచుండును. మఱియు నాపడఁతి ధర్మాధర్మముల నెఱింగినది. ఆసుశ్రోణి భర్తనుజూచి మిక్కిలి చెలువయిన తిన్ననిపలుకుల నతనితో 'రాజా! వీరుగో నీతమ్ములు కందికుందుచున్నారు చూడు. చాతకములవలె మాటిమాటికి వావిడుచుచు నిలుచున్నారు చూడుము. వీరిని బాటింపవు. మహారాజా! మదపుటేనుఁగులుంబోలె మత్తిల్లియున్నవీరు విడువక దుఃఖములపాలయియుండినవారు గాన యుక్తియుక్తం బగుమాటచెప్పి వీరిని సంతోషింపఁజేయుము. రాజా ! మునుపు ద్వైతవనమునందు నీతమ్ములు వీరు చలికిని గాలికిని నెండకును గందికుందియుండఁగా నండజునుజూచి 'మనము దుర్యోధనుని యుద్ధమునఁ జంపి సమస్తములయిన కామములచే నిండారియున్న యీ భూమండలము ననుభవింతము. అరిందములారా ! మనము యుద్ధమున జయమునొందఁదివిరి వీరపురుషులను, రథములను, మహాగజములను, హతములు గావించి భూమిని రథములచేతను రౌతులచేతను గలయంగప్పి, యీప్రదక్షిణలచే బెంపుసొంపారునానావిధయజ్ఞములును యజింతము. వనవాసమునం బడిన దుఃఖమంతయు మనసుఖమునకే యగును' అని యిట్లుల చెప్పితివి. ?

వారి కిట్లుచెప్పియును నీవును ధార్మికులం దుత్తముఁడవైయుండియును మరల మామనంబులను నొప్పించెదవేల ? పండయగువాఁడు భూమిని పాలింపఁజాలఁడు; ధనములను ననుభవింపఁజాలఁడు. పండయుఁటఁ బుత్రులు, భోంపియుండుఁ జేపలవలె బాగుగనుండఁజాలరు. దండనీతి యెఱుఁగని క్షత్రియుఁడు విలసిల్లఁడు. దండము లేనివాఁడు భూమిని బడయఁజాలఁడు. దండము లేనిరాజును నండగొన్నప్రజలును సుఖమునొందఁజాలరు. దేవతలు, అసురులు, గంధర్వులు, అప్సరసలు, రాక్షసులు, గుహ్యకులు, నాగులు, మనుష్యులు ననెడి వీరిచేత భూషితమై ధర్మార్థకామములచే సంపూర్ణమై యున్నయీజగమంతయు దండముచేత నడంచి యనుభవింపఁదగినదిగా నున్నది. రాజా ! స్వయంభువలన నుండివచ్చిన శాశ్వతం బగునీతిశాస్త్రమును వినుము. ఇది బ్రాహ్మణు లెల్లవారికిని మీకును దెలిసినవిషయమే. రాజు లేకయుండినచో, నీలోకము భయముగొని నలుగడలఁ బరుగిడిపోవునని దీనిని రక్షించుటకై యీశ్వరుఁడు తానింద్ర, డగ్ని, యముఁడు, వాయువు, సూర్యుఁడు, వరుణుఁడు, చంద్రుఁడు, కుబేరుఁ డనువీరల శాశ్వతములయిన తేజస్సు నంశముల నొకటిగాఁజేర్చి మహాకాయుండును, మహావీర్యుండును, జగత్తును బరిపాలించుటకుఁ శక్తుండును నగురాజును సృజించెను. దేవేంద్రుఁడు మొదలయిన వీరల యంశములవలన రాజు పుట్టుచున్నాఁడు గావున నతఁడు తనతేజముచే సమస్తప్రాణులను నడంచుచున్నాఁడు. రాజు సూర్యుఁడుంబోలెఁ గన్నులను మనంబులను దపింపఁజేయును. భూమియం దెవరుగాని యతనినిదేఱిచూడఁజాలరు. ఆరాజు లోకమున నగ్నియు, వాయువును, సూర్యుఁడు

ను, జంద్రుఁడును, యముఁడును, వరుణుఁడును, గుబేరుఁడును, దేవేంద్రుఁడునుంగాఁ బ్రకాశించుచున్నాఁడు. రాజునందు సమస్తఋషుల తేజస్సును స్థాపింపఁబడియున్నది. రాజు బాలుఁడు గానున్నను, మనుష్యునిఁగాఁ దలఁచి యవమానింపరాదు. రాజొక పెద్దదేవతయనియు, మనుష్యరూపముగొని నిలుచున్నఁడనియుఁ దలంపవలయును. నిప్పు, తప్పి దగ్గఱిన యొకమనుష్యునిఁ గాల్చును. రాజనెడు నగ్గియో, గోవులు ధనములు మొదలగు వస్తువులతోడఁ గులమునే గాల్చివైచుననుటకు సందేహము లేదు. మీ కోపాగ్నివలన ధృతరాష్ట్రుని కులమే దహింపఁబడినది. ఇది లోకమంతయుఁ దెలిసినది. ఇందు సందేహమేకలుగదు. మంచికులమునఁ బుట్టి, మంచినడవడిగలిగి, ధర్మబుద్ధితోఁ గూడి, బ్రజలను రక్షించుటయందు నిరతుఁడై యొప్పురాజు, దేవతలచేతను బూజితుఁడగును. కార్యమును,శక్తినిని,జోటును, గాలమును గలరూపునఁ గనుఁగొని,ధర్మార్థ మెవఁడు మాటిమాటికిఁ బెక్కురూపము లెత్తికొనునో, యతనియనుగ్రహమందు లక్ష్మియుఁ, బరాక్రమమందు జయమును, గోపమందు మృత్యువును వసించుచుండును. ఏలన నతఁడు సర్వతేజోమయుఁడుగదా. అతని నెవఁడు తెలియక ద్వేషించునో వాఁడు నాశమునొందును. అట్లు ద్వేషించువానిని, రాజుగూడ శీఘ్రముగాఁ జంపఁదలఁచును. కాఁబట్టి రాజు తనకిష్టులయినవారియందు ననిష్టులయినవారియందును మంచియో చెఱ్ఱరయో దేనిని నిశ్చయించునో దానినిమార్పరాదు. ఈశ్వరుఁడు సమస్తజగత్తులను రక్షించు బ్రహ్మతేజోరూపమై తనవలనఁ బుట్టినదియు నగుదండనీతి యనుధర్మమును రాజులొఱకై నిర్మించెను. స్థావరజంగమ

ములగు సమస్తప్రాణులును, దండనీతివలని భయమున భోగ
ము నొసంగుచున్నవి; ధర్మమునుండి చలింపకయు నున్నవి.
రాజు న్యాయ్యమున వర్తించు మనుష్యులను, దేశకాలములను
శక్తినిఁ గార్యమును గలరూపునఁ గనుంగొని దగురీతి నడంపవల
యును. దండమే, లోకమునకు రాజు; దండమే,అడఁచువాఁడును,
జరుపువాఁడును, ఆజ్ఞసేయువాఁడును. అదియే వర్ణములకును
నాశ్రమములకును, నవ్యయంబగు ప్రభువు. దండమే ప్రజల
నెల్ల శాసించుచున్నది. దండమే ప్రజలనెల్ల రక్షించుచున్నది.
జగత్తులు నిదురించుచున్నను దండము మేలుకొని యుండును.
విద్వాంసులు దండమును ధర్మమని తెలియుదురు. చక్కఁగా
నాలోచించి ప్రయోగించినదండము ప్రజలనెల్ల రంజిల్లఁజేయు
ను. ఆలోచింపక చేయుదండము సమస్తమును నాశముసేయు
ను. రాజు స్త్రీలుమాలికలేక దండింపఁదగిన వారియందు దండ
మును జెల్లింపనియెడ, జలమందలి చేపలుంబోలె లోకమందు
బలవంతులు బలహీనులను భక్షించివైతురు. అప్పుడు కాకియుఁ
బురోడాశమును దినును. కుక్కయు హవిస్సును నాకును. స్వామి
త్వ మెందును గలుగదు. అంతయుఁ దలక్రిందగును. లోకము
నందుఁ బరిశుద్ధుం డగుమనుష్యుండు మిక్కిలి యరుదగును. లో
కమంతయు దండముచేత నడంపఁబడి దానివలని భయమునుబ
ట్టి ప్రయోజన (భోగ)కారియగుచున్నది. దేవతలును, అసురులు
ను, గంధర్వులును, రాక్షసులును, ఉరగులును, పతగులును దండ
ముచేతఁ బీడితులగుటంబట్టియే భోగమునకుఁ బాత్రులయ్యేద
రు.దండము పొరలెనా సకలవర్ణములు చెడును; సకలమైన కట్టు
పాట్లును భేడిల్లును. లోకమంతయుఁ బ్రకోపమునొందును. నల్లసి

దేహమును, నెట్లనికన్నులును, గలిగి పాపమును బరిమార్చునట్టి దండపురుషుఁ డెచ్చటసంచరించునో యచ్చటిప్రజలు తమ్మునడపువాఁడు చక్కఁగా నరయువాఁడేని తెలివిమాలరు. అట్టిదండమునకుఁ, జక్కఁగా విచారించి చేయువాఁడును, బ్రాజ్ఞుండును, ధర్మకామార్థములఁ జక్కఁగాఁ దెలిసినవాఁడును, సత్యవాదియు నగురాజు కారణమగును. అట్లు దండమును జెల్లించురాజు స్వర్గమును గూర్చి పోవును. కామమందు మనస్సునుంచు నీచుం డగురాజు దండముచేతనే కొట్టువడును. దండము మిక్కిలియు గొప్పతేజముగలది. అది, మంచిబుద్ధిమంతులు గానివారికి నెంతమాత్రము వహింప నలవిగానిదిచుమీ. కావునసే యది ధర్మమునుండి చలించినరాజునే యతనిబంధువులతోఁగూడఁ జంపివైచును. అది రాజును జంపి దుర్గమును రాజ్యమును స్థావర జంగమాత్మకమయిన జగత్తును, ఆకాశమునం గల మానులను దేవతలను హింసించును. లోభియు, బుద్ధిదేఱినివాఁడును, విషయాసక్తుఁడును, మూఢుఁడును, అసహాయుఁడు నయినవానికిఁ బాడిదొప్పున దండము, నడపశక్యముగాదు. పరిశుద్ధుండును, సత్యసంధుఁడును, నీతిశాస్త్రము ననుసరించువాఁడును, మంచి సహాయసంపత్తి గలవాఁడును, బుద్ధిమంతుండు నగువానికే చెల్లింప శక్యమగును. రాజు తనరాజ్యమందు న్యాయముతో వర్తించువాఁడును, శత్రువులందు వేండ్రమయిన దండము గలవాఁడును, నెయ్యురగు సుహృదులందు ఋజువయినవాఁడును, (చక్కటిగల వాఁడును), బ్రాహ్మణులందు తీమగలవాఁడునై యుండవలయును. ఇట్లుండురాజు పరిగయేతి బ్రతుకువాఁడయినను నీటియందు మునెబిందువు వ్యాపించునట్లు లోకమునందు వానికీర్తి వ్యాపిం

చును. ఇందులకు విపరీతముగా వర్తించుబుద్ధిమాలిన రాజునకుఁ గీర్తి, నీటియందలి నెత్తిబొట్టువలె, లోకమున సంకుచితమగును. రాజా! ధర్మమునుండి చలించుటవలననే ధృతరాష్ట్రునిపుత్రులను దేవదేవుం డగురుద్రుఁడును, బ్రహ్మయు, విష్ణుదేవుఁడును, మహాత్ముం డయినయింద్రుఁడును, దిక్పాలురును, పంచభూతములును, మహాత్ములయినపాండవులును వధించిరి. అధార్మికులును దురాచారులు నయినయీధృతరాష్ట్రపుత్రులు సేనలతోడఁగూల్చంబడిరి. రాజా! నెపముననో, మాయచేతనో, క్షత్రధర్మము చేతనో వారిని వధించుటవలన నీకు సుంతేనియు దోషములేదు. సర్వభూతములయందలి మైత్రియు, దానమును, అధ్యయనమును, తపస్సును బ్రాహ్మణులకే ధర్మమగును; రాజులకుఁగాదు. రాజులకు దుష్టులను వారించుటయు (దండించుటయు) సజ్జనులను బరిపాలించుటయును, యుద్ధమందు వెనుదీసి పాఱకుండుటయు ననునివియే పరమ మయినధర్మము. ఎవనియందు క్షమయుఁ గోపమును, ఇచ్చుటయుఁ బుచ్చుకొనుటయును, భయమును అభయమును, నిగ్రహమును అనుగ్రహమును రెండునుగలవాఁడే ధర్మవిదుఁడని చెప్పుదురు. ఈభూమి, చదవుచేతను, దానముచేతను, మంచి మాటలచేతను, యాగముచేతను, యాచనచేతను నీకు లబ్ధమయినదిగాదు. లోకంబునఁ బ్రసిద్ధమై, వెక్కండ్రు వీరులచే నుద్యతమై, రథ గజ తురగ సంపన్నంబై, ప్రభూత్సాహ మంత్రము లనెడిమూఁడంగములచే నత్యుత్తమమై, ద్రోణకర్ణాశ్వత్థామ కృపులచే రక్షితమై యుండిన శత్రుసైన్యములును నీచేతహతములయినవి. కాఁబట్టి, వీరా! భూమిని నీవు భుజింపుము. పురుషసింహమా! వెక్కు జనపదములతోఁగూడిన

జంబూద్వీపమును నీవు దండముచేత నడంచితివి. ఈ ద్వీపమునకు సాటియై మేరువునకుఁ బడమటి ప్రక్కనున్న * క్రౌంచద్వీపమును నీవు దండముచేత నడంచితివి. నరపతీ ! మేరువునకుఁ దూర్పున నున్నదియుఁ గ్రౌంచద్వీపమునకు సదృశమయినదియు నగుశాక ద్వీపమును దండముచేత నీ వడంచితివి. మేరువునకు ను త్తరమునందున్నదియు శాకద్వీపమునకు సమానమయినదియు నయిన భద్రాశ్వద్వీపమును దండముచేత నడంచితివి. వీరా ! నానా జనపదముల కాశ్రయమయిన ద్వీపములును, వానికి నడుమఁగల చిన్న ద్వీపములును సముద్రమునుజొచ్చి నీవు దండముచేతి నడం చితివి. మహారాజా ! ఎనలేని యిట్టికార్యములను జేసితివి. ఇందు లకు బ్రాహ్మణులచేతను బొగడొందుచున్నావు. ఇంతకు సంతో షింపకున్నావే ! భారతా! అంకెలువైచు వృషభములవలెను, మదించియున్న గజములవలెను నున్న యీ తమ్ములనుజూచి యుల్లసిలుమీ. వీరలు పగవారిని నవలీలనోర్చువారు; పరులను మగంటిమిచేఁ గ్రాఁచువారు. అందఱను దేవతలకుఁ బ్రతిము లయినవారు. వీరియం దొక్కొక్కరును నాకు సుఖముగూర్పఁ జాలుదురని నాతలంపు. శరీరమును జరుపుటయందు నింద్రియ ములన్నియుఁ జేరియుండునట్లు, మనుష్యులందు మిన్నలై బెబ్బు లులుంబోని శూరులయిన పతులందఱును నా విషయమందుఁ జేరియుండఁగా నిఁక జెప్పనేల ? నాయత్తగారు కుంతి యన్ని యుఁ దెలిసినది. ఆయమ యన్నియుఁజూచినది. ఆయమ నన్నుఁ జూచి 'పాంచాలీ ! యుధిష్ఠిరుఁడు తీవ్రమయిన పరాక్రమము

* క్రౌంచద్వీపాదులను వశీకరించుట రాజసూయమందు సిద్ధులమూల ముగనని తెలియునది.

మెఱసి విరోధులగు వేలకొలఁది రాజులను వధించి నిన్ను మిక్కిలి యెక్కుడయిన సుఖమునందు నుంపఁగలఁడు' అని చెప్పినమాట పొల్లుగానేరదు. రాజా! నీ తెలివిలేమిచేత నది పొల్లగునని తలంచుచున్నాను. అన్నవగు నీవు, ఉన్మత్తుడవయియుండుట వలన నిన్ననుసరించు తక్కిన పాండవులందఱును, నీపైత్యము వలనఁ బైత్యముగలవారై యున్నారు. నీదు తమ్ములు పైత్యము గలవారు గాకుండిరేని, నిన్ను నాస్తికులతోఁగూడఁ గట్టివైచి భూమినేలుదురు. తనకయిన శ్రేయస్సును బొందకున్న మూఢుఁడే కదా యిట్లుచేయును. పొగలచేతను, గాటుకలచేతను, నస్యములచేతను నీపైత్యమును తొలంపవలయును. దారితప్పి నడచు మనుష్యునకు మందులచేతఁ జికిత్స గావింపవలయును. భరతసత్తమా! లోకమునంగల స్త్రీలయందు నేను మిక్కిలియుఁ గీడ్పడినదానను. ధృతరాష్ట్రుని కొడుకులచేత నట్లవమానింపఁబడియు, నే నుసురుతోనుండఁ గోరుచున్నానే! రాజా! ధృతరాష్ట్రుని కొడుకు లెప్పుడును దుర్మార్గమున నడచువారు. అట్టివాని వధించుటయం దొకప్పుడు నేవిధమయిన దోషమును గానంబడదు. శుక్రుఁడు చెప్పిన యీశ్లోకములను వినుము. వాని యర్థమేమన-'తన్నుఁ జంపుకొనువాఁడు, తన ధనమును బాడు చేయువాఁడు, బంధువులను జంపువాఁడు, విషముపెట్టువాఁడు, కారణములేక చంపువాఁడు, ఇల్లాలిని బరామర్శించు వాఁడనెడి యీయారుగ్వురును ఆతతాయులనఁబడుదురు. వీరలను జంపుట యందు దోషమేకలుగదు.' మహోత్సుండయిన యీశుక్రునికొఱకు బ్రహ్మదేవుఁడు దీనిని వచించెను. సన్మార్గమందు వర్తించు బ్రాహ్మణుఁడు, క్షత్రియుఁడు, వైశ్యుఁడు, శూద్రుడునను వీరలయిండ్లకుఁ

బోయి బలవంతముగాఁ గొట్టువానిని, విషము పెట్టువానిని, భుజింపరానిదియుఁ ద్రావరానిదియు నగువస్తువు నిడువానిని, అగ్ని పెట్టువానిని జంపవలయును. గోవులను బ్రాహ్మణులను వధించునపుడును, పడఁతులను దలవెండ్రుకలుపట్టి యీడ్చునపుడును, బితామహుఁడగు బ్రహ్మగా నుండినను గొట్టవలయు ననఁగా నీకుఁదక్కిన పాపాత్ములవిషయమై చెప్పనేల? ఇది రాజులు నడవవలసిన మార్గము. గోవులకును బ్రాహ్మణులకును రాజులకును వ్యసనము కలుగు కాలమందును, రాజ్యమునకుఁ జెఱుపుగలుగు కాలమందును, తన దేహమును గాచుకొఱకును, పడఁతుల యేడ్చుధ్వనిని విన్నను, మహాప్రభావుఁడగు బ్రాహ్మణుఁడయినను యుద్ధము సేయవలయును. ధర్మమునుండి చలించిన యాతతాయియగు బ్రాహ్మణునిఁ జంపవచ్చును. తెలిసిన వాఁడు బ్రాహ్మణవధమును వేఱెచ్చటఁగాని మనస్సుచేతను దలంపరాదు. గోవును, బ్రాహ్మణునిఁజంపఁ దెగించిన బ్రాహ్మణుని క్షత్రియుఁడు చంపవచ్చును. మంత్రమును గాచుకొఱకును, దన కుటుంబమును బొందుకొఱకును క్షత్రియుఁడు బ్రాహ్మణునిఁ జంపవచ్చును. ధర్మమునుండి చలించినవాఁడై, క్రూరుఁడై, చోరుఁడగు బ్రాహ్మణుని క్షత్రియ జాతియందుఁ బుట్టినవాఁడు యుద్ధమున మిక్కిలిబలిమి మెయి మారొనవచ్చును. వేదాంత పారంగతుఁడయినను దన్నుఁ జంపవలయునని కోరి పయినెత్తి వచ్చు నాతతాయిని వధింపవచ్చును. దానివలన వేదము సాంగముగా నధ్యయనముచేసిన బ్రాహ్మణునిఁ జంపుట యను భ్రూణహత్యను జేసిన దోషమునొందఁడు. బ్రాహ్మణుఁడును క్షత్రియుఁడును, వైశ్యుఁడును, శూద్రుఁడును, చండాలుఁడును

మఱియుఁ దక్కినవాఁడెవఁడును, నే సమయమందును శాంతుఁడగు బ్రాహ్మణుని నొక గడ్డిపోఁచచేతను గొట్టరాదు. బ్రాహ్మణునిఁ బెద్దకట్టనుగొని కొట్ట నెత్తినపాపి మున్నూఱుసంవత్సరములు మంచి నిలుకడనొందఁడు. కొట్టినవాఁడు వేయిసంవత్సరములు నరకమందుఁ బడును. కాఁబట్టి బ్రాహ్మణునిఁ గొట్టుటకై చేయెత్తుటయు, నాయుధముచేతఁ గొట్టుటయుఁదగదు. బ్రాహ్మణుని మేననుండివచ్చు నెత్తు రెన్ని ధూళియణువులను గ్రహింపఁ గూడునో యన్ని యేండ్లు కొట్టినపాపి నరకమందుఁ దిరుగుడు వడుచుండును. బ్రాహ్మణునితోలు నెమ్ములను భేదించినవాఁడును, భేదింపఁజేసినవాఁడును నగు మనుష్యాధముఁడు బ్రహ్మహత్య చేసిన వాఁడయి ప్రాయశ్చిత్తముచేసికొనఁ దగుచున్నాఁడు. శ్రోత్రియుండగు బ్రాహ్మణునిని, ఆత్రేయగోత్రమందుఁ బుట్టినబ్రాహ్మణస్త్రీనిని జంపినచో, అది బ్రహ్మహత్యకు రెండింతలు దోషము గలదని ఋషులు చెప్పుటచే నిరువది నాలుగేండ్లు దానికిఁ బ్రాయశ్చిత్తము చేసికొనవలయును. అట్లు ప్రాయశ్చిత్తము చేసికొనని వానిని, మేనియందు గుఱుతుచేసి, దేశమునుండి వెడలఁగొట్టవలయును. బ్రాహ్మణునిఁ జంపినవాఁడును, దొంగతనము గలవాఁడును నయినయొకఁడు బ్రాహ్మణుఁడయినను, క్షత్రియుఁడయినను, వైశ్యుఁడయినను, శూద్రుఁడయినను వానిని రాజు దండింపవలయును. ఇట్టివానిని గాలుసేతులను, వెదవిని, ముక్కును ఛేదించి యిఁక నట్లుచేయకుండునట్లు కావింపవలయును. వీరు బ్రాహ్మణునిఁ జంపినవారేని వీరికన్నులను బెఱికివైవ వలయును. ఈ దండనము శూద్రునకును, వైశ్యునకును, క్షత్రియునకును జెల్లును. ఇట్టి పాపముచేసిన బ్రాహ్మణుఁడు ప్రాయశ్చిత్తము చేసి

కొనకుండినేని యూరువెడలఁ గొట్టవలయును. బ్రాహ్మణునిఁ జంపిన క్షత్రియునిని వైశ్యునిని శూద్రునిని రా జాయుధము చేతఁ జంపవలయును. బ్రాహ్మణునిఁ జంపిన బ్రాహ్మణులను రాజు మేనియందు గుఱుతుచేసి, యూరువెడలఁ దఱుమవల యును. బ్రహ్మహత్యచేసినవారగు తక్కువ మూఁడు జాతుల వారిని నింద్రియ వికలులను (అనఁగాఁ గన్నుచెవి మొదలగు వానిని లేనివారిని) జేసి చండాలురతోఁగూడి మనుష్యట్లు చేయవలయును. వారలతోఁ గలసిభుజించువాఁడు నట్టిపాపము గలవాఁడగును. వారు మరణించినను వారి కెవ్వరును బిండము మొదలగువాని నిడరాదు.నల్లని చాయయును వికారరూపమును వ్రేలుచున్న తలవెండ్రుకలును గలిగి బ్రహ్మహత్య కనఁబడకయే వెంబడించి చేసినవానిని బీడించుచున్నని పెద్దలు తెలియుదురు. బ్రహ్మహత్య చేసినవానితో భుజించుచుండినయెడల నట్లుండు బ్రాహ్మణులును వారువసించు నూరును దేశములును గఱువు చేతను దొంగలచేతను శీఘ్రముగానే పీడింపఁబడును. బ్రాహ్మణులను జంపువాఁడును బాపకర్ముండును నగువానిని క్షత్రియుఁడయినను వైశ్యుఁడయినను శూద్రుఁడయినను గన్నులు పెటికివైవవలయును. సాధువులు బలవంతులయినను, బలహీనులయినను, వారికి రాజు బలమగును. బలవంతులయినను దుర్బలులయినను బాపులకు మృత్యువగును. రాజా ! ఒకఁడు బలవంతుఁడుగానీ బలహీనుఁడుగానీ వాఁడు దోషముగలవాఁడై యుండునేని వానిని రాజునకుఁ దెలుపక కొట్టువాఁడు దండనమునకుఁ బాత్రుఁడగును. రాజునాజ్ఞను రాజేర్పరించిన న్యాయాధికారిని మీఱినవాఁడును, సాధుని సాధువాక్యమును విడిచి తొలఁగిన

వాఁడును నపరాధులగుదురు. చెఱసాలనుండి వెలి కుఱికినవాఁడును, అపరాధి నొప్పగింపని పూఁటకాఁపును, మంచికులమున బుట్టినను ధనసంపన్నుఁడయినను నపరాధులగుదురు. రాజాజ్ఞచేఁ బిలువఁబడియు, బలవంతుఁడగు నొకనిని బ్రాహ్మణుఁడగొని యాయుధమెత్తికొని రాజసభకు రాకుండునట్టివాఁడపరాధియగును. అట్టి గొప్పయపరాధముగల మనుష్యుని వాని దేహమును, ధనమును భోఁగొట్టుకొనఁజేసి పరలోకమునకుఁ బుచ్చవలయును. అట్లు మృతుఁడయిన వానికెవ్వఁడును బిండాదు లిడరాదు. ఆజ్ఞనుమీఱి యిడువానికి * రెండవదోషమునకుఁ దగినదండుగును విధించుట దగును. కులస్త్రీలను బలవంతముగాఁ జెఱపుటయు, రాజ్యమును జెఱుపుటయు, బ్రాహ్మణులను జంపుటయు, న్ముచ్చిలించుటయు, రాజును ద్వేషించుటయు, యుద్ధములేని కాలమందుఁ జంపుటయు, కలుద్రావుటయు, గురుపత్నిని గూడుటయు, మిత్రద్రోహము చేయుటయు ననెడి యిట్టి మహాపాతకమును జేయువాఁడు మహాసాహసికుఁడు (మహాపరాధి) అగును. వానిని గొంచెమేని దయఁజేయింపక, ధనమంతయుఁ దీసికొని తోడనే వర్జింపవలయును. ఇట్టి దండనము శూద్రుఁడు మొదలయిన మూఁడువర్ణముల వారికనియు, ఇట్టిమహాసాహసముచేసిన బ్రాహ్మణుని మేనియందు గుఱుతుచేసి వెలిఁ దఱుమగొట్టవలయుననియు బ్రహ్మ తొల్లి

---

* యాజ్ఞవల్క్యస్మృతి వ్యవహారకాండము సాహస ప్రకరణమందుఁ ప్రథమశ్లోకటీకను - అపరాధములు మూఁడువిధములు. మొదటిదానికి వేయి ఖంగారములను రెండవదానికి నేనూఱును, మూఁడవదానికి నూఱును దక్కువ దండుగుగా విధింపఁబడియున్నది.

విధించుయున్నాఁడు. బుద్ధిమంతుఁడగుశుక్రుఁడు, నాలుగువర్ణ
మున వారికిని స్త్రీలకును బాలురకును వృద్ధులకును గొల్ల
వాండ్రకును వేఱుబంగారములు దండుగు విధింపవచ్చునని
చెప్పెను. బృహస్పతి దుర్వినీతులయిన యిట్టి పాపులకును ఆత
తాయుల కందఱికును మరణదండము విధించుచున్నాఁడు. కాఁ
బట్టి పాపబుద్ధులును బాపకర్మములే చేయుచుండువారును నగు
ధృతరాష్ట్రుని పుత్రుల కందఱికును మరణదండము గావించు
టయం దెంతమాత్రమును దోషములేదు. రాజా! ఏకవస్త్రయు
రజస్వలయు నగుననన్ను, నీదోషమునుబట్టి, నీకన్నులయెదుట,
వెక్కండ్రుశూరులు చూచుచుండ, నట్లు సభయందు జూదంబు
నప్పు డీడ్చుకొని వచ్చునట్లుచేసిన దురాత్ములగు కర్ణ శకుని దుర్యో
ధనాదులను జంపినదాన దోషమేకలుగదు. కోపాగ్నిచేతఁ బను
తోడ ధనసంచయములను గాల్చి ధృతరాష్ట్రనికులము నాశము
సేసినందులకు నీకు ధర్మలోపముకలుగదు. నీ నిమిత్తమున నిట్టి
దుఃఖమునుబొందినదాన నయితిని. ఆసమయమందు జగత్తునకుఁ
గాలహేతువగు దేవదేవుండు సూర్యుఁడనుగ్రహించి నన్ను
వస్త్రహీననునుగానీక రక్షించెను. ఆదిత్యుని ప్రసాదముచేత
బ్రాహ్మణములకు నేనుబాయకున్నాను. నామాట పొల్లుకాదు.
నీవైనా యిట్లు పాటుపడుచున్న యీతమ్ములను బాటింపక, యీ
భూమినంతయు దిగవిడిచి, నీయంతట నీవే యాపద కలిగించు
కొనుచున్నావు. రాజసత్తమా! మాంధాతయు, అంబరీషుం
డునుంబోలె నీ వీ భూతలమున రాజుల యెన్నికకెక్కి వెలుంగు
చున్నావు. ధర్మముచొప్పునఁ బ్రజలను గాచుచు పర్వతవన
ద్వీపములతోఁ గూడినయీ భూదేవిని లెస్సగాఁ బరిపాలిం

పుము. మనసునం దీపిన్నతనమువలదు. పలువిధములయిన యజ్ఞములను యజింపుము. పగవారిని మార్కొని యోర్వుము. ధనములను వస్త్రములను మఱియుంగల భోగ్యవస్తువులను బ్రాహ్మణులకు నొసంగుము' అనెను. ఇది పదునాలుగవయధ్యాయము.

రాజధర్మపర్వము.

అర్జునుఁడు ధర్మరాజునకు జెప్పినది.

అర్జునుఁడు ద్రౌపది చెప్పినదివిని రాజయిన తనయన్న ననుసరించి యతనితో 'ప్రజలనందఱను శిక్షించునది దండమే; రక్షించునదియు దండమే. లోకులు నిదురించుచుండినను దండము మేలుకొనియుండును. దండమును ధర్మముగాఁ బండితులు తెలియుదురు. ధర్మమును అర్థమును గామమును దండమే రక్షించుచున్నది. కాన త్రినర్గమును దండమని చెప్పఁబడుచున్నది. ధనమును ధాన్యమును దండముచేత రక్షింపఁబడుచున్నవి. దీనిని చక్కఁగా నెఱుంగుచు లోకము స్వభావమును జూడుము. కొందఱు మనుష్యులు రాజు దండించునని భయపడి పాపము చేయకుందురు. కొందఱు యమదండమువలని భయముచేతను, కొందఱు పరలోక భయమువలనను, పాపముచేయకుందురు. ఇట్లు లోకము దండార్హమయిన స్వభావము కలిగియుండుటను జూడఁగానన్నియు దండమందు నెలకొన్నవగును. కొందఱు దండమునకు భయపడియే యొకరినొకరు పట్టి కబళింపకున్నారు. దండము రక్షింపకపోయెనా యీలోకము జీఁకటిలో మునిఁగి

పోవును. అడఁగని వారిని (తాడనాదులచే) నడంచుట వలనను, అపరాధులను (విత్తాహరణాదులచే) దండించుటవలనను నిట్లు దమనముచలనను దండనముచలనను బండితులు దండమని చెప్పు దురు. బ్రాహ్మణులకు మాట దండము. *క్షత్రియులకుఁ గూలి యిచ్చుట దండము. వైశ్యులకు ధనము దండము. శూద్రు నకు (నూడిగము తప్పవేఱు) దండము లేదని చెప్పుదురు. రాజా మనుష్యులకు నవివేచనము గలుగకుండుటకును, ధనములను రక్షించుటకును, లోకమందు దండమనెడి మర్యాద యేర్పఱుపఁ బడినది. ఏదేశమందు రాజు చక్కఁగాఁ బాటించునేని † నల్లని కాయమును, నెఱ్ఱని కన్నులును గలదండపురుషుఁడు మిక్కిలి యుద్యత్తుఁడై సంచరించునో యందుఁగల ప్రజలు మోహము నొందరు. బ్రహ్మచారి, గృహస్థుఁడు, వానప్రస్థుఁడు, సన్న్యాసి యనెడి యీమనుష్యులు దండమునకు భయపడియే తమ తమ మార్గములందు నెలకొని యున్నారు. భయము లేనివాఁడు యా గము చేయఁడు; దానము సేయఁగోరఁడు; భయము లేని వాఁడె వఁడు దననియమమునందు నిలువఁగలఁడు ?. ఎదిరిమర్మము లను ఛేదింపకయు, దుష్కరమయిన కార్యము చేయకయు, చేపలఁ బట్టువానివలెఁ జంపకయు, గొప్ప సంపత్తిని బడయ రాదు. చంపుటకుఁ దెగనివానికి నీలోకమందుఁ గీర్తియు, ధన

---

* క్షత్రియులకు స్వాతంత్ర్యములేక యొకరిప్రాపుచే బ్రదుకుటయే హీన త్వముగాన దండమగును.

† బిట్టుగాఁగొట్టినచో దండనువలన అంధత్వము గలుగునుగాన నల్లనిదని యు దండించువాని కన్నులు కోపాతిశయమున నెఱ్ఱగానుండును గాన యెఱ్ఱని కన్నులుగలదనియుఁ జెప్పఁబడినది.

మును, బ్రజలును గలుగవు. ఇంద్రుఁడు వృత్రుఁ డనునసురను జంపియే మహేంద్రుఁ డనుపేరిని నందులకుఁ దగినగృహమును బడసి, లోకములకు నీశ్వరుండునయ్యెను. కొట్టునట్టి దేవత లెవరో వారినే లోకము మిక్కిలియుఁ బూజించుచున్నది. రుద్రుఁడు, కుమారస్వామి, ఇంద్రుఁడు, అగ్ని, వరుణుఁడు, యముఁడు, కాలుఁడు, వాయువు, మృత్యువు, కుబేరుఁడు, సూర్యుఁడు, వసువులు, మరుత్తులు, సాధ్యులు, విశ్వేదేవతలును గొట్టునట్టి స్వభావముగలవారు. కాఁబట్టి వారల ప్రతాపమునకు లోఁగి జనులు వారలను బూజించుచున్నారు. బ్రహ్మను, ధాతను, పూషను, నొక్కరును బూజించుటలేదు. దాంతులును, శాంతిపరాయణులును, సర్వభూతములయందును (రాగముగాని ద్వేషముగాని లేక) మధ్యస్థులై యుండువారు నగుదేవతలను మనుష్యలోక కొండఱుమాత్రమే పూజించెదరు. లోకమునందు హింససేయక జీవించువాని నెవనిని గానను. బలముగల ప్రాణులు బలము లేని ప్రాణులవలన జీవించుచున్నవి. ముంగిస యెలుకలను దినుచున్నది. ముంగిసను పిల్లి దినుచున్నది. పిల్లిని కుక్క దినుచున్నది. కుక్కను జిఱుతపులి తినుచున్నది.అట్టి పులులనెల్ల మనుష్యుఁడు చంపుచున్నాఁడు. ధర్మమెట్లు పోవుచున్నదో చూడుము. స్థావర జంగమములన్నియుఁ బ్రాణమున కన్నమని దైవము విధించియున్నది. తెలిసినవాఁ డీవిషయమై సందేహము నొందఁడు. రాజసత్తమా! ఎట్లు శౌర్యము, తేజము, ధైర్యము, సామర్థ్యము మొదలయిన క్షత్రియజాత్యుచిత గుణములతోడ బ్రహ్మచేత సృజింపఁబడియున్నావో, యీవిధముననే కాఁదగుదువు. మూఢులయినక్షత్రియులు కోపమును సంతోషమును విడిచి యడవిక్

బోయి తపముచేయువారై యుండియు (కందమూలాదుల) వధ ములేక ప్రాణమును గడుపుచున్నారుగారు. జలమునందును, భూమియందును, పండ్లయందును, బెక్కులు ప్రాణులున్నవి. లోకమునందు వానిని జంపకుండువాఁ డెవఁడు ? ప్రాణిహింసలేని జీవనము మఱెదియున్నది ? మిక్కిలి సూక్ష్మము లయినరూపులుగలవియు, అనుమానముచేతఁ దెలియఁదగినవియును, కన్ను తెప్పలల్లార్చినంత నునుఱు దొఱఁగునవియు నగుప్రాణులు గొన్ని కలవు. కోపమును నసూయను దిగవిడిచి గ్రామమునుండి బయలువెడలియుఁ గొందఱుమునులు తెలివిమాలి వనమునందును గుటుంబధర్మము గలవారయి చూపట్టుచున్నారు. భూమిని భేదించి ఓషధులు వృక్షములు మొదలయినవానిని, బఱులను బశుపక్షులను, ఛేదించి మనుష్యులు యాగముచేయుచున్నారు.వారును స్వర్గమును బొందుచున్నారు. దండనీతి లెస్సగాఁ జెల్లింపఁబడునేని సమస్తప్రాణులకును సకలమయిన ప్రయత్నములును సిద్ధించుచున్నవి. అందు నాకు సందేహములేదు. లోకమున దండములేనిచో నీప్రజలు నాశమునొందును. నీటియందలిచేఁపలవలె బలవంతులయినవారు దుర్బలులను గబళించి వైతురు. 'చక్కఁగాఁ జెల్లింపఁబడినదండము ప్రజలను రక్షించుచున్న'దని తొల్లి బ్రహ్మచెప్పినమాట నిజమే. అగ్నులు చెడుకంపు గలయీ మాంసమునకు జంకియు (ఘ్రాణాత్కారముచేత) నదల్పఁగా వెలుఁగుటయు దండమువలని భయమునచే. మంచిసెబ్బరలను వేఱువేఱ నేర్పఱిచి చూపెడియీ దండము లోకమునందు లేకపోయెనా యీ జగ మొక్కటే యంధకారమగును. ఏదియుఁ దెలియదు. మర్యాదల నదల్చి

వేదములనిందించుచు నాస్తికులయి యుండువారును, దండము చేత మిక్కిలి పీడితులయిరేని తోడనే మర్యాదనుగావ నర్హులగుచున్నారు. లోకమంతయు దండముచేత జయింపఁబడినది. పరిశుద్ధుఁడగువాఁడు దుర్లభుఁడుచుమీ. దండమునందు భయముండుటవలననేచుమీ లోకము మర్యాదతోడ ననుభవించుటకు నర్హమగుచున్నది. నాలుగువర్ణములవారి సంతోషమునకును, చక్కని నీతిగావించుటకును, ధర్మార్థములను రక్షించుటకును బ్రహ్మ యీదండమును విధించియున్నాఁడు. దండభయము లేనిచో, పక్షులును దుష్టమృగములును, పశువులను మనుష్యులను యజ్ఞమున కగుహవిస్సులను దినివైచును. బ్రహ్మచారి యధ్యయనముచేయఁడు. ఆవుసమయమునఁ బిదుకదు. కన్య పెండ్లియాడదు. ఈదండము పాలింపకుండునేని సకలమయిన మర్యాదలును లోపించును. సకలమయిన గరుసులును నుడివోవును. మమత్వమును జనులు కొలదిపాటిగాఁ దలంపరు. అనఁగానన్నియుఁ దమదేయని జంకక సులువుగా నెంతురు. విధ్యుక్తముల యిసదశ్రీణులు గలిగి పెక్కు సంవత్సరములు చేయఁదగు సత్రమును యాగములను నిర్భయముగా ననుష్ఠింపఁజాలరు. ఆశ్రమమునొందినవారు తమతమ యాశ్రమములకు విహితమయిన ధర్మమును చెప్పఁబడినట్లు చేయరు. ఒకఁడును విద్యను గఱవఁడు. దండము లేనిచో బండియందుఁ గట్టినలొట్టియలు, ఎద్దులు, గుఱ్ఱములు, గాడిదలు, కంచరగాడిదలును వాహములను లాగవు. పనివాండ్రు నొడయనిమాట వినరు. తండ్రిబోధించు ధర్మమందు పిన్నవాఁడైన్నఁడును నిలువఁడు. ప్రజలందఱును దండమున నెలకొనియున్నారు. పండితులు దండమున

భయమున్నదని చెప్పుచున్నారు. మనుష్యులకు నివాసమును బరమును దండమందు నెలకొనియున్నవి. చక్కఁగా జగుపఁ బడునదై విరోధులను నాశముసేయునట్టి దండ మేదేశమునందు వర్తించుచున్నదో యచటఁగపటమును, బాపమును, వంచనయుఁ గానంబడవు. దండ ముద్యతమై యుండఁదేని కుక్క హవిస్సును జూచి నాకును; కాకి పురోడాశమును గొంపోవును. ఈరాజ్యము ధర్మముగనో యధర్మముగనో రాజునకు విధింపఁబడియుండుటచే దీనినిగూర్చిశోకింపరాదు. భుజింపఁదగువానిని భుజింపుము. యాగములు యజింపుము. శ్రీమంతులగువారు నిర్మలము లయినవస్త్రములు గట్టుచు గాదిలి యిల్లాండ్రతోఁ గూడిమాడి మేలయిన యన్నములనుదినుచును సుఖముగా ధర్మమాచరించుచున్నారు. సకలప్రయత్నములను ధనమునకు లోనయియున్నవి. ఇందులకు సందియము లేదు. ఆధనమో దండమునకు లోపడియున్నది. దండంపు గౌరవమును జూడు. (పనులను జంపుటకుఁ గొట్టమును దూతినపులిని) చంపకుండుట (యాపనులకయిన) తగనిపెను హింసగా పర్యవసించును. కాఁబట్టి ధర్మమును గయికొనుటయే మంచిది. ఇట్టి ధర్మప్రవచనము లోకయాత్ర జరుగుటకే యిందుఁ గావింపఁబడినది. తుదముట్ట గుణమేగలది గాని, తుదముట్ట గుణములేనిదిగాని యగువస్తువొకటియు లేదు. మంచిదియుఁ జెడ్డదియు నీరెండును నన్నికార్యములందును గనఁబడుచున్నవి. వెక్కండ్రుజను లెద్దులవృషణముల నలిపి పిదప వానిముక్కులను దూటువొడిచి వెక్కులు బరువులు దానిపయి మోయించి గట్టుచును గొట్టుచు నుండెదరు. మహారాజా ! ఇట్లు లోకమాయానెఱితెఱఁగులచేతఁ దోడనే యాకులమై భయముగొని

యున్నది. అవిలేనిచో (బరువుమోయుట మొదలయిన కార్యములులేక పసదూలును) కాన పురాతనమైనధర్మమునే యాచరింపుము. (క్రొత్తగానొకటి తలపెట్టవలదు). యాగముచేయుము. దానములుచేయుము. ప్రజలను రక్షింపుము. ధర్మమును జక్కఁగ బరిపాలింపుము. శత్రులను జంపుము. మిత్రులను బెంపుము. రాజా! పగవారిని జంపినందులకు శోకింపకుము. పగవారిని జంపురాజున కించుకయును బాపములేదు. ఆయుధమెత్తికొని కొట్టవచ్చు వానిని ఆయుధముగొని యెవఁడుగొట్టునో వాఁడు భ్రూణహత్యచేసినవాఁడుగాఁడు. *కోపము కోపమును జేరుచున్నది. సమస్తప్రాణులయందుండునాత్మ వధింప నలవిగానిది. సందేహములేదు. వధింపనలవికానియాత్మను వధించుట కెవనికిఁగాని యెట్లుశక్యము? ఒకఁడు ప్రాతగృహమును విడిచి క్రొత్తగాఁ గట్టినయింటఁ బ్రవేశించినట్లు, ఆత్మ ప్రాతదేహములను దిగవిడిచి క్రొత్తవియగు నాయాశరీరములను బొందుచున్నవి. ఇదియే మృత్యువని తత్త్వమునుగాంచిన జనులు చెప్పుదురు' అనెను. ఇది పదియేనవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీముఁడు ధర్మరాజునకుఁ జెప్పినది.

భీముఁడు అర్జునుఁడు చెప్పినది విని, యెంతమాత్రము ధర్మరాజు పూనికకు సయింపనేరక ధైర్యమునుగొని యతనితో

* 'మన్యుస్తం మన్యుమార్ఛతి' అని మూలము. కోపము కోపమును జేరుచున్నదని యర్థము. ఇందులకు 'మన్యుఃకర్తానాహంకర్తా' అని శ్రుతి. దీని వలన కర్తకోపమే కాని భ్రూణహత్యాదిదోషము లేదనుట.

'రాజా! నీవు ధర్మముల నెఱింగినవాఁడవు. నీకుఁ దెలియనిది పుడమియం దొకటియులేదు. నీనడవడి నెప్పుడును మేము నేర్చుకొనుచున్నారముగాని యట్లు నడువ మాకెంతయు శక్యముగాకున్నది. 'చెప్పను చెప్పను' అను తలంపుమాత్రము నామనస్సున నుండెను. అయినను దుఃఖము మితిమీఱుటచే నాఁగఁజాలక చెప్పెదను. చెవియొగ్గి తెలియుము. నీకుఁగల మిక్కుటమయిన తెలివిలేమిచేత నన్నిటిని సందేహింపవలసివచ్చినది. మాకుఁ దెంపులేమియు, నక్లె దుర్బలత్వమును, గలిగినవి. లోకమునకు రాజును సర్వశాస్త్రములందుఁ బండితుఁడునగుదువు. ఇట్టి నీకుఁ గేవలుఁ డయినవానివలె లోకమునకుం గలయగతియు (ఆపదను) గతియు(సంపదను) దెలిసియున్నవి. జరుగుచున్నకాలమందు నిఁక జరుగఁ గలకాలమందును నొకటియు నీకుఁ దెలియనిది లేదు. మహారాజా! జనాధిపా! ఇట్లుండఁగా రాజ్యముచేయవలయు నన్నవిషయమందు కొంతకారణమును మాత్రము చెప్పెదను; ఒక్కటే మనస్సుతో వినుము. లోకమందు శారీరము మానసము నని రెండువిధముల వ్యాధులున్నవి. వానిలో నొకటినుండి మఱొకటి పుట్టుచున్నది. ఒకటినివిడిచి మఱొకటి కలుగుట కానరాదు. శారీరవ్యాధివలన మనోవ్యాధియు మనోవ్యాధివలన శారీరవ్యాధియుఁ గలుగుట నిశ్చయము. శారీరము మానసము ననెడియీవ్యాధులను గుఱించి ముందుగడచిపోయినవానికి నెవఁడుశోకించునో వాఁ డాశోకమువలన దుఃఖమును నారెండువిధముల వ్యాధులను మరలఁ బడయుచున్నాఁడు. శీతము (కఫము) ఉష్ణము (పిత్తము) వాయువు (వాతము) ననెడి యీ మూడుగుణములును శరీరమునందుఁ గలిగినవి.

ఈమూఁడుగుణములును సమముగా నుండుటయే స్వస్థత (నొప్పి లేమి) లక్షణము. వానియందొకటి యధికమయ్యెనేని చికిత్స విధింపఁబడుచున్నది. అనఁగా ఉష్ణముచేత శీతమును శీతముచేత నుష్ణమును నీరెంటిచేత వాయువును గ్రమముగా బాధింపఁ బడి తొలఁగిపోవునని చెప్పఁబడుచున్నది. సత్త్వము, రజస్సు, తమస్సు అని యీమూఁడు మానసము లయినగుణములు. ఈ మూఁడుగుణములును సమముగానుండుట స్వస్థత (మనో వ్యాధిలేమి) లక్షణమని చెప్పఁబడుచున్నది. మూఁడుగుణములం దొకటి యధికమగునేని దాని పరిహారమునకు విధి చెప్పఁబడి యున్నది. సంతోషముచేత దుఃఖమును దుఃఖముచేత సంతో షమును నీరెంటివలన మోహమును గ్రమముగా నివర్తించు నని విధిచెప్పఁబడుచున్నది. సుఖమునందుండు కొందఱు మను ష్యులు, తెలివిలేమివలన, నాసుఖమును బుచ్చుటకు దుఃఖ మును దలంచుకొనఁగోరుచున్నారు. దుఃఖమునందుండు కొం దఱు మనుష్యులు దానినిబుచ్చుటకు సుఖమును దలంపఁగోరు చున్నారు. నీవు దుఃఖముగలవాఁడుగను లేదు. దుఃఖములేని వాఁడుగను లేదు; సుఖముగలవాఁడుగను లేదు;. సుఖములేనివాఁ డుగను లేదు; దుఃఖమును దలంపఁదగినవాఁడుగను లేదు; సుఖ మును దలంపఁ దగినవాఁడుగను లేదు. ఏమి చేయవచ్చును. దైవము బలీయముగానున్నది. లేక యీతీరున సంతోషపడుట నీదుస్వభావమో ! పాండవుల కనులయెదుట రజస్స్వలయు నేక వస్త్రయునగు ద్రౌపదిని సభలో నీడ్చుటనుజూచియు దానిని దలంచుకొనకున్నావే ! పట్టణమునుండి వెడల నడిచినదియు, తోళ్లు గట్టికొనుటయు, పెద్ద వనమునందు వసించుటయు నీవు

దలంపవేమి ? జటాసురునికడఁ బడినపాట్లును, చిత్ర సేనుని తోడఁ జరిగినయుద్ధమును, సైంధవునివలనఁ గలిగినకష్టమును నెట్లు మఱచిపోయితివి ? మరల నజ్ఞాతవాసమందు రాజ కుమారి యగుద్రౌపదిని గీచకుఁడు కాలం దాచినకష్టము నెట్లుమఱచితివి ? పగవారినడంచు దిట్టవుగదే ! ద్రోణభీష్ముల తోడ మునుపు నీకుఁ గలిగినయుద్ధమువలెనే నిపుడు మన స్సునెడు శత్రువుతోడ యుద్ధముసేయవలసి వచ్చియున్నది. ఈ యుద్ధమందు బాణములతోఁ బనిలేదు. మిత్రులును బంధులు నక్కఱలేదు. నీవు నీ యొక్కనితోడనే పోరాడ వలయును. అట్టి యుద్ధము తటస్థించియున్నది. ఈ యుద్ధమందు మనస్సును జయింపక ప్రాణమును విడుతువేని వే ఱొకదేహ మెత్తినపిదపఁగూడ నీ యుద్ధము చేయవలసివచ్చును. ప్రభువు గానివాఁడు (ధనాఢ్యుఁడు గానివాఁడు) పతితుఁడు. వాఁ డొంగి లికి సాటి; వాఁ డల్పుఁడు. బలముగలవానికి సైతము మిక్కిలి యపథ్యముచేసినయెడల వానిబలము వానిని గొంచెమైనను గాపాడదు. కాఁబట్టి భరతస త్తమా ! వ్యక్తముగాఁ దెలియు చున్న యీ స్థూలశరీరమును విడిచి యవ్యక్తరూపముగా నున్నట్టి మనస్సునకు నవ్వలనుండు దానిని (ముక్తిని) బొందు కొఱకు, (యమాది యోగానుష్ఠానరూపము లయిన) స్వక ర్మములచేత నిపుడే మనస్సుతోడ యుద్ధము సేయుము. యుద్ధ మం దా మనస్సును జయింపకపోయితివా యేమిగతి నొందు దువు? మహారాజా ! మనస్సును జయించినచో గృతార్థుఁడగు దువు. ఇట్టి తలంపును గట్టిగాఁ గయికొని ప్రాణులగతిని నీగతిని దెలిసి తాతముత్తాతల నడవడియందు నిలిచి పాడిచొప్పన

రాజ్యమును బాలింపుము. పాపాత్ముఁడు దుర్యోధనుఁడు తన యనుచరవర్గముతోఁగూడ దైవబలముచేతను ద్రౌపది వెన్నెఱి వేణి యదృష్టముచేతను యుద్ధమున నిహతుఁ డయ్యెను. పార్థా! విధ్యుక్తముగా దక్షిణలతో నశ్వమేధమును యాగమును జేయుము. మేము నీకుఁ గింకరులము. వీర్యశాలి యగువాసుదేవుఁడును నీకు వలయునదిచేయును' అనెను. ఇది పదియవ అవయధ్యాయము.

రాజధర్మపర్వము.

ధర్మరాజు నైరాశ్యమే గొప్పదియని భీమునకుఁ జెప్పుట.

ధర్మరాజు భీమునితో "సంతోషము లేమి, పరాకు, మదము, రాగము, శాంతి లేమి, బలము, మోహము, అభిమానము, పదటము, ననెడి యిట్టిపాపము లావేశింపఁగా నీవు రాజ్యమునకుఁ బేరాస పడుచున్నావు. వీనినుండి చక్కఁగా విడివడి భోగ్యవస్తువులను మాని మిక్కిలి శాంతిగయిొని యెంతయు సుఖంబుండుము. ఈ భూమండలమునంతయుఁ దా నొక్కఁడే రాజయి యేలునట్టివానికిని గడు పొక్కటియే కదా. రాజ్యమును నీ వేమని యిట్లు కొనియాడెదవు? భరతసింహమా! ఒక్కదివమునఁగాని బెక్కుమాసముల చేతఁగాని పూరింపఁ దరముగాని యీపేరాసను నాయువంతటిచేతను బూరింప శక్యముగాదు. అగ్ని (కట్టియలచేత) దరికొలుపఁగా మిక్కిలి మంటలుగలదగును; దరికొలుపనిచో దానే యడఁగిపోవును. అట్లె రేఁగినయుదరాగ్నిని నాహారమును మట్టుపఱిచి నీ వడఁగింపుము. తెలివిలేని

వాఁడు తనపొట్ట ప్రోచుకొనుకొఱకుఁ బెక్కు హింసలు చేయును. ఉదరమును గెలువుము. దానివలన మేలొందు నీభూమి యంతయు నీవు జయించిన వాఁడవగుదువు. మనుష్యులకుఁ గల పెక్కు కామభోగములను నైశ్వర్యమును నీవు గొనియాడుచున్నావు. భోగమును దిగవిడిచినవారును దపముచేఁ గృశించినవారునగు పెక్కండ్రు మిక్కిలి యుత్తమ మయినపదవిని బొందుచున్నారు. *యోగక్షేమములును, ధర్మాధర్మములును నీయందు నిలిచియున్నవి. ఇట్టి పెనుభారమునుండి విడివడి త్యాగము (సన్న్యాసము)నే యాశ్రయింపుము. పులి తనకడుపునకుఁ గాను పెక్కుహింసలు చేయుచున్నది. ఆమృగమునుబోలి మతిమాలిన మనుష్యులు కొందఱును నామార్గమునే యనుగమించెదరు. రాజులయియుండియు సంతోషము నొందకుండువారు పెక్కురు. కలిగిన విషయసుఖములను దోసిపుచ్చి సన్న్యాసమందు మనస్సుపెట్టి సంతోషించు వాఁడొక్కఁడే. బుద్ధుల వేఱు పాఁకెట్లున్నదో చూడు. ఆకు లాహారముగాఁ గలవారును, దొరికినదానిని తాతిచే దంచి తినువారును, పల్లేఱులుగాఁగలవారును, జలభక్షులును, వాయుభక్షులును నగు సన్న్యాసులచే నరకమిది జయింపఁబడినది. ఈ భూమండలమునంతయు నిండారఁ బరిపాలించునట్టి రాజును, రాతిని బంగారమును సమముగాఁగొను సన్న్యాసియు ననెడి యిరువురలో నాసన్న్యాసియే కృతార్థుఁడుకాని రాజుగాఁడు. ఏకార్యములయందును బూనికలేకయు నాశలన్నియు వీడియు మమకారము మానియు నుండుము. ఇహ

---

* యోగమనఁగా నింతకు లభింపనిధనమును లభించుట ; క్షేమమనఁగా లభించినదానిని రక్షించుటయని తెలియునది.

మందును బరమందును నాశములేనిదియు శోకరహితమయినది యునగు పదమును బొందుము. భోగమున కాసపడునాఁడు శోక మునొందును. భోగాసక్తి దిగవిడిచినవా రెంతమాత్రము శోక మొందరు. కాఁబట్టి యీభోగమునంతయు దిగవిడిచి రాజ్యస్థుఁడును ద్యాగియేయనెడు కల్లవాదమునుండి విడివడుము. పితృయాన ము దేవయానమనెడు రెండు మార్గములును బ్రసిద్ధములు. వీనియందు యాగాదికర్మములను యజించువారు పితృయాన ముచేతను, ఆశలను దిగవిడిచిన సన్న్యాసులు దేవయానము చేతను బోవుదురు. మహర్షులు తపస్సుచేతను బ్రహ్మచర్యముచే తను వేదాధ్యయనముచేతను దేహయాత్రగడపి దేహములను విడిచి మృత్యువునకు గోచరముకాని పదమునకుఁ బోయెదరు. ఈ లోకమందు, బంధనమును (ఆశయును), అశ్లీలకర్మమును, ఆమిషములని (భోగయుక్తములగు పాపములని) చెప్పఁబడుచున్నవి. ఈ రెండుపాపములనుండియు విడివడినవాఁ డాపరమపద మును బొందుచున్నాఁడు. ద్వంద్వములు లేనివాఁడును సంగముల నుండి విముక్తుఁడును, మోక్షదర్శియు నగు జనకుఁడు మున్నొక ప్పుడు చెప్పినది. 'నా వి త్త మనంతము; అట్టి నాకు నొక్కటియు లేదు; మిథిల దహింపఁబడినపుడు నాకు నొక్కటియుదహింపఁ బడినదికాదు' అనియె. ప్రజ్ఞయను నుప్పరిగపయి నెక్కినవాఁడు శోకించుచున్న జనులనుజూచి తాను శోకింపఁడు; మందబుద్ధి యగువాఁడు భూమిపయినున్నను గొండపయినున్నను నిజముకనుఁ గొనఁజాలఁడు. తెలిసికొనవలసినవియగు కర్తవ్యాకర్తవ్యము లను దెలిసికొనువాఁడే కన్నులగలవాఁడును బుద్ధిగలవాఁడు నగును. తెలియనివానిని తెలుపుటవలనను, సందేహములను

(చక్కఁగా తీర్చిచెప్పుటవలనను) బుద్ధియని చెప్పఁబడుచున్నది. బ్రహ్మనిష్ఠాపరులును జ్ఞానసంపన్నులును ఆత్మయాథాత్మ్య ప్రాప్తులును నగుపెద్దలఁ గలకొలఁది నెవఁడు తెలియుచున్నాఁడో వాఁడు మిక్కిలి పేరిమినొందును. ఎప్పుడు నానావిధముల వేఱువేఱవస్తువు లయియున్న యీయాకాశాది భూతములన్నియు (ప్రళయమందు) నొక్క బ్రహ్మమను వస్తువయియుండు ననియు నట్లు యాయొక్కటినుండి (నానాభూతరూపముల) ప్రపంచరూపమున విస్తారము నొందుననియుఁ దెలిసి యను భవించునో యపుడు బ్రహ్మమును బొందుచున్నాఁడు. అట్టి బుద్ధి గలజను లాగతిని బొందుదురు; కాని తపస్సులేనివారును, బుద్ధిహీనులును, తెలివిలేనివారును, నల్పసత్త్వులును దానిని బడయనేరరు. అన్నియు బుద్ధియందు నెలకొని యున్నవి' అనెను. ఇది పదునేడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

అర్జునుఁడు ధర్మరాజునకు జనకునకును నతని భార్యకును జరిగినసంవాదమును జెప్పి కర్తవ్యము నుపదేశించుట.

ధర్మరా జిట్లుచెప్పి మిన్నకుండఁగా నర్జునుఁ డతనివాక్యములు శల్యములవలెఁ దన్నుఁబీడింపఁగా శోకమునను దుఃఖమునను దపించుచు నతనితో "రాజా! విదేహరా జగుజనకునకు నతని భార్యతోడఁ గలిగిన సంవాద మనెడియీ యితిహాసమును జనులుచెప్పుదురు. జనకుఁడు రాజ్యమును దిగవిడిచి బిచ్చమెత్తు

టకు మనస్సున నిశ్చయించియుండఁగాఁ జూచి యతనిభార్య దుఃఖితయయ్యెను. 'ధనములను బలువిధము లయినరత్నము లను బిడ్డలను జెలికాండ్రను విడిచి యిట్లు పవిత్రమయిన మార్గమును వదలి జనకుఁడు మూఢత్వము నొందెను. ఆశ యును మచ్చరమునుమాని యకించనుఁడై (ఏమియు లేని వాఁడై) భైక్షవృత్తిని గయికొని యొకపిడికెఁడు యవలనో లేక బియ్యమునో యెప్పుడు వచ్చునాయని యాజనకుఁ డెదురుచూ చుచుండుటను నతని ప్రియభార్యగాంచెను. ఆయమ మన స్సివ్వని గావున దేనివలనను భయముపిడిచియున్న తనభర్తను దగ్గఱి కుపితయై యేకాంతముగ సహేతుకము లయినమాట లతో 'ధనధాన్యసమన్వితుండ వగునీవు సొంతమగురాజ్యమును దిగనాడి పునుకబిచ్చమును గయికొని యొకపిడికెఁడు ధాన్య మెప్పుడు దొరకునాయని యెదురుచూచెదవేల? రాజా! నీ పట్టువీఁడు; నీచేష్టవీఁడు; గొప్పరాజ్యమును ద్రోసిపుచ్చి స్వల్ప మునకుఁ బేరాసపడెదవు. రాజా! ఈపిడికెఁడుబియ్యమును గొని యతిథుల నారాధింపవచ్చునా? లేక దేవతలను ఋషు లను బితరులను నారాధింపఁగూడునా? నీవుపడెడియీశ్రమము వ్యర్థమేచుమీ! రాజా! కర్మమునువిడిచితివి గాన దేవతలు నతిథులును బితరులును మొదలయిన వారందఱచేత దిగవిడు వంబడి పోవుచున్నావు. మూఁడువేదములు దెలిసినవారును పెద్ద లు నయిన పెక్కువేల బ్రాహ్మణులను రక్షించువాఁడవై యుండి యిట్లు నీవిపుడు పరులవలననుండి పొట్టపోఁచికొనుటకు ధన మును గోరెదవో! వెలుఁగుచున్నలక్ష్మిని దిగవిడిచి కుక్కవలె నిపుడు కనఁబడుచున్నావు. ఇపుడు మీతల్లి బిడ్డలేనిదగుచున్నది.

కౌసల్యయు నీవలనఁ బతి లేనిదగుచున్నది. ధర్మమునుదక్కుఁగల ప్రయోజనములను గోరెడి పెక్కురాజులు దీనులయి నీప్రియ మునుగోరుచు నిన్నేయాశ్రయించి యుపాసించుచున్నారే! వారిని సైతము పసమాలినవారినిగాఁ జేసి నీవేలోకమును బడయఁ బోయెదవు? రాజా! పరాధీను లయినమనుష్యులకు మోక్షము సందేహపడఁదగినది. కాబట్టి యిటువంటి పాపము సేయునట్టి మీకు నూర్ధ్వలోకమును గలుగదు; అధోలోకమును గలుగదు. ధర్మముదప్పని యిల్లాండ్రను దిగవిడిచి జీవింపఁగోరు నీకు మంచిలోక మెక్కడిది ? విలువగల వస్త్రములను ఆభరణములను, మాలెలను, వాసనద్రవ్యములను విడిచిపుచ్చి పనిమాలి యెందులకయి పోయెదవు? నీటితొట్టివలెను పండ్లునిండిన పెద్ద మానివలెను బ్రాణు లన్నిటికిని గొప్ప పవిత్రపోషకుఁడవు గానుండిన నీవు పరులను యాచింప బయలువెడలెదవే ! పనిని విడిచి సన్న్యాసిగా నుండినచో నేనుఁగునుగూడ మాంసాహార ములగు పెక్కుమృగములను పెక్కుపురువులును దినుచును. ఒక్కప్రయోజనమును లేని నిన్నుఁదినుట నడుగవలెనా? ఒకఁడు నీదయిన యీకుండికను బగిల్చినను, మూఁడుగాచేరిన యీనఁడమును నీదుకాషాయమును లాగికొన్నను, నీమనస్సు వాని మీఁదనెట్లుండును? అన్నియుడిగవిడిచిన నీకు నీపిడికెఁడు బియ్యమందేమి యాసకావలసియున్నది. ఈ బియ్యమునకుఁ జేయు పనియు రాజ్యమంతటికిని జేయుపనియు నొక్కటియో? అట్లుండఁగా దీనిని నెందులకుఁగా నిశ్చయించితివి. శరీరమును గాపాడఁగోరి యీపిడికెఁడి బియ్యమునకుఁ బాటుపడితివేని, నీతలఁపు వ్యర్థమా ? ఇంతకు రాజ్యమువహించుట మంచిది. నీకు నే

నెవ్వరు? నాకు నీవెవ్వరు? నాయందు నీకేమి జాలి? దిగవిడువ వలసిన వివి. లేనిచో నీమనస్సు కోర్కిఁదగినట్లు లుప్పరిగయు శయనమును వాహనములును వస్త్రములు నాభరణములును గల రాజ్యము బాలింపుము. ధనమం దాశవిడిచినవారును ధనహీను లును మిత్రులను విడిచినవారును నేమియు లేనివారును నగు సన్న్యాసులుగానుండియు సుఖమునుగోరి కుండిక దండముమొ దలగువానిని సేకరించి యుంచుకొనియుండువారిని జూచి యాశ పడువాఁడు రాజ్యమును ద్యజించునా యేమి? ఎప్పుడును బుచ్చు కొనుచుండువానికిని, ఎప్పుడును నిచ్చుచుండువానికిని గలభేద మును దెలిసికొనుము, వీరిలో నెవఁడుమే లనఁబడును? ఎప్పు డును యాచించువారును నెప్పుడును దాంభికు లయియుండువా రును నగు జనులవిషయమై యొసంగిన దక్షిణ, కారుచిచ్చులో వేల్చిన యాహుతివలె నగును. రాజా! అగ్ని, కట్టియలను దహింపనడఁగని యట్లు, ఎప్పుడును యాచించువృత్తిగల బ్రాహ్మ ణుఁడు శాంతిగలవాఁడు కానేరఁడు. సజ్జనులకు (సన్న్యసులకు) నన్నము పెట్టు మనుజుని జీవనమే యిహమందు నిలుకడగలది. అన్నమునొసంగురాజులేనియెడల మోక్షమునుగోరు సన్న్యసు లెక్కడనుండఁగలరు? ఈలోకమందు గృహస్థు లన్నము నాశ్ర యించియే జీవింపవలయును. ఆయన్నమును గొనియె సన్న్యా సులును జీవింపవలయును. అన్నమువలనఁ బ్రాణము నెలకొనఁ జాలుచున్నది. అన్నము నిచ్చువాఁడు ప్రాణము నిచ్చువాఁ డగును. గృహస్థులనుండి విడివడి, సన్న్యసిగా నుండువారును, ఆగృహస్థులనే యాశ్రయించి సత్తువయుఁ బ్రతిష్ఠయు దాంతి యుఁ బడసికొనుచున్నారు. యాచనవలనను, త్యాగమువల

నను, మూఢ్యము (మోహము) వలనను సన్న్యాసికానేరఁడు. ఎవఁడు చక్క-ద్రవ్యములను దిగవిడుచునో వాఁడు ముక్తుఁడనియు సన్న్యాసియనియు నెఱుంగుము. సంగముగలవానివలె నాచరించెడి యసక్తుఁడును బంధముక్తుఁడును శత్రువునందును మిత్రునందును సమబుద్ధిగలవాఁడు నగుపురుషుఁడే ముక్తుఁడగును. మఱకము, భిక్షు పుస్తకము మొదలగు పలువిధములయిన పాశములచే బద్ధులయినవారును, వ్యర్థముగా పెక్కు-భోగములను వెదకువారునై, ముండనము గావించుకొని కాషాయవస్త్రములుగట్టి తమకు దానముదొరకుటకై సన్న్యాసము నొందుచున్నారు. వేదమును దమపేరువాసిని పుత్రులను దిగనాడి బుద్ధిమాలినవారు ముమ్మడికోలయుఁ గావివస్త్రమును గయికొనుచున్నారు. మనస్సునందలి రాగాదిరూప మయినకషాయము (దోషము) పోకుండఁగా పైనిగట్టికొను కాషాయమేదో యొక విషయవాంఛనుబట్టి యనియె తెలియుము. ధర్మవేషధారులగు ముండులకది పొట్టపోచికొనుకొఱకని నామతము. మహారాజా! నీవు జితేంద్రియుఁడవై కాషాయము కడవసము నారచీరలను ధరించినవారును, నగ్నులును (అవధూతులును), జటలఁదాల్చిన వారును ముండులు నగునాధువులను భరించుచు లోకములను జయింపుము. అగ్న్యాధానకర్మమును, గురువుకొఱకు మంచి దక్షిణలతోఁ గూడినయజ్ఞములను నహరహము చేయువాని కంటెను ధర్మపరాయణుఁడెవఁడు? " అని చెప్పినదయ్యెను. రాజా! ఈ లోకమందు జనకుఁడను రాజు తత్త్వజ్ఞుఁడని చెప్పుదురు. అతఁడుసయిత మిట్టిమోహము నొందెను. కాఁబట్టి నీవు మోహమునకు లోనుగాకుము. మనమెప్పుడు నిట్టిధర్మము

నాచరించుచు దానతపఃపరులమై యానృశంస్యగుణముకలిగి కామక్రోధములు మాని, యుత్తమముగ దాంతిని గయికొని ప్రజలను బాలించుచు వెద్దలను గురువులను బూజించుచు యాగములుచేసి మంచిలోకములను బొందెదము; బ్రాహ్మణులకు ననుకూలురమై సత్యముపలుకుచు దేవతలకును నతిథులకును దక్కిన ప్రాణులకును విధిచొప్పునఁ దృప్తి గావించుచు నిష్టంబగు పదమును బడయుదము' అనెను. ఇది పదునెనిమిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

ధర్మరాజు సన్న్యాసమే యుత్తమమని యర్జునకుఁ జెప్పుట.

ధర్మరా జర్జునునితో 'నాయనా! ధర్మశాస్త్రములను బ్రహ్మశాస్త్రములను, నే నెఱుంగుదును. 'కర్మమును జేయు' మనియు 'కర్మమును విడువు'మనియుఁ జెప్పురెండువిధములగు వేదవచనమును నెఱుంగుదును. పెక్కులు హేతువులనుగొని విచారము చేసినను, శాస్త్రము లొండొంటికిఁ బొసంగక కలగూరగా నుండును. ఇట్టిశాస్త్రమం దేది సిద్ధాంతమో దానిని యథావిధి నేనెఱుంగుదును. నీవో శాస్త్రమును (వైవైని) మాత్రము చదివినవాఁడవు. * వీరవ్రతముతోఁ గూడినవాఁడవు. శాస్త్రములోని యర్థమును గలరూపునఁ దెలిసికొన నీ వేవిధమునను సమర్థుఁడవు గావు. ధర్మమును గనుఁగొన్నవాఁడవేని నీ విట్లుపలుకవు. శాస్త్రములోని యర్థము కలరూపును దెలిసినవాఁడును ధర్మనిశ్చయమును జక్కఁగా నెఱింగిన

* వీరవ్రతమనఁగా బీరంపుపట్టుదల.

వాఁడును నిట్లు చెప్పనేచెప్పఁడు. అయినను అర్జునా ! తోడఁ బుట్టిన నెయ్యమునుదియ్యము నూఁది నీకు న్యాయమని తోఁచిన తెఱఁగున యుక్తముగ నీ వాడినమాటలకు నేను సంతసించితిని. బ్రహ్మకును మహేశ్వరునకును వాసుదేవునకును సమమయిన ప్రాణియొక్కటియు నింతవఱకుఁ గలిగినదిగాదు ; ఇంకను గలుగనేరదు. అట్లు మేటియోధులందు నీవే మిన్న వనుట సర్వసమ్మతము. నీకు మించినయోధ నింతకును నీక మ్మాఁడను గలుగఁదు. ఇంద్రునియందును వాయువునందును విష్ణుదేవునియందును నెట్టి బలముగలదో యట్టిబలము నీయం దును భీమునియందును నున్నది. అర్జునా ! చిత్రయుద్ధముసేయు టయందును కడుదూరమునుండి కూల్చుటయందును దివ్యాస్త్ర బల సంపత్తియందును నీకు సముఁ డయినవాఁడు వేఱెవ్వఁడు గలఁడు ? యుద్ధధర్మము లన్నిటియందును, పెక్కు క్రియా నైపుణములందును నీకు సాటియైనవాఁడు మూఁడులోకములం దును గలుగఁడు ! ధర్మమును ధర్మమును సంబంధించినదియు నిశ్శేషముగా నాకుఁ దెలియును. ధర్మసూక్ష్మమును జెప్పు విష యమున నన్నుఁగడచుట నీ కలవిగాదు. అర్జునా ! నాబుద్ధికిఁ దోఁచువిషయమునందు నీవుసందేహపడవలదు. నీవు యుద్ధశా స్త్రమునుదెలిసితివేకాని వృద్ధులను సేవించినాఁడవుగావు. ధర్మం పు సంగ్రహమును విస్తరమును దెలిసిన యీ పెద్దలనిశ్చయ మును నీవుదెలిసినవాఁడవుగావు. నాయనా ! తపము, త్యాగ ము, అవిధి యనెడియీ మూఁడును బుద్ధిమంతులచేనిశ్చయింపఁ బడినవి. వీనిలో నొకటికంటెను మఱొకటి యెక్కుడని మా మతము. ధనమునకు నెక్కుడయినది లేదని నీవు తలంచు

చున్నావు. ఈ ధనము ప్రధానముకానిదని నీకుఁ దెలిపెదను. లోకమందుఁదపస్సును వేదాధ్యయనమును సహజముగాఁ జేయు చుండుధార్మికులు పెక్కండ్రు చూపట్టుచున్నారు. అట్లు తప ముసేయుఋషులకు శాశ్వతము లయినలోకములు కలుగుచు న్నవి. అరుణులు, కేతవులు ననెడి కొందఱు ఋషులు మీసలు దలసూపు పసిప్రాయమునఁ నే ధీరులయి వనములకుఁబోయి వేదా ధ్యయనముచేసి దివ్యలోకమును బొందియున్నారు. (తపముపెం పిట్లున్నది) విషయముల నిగ్రహించి యజ్ఞానమువలనిచీఁకటిని దిగవిడిచి యార్యులుకొందఱు దేవయానమనెడియు త్తమమా ర్గమునఁ ద్యాగవంతులు (సన్న్యాసులు) పొందు లోకములను బొందియున్నారు. (త్యాగముపేర్మి యిట్టిది). పితృయానమనెడి దక్షిణపుమార్గమునఁ బోయి చంద్రలోకమును బొందువారు కర్మమునం దుండువారలే. వారు శ్మశానములకుఁ బోవువారు. మోక్షమునొందువారు దేనిని గాంతురో యిట్టిదట్టి దని నిర్దేశిం పరాని యాబ్రహ్మపదమే పూర్వోక్తమయిన 'అవిధి' యను మూఁడవదిగాఁ జెప్పఁబడుచున్నది. ఇట్లు త్తమపదమునకుఁ గార ణమగుటచేఁ ద్యాగము స్థానములందు ముఖ్యమయినదని నామ తము. అది నినుబోఁటివారలకుఁ దెలుపుట మిక్కిలియుఁ గష్ట మైనది. సారాసారములను దెలిసికొనఁగోరు కవులు 'ఇక్కడనుం డునా ? ఇక్కడనుండునా ?' అని పెక్కుశాస్త్రములను విమ ర్శించి యిట్టినిశ్చయమును బొందియున్నారు. దీనికలరూపు దెలి యని జనులు వేదములను శాస్త్రములను నుపనిషత్తులను గడచి యరఁటిచెట్లను జీల్చి సారమును గాననియట్లు కనుంగొనరయిరి. అట్టివా రేకాంతముగా నుండుట యనుత్యాగమార్గమును

దోసిపుచ్చి పంచభూతాత్మక మయినయీ శరీరమందుఁ గల యాత్మను వెక్కు-లింగితములచేత నిచ్ఛాద్వేషములతోఁ గూడినదిగాఁ జెప్పెదరు. అది యిట్టిదిగాదు. అది కన్ను (మొదలయిన యింద్రియముల)కు నందరానిది; వాక్కు-చే నిట్టిదనిపలుక నలవిగానిది. అట్టియాత్మ కర్మకారణ మయినయజ్ఞానమును బురస్కరించుకొని భూతశరీరములందుఁ జుట్టివచ్చుచున్నది. మనుష్యుఁడు తృష్ణను నిగ్రహించి కర్మపరంపరనువిడిచి యహంకార మునొందక శుభంబగు మోక్షమార్గంబునఁ జని సుఖమొందవలయును. అర్జునా ! సత్పురుషులు సేవించునదియు సూక్ష్మంబునఁ దెలియఁ దగినదియునయిన యీమోక్షమార్గముండఁగాఁ, బెక్కు-లనర్థములు నిండియున్నవస్తువును నీ వెట్లు కొనియాడెదవు ? కర్మవిదులయిన వారును, ఎప్పుడును దానము యాగము మొదలయిన కర్మములందు నిరతులయినవారును, నగుజనులుగూడ నీధనమును నిచ్చే యనర్థములు నిండినదనియు, మోక్షమార్గమే మేలయినదనియుఁ గాంచుచున్నారు. హేతువులను జక్కఁగా నెఱింగిన పండితులును దృఢమయిన పూర్వకర్మవాసనవలన మోక్షము లేదనియే వాదించుచు మూఢులైయున్నారు. వారిని మంచిదారికిఁ ద్రిప్పుట మిక్కిలియుఁ గష్టము. వెక్కు-శాస్త్రములను జదివి పలువిధములుగా మాటాడఁజాలువారు కొందఱు జనసమూహములందు ననృతములాడుచుఁ బరుల నవమానించుచును భూమియంతయు సంచరించుచున్నారు. పార్థా ! ఏ విషయములను మనము చక్కఁగాఁ దెలిసికొనమో వానిని దక్కిన వాఁడెట్లు దెలియ నర్హుఁడగును ? శాస్త్రవిత్తములును ప్రాజ్ఞులునైనగొప్ప పండితులును నిట్లు చక్కఁగాఁ దెలియకున్నహారే

యగుదురు. ధర్మము దెలిసినవాఁడు తపస్సుచేత గొప్పవై రాగ్య మునొందుచున్నాఁడు. దానివలని బుద్ధి (జ్ఞానము)చేత బ్రహ్మము నొందుచున్నాఁడు త్యాగముచేత నెప్పుడును సుఖమునొందు చున్నాఁడు'' అనెను. ఇది పందొమ్మిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

దేవస్థానుఁడు ధర్మరాజునకు యాగము చేయు మని చెప్పుట.

ఇట్లు మాటలాడికొనుచుండఁగా, మాటకారియు మహాతప స్వియు నగు దేవస్థానుఁడు మిక్కిలి యుక్తియుక్తమగు వాక్య మున ధర్మరాజుతో 'ధనమునకంటె నెక్కుడయినది లే'దనియర్జు నుఁడు చెప్పిన విషయమున నీకుఁ గొంచెము తెలిపెదను. మనస్సు నిలుకడగా నిలిపి వినుము. అజాతశత్రూ! నీ వీ భూమి నంతయు రాజధర్మముచొప్పున జయించితివి. అట్లు జయించిన దానిని వ్యర్థముగా దిగవిడుచుట నీకు న్యాయముగాదు. బ్రహ్మ మును బొందుటకు బ్రహ్మచర్యము మొదలయిన నాలుగాశ్రమ ములును నాలుగు మెట్లుగల నిచ్చెనగా నేర్పడియున్నది. రాజా! ఆనాలుగు మెట్లను వరుసగా విధిచొప్పున జయింపవలయును. కాఁబట్టి, నెక్కు దడిణలతోఁగూడిన శ్రుహాయజ్ఞములను యజింపుము. వేదాధ్యయనమే యజ్ఞముగాఁ గలబ్రహ్మచారులును, బుద్ధ్యర్థము కర్మనిష్ఠులయిన గృహస్థులును, అడవికిఁ బోయి తపోనిష్ఠులగు వానప్రస్థులును, బ్రహ్మజ్ఞానమే యాగముగాఁ గల సన్న్యాసులునని నాలుగాశ్రమములవారిని దెలియుము.

కుంతీపుత్రా! వైఖానసులు (వానప్రస్థులు) 'ఆశపడి ధనముసం పాదించి కర్మముచేయుటకంటెను నాశనువిడుచుటయే గొప్ప.' యనిచెప్పినట్లు వినికి. క్షత్రియుఁ డాకర్మమును జేయుఁ గాకొన్న చో మిక్కిలియు దోషమునొందును. విద్వాంసులు కర్మశాస్త్ర ము విధించొప్పున ద్రవ్యములనెల్ల నొక్కటిగా సమకట్టికొనుచు న్నారు. మనసునందుఁ దృఢగతిగి యర్హానర్హములను వివేచించి తెలియనివారు (తమదేహము ధనము మొదలయినవానిని)నర్హం బగుయాగాదికర్మములకు వినియోగింపక యనర్హంబగువానియం దుపయోగించెదరు. వారు తమకుఁ గలిగెడియిట్టిపెనుదోషము ను దెలియరు. వారలకు ధర్మము (చిత్తశుద్ధి) గలుగుటయు దుష్కరము. బ్రహ్మ, యాగములకొఱకు ధనములనుసృజించెను; వానిని రక్షించుమనుష్యునిని యాగము చేయఁగోరియే సృజించెను. కాఁబట్టి ధనములనెల్ల యాగమునందే యుపయోగింపవల యును. యాగము చేసినచోఁ దోడనే వలయుసిద్ధిని బడయవచ్చును. మహాతేజుం డయినయింద్రుఁడు రత్నములను దక్షిణ గాఁగొని పెక్కులు యాగములుచేసి సమస్తదేవతలకు నెక్కు డయినయింద్రపదివిని బొంది వెలుంగుచున్నాఁడు. కాఁబట్టి యజ్ఞ మందు ధనములనెల్ల నుపయోగింపవలయును. కృత్తివాసుం డును మహాత్ముండును దేవదేవుండు నగుశివుఁడు సర్వమేధమనెడి యజ్ఞమందుఁ దన్నే హోమముచేసి యీ లోకములనంతయుఁ దనకీర్తిచే నించి తేజంబున విరాజిల్లుచున్నాఁడు. మరుత్తు డను రాజు తనపుణ్యంపుఁబెంపువలన దేవరా జయినయింద్రుని సయి తము జయించెను. వాఁడు చేసినయాగమందు పాత్రము లన్ని యు బంగారుతోఁ జేయంబడినవై యుండెను. లక్ష్మీదేవి తాఁ

చక్రయాగమునకు వచ్చెను. హరిశ్చంద్రుఁడను రాజు, పెక్కు యాగములుచేసి పుణ్యమునొంది శోకముపీడి తాను మనుష్యుఁడై యుండియుఁ దనవెంపుచే దేవేంద్రునిఁగూడ జయించెనని వినలేదా? కాఁబట్టి సమస్తధనములను యాగమునందు వినియోగింపవలయును' అని చెప్పెను. ఇది యిరువదియవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

{ దేవస్థానుఁడు ధర్మరాజునకు స్వధర్మము ననుష్ఠించుటయే యుత్తమమని చెప్పుట. }

దేవస్థానుఁడు "క్షత్రియునకు యాగాదికర్మమే న్యాయమా?" యను విషయము నొకసమయమున నింద్రుఁడడుగఁగా బృహస్పతి చెప్పిన యీపురాతన మయినయితిహాసమును జెప్పెదరు. సంతోషము స్వర్గమునకు సమము; సంతోషము పరమసుఖము. సంతుష్టికి మించిన దొకటియులేదు. తాఁబేలు తనయవయవములు ముడుఁచుకొనునట్లు కామముల నన్నిటినుండియు నొకఁడెప్పు డింద్రియములనుదీసి లోపలనడంచుచున్నాఁడో యపుడుజ్యోతిరూప మయినయాత్మతనయందే తోడనే ప్రసన్నమగుచున్నది. అప్పుడు సంతోషము నెలకొనుచున్నది. ఎప్పుడొకఁడుతాను బరులవలనను బరులు తనవలనను భయపడుటలేదో, ఎప్పుడు కామద్వేషములను గెలుచుచున్నాఁడో, యప్పుడాత్మను దర్శించుచున్నాఁడు. ఎప్పుడు కర్మముచేతను, మనస్సుచేతను, వాక్కుచేతను, నేప్రాణినిగుఱించియు, నపకారమును నుపకారమును జేయఁబూ

ఁడో యప్పుడు మనుష్యుఁడు బ్రహ్మము నొందుచున్నాఁడు. ఇట్లు ప్రాణు లాయావిధములఁ గావించు నాయాధర్మముల నప్పుడప్పుడు తామే యనుభవించుచున్నవి. కాఁబట్టి నీవును నీకుఁ దగినధర్మమును దెలియుము. కొందఱు సామవచనములను గొనియాడెదరు. కొందఱు యాగాదికర్మములను గొనియాడెదరు. మఱికొందఱు సన్న్యాసమును గొనియాడెదరు. వీనియం దొకటిని గొందఱును మఱొక్కటిని గొందఱును గొనియాడుట లేదు. కొంద ఱీరెంటిని గ్రమంబుగఁ గొనియాడెదరు. కొందఱు యజ్ఞమునుగొనియాడెదరు. కొందఱు సన్న్యాసమును గొండాడెదరు. కొందఱు దానమును గొందఱు ప్రతిగ్రహమును (పుచ్చుకొనుటను)గొనియాడెదరు. కొంద ఱన్నిటినివిడిచి మిన్నక ధ్యానము చేయుచుండెదరు. చంపియుఁ గోసియుఁ జీల్చియుఁ బ్రాణులను బరిపాలించురాజ్యమును గొందఱుపొగడెదరు. కొంద ఱేకాంతమున ధ్యానముచేయుచుండెదరు. వీనినంతయుఁ జక్కఁగా విమర్శించి పండితులు నిశ్చయించినది. 'ప్రాణులకు ద్రోహముచేయకయ చేయుధర్మమే సజ్జనులకు సమ్మతమైనది' యనుట యే. ద్రోహములేమి, సత్యమాడుట, దానము, దయ, దమము, స్వభార్యయందుఁ బుత్రోత్పత్తిచేయుట, మృదుత్వము, లజ్జ, చపలములేమి, యనెడు నివి ముఖ్యమయినధర్మమని స్వాయంభువ మనువుచెప్పెను. కాబట్టి దీనిని బ్రయత్నమునఁ బ్రతిపాలింపుము. రాజ్యమునందుండు రాజెవఁడెప్పుడును వశియై, ప్రియాప్రియముల సమముగాఁ దలఁచి యాగముచేసి మిగిలినదానిని భుజించుచు, శాస్త్రార్థము కలరూపునెఱింగి, సాధురక్షణమందును నసాధుశిక్షణమందు నాసక్తుఁడై, నీతిదప్పక ప్రజలను ధర్మమా

ర్గమందు నెలకొలిపి, యశ్లె కడపట రాజ్యమును బుత్రునియం దుంచి వనమునకుఁబోయి వన్యములయినవానిచే జీవించుచు ధర్మ ము గట్టిగానూఁది ప్రాలుమాలిక లేక తనయాశ్రమమునకుఁ దగు కర్మములనుచేయువాఁడగునో యట్టిరాజున కే యిహమునుబరము ను సార్థకములగును. మోక్షము పెక్కువిఘ్నముల కలదనియుఁ బడయుటకు మిక్కిలికష్టమయినదనియు నామతము. పూర్వోక్త మయినధర్మము నాచరించినరాజు లనేకులు, సత్యమును దానము తపస్సునుగలవారును, ఆ నృశంస్యగుణముతోఁ గూడినవారును, కామక్రోధరహితులును, ప్రజాపరిపాలనయుక్తులును, గోవ్రల కొఱకును బ్రాహ్మణులకొఱకును యుద్ధము సేయువారును నై యుండి యత్యుత్తమయినగతిని బొందియున్నారు. ఇశ్లె వసువు లును, రుద్రులును, ఆదిత్యులును, సాధ్యులును పెక్కండ్రు రాజర్షులును నీధర్మము నాశ్రయించి పుణ్యములయిన తమకర్మ ములచేతఁ దప్పక స్వర్గలోకమును బొందియున్నారు' అనెను. ఇది యిరువదియొకండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

అర్జునుఁడు క్షత్రియధర్మము మేలయినదని ధర్మరాజునకుఁ జెప్పుట.

ఇట్టిసమయమునందే, యర్జునుఁడు మనంబున నేమియుఁ దోఁపక వగచుచున్న తనయన్నను ధర్మరాజునుజూచి మరల "పురుషసత్తమా! నీవు ధర్మజ్ఞుండవు. నీకుఁ దెలియనిదేమున్నది? క్షత్రియులధర్మముచేతఁ బగవారిని జయించి మిక్కిలి దుర్లభ

మయిన యీరాజ్యమును బడసినపిదప నీవేల మిక్కుటముగాఁ దపించెదవు ? మహారాజా ! రాజులకు యుద్ధమందు మృతినొందుట సమ్మతమయినది. క్షత్రధర్మమును బహుయజ్ఞముతోఁ గూడినదానిని దలంచిచూడుము. బ్రాహ్మణులకు త్యాగము (సన్న్యాసము) చే మరణమొందుట ధర్మమని విధింపఁబడి యున్నది. క్షత్రియులకో యుద్ధమందు మరణము విధింపఁబడియున్నది. ఒకప్పుడు నాయుధము నెడఁబాయకుండుక్షత్రియధర్మము మిక్కిలి భయంకర మయిన దందురు. భరతసత్తమా ! క్షత్రియధర్మమును జేకొన్నవాఁడు బ్రాహ్మణుఁడుగా నుండినను వాఁడాయుధముచేత యుద్ధమున నధింపఁబడుట న్యాయముగా నున్నది. క్షత్రియజాతియందుఁ బుట్టుట ప్రశస్తమయినది. క్షత్రియజాతి వేదమునుండి పుట్టినది. త్యాగము (సన్న్యాసము) ను యాగమును తపస్సును పరులసొమ్ముచే బ్రతుకుటయు క్షత్రియునకు విహితములుగావు. అట్టిక్షత్రియజాతియందుఁ బుట్టి ధర్మములన్నియుఁదెలిసి ధర్మబుద్ధిగలిగినట్టి రాజవు; సమర్థుండవు; లోకమునందు నెక్కువతక్కువలును ముందువెనుకలును గనుఁగొనియున్నవాఁడవు. నీ విట్టిసంతాపమువలని శోకమును ద్రోసిపుచ్చి స్వధర్మమందు బద్ధుఁడవగుము. క్షత్రియుని హృదయము విశేషించి వజ్రసమానమై యుండవలయును. క్షత్రధర్మము చొప్పున శత్రువులనుజయించి యేయడ్డిలేక రాజ్యమును బడసినపిదప నింద్రియముల జయించినవాఁడవై యజ్ఞదానతత్పరుండవై యుండుము. కశ్యపప్రజాపతి పుత్రుఁడైనయింద్రుఁడు క్షత్రియధర్మము గయికొని పాపవృత్తులయిన జ్ఞాతులను నెనమన్నాటపదుం డ్రనుజంపెను. రాజా ! అతఁడు చేసినయాపని పూజ్యమును

బ్రశంసింపఁదగినదియు నయ్యెను. ఆకారణముచేత నతఁడు దేవతలకు రాజు నయ్యె ననిమాకు పినికి. మహారాజా! మనుష్యుల కిం ద్రుఁడ వయిననీవు నిం ద్రునివలెనే యేతుందుడుకును లేక చిరకాలము బహుదక్షిణలతోఁ బెక్కులు యాగములుచేయుచుండుము. క్షత్రియధర్మము చొప్పున శస్త్రముచేతఁ బరిశుద్ధులై పరలోకమందు మంచిగతిని బొందినజ్ఞాతులను గుఱించి యిట్లు కొంచెమయినను దుఃఖింపకుము. భరతసత్తమా! ఏది జరిగినదో యది యట్లే జరుగవలయును జుమీ. దైవమును గడవఁబరముగాదుగదే" యనెను. ఇది యిరువది రెండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

వ్యాసుఁడు ధర్మరాజునకు శంఖలిఖితోపాఖ్యానమునుజెప్పి క్షాత్రధర్మమును గయికొనుమని బోధించుట.

వైశంపాయనుఁడు జనమేజయునితో 'రాజా! అర్జునుఁడిట్లుచెప్పఁగా ధర్మరాజేమియుఁ బలుకఁడయ్యె. తోడనే వ్యాసుఁడతనిని జూచి 'ధర్మపుత్రా! నీవు సౌమ్యుఁడవుగదే. అర్జునుఁడు చెప్పినది సత్యమే. శాస్త్రమందు గృహస్థాశ్రమము ముత్తమధర్మమని చూపట్టుచున్నది. నీవును ధర్మము తెలిసినవాఁడవు. శాస్త్రముచొప్పున, విధ్యుక్తరీతిని, నీ సొంతధర్మమును నీవు చేయుము. గృహస్థాశ్రమమునువిడిచి వనమునకుఁ బోవుట నీకు విహితముగాదు. దేవతలును బితృదేవతులను అతిథులును భృత్యులును నెప్పుడు గృహస్థు నండగొనియే జీవించెదరు.

రాజా ! వారిని భరింపుము. పశువులును బశువులును మఱియుఁ దక్కిన ప్రాణులును గృహస్థులచేతనే రక్షింపఁబడుచున్నవి. కాఁ బట్టి గృహస్థాశ్రమమునందలివాఁడే శ్రేష్ఠుఁడు. ఈ నాలుగా శ్రమములలో నాగృహస్థాశ్రమము నాచరించుట కష్టము. ఇంద్రియపటిమ లేనివారలకు ననుష్ఠింపఁ గష్టమయిన యీవిధిని నీవు చక్కఁనడపుము. నీకు వేదములందు జ్ఞానము పూర్ణముగ నున్నది. పెనుతపమును జేసియున్నావు. కాఁబట్టి పితృపై తామహ మైన రాజ్యమును బరువును వహించినట్లు నీవుభరింపవలయును. మహారాజా! తపస్సు యజ్ఞము, అధ్యాత్మవిద్య, భిక్షు, యింద్రియ నిగ్రహము, ధ్యానము, చదువునందలి పూనిక, సంపదయందుఁ దృప్తి, ఏకతముండుట, సంతోషము, తనశక్తికొలఁది దానము ననెడి యిట్టి ధర్మములన్నియు బ్రాహ్మణులకు సిద్ధికరములుగా విధిం పఁబడినవి. క్షత్రియుల కయినధర్మములు నీకుఁ దెలిసియుండినను, మరలఁ జెప్పెదను. యాగమును విద్యయు పూనికయు ధన మందుఁ దృప్తిలేమియు దండమును దాల్చియుండుటయు వేం డ్రపుఁదనమును ప్రజాపరిపాలనమును వేదమునంతయు దెలి యుటయుఁ దపమును మంచినడవడియు, నవ్వారిగా ధనమార్జిం చుటయు సత్పాత్రమునకు దానము ననెడి యీ సత్కర్మ ములు రాజులకు నిహమును బరమును సాధించి యిచ్చునని మనకు వినికి. రాజా ! వీనియంచెల్ల దండమును దాల్చుటయే యెక్కు డయినదని చెప్పుదురు. క్షత్రియునియందు బలమును, బలము నందు దండమును, నెప్పుడు నెలకొనియున్నది. ఇట్టికార్యములే రాజులకు రాజ్యసిద్ధిని గలిగించునవి. బృహస్పతి 'యుద్ధము చేయని క్షత్రియునిని దేశసంచారము చేయని బ్రాహ్మణునిని

సర్ప మెలుకలను మ్రింగునట్లు భూమి మ్రింగుచున్నది'! యని యీగీతమునుబాడెను. సుద్యుమ్నుఁడను రాజఋషియుఁ బ్రచే తసపుత్రుఁడయిన దక్షునివలె దండమును ధరించుటవలనఁ బర మంబయిన సిద్ధిని బొందెనని వినఁబడుచున్నది' యనెను. అందు లకు ధర్మరాజు వ్యాసునితో 'మహాత్మా! సుద్యుమ్నుండను రా జే కర్మమువలన నుత్తమసిద్ధిని బొందెనో వినఁగోరుచున్నాను' అనెను. వ్యాసుఁడతనితో 'ఈవిషయమందుఁ బురాతనమయిన యితిహాసమును జెప్పెదను. వాఁడి నియమములుగల శంఖుఁడు లిఖితుఁడను నిద్దఱు సహోదరులుండిరి. వారికి బాహుదయనెడి నదితీరమున రెండాశ్రమములు వేఱువేఱ నుండెను. అవి నిత్య పుష్పఫలములుగల వృక్షములుగలిగి రమణీయములై యుండెను. అట్లుండఁగా నొకకాలమున లిఖితుఁడు శంఖుని యాశ్రమమునకు వచ్చెను. అప్పుడు శంఖుఁడు దైవికముగా నాశ్రమమువిడిచి బయ టఁబోయి యుండెను. సహోదరుని యాశ్రమమునకుఁ బోయిన యాలిఖితుఁడును నపు డందు విహరించుచు నచటఁ జక్కఁగాఁ గమియఁబండి యున్నకొన్ని పండ్లనుగోసెను. ఆపండ్లనెత్తి యా బ్రాహ్మణుఁడు జంకుగొంకులేక భుశింపఁదొడంగెను. అతఁడు దినుచుండు సమయమందే శంఖుఁడు నాశ్రమమువచ్చి చేరెను. అట్లు తన తమ్ముఁడు లిఖితుఁడు పండ్లను దినుచుండుటను జూచి యతఁడు "ఈపండ్లు ఎక్కడదొరికినవి? ఏలతినుచున్నావు?' అని యడిగెను. తోడనే యాలిఖితుఁడు తనయన్నయగు శంఖుని దగ్గఱకుఁబోయి నమస్కరించి 'ఇక్కడనుండియే యీపండ్లను నేనెత్తికొంటిని' యని వేడుకగా నన్నచుఁ జెప్పెను. తోడనే శంఖుఁడు తీవ్రమయిన కోపమునొంది "నీయంతట నీవు పండ్ల

నె త్తికొంటివి గావున నిది దొంగలించుట యగును. కాఁబట్టి రాజునొద్దకుఁబోయి 'రాజస త్తమా ! ఇయ్యనిదానిని నేనె త్తి కొంటిని. కాఁబట్టి దొంగనయితిని. నన్ను దొంగగాఁ దెలిసి దొంగకుఁ దగుదండమును విధించి నీస్వధర్మము (దండధార ణము)ను గాచుకొనుము' అని తెలిసికొనుము" అనెను. అతఁడు చెప్పినచొప్పున లిఖితుఁడు వాఁడి నియమముగలవాఁడు గావున రాజగు సుద్యుమ్నునికడకుఁ బోయెను. ఆరాజును ద్వారపాలకుల వలన లిఖితునిరాక విని మంత్రులంగూడి కాలినడకనే వచ్చెను. అట్లు వచ్చిచేరి యారాజు ధర్మవిదులందు మిన్నయైన యా లిఖితునితో 'మహాత్మా! ఎందులకురాక! వలసినదిచెప్పుము; అది చేసినఁ జేచుమీ' అనెను. అందుల కాబ్రహ్మర్షి సుద్యుమ్నునితో 'నేను జెప్పినదివిని చేసెద'నని ప్రతిజ్ఞచేసితివి గావునఁ జేయవలయును. నాకువలయునది మఱేమిగాదు. మాయన్న యియ్యనిపండ్ల నేనై యె త్తికొని భక్షించితిని. ఆ విషయమై నన్నుదండింపుము. జాగువలదు' అనెను. సుద్యుమ్నుఁడు 'బ్రాహ్మ ణోత్తమా ! దండమును విధించుటయందు రాజుప్రమాణ మనుట మీమతమేని దండమునువిధించుట రాజును సంబం ధించినదనుట మీకుఁ బ్రమాణమేని అనుజ్ఞయిచ్చుటయందు నతఁడే ప్రమాణము కావలయును. కాఁబట్టి నే ననుజ్ఞయిచ్చి తిని. దానిచేత నే దోషముపీడి శుద్ధుండవై తివి. ఇదిగాక మఱియు నేవేని కోరికలడుగుము. నీవడిగినట్లు చేసెదను' అనెను. మహా త్ముఁడారాజు కోరినది యడుగు మనివేఁడుచుండఁగా నాబ్రాహ్మ ణుఁడు దండముతప్ప మఱేవరమును గోరఁడయ్యె. అంత రా జ మ్మహాత్మునిచేతులను రెంటిని ద్రుంచెను. అతఁడును దండముఁ

బొందియన్నయగు శంఖునియొద్దకుఁ బోయి 'నాయపరాధమునకు దండనము పొందితిని; నాదుర్బుద్ధికి నీవు తమింపవలయును' అని యార్తితోడఁ జెప్పెను. శంఖుఁడు 'ధర్మజ్ఞా! నీయెడనాకుఁ గోపములేదు. నీవు నాకేమియుఁ జెఱుపుచేయవు. మనకులము మిక్కిలి నిర్మలమయినదని యీలోకమందుఁ బ్రసిద్ధికెక్కినది. అందుఁబుట్టి నీవు ధర్మమును నతిక్రమించితివి గాన యీదోషమునకై నీకుఁ బ్రాయశ్చిత్తముచేయఁబడినది. నీవు శీఘ్రముగా బాహుదానదికిఁబోయి విధ్యుక్తముగా దేవతలకును ఋషులకును పితరులకును దర్పణములు చేయుము. ఇఁక నధర్మమందు మనస్సుచెల్లింపకుము. తెలిసినవారు బ్రహ్మహత్యను సురాపానమును దొంగతనమును గురుతల్పగమనమును, నివిచేయువారితోడి కూటమియు, ననువీనిని మహాపాతకములని చెప్పెదరు. వీనియందును దొంగతనమునకు సాటియైన మహాపాతకములేదు. దొంగతన మిహలోకమునందు బ్రహ్మహత్యకు సమానమగును. సకలపాతకులకును శరీరదండము ప్రాయికముగా చెప్పఁబడుచున్నది. దొంగలో విశేషించి శరీరదండమే కాని యదితప్ప వేఱుదండము విధింపఁబడకున్నది. బ్రాహ్మణుఁడును క్షత్రియుఁడును వైశ్యుఁడును శూద్రుఁడు నందఱును గోరిచేసినపాపమునకు దండింపఁదగినవారే యగుదురు. ఇందు విచారింపవలసినదిలేదు. మనుష్యులు పాపములుచేసి రాజులచే దండమునుబొంది యీపాపమువీడి పుణ్యాత్ములగుసత్పురుషులవలె స్వర్గమును బొందుదురు. నీవు రాజుచేత దండమునుబొంది తివిగావున మనకుల మున్నతికెక్కును' అనెను. అదివిని లిఖితుఁడు పుణ్యంబయిన యానదికిఁబోయి స్నానముచేసి తర్పణము

చేయఁ దొడంగెను. అంత నతనికిఁ దామరపువ్వులవలె రెండు చేతులును మొలిచెను. లిఖితుఁ డదిచూచి యాశ్చర్యపడి యా చేతుల నన్న యగుశంఖునకుఁ జూపెను. అంత శంఖుఁడు 'నేను నా తపోమహిమచేతఁ గావించితిని. ఇందు సందేహమువలదు. అదృష్టమిట్లున్నది' యనెను. అందులకు లిఖితుఁడు 'మహాతేజా! నీతపస్సునకు నిట్టిశక్తిగలదేని నన్ను మునుపే నీవేల పరిశుద్ధునిఁ జేయవైతివి'? అని యడిగెను. శంఖుఁడు 'ఇట్లుచేయుట శక్యమే; కాని నీకు దండము విధించునధికారమునాకు లేదు. ఆరాజును బరిశుద్ధుఁడయ్యెను; నీవును నీపూర్వులతోడఁ బరిశుద్ధుఁ డయితివి' అనెను. పాండవశ్రేష్ఠా! ఆరాజు సుద్యుమ్నుఁ డాదండ కర్మముచేతఁ బ్రచేతసకుమారుఁ డగుదక్షునివలె పరమంబయిన సిద్ధిని బొందెను. రాజులకుఁ బ్రజలను మార్గమతప్పిపోకుండు నట్లు పాలించుట ధర్మము. కాఁబట్టి యిట్లుచేసినందులకు మన స్సున శోకముంపకుము. నీవుధర్మజ్ఞులయం దుత్తముఁడవు. కను క సహోదరుఁడాడిన హితవచనమును వినుము. రాజేంద్రా! క్షత్రియులకు దండమేధర్మముగాని ముండనము (చేసికొనుట) గాదు" అనెను. ఇది యిరువదిమూఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

వ్యాసుఁడు ధర్మరాజునకు రాజధర్మమును జెప్పి రాజ్యపాలనమునుచేయ నియోగించుట.

వ్యాసుఁడు ధర్మరాజుతో నర్థవంతమగు వాక్యమున 'నాయ నా! ధర్మపుత్రా! నీతమ్ములు గొప్పమనస్సు గలిగి యడవియందు

వసించుచుండునపుడు వారికం దేమేమి మనోరథములు గలిగి యుండెనో వానినెల్ల నామహారథులు పడయుదురుగాక. నహు షపుత్రుఁడయినయయాతివలె నీభూతలము నేలుము. పురుష సింహమా! నీతమ్ములు తపస్వులై యడవియందు మిక్కిలిదుఃఖ ముతోడి వాస మనుభవించిరి. ఆ దుఃఖముతీరిన యిప్పుడు, వార లు సుఖము లనుభవింపనిమ్ము. నీవు నీతమ్ములతోడ ధర్మము నర్థ మును గామము ననుభవించి పిదప వనమునకు బయలుదేఱు దువు. దేవతలయుఁ బితరులయు నతిథులయు ఋణములు తీర్చి పుచ్చి పిదప స్వర్గమును బొందవచ్చును. సర్వమేధము నశ్వమేధ ము నసెడియాగములు యజింపుము. పిదపఁ బరమం బయినగతిఁ బొందెదవు. నీతమ్ములచే బహుదక్షిణలతోడ యజ్ఞమును జే యించి లోకమునందుఁ దులలేనికీర్తినిబొంది పిదప నిచ్చలు పో వచ్చును. కురుసత్తమా! నీవు చెప్పినదానిభావమును మేమెఱుఁ గుదుము; అయినను ధర్మమునుండి జాఱకుండునట్లుగాఁ జెప్పెదను; వినుము. యుద్ధముచేసి గెలుపునొంది రాజ్యమును బొందిన వానికి వలయు ధర్మమును, వారివారికిఁ దగినధర్మముల నెఱింగిన నిపుణులిట్లు స్థాపించుచున్నారు. ప్రత్యక్షము, అనుమానము, ఉపమానము, ఆగమము, అర్థాపత్తి, ఐతిహ్యము, సందేహము, నిర్ణయము, ఆకారము, ఇంగితము, నడక, చేష్ట, ప్రతిజ్ఞ, హే తువు, దృష్టాంతము, ఉపనయము, ఉక్తి, నిగమనము నసెడివిష యములును, వీనివలని ప్రయోజనములును, వెక్కులు ప్రయో జనముల నొడఁగూర్చునట్టి సాధనములుగాఁ జెప్పుదురు. వీవి యందుఁ బ్రత్యక్షమును అనుమానమును దక్కినవాని కన్నిటికిని కారణమని చెప్పఁబడుచున్నవి. ప్రమాణమును దేలిసినవాఁడే

దండమును జెల్లింప వలంతియగును. ప్రమాణమును దెలియక ప్రయోగించునట్టి దండము రాజును జంపును. శాస్త్రజన్యమగు బుద్ధితోడ (శాస్త్రమునందలి యభిప్రాయమును దెలిసి) రాజు, దేశకాలములను గనుఁగొని యపరాధకులను శిక్షించునేని యతనికిఁ బాపముగలుగదు. ఏరాజు, ఆచింటనొకపాలు పన్ను పుచ్చుకొని రాజ్యమును రక్షింపఁడో వాఁ డా ప్రజలపాపము నందునాలుగింట నొకపాలును బొందును. రాజు,ధర్మమును దప్పక నడవవలసినవిధిని జెప్పెదను దెలిసికొనుము. ధర్మశాస్త్రముల ననుసరించి యాత్మ నిగ్రహము గలిగియుండుటవలన భయము నువీడి కామక్రోధములను బాటింపక ప్రాణులయందుఁ దండ్రి వలె సమదృష్టి గలిగియుండవలయును. రాజు న్యాయ్యమయిన యొకకార్యమును దొడంగి దైవముచేత నది కొట్టువడుటచే సాధింపకపోయినను నతఁ డా విషయమందు మితినడిచినవాఁడు (పొరఁబడినవాఁడు) గానేరఁడు. రాజు తనబలిమిచేతను, బుద్ధి నుపయోగించియుఁ, బగవారిని నడంచియే తీఱవలయును. పాపు లతోడ సంధిసేయరాదు. రాజ్యమును ధర్మముగా నడపవలయు ను. శూరులను పెద్దలను విద్వాంసులను గౌరవింపవలయును. గోవులుగలవారును ధనవంతులునయిన ప్రభువులను విశేషించి రక్షింపవలయును. విశేషించి మిక్కిలి చదువరులయిన వారిని వ్యవహారములందును ధర్మకార్యములందును నధికారులుగా నియోగింపవలయును. న్యాయశాస్త్రమందును ధర్మశాస్త్రమం దును మిక్కిలి యాటి తేటినవారును ప్రమాణములను జక్కఁగా దెలిసినవారును నగువిద్వాంసులను తెలివిగలవాఁడు మంత్రాలో చన సభయందును వ్యవహారసభయందును నధికారులుగా నియ

మింపవలయును. తర్కశాస్త్రమందును ధర్మశాస్త్రమందును నాతితేటినబుద్ధితో దండనీతిని జక్కఁగాఁదెలిసి చెల్లించినచో నది యీమూఁడులోకములను జయించును. రాజా ! వేదతత్త్వ మెఱింగినవారిని యాగకార్యములందు నియోగింపవలయును. వేదములను శాస్త్రములను దెలిసినవారు మంచిబుద్ధిమంతులు. తర్కశాస్త్రమందును వేదములందును వార్తయందును దండ నీతియందును బారంగతులయిన పండితులను సకల కార్యములం దును నియోగింపవలయును. వారలు బుద్ధి (జ్ఞానము) తుదిని బొందినవారు. ఎంతటిగుణవంతుఁడయినను నొక్కనియందె నమ్మి యుండుట తెలివిగాదు. ప్రజలను రక్షింపక, పెద్దలను బూజిం పక,యడంకువయులేక యహంకారమును నసూయయుఁగలరాజు పాపమునొందుకొకాక దుర్దాంతుఁడనియు జెప్పఁబడును. ఎవరు రక్షణము నొందక కఱవు మొదలయినదైవకృత్యములవలనను దొంగలవలనను గుందుదురో వారికష్టమంతయు రాజును జేరిన పాపమగును. చక్కఁగా నాలోచించి లెస్సయగు ప్రయోగముతో మనుష్యప్రయత్నము నంతట నుపయోగించినచో రాజు నకు నధర్మముగలుగదు. ప్రయత్నములు దైవముచేత విచ్ఛిన్నము లగుటయుఁగలదు; సిద్ధించుటయుఁగలదు. తనచేయవలసిన ప్రయ త్నముచేసి వైచునేని రాజును బాప మంటదు. రాజసింహమా! ఈ విషయమై యీకథను నీకుఁ దెలిపెదను. అది పూర్వము రాజర్షిగా నుండినహయగ్రీవుఁ డనువాని చరిత్రము. అతఁడు శూరుఁడు; అక్లిష్టకర్ముండు. అతఁడసహాయుఁడై యుద్ధమందుఁ బగవారిని జంపి పిదపఁ దానును హతుఁడయ్యెను. ఆకథ యేమనఁగా-హయగ్రీవుఁడు మనుష్యులను రక్షించుటయందును శత్రు

వులను నడంచుటయందుఁ దగినయత్నముచేసి యీలోకమందుఁ బ్రఖ్యాతిగాంచి యుద్ధంబువలన స్వర్గలోకమునొంది సుఖించుచున్నాఁడు. అహంకారమును దిగవిడిచి, బగవారిఁ దున్మితూటాడు మహోత్సుఁ డాహవయజ్ఞీవుఁడు శస్త్రములచే ఛేదింపఁబడియుఁ చొంగలచేఁ గొట్టువడియుఁ దనధర్మము తప్పక యుద్ధమున ముందునిలిచి సిద్ధినొంది దేవలోకమున సంతోషించుచున్నాఁడు. రాజులకు యుద్ధమొక యజ్ఞము. అందు విల్లు యూపము ; నారి యందలిత్రాడు; బాణము *స్రుక్కు; కత్తిస్రువము; నెత్తురు నేయి; తేరు వేదిక; కోపము అగ్ని ; నాలుగుగుఱ్ఱములును నలువురు ఋత్విజులు గానుండును. రాజసింహుండును బలవంతుఁడు నగు హవయజ్ఞీవుఁడు యుద్ధయజ్ఞమందు శత్రువులనువేల్చి పిదపఁ దుది యంసుఁ దనప్రాణములనువేల్చి పావిము క్తుఁడై దేవలోకమున సంతోషించుచున్నాఁడు. మంచితెలివిగలిగి నీతి తప్పక రాజ్యమును రక్షించి యాగములుచేసి లోకమంతయు వ్యాపించిన కీర్తిగాంచి యహంకారము లేకుండిన హవయజ్ఞీవుఁడు దేవలోకమందు ముదంబునఁ దేలుచున్నాఁడు. మంచి యుత్సాహముగలిగియు నభిమానమును విడిచియు యాగాదులయిన దైవకార్యములను మనుష్యులు చేయఁదగినకార్యములను దండనీతినిని భూమినిని బాలించి తానును బెక్కుధర్మములుగావించి మహోత్సుండు హవయజ్ఞీవరాజు దేవలోకమునందు సుఖించుచున్నాఁడు. విద్వాంసుఁడును దాతయు శ్రద్ధాళువును గృతజ్ఞుండునై, వేదములను జక్కఁగా నధ్యయనముచేసి శాస్త్రములను లెస్సగాఁగఱచి, కర్మముల నాచరించి, రాజ్యమును బాగుగఁ బరిపాలించి, నాలుగువర్ణము

* స్రుక్కును స్రువమను సోమముఁ వేల్చుట కెత్తు నపకలు అని తెలియునది.

లను వారివారి ధర్మములందు నెలకొల్పి, మనుష్యలోకమును విడిచి హయగ్రీవుఁడు పూజ్యులయిన మేధావులగు విద్వాంసులు ప్రయాగాదులందు దేహము విడిచిపోందు లోకమును బొంది సంతోషించుచున్నాఁడు. బ్రజలను బరిపాలించి, యుద్ధముల జయ మునొంది, సోమరసమును బానముచేసి, బ్రాహ్మణోత్తములను దృప్తినొందించి, నెఱిచొప్పునఁ బ్రజలకు నండము విధించి, యుద్ధము తీఱఁగానే హయగ్రీవుఁడు దేవలోకమునందు ముదమందుచున్నాఁడు. విద్వాంసులగు సత్పురుషులు శ్లాఘనీయుఁడును నర్హుఁడు నయిన చరిత్రమును మిక్కిలి కొనియాడుచున్నాడు. పుణ్యకీర్తి యగునమ్మహాత్ముఁడు హయగ్రీవుఁడు వీరులకుఁ దగులోకములనుబడసి స్వర్గమును జయించి సిద్ధినిబొందినవాఁడయ్యెను' అనెను. ఇది యిరువదినాలుగవయధ్యాయము.

రాజధర్మపర్వము.

వ్యాసుఁడు ధర్మరాజునకు సేనజిత్తు చెప్పినది చెప్పి రాజధర్మము నుపదేశించుట.

ధర్మరాజు వ్యాసుఁడు చెప్పినది విని, యర్జునుఁడు కుపితుఁడై యుండఁగా, నమ్మునితో 'ఈభూతలరాజ్యమును నిందుఁగల పలు విధము లగుభోగములును నిపుడు నామనసునకుఁ బ్రీతిగొలుపకున్నవి. పతులను బాసి పుత్రులనుమాలి పలవించుచున్నపడఁతుల యేడ్పులెలుంగుల వినఁగా శోకము నన్నుఁ జీల్చుచున్నది. నామనస్సున కెంతమాత్ర మూఁటగలుగకున్నది' యని బదులుచెప్పెను. అందులకు యోగవిదులయందు మిన్నయు మహా

ప్రాజ్ఞుండును ధర్మజ్ఞుండును వేదపారంగతుండు నగువ్యాసుం డత నితో 'స్త్రీలు,గతించిన పురుషునిఁ గర్మముచేతఁగాని యాగము చేతఁగాని పడయఁజాలరు.పురుషునిచ్చుటకును నెవఁడును లేఁడు. ఇది కాలంపుఁ గ్రమముచొప్పున దైవముచేత విధింపఁబడినది. మనుష్యుఁడు కాలముచేత సర్వమును బడయుచున్నాఁడు. మనుష్యుఁడు తనబుద్ధి శక్తిచేతను జదువ్రచేతను నకాలమందు నొక విశేషమును బడయశక్తుఁడుగాఁడు; మూర్ఖుఁడును నొకప్పుడు పెక్కులర్థములను బొందుచున్నాఁడు. మనుష్యునకు సకలము నిచ్చునట్టిది కాలమే. భూమియు మందులును మంత్రములును దక్కిన శిల్పికర్మములును నకాలమందు ఫలమొసంగవు. ఆవియే కాలముచేఁ బొదలి మంచికాలమందు వృద్ధియు సిద్ధియుఁ బొందుచున్నవి. వాయువులు వేగముగా వీచుటయుఁ గాలముచేతనే. కొలంకులు మొదలయినవాని నీటియందుఁ దామరలు కలువలు మొదలయినవి మొలచుటయుఁ గాలముచేతనే. వనములందు వృక్షములు పూచుటయుఁ గాలముచేతనే. రాత్రులు క్రమముగా నల్లగను దెల్లగను నుండుట కాలముచేతనే. చంద్రుఁడు నిండారుబింబము గలిగియుండుటయుఁ గాలముచేతనే. అకాలమందు వృక్షమునఁ బున్నాలును బండ్లును గలుగవు.. అకాలమందు నదులు వేగముగా వెల్లిపొడువవు. అకాలమందుఁ గొండలయందును గ్రామములందును గలపక్షులును భ్రాములును మృగములును నేనుఁగులు మదమునొందవు. అకాలమందు స్త్రీలకు గర్భముగలుగదు. అకాలమందు సీతు నెండయు వానయురావు.అకాలమందుమనుష్యుఁడు పుట్టుటయుగిట్టుటయులేదు. అకాలమందు బిడ్డఁడుమాటాడుట లేదు. అకాలమందు జ్వరనము

నొందుటలేదు. అకాలమందు విత్తిన విత్తులు మొలచుటలేదు అకాలమందు సూర్యుఁడుదయించుటయు నస్తమించుటయు లేదు. అకాలమందుఁ జంద్రుఁడును, వెనుకరడులపరంపరలతోఁ గూడిన సముద్రమును బెరుఁగుటయుఁ దఱుఁగుటయు లేదు. ధర్మరాజా! ఈవిషయమున దుఃఖార్తుఁడయినసేనజిత్తు పాడిన యీపురాతనపు టితిహాసమును జెప్పెదరు.—దుస్సహమైన యీకాలగతి మనుష్యుల నెల్లవారిని బట్టుచున్నది. భూమియం దెల్లవారును గాలముచేత ముదిరియే మృతినొందుచున్నారు. రాజా! లోకమందుఁ గొందఱు మఱికొందఱను గొట్టుచున్నారనుటయు, నట్లే వారిని వేఱుకొందఱు గొట్టుచున్నారనుటయు లోకమునందు వాడునట్టి వట్టిపేరే; కాని వాస్తవముగాదు. రాజా! కొట్టువాఁడును లేడు. (కొట్టుటయులేదు, కొట్టఁబడుటయులేదు.) ఒకఁడు కొట్టుచున్నాఁడని తలఁచుచున్నాఁడు. మఱియొకఁడు కొట్టలేదని తలఁచుచున్నాఁడు. ప్రాణుల పుట్టుకయును జావును స్వభావముచేత నియతమైయున్నవి. ధనము నష్టమైనను, పెండ్లామేని బిడ్డఁడుగాని తండ్రిగాని మృతినొందినను,అప్పు 'డక్కటా! అక్కటా! ఏమిదుఃఖము!' అని యాక్రోశించి దానినే చింతించుచుండుటచే దుఃఖమును బయింబయి పెంచుకొనుచున్నాఁడు. నీ వేల మూఢుని వలె శోకించెదవు? శోకింపఁదగనివారినిగూర్చి శోకించెదవే. (అదిదగదు). దుఃఖములందుఁ దగులుటచే దుఃఖములును, భయమునొందుటచేత మఱిమఱిభయములును బెరుఁగుచున్నవి. ఇంతేకాని మఱేమిలేదు.'ఈదేహముగూడ నాదికాదు. ఈభూమియం దేదియు నాదిగాదు. ఇంచలివస్తువులు నాకెట్లో యట్లె తక్కినవారికిని సొంతము' అని కనుఁగొనువాఁడు మోహము

నొందఁడు. శోకమునకు వేలకొలఁది కారణములుగలవు. సంతోష మునకును వేనవేలు కారణములున్నవి. ఇవి ప్రతిదినమును మూఢులనే పయికొనునుగాని పండితులనుగాదు. ఇవి యిట్లు కాలక్రమమునఁ బ్రియములును ద్వేషింపఁదగినవియునై సుఖములుగను దుఃఖములుగను జూపట్టుచుఁ జక్రమువలె ప్రాణులయందుఁ జుట్టి వచ్చుచున్నవి. ఈలోకమందు దుఃఖమే కలదుగాని సుఖము లేదు; కాఁబట్టి దుఃఖమేయనుభవింపఁబడుచున్నది. దుఃఖము తృష్ణ యనుపీడవలనఁ బుట్టుచున్నది. సుఖము దుఃఖమనెడి పీడవలనఁ బుట్టుచున్నది. సుఖమునకు వెంట దుఃఖమును, దుఃఖమునకు వెంబడిని సుఖమును వచ్చుచున్నది. ఎప్పుడును దుఃఖమే కలుగదు. ఎప్పుడును సుఖమేకలుగదు. సుఖమెప్పుడును దుఃఖమునందు మిగియును; ఒకప్పుడు దుఃఖమువలననే పుట్టును. కాఁబట్టి శాశ్వత సుఖమునుగోరువాఁడెంటిని దిగవిడువవలయును. సుఖము, మిగియుటనుండియే దుఃఖముపుట్టవలయును. దుఃఖముమిగియుటనుండియే సుఖము పుట్టవలయును. కాఁబట్టి దేని నిమిత్తము శోకముగాని, దుఃఖముచేతె నతిశయించిన తాపముగాని, యాయాసముగాని కలుగుచున్నదో దానిని దేహమునందలియొక యంగమైనను (పాముకఱచిన యంగమునుం బోలె) దిగవిడువవలయును. సుఖముగాని దుఃఖముగాని, ప్రియముగాని యప్రియముగాని, యేది ప్రాప్తించుచున్నదో దానిని వెనుదీయని మనసుతో భరించియే తీఱవలయును. నాయనా! ఇంతేల! నీ భార్యలకును బుత్రులకును నప్రియము నించుకంత యేనియుఁ గావింపుము; అప్పు డెవ్వరెవ్వనివారో, యది యేహేతువుచేతనో, మఱి యేప్రకారమననో నీకుఁ దెలియఁగలదు.

ఎవరు మిక్కిలియు మూఢులో, ఎవరు బుద్ధిమంతుడను బొందినవారో, వారే యీలోకమునందు సుఖము పెంపారుచున్నారు. ఈ యిరుతెగలకు నడిమివారు కష్టియే పడుచున్నా' రని యిట్లు ప్రజ్ఞాడాసేనజిత్తు చెప్పెను. అతఁడు లోకమందుఁ గలమంచిసెబ్బరలను జక్కఁగాఁ దెలిసినవాఁడు; ధర్మములను సుఖదుఃఖములను నెఱింగినవాఁడు పరుల దుఃఖమునకు దుఃఖించువాఁడొకప్పుడు సుఖమునొందఁడు. ఏలన దుఃఖములకుఁ దుదిలేదు. ఒకదుఃఖమునుండి మఱొకదుఃఖము పుట్టుచున్నదే! (దానికిఁ దుదియెక్కడిది? కాన యది తీఱినదిచూచి సుఖమందుటయు నెక్కడిది?) సుఖమునుండియు దుఃఖముపుట్టుచున్నది. లోకమందు సుఖమును దుఃఖమును సంపత్తియు విపత్తియు లాభమును నష్టియును చావును బ్రతుకును కాలగతిచే మాఱిమాఱి యన్నియుఁ గలుగుచున్నవి. కాఁబట్టి వానింబట్టి దుఃఖముచేఁ గలంగరాదు. సంతోషముచే నుబ్బరాదు. రాజులకు యుద్ధమందు దీక్షఁబూనుటయు రాజ్యమును బాలించుటయు దండనీతి చక్కఁగాఁ జెల్లించుటయు యజ్ఞములందు దక్షిణలుగా ధనమొసంగుటయుఁ జక్కఁగా జానసుసేయుటయు ధర్మమందురు. ఇవియన్నియు రాజునకుఁ బావనము లయినవని తెలియునది. మంచి తెలివిగలిగి నీతితోడ రాజ్యమును బాలించుచు నహంకారము విడిచి యజ్ఞములుచేయుచు, ప్రాణులనెల్లను ధర్మదృష్టితో సమముగాఁ జూచుచు నుండుమహాత్ముఁడగురాజు దేహమును విడిచినపిదప దేవలోకమునందు సుఖించుచున్నాఁడు. యుద్ధములగెలిచి, రాజ్యమునుబాలించి, సోమరసమును బానముచేసి ప్రజలనుబెంచి జనులకు నీతిదప్పక దండమునెఱపుచు నాయువుముగి

సినపిదప దేవలోకమందు సంతోషించుచున్నాఁడు. రాజు యాగ ములుచేసి రాజ్యమునుజయించి, యందలిప్రజలను వారిప్రియ ములను రక్షించి, వేదములను శాస్త్రములను చక్కఁగా నధిగ మించి, నాలుగువర్ణములను వారివారి ధర్మములందు నెలకొలిపి, యిట్లు రాజ్యమును జక్కఁ బాలించి పరిశుద్ధాత్ముండయి దేవ లోకమందు మోద మొందుచున్నాఁడు. ఏరాజు స్వర్గమందుం డిన నతని చరిత్రమును మంత్రులును బురజనులును దేశజను లును గొనియాడుచున్నారో యారాజే రాజులయం దుత్త ముఁడు' అనెను. ఇది యిరువదియేనవయధ్యాయము.

*(అధికపాఠము)

రాజధర్మపర్వము.

{ధర్మరాజు ధనము యాగదానాదులకే కాని భోగ ములకుఁ దగదని యర్జునునకుఁ జెప్పుట.}

ఈ యవసరమునందే ధర్మరాజు గొప్ప మతిగలవాఁడుగాన యర్జుననిజూచి యుక్తియుక్తమగు వాక్యమున "అర్జునా! 'ధన మునకంటె నెక్కుడయినది యొక్కటియు లేదు. ధనములేనివా నికి స్వర్గములేదు; సుఖములేదు; ప్రయోజనములేదు' అని తలఁ చుచున్నావుకాని యది నిజముగాదు. వేదాధ్యయన మనెడు

* ఇది దాక్షిణాత్యకోశములం దొకానొకటిమాత్ర మున్నదని యధికపాఠ ముగా నధ్యాయసంఖ్యలేక ముద్రితమై యున్నది. ప్రతాపచంద్రరాయఁగారి ప్రతి యందు నధ్యాయములలోఁబడి గణితమై యున్నది. దాక్షిణాత్య ముద్రణాను పాఠముగా దీనిని దెనిఁగించుటంబట్టి యిట యధికపాఠముగా నుంపఁబడియె.

యజ్ఞముచేత సిద్ధిని బొందినవారు వెక్కండ్రుజనులు చూపట్టుచున్నారు. తపస్సునందు నిరతులయి శాశ్వతములగు లోకములను బొందిన మునులును గనుపట్టుచున్నారు. ధనంజయా! వైఖానసులు 'బ్రహ్మచారులై సర్వధర్మములను దెలిసి ఋషులసమయమును రక్షించుచువచ్చు జనులను దేవతలు బ్రాహ్మణులనుగాఁ దెలియుచున్నారు. వేదాధ్యయనమందు నిష్ఠ లయినఋషులను జ్ఞానమందు నిష్ఠగలవా రగునితరఋషులను ధర్మమందు నిష్ఠగల వారినిఁగా నీ వెప్పుడును దెలియుచుండవలయును. కార్యముల నెల్ల జ్ఞాననిష్ఠులగు వారియందే ప్రతిష్ఠింపవలయును. అనగా వారి యభిప్రాయముచొప్పున జరుపవలయును' అని చెప్పినట్లు మనకుఁ దెలిసియున్నది. అజులు పృశ్నులు సికతులు అరుణులు కేతవులు నఋషులు వేదాధ్యయనముచేత దేవలోకమునొందిరి. వారు వేదోక్తములగు దానము అధ్యయనము యజ్ఞము భరింపఁ గష్టమగునిగ్రహము ననెడి యీ కర్మముల నాచరించి సూర్యునికి దక్షిణంబగుమార్గమున దేవలోకమునొందిరి. ఈలోకములు కర్మనిష్ఠులయినవారి లోకములని నేను బూర్వమును జెప్పియున్నాను. ఉత్తరంబగు మార్గమునఁ బోగనిష్ఠులగువారు పయనముచేయుదురని తెలియఁగలవు. అది కొనిపోవునట్టివియు శాశ్వతములయి ప్రకాశించుచుండునట్టివియు యోగనిష్ఠులలోకములు. పురాణవిదులయినవారిలో నుత్తరమార్గమును బ్రశంసించెదరు. సంతుష్టియే మిక్కిలి యుస్వర్గము. (సంతుష్టివలననే స్వర్గముఁ బొందఁగూడును) సంతుష్టియే పరమమైనసుఖము. (సంతుష్టివలననే పరమసుఖము కలుగఁగూడును.) సంతుష్టికంటె నెక్కుడయిన దొక్కటియులేదు.

అది క్రోధము నుబ్బును నడంచినవానియందుఁ జక్కఁగా నెలకొనుచున్నది; అది వానికి నుత్తమమయిన సిద్ధియగును. ఈ విషయమై తొల్లి యయాతి రాజు చెప్పినయీగాథ నుదాహరింతురు.- 'మనుష్యుఁడు తాఁబేలు తనయవయవములను ముడుఁచుకొనునట్లు వెలికి నిగుడు కామములనెల్ల నెప్పుడు లోపల నడంచుచున్నాఁడో, ఎప్పుడు తానొకటికిని భయపడఁడో, తన వలనను నొకటియు భయమందదో, ఎప్పుడు తానేదియుఁ గోరకయు ద్వేషింపకయు నుండునో యప్పుడు బ్రహ్మమునొందుచున్నాఁడు. ఎప్పుడు మనుష్యుఁడు సమస్తప్రాణులందును మనసు వాక్కు కర్మ మనెడియీమూఁటిచేతను భూపభావము నెఱపఁడో, యప్పుడు బ్రహ్మమునొందుచున్నాఁడు. అభిమానమును మోహము నడంచి పెక్కుసంగములను వీడి యాత్మస్వరూపము జ్యోతివలెఁ దెలియుచున్న సాధువు మోక్షమున కర్హుఁడగును. అర్జునా! నేను జెప్పు నీమాట, నింద్రియములు చిక్కఁబట్టి వినుము. కొందఱు ధర్మమును కొందఱు శీలమును మఱి కొందఱు ధనమును గోరుచున్నారు. (ధర్మమునకుఁ గారణమని) ఒకఁడు ధనము గోరవచ్చును; * కానివానికి దానిని గోరకుండుటయే * మిక్కిలి గొప్పది. ధనమందును, ధనము మూలముగాఁ గలధర్మమందును బెక్కులుదోషములు గలవు. వానిని బ్రత్యక్షముగా నేను జూచుచున్నాను. నీవును దానిని జూడఁదగును. ధనమున కాశించువాఁడు తానవశ్యము వర్జింపవలసిన

---

* యజ్ఞాదులు చేయుటకుఁగాను సాధనముగా ధనమును గోరుటకంటె యజ్ఞాదులుచేయుకయు నందులకై ధనమునుగోరకయు నుండుట మంచిదని యాశయము.

కర్మములను వర్జించుట మిక్కిలియుఁ గష్టము. ధనమును గడించుచుండువారికి నందు మంచికార్యములు చూపట్టుట మిక్కిలి యరిది. పరులకు ద్రోహముచేసినచో ధనముఁ బొందఁగూడునని చెప్పెదరు. ఏకారణమునఁ గలిగినను ధనము నానాభయములనే కలిగించును. మంచినడవడి తప్పి శోకమును భయమును దలంపక యల్పమగువిత్తముకొఱకు మిక్కిలి యాశించువాఁడు పరులకు ద్రోహములుచేయును; దానివలన భూరిణహత్యగలిగి ననుగాని తెలియఁడు. పడయరానిధనమునుబడసి దాని ననుకూలురయిన భృత్యుల కిచ్చిన దొంగలు దోఁచుకొనిపోయినట్లుంబోలె నిచ్చినపిదప మిక్కిలియుఁ బరితపించుచున్నాఁడు. కూలిపుచ్చుకొను భృత్యులును దోషముగలవారుగాఁ జూపఁబెట్టెదరు. ధనములేనివాని నెవఁడేమన వచ్చును? వాఁడు సకలసంగములను వీడి తానుభిక్షించి *తెచ్చికొన్న యించుకంతదాని చేతను బొట్టఁబ్రోచికొనుచు సుఖముగానుండును. ధనముచేత నెవ్వఁడును సుఖమొందఁడు. ఈవిషయమై పురాణముల నెఱింగినవారు యజ్ఞసమూహములను గుఱించి వేదములందుఁ బ్రతిపాదితములయినది యగు యజ్ఞగీత మనుగాథనుజెప్పెదరు—అదేమనఁగా 'బ్రహ్మ ధనములను యజ్ఞముకొఱకుఁ బడసెను.

---

* ఇట 'అధనఃకృష్యకింవాచ్యో విముక్తఃసర్వశఙ్కితీ। దేవస్వముపగృహ్యైవ ధనేనసుఖీభవేత్' అని మూలము. దేవస్వమనఁగా 'యద్ధనం యజ్ఞశీలానాం దేవస్వంతద్విదుర్బుధాఃఁ' అన్నట్లు యజ్ఞార్థమైనధనము. ధనము దేవతలసొమ్ముగుటచేత నది పడసినవాఁడు సుఖమునొందఁడని యర్థాంతరము. భిక్షించితెచ్చుకొన్న యించుకంతయేనియుం దేవస్వముగాఁ జెప్పుటయుఁ గలదు; కాన దానినిబట్టియు నర్థము చెప్పఁబడెను.

ఆధనమునురక్షించి యాగమునుసేయుటకు మనుష్యునిని సృజించెను. కాఁబట్టి ధనమునంతయు యాగమునందే యుపయోగింపఁదగును. ధనమును దనయిచ్చ వచ్చినట్లు వినియోగించుట హితమును బ్రశస్తమునుగాదు' అనుటయే. అర్జునా ! నీవు ధనవంతులందు మేటివిగదే. బ్రహ్మ తనకార్యమగు యాగమునుద్దేశించి యాధనమును మనుష్యులకు నిచ్చుచున్నాఁడని తెలియుము. కావునన్నే యాధనమొక్కనికిని సొంతము గాదని ప్రాజ్ఞులు తెలియుదురు. కాబట్టి దొరకినధనము మనుష్యుఁడు శ్రద్ధతోడ దానమందును యాగమందును వినియోగింపవలయును. ఒకఁడు లభించినధనమును దానముచేయుట తగునేకాని భుజించుటయు నశింపఁజేయుటయుఁ దగవుకాదు. యాగము దానము నని చేయుటకు గొప్పకార్యము లుండఁగా ధనమును గూడఁబెట్టుటచేతఁ బసయేమి! ఎవరు బుద్ధికొఱతవలనఁ దాము స్వధర్మమును దిగవిడిచినవారికి ధనమొసంగుదురో వారు దేహము విడిచినపిదప నూఱేండ్లు పుక్కిషమును భుజింతురు. తగనివానికిచ్చుటయుఁ దగినవానికి నీయకుండుటయు, అర్హుఁడు అనర్హుఁడని వివేచించి తెలిసికొనఁజాలమివలనఁ గలుగుచున్నది. కాఁబట్టి దానధర్మము సయితము దుష్కరము. లభించినట్టి ధనము సపాత్రమునకిచ్చుట, పాత్రమున కీయకుండుట యను రెండుదోషములును గలవని తెలియుము' అనెను.

రాజధర్మపర్వము.

ధర్మరాజు నిర్వేదించుటనుజూచి వ్యాసుఁడు రాజ్యపాలనము నేయు విధించుట.

ధర్మరాజు 'బిడ్డఁ డభిమన్యుఁడు హతుఁడయ్యెను ; ద్రౌపది కొడుకులును ధృష్టద్యుమ్నుఁడును విరాటుఁడును ద్రుపదుఁ డును వృషసేనుఁడును ధృష్టకేతుఁడును మఱియు నానాదేశీ యులగురాజన్యులును యుద్ధమునందు హతులయిరి. ఇట్లింద ఱును హతులై యుండఁగా నిట్లు జ్ఞాతులను వధించిపుచ్చినరాజ్యా తురుని నన్ను శోకమెంతమాత్రము విడువకున్నది. నాకు రాజ్య మందుఁ గామముపెద్ద; నేను మిక్కిలి యుగ్రుఁడను; నానంశ మును ద్రుంచివైచుటకు మూలభూతుఁడను. కాకేమి? నేనెవ్వని యొడియందుఁ బొరలి యాటలాడుచుంటినో యాభీష్ముని, నట్టి నేనే రాజ్యమునందుఁ బేరాసపట్టి యుద్ధమునఁ జంపితిని. అతఁడు శిఖండిని జూచుచుండఁగా వజ్రములంబోని యర్జునుని బాణము లచే నానిమిత్తముకొట్టువడి సుడివడుచుండఁగాఁ జూచినప్రొడు, ముదిసిన సింహముంబోలెఁ బురుషసింహుఁ డగునాపితాము హుఁడు మెఱయుచున్న బాణములు మేనంబర్వుచుండఁగాఁ జూ చినపుడు, నామనసు కందికుందినది! ఎదిరిరథికులను గలంచినలం చునట్టి నాతాతయా భీష్ముఁడు పర్వతమువలె సుడివడుచుఁ గీడ్పడి తూర్పుమొగముగా రథమునుండి తూలిపడఁగాఁ జూచినపుడు నామనసు కలంగఁబాఱెను. ఎవఁడు కేల ధనుర్బాణములు ధరించి కురుక్షేత్రమునఁ బరశురాముని తోఁడఁ బెక్కుదినములు పోరుగావించెనో, ఎవ్వఁడు కాశియందుఁ గన్యాస్వయంవరమునఁ గూడియున్న భూమియందలి రాజులనెల్ల నేకరథుఁడై యుద్ధము

నకుఁబిలిచెనో, ఎవఁడెవ్వరికిని మార్కొనరాని యుగ్రాయు ధ్రుండను చక్రవర్తిని తనశస్త్రంపు వేఁడిమిచేఁ గాల్చిపుచ్చెనో, ఆకారవ్యుని, ఆగంగాపుత్రుని, భీష్ముని నేను యుద్ధమునఁ బడఁ గూల్చితినే! అతఁడు తనకు శిఖండిమృత్యువని తెలిసియు వానిని బాణములఁగూల్చినాఁడుకాఁడే ! అట్టి మహావీరుఁ డర్జునునిచేఁ గూలెనుగా ! మునీంద్రా ! అతండు పుడమిపయిఁ ద్రెళ్లి నెత్తుటం దోఁగుచుండఁగా నెప్పుడుచూచితినో యప్పుడే మిక్కిలి దెప్పర మయినజ్వరము నాలోనఁ జొచ్చినది! ఎవ్వఁడు మమ్ము బాల్య మునఁబెంచెనో, యెవఁడుమమ్ముఁ జక్కఁరఁజీఁచెనో, యట్టియత నిని బాపియుఁ గురుఘాతుకుండును నగు నేను రాజ్యమునకు-నల్పకాలముండునట్టి రాజ్యమునకుఁ - బేరాసపడి తెలివిమాలి గూల్చితినే ! మతిద్రోణుఁడో, ఆచార్యుఁడు; గొప్పవిలుకాఁడు; సకల రాజపూజితుఁడు; అట్టి యతనిని యుద్ధమునం దెదురుచని యతని కొడుకునుగుటించి పాపినినేను వట్టిబోంకాడితిని. ఆయా చార్యుఁడు నన్ను 'రాజా ! నాకుమారుఁడు జీవముతో నుండు నేని నీవు నిజముచెప్పము' అని యడిగినమాట నాయవయము లను దహించుచున్నదే ! నేను నిజమేపలుకుదు నని నెఱనమ్మక ముచేత నా బ్రాహ్మణుడు నన్నదియడిగెను ; ఆగురునియెడ నేను, సత్య మనుకవచమునూడ్చి రాజ్యమందుఁ బేరాసగొన్న నేను, పెద్దలను జంపఁదెగినపాపుండ నగునేను, నేనుఁగు హతముకాఁగా నే యేనుఁగనుటను మఱుఁగుపఱిచి 'అశ్వత్థామహతుఁడయ్యెను' అని యబద్ధమాడితిని. మిక్కిలియుఁ జేయరాని యట్టికృత్య మునుజేసిన నాకెట్టిలోకములు పొందఁగలుగునోకదా ! యుద్ధం బుల కెంతమాత్రము వెనుదీయని యన్నయగు కర్ణునిఁజంపితిని.

నాకంకె బెట్టిదుఁడగుపాపి యీలోకమం దెవఁడు? పర్వతము లందు సింహమువలె నుదయించినబిడ్డఁ డభిమన్యునిఁ బేరాసగొని ద్రోణపాలితం బగుసైన్యమునందుఁ బొరఁబడునట్లు చేసితిని. అదిమొదలు భూరిణహత్యచేసినపాపివలె నర్జునుని కృష్ణునిని మొగమెత్తి చూడలేకున్నాను. దుఃఖమున కెంతమాత్రము దగని ద్రౌపది యైదుపర్వతములను బోఁగొట్టుకొన్న పుడమివలె నేవురుపుత్రులను దిగనాడుటదలంచి పొక్కుచున్నాను. ఇట్లీలోకమునకే నాశముపుట్టించినవేను మహాదోషిని; పాపిని. నేనిట్లే యుండి నాపాడుబొందిని శోషింపఁజేసెద. పెద్దలనుజంపిన నేను, నీక జన్మాంతరములం దయినను కులఘాతుకుఁడు గాకుండుటకై యిట్లు ప్రాయోపవేశముఁ బూనియున్నానని తెలియుఁడు. మహర్షులారా! ఇఁక భుజింపను; ఏవిధమునను జలముపయోగింపను, ఇట్లేయుండి నేను బ్రియములయిన ప్రాణములను బోకార్చుకొనెదను. మహర్షులారా! మీరు నిశ్చలులుపోవచ్చును. మిమ్ము మ్రొక్కి వేఁడుకొనుచున్నాను. ఈకళేబరము నిట్లే దిగవిడిచెదను; అందఱు నాకనుమతి యియ్యవలయును" అనెను. బంధుశోకమునకు విరవిరఁబోవుచు ధర్మరాజిట్లుచెప్పఁగా ఋషిసత్తముఁ డగువ్యాసుఁడు 'అట్లుకాదు' అని యడఁచి మరల నతనితో 'మహారాజా! నీవు మితిమీఱి శోకపడుట యెంతమాత్రము తగదు. ప్రభూ! ఇది యదృష్టమని మునుపు చెప్పియున్నాను. మరల దానినే చెప్పెదను. లోకమునందుఁ బుట్టినప్రాణులకు నీళ్లయందలి బుగ్గలవలె సంయోగ వియోగములు వచ్చుటయుఁ బోవుటయుఁ దప్పదు. ఒండొండకూడికలెల్ల నశింపకమానవు. పొడవు పెరిఁగినవెల్లఁ బడకతీఱదు. కూటమి తుది యెడఁబాఁకు.

బ్రతుకుతుది మరణమే. సుఖము ముగింపు దుఃఖమే. సోమరి తన మప్పటికి సుఖముగానుండినను దుదను దుఃఖమే యగును. పాటు అప్పటికి దుఃఖముగా నుండినను దుదిని సుఖము నిచ్చును. అణిమాదివిభూతులును, సంపత్తియు, లజ్జయు, ధైర్యమును గీర్తియుఁ బాటుపాడువానియం దుండునే కాని సోమరియందుండవు. సుహృదు లెందఱుండినను సుఖమునకుఁ జాలరు. శత్రువు లెందఱయినను దుఃఖమునకుఁ జాలరు. ప్రజ్ఞయెంతయినను ధనములొందుటకుఁ జాలదు. ధనములవలన సుఖము గలుగఁజాలదు. కాంతేయా! దైవము నిన్నెట్లుకర్మములుచేయుటకు సృజించినదో యట్లు వానిని జేయుము. అందువలననే నీకు సిద్ధికలుగును. రాజా! నీయంతకు నీ వొడయుఁడవుగావు' అనెను. ఇది యిరువదిమూఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{వ్యాసుఁడు ధర్మరాజునకు నశ్మజనకసంవాదమును జెప్పి క్షత్రధర్మమును విధించుట.}

ధర్మరాజు జ్ఞాతిశోకమునఁ బరితపించుచుఁ బ్రియములయిన ప్రాణములను విడువఁగోరుచుండఁగా వ్యాసుఁడతని శోకమును బోఁకార్చి 'పురుషతిలకా! ఈ విషయమై పురాతనమయిన యితిహాసమొకటి నుదాహరించెదను. దానిపేరు అశ్మగీత. దానిని జెప్పెదవినుము. విదేహరాజగుజనకుఁడు దుఃఖశోకములు తన్నుఁ బైకొనఁగాఁ బ్రాజ్ఞుఁడయినయశ్మఁడను బ్రాహ్మణునిఁ జూచి సందేహము నడుగువాఁడై 'బంధువులును ధనమును

వచ్చునపుడును బాసిపోవునపుడును తన శుభమునుగోరిన మనుష్యుఁడొట్లుండవలయునని?" అనియడిగెను. అందులకశ్మఁడు 'ఈ దేహా ముత్పత్తినొందినతోడనె యీయాదుఃఖములును సుఖములును దీనిని వెంబడించుచున్నవి. ఆ రెంటిలో నేదేనియొకటి కలుగ వచ్చునుగాన యట్లు కలిగినప్పుడు దానియందేమనస్సు చెల్లించుచుండినయెడల సది, గాలి మబ్బులనుంబోలె, వాని తెలివిని హరించివైచును. (బకుఁడు సుఖమందున్నపుడు) 'నేను గొప్పకులమునఁ బుట్టినవాఁడను. సిద్ధిగలవాఁడను. (ఏదితలఁచినను చేయంగలవాఁడను) నేను సాధారణమనుష్యుఁడను గాను' అను నీ మూఁడు తెఱఁగుల కారణములచే వానిమనసు మిక్కిలి క్లిన్నమగును. మనస్సు భోగములందుఁ దగులునడఁగాఁ దండ్రికూడఁబెట్టిన ధనము నంతయువెచ్చించి యన్నియు మిక్కిలి తఱిఁగి బీదవడఁగాఁ బరుల సొమ్ములను గ్రహించుట మంచి దని తలంచుచున్నాఁడు. రాజులట్లుమేరమీఱి యయుక్తముగా నితరులసొమ్ము నపహరించువానిని, బోయవాఁడమ్ములచేత జింకను గారించునట్లు, దండించుచున్నారు. అట్టి మనుష్యులిరువదియేండ్లో ముప్పదియేండ్లో వయస్సుగలిగి యంతకే రాజదండనాదులచేఁ దీఱుదురుగాని నూఱేండ్లవఱకు నుండుటగలుగదు. రాజు సమస్తప్రాణుల నడవడుల నప్పుడప్పుడు పరిశీలించుచు, నట్లు దొంగతనము మొదలగువానిచే మిక్కిలియు దుఃఖితులయినవారికిఁ దనబుద్ధిచేత వలయుమందు గావింపవలయును. మనస్సు తబ్బిబ్బో, అనిష్టములు వచ్చుటయో, యీరెండుమాత్రమే మానసదుఃఖములకుఁ గారణములు; కాని, మూఁడవకారణము కలుగనేరదు. మఱియు నిటువంటివగు నాయాదుఃఖములును విషయస్పర్శమువలనఁ గలుగు

దుఃఖములును మనుష్యుని వెంబడించుచున్నవి. ఇట్లుండు నపుడే ముదిమియు మరణమును, రెండు తోఁడ్లై వలె, ప్రాణులను బలముగలవానినో, దుర్బలములనో, పొట్టివానినో, పొడుగగువానినో, యన్నిటినిబట్టి మ్రింగుచున్నవి. ఏమను ష్యుఁడుగాని, సముద్రపర్యంత మయినయీ భూమండలమును జయించినవాఁడేని, యీజరామరణములను జయించువాఁడొకప్పుడును లేఁడు. ప్రాణులకు సంభవించునది సుఖమో దుఃఖమో యనుభవింపవలయును. ఇది యవశము. దీనిని దప్పించుకొనుటకు వీలులేదు. ఎలఁబ్రాయమునసో, నడిమి వయస్సునసో, ముదిమియందో, దాను గోరినవిగాని గోరనట్టివిగాని యగువిషయములువచ్చినఁ ద్రోసిపుచ్చఁ దరముగాదు. అప్రియములతోడి కూడికయు, మిక్కిలిప్రియములతోడి యెడఁబాటును, సంపదలును, ఆపదలును, సుఖమును, దుఃఖమును, నదృష్టము ననుసరించుచున్నవి. ప్రాణుల పుట్టుకయుగిట్టుటయు, లాభములను నష్టములనుబొందుటయు, నన్నియు విధిచేత నేర్పడియున్నట్టివగును. వాసనయు, రూపును, రసమును, స్పర్శమును, స్వభావముచేతనే కలుగునట్లు, సుఖములును దుఃఖములును విధి ననుసరించియే కలుగుచున్నవి. కూర్చుండుటయుఁ బరుండుటయు, పోవుటయు లేచుటయు, త్రాగుటయుఁ దినుటయుఁ బ్రాణులకన్నిటికిని గాలముచేతనే కలుగుననుట నిశ్చయము. వైద్యులుగూడ రోగులమ్మెదరు. బలవంతులును బలహీనులమ్మెదరు. * నపుంసకులును బడఁతులు గలవారమ్మెదరు. దీనిని జూ

---

* స్త్రీమన్తశ్చాపరే షణ్ఢాఃʼ అని మూలము. శ్రీమన్త శ్చాపరే షణ్ఢాఃʼ అని పాఠాంతరము. ధనవంతులును దరిద్రు లగుదురని యర్థము.

డఁగాఁ గాలగతి విచిత్రముగానున్నది. గొప్పకులమునఁ బుట్టుటయు, తెవులులేకుండుటయు, చక్కఁదనమును, వీర్యమును, సంపత్తియు, ఉపభోగమును, విధిచేతనే దొరకొనును. దరిద్రులు కోరకున్నను పుత్రులు మిక్కిలియుఁ బెక్కండ్రు కలుగుచున్నారు. ధనసమృద్ధిగలవారికి నొక్కబిడ్డఁడును గలుగఁడు. విధిచెయ్దు విచిత్రమయినది. వ్యాధి, జలము, ఆయుధము, అగ్ని, ఆఁకలి, విషము, జ్వరము, మరణము, పయినుండిపడుట మొదలుగాఁగల యేయాపదయం దేమనుష్యుఁడు పోవునట్లు విధియేర్పఱిచినదో వాఁడామేరనే పోవుచున్నాఁడు. *లోకమునఁ గొందఱు మేరతప్పి నడవకున్నను బెక్కిడుములు పడుటయు, మఱికొందఱు మేరతప్పి నడచుచున్నను నిడుమకుఁబట్టువడకుండుటయుఁ జూపట్టుచున్నది. మిక్కిలి ధనముగలవాఁడెలస్సాయమం దే నాశమొందుటచూపట్టుచున్నది. మిక్కిలి కష్టపడుచున్న దరిద్రుఁడు ముదిమితోఁగూడ నూఱేండ్లు బ్రతుకుచున్నాఁడు. †చెడుకులమునఁబుట్టినమనుష్యులు చిరజీవులుగాఁ జూపట్టుచున్నారు. మెంపుసొంపుగల మంచికులమునఁబుట్టినవారు మిడుతవలెనశించెదరు. లోకమునందు బహుతరముగా సంపదగలవారికి భుజించుటకు శక్తియుండదు. బీదలకు

---

*ఇందులకు 'దృశ్యతే నాప్యతిక్రామన్నిష్కార్తోఽథవాపునః। దృశ్యతేచాప్యతిక్రామన్నిగ్రాహ్యోఽథవాపునః' అని మూలము. విధిని గడచినవాఁడును, విధినుండి తెలుసుకొనినవాఁడును ఒక్కఁడునులేఁడు. విధియందుఁ బట్టుపడనివాఁడును లేడని యర్థాంతరమొకటి చూపట్టుచున్నది.

†దీనికి 'అకులీనాశ్చపురుషాః' అనిమూలము. 'అకిఞ్చనాశ్చపురుషాః' అని దాక్షిణాత్యపాఠము. 'దరిద్రశ్చ పరిక్లిష్టఃశతవర్షోజరాన్వితః' అని మున్ముందె చెప్పియుండుటంబట్టి మఱల అకించనునిఁ జెప్పుట అసమంజసము.

మిక్కిలియు కష్టులును తాలును జీర్ణమగును. ఒకడు కాలము చేతఁ బ్రేరితుఁడై తానొకటిచేసినను 'నేనే దీనిని చేయుచున్నా' నని తలంచుచున్నాఁడు. దురాత్ముఁడు తనకుఁగలవానితోఁ దనివి నొందక యేదేదియిష్టమో యట్టిపాపమునెల్లఁ జేయుచున్నాఁడు. వేట, జూదము, పడఁతి, పానము, వివాదములును, పండితులచే నిందితములయినవి; కాని మిక్కిలి చదువరులయిన పురుషులును వీనియందుఁ దగిలియుండుట చూపట్టుచున్నది. ఇట్లు చూడఁగా సమస్తమయిన విషయములు నిష్టములయినవియు ననిష్టములయినవియును, కాలముచేతనే సమస్త ప్రాణులను బొందుచున్నవి. వేఱుకారణము కనుపట్టకున్నది. వాయువు, ఆకాశము, అగ్ని, చంద్రుఁడు, సూర్యుఁడు, పగలు, రాత్రి, నక్షత్రములు, నదులు, పర్వతములునెడి వీనినెవఁడు చేయుచున్నాఁడు? ఎవఁడుభరించుచున్నాఁడు? శీతమును, ఉష్ణమును, వర్షమును గాలముచేతనే చుట్టివచ్చుచున్నవి. ఇక్లే మనుష్యులకు సుఖములు నుదుఃఖములును గాలముచేతనే కలుగుచున్నవి. మందులును, ఆయుధములును, హోమములును, జపములును, మనుష్యుని ముదిమియు, మరణమును బోఁగొట్టి రక్షింపఁజాలవు. మహాసముద్రమందుఁ గట్టెయుఁగట్టెయు నెట్లుచేరునో, చేరినపిదప నెట్లుపాసిపోవునో, యట్లెప్రాణులకూడుటయుఁ బాయుటయునుండును. ఇంపయిన గీతములతోను వాద్యములతోను బూవ్వుబోండ్లసంగడిని నుపచరింపఁబడు ధనికులయందును, ఏదిక్కునులేక యొకరిపిండమున నెప్పుడును గడుపుబ్రోచికొనుచుండు బీదలయందును, గాలమొకవిధముగా నడచుకొనుచున్నది. ఈసంసారములందు నింతవఱకువేనవేలు తల్లులును, దండ్రులును, వందలకొలఁది పుత్రులును,

బెండ్లములును ననుభవించియైనది. వాస్తవమునకు వారెవ్వరి వారు ? మన మెవ్వరివారము ? మనుష్యున కెవ్వరును సొంతము గారు. వాఁడు నెవ్వరికిని సొంతముగాఁడు. (మనుష్యున కెవ్వఁడును సతముగాఁడు. వాఁడు నెవ్వరికిని సతముగాఁడు) పెండ్లము బందుగులు చెలికాండ్రు ననుఁ వీరితోడి కూడిక, దారిలో (సత్రములు చలిపందిరి మొదలగువానియందుఁ) గూడు కూడికవంటిదే యగును. మనుష్యుఁడు 'ఎక్కడ నున్నాను ? ఎక్కడికిఁబోయెదను ? నే నెవ్వఁడు ? ఇక్కడి కేల వచ్చితిని ? దేనినిగూర్చి యెందులకుఁగాను శోకించెదను' అని యాలోచించి మనసును గుదురుపఱుచుకొనవలయును. సంసారము చక్రమువలెఁ దిరుగుచుండునది. అందుఁ బ్రియులయిన వారితోఁగూడి మూడియునికి సతముగాదు. కాఁబట్టితోఁబుట్టువు, తల్లి,తండ్రి చెలి,వీరందఱును దారిలోఁ గూడిన కూడికలే. కాన బంధులమరణమును గూర్చి దుఃఖింపరాదు. పరలోకమో కన్నులకెదుటఁ జూచునట్టిదిగాదు. అందు సుఖం బుండఁగోరు వారు శాస్త్రములను గడవక నమ్మికగలిగియుండవలయు నని తెలిసినవారు చెప్పెదరు. తెలిసినవాఁడు పితరులకును దేవతలకును వలయు కర్మములను జేయవలయును. మఱియుం గల ధర్మకార్యములను యాగములను ధర్మార్థకామములను విధ్యుక్తముగా నాచరింపవలయును. ఈ జగము ముదిమి జావు ననెడు పెనుమొసళ్లుగలిగి మిక్కిలి లోఁతయిన కాలసముద్రమందు మునుఁగుచున్నదని కట్టా ! యెవ్వఁడును దెలియకున్నాఁడు. ఆయుర్వేదము నభ్యసించుచున్న వారయ్యును వైద్యులుపెక్కండ్రు తామేకాక తమకుటుంబమువారితోఁ గూడ

రోగములందుఁ గష్టపడుచుఁ జూపట్టుచున్నారు. వారు పలువిధ ములయిన కషాయములను నేతులను ద్రాగియు, సముద్రము చెలియలికట్టను గడవలేనట్లు, మృత్యువును గడవలేకున్నారు. తెవులును ముదిమిని బోఁగొట్టి యాయువును నిలుపునట్టి రసా యనమును దెలిసి దానిని మోతాదుచొప్పున నుపయోగించి నను, నేనుఁగులు తమకంపు మేటియేనుఁగులచేతఁ గొట్టువడు నట్లు, ముదిమిచేఁ గొట్టువడుచున్నారు. అట్లే వేదాధ్యయన మందునిరతులయ్యుఁ, దపస్సుచేసియు, దానములను యజ్ఞములు నుం గావించియు, జరామరణములను దాఁటినారుగారు. పగ ళ్లును మాసములును సంవత్సరములు నెప్పుడు విరమింపవు. పుట్టుకనొందిన ప్రాణులకన్నిటికిని మరలఁ గూడిక కలుగుననుట లేదు. (పుట్టిన ప్రాణులకన్నిటికిని పోయిన సంవత్సరములును నెలలును పగళ్లును మరలిరావు. కూడికలును మరలఁగలుగవు.) ఇ ట్లునికి నిలుకడ లేనిమనుష్యుఁడు విరివియై తప్పక కలుగు నట్టి (సంసార) మార్గమును వెల్లువచేత నీడ్వఁబడినవాఁడుం బోలె నవశుండై కాలముచేతఁ బొందుచున్నాఁడు. ఆ మార్గమును సకలమయిన ప్రాణులును బొందునట్టిది. దేహము జీవునినుండి కలిగినదో, లేక జీవుఁడు దేహమునుండి కలిగెనో యేది యెట్లయినను బెండ్లములతోను బంధువులతోను గూడిక దారియందలి కూడికవంటిదే యగును. ఒకటి మఱిదేనితోఁ గాని యెన్నఁటికిని వీడనికూటమి నెప్పుడును బడయఁజాలదు. తన శరీరముతోనయిన నట్టికూడికఁ బడయనేరదనఁగా మఱొ క్కదానితోఁ జెప్పనేల? రాజా! ఇపుడు నీ తండ్రియెక్కడ? నీ తాత లెక్కడ? నీ వివుడు వారిని జూడవు. వారును నిన్నుఁ

జూడరు. స్వర్గమును, నరకమును, గన్నారఁజూచినవాఁడు లేఁడు. ఈవిషయమై యీ స్త్రీకులకు వేదమేకన్ను;నీ వాకన్నుచూపిన ట్లాచరింపుము. ఒకఁడు పితరులయు దేవతలయు మనుష్యులయు ఋణములు దీర్చుకొనుటకు నసూయమాలి బ్రహ్మచర్యవ్రతము నాచరించి పుత్రులంగని యాగములను జేయవలయును. మొదట బ్రహ్మచారిగానుండి భిక్షమొదలగు ధర్మములనడపి పిదప మనస్సునందలి కష్టములనుదొలఁగించి యాగములును జరిపి పుత్రులనుగని యిహమును బరలోకమును ననుభవించుటకై బరమాత్మను నారాధింపవలయును. తనకు విహితములయిన ద్రవ్యములను మాత్రముగయికొనుచు,స్వధర్మమును జక్కఁగా నాచరించి, రాజ్యమును వృద్ధినొందించు రాజుకీర్తి చరాచరములయిన సకలజగత్తులందును మీఁదు మిక్కిలివెరుఁగును'అనెను. ఇట్లశ్మని హేతుసంపన్నము లయినవాక్యములను గడవఱకు విని విదేహరా జగుజనకుండు బుద్ధితెల్విగొంద శోక ముడిగి యశ్మని వీడుకొని తనగృహమునకుఁ బోయెను. ధర్మరాజా! నీ విం(దునకు సాటియగువాఁడవు గదే! నీవు నిష్ఫ డాచొప్పు ననే శోకమును విడిచి లెమ్ము. సంతోషమునొందుము. కృత్రియధర్మముచొప్పున నీవు జయించి యున్నయీభూమిని బరిపాలింపుము. దీని నవమానింపకుము" అనెను. ఇది యిరువది యేడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

నారదుఁడు సృంజయునకుఁ జెప్పిన పోడశరాజ చరిత్రమును గృష్ణుఁడు ధర్మరాజునకుఁ జెప్పుట.

ధర్మరాజేమియుఁ బలుకకుండుటనుజూచి యర్జునుఁడు హృషీకేశుం డగుకృష్ణునిఁజూచి 'మాధవా! పరంతపుఁడగుధర్మపుత్రుఁడు,జ్ఞాతిశోకముచేఁ బరితపించుచు దుఃఖసముద్రమందు మునిఁగియున్నాఁడు. ఇతని నూఱడింపుము. జనార్దనా! మరల మేమందఱమును విపత్తును సంశయింపవలసినస్థితికి వచ్చితిమి. నీవు మహాప్రజ్ఞుండవు.ఇతనిశోకమును దుదముట్టఁ బోకార్పఁదగుదువు' అనెను.ఇట్లర్జునుఁడు చెప్పినది విని పుండరీకాక్షుఁడు కృష్ణుఁడు రాజువంకఁ దిరిగెను. ధర్మరాజునకుఁ గృష్ణు నతిక్రమించి నడువరాదు గదా! ఏలనఁగా-బాల్యమునుండి కృష్ణుఁడు ధర్మరాజునకు నర్జునునికంటె నెక్కుడుప్రియుఁడై యుండెను. కృష్ణుఁడు చందనపుఁబూతగలిగి తాతికంబమువలె డంబుగులుకు ధర్మరాజుచేతిని దననిడుదచేతఁ బట్టుకొని వినువారలకెల్ల వేడుకపుట్ట నిట్లనియె. అపుడు మురువయినపలువరుసయు సొగసయిన కన్నులగవయుఁ జెన్నారు నతనినెమ్మొగము సూర్యుఁడుదయింపఁగా విరిసిన తామరపూవువలె మిక్కిలియుఁ దేటగాఁ బ్రకాశించెను. అతఁడు ధర్మరాజుతో 'పురుషసింహమా! శోకము వలదు; దీనివలన నీయవయములు వాడుచున్నవి. ఈయుద్ధము మొనను హతులయినవారు మరల నీకెంతమాత్రము దొరకుటయరిదిచుమీ! కలయందుఁ గన్నలాభములు మేలుకొనఁగాఁ బొల్లయినట్లె మహాయుద్ధమందు గతించినరాజులు మరలవచ్చుట

వట్టిదినుమీ ! యుద్ధమందుఁ జెలువుగులుకు చుండినయాశూరు లందఱును నెదురొక్కని నిలిచి నిహతులయి రేకాని వారియం డొక్కఁడేనియు వెనుకప్రక్కఁగానిపరుగెత్తిపోపుచుండఁగఁగాని కూల్పఁబడినవాఁడుగాఁడు. ఇట్లు వీరలందఱును మహాయుద్ధమం దు వీరులవలెఁ బోరాడి ప్రాణములువిడిచి యాయుధములదెబ్బ లచేఁ బవిత్రులై దేవలోకమునొందిరి. అట్టివారినిగుఱించి నీవు శోకించుట న్యాయముగాదు.క్షత్రధర్మపరాయణులై వేదవేదాం గపారంగతు లైనయాశూరులు వీరులు పొందుపుణ్యగతిని బొందిరి.మహానుభావులయినరాజు లిట్లు మృతులయినది విని నీవు శోకించుట యెంతమాత్రము దగదు. ఈ విషయమై పుత్రశోక మున నాఱటపడుచున్న సృంజయునకు నారదుఁడు చెప్పిన యీ పురాతనమయిన యితిహాసము నుదాహరించుచున్నారు.

నారదుఁడు'సృంజయా! నేనును నీవును మఱితక్కినప్రజలును సుఖదుఃఖములనుండి విడివడకయే మృతినొందఁగలరు. అం దులకు వగవనేల. తొల్లి యుండినరాజులమహత్త్వమును జెప్పె దను. కొంచె మాలించి వినుము. రాజా ! మృతులయిన మహా నుభావు లగురాజులను విన్నమాత్రమున నీదుఃఖము వీడిపోవును. తాపము నుడుపుము. నేను జెప్పునది విస్తరించి వినుము. పూర్వ లయినరాజులచరిత్ర ముదారమును మనోహరమునై గ్రహములక్రూరత నుడిపి యాయువును వర్ధిల్లఁజేయునది; ఉత్తమమయినది. సృంజయా! అవిక్షిత్తుకుమారుఁడయిన మరు త్తుఁడు మృతుఁడగుట వినుచున్నారము. మహాత్ముఁడయినయ తనియాగమందు నింద్రుఁడు వరుణుఁడు బృహస్పతి మొదలయిన దేవతలును సృష్టికర్తలును బ్రత్యక్షముగా వచ్చిరి. అతఁడు

తాను జేసినయాగములచేత దేవరా జయినయింద్రుని నసూ
యపడునట్లు గావించెను. ఇంద్రుని ప్రియమునుగోరి విద్వాం
సుఁడగు బృహస్పతి యతనియొద్దకుఁబోయి 'ఇఁక యాగముచే
యవల' దని యాజ్ఞాపించెను. అట్లయ్యును, నతనితమ్ముఁడయిన
సంవర్తుఁ డనుఋషి యాదేవగురుని యిష్టమొనఁగూడకుండు
నట్లు లా రాజునకు యాగముచేయించెను. మరుత్తుఁడు రాజయి
భూమిని బాలించుచున్న కాలమందు, నేల దున్నుట మొదలగు
పనులులేకయే పంట లవ్వారిగా నెల్లయెడలఁబండి వెలుంగు
చుండెను. ఆమహోత్తుఁడు చేసినసత్రయాగమందు విశ్వేదేవతలు
సదస్యులుగాను, మరుత్తులు సోమపానముచేయుఋత్విజులుగాను,
సాధ్యులును దక్కినదేవతలును బరిచారకులుగాను, నుండిరి.
అతఁ డొసంగిన దక్షిణలు దేవతలకును మనుష్యులకును గంధ
ర్వులకును మిక్కుటముగా నుండెను. సృంజయా ! నీకంకెను
నీపుత్త్రునికంకెను, ధర్మము, జ్ఞానము, ఐశ్వర్యము, వైరాగ్యము
ననెడియీనాలుగింట మిక్కిలి యతిశయించిన యాపుణ్యా
త్ముఁడు మరుత్తుఁడే మృతుఁడయ్యెనేని నీపుత్త్రుఁడట్లయినందులకుఁ
బరితపింపకుము. వితథుని పుత్త్రుఁడయిన సుహోత్త్రుఁడును గాల
గతినొందెనని వినుచున్నారము. అతఁడు రాజుగానుండు కాల
మున నింద్రుఁ డాతని ప్రియమునకుఁగాను నొక సంవత్సరము
బంగారువాన గురియించెను. భూమి యతనికాలమున వసుమతి
యనుపేరు సార్థకముగాఁ గలదియాయెను. నదులందు బంగారు
నీరు ప్రవహించెను. లోకపూజితుఁడయిన యింద్రుఁడు నదు
లందు చేప, ఎండ్రి, తాఁబేలు, మొసలి, తిమింగిలములను వీనిని
బంగారుమయము లయినవానిని గావించెను. బంగారుమయము

లయి వేలకొలఁదిగా నున్నవానినిజూచి సుహోత్రుఁడు విస్మయ మొందెను. ఇట్లువ్వారిగా నిండినబంగారము నతఁడు కురుక్షేత్ర మున విస్తరించి గావించిన యాగమందు బ్రాహ్మణుల కొసఁగెను. సృంజయా! నీకంటెను నీపుత్రునకంటెను ధర్మాదులు నాలుగింట మిక్కిలి యతిశయించిన మహాపుణ్యుండా సుహోత్రుఁడు మరణమొందెను. శ్వేతపుత్రా! ఏయొక యాగమును దక్షిణయులేని నీదుపుత్రుఁడు మృతుఁడయినందులకుఁ గుంద కుము. శోకమువలదు; సయింపుము. సృంజయా! అంగదేశపు రాజు బృహద్రథుండనెడివాఁడు మృతుఁడయినట్లు వినుచున్నా రము. అతఁడు తెల్లనివన్నెగల పదిలక్షలగుఱ్ఱములను, బంగారు భూషణములచే నలంకృత లయినపదిలక్షలకన్యలను దానము చేసెను. విస్తరించి దానముచేసిన యాగమందు పద్మమాలికలు దాల్చిన పదిలక్షలయేనుంగులను, బంగారుసొమ్ములుగలవై వేయియాపుల ననుచరించు కోటియెద్దులను, నతఁడు దక్షి ణగానొసంగెను. విష్ణుపద మనుపర్వతమందు నతఁడుచేసిన యాగమున సోమపానముచేసి యింద్రుఁడు మత్తునొందెను. దక్షిణలచేత బ్రాహ్మణులు నలరిరి. వందలకొలఁది నతఁడు చేసిన యాగములందు దేవతలకును గంధర్వులకును మనుష్యుల కును దక్షిణలు మిక్కిలి యెక్కుడయ్యెను. * సోమసంస్థలను నేడుయాగములందు నా యంగరాజొసంగిన దక్షిణవలె దక్షిణ నిచ్చు మనుష్యుఁడు నింతకుముందును లేఁడు, ఇఁకమీఁదను గలుగఁడు. ధర్మాదులు నాలుగింట నిన్నును నీపుత్రుని మిక్కిలి

* అగ్నిష్టోమము, అత్యగ్నిష్టోమము, ఉక్థ్యము, షోడశి, అతిరాత్రము, వాజపేయము, ఆప్తోర్యామమని యాగములేడు.

యతిశయించిన పుణ్యాత్ముఁ డాయంగరాజే మృతినొందెను. నీ పుత్రుఁడు పోయినందులకు వగవవలదు. సృంజయా! ఉశీనరుని పుత్రుఁడయిన శిబియను రాజు మరణించుటను వినుచున్నారము. అతఁ డీభూమినంతయుఁ దోలువలెఁ జుట్టగాఁ జుట్టెను; గంభీర మయిన తస రథధ్వనిచేత భూమి ధ్వనించునట్లు చేసెను. జయ ప్రదం బగునొకరథమునం దారూఢుఁడై భూమిని దనయేక చ్ఛత్రమునకు లోనుగావించెను. ఆశిబి, యడవియందున్న గోవు లతోఁగూడఁ దనకుఁ గలగోవులు గుఱ్ఱములు నన్నిటిని యాగ మందు దానముచేసెను. 'సమ స్త రాజులందును, నింద్రసమాన పరాక్రముం డయిన యాయుశీనరుపుత్రుఁడగు శిబియను రాజర్షి కంటె వేఱొకరాజు నతని భారము వహింపఁ గలిగినది లేదు; ఇఁక గలుగఁబోవుటయు లేదు' అని బ్రహ్మదేవుఁడును దలం చెను. నీకంటెను నీదు పుత్రునకంటెను ధర్మాదులు నాలుగింట మిక్కిలియు నతిశయించిన యామహాపుణ్యుఁడు శిబిరాజే మర ణించెను. ఒకదక్షిణయు నొకయాగమును లేని నీదుపుత్రుఁడు మృతినొందినది తలఁచి నీవు శోకముపడవలదు; తపింపనువలదు. సృంజయా! దుష్యంతునకు శకుంతలయందుఁ బుట్టినవాఁడును మహాత్ముఁడును ధనసంచయముల మిక్కిలియుఁ గలవాఁడును నగుభరతుఁడును గాలమునొందెనని వినుచున్నారము. అధిక పరాక్రమశాలియైన యాభరతుఁడు మున్నుదేవతలను గుఱించి యమునా నదితీరమందు మున్నూఱును సరస్వతితీరమందు నిరు వదియు, గంగగట్టునందుఁ బదునాలుగును, దక్కినచోట్లయందుఁ బెక్కులునుగా వేయి యశ్వమేధములును నూఱు రాజసూయ ములును గావించెను. మనుష్య లోకసమును జేతులచేతఁ బిడికి

లింపఁజాలనట్లు, సకలరాజులు నాశ్చర్యంబగు భరతునికార్యమును ననుసరింప శక్తులుగారు. అతఁడు యూగవేదికలను విస్తరించి వైచి వేయింటికి నెక్కుడు గుఱ్ఱములను గట్టెను. ఆ యూగ శాలయందు భరతుఁడు కణ్వునికిఁగాను వేయి పద్మముల (నూఱుకోట్ల) సంఖ్య గలగోవుల నొసంగెను. నీకంటెను నీ పుత్రునకంటెను ధర్మాదులు నాలుగింట నెంతయో యతిశ యించిన యీమహాపుణ్యుఁడు భరతుఁడే మృతినొందెను. నీ పుత్రుఁడు మరణించినందులకుఁ దాపము నొందకుము. సృంజ యా ! దశరథకుమారుఁ డయినరాముఁడు మరణించెనని వినుచున్నారము. అతఁ డెప్పుడును బ్రాణులయం దౌరసపుత్రుఁడుఁ బోలెఁ బ్రీతినెఱపుచు వచ్చెను. అతని దేశమందు ధనములేని వాఁడును, గష్టపడువాఁడును గలుగఁడు. రాముఁ డందఱకును దండ్రివలెనుండి రాజ్యము నేలుచువచ్చెను. అతఁ డేలుచుండు నపుడు కాలముతో వానగురిసి పంటలువర్ధిల్లి యెప్పుడును సుభి క్షముగానే యుండెను. రాముఁడు రాజ్యపాలనము చేయు కాలమందు, ప్రాణులకు జలమందు మునిఁగిపోవుట, అగ్నిచేతఁ గాలుట, దుష్టమృగములవలన నుపద్రవము గలుగుట మొద లయిన క్లేశములుగవు. స్త్రీలును, బురుషులు నేవ్యాధియులేక వలయుసిద్ధులం బడసి వేయేండ్లు సుఖం బుండిరి. ఒండొరులకు వివాదమనునది స్త్రీలయందును గలుగదనఁగా నికఁ బురుషుల యందెక్కడిది ? ప్రజ లేభయమునులేక యిచ్చచొప్పున సంచ రించుచు వలయుసిద్ధుల నొంది సంతోషముఁబడసి యథార్థ మయిన నియమముతో నెప్పుడును ధర్మము లాచరించుచు నుండిరి. అతని రాజ్యమందు వృక్షములన్నియు నాటంకములేక

యేకాలమందును బూవులును బండ్లునునిండి పొదలుచుండెను. గోవులన్నియుఁదూమెడుపాలుపిదుకుచుండెను.మహాతపస్వియగు నారాయుఁడు పదునాలుగేండ్లు వనవాసముచేసి పిదప నేయడ్డియు లేక నందఱును గొనియాడునట్టి యశ్వమేధములు పదిగావించెను. సుందరమయిన నెమ్మొగమును, నెఱ్ఱనిగన్నులును, సింగమువంటి వెడందపుఱొమ్మును,జానుపులవఱకువ్రేలుబలువయిన బాహువులును యూఁపతియైన యేనుంగువలె నల్లనిరూపును, యౌవనప్రాయ మును గలరామాఁడు పదునొకొండువేల సంవత్సరము లయోధ్యకు నధిపతిగానుండి రాజ్య మేలుచువచ్చెను. నిన్ను నీదుపుత్రుని ధర్మాదులు నాలుగింట మిక్కిలియు మించినట్టి యాబలుపుణ్యుఁ డు రామాఁడే మృతిఁజొందెను. ఒక్కయాగమును దక్షిణయులేని నీపుత్రుఁడు మృతుఁడయినందులకుఁ బరితపింపవలదు. సృంజయా! భగీరథుండను రాజు మృతుఁడయ్యెనని వినుచున్నారము. విస్త రించి యతఁడు చేసినయాగమందు దేవతలకు రాజయిన యిం ద్రుఁడు సోమరసమును బానముచేసి మదమెచ్చి తనబాహుబల ముచే పెక్కువేల యసురులను జయించెను. ఆ భగీరథుఁడు బంగారుసొమ్ములు దాల్చిన పదివేలకన్యలను దనయాగమందు దక్షిణగానొసంగెను. దానముచేసిన యొక్కొక్క కన్నియకును నాలుగేసి గుఱ్ఱములు పూన్చిన యొక్కొక్క రథమును, ఒక్కొ క్కరథమునకు బంగారు సొమ్ములుదాల్చి వెంటవచ్చు నూఱేసి యేనుంగులును, ఒక్కొక్క యేనుఁగునకుఁ బిఱుఁదవేయేసి గుఱ్ఱ ములును, ఒక్కొక్క గుఱ్ఱమునకుఁ బిఱుఁద వేయిగోవులును, ఒక్కొక్కగోవునకుఁబిఱుఁద వేయిమేకలునుగాదానముచేసెను. వానియొడియందు మున్ను రహస్యముగావసించు భాగీరథియను

గంగ,బిడ్డవలెఁగూర్చుండియుండెను.అతనితొడమీఁదఁ గూర్చుండిన కారణమున గంగ యూర్వశియను పేరుగలదయ్యెఁ. ముల్లోకములను భావనముచేయు గంగయు బహుదక్షిణలతో యాగములుచేయు భగీరథరాజునకుఁ గూఁతురయ్యెను. సృంజయా! నీకంకెను నీపుత్త్రునికంకెను ధర్మము మొదలయిన నాలుగింటమిక్కిలి యతిశయించిన మహాపుణ్యుఁడా భగీరథుండును మరణమునొందెను నీవు పుత్త్రునిగుఱించి పరితాప పడవలదు. సృంజయా! మహాత్ముండు దిలీపుండనురాజును మరణించెనని వినుచున్నారము. అతని కృత్యములను బ్రాహ్మణులు మిక్కిలి గొప్పనిగాఁ జెప్పెదరు. అతఁడు దానముచేసిన పెనుయాగమందు ధనముల నిండారియున్న యీపుడమిని సంతోషముతోడ బ్రాహ్మణులకు దానముచేసెను. అతఁడుచేసిన యాగములం దొక్కొక్కయుపాధ్యాయుఁడు బంగారముతోఁ జేయఁబడిన వేయివేనుంగులను దక్షిణగాఁబడసెను. అతఁడుచేసిన యాగమందుఁ గల పెద్దయూప మపరంజిచేత రచింపఁబడినదై యెంతయు జ్వలించుచుండెను. ఇంద్రుఁడు మొదలయిన దేవత లతనికి వలయు కార్యములుచేయుచు నతనినారాధించిరి. బంగారుతోఁ జేయఁబడిన యాయూపము మీఁదనున్న చషాలమను నపరంజి స్థూపియందు నాఱువేల దేవతలును, గంధర్వులును నటనముచేసిరి. దానినడుమ విశ్వావసువను గంధర్వుఁడు తానేనప్త స్వరములతోడ వీణాగానముచేసెను. సకలప్రాణులు నతఁడు చేయు వీణాగానము 'నాకు' అని తలంచినవి. దిలీప మహారాజుగావించిన యీకార్యమును నడపంజాలు రాజులెన్నఁడు నుండినదేలేదు. బంగారుకవచములుగల యతనిగజములు మద

ముగొని దారియందుఁ బండియుండెను.సత్యవాదియు గొప్పవిలు కాఁడును మహాత్ముండునయిన దిలీపమహారాజును దర్శనముచేసి నమనుష్యులను స్వర్గలోకమును జయించిరి. దిలీపుని నగరు నందు వేదశబ్దమును విలుశబ్దమును 'ఇమ్ము' అనుశబ్దమును తఱిఁ గినకాలములేదు. సృంజయా! నిన్నును నీపుత్రునిని ధర్మాదులు నాలుగింట నెంతయునెచ్చియుండిన యాపుణ్యాత్ముఁడు దిలీపుఁడే మృతుఁడయ్యెను. నీపుత్రునిఁ దలంచుకొని తాపపడకుము. సృంజయా! యువనాశ్వనిపుత్రుఁడయిన మాంధాతయు మరణ మందెనని వినుచున్నారము. అతఁడు మహాత్ముఁడయిన యువనా శ్వని యుదరమున పృషదాజ్యమునుండి యుదయించి వృద్ధినొంది నవాఁడు; కాంతిమంతుఁడు;ముల్లోకములను జయింపఁదగువాఁడు నగురాజు. గర్భరూపముననుండిన యతనిని మరుత్తు లనుదేవతలు తండ్రిపార్శ్వమునుండి వెలువరించిరి. దేవరూపుండయిన యాబి డ్డఁడు తండ్రియగు యువనాశ్వని యొడియందుఁ బరుండఁగాఁ జూచి దేవతలీనిను వెవరియొద్ద బాలుగుడుచునని యొకరితోనొ కరు మాటాడికొనుచుండఁగా నింద్రుఁడు 'నావలనఁగుడుచును' అను నర్థముగల 'మాంధాత' యనుమాట చెప్పుచువచ్చెను. అది కారణంబుగా నాబిడ్డనికి మాంధాతయనుపేరు కలిగెను. పిదప మహాత్ముండయినయాబాలకునిఁజూపింపఁగోరి యింద్రుఁడు వానినోరఁ దనచేయిడఁగా నదిపాలుచేఁపెను. అట్లింద్రుని చేతిని గుడుచుచుండఁగా నాబిడ్డనిమేను నాఁటికి నూఱుపలములచొ ప్పునఁ బెరిఁగి పండ్రెండుదినములకు పండ్రెండేండ్లు వయసుగల వాఁడయ్యెను. ధర్మాత్ముఁడగుమహాత్ముండును శూరుండును నింద్రసమానుఁడయిననామాంధాతకు భూమియంతయు

నొక్కనాఁటిలో వశమయ్యెను. అతఁడు యుద్ధమున నంగారుని మరుత్తుని అసితుని గయుని నంగరాజగు బృహద్రథుని జయించెను. మాంధాత యంగారరాజుతో మార్కొని పోరాడునపు డతనివింటిధ్వనిచే దేవలోకము పెటిలినదని దేవతలు తలఁచిరి. సూర్యుని యుదయాస్తమయములకు లోనయిన భూతల మంతయు మాంధాతక్షేత్రముగా చెప్పంబడుచున్నది. రాజా! మాంధాత వందలకొలఁది నశ్వమేధములను రాజసూయము లను జేసి వానియందు బ్రాహ్మణులకు నొకయోజనముపొడవును బదియోజనముల నిడివియుఁగాఁ బ్రోగయిన బంగారుమయము లగు రోహితమత్స్యములను దానముచేసెను. * ఆయాగమందు బ్రాహ్మణుల కిచ్చి యధికముగానుండిన ధనములనుఁ దక్కిన జనులు తాము పంచుకొనిరి. సృంజయా! నీకంటెను నీపుత్రుని కంటెను ధర్మాదులు నాలుగింటను మిక్కిలి యతిశయించిన మహాపుణ్యుఁడయినయీమాంధాతయో మరణము నొందెను. నీపుత్రునికై పరితపింపవలదు. సృంజయా! నహుషునిపుత్రుఁడయిన యయాతి మరణించెనని వినుచున్నారము. అతఁడు సముద్రముతోఁ గూడ నీపుడమినంతయు జయించి శమ్య (బలుపయినదుడ్డుకఱ్ఱ) విసరివైవఁగాఁ బోయి పడునంతదూర మున కొకొక్కటిగా వేదికల భూమి నలంకరించి వెక్కులు మేటిజన్నములు చేసి యీభూమినంతయు విడిచి సముద్రతీర మునుబొందెను. నూఱు వాజపేయములును దక్కిన యాగ

---

*"అతిరిక్తాన్ ద్విజాతిభ్యో వ్యభజం స్త్వితరే జనాః' అని మూలము. ఇందులకు 'ఎక్కువగా మిగిలిన ధనములను దక్కినజనులు బ్రాహ్మణులకు నిచ్చిరి.' అని యర్థాంతరము. ఇది సమంజసముగాదు.

ములు వేయింటిని గావించి యయాతి మూఁడుబంగారుకొండల చేత బ్రాహ్మణో త్తములకుఁ దృప్తిగావించెను. ఆయయాతి భూమియందుఁ గలదైత్యులను దానవులను నసురయుద్ధమునుబన్ని వధించి భూమినంతయుఁ గయికొని కొడుకులకుఁ బంచువాఁడై యదువు ద్రుహ్యుఁడు మొదలయిన కుమారులను రాజ్యము చివరలం దునిచి పూరుని రాజ్యమున కభిషిక్తునిఁజేసి భార్యా సహితముగా వనమును బ్రవేశించెను. సృంజయా! నిన్నును నీపుత్త్రునిని ధర్మాదులు నాలుగింట నతిశయించినయా మహాపుణ్యుఁడు యయాతియే మరణమునొందెను. నీ పుత్త్రునిగుఱించి పరితపింపవలదు. సృంజయా! నాభాగునిపుత్త్రుఁ డయినయంబరీషుఁడును మృతుఁ డయ్యెనని వినుచున్నారము. జనులు పుణ్యాత్ముఁ డయినయా రాజశ్రేష్ఠుని గఱకునిఁగా వరించిరి. అతఁడు తాను విస్తరించి చేసినయాగమందు యాగముచేయించుబ్రాహ్మణులకు, వేయియాగముల నొక్కొక్కఁడును జేసినట్టి రాజులను బదిలక్షలమందిని బరిచర్యలుచేయ నియోగించెను. ప్రాజ్ఞులు 'ఇట్లుచేసినవా రింతకుమునుపును లేరు. ఇఁకమీఁదను లేరు' అని యంబరీషుని మిక్కిలి కొనియాడిరి. అతనియాగమందు బ్రాహ్మణులకూడిగముచేసిన రాజులందఱును నశ్వమేధయాగములుచేసినవారుంబోలె (నంబరీషునిమహత్త్వముచేత) నుత్తరాయణమను దేవయానమార్గమునఁబోయి హిరణ్యగర్భలోకమును బొందిరి. సృంజయా! ధర్మాదులు నాలుగింట నీకంటెను నెక్కుడై నీపుత్త్రునికంటెఁ బుణ్యుఁ డయినయా యంబరీషుఁడే కాలగతిఁజెందెను. నీపుత్త్రునిగుఱించి శోకింపకుము. సృంజయా! చిత్రరథుని పుత్త్రుఁ డయినశశిబిందుఁ డనురాజును మృతుఁ డయ్యెనని

వినుచున్నారము. అమ్మహాత్మునకు లక్షమంది భార్యలుండిరి. వారలయం దతనికిఁ బదిలక్షలకుమారులు గలిగిరి. ఆపుత్త్రులొ కొక్కరును బంగారుకవచములు దాల్చినమేటి విలుకాండ్రు రయియుండిరి. ఒకొక్కపుత్త్రునకును వేఱువేఱ నూఱేసికన్నియలును నొకొక్కకన్నియకు నూఱేసియేనుఁగులును, నొకొక్కయేనుఁగునకు నూఱేసితేరులును, నొకొక్కతేరికిని బంగారుసామ్ములు దాల్చినమేటిగుఱ్ఱములు నూఱేసియు, నొకొక్కగుఱ్ఱమునకును నూఱేసిపశువులును నొకొక్కపశువునకును నూఱేసిమేఁకలును గొఱియలునుండెను. ఇట్లు తుదిలేక సాంపారు చున్నయీమహాధనము నతఁడశ్వమేధయాగమందు బ్రాహ్మణుల కొసంగెను. సృంజయా ! నీకంటె ధర్మాదులు నాలుగింట నెక్కుఁడై నీపుత్త్రునికంటెఁ బుణ్యాత్ముఁడయిన యాశశిబిందుఁడే మృతినొందెను. నీపుత్త్రునిగుఱించి తాపపడకుము. సృంజయా ! * అధూర్తరజనుని పుత్త్రుఁడయినగయుఁడును మరణమునొందెనని వినుచున్నారము. ఆరాజు హోమము చేసి మిగిలినదానిని నూఱుసంవత్సరములు భుజించుచుండెను. అగ్ని తానే యతనికి వరమొసంగఁగోరి వచ్చెను. రాజయగ్నిని 'నే నెంతదానము చేసినను నాధనము తఱుఁగకుండవలయును. నాకు ధర్మమందు శ్రద్ధ వర్ధిల్లవలయును. అగ్నిదేవా ! నీప్రసాదమువలన నామనసు సత్యమందే రమింపవలయును.' అని యీవరములనడిగెను. అగ్నిదేవుఁడు నతనియిచ్చుచొప్పున నావరములనెల్ల నిచ్చెనని మాకు వినికిగలదు. అతఁడు దర్శపూర్ణమాసము, చాతుర్మాస్యము, అశ్వమేధము ననెడియాగము

* 'గయం చామూర్తరయసమ్' అని యుత్తరాపాఠము.

లు పెక్కువేల సంవత్సరములు చేయుచుండెను. లక్షగోవులను బదివేలగుట్టములను వేయేండ్లవఱకు మరలమరల నిచ్చుచుండెను. పురుషసత్తమా ! అతఁడు సోమయాగముచేత దేవతలను, ధనములచేత బ్రాహ్మణులను, శ్రాద్ధములచేతఁ బితరులను, గామములచేతఁ దన యిల్లాండ్రను దృప్తినొందించెను. అశ్వమేధమహాయజ్ఞమందు నేఁబదిమూరల వెడలుపును నూఱుమూరల నిడివియుఁ గలబంగారునేలను గావించి దక్షిణగా నొసఁగెను. గయుఁడు గంగాతీరమందలి యిసుకలెన్నిగలవో యన్నిగోవులను దానముచేసెను. సృంజయా ! నీకంటె ధర్మాదులు నాలుగింటనెక్కుడై నీపుత్రునికంటెను బుణ్యుఁడయినయాగయుఁడే కాలగతినొందెను. నీపుత్రునికై పరితాపపడవలదు సృంజయా! సంకృతిపుత్రుఁడయినరంతిదేవుఁడును మరణించెనని వినుచున్నారము. అతఁడు గొప్పతపస్సుచేసి యింద్రు నారాధించి యతనివలన 'మాకు నన్నము మిక్కిలియునుండవలెను; మాకతిథులును దొరకవలయును. మాకు శ్రద్ధతొలంగకుండవలయును. మేమెక్కరినియాచింపకుండవలయు' నని వరములనుబడసెను. సంశితవ్రతుండును మహాత్ముండును యశస్వియు నగు రంతిదేవునికడకుఁ దమ్ము సద్వినియోగముచేయుఁగాకయని గ్రామములందును నడవులందును గలపశువులు తమంతటనే వచ్చెను. అతఁడు యాగమునం దుపయోగించిన పశువులతోలుప్రోవునుండి స్రవించుజలము చర్మణ్వతి యనుపేరు గలమహానదిగఁ బ్రసిద్ధినొందియున్నది. ఆరాజు గొప్పసభయందు బ్రాహ్మణుల కవ్వారిగా బంగారమును దానముచేసెను. *ఆకాలమందు

*'మీకు నూఱునిష్కము లిచ్చెద' నని రాజుచెప్పఁగా బ్రాహ్మణులందు

బ్రాహ్మణులు 'నీకు నూఱునిష్కములియ్యఁబోవుచున్నాఁడు.' నీకు నూఱియ్యఁబోవుచున్నాఁడు' అని చెప్పినప్పుడే యతఁడో 'మీకువేయి నిష్కము'లని చెప్పియిచ్చి బ్రాహ్మణులను సంతోషముగా రాఁబట్టెను. ఆబుద్ధిమంతునిగృహమందు వంట కయిన పాత్రములు, తక్కినబండములకుఁ గలపాత్రములును, కుండలును, పాత్రలును, కొప్పెరలును, స్థాలులును, పికరములును నేవి యేనియు బంగారముగానివి కలుగవు. అతనియింట నొకరాత్రి వేయున్నూట యిరువదిగోవులు చంపఁబడుచుండెను. అందు మెఱుఁగిడ్డరతనాలకుండలములు గలపరిచారకులు భుజించువారిని 'ఇప్పుడు తొంటివలె మాంసము లేదు. వలయునట్లు ప్రప్పమొదలగువానిని భుజింపుఁడు' అని బిగ్గఱచెప్పిరి. సృంజయా! నీకంటెను ధర్మాదులనాలుగింట నెక్కుడై నీపుత్రునికంటెఁ బుణ్యుఁడయిన యూరంతిదేవుఁడే మృతినొందినాఁడు. నీదుపుత్రుని గుఱించి పరితాపపడనవలదు. సృంజయా! మహోత్సాహుడయిన సగరుండును గతించినట్లు వినుచున్నారము. ఇక్ష్వాకుకాలమునఁ బుట్టి యమానుషపరాక్రమముపడసి పురుషులకుఁ బులియుంబోలి వెలుఁగు నా సగరుఁడు బయలువెడలునపుడతనియయువది వేవురు పుత్రులు, శరత్కాలమందు మేఘములేని యాకసమునఁ జంద్రుని నక్షత్రసమూహములు వెంబడించునట్లు వెంబడించిరి. తొల్లి యతనిప్రతాపమువలన భూమియంతయు నతనియేక చ్ఛత్రముక్రిందవెలయుచుండెను. అతఁడు దేవతలను వేయి యశ్వమేధయాగములచేతఁ దృప్తినొందించెను. తామరసపత్ర

లతొల్లక బిగ్గఱఁగా 'నీకు నూఱునిష్కములు మేమిచ్చెద'మని కూపెట్టుట యు రాజువేయి నిష్కములిచ్చెనని యర్థాంతరము.

నేత్రలగు చెలునలచేతను శయనములచేతను నిండినవై బంగారు మయము లయిన స్తంభములుగలిగిన యుప్పరిగలును మఱియుఁ దక్కుఁగల భోగ్యవస్తువులును, పాత్రము లగుబ్రాహ్మణులకు దానముచేసెను. అతని యాజ్ఞచొప్పున బ్రాహ్మణు లావిత్తమును బంచుకొనిరి. సముద్రపరివృత మయినభూమి నతఁడు కోప మునఁ ద్రవ్వించుటచేత నతనిపేర సాగర మనుపేరు సముద్రమునకుఁ గలిగినది. సృంజయా ! నీకంటె ధర్మాదులు నాలుగింట నెక్కుడై నీపుత్రునకంటెఁ బుణ్యుఁడయినయా సగరుఁడే మృత్యుఁడయ్యెను. నీ పుత్రునకై పరితాపపడవలదు. సృంజయా! వేనునిపుత్రుఁడయినపృథుఁడనురాజు మృతుఁడయ్యె ననివినుచున్నారము. మహర్షులు మహారణ్య(దండకారణ్య)మం దొక్కటిగాఁజేరి లోకములనితఁడు ప్రభనొందింపఁ గలఁడని తలఁచి పృథువనిపేరిడి వానికిఁ బట్టాభిషేకముచేసిరి. అతఁడు లోకము లను ఋతము (ఆపత్తి)నుండి కాచుటచే ఋత్రియుఁ డనియను, నతనిని జూచినప్రజలు రక్తులమయితిమని చెప్పుటచే రాజ నియు పేరొందినవాఁడయ్యెను. అతఁడు లోకము నేలుకాల మందు భూమి దున్నకయ పండెను. చెట్లయం దొకొక్కయా కునందును దేనె దొరకెను. ఆవులన్నియుఁ దూమెఁడుపాలు పిది కెను. మనుష్యులు తెవులులేకయు నేవిధమయిన భయమును లేకయు వలయుసిద్ధినిబడసి నింటను బయళ్లను విచ్చలవిడి వసిం చుచుండిరి. అతఁడు సముద్రమునఁ బోవుకాలమందు జలము గూడ తాయివలె స్తంభించియుండెను. అతనివింటిచేఁ గొండ లును జీల్చఁబడినవి. అతని ధ్వజమునకు భంగపాటు కలుగదయ్యె. అతఁ డొనర్చిన యశ్వమేధమహాయజ్ఞమందు మూఁడు మను

ష్యుల పొడవుగల బంగారు కొండల నిరువదియొకంటిని బ్రాహ్మణులకు దానముచేసెను. సృంజయా! నీకంకు ధర్మాదులు నాలుగింట నెక్కుడై నీపుత్రునికంకు బుణ్యుడయినయా పృథుడును మృతినొందెను. నీపుత్రునిగుఱించి తాపమొందకుము. సృంజయా! నీవు పలుకక యేమో యాలోచించుచున్నావు; నే నిపుడు చెప్పినమాట వినవుకాఁబోలు. దాని వినవయితివేని నేనిపుడు మొఱయిడినయీమాటలు, చావనున్నవానికి నెంతచక్కగాఁ బథ్యము ప్రయోగించినను వ్యర్థమగునట్లు, నీయందు విఫలముగావలయును' అనెను. సృంజయుఁడు 'నారదా! నీవు చెప్పినయీమాటల వినుచున్నాను. వీనియందలి యర్థము మిక్కిలి విచిత్రముగానున్నది; కాన కర్మతాత్పర్యులు గుబులుకొను పూదండవలెనిది యింపుగులుకుచున్నది; మహాత్ములును బుణ్యకర్ములును మహాకీర్తిమంతులు నయిన రాజర్షులనుగుఱించిన ముచ్చట గలదిగావున శోకమునంతయుఁ దూలించుచున్నది. మహర్షీ! నీమాటలు వ్యర్థములుగావు. నీదర్శనమునఁ నాకు శోకము వీడిపోయినది. అమృతమును నెంత ద్రావినను దనివిగలుగనట్లు నీమాటల వినఁగోరిక కలుగుచున్నదే కాని తృప్తికలుగకున్నది. నీదృష్టి యమోఘమైనదిగదా. నేనుసంతాపమునఁ బొక్కుచున్నవాఁడ. విభూ! ఇట్టినీవు నాయందనుగ్రహము చూపితివేని యిపుడు నాపుత్రుఁడు తప్పక బ్రతుకును. పుత్రునితోడి సంగమును నాకుఁ బడయఁగలుగును' అని వేఁడెను. నారదుఁడు 'నీకుఁ బర్వతుఁడొసంగిన స్వర్ణష్ఠీవి యనుపుత్రుఁడు మృతుఁడయి యిట్లుపరుండియున్నవాఁడుగదా. వీనిని మరల నీకు నిచ్చుచున్నాను. వీఁడు

బంగారు కాంతిగలిగి వేయేండ్లు బ్రతుకఁగలఁడు' అనెను. ఇది యిరువదియెనిమిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{కృష్ణుఁడు ధర్మరాజునకు నారదపర్వతోపాఖ్యా నము చెప్పుట.}

ధర్మరాజు 'అసృంజయుని కొడుకు సువర్ణష్ఠీవి యెట్లయ్యెను? పుత్రుఁడేల యాపుత్రు నొసంగెను? వాఁడేల మరణించెను? ఆకాలమున మనుష్యునియాయువు వేయేండ్లయి యుండఁగా సృంజయునికొడుకు బాల్యము నిండనిస్రాయమునఁనే చచ్చుట యెట్లు? ఆతనికి సువర్ణష్ఠీవి యనునఁడివట్టిపేరా? లేక యందులకుఁ గారణమున్నదా? ఇది తెలియఁగోరుచున్నాను' అని యడిగెను. అందులకుఁ గృష్ణుఁడు 'రాజా! ఇది జరిగినట్లు నీకుఁ జెప్పెదను. నారదుఁడు పర్వతుఁడు ననుబుషు లిరువురుగలరు. వారు లోకమున నమేయులు. నారదుఁడు మేనమామ; పర్వతుఁడతని మేనల్లుఁడు. తొల్లి వారిరువురు నుల్ల ముపల్లవింప నిందలి వరిబియ్యపుటన్నమును నేతిని భుజించి విహరింపవలయునని కోరి దేవలోకమునుండి యీలోకమునకువచ్చిరి. తపస్వులయిన యామామయు నల్లుఁడు నిరువురును మనుష్యులు దినునన్న ములను దినుచు భూమిపయి సంచరించుచుండిరి. వారిరువురు నొండొరులయెడఁ బ్రీతిగలవారుగాన నొకరికొకరు సంతోషమున 'మనలో నెవనికిఁగాని మనస్సునందు మంచిదో చెడ్డదో యేతలంపుగలిగినను నొకరి కొకరు తెలుపవలయును, లేదా,

అట్లు తెలుపనివానికి శాపముగలుగు'నని సమయముచేసికొనిరి. ఇట్లు లొడంబడికచేసికొని యాలోకపూజితు లిరువురును శ్వేతుని కొడుకయిన సృంజయుఁడనురాజుకడకుఁబోయి 'రాజా ! మే మిరువురును నీ మేలునకుఁగాను గొంతకాలము నీయొద్ద వసింపఁగోరుచున్నారము. మాకుఁగలరూపున ననుకూలుఁడవై యుండుము' అనిరి. రాజును 'వల్లె' యని వారిని సత్కరించి తానే యుపచరించెను. అంత నొకప్పుడు రాజు మహాత్ములయిన యాతపోధనులనుజూచి మిక్కిలియుఁ బ్రీతిగడలుకొన 'దేవతయుంబోలె జూపట్టుచున్న యీచిన్నది నాకొక్కతే కూఁతురు. ఈబిడ తామరయకరువులవంటి పసిమిచాయఁ దళుకొత్తుచు నేకందును లేక చూడందగి యొప్పునవయవములపొందు గలది ; మంచి శీలమును వృత్తమునుగలది. ఈకుమారిపేరు సుకుమారి. ఇది మీ యిరువురకుఁ బరిచర్యచేయఁగలదు' అనెను. ఆబుషులు 'మిక్కిలి యుత్తమ' మనిరి. అంత నారాజు నాకన్నియను 'కూఁతురా ! ఈ బ్రాహ్మణులను దేవతలవలెను దండ్రులవలెను నుపచరించుచుండవలయును' అని కట్టడచేసెను. ఆకన్యయు ధర్మమాచరించునట్టిదిగాన 'వల్లె'యని తండ్రి యానతిచొప్పున నామునివరులకు మరియాదతోడ నుపచరించుచువచ్చెను. ఆబిడ యట్లుచేయుచున్నయుపచారముచేతను దాని యెనలేని చక్కందనముచేతను మన్మథుఁడుతోడనే నారదునాక్రమించినవాఁడయ్యె.అంతనమ్మహాత్ముని మనసునందలి మరుఁడు శుక్లపక్షారంభమందలి చంద్రునివలె నాఁడునాఁటికిఁ బెరుఁగుచుండెను. ఆనారదుఁడు ధర్మవిదుండయ్యును దీర్ఘమయిన యామములును సిగ్గువలనఁ దనమేనల్లుఁడగు పర్వతునకుఁ దెలుపకపోయెను. పిదపఁ బర్వతుఁడో యింగితముల

చేతను దపశ్శక్తిచేతను నా నారదుఁడు కామార్తుఁడై యుండుటను దెలిసికొని తోడనే మిక్కిలియుఁ గుపితుఁడై యతనిని శపించువాఁడై "ఓబ్రాహ్మణా! మనస్సునందు మంచిదో చెడ్డదో యేతలంపుగలిగినను దానినంతయు మన మొకరికొకరు చెప్పి కొనవలయును" అని నాతోడ నీవు మనఃపూర్వకముగాఁ బ్రతిజ్ఞచేసి యిప్పుడు నీవే దానిని బొల్లుగావించితివి. సుకుమారియను కొమరాలియందు నీకుఁ గలమరులు నాకుఁ జెప్పవయితివి. నీవొ పెద్దవాఁడవు; బ్రహ్మచారివి; తపస్వివి; మఱి బ్రాహ్మణుఁడవు. ఇట్టివాఁడవై యుండియు మన మొండొరులు చేసికొన్నప్రతిజ్ఞనుండి జాఱినది నాకు సయింపరాకున్నది. అది కారణముగా మిక్కిలి కుపితుఁడనై నిన్నుశపించెదను. సుకుమారి నీకుఁ దప్పక భార్యకాఁగలదు; సందేహములేదు. ఆపడఁతిని బెండిలియైనది మొదలుగా నీ సాంతరూపునుబాసి వానరరూపమును బొందిజనులందఱికిను జూపట్టుదువు' అని శపించెను. నారదుఁడా శాపవాక్యమునువిని 'ఓరీ! తపము బ్రహ్మచర్యము సత్యము దమము ననునివియుండియు నిత్యధర్మ్ముఁడవయ్యు నీకు స్వర్గములేకపోవుఁగాక' యని మాఱుశపించెను. ఇట్లామును లిరువురును బరస్పర మసూయావలనఁ గ్రుద్ధులై యొకరినొకరు శపించుటమేటిగజము లొండొంటిని దలపడినట్లుండెను. మహామతియగు పర్వతుఁడు నిజతేజంబుచేత న్యాయంబుచొప్పున నెల్ల యెడలఁ బూజలందుచు, నీభూమియంతయు సంచరించుచుండెను. అంత నారదుఁడు సృంజయుని కూఁతురయిన సుకుమారిని, ఏకందును లేనిసుందరీమణిని, విధ్యుక్తముగాఁ బెండ్లాడెను. ఆకన్నియయుఁ బర్వతుని శాపముచొప్పున నారదుఁడు వివాహమంత్రములు

చెప్పితీఱఁగానే వానరమువంటి మొగము గలిగి యుండుటఁ గాంచెను. అయిన నాబిడ యతని నపు డింతమాత్ర మవమానింపక మిక్కిలియుఁ బ్రీతియే చూపుచువచ్చెను. ఆచెలువ పతియందు నెయ్యముదియ్యముగలదై యతని నుపచరించుచుండి నదేకాని మఱియొకదేవతను గాని ఋషినిఁగాని యక్షునిఁ గాని మనస్సునందుసయితము పతిగాఁ దలంపకుండెను. అంత నొకనాఁడు పర్వతుఁడువ్వరునులేని యొకయడవియందుఁ బోవుచుండఁగా నట నారదునిఁగాంచెను. తోడనే యతఁడు నారదునికడకుఁబోయి మ్రొక్కి, "ప్రభూ! నేను స్వర్గలోకమునకుఁబోవు నట్లు నీ వనుగ్రహింపవలయును' అని వేఁడెను. నారదుఁడట్లు పర్వతుఁడు దీనుండై చేతులుమోడ్చి నిలుచుండుటనుజూచి తానును మఱింత దుఃఖితుఁడై 'నాయనా! నన్ను నీవు మొదట వానకుఁ డగునట్లు శపించితివి. చానివలన నేనును గోపముగొని 'ఇది మొదలు నీకు స్వర్గమందు వాసముగలుగ' దని శపించితిని, నీవు నాకుఁ బుత్రునివంటివాఁడవగుదువు. ఇట్టి నీకిప్పనితగునే' యనెను. అంత నామునులిరువురు నొండొరుల కొసంగిన శాపములను నివర్తింపఁజేసిరి. అప్పుడు నారదుఁడు తన యెప్పటిరూపున దేవతయుంబోలెఁ గాంతివెంపు సొంపారుచుండఁగా సుకుమారిచూచి పరపురుషుఁడని శంకించి పరుగునఁ బోవఁదొడఁగెను. దానినిజూచి పర్వతుఁడు 'అమ్మా! ఇతఁడు నీ భర్తయగును. ఇందు సందేహమువలదు. పరమధర్మాత్ముండయిన భగవంతుఁడు నారదమహర్షి నీయందు మనసెప్పుడును వీడనివాఁడు. ఇందు సంశయమువలదు.' అని పలువిధములను సమాధానపెట్టెను. అమ్మహాత్ముఁడు పర్వతుఁడు చెప్పినదివిని సుకుమారి

తనపతికి నడుమవచ్చిన వానరరూపము శాపదోషమునఁ గలిగిన దని తెలిసికొని యెప్పటివలెనుండెను. అంతఁ బర్వతుఁడు స్వర్గమునకుఁబోయెను. నారదుఁడు తనగృహమునకు నరిగెను. రాజా! సమస్తమును దనుతనే కావించిన యమ్మహాత్ముఁడు నారదమహర్షి యిదిగోనున్నాఁడు. అడిగితివేని జరిగినది జరిగినట్లు చెప్పఁగలఁడు' అనెను. ఇది యిరువదితొమ్మిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

నారదుఁడు ధర్మరాజునకు సువర్ణష్ఠీవిచరిత్రము చెప్పుట.

అంత ధర్మరాజు నారదునిఁజూచి 'మహాత్మా! సువర్ణష్ఠీవి పుట్టినతెఱంగు వినఁగోరెద' ననెను. అందులకు నారదుఁడతనితో 'మహాబాహూ! శ్రీకృష్ణుఁడు చెప్పిన యిక్కథయిట్లే జరిగినది. ఇందు మిగిలినకథను నీకుఁ జెప్పెదను. నేనును నామేనల్లుఁడు పర్వతుఁడును సృంజయునియొద్ద వసించుటకుఁ బోయితిమి. అతఁడప్పుడు మమ్ము విధ్యుక్తముగాఁ బూజించి, వలయుకోర్కులనెంతయు నొడఁగూర్చుచుండఁగా నిచ్చలు నతనియింట నసించుచుంటిమి. అప్పుడు వర్షాకాలముగడచుటవలన మాకు వెడలిపోవలసివచ్చెను. ఆసమయమందుఁ బర్వతుఁడు నాతో 'మనమీరాజునింట మిక్కిలియుఁ బూజితులమై వసించుచున్నారము. కాబట్టి బదులేమిచేయవలయునో యాలోచింపుము' అనెను. నేను 'అల్లుఁడా! ఇదంతయుఁ జేయుట నీకేతగును. సృంజయుని కోరినవగమతఁడే యడుగనిమ్ము. అతఁడేదికోరునో యది పడయుఁగాక. లేక నీకిష్టముండినా మనతపశ్శక్తిచేత నతఁడు కోరిన

సిద్ధినొందుఁగాక'యంటిని. అంతఁ బర్వతుఁడు సృంజయునిఁబిలిచి 'రాజా! నీవు చక్కటితోఁజేసిన సత్కారములకుఁ బ్రీతులమయితిమి. రాజా! మేమనుజ్ఞయిచ్చితిమి. వలయువరము నాలోచించి చెప్పుము. అయిన నావరము దేవతలకుఁ గీడుగాని మనుష్యులకు నాశముగాని చేయునట్టిది గారాదు. రాజా! అట్టివరమును గయికొనుము, ఏలన నీ వట్టిపూజకుఁ దగుదువని మామతము' అనెను. సృంజయుఁడు 'మీకు నాయందుఁ సంతోషముగలదేని యంతే నాకునుజాలును. అదియే నాకుఁ బరమలాభము. నాకు మహోఫలమొడఁగూడినదే చుఁడీ' యనెను. అందులకుఁ బర్వతుఁడు 'రాజా! చిరకాలముగా నీ మనస్సునం దున్నతలంపును జెప్పెదవినుము. నీవు వీరుఁడును వీర్యనంతుఁడును దృఢవ్రతుండును దీర్ఘాయుష్మంతుండును మహాభాగ్యనంతుఁడును దేవేంద్రసమానకాంతియు నగు కొమరునిఁ బడయఁగోరుచున్నావు. నీకోరినట్లు కాఁగలదు. కాని పుట్టిన కొడుకాయుష్మంతుఁడు మాత్రము గానేరఁడు. ఏలన నింద్రునిఁ గ్రిందుపఱుచుటకై కదా నీ కిట్టితలంపు మనస్సునఁనాటియున్నది.ఆబిడ్డఁడు సువర్ణమును గ్రక్కుటచే సువర్ణష్ఠీవియని చెప్పఁబడును. దేవరాజుంబోలెఁ గాంతిదళుకొత్తు నాకుమారుని దేవరాజువలన రక్షింపవలయును' అని మరలఁజెప్పెను. సృంజయుఁడు పర్వతునితో 'మహర్షీ! ఇది యివ్విధముగాకుండవలయు' నని యతనిని వేఁడికొనుచు 'మతియు మీ యిరువురతపశ్శక్తిచే నాబిడ్డఁ డాయుష్మంతుఁడై యుండవలయును' అనెను. పర్వతుఁడింద్రునివలని పట్టుమున నాతనికేమియు బదులుచెప్పఁడయ్యె. అందులకు వగచుచున్న రాజును జూచి నేను 'మహారాజా! ఆసమయమున నన్నుఁ దలం

చుకొనుము. యమునిపాలుపడియున్నను నీ యల్లారుబిడ్డని నే కొఱఁతయులేకుండు నట్లారూపుననే మరల నీ కిచ్చెదను. నీవు దుఃఖపడకుము' అని మరలఁజెప్పితిని. ఇట్లుచెప్పి మేమిరువురును నిచ్చలు పోయితిమి. సృంజయుఁడు తన మందిరమునకుఁ బోయెను. అంత నొకప్పుడు సృంజయునకుఁ దేజంబు మిక్కిలి యు రాజిలుచుండు నొకపుత్రుఁడు పుట్టెను. ఆబిడ్డఁడు పెద్ద కొలఁకునందుఁ దామరపూవు దద్దయుఁబెరుఁగునట్లు, నానాఁటికిఁ దగునట్లు పెరుఁగుచుండెను. వాఁడు సువర్ణష్ఠీవి యనునామము సార్థకముగా సువర్ణమును విసర్జించుచుండెను. అది యీలోక మునందంతయు బెనువింతగానుండెను. ప్రాజ్ఞులయిన మూర్ఖులు సృంజయునకు నొసంగిన వరంబును దెలిసి దేవేంద్రుఁడు తనకుఁ దీర్పాటుకలుగునో యని భయపడి గురుఁడయిన బృహస్పతి మతముచొప్పున నిత్యము నాపుత్రకునకుఁ గీడుసేయ తెఱపి వెదకుచుండెను. అంత నొకప్పుడతఁడు తనయెదుట రూపొందియున్న తనదివ్యాస్త్రమగు వజ్రమునుజూచి 'వజ్రమా! పర్వత ఋషి చెప్పినట్లు సృంజయుని పుత్రుఁడు పెరిఁగి తనవీర్యముచేత నన్నుఁ గీడ్పఱుపఁగలడు. కాన నీవిపుడే పులిరూపముగొని యారాజపుత్రునిఁజంపుము' అని యాజ్ఞాపించెను. ఆవజ్రమో పగవారిపురముల గెలుచునట్టిదిగాన యింద్రుఁడు పురికొలుపఁగా నక్కుమారునిఁ దుదముట్టించుటకు నెప్పుడు కందువ నరయుచునేయుండెను. సృంజయుండు నింద్రునకుసాటియై వెలుంగు పుత్రునిఁ బడసి సంతుష్టినొంది యంతఃపురపువారితోఁగూడ నెప్పుడును వనమందే వసించియుండెను. పిదప నొకనాఁడబ్బాలుఁడు గంగాతీరమునం దెవరును లేని యొకవనమందుఁ గ్రీడించుటకు దాది

తోఁగూడంబోయెను. ఆబిడ్డనికపుడించుమించుగా నయిదేండ్లు. వానికప్పటికి మేటియేనుంగువంటి పరాక్రమము గలిగియుండెను. అట్లాడుచుండఁగా నాబిడ్డఁడు తనపైఁ దటాలునఁ దూకివచ్చుచున్న యొకపులిని జూచెను. ఆ బాలుఁడు వడవడవడంకుచు బులిచే నలంపఁబడి యసుఁ డెడలి పుడమిపయింబడెను. తోడనే దాదియుఁ గూఁ పెట్టెను. ఇంద్రునిమాయచేవచ్చిన యాపులియు రాజకుమారునిఁ జంపినతోడనే యక్కడనే మఱుఁగయ్యెను. ఎంతోకష్టమునఁగూఁ పెట్టుచున్న దాదియెలుఁగువిని సృంజయుఁడు తానే యక్కడికిఁ బరుగునవచ్చెను. అట్లువచ్చి యాబిడ్డనిఁగాంచెను. వాఁడునెత్తురుద్రానంబడి యసుఁ డుడివీడి యాకాశమునుండి యానందము కుందిపడియున్నచంద్రునివలెఁ బరుండియుండెను. అంత నారాజు తొమ్మునొట్టుకొనుచు నెత్తుటఁ దోఁగియున్న యాబాలుని నొడియుం దెత్తిపెట్టుకొని యాతురుఁడై పలవించెను. అంత నాబిడ్డని తల్లులును శోకమున రోదనముసేయుచు సృంజయుఁడున్నయయ్యెడకుఁ బొఱుఁ తెంచిరి. పిదప సృంజయుఁడు మనస్సు నాయందుఁ జెల్లించి నన్నే తలంచుకొనెను. అప్పుడతని చింతనెఱింగి నే నతనికెదుటఁ బొడకట్టితిని. ఆరాజు శోకరసంబు ననోలలాడుచుండఁగాఁ గృష్ణుఁడు నీకుఁ జెప్పినమాట లన్నియు నతనికి వినిపించితిని. పిదప బిడ్డని బ్రతికించినయెడ వాఁ డింద్రు ననుసరించి వర్తింపవలయునేకాని వేఱువిధమున వానిని బ్రతికింప శక్యముగాదనిచెప్పి వానిని బ్రదికించితిని. అటుపిమ్మట నాకుమారుఁడు సువర్ణష్ఠీవి మిక్కిలిపొగడ్తయుఁ బరాక్రమమును బడసి తల్లిదండ్రులకు సంతోషముగావించెను. భయంకరపరాక్రముఁడయిన యాసువర్ణష్ఠీవి తనతండ్రిస్వర్గమునకుఁ బోఁగానే

వేయినూఱేండ్లు రాజ్యపాలనముచేసెను. ఆకాలమందు బహు దక్షిణలతో గూడిన గొప్పయాగములు పెక్కులుగావించి దేవతలకును పితృదేవతలకును తృప్తిగావించెను. అతఁడు తనవంశ పరంపరకుఁ గారణముగాఁ బెక్కండ్రపుత్రులనుగని బహుకాలమునకుఁబిదపఁ బరలోకమునొందెను. రాజోత్తమా ! నీవును నీకుఁగల యీశోకమును దిగవిడువుము. శ్రీకృష్ణుండును వ్యాసమహర్షియుఁ జెప్పినట్లు నీతండ్రితాతలనుండివచ్చిన రాజ్యమును గయికొని పరిపాలింపుము. పవిత్రములయిన మహాయజ్ఞములు చేసి యిష్టంబగులోకమును బొందఁగలవు' అనెను. ఇది ముప్పది యవయధ్యాయము.

రాజధర్మపర్వము.

వ్యాసుఁడు ధర్మరాజునకుఁ దత్తోపదేశము
సేయుట. ధర్మరాజు వ్యాసుని నాశ్రమము
ల మేలిమినడుగఁగా నతఁడుచెప్పుట.

అంత ధర్మతత్త్వజ్ఞుం డగువ్యాసుండు దుఃఖించుచు నూర కున్నధర్మరాజును జూచి 'రాజా ! రాజులకు (క్షత్రియులకు) ప్రజలనుబాలించుట ధర్మము.* లోకమునకు ధర్మమే ప్రమాణము. నిత్యమును ధర్మమునే యనువర్తించువారికి ధర్మమే ప్రమాణము. కాఁబట్టి నీ తాతముత్తాతలమార్గము (పదము) ననుష్ఠింపుము. బ్రాహ్మణులకుఁ దప్పక్సి ధర్మము. అది వేదములం

* ఇట మూలము. — ధర్మః ప్రమాణం లోకస్య నిత్యం ధర్మాను వర్తినః । అనుతిష్ఠస్వ తద్రాజ పితృపైతామహంపదమ్ । బ్రాహ్మణేషు తపో ధర్మః స నిత్యోవేదనిశ్చితః। తత్ప్రమాణం బ్రాహ్మణానాం శాశ్వతం భరతర్షి

దు శాశ్వతముగా నిర్ణయింపఁబడి యున్నది. అది బ్రాహ్మణులకు శాశ్వత మయిన ప్రమాణము. అటువంటి ధర్మముల కన్నిటికిని క్షత్రియుఁడే రక్షకుఁడు. విషయలోలుఁడై యెవ్వఁడీ క్షత్రియుని శాసనము నతిక్రమించి నడచునో వాఁడు లోకయాత్రకు విఘాతకుఁడు గాన వానిని రెండుచేతులార నడంప వలయును. ఎవ్వఁడు మోహమునకుఁ బాలై ప్రమాణమైనదానిని నప్రమాణముఁ గావించునో వాఁడు భృత్యుఁడయినను బుత్రుఁడయినను తపస్వియైనను మఱి యెట్టివాఁడయినను, అట్టి పాపుల నన్నియుపాయములచే నడఁచిపుచ్చవలయును; లేదా పొరిపుచ్చవలయును. ఇందులకు వేఱువిధముగా రాజు వర్తించునేని పాపమునొందును. ధర్మము మిక్కిలియు నశించుచుండఁగా

భ! తస్యధర్మస్య కృత్స్నస్యక్షత్రియఃపరిరక్షితా । యస్స్వయం ప్రతివర్త్యస్యశాసనం విషయేరతిః । సబాహుభ్యాం వినిర్గాహ్యోలోకయాత్రావిఘాతుకః'—ఇందులకు దాక్షిణాత్యపాఠము: ధర్మఃప్రమాణంలోకస్య నిత్యంధర్మానువర్తితామ్॥ అను...పదమ్ । బ్రాహ్మణేషుతు యోధర్మఃసనిత్యోవేదనిశ్చితః । తత్ప్రమాణం ప్రమాణానాం శాశ్వతం భరతర్షభ । తస్యధర్మస్య ...రక్షితా । తథాయఃప్రతివర్త్యస్యశాసనం విషయేనరః । సబాహుభ్యాం వినిర్గాహ్యోలోకయాత్రావిఘాతుకః' 'లోకమునకు ధర్మము ప్రమాణము. నిత్యమును ధర్మమునే యనువర్తింపుము. తండ్రితాతలనాటిరాజ్యపనిము ననుష్ఠింపుము. వేదములందు నిశ్చితమై బ్రాహ్మణులందు నిత్యము నెలకొనియుండు ధర్మమే ప్రమాణములందెల్ల శాశ్వతమయిన ప్రమాణము. ఆధర్మమున...రక్షకుఁడు. ఆరాజు శాసనమును మనుష్యుఁడెవ్వఁడు చెఱుపునో వాఁడు లోకయాత్రకు విఘాతకుఁడుగాన వానిచేతులు రెంటిని దీసివైవవలయును' అని యొక వ్యాఖ్యానము.

నెవఁడు దానిని రక్షింపఁడో వాఁడు ధర్మమును జంపువాఁ డగును. నీవు ధర్మరక్షకుఁ డయినక్షత్రియుఁడవు గావున ధర్మమును హతము గావించినవారిని (దుర్యోధనాదులను) వారి యను చరులతోడ హతులంగావించితివి. ఇట్లు నీవు నీస్వధర్మమునందు వర్తించుచుండఁగా (ధర్మమును దప్పినట్లు) శోకించుచున్నావేల? రాజును గొట్టనువలయును; పెట్టనువలయును; ధర్మంబునఁ బ్రజలను పాలింపనువలయును' అనెను. అందులకు ధర్మరాజు 'తపోధనా! నీవు చెప్పుమాటయందు నేను సందేహపడలేదు. నీవు సకలధర్మవిదులందును మిన్నవు. నీకు ధర్మము ప్రత్యక్షమును కదా! అయినను జంపఁదగనివారిని బెక్కండ్రను రాజ్యము నిమిత్తము చంపివైచితిని. ఆకార్యములే నన్నుఁ గాల్చుచును వ్రేల్చుచును నున్నవి' అనెను. వ్యాసుఁడు 'ధర్మపుత్రా! కర్మమునకు (మంచిదానికిని జెడ్డదానికిని) కర్త యీశ్వరుఁడా? లేక మనుష్యుఁడా? ఫలము (సుఖముగాని దుఃఖముగాని) తనంతటనే లోకమునఁ గలుగుచున్నదా? లేక పూర్వకర్మముచేఁ గలుగుచున్నదా? మనుష్యుఁ డీశ్వరునిచేత నియుక్తుఁడై యే, కర్మమును మంచిదానిని జేయుచున్నాఁడేని (యాకర్మమున కయిన) ఫల మీశ్వరునే చెందవలయును. ఒకఁడు గొడ్డలితోనడవియం దొకవృక్షమునిని నఱకునేని యాపాపము కలుగునది పురుషునికేకాని యెంతమాత్రము గొడ్డలికిఁగాదు. లేక యాగొడ్డలి వట్టి యుపాదానకారణమే యగుటవలన (నఱకినయా) పాపము తెలివిగల నఱకిన పురుషునే చెందవలయునుగాని తెలివిలేనిగొడ్డలిని గాదన్నచో, అప్పు డాపాపము గొడ్డలినిజేసిన (తెలివిగల) పురుషునిని జెందవలయును. అయిన నిట్లు గలుగదు. ఒకఁడుచే

సినకర్మమునకు ఫలము మఱియొకఁడు పొందుననుట సమ్మతము కాదు; కాఁబట్టి కర్మఫలమునంతయు వీనియందు వానియందేల! యీశ్వరునియందే సమర్పింపుము. లేక కర్మమునకు మంచి దానికో చెడ్డదానికో పురుషుఁడే కర్తయనియు (వానినియమిం చునట్టి) యీశ్వరుఁడు లేఁడనియుఁ జెప్పితివేని (యపుడు పరలో కమును ఫలమునిచ్చువాఁడును లేనందున) నీవు చేసినదేదియు నీకు సెబ్బరగావింపఁజాలదు. రాజా! ఎవ్వఁడుగాని యెప్పుడేని కర్మవిధిచే నేర్పడియుండుదానిని దప్పించుకొనఁజాలఁడు. లేక నీవుపూర్వమందుఁ జేసినకర్మములకు విధియే(ఏర్పాటే)ఫలితమగు నేని (యపుడు పూర్వకర్మములనుబట్టియే యిప్పటి నీధర్మములు నేర్పడియుండుటవలన నీవు స్వతంత్రుఁడవు గానేరవుగాన) చెట్టు నఱికినపాపము గొడ్డలిచేసినవాని నంటినట్లు, తొంటిపాప మీ జన్మమం దెవ్వనిని జెందనేరదు. * లేక నీవు 'ఏర్పాటుగాదు హతమే(యదృచ్ఛ)లోకమందు నెలకొని పనులు జరిపించుచున్న' దని తలంతువేని యప్పటికి (నేర్పాటులేనందున)నిట్టియశుభ మీ యుద్ధమందలి నాశము జరిగియుండదు. ఇఁకమీఁదను జరు గదు.(యుద్ధమునందలి నాశము ముందేర్పాటువలననేకదా కలిగి

---

* దీనికి 'యది వామన్యసేరాజన్ హతమేకం ప్రతిష్ఠితమ్। ఏవ మప్యశుభం కర్మ నభూతం నభవిష్యతి' అని నీలకంఠపాఠము. హతమేకమ్ అనుటకు 'హత మేవ' అని పాఠాంతరము. అప్పుడు మనుష్యునకు 'బలవంతముగా వధముకలు గుట నిశ్చయమని తలంతువేని యప్పటికిని నీవు చేసినది చెడ్డకార్యముగాదు. ఈయభిప్రాయమునందు ముందును వెనుకను నేకీడును మేలును గలుగుటకుఁ గారణములేఁ'దని యర్థము.

నది) లేక లోకమందుఁ బుణ్యము పాపమనెడి కారణములవలన సుఖమును దుఃఖమును గలుగుననిచెప్పుట యుక్తమని తలంతువేని యీపుణ్యపాపములను శాస్త్రమొక్కటిచేతనే తెలియఁదగును. అట్టిశాస్త్రమందు రాజులకు దండముదాల్చుట పుణ్యమని విధింపఁబడియున్నది. అది లోకమునందు నంగీకరింపఁ బడియున్నదియే.* కర్మములు మంచివియుఁ జెడ్డవియుఁ జక్రమునందుం బోలె నిందుఁ జుట్టుచుండుననియు మనుష్యులు తమ మంచిచెడ్డల ఫలము లనుభవింతురనియు నామతము. ఒకపాపకర్మమునుండి మఱొకటి కలుగుచున్నది. కాఁబట్టి చెడ్డ కర్మములనెల్ల విడునప్పుము.నీమనసు నిట్లు శోకమునం దుంపకుము. పరులకు నిందింపఁదగినదైనను నీకు స్వధర్మమగుదానియందు వర్తించువాఁడవు; ఇట్టి నీకు దేహమునుదిగవిడుచుట బాగుకాదు.దేహముతోఁ బ్రతికి యుండువాఁడు దుష్కర్మములకయిన ప్రాయశ్చిత్తములను విధ్యుక్తముగాఁ జేసికొనఁగూడును. శరీరమును విడిచినవాఁడట్లుచేయనేరక కీడ్వాటొందవలయును. కాఁబట్టి, రాజా! నీ వప్పుఅుతోనుంటివేని ప్రాయశ్చిత్తము చేసికొనఁగూడును. ప్రాయశ్చిత్తము చేసికొనక దేహమును దిగవిడిచి పిదపఁ బశ్చాత్తాపపడఁగలవు' అనెను. అదివిని ధర్మరాజు 'పితామహా! నేను రాజ్యమందలి

---

* 'లోకమునందలి విధిచొప్పున రాజునకు దండముదాల్చుట న్యాయమయినప్పటికిని, అట్లుచేయునపుడు మంచికార్యమువలెఁ జెడ్డకార్యము నతనికిఁ దెలియకయే సంభవించునని నీకుఁ దోఁచునేని చెడ్డకార్యమునకుఁ గారణమగా నుండుటను విడిచి స్థిరమగు శుభకర్మఫలమును దెలిసికొనుము' అని యర్థాంతరము.

పేరాసచేత నాయొక్కనినిమిత్తము, పుత్రులను పౌత్రులను నన్న దమ్ములను దండ్రులను, మామలను, గురువులను, మేనమామలను, దాతలను, మేనల్లుండ్లను, సంబంధులను, స్నేహితులను, సుహృదులను, జ్ఞాతులను, మహోత్సలయినస్త్రీయులను బెక్కుదేశములనుండిన యనేకరాజులను సందఱను జంపించితిని. తపోధనా! ఆరాజులు నిత్యమును ధర్మమాచరించుచుండినవారు; మాటిమాటికి యజ్ఞములు చేయుచుండినవారు; వీరులు. ఇట్టిరాజులనుగూల్చిన నే నేగతిని పొందఁగలనో? దీనినిమరల మరలఁ జింతించుచు నాశోకముచేత నెల్లప్పుడును దగ్ధుఁడ నగుచున్నాను. శ్రీమంతులును రాజసింహులు నయినయాపీఁగులను బాసిన యీభూమినిని, ఘోరమయిన జ్ఞాతివధమును, బెక్కువిధములఁజంపఁబడిన తక్కినస్త్రీయులను, కోట్లకొలఁదిని రూపుమాసిన తక్కిన మనుష్యులను జూచి తపించుచున్నాను. పితామహా! వెనిమిటులను బుత్రులనుఁ దోఁబుట్టువులను బాసినయాయుత్తమకాంతల దురవస్థ యిప్పు డెట్లుండునో? వారు 'పాపులాపాండవులు వృష్ణులతోడఁజేరి పాడుచేసిరి' అని పాండవులమగుమమ్మీఁదిట్టుచు మేనులుచిక్కి స్రుక్కుచు నేలపయిఁబడి పొరలాడుచుందురు. బ్రాహ్మణోత్తమా! పతులను బుత్రులను దండ్రులను నన్నదమ్ములను గానలేక యా కాంతలందఱును ప్రియంబునఁ దమప్రాణముల విడిచి యమునింటికిఁ బోవుదురు. ఇందు సందేహములేదు. ధర్మమును జక్కఁగా విమర్శింపఁగా మేము స్త్రీవధ పాపమును బొందఁగలము. అట్టి మేము సుహృదులను జంపి తీఱనిపాపమునొంది తల్క్రిందుగా నరకమునఁ గూలఁగలము. సత్తమా! కాఁబట్టి యుగ్రతపంబుచేసి యీదే

హామును విడిచిపుచ్చెదను. పితామహా ! అయిన నాశ్రమ ముల విశేషమును నాకుఁ జెప్పుము " అనెను. ఇది ముప్పది యొకఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

వ్యాసుఁడు యుద్ధమృతులయిన రాజులసంతతులను వారివారిరాజ్యములఁ బట్టముగట్టి యశ్వమేధము చేయుమని ధర్మరాజునకుఁ జెప్పుట.

ధర్మరాజుచెప్పినదివిని వ్యాసుఁడు బుద్ధియందు సూటిగా నాలోచించి మరల నతనితో ' క్షత్రియోత్తమా ! క్షత్రియధర్మమును దలంచిచూచి నీ వీశోకమును బోకార్చుకొనవలయును. స్వధర్మమును మున్నిడికొనియేకదా యీక్షత్రియులు హతులయిరి. సంపూర్ణమయిన సంపత్తిని, నీభూమియందు విపులమయినకీర్తిని, గోరి యితరులను జంపఁగోరిన యీక్షత్రియులు కాలముచేత మృతినొందిరి. నీవును భీముఁడు నర్జునుఁడును నకులసహదేవులును వారిని జంపినవారుగారు. కాలము తాను మార్పుచేయు ధర్మము ననుసరించి యీమనుష్యుల ప్రాణములను గొంపోయెను. కాలమునకుఁ, దల్లియనియుఁ దండ్రియనియు మఱియేదియనియుఁ గాని యభిమానము చూపఁదగిన దొకటియులేదు. భరతసత్తమా ! ప్రాణుల పుణ్యపాపములకు నది సాక్షియైనది. అదియే మీయీయుద్ధమును నిమిత్తముగాఁ గొని వారిని సంహరించినది. అది ప్రాణులనుగొని ప్రాణులను జంపించుచున్నది. ఇది దాని యీశ్వర్యత్వము. * కాలము కర్మ

*ఇట 'కర్మనూత్రాత్మకం విద్ధి సాక్షిణం శుభపాపయోః' అని మూలము.

ములకు సూత్రమయినది - అనఁగా కర్మములను వానివాని ఫల ములనొందునట్లు నడుపునది. ఏలనఁగా నది పుణ్యపాపకర్మము లకుసాక్షియైనదని తెలియుము. కాలమే సుఖదుఃఖము లనుఫల ములనిచ్చునది. మహాబాహూ! హతులయిన యాక్షత్రియులు గావించినకర్మములను దలంచుకొనుము. అవియే వారినాశము నకు హేతువులయినవారిని గాలముబారిఁ బడునట్లుచేసినది. విధి నిన్నుఁబయికొని యిటువంటి కర్మమును జేయించినది గాన నీవును విధికిలోనై నడచుకొనుటయె యాచారముగాఁగలవాఁడవని నిన్నుఁదెలిసికొనుము. వజ్రపువాఁడుచేసిన యంత్రము, దానిని త్రిప్పుమనుష్యునకు వశమైనడచునట్లు, ఈ జగమంతయుఁ గాలము తోఁగూడినకర్మము త్రిప్పినట్లుతిరుగుచున్నది. మనుష్యునకు నుత్ప త్తి వినాశములు, కారణమేది తెలియకయు, నలవ్రోకగాను, గలుగుటనుజూడఁగా నీశోకమును సంతోషమును నిరర్థకములే యగును. రాజా! ఈ విషయమై నీమననునకు నీవు కలిగించుకొ నుబంధము వట్టిదేకాని వాస్తవముకాదు. అయిననను దాని నివర్తించుకొనఁగోరితివేని యందులకువలయు ప్రాయశ్చిత్తము లను జేసికొనుము. తొల్లి యొకప్పుడు దేవాసురులకు యుద్ధము జరిగినది వినుచున్నారము. వారిలో ననురు లన్నలు, దేవతలు తమ్ములు. వారలకు సంయితము రాజ్యలక్ష్మి నిమిత్తమే వెను విరోధముకలిగి ముప్పదిరెండువేల సంవత్సరములు యుద్ధము ప్రవర్తించెను. అందుదేవత లీభూమినంతయు నొక్కటే నెత్తురు సముద్రముగాఁ గావించి యసురులను జంపి స్వర్గమును బడసిరి.

'కర్మమూర్త్యాత్మకం విద్ధి' అని దాక్షిణాత్యపాఠము. కాలమే కర్మముయొక్క ప్రత్యక్షరూపమని తెలియును అని యర్థము తెలియునది.

ఆయుద్ధమందు ననుఁరులకు సాయముచేయుట్కై గర్వంబునఁ గ
న్నఁగానక భూమినుండి యెనుబదియెనిమిదివేవురు బ్రాహ్మణులు
వచ్చియుండిరి. వారిని శాలావృకులందురు. వారు ముల్లోకము
లందును బ్రసిద్ధులు. వేదములందుఁ బారంగతులు. దేవతలా
బ్రాహ్మణులను సయితము నుఱుమాడిరి. అధర్మమును వృద్ధిఁ
జెందించి ధర్మమునకు విచ్ఛేదము కలిగింపఁ దివ్వరుదురాత్మలను
రాజులును దేవతలును గ్రూరులయిన దైత్యులనుంబోలె వధింప
వలయును. ఒకకులమునం దొకనిని జంపినయెడలఁ దక్కినవారికి
క్షేమముగలుగునేనియు, అట్లు యొకకులమును జంపినయెడ దేశ
మునకుక్షేమముగలుగునేనియు,నావధములుధర్మనాశకములుగా
నేరవు. నరపతీ ! ధర్మమొకానొకటి యధర్మమువలెను నధర్మ
మొకానొకటి ధర్మమువలెను నుండును. వివేచన గలప్రాజ్ఞుఁడు
దానిని వివేచించి తెలిసికొనవలయును. పాండవా ! నీవును
జదువరి వగుదువు. కాఁబట్టి నీమనస్సును దిటపఱుచుకొనుము.
దేవతలు తొల్లి చన్నమార్గమువెంటఁ బోయినాఁడవే కాని
మఱేమికాదు. ఇట్టివారు నరకమును బొందరు. నీ వీతమ్ములను
సుహృదులను నూఱడింపుము. మనుష్యుఁడెవ్వఁడు పాప
కార్యమునకుఁ దొడంగినపుడు పాపబుద్ధి గలిగియుండి, దానిని
జేయుచున్నపుడయిన నట్టిబుద్ధి మానక గలిగియె యుండి, చేసిన
పిదప నందులకై మనస్సునఁగుందుటగాని లజ్జపడుటగాని లేకుం
డునో, వానియం దాపాపమంతయును బోప మని చెప్పఁబడును.
అట్టిపాపమునకుఁ బ్రాయశ్చిత్తమును గలుగదు. ప్రాయశ్చిత్తము
వలన నాపాపమునకుఁ దగ్గుటయుఁగలుగదు. నీవో మంచికుల
మందుఁ బరిశుద్ధముగా జనించినవాఁడవు. పగవాఁడయినదుర్యో

ధనునిదోషమువలన నీకిష్టములేకయే యీకార్యము చేయవలసి వచ్చినది. చేసినపిదప నిట్లు పరితపించుచున్నావు. అశ్వమేధ మనెడి మహాయాగ ముత్తమ మయినప్రాయశ్చిత్తమని చెప్పఁబడుచున్నది. మహారాజా ! ఆయాగమును జేయుము. నీయిష్టముచొప్పునఁ బాపరిహర్తుండవై యుందువు. మహాత్ముఁడగు దేవేంద్రుఁడు మరుత్తులనుగూడి శత్రువులను జంపి యొక్కొక్కయాగముగా నూఅశ్వమేధయాగములుచేసి పాపములు దూల్చి స్వర్గమును సుఖోదయములగు లోకములనుబడసి యామరుత్తులతోడ దిక్కులను వెలింగించుచున్నాఁడు. అట్లమరులకు రాజయి స్వర్గలోకమున నప్సరసలతోడ వెలుంగుశచీపతియగు నింద్రుని,ఋషులును దేవతలు నారాధించుచున్నారు. అనఘా ! నీవును బరాక్రమమున రాజులను జయించి యీభూమిని బొందియున్నావు. నీవు జయించిన రాజులపట్టణములకును రాజ్యములకును స్నేహితులంగూడి చని,యందుఁ గలయారాజులపుత్రులను మనుమలను లేక సహోదరులను నాయారాజ్యములకు రాజులుగాఁ బట్టముగట్టుము. గర్భమం దుండుబిడ్డల యందును కనికరమును బచరించి ప్రజలనండఱను రంజించుచు భూతలమును బరిపాలింపుము. ఏరాజులకుఁ గొడుకులులేరో వారి కూఁతుండ్ర నారాజ్యమునకుఁ బట్టముగట్టి యేలునట్లుచేయుము. స్త్రీలు సహజముగా భోగమం దాసక్తిగలవారు. నీవిట్లు చేయుదువేని వారు తమశోకములను దిగవిడిచి సుఖంబుందురు. సమస్తరాజ్యములను నిట్లూఁటఁ గలిగించి తొల్లి జయంబుగొన్న యింద్రుఁడునుంబోలె నశ్వమేధయాగమును జేయుము. ఓ క్షత్రియసత్తమా ! యుద్ధమందుఁ గూలినయాక్షత్రియులను గుఱించి

శోకించుట యెంతమాత్రము దగదు. దైవము ప్రభావముచే మోహితులై వారు తమతమకర్మముల చేతనే నాశమునొందిరి. నీవు క్షత్రధర్మము ననుష్ఠించితివి; అకంటకమయిన రాజ్యమునుబడసితివి. కాంతేయా! నీస్వధర్మమును గాచుకొనుము. దానివలన నీవు పరలోకసుఖము నొందుదువు' అనెను. ఇది ముప్పదిరెండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{వ్యాసుఁడు ధర్మరాజునకుఁ బ్రాయశ్చిత్తములకుఁ దగుపాపములను వానిప్రాయశ్చిత్తములనుజెప్పుట.}

ధర్మరాజు 'పితామహా! మనుష్యుఁడిం దేకార్యములుచేసి ప్రాయశ్చిత్తము చేసికొనవలయునో, దేనినిజేసి యీపాపమునుండి విడివడునో, నాకుఁజెప్పుము' అని యడుగఁగాఁ వ్యాసుఁడతనితో విహితములయిన కర్మములను జేయకపోవుటచేతను నిషిద్ధములయినవానిని జేయుటవలనను మనుష్యుఁడు పొల్లుపడవడిగలవాఁడై ప్రాయశ్చిత్తము చేసికొనవలసిన వాఁడగుచున్నాఁడు. సూర్యుఁడుదయమగునపుడును నస్తమించునపుడును బరుండినిదురించుబ్రహ్మచారి, పుచ్చిన గోళ్లుగలవాఁడు, నల్లని పండ్లుగలవాఁడు, *పరివిత్తియు, †పరివేత్తయు, బ్రాహ్మణుల వెంపును దూషించువాఁడును, ‡అగ్రేదిధిషువును, §దిధిషూపతియును వ్రతము

---

* తమ్ముఁడు పెండ్లాడియుండ బ్రహ్మచారిగానున్న యన్న.

† అన్న బ్రహ్మచారిగానుండఁ బెండ్లాడిన తమ్ముఁడును.

‡ అక్క కన్నియగా నుండఁగా దానిచెల్లెలిని పెండ్లాడినవాఁడు.

§ చెల్లెలికిఁ బెండ్లియైనపిదప దాని యక్కను పెండ్లాడినవాఁడు.

చెడినవాఁడును, ద్విజాతులను మూఁడువర్ణములవారినిఁజంపినవాఁడును, అపాత్రమందు దానముచేసినవాఁడును, పాత్రమున కొసఁగనివాఁడును, సముదాయమునకు యాగముచేసినవాఁడును, మాంసమును విక్రయించినవాఁడును, ఔపాసనము మొదలయిన యగ్నికార్యములను విడిచినవాఁడును, *వేదమును విక్రయించినవాఁడును, శూద్రస్త్రీని జంపినవాఁడు, నను వీరిలోఁ బూర్వులయినవారు నిక్కిలి గర్హ్యులు. యాగమునకుఁగాక యూరక గోవధముచేసినవాఁడును, అడవిని గాల్చినవాఁడును, అబద్ధముచెప్పి గొలుచువాఁడును, మోసముచేసి బ్రతుకువాఁడును, గురువు నిషేధించువాఁడును, మాటచేతఁగాని మనస్సుచేతఁగాని దారపోసికొని దానముచేసినదాని నపహరించినవాఁడును, సరులిచ్చుదానిని వారించువాఁడును, ఒకబంతియందే వేఱుపాకమును భుజించువాఁడును, భుజించువారి నవమానించువాఁడును, సాతజనులతోఁ గలహించువాఁడును, నాశ్రయించినవానిని రక్షింపనివాఁడును, నియమమును మీఱినవాఁడును, నను వీరొక్కొక్కరును దమతమపాపములకుఁ దగునట్లు ప్రాయశ్చిత్తముచేసికొనవలయును. ఇఁక లోకమునకును వేదమునకును విరుద్ధములయిన యకార్యములను నీకుఁజెప్పెదను. ఆలించి వినుము. స్వధర్మమును విడుచుట, పరధర్మము ననుష్ఠించుట, అయోగ్యునిచే యాగముచేయించుట, అభక్ష్యమును భక్షించుట, శరణాగతుని దిగవిడుచుట, భృత్యులను బోషింపకుండుట, ఉప్పు చింతపండు మొదలయిన రసపదార్థములను విక్ర

* వేతనమునకు వేదములను బదివించినవాఁడు.

యించుట, పశుపక్ష్యాదులను తిర్యక్కులను జంపుట, శక్తి యుండియు * ఆధానమును మొదలయిన కర్మములను జేయు చుండుట, నిత్యము (పసులకు నాహారము మొదలుగా) నిచ్చువానికి నీకుండుట, దక్షిణ యొసఁగకుండుట, బ్రాహ్మణుల సామ్మునపహరించుట మొదలుగా నివియన్నియు ధర్మము నెఱిం గినవా రకార్యములని తెలిపెదను. తండ్రితో జగడముసేయు కొడుకును, గురుభార్యను బొందువాఁడును, ధర్మపత్నిని బాఁడి మెయిఁ బొందనివాఁడును, అధార్మికులగుదురు. వేనిని జేసినను వేనిని జేయకున్నను మనుష్యుఁడు ప్రాయశ్చిత్తము చేసికొనవల యునో యాకార్యములు వేదములందును విస్తరముగను సంగ్ర హముగను జెప్పఁబడియున్నవి. ఇటువంటికార్యములు చేసియు మనుష్యునకుఁ బాపము పొందకుండుటకుఁ గొన్నికారణములు గలవు; వానినిజెప్పెదను. యుద్ధమం దాయుధమునుగొని తెన్నుఁ గొట్టవచ్చువాఁడు వేదాంతవేత్తయైనను వానిని జంపుట బ్రహ్మ హత్యగాదు. ఈవిధి,వేదములందలి మంత్రములు చెప్పుచున్నవి. వేదప్రమాణములచే విధింపఁబడిన ధర్మమును నీకుఁ జెప్పెదనుఁ తన వృత్తమునుండి తొలఁగిన యాతితాయి యగుబ్రాహ్మణుని జంపుటవలనఁ బాపముగలుగదు. ఒకని కోపము మఱొకనికిఁ గోపము గలిగించినది. ప్రాణమున కపాయముకలుగునపుడు ధర్మ విదుల యనుమతినొంది తెలిసి సురనుపయోగించువాఁడు పిదప శుద్ధినొందవలయును. అభక్ష్యమును భక్షించుటవలనఁ గలుగు పాపమంతయుఁ బ్రాయశ్చిత్తవిధిచొప్పున శుద్ధిబొందునని నీకుఁ జెప్పితిని. గురువునాజ్ఞను గొని గురుపత్నిని బొందినవాఁడు దోష

* ఔపాసనమనెడు స్మార్తాగ్నివైదికమయిన మూఁడగ్నులుగాఁ జేయుట.

మునొందఁడు. ఉద్దాలకుం డనుఋషి శిష్యునిఁగొని శ్వేతకేతుం డనుపుత్రునిఁ బుట్టించుకొనెను. గురువుకొఱకై యాపదయందు దొంగలించుటవలన దోషముగలుగదు. అయినను దాను విచ్చల విడి భోగించుటకై దొంగలించువాఁడు దోషియగును. బ్రాహ్మణులసొమ్ముదక్కఁ దక్కినవానిని (ఆపదయందుఁగాని గుర్వర్థముగాని) దొంగలించినచో దోషములేదు. అట్లు దొంగలించి తాను భుజింపనివాని నేపాపమంటదు. తనప్రాణమునుగాని యొరులప్రాణమునుగాని రక్షించునపుడును, గురువుకొఱకును, స్త్రీలయెడను, వివాహములందును, నబద్ధము చెప్పవచ్చును. స్వప్నమందు శుక్లమువిడిచినయెడల నందులకు మరల నుపనయన మక్కఱలేదు. మండుచున్న యగ్నియందు నేయివేల్చుటయే యందులకుఁ బ్రాయశ్చిత్తము. అన్నపతితుఁడుగాఁగాని సన్న్యసిగాఁ గాని పయినచోఁ దమ్మునికిఁ బొరివిత్త్యదోషముగలుగదు. ఒక స్త్రీ వేఱికొనఁగా దానితోఁ బొందినయెడల నది ధర్మదూషకముగాదు. నర్థముగాఁ బశువులను జంపుటయుఁ జంపించుటయుఁగూడదు. విధ్యుక్తముగాఁ బశువులను వధించుట వానియెడ ననుగ్రహమేయగును జుమీ. తెలియమిచే ననర్హుఁ డయినబ్రాహ్మణునకు దానముచేయుటయు నర్హుఁడయినవానికి దానముచేయకపోవుటయు దోషముగాదు. అపరాధము గలభార్యను దొలఁగఁబుచ్చుట దోషముగాదు. దానినల్లి గావించుట దాని పరిశుద్ధికిఁ గారణమగును. అట్లు చేయుపురుషునికిఁ బాపముగలుగదు. సోమరసము తత్త్వమును దెలిసినవాఁడు దాని నమ్ముట వలనఁ బాపమునొందఁడు. సమర్థుఁడుకాని పనివానిని దిగవిడుచుటయు దోషముగాదు. గోవులకొఱకు నడవిని గాల్చుటయు

నిషిద్ధముగాదు. ఇట్లు చెప్పఁబడిన కార్యములు చేయుటవలన దోషములేదు ; దోషములనుదూల్చి పరిశుద్ధి నొసంగఁ బ్రాయశ్చిత్తవిధులను సవిస్తరముగా నీకుఁ జెప్పెదను' అనెను. ఇది నుప్పదిమూఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

వ్యాసుఁడు ధర్మరాజునకుఁ బాపములకుఁ బ్రాయశ్చిత్తములను జెప్పుట.

వ్యాసుఁడు 'మనుష్యుఁడు చాంద్రాయణము మొదలయిన తపమును యాగాదులయిన కర్మములను గోదానము మొదలయిన దానములనుజేసి మరల నాపాపములకుఁ బోకుండునేని పాపమువీడి పరిశుద్ధుం డగును. బ్రహ్మహత్యచేసినవాఁ డసూయవిడిచి, యెప్పుడును బ్రహ్మచారియై, తనకు వలయునది తానే చేసికొనుచు, నెప్పుడును జుఱుకుగలిగి, దనపాపమును లోకులకుఁ దెలుపుచును, నొకచేత ఖట్వాంగ మునుకఱ్ఱను నొకచేతఁ గపాలమును నెత్తికొని, బిచ్చమెత్తిన యన్నము నొకప్రాఁటగుడిచి, నేలపయిఁబరుండి, పండ్రెండుసంవత్సరము లుండునేని, యాపాపమునుండి విముక్తుఁడగును. వలయునని బ్రహ్మహత్యచేసినవాఁడేని, ఆయుధము గలవానికడకుఁ బోయిఁ దన్నుఁజంపించుకొనవలయును. లేక తెలిసినవారియిచ్చచొప్పననో తనయిచ్చచేతనో యగ్నిని దరికొలిపి యందుఁ దనదేహమును విడువవలయును; తల క్రిందుగా వంచుకొని యేదేనియొక వేదమును జపించుచు మున్నూఱు యోజనములదూరము యాత్రచేయవల

యును. లేక తనధనమునంతయు వేదవిదులగు బ్రాహ్మణులకు నొసంగవలయును; లేక జీవనమునకుఁ జాలినంత ధనమును వలయు వస్తువులు నిండియున్న గృహమును దానముచేసి పశువులను బ్రాహ్మణులను బోషించుము వచ్చినయెడల బ్రాహ్మణహత్య నివర్తించును. లేక *కృచ్ఛ్రమనుతపమును నాచేఁ జ్లేడతెగక చేయుచువచ్చినయెడల బ్రహ్మహత్యగలవాఁడు పరిశుద్ధుఁడగును; లేక యొకమాసమును నాలుగుగా భాగించి ముందుచెప్పిన యాకృచ్ఛ్రనియమముచొప్పున మూఁడేండ్లు భుజించుచువచ్చిన యెడల నాపాపమునుండి విడివడును; లేక యొక్కమాసమున కొక్కమాటుభుజించుచువచ్చునేనియొక్కసంవత్సరమునఁబరిశుద్ధుఁ డగుననుటకు సందేహములేదు. అట్లు దృఢముగా నిరాహార వ్రతము పూనునేని మఱియుఁ దక్కువకాలమునఁ జేశుద్ధినొంద వచ్చును. అశ్వమేధయాగము సయిత మీపాపమును దొలఁగించి శుద్ధియొసంగు ననుటకు సందేహములేదు. అశ్వమేధమును జేసి యవభృథస్నానమును గావించిన మనుష్యులందఱును నిట్టి పాపములనుండి విడివడి పరిశుద్ధులగుదురనుట వేదముఖ్యవిషయము. మఱియు బ్రాహ్మణునినిమిత్తము యుద్ధమునఁ గొట్టువడినను, లేక లక్షగోవులనో, పాలుపితుకఁదగిన కపిలగోవుల నిరువదియైదువేలింటినో సత్పాత్రమునందు దానముచేసినను, బ్రహ్మహత్య మొద

---

* కృచ్ఛ్రమనఁగా మూఁడుదినములు వేఱువిను మాత్రమును, మఱి మూఁడు దినములు సాయంకాలమున మాత్రమును, అవ్వలి మూఁడుదినములు దైవికముగా దొరికినదానిని మాత్రమును భుజించుచు, మఱియవ్వలి మూఁడుదినము ఉపవాసముండు విధి. ఈ మూఁడేసి దినములకు మాఱుగా ఏడేసిదినము లనుష్ఠింపఁగా మూఁడుసంవత్సరములకుఁ బరిహారమని తెలియునది.

లయిన పాపము లన్నింటినుండి విముక్తుఁడగును. ప్రాణసందే హముగలిగినపుడు చక్కఁగాఁ బిదికెడి వేయిపశువులను దూడ లతోఁగూడ సాధువులయిన దరిద్రులకు దానముచేసినచో బాపమునుండి విడివడును, రాజా ! బ్రాహ్మణులకుఁ గాంభోజ దేశపు గుఱ్ఱములను నూఱింటిని దానముచేయునేని పాపము నుండి విడివడును. మఱియు నెవఁ డొక్కనికయినను వాఁడు కోరిన దంతయు నిచ్చుటయేకాక యట్లిచ్చుటను జెప్పికొన కయునుండునో వాఁడును బాపమునుండి విముక్తుఁడగుచున్నాఁ డు. ఒక్కమాఱు మద్యము త్రాగినవాఁ డామద్యమును నిప్ప వలెఁ గాఁచి త్రాగునేని వాఁడిహమందును బరమందును బరిశుద్ధి నొందుచున్నాఁడు. నిర్జలమగు ప్రదేశమందుఁ గొండకొననుండి క్రిందఁబడియు, నగ్నియందుఁ బొచ్చియు,*మహాప్రస్థానము నను ష్ఠించియుఁగాని దేహము విడిచినవాఁడు సమస్తపాపములనుండి విడువడి నొందును. బ్రాహ్మణుఁడు మద్యముద్రాగినయెడ బృహ స్పతి సవమనెడి యాగముచేసి పాపమువీడి †సభకుఁబోవ నర్హుఁ డగునని వేదముచెప్పుచున్నది. లేక యొకఁడు మద్యముద్రావె నేని వాఁడు మత్సరమువిడిచి భూదానముచేసి మరల మద్యము ద్రావకుండునేని యాదోషమునుండి చక్కఁబడి పరిశుద్ధుఁడగు చున్నాఁడు.గురుభార్యనుబొందినవాఁ డెట్లుగాఁ గాఁచిన యినుప

---

* మహాప్రస్థానమనఁగా కేదారక్షేత్రమునందు హిమవంతమునాగోహించు ట.అనఁగాప్రాణత్యాగమునకై యుత్తరముగాఁబోయి హిమవంతునెక్కుట.

† ఇందులకు 'సమితిం బ్రాహ్మణో గచ్ఛే దితివై బ్రహ్మణఃశ్రుతిః' అని మూలము. 'సమితిం బ్రహ్మణో గచ్ఛేత్' అని ఉత్తరకోశపాఠము. బ్రహ్మలో కము పొందునని బ్రహ్మయే చెప్పినాఁడని యర్థము.

జాతిపయిఁ బరుండవలయును. లేక తనపురుషచిహ్నమును (లింగమును) కోసివైచి యాకాశముచూచుచు నూరువెడలి యడవికిఁ బోవలయును. దేహమును విడుచుటచేత నొకఁడు దానుచేసిన పాపకర్మములనుండి విడుచున్నాఁడు. అట్టి స్త్రీ లొక సంవత్సరమువఱకు నాహార విహారాదులు వదలి నియమముతో నుండు రేని యట్టిపాపకర్మములనుండి విముక్తి నొందుదురు. ఎవఁడు మహావ్రతమును, (నొకమాసము నీరు సయితము ద్రావకుండుటను), నాచరించునో, లేక తనధనమునంతయు దానముచేయునో, లేక గురువునిమిత్తము యుద్ధమునందు హతుఁడగునో, యతఁడు పాపకర్మమునుండి విడివడును. గురువునెడఁ బొల్లుగావర్తించువాఁడును గురువు నడ్డగించినవాఁడును నతనికిఁ బ్రియమయినదానినిజేసి యాపాపమునుండి తొలఁగును. బ్రహ్మచర్యవ్రతమును విడిచినవాఁడు బ్రహ్మహత్యకునయిన ప్రాయశ్చిత్తమును జేసి కొనవలయును. లేదా, యాప్రతోలునుగట్టుకొని యాఱు మాసములు కృచ్ఛ్రమును తపముచేసెనేని యా పాపమునుండి విడివడును. పరస్త్రీని బొందినవాఁడును బరధన మపహరించినవాఁడును సంవత్సరము వ్రత మాచరించి యా పాపమునుండి ముక్తుండగును. ఎవనిధనము దొంగలించునో వాని కంతమాత్రము ధనమును దనచేత నగునుపాయములు పెక్కింటిచేత నిచ్చిపుచ్చవలయును. అప్పుడు వాఁ డాపాపమునుండి విడివడును. పరివిత్తియుఁ బరివేత్తయు నన్నకుఁ బెండ్లియైనపిదప మనోనియమముగలిగి పండ్రెండురాత్రులు కృచ్ఛ్రమను వ్రతమునలిపి పరిశుద్ధుఁడగును. వారిలోఁ బిన్నవాఁడు పితరుల ను త్తరింపఁజేయుటకు మరల వేఱొకన్యను బెండ్లి చేసికొనవలయును. ఆరెండవ

వెండ్లిచే మొడటఁ బెండ్లాడినస్త్రీకి దోషము ముట్టకపోవును. కావున దానిని జేసినటచేఁ బురుషునికి దోషముకలుగదు. ధర్మవిదులయినవారు స్త్రీలు మహాపాపములు చేసినపుడు నాలు గుమాసము లుపవాసవ్రతము చేసినచో శుద్ధినొందుదురని తెలి యుదురు. * స్త్రీలు పాపముచేసినట్లు సందేహింపఁబడినచో దెలిసినవానికి వారినిబొందుట న్యాయముగాదు. పాత్రము బూ డిదచేత శుద్ధమగునట్లు వారు రజస్సుచేత పరిశుద్ధినొందుదురు. కంచుపాత్రము, శూద్రుఁ డొంగిలిచేసినను, పశువులు మూరు కొన్నను, పుక్కిలింతచేతి నొంగిలియైనను దానిని బాలు పెరుఁగు నేయి మూత్రము పేడ యను పంచగవ్యములును; మన్ను, నీరు, బూడిద, చింతపండు, నిప్పు అనెడి యైదును జేర్చి యీఁదింటిచే శుద్ధిసేయవలయును. ఇట్టిశుద్ధివిధిరూపమగు ధర్మము బ్రాహ్మణు నకుఁ బూర్ణముగాను, క్షత్రియునకుఁ బాతికపాలు తక్కువగాను నుండును. వైశ్యునకును శూద్రునకును మఱియు నొక్కొక్క పాతికపాలు తక్కువగ విధింపఁబడుచున్నది ఆనలువురు నీశుద్ధికై ప్రాయశ్చిత్తము చేసికొనవలసినపు డీ విధానమునుబట్టి వారిలో నశుద్ధి యెవరియం దెక్కుడగునో తేలికయగునో తెలిసికొన వచ్చును. ఆ గురులాఘవములను దెలిసినచే తగునట్లు ప్రాయశ్చి త్తము చేసికొనఁగూడును. పశుపక్ష్యాలను జంపినను, బెరుఁగు చున్న వృక్షములను బెక్కింటిని నఱికినను, నాపాపమును వెల్ల

---

* స్త్రీయ స్వాశక్తాఁ పాకీ నోపగమ్యా విజానతా' అని మూలము. "పాపా నోపగమ్యా' అని ఉత్తరకోశపాఠాంతరము. స్త్రీలు పాపమొకప్పుడు గాని మనస్సుచేతఁగాని చేసినట్లు సందేహము తోఁచెనేని ధర్మవిదు లంతమాత్ర మునకు వారిని పాపాత్మకులుగా గణింపరని యర్థాంతరము.

డించుకొనుచు మూఁడురాత్రులు వాయుభక్షుఁడై యుండవల యును. పొందఁదగనిస్త్రీని బొందినచో నాపాపమునకుఁ బ్రాయ శ్చిత్తముచేయుటకు నాల్గునెలలు తడిపుట్టములతో విబూదిపఱచి పఱుండవలయును. రాజా ! అకార్యముల కన్నింటికిని బ్రహ్మచె ప్పిన విధిచొప్పనను దృష్టాంతమును వేదములను ననుసరించియు, హేతువునుబట్టియు, ప్రాయశ్చిత్త విధియగును. బ్రాహ్మణుఁడు శు చిప్రదేశమున గాయత్రిని జపించుచు మితాహారుఁడయి హింస వదలి కొంచెపు మాటలుగలిగి వర్తించునేని సమస్త పాపముల నుండి విముక్తుఁడగును. అట్టియెడ నతఁడు పయికప్పులేని వట్టి బయలునందు పగలెల్లనుండి రాత్రులు నందే పఱుండియుండవ లయును. పగటి మూఁడుమార్లును రాత్రి మూఁడుమార్లును వస్త్రములతోనే జలములందుఁజొచ్చి స్నానముచేయవలయును. మఱియు వాఁడినియమము గలిగి స్త్రీలతోను శూద్రులతోను బతితులతోను మాటాడకుండవలయును. బ్రాహ్మణుఁ డిట్టివ్రత ము నాచరించునేని తాను దెలియకచేసిన పాపములనుండి విడి వడును. మనుష్యుఁడు చేయు మంచిసెబ్బర కర్మములకు భూత ములెల్ల సాక్షియగును. అట్టి కర్మములకు ఫలము వాఁడు దేహ మువిడిచినదే పొందును. ఆపుణ్య పాపకర్మములలో నేది దక్కిన దానిని గ్రిందుపఱిచి యెక్కుడగునో దానిఫలమునే కర్మకరుఁడు పొందుచున్నాఁడు. కాబట్టి మనుష్యుఁడు * జ్ఞానముచేతను దప స్సుచేతను సత్కర్మములచేతను పుణ్యఫలమును వృద్ధిఁబొందిం చుకొనును. అట్లె యతఁడశుభకర్మములను జేసెనా పాపమును వృద్ధిఁబొందించుకొనును. కాఁబట్టి పుణ్యకర్మములనే చేయవల

* 'జ్ఞానేన' అని మూలము 'దానేన' అనిపాఠా.

యును. పాపకర్మమునుండి నివర్తింపవలయును. పాపకర్మములు నివర్తించు నిమిత్తమై ధనము నెప్పుడు దానముచేయవలయును. అట్లుచేసిన పాపమునుండి విడుమరకలుగును. ఆయా పాపమునకుఁ దగిన ప్రాయశ్చిత్తమును నుదాహరించితిని. మహాపాతకములకుఁ దప్పఁ దక్కిన పాపములకెల్లఁ బ్రాయశ్చిత్తము విధింపఁబడుచున్నది. భక్ష్యములు అభక్ష్యములు వాచ్యములు అవాచ్యములు ననెడిపాపములు తెలిసి చేయుట తెలియకచేయుట యనుదీనినిబట్టి రెండువిధములుగా నున్నది. †తెలిసిచేసిన పాపమంతయు మిక్కిలి దుర్భరమైన దగుచున్నది. తెలియక పొరపడిచేసినది స్వల్పదోషమే యగును. రెంటికిని ప్రాయశ్చిత్తము గలదు. పాపము నింతవఱకుఁ జెప్పఁబడిన ప్రాయశ్చిత్తవిధిచేతఁ బోకార్చుట శక్యమేకాని యశక్యముగాదు. అయిన నీ ప్రాయశ్చిత్తవిధి యాస్తికులకును శాస్త్రమందు విశ్వాసముగలవారికిని విధింపఁబడి యున్నది; కాని నాస్తికులకును, శాస్త్రవిశ్వాసము లేనివారికిని దంభమును ద్వేషమును ముఖ్యముగాఁ గలవారికిని విధింపఁబడినది కాదు. ఇహమందును బరమందు

---

* 'నివర్తేత్పాపకర్మణ' అనిమూలము 'నిమిత్తేపాపకర్మణామ్' అనిపాఠాంతరము. పాపకర్మము నిమిత్తమైఅనఁగా దానిని దొలఁగించుకొఱకు పుణ్యకర్మము చేయుమని యర్థము.

† 'జానతాతుకృతం పాపం గురుసర్వం భవత్యుత । అజ్ఞానాత్స్వల్పకో దోషః ప్రాయశ్చిత్తం విధీయతే' అని మూలము. 'అజ్ఞానాత్ స్థలితేదోషే ప్రాయశ్చిత్తం విధీయతే' అని పాఠా. ఇందులకు ప్రాయశ్చిత్తము' తెలియక పొరపడిచేసిన పాపమును దొలఁగించుటకై విధింపఁబడినది; కాని తెలిసి చేసిన పాపమునకుఁగాదు. అట్టిపాపము దుర్భరమైనది' అని యర్థము.

ను హితముఁగోరువాఁడు శిష్టుల యాచారమును ధర్మమును * దైవమును నెప్పుడును గొలువవలయును. † రాజా ! వారిని వధించినపుడు నీ ప్రాణములను గాచుకొనుటకో లేక నీకుఁ గలరాజధర్మములనుబట్టియో యట్లు చేసితివి; కావున నావధపాపమునుండి నేను పూర్వము చెప్పిన హేతువుల చేత, తనంతట విడివడ్డవాఁడ వయితివి. కాన యందులకై నీ కేమియుఁ జేయనక్కఱలేదు. అయినను గాని జాలినిబట్టి నీకుఁ బాపమేదో కలదని తలంతువేని యందులకై ప్రాయశ్చిత్త మాచరింపుము. అది దగునేకాని, యపూజ్యులకే తగినట్టి దుఃఖ ముకారణముగా ప్రాణములు విడుతురా? ఇది నీకెంతమాత్రము దగదు సుమా' అనెను. మహాత్ముఁడామహర్షి యిట్లు చెప్పఁగా ధర్మరాజు గడియసేపాలోచించి యాతపోధనునిఁ జూచి యిట్లనియె. ఇది ముప్పదినాలవయధ్యాయము.

రాజధర్మపర్వము.

వ్యాసుఁడు ధర్మరాజునకు భక్ష్యభక్ష్యములను బాత్రాపాత్రములను దెలుపుట.

ధర్మరాజు 'పితామహా ! ఏది భక్షింపఁదగినది ? దేనిని భక్షింపరాదు. దేని నిచ్చుట పొగడ్తకెక్కినది ? పాత్రమేది ?

---

* 'శిష్టాచారశ్చ దిష్టశ్చధర్మః' అని. దా. మూలము. 'శిష్టశ్చధర్మః' అని బొ. మూలము.

† 'స రాజన్హోక్ష్యసే పాపాత్తేన పూర్వేణ హేతునా। త్రాణార్థం వావధే తేషా మథవా నృపకర్మణా'' మూలము. 'స రాజన్హోక్ష్యతే పాపాత్తేన పూర్వేణ హేతునా' (దా.మూ) 'ప్రాణార్థం వాధనేనైషా మథవానృపకర్మణా' (బొ. మూ).

అపాత్రమెద్ది? నాకుఁజెప్పు'మని యడిగెను. వ్యాసుఁడు 'ఈవిష యమై ప్రజాపతియగు మనువునకును ఋషులకునుఁ దొల్లి సంవాదరూపమున జరిగినయితిహాసము నుదాహరించుచున్నారు. తొల్లి కృతయుగంబున వ్రతపరాయణులగు ఋషులు కొందఱు గూడి మనువు తీఱుపాటునఁ గూర్చుండియుండఁగా, నతనిని ధర్మ మునుగూర్చి యడుగువారై "ప్రజాపతీ! ఏది భుజింపఁదగినది? దానమేది? పాత్రమెవరు. * అధ్యయనమెట్లు? తపమెట్లు? కార్యము లెవ్వి? అకార్యము లెవ్వి? ఇవన్నియు మాకుఁజెప్పుము' అనిరి. అందుల కాస్వాయంభువమనువు వారితో 'ఋషులారా! ధర్మమును గలరూపున విస్తరించియు సంగ్రహించియుఁ జెప్పెదను వినుఁడు; విశేషించి దోషము చెప్పఁబడనిచోట జపమును హోమము నుపవాసము నాత్మజ్ఞానమును, ఇట్టివిగల మహానీయులును, పుణ్యనదులు ననునివి మనుష్యునిఁ బరిశుద్ధునిఁగావించునవిగాఁ జెప్పఁబడినవి. కొన్ని పర్వతములుగూడఁ బవిత్రములయినవి. మఱియు బంగారమును దినుట, నేయిగుడుచుట, †రత్నస్నానము, దేవాలయమునకుఁ బోవుటయు ననునివి పురుషునిఁదప్పక త్వరిత ముగాఁ బరిశుద్ధునిఁజేయుచున్నవి. మనుష్యుఁడెవఁడుగాని గర్వించె నేసి యెప్పుడును బ్రాహ్మణుఁడు గానేరఁడు. అట్లు గర్వించినవాఁడు దీర్ఘా యువునుగోరునేని ‡ తప్తకృచ్ఛ్రమును తపమును (ఆగర్వమునకుఁ

---

* దానమధ్యయనంతపః' (బౌ. మూ) 'గమ్యాగమ్యా' కథం స్థితియః. అని (దా. మూ.) కానియిందులకు మీఁద నుత్తరములేదు. కానయిది పరిహృతము.

† రత్నములువైచిన జలములచే స్నానముచేయుట.

‡ 'త్రిరాత్రం చోష్ణపోభవేత్' అని మూలము. ఇదియే తప్తకృచ్ఛ్రము. మొదటిమూఁడుదినములు ఆఱుపలముల వేఁడినీళ్లను పిదప మూఁడుదినములు మూఁడు

బరిహారముగా) చేయవలయును. ఈయఁబడని వస్తువు నెత్తకుండుటయు, దానమును, అధ్యయనమును, దపమును, అహింసయు, సత్యమును, క్రోధము లేమియు, * ఇజ్యయు ననునివియే ధర్మమునకు లక్షణములు. అదే ధర్మము దేశకాలభేదమునుబట్టి యధర్మముగాఁ బర్యవసించును. అదానమును, అనృతమును, హింసయు †నొక్కొక్క– సందర్భమందు ధర్మముగాఁ జెప్పఁబడియున్నవి. తెలిసినవారికి నీరెండువిధముల ధర్మములును ప్రవృత్తియనియు నివృత్తియనియు రెండు విధములగును. ఈ ప్రవృత్తి నివృత్తులు రెండును వైదికము లౌకికమునని మఱియు రెండువిధములగును. అందు వైదికమగు నివృత్తికి (అనఁగా వేదోక్తకర్మములుమాని బ్రహ్మానుసంధానముఁదగిలియుండుటకు) ఫలము, అమర్త్యత్వము (చచ్చిపుట్టుట లేకుండుట). వైదికమయిన ప్రవృత్తికి (వేదాదికర్మములనుష్ఠించుటకు) ఫలము మర్త్యత్వము (చచ్చి మరలంబుట్టుట). లౌకికము లయినయీ రెంటికిని, నది శుభమయినచో శుభఫలమును అశుభమయినచో నశుభఫలమును గలుగునని తెలియవలయును. ఈ రెంటిని వానివాని శుభాశుభఫలములనుబట్టి వేఱువేఱు తెలిసికొనవలయును. చేయుపనులు నీచముగానుండినను నపి,

---

ఫలముల కాఁచినపాలును పిదప మూఁడుదినములు ఒకపలము వేఁడినేతినిని గుడిచి పిదప మూఁడుదినము లొక్కటియుఁ గుడువక యుండుటయే యీవ్రతము.

* 'ఇజ్యా' అని ప్రాతాంతరము- యాగకర్మమని యర్థము.

† 'ధర్మోహ్యవ్యక్తికస్మృతః' అని (ద్రౌ. మూలము) 'ఆత్యంతికస్మృతః' అని (దా.మూ). అదానము అనఁగా నొకరిసొమ్మును బుచ్చుకొనుట. రా జపరాధులపై దండుగలు విధించి దానిని రాజోపయోగములకు నెత్తికొనుట దోషము గాదు. అసత్యము - భృత్యుఁడు తన యేలినవానిఁ గాచుటకై కల్లలాడిన దోష

దైవము, శాస్త్రోక్తకర్మము, తన బ్రతుకు, * తన మరణము, నను వీనినిబట్టి చేయఁబడునేని శుభఫలమునే యిచ్చును. ఒక పని, మీఁద నొకరికిఁ గీడుగలిగించునని సందేహముతోఁ జేసినను గాని, లేక తప్పక కీడుగలిగించునని యనుభవముచేఁ గనుఁగొని యే (అనఁగా నిశ్చయముతో) చేసిననుగాని, యందులకుఁ బ్రాయశ్చిత్తముచేసికొనవలయును. కోపముచేతఁగాని మోహము చేతఁగాని యొకపనిచేసినయెడల నక్కార్యమునకుఁ దగినట్లు వేద మునందుఁ జెప్పినవిధిననుసరించి శరీరమును వాఁడున ట్లుపవాస ముచే స్రుక్కించుకొనవలయును. మఱియేదేని తన మనస్సునకుఁ బ్రియముగావించుటకో పఁగుల మనస్సున కప్రియముగావించు టకో క్రోధమోహములచేతఁ జేసినయెడల నప్పాపమును మంత్ర జపములచేతను, బరిశుద్ధాన్నభోజనముచేతను దొలఁగించు కొన వలయును. రా జొకవిషయమున దండము విధింపక తప్పెనేని యొకదిన ముపవాసముండి తన్ను శుద్ధునిఁగావించుకొనవలయు ను. ఆరాజున కట్టిదండము నుపదేశించుటకుఁ దప్పినపురోహి తుఁడుమూఁడునా ళ్లుపవాసముండవలయును. తనకుఁ బుత్రాది క్షయమువలన శోకమునొందుచు నాయుధములు మొదలయిన వానిచేఁ దన మరణమునకుఁ బ్రయత్నించియుఁ జావకున్నవాఁడే ని మూన్నాళ్లు పస్తుపడియుండవలయును, శాశ్వతమయినజాతి,

---

ముగాదు. హింస - రా జపరాధిని వధించుటయుఁ దన్నుఁగాచికొనుటకై శత్రు వును వధించుటయు దోషముగాదు.

*'ప్రలయః' అని (దా.మూ.) 'ప్రాణచ్ఛః' అని (జై.మూలము) ప్రాణమును గాచుకొనునట్టి పని యని యర్థము. ఇట్లే యుభయప్రతులకు నయ్యెయెడల పాఠ భేదములు మెండుగఁ జూపట్టుచున్నవి.

ఆశ్రమము, గ్రామము, కులము ననెడి వీనిసంబంధించిన ధర్మములనన్నిటిని దిగవిడిచిన మనుష్యులకు మఱియేధర్మమును గలుగదు. ధర్మసందేహము గలిగెనేని వేదశాస్త్రముల నెఱింగిన పదిపండితులనయినను, ధర్మశాస్త్రమును జక్కఁగా నేర్చిన ముప్పురనయినను, విచారించి వారు చెప్పినది ధర్మమని నిర్ణయించుకొనవలయును. ఎద్దు, మన్ను, చిన్నచీమలు, *నుఱికియందుఁ బుట్టుపురుగులు, (వత్సనాభి మొదలయిన) విషమును బ్రాహ్మణులు తినరాదు. మఱియు వాగు పొలసులేని చేఁపలను, తాఁబేలు తప్ప జలములందుఁ గలుగు తక్కినవానలుగాలి ప్రాణులగు కప్ప మొదలగువానిని భుజింపరాదు. మఱియు జలపక్షులగు భాసమును (గంపపులుఁగులు) ఱంచలను, గరుడపక్షులను, చక్రవాకములను, నీరుకోళ్లను, కొంగలను, కాకులను, నీరుకాకులను, గ్రద్దలను, డేగలను, గూబలను, మఱి వాఁడులయిననిడుదకోఱలుగలిగి మాంసమును దినుజంతువులను, రెండువరుసల పండ్లుగలవానిని, నాలుగు కోఱపండ్లు గలవాని, నన్నింటిని బ్రాహ్మణుఁడు భుజింపరాదు. మఱియు గొఱియ, గాడిద, క్రొత్తగానీనిన యావు, లొట్టియ, †స్త్రీ యనువీరలపాలును బ్రాహ్మణుఁడు త్రాగరాదు. బ్రాహ్మణుడుమరణముగలిగిన యింటను బురిటియింటను నన్నమును బదిదినములవఱకును గుడువరాదు. ఈని పదిదినములుకాని యావుపాలను గుడువరాదు. ఋత్రియునియన్నము, తినువాని తేజమును, శూద్రునియన్నము వాని బ్రహ్మవర్చసమును, కంసాలియన్నమును వెనిమిటియుఁ బుత్రుఁడులేని పడఁతియన్నమును వాని యాయు

† శ్లేష్మాతకః 'అని మూలము. విరిగికాయలని కొందఱు వ్యాఖ్యానము.

* 'సూకరాణాంగవామ్' (దా.మూ) 'సూతికానాంగవామ్' (జౌ.మూ)

వునుసపహరించును. పాడిదప్పి వడ్డిగొని బ్రతుకువాని యన్నము మలమునకు సాటియగును. వేశ్యయన్నమును, తనపెండ్లాముఱంకుమగనియన్నమును, ఆడుదానికి లోపడినవాని యన్నమును, శుక్లమునకు సాటియగును. యాగమునందు దీక్షితుఁడయినవాని యన్నమును (అతఁడు వపాయాగముచేయువఱకును) గుడువరాదు. యాగమునందు సోమమునమ్మినవాఁడు, లోభి, వడ్రవాఁడు, మాదిగవాఁడు,ఱంకుటాలు,చాకలి, వైద్యుఁడు, ఊరితలారులు, జనులగుంపు,గ్రామమంతటిచేత నపవాదముపడినవాఁడు,నటుఁడు, స్త్రీలపడుపున బ్రతుకువాఁడు, అన్నకుముందు పెండ్లాడినవాఁడు, పుంస్త్వములేనివాఁడు, బట్టువాఁడు, జూదరి యనువీరల యన్నమును భుజింపఁదగదు. ఎడమచేతఁ దేఁబడినదియు, ఎండినదియు, ప్రాతగిలినదియు, మద్యసంబంధముగలదియు, తినఁగా మిగిలినదియు,తనకని ప్రత్యేకముగానె త్తిపెట్టఁబడినదియు (శేషమైనదియు) నగునన్నమును భుజింపరాదు. పిండి, చెఱకు, కాయగూర, పాలు, వేలపిండి, బొరుగులు, పెరుఁగుతోఁగలిపిన వేలపిండియునను వీనితోఁజేయబడినవి నాళ్లుచెల్లిన యెడల భుజింపఁదగవు. పాయసము, పులగము, మాంసము, అప్పమును, దేవతలకు నివేదింపఁబడనివిగా నుండినచో గృహస్థులయిన బ్రాహ్మణులు వీనిని భుజింపరాదు. గృహస్థుఁడగువాఁడు దేవతలను, ఋషులను, పితరులను, ఇలువేల్పులను మనుష్యుల నందఱనుబూజించి యటమీఁదఁ దాను భుజింపవలయును. * ఇల్లు విడిచినపోయిన సన్న్యాసివలె స్వగృహమునందు గృహస్థుఁ డుండవలయును.

* ఇల్లు గృహస్థుఁడింట వసించుట చే ఇలువిడిచిపోయిన సన్న్యాసి వంటి వాఁడగునని యర్థాంతరము.

ఇట్లుండుగృహస్థుఁడు ప్రియభార్యలం గూడియుండి ధర్మమును బడయుచున్నాఁడు. కీర్తినిగోరి కాని, (ఇయ్యనియెడ నేమను కొందురోయను) భయముచేతఁగాని, దానముచేయరాదు. తన కుపకారముచేసినవాఁడని దానముచేయరాదు. గాయకులు,నర్తకులు, విదూషకులు, మదించినవాఁడు, పిచ్చిపట్టినవాఁడు, దొంగ, దూషించువాఁడు, మూఁగ, కురూపి, అంగహీనుఁడు, పాట్టివాఁడు, దుష్టుఁడు, దుష్కులమునఁ బుట్టినవాఁడు, వైదికసంస్కారములేనివాఁడు, నను వీరలకు దానముసేయరాదు. వేదాధ్యయనములేని బ్రాహ్మణునకు దానముచేయరాదు; శ్రోత్రియుఁడగువానికే చేయవలయును. సరియైనపద్ధతిని చేయఁబడని దానమునుసరియైనపద్ధతిని గొనని ప్రతిగ్రహమును రెండును దానమునిచ్చినవానికిని బుచ్చుకొన్నవానికిని ననర్థములకే యగును. చంద్రమానికట్టియనుగాని జాతినిగాని బట్టుకొని సముద్రమును దాఁటఁగోరు వాఁడెట్లు మునింగిపోవునో యట్లె నిచ్చినవాఁడును బుచ్చుకొన్నవాఁడును మునిఁగిపోదురు. తడికట్టియలలను బఱపినయగ్ని యెట్లువెలుఁగదో యట్లెతపమును వేదాధ్యయనమును నాచారమునులేని బ్రాహ్మణుఁడు దానముపుచ్చుకొనుటచేఁ బ్రకాశింపఁడు; ఇచ్చినవానికి ఫలమునొసంగఁడు.మానిసిపునుకయందలి నీరును, కుక్కతోలుతిత్తియందలి పాలును,తామున్నస్థానముల దోషమువలన దుష్టములెట్లగునోయట్లె మంచినడవడిలేనివాని యందున్నశాస్త్రములును వ్యర్థములగును. శాస్త్రములు తెలియకుండినను, అసూయాదులు గలిగి యున్నను, వేదములులేకయున్నను బ్రాహ్మణునియందును వ్రతములేని తక్కువవారియందును గరుణచేతఁ జేయుదానము యుక్త

మగును. * ఒకఁడు బీదయనియు రోగియనియు దుఃఖితుండ నియు వానికి దానముచేయనచ్చును. కానివాఁడు తనకేదేని యాపత్తును జేయుననికాని ధర్మము కలుగుననికాని తలఁచి చేయరాదు. వేదము తెలియని బ్రాహ్మణునకిచ్చినదానము వ్యర్థ మందురు, ఏలనఁగా పాత్రదోషమువలన నది ఫలింపదు. ఇందు లకు విచారింపఁబనిలేదు. మ్రానితోఁజేయఁబడిన యేనుఁగయు, తోలుచేఁజేయఁబడిన మృగమును, వేధమధ్యయనము చేయని బ్రాహ్మణుఁడును నను నిమ్మాడును వరుసగానేనుఁగు మృగము బ్రాహ్మణుఁడను పేళ్లుదాల్చియుండుట తప్పఁ దక్కిన పనయేమి యునొందరు. పడఁతులయందు నపుంసకుఁడును, ఆవునం దావు ను, పనిమాలియుండునట్లును, ఱెక్కలులేనిపక్షి యట్లును, వేదము తెలియని బ్రాహ్మణుఁడు వ్యర్థుఁడే యగును. † మనుష్యులులేని గ్రామమును, నీరులేనినూయియు, అగ్నిలేని వేడిమియు, నెట్లో యట్లె మూర్ఖునియందుఁ జేసినదానమును నిష్ఫల మగును. మూ ర్ఖుఁడొల్లవారికిని బగవాఁడు; దేవతలకును బితరులకును జేయు హవ్యకవ్యములను జెఱుపువాఁడు; కాన వాఁడు మంచిలోకముల ను బొందనేరఁడు. ధర్మరాజా! ఈ ధర్మమునంతయుఁ గలయంత వట్టు (మనువపుడు చెప్పినదంతయు) నీకు సంగ్రహముగాఁ జెప్పి

---

* ఇందులకు 'నవైదేయ మనుక్రోశా ద్దీనార్తాతురకేష్వపి' (బౌ. మూల ము)'దీనా యాపగుణాయచ' అని(దా.మూలము). గుణములేనివాఁడు దరిద్రుఁడని యీవచ్చునుగాని తక్కిన యాపత్కారిత్వాది హేతువులఁబట్టి యీరాదనుట.

† 'గ్రామస్థానం యథాశూన్యం' అని (దా. మూ.) గ్రామధాన్యం యథాశూన్యం' అని (బౌ. మూ). గింజలేని పొల్లుధాన్యమువలెనని యర్థము.

తిని. ఇది మిక్కిలి విస్తరించి వినఁదగినది'' అనెను. ఇది ముప్పది యేనవయధ్యాయము.

రాజధర్మపర్వము.

వ్యాసుఁడును గృష్ణుడును జెప్పినట్లు ధర్మరాజు మనసున శాంతినొంది హస్తినాపురమును బ్రవేశించుట.

ధర్మరాజు 'మునీంద్రా ! రాజధర్మములను జతుర్వర్ణధర్మములను నన్నింటిని వినఁగోరుచున్నాను. ఆపదలయందు నీతియెట్లుజరుపవలయునో ధర్మమార్గము నవలంబించి యెట్లు భూమిని జయింపవచ్చునో వినఁగోరుచున్నాను. నీ విపుడు ప్రాయశ్చిత్తమును భవిష్యద్భవిష్యవివరణముతోఁ గూడ ముచ్చటించితివి. ఇది నాకుఁ గౌతూహలముగలిగించి నామనస్సును నుబ్బించుచున్నట్లున్నది. ధర్మచర్యయు రాజ్యమును నెప్పుడు నొకటినొకటి విరోధించియుండును. కాన ధర్మముతో విరోధింపక రాజ్యమెట్లు చేయవచ్చునని యీవిషయమునే నిత్యమును జింతించుచున్నను నామనస్సున కేమి తెలివిడిలేకున్నది. కాన రాజధర్మాదులను దెలుపుము' అని యడిగెను. అందులకు వ్యాసుఁడు నారదునిఁ జూచి ధర్మరాజుతో 'మహాబాహూ ! నీవు ధర్మము నంతయు వినఁగోరుదువేని కురుపితామహుండును వృద్ధుండునగు భీష్మునికడకుఁబొమ్ము. అతఁడు భాగీరథికన్నపుత్రుడు, సర్వజ్ఞుఁడు, సర్వధర్మవిదుఁడు. కాన నీకు మనస్సున ధర్మరహస్యములందుఁగల సందేహములను ద్రుంచివైవఁగలఁడు. అతఁడు దేవనదియగు

గంగకన్నవాఁడు గాన యింద్రుఁడు మొదలయిన దేవతలనెల్లఁ గన్నారఁజూచినవాఁడు. ఆప్రభుఁడు బృహస్పతి మొదలయిన దేవ ర్షులను బలుమాఱు నుపచారముఁజేసి సంతోమపెట్టి వారివలన రాజనీతి సభ్యసించెను. ఆకురుసత్తముఁడు దేవాసురులకు గురుం డగు శుక్రుం డొసంగిన నీతిశాస్త్రము సవ్యాఖ్యముగాఁ దెలిసి యున్నాఁడు. అమ్మహాబుద్ధి, భార్గవుండగు చ్యవనునివలనను వసిష్ఠు నివలనను విధ్యుక్తముగా వేదములనెల్ల వ్యాకరణాద్యంగముల తోడఁ జదివెను. ఆపురుషతిలకుఁ డధ్యాత్మవిద్యాతత్త్వములఁ దెలిసినవాఁడయి తేజంబు జ్వలించుచుండు బ్రహ్మమొదటిపుత్రుఁ డగు సనత్కుమారునివలన నాత్మవిద్యనును, మార్కండేయుని వలన సన్న్యాస ధర్మసంతతియును, పరశురాముని వలనను నింద్రునివలనను నస్త్రవిద్యలను, జక్కఁగా నేర్చుకొనెను. మను ష్యజన్మముగలవాఁడయ్యు నతనిమరణ మతనియిచ్చకు లోనయి నది. పుత్రుఁడులేకుండియు నతనికిఁ బుణ్యలోకము గలదనుట మిక్కిలి ప్రసిద్ధము. పుణ్యులయిన బ్రహ్మర్షు లతనికి నెప్పుడును సభ్యులయి యుండిరి. తెలిసికొనవలసిన విషయములం దతనికిఁ దెలి యని దొక్కటియు లేదు. ధర్మముల సూక్ష్మమును దక్కుంగల తత్త్వములను నాభీష్ముం డొసంగినవాఁడుగాన యతఁడు నునుఁతె డలుటకు మునుపే యతనికడకుఁ బోయితివేని నీ కుపదేశము సేయును'అనెను. అందులకు ధర్మరాజు వ్యాసుంజూచి నేను'భూమి నంతయు నాశమగునట్లు మేనుగరుపాఱునట్టి యిట్టి గొప్పజ్ఞాతి వధమును గావించి సమస్తలోకమునకు నెగ్గుచేసితిని. ఇంత మాత్రమా ! కపటములేక మాకొఱకు యుద్ధముచేయుచుండఁగా నవ్వీరునే కపటముగాఁగొట్టి కూలఁద్రోయించితినే! అట్లుచేసి

యతనికడకుఁబోయి యడుగుటయెట్లు'? అనెను. అదివిని యదుతిలకుండగు కృష్ణుఁడు చతుర్వర్ణములకును హితము సేయఁ గోరినవాఁడై యారాజవర్యునితో 'రాజోత్తమా! నీవు శోకమును దలఁచి మిక్కుటమయిన నిర్బంధము వెట్టుకొనుట యిప్పుడొంతమాత్రము దగదు. వ్యాసుఁడు చెప్పినట్లు చేయుము. మహాతేజులయినతమ్ములును బ్రాహ్మణులును హతశేషులయిన రాజులును నందఱును వేసవికాలముతుదను బర్జన్యునింబోలె నిన్ను వేఁడుకొనువారై వచ్చి కొలిచియున్నారు. మహారాజా! చతుర్వర్ణములతోఁ గూడిన కురుజాంగలరాజ్యమంతయును నిన్నువేఁడి వచ్చియున్నది. మహాత్ములయిన యీ బ్రాహ్మణుల ప్రియమునకుఁగాను, అపారతేజుండయిన యీగురుని వ్యాసుని యొగమునుబట్టియు, నేను మొదలు నాస్నేహితులకును ద్రౌపదికిని ప్రియమును లోకమునకు హితమును గావింపుమా' యనెను. అంత ధర్మరాజు కృష్ణుఁడు చెప్పినదివిని సర్వలోకహిత ముగోరి గొప్పమనస్సున లేచెను. అమ్మహాయశుఁడు, కృష్ణుఁడు, వ్యాసుఁడు, దేవస్థానుఁడు, అర్జునుఁడును దక్కుఁగల పెక్కుం డ్రు ననునయింపఁగా, మనంబునఁగల దుఃఖమును దుందుడు కును దిగ్గవిడిచెను. ఆపాండవుండు, వేదమునందును వేదార్థమం దును దక్కుఁగల శాస్త్రములందును సమర్థుండుగాన తనమనం బుచే నిశ్చయించుకొని దుఃఖమువీడి నెమ్మదినొందెను. అతఁడు నక్షత్రములచేఁ బరివృతుఁడగుచంద్రుండునుంబోలె, వారలచేతఁ బరివేష్టితుండై ధృతరాష్ట్రుని మున్నిడుకొని తనపట్టణమునకుఁ బోవ బయలువెడలెను. అట్లు వెడలునపు డతఁడు ధర్మవిదుం డగుగాన పెక్కువేల దేవతలను బ్రాహ్మణులను బూజించెను. పిదప

శుభలక్షణములుగల పదునాఱు గుఱ్ఱములు పూన్పంబడినదై కంబములును కడవసములును బఱవంబడి మంత్రములచే నర్చితంబయిన క్రొత్తతెల్లనిరథంబునందు, వందిజనులు కైవారములు సేయుచుండ, నాధర్మరాజు, అమృతమయంబగు రథంబును సోమదేవుండునుం బోలె, నారోహించెను. భయంకరపరాక్రముండగు భీముఁడు గుఱ్ఱముల పగ్గెములు పూనెను. అగ్గునుండు కాంతులు దొలంకు శ్వేతచ్ఛత్రమును బట్టెను. రాజు శిరసుపయినిబట్టిన యాతెల్ల గొడుగు, తెల్లని మబ్బులుగల యాకాశమందు, నక్షత్రములచేతబలసియున్న చంద్రునింబోలె వెలింగెను. నకుల సహదేవులిరుప్రకును జంద్రుని కిరణంబులవలెఁ బ్రకాశించుచున్నవియు నలంకృతములును సుందరములునగు రెండు చామరములను వీచిరి. ఆసహోదరులందఱు నలంకృతులై యేకరథమునఁ జేరుట, యేనుభూతములు నొక్కచోటఁ జేరినట్లు చూపట్టెను. రాజా! ధృతరాష్ట్రునిపుత్రుఁడుయుయుత్సుఁడుమనోవేగముగల నాలుగుగుఱ్ఱములుపూన్చిన మేలిరథమునెక్కి పాండవజ్యేష్ఠుండగు ధర్మపుత్రుని వెంటనంటిపోయెను. శ్రీకృష్ణుఁడును సాత్యకితోఁగూడి శైబ్య సుగ్రీవము లనుగుఱ్ఱములు పూన్చిన పచ్చబంగారుతేరిపయి నెక్కి పాండవులకుఁ బిఱుద బయలుదేఱెను. ధర్మపుత్రుని వెదతండ్రియగు ధృతరాష్ట్రుఁడు గాంధారింగూడి నరయానము (పల్లకి) నెక్కి ముందు బయలుదేఱెను. కుంతి ద్రౌపది సుభద్రమొద లగుకౌరవస్త్రీలందఱును విదురుని మున్నిడికొని పలువిధములయిన వాహనములతో బయలుదేఱిరి. అంతఁ జక్కఁగా నలంకృతములయిన వెక్కురథములును గజములును దురగములును బదాతి సమూహములును

177. ధర్మరాజు శ్రీకృష్ణునితోడ హస్తినాపట్టణమును ప్రవేశించుట.

వెనువెంట బయలువెడలినవి. అంత వైతాళికులును సూతులును మాగధులును సుభాషితములఁ గైవారములు సేయుచుండ రాజు యుధిష్ఠిరుండు హస్తినాపురమునకుఁ బోయెను. ఆధర్మరాజునంటినక్రంత సంతోషపూరితు లయిననానాజనులు నెరసియుండ లెక్కఁడరాని జనసమూహములు మిక్కిలి క్రిక్కిఱిసియు లోకంబున సాటిలేనిదై నీటుగులుకు చుండెను. పురజనులు ధర్మరాజు నెదుర్కొని తోడ్కొని పోవఁగోరి పట్టణమును రాజవీథులను వలయునట్లు నానావిధముల నలంకరించిరి. ధ్వజముల చేతను దెల్లనితోరణమాల్యములచేతను అగరు మొదలయిన వానన ధూపములచేతను రాజవీథి మొదలయినప్రదేశములన్నియుఁ జక్కఁగా నలంకృతములై యుండెను. ఆరీతినే రాజభవనముచుట్టును విలువగల మేలిపువ్వులచేతను వాసనపుఁబొడుల చేతను బెక్కుపూదండలచేతను జక్కఁగా సింగారించిరి. పట్టణపుద్వారములం దక్కడక్కడఁ గ్రొత్తవియు దృఢములయినవియు నగు తెల్లని పూర్ణకుంభములును దెల్లని పుష్పములును నెలకొల్పఁబడినవి. అంత ధర్మపుత్రుఁడు జనులు శుభవాక్యములఁ బొగడుచుండ సుహృదులం గూడి యట్లు చక్కఁగా నలంకృతమయినహస్తినాపురద్వారమును బ్రవేశించినవాఁడయ్యెను. ఇది ముప్పదియాఱవయధ్యాయము.

రాజధర్మపర్వము.

పురజనులు పాండవులను బొగడుట. ధర్మరాజు రాజసభా ప్రవేశము. ధర్మరాజును నిందించిన చార్వాకుఁ డనురాక్షసుఁడు బ్రాహ్మణ కోపముచేత నశించుట.

పాండవుల ప్రవేశమును జూడ నువ్విళ్లూరుచుఁ బురజనులు వేలకొలఁదిని రాఁదొడఁగిరి. నలుగడల నలంకృతమై జనసమూహములు నిండియున్న యారాజవీధి, చంద్రుఁ డుదయించినపు డుప్పొంగు మహాసముద్రముంబోలె వెలిఁగెను. రాజమార్గము లందు రత్నమయము లయినగొప్పగొప్పగృహములు క్రిక్కిఱిసియున్న స్త్రీల బరువుచేత నల్లలాడుచున్నట్లు చూపట్టుచుండెను. ఆపడంతుకలు నునుసిగ్గు నూలుకొన నల్లల ధర్మరాజును భీముని నర్జునుని నకుల సహదేవులను గొనియాడిరి. వారు ద్రౌపదిని జూచి 'పాంచాలీ! మహర్షిని గొలుచుగౌతమియుంబోలెఁ బురుషతిలకు లయినయిట్టిపతులను బడసి వెలుంగుచున్న నీవే ధన్యురాలవు! కల్యాణీ! నీచేసినకార్యము లమోఘములు! నీవ్రతచర్యయు నట్టిదే' యని కొనియాడిరి. వారి పొగడిక వాక్యములచేతను, బ్రేమచేత నొండొరులతోడ మాటాడు చప్పళ్లచేతను, బురమంతయుఁ గలకలమని మ్రోయుచుండెను. అంత ధర్మరాజారాజమార్గమును దగురీతిని గడచి చని యలంకృతమై యొప్పు లొలుకుచున్న రాజభవనమును జేరెను. అంతఁ బ్రకృతులందఱును బురజనులును దేశజనులు నందంద ధర్మరాజును డగ్గఱి చెవి కింపయినమాటల 'రాజేంద్రా! శత్రునిషూదనా! భాగ్యముచేత శత్రువులను జయించితివి. ధర్ముతోడను బలము

తోడను మాభాగ్యమువలన మరల నీరాజ్యమును బడసితివి. మహారాజా ! ఇందుండి వందలకొలఁదియేండ్లు మాకు రాజవై యింద్రుఁడు స్వర్గమును బరిపాలించునట్లు ధర్మంబునఁ బ్రజలను బరిపాలింపుము' అని చెప్పిరి. ఇట్లు రాజభవనము ద్వారమందు నలుప్రక్కల బ్రాహ్మణు లాడుచున్న యాశీర్వాదములను గయి కొనుచు మంగళోపచారములచేతఁ బూజితుండై ధర్మరాజు దే వేంద్రునిరాజభవనమువలె నొప్పుచున్న రాజగృహమందుఁ బ్రవే శించి జయశబ్దములను విన్నపిదప రథమునుండి దిగెను. శ్రీమం తుఁడమ్మహాయశుఁడు లోపలఁ బ్రవేశించి యం దున్న దేవతల సన్నిధికిఁబోయి వానినెల్లఁ జందనము పుష్పములు రత్నములు మొదలయిన వస్తువులచేతఁ బూజించి యంత మంగళ వస్తువులను గేలంగొని తిమ్మఁ జూడఁగోరించి నిలుచున్న బ్రాహ్మణులను గాంచెను. ఆశీర్వదింపఁగోరి యా బ్రా హ్మణో త్తములుచుట్టును బరివేష్టింపఁగా నాధర్మరాజు నక్షత్రగణ ములు బలసియున్న చంద్రునివలె నప్పుడు పరిశుద్ధుఁడై వెలిం గెను. అతఁడు పువ్వులు మోదకములు రత్నములు నవ్వారి యైన బంగారములు గోవులు వస్త్రములు మున్నగువానిచేతను మఱి యుఁదక్కిన వెక్కువస్తువులచేతను నా బ్రాహ్మణులను విధ్యు క్తముగాఁ బూజించెను ; మఱియు భృత్యులు గానివారికి వల యునవియెల్ల నరయునట్లును గావించెను. పిదప గురుం డయిన ధౌమ్యునిని బెదతండ్రి యగుధృతరాష్ట్రునిని మున్నిడికొని, యిం ద్రుఁడు సుధర్మాసభను బ్రవేశించునట్లు, ధర్మరాజు రాజసభ యందుఁ బ్రవేశించెను. అంత సుహృదులకు సంతోషకరమును వినుటకు మిక్కిలి యింపయినదియుఁ బుణ్యంబును నగు పుణ్యా

హావాచనధ్వని దేవలోకమును వ్యాపించునదై చెలంగెను. వేద విదులగు బ్రాహ్మణుల వాక్కులు హంసధ్వనులుగలవై యర్థనిబి డములైన పదములతోడఁగూడి వినఁబడెను. పిదప దుందుభి వాద్యధ్వనియుఁ, జెలువయిన శంఖధ్వనియు, వందిమాగధుల జయజయధ్వనులు, నుప్పతిల్లెను. బ్రాహ్మణు లాదిగాఁ గల యాజనుల ధ్వనులన్నియు నుడిగినతోడనే దుర్యోధనునికిఁ జెలి కాఁ డయినచార్వాకుఁ డనురాక్షసుఁడు సిగయు మూఁడుదం డములును జపమాలయుఁ గలసన్నా స్యసిబ్రాహ్మణవేష మూని యాశీర్వదింపఁ గోరుచున్నవాఁ డైయున్న మహాతపస్వులగు నం దలివేలకొలఁదిబ్రాహ్మణులసమూహమునం దుండి ధైర్యంబున రాజగు యుధిష్ఠిరునింజూచి భయంబు మాలి పలుకఁ దొడఁ గెను. ఆదుష్టుఁ డందలి బ్రాహ్మణుల యొక్కరిమాటయు వినక మహాత్ము లయినపాండవులను బాపాత్ములని చెప్పఁదలఁచి 'ఓ! కుంతికొడుకా! ఇందుఁ గలబ్రాహ్మణులందఱును దమ యభి ప్రాయములను నాముఖమున నీకుఁ జెప్పుచున్నారు. నీవు జ్ఞాతు లను వధముచేసిన చెడురాచవాఁడవు.ఇస్సీ! సీబై సి. ఆదియట్లుం డనీ. ఈరీతిని జ్ఞాతులనెల్ల నాశముచేసితివే. ఇట్టి కట్టిడికి నీకు రాజ్యమేమి? వట్టి జ్ఞాతులనుమాత్రమా! పెద్దలనుగూడఁ జంపి పుచ్చితివే! ఇట్టి నీకు బ్రదుకుటకంటె చచ్చుటే మేలు' అనెను. దుష్టుఁ డారాక్షసుఁ డాడినయీమాటలు విని యందుఁ గల బ్రాహ్మణులందఱు నామాటలకు భయపడి వ్యథనొందుచు బిగ్గఱి నాకోశించిరి. అంత నాబ్రాహ్మణులు నాధర్మరాజును మిక్కిలి లజ్జితుఁ డై యెంతయు వెతనొందుచుఁ గొంతసేపు మాటాడకుండిరి. పిదప ధర్మపుత్రుఁడు వారితో 'పెద్దలారా!

మీకు మ్రొక్కెద; బతిమాలుకొనెదను. నన్నను గ్రహింపుఁడు. *నే నిదె ప్రాణములు విడుచుట దగ్గఱియున్నది. కాన నన్ను 'ఇస్సీ' యని నిరాకరించుట మీకుఁదగదు' అనెను. అందుల కా బ్రాహ్మణులందఱును 'రాజా! వీఁడు మాతోఁ జేరిన బ్రాహ్మణుఁడేకాఁడు. ఎవఁడో యన్యుఁడు' అని చెప్పి యంతటఁ దాము దపంబులచే నిర్మలులును వేదవిచ్ఛాంసులు నయినమహాత్ములు గాన జ్ఞానదృష్టిచే వాఁడెవ్వఁడగుటయుఁ దెలిసికొని 'రాజా! వీఁడు దుర్యోధనునకు సఖుఁడుగా వాసికెక్కిన బ్రహ్మరాక్షసుఁడు. ఆ దుర్యోధనునకు హితము సేయఁదలఁచి వీఁడు సన్న్యాసివేషమున వచ్చినాఁడు; ఈమాటలు మేము చెప్పలేదు. ధర్మాత్మా! నీ విట్లు భయపడవలదు. నీకును నీతమ్ములకును మంగళంబగుఁగాక' యనిరి. అంతఁ బవిత్రులగు నాబ్రాహ్మణులు క్రోధంబు దీపింప నందఱు నా పాపరాక్షసుని హుమ్మని హుంకారములచే నవల్చుచుఁ దూలఁగొట్టిరి. వారలతేజంబువలన నారాక్షసుఁడు దగ్ధుఁడై విడుగుపడి యొఱగిన చిగురించు మ్రాఁకుంబోలె నేలం గూలెను. అట్లాబ్రాహ్మణులు ధర్మపుత్రుని సంతోషపఱచి యతనిచేఁ బూజితులై గృహములకుఁ బోయిరి. ధర్మపుత్రుఁడును సుహృదులంగూడి ముదంబునఁ బొదలుచుండెను. ఇది ముప్పదియేడవయధ్యాయము.

---

*ఇందులకు 'ప్రత్యాసన్నవ్యసనినమ్' అని మూలము. నీలకంఠులు దీనికి 'ప్రత్యాసన్నాः సమాపన్నాः వ్యసనినः చిరదుःఖినో భ్రాత్రాచయోయస్య తమ్ - భ్రాత్రాదిదుःఖ పరిహారార్థం మమేదం రాజ్యకరణమ్ నతు స్వసుఖార్థమిత్యర్థः' అని యర్థము చేసిరి; కాని యిదిచాలఁ గ్లిష్టము. సమీపించిన మరణవ్యసనముగల వానిని అనుటే సరసము.

రాజధర్మపర్వము.

కృష్ణుఁడు ధర్మరాజునకుఁ జార్వాక రాక్షసుని పూర్వవృత్తాంతమును జెప్పుట.

అంత దేవకీపుత్రుఁడు శ్రీకృష్ణుఁడు తమ్ములతోడం గూడి యున్న ధర్మపుత్రుంజూచి సమస్తమును గనుఁగొన్న వాఁడుగాన 'అయ్యా ! ఈ లోకమందెప్పుడును నాకు బ్రాహ్మణులు పూజనీయులు. వాక్కునందు విషమును మిక్కిలి యనుగ్రహమును గలిగిభూమియందు సంచరించుచున్న దేవతలుచుమీ వీరు! తొల్లి కృతయుగంబునఁ జార్వాకుఁడను రాక్షసుఁడు బదరీక్షేత్రమందుఁ బెక్కు సంవత్సరములుతపము చేయుచుండెను.అంత బ్రహ్మదేవుఁడువచ్చి వలసినవర మడుగుమని మాటికి మాటికిని జెప్పగాఁ నారాక్షసుఁడు 'నా కే ప్రాణివలనను భయము లేకుండవలయు'నని యడిగెను. ఆజగత్పతియు బ్రాహ్మణులు నవమానించుటం దప్పఁ దక్కినయెడల నే ప్రాణివలనను భయము గలుగకుండును ట్లు త్తమమయిన వర మొసంగెను.ఆపాపాత్ముఁడట్లు వరముఁబడసి మిక్కుటమయిన బలిమియు వేండ్రమయినచేష్టలును మతిలేని పరాక్రమమును బొంది దేవతలను దపింపఁజేయఁ దొడంగెను. వాని బలిమికిఁ గీడ్పడి దేవత లొక్కటిగాఁగూడి బ్రహ్మకడకుఁబోయి యారాక్షసుని వధింపవలయు నని చెప్పిరి. ఆదేవుఁడును వారిం జూచి 'వీనికిని జీవకాలమునఁ నే మృత్యువు గలుగునట్లుగా నే నే ర్పాటు చేసియున్నాను. మనుష్యులలో దుర్యోధనుఁడను నొక రాజు వీనికిఁ జెలికాఁడగును. వీఁడు వానివలని స్నేహమునకు బద్ధుఁడై బ్రాహ్మణుల నవమానించును. బ్రాహ్మణులో వాగ్బలముగలవారు. వారు తమ్ము నవమానించిన కారణమున మిక్కిలి


కుపితులై యీ పాపాత్మునిఁ దమకోపాగ్నిచేఁ గాల్చి కూల్తురు' అనెను. ఆచార్యాకుఁడే యిదిగో బ్రాహ్మణదండముచేతఁ గొట్టువడి నేలంబండి యున్నాఁడు; కావున శోకింపకుము. రాజా! క్షత్రియతిలకులును వీరులు నగునీజ్ఞాతులు క్షత్రధర్మము చొప్పున నీచేత హతులయిరి. కాన యీమహాత్ములు స్వర్గలోకమందిరి. కాఁబట్టి యీవిషయమై వేఱుతలంపు వలదు. వలయు కార్యములను జేయఁ బూనుము. శత్రులనుఱుమాడుము. ప్రజలను రక్షింపుము. బ్రాహ్మణులను బూజింపుము' అనెను. ఇది ముప్పదియెనిమిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

ధర్మరాజు రాజ్యాభిషేకము.

అంత రా జయినధర్మపుత్రుఁడు శోకమును దాపమును విడిచి సంతసంబున గొప్పదియగు బంగారుపీఠమునఁ దూర్పు మొగముగాఁ గూర్చుండెను. సొగసయి ధగధగ వెలుంగుచున్న బంగారుపీఠములం దతని కెదురుగా సాత్యకియుఁ గృష్ణుఁడును గూర్చుండిరి. ధర్మరాజును నడుమ నుంచుకొని యతని కిరుప్రక్కల భీమసేనుఁడును నర్జునుఁడు మణులుచెక్కిన మేలి పీఠములందుఁ గూర్చుండిరి. బంగారముచే సింగారింపఁబడిన తెల్లనియేనుఁగుదంతపు మంచముమీఁదఁ గుంతియు సహదేవుఁడును నకులుఁడును గూర్చుండిరి. దుర్యోధనునిపురోహితుఁడయిన సుధర్ముఁడును విదురుఁడును ధౌమ్యుఁడును ధృతరాష్ట్రుఁడును నగ్నివలె జ్వలించుచున్న యాసనములందు వేఱువేఱ కూర్చుండిరి. ధృతరాష్ట్రుఁ డున్నయెడకు సమీపమున యుయుత్సుఁ

డును గాంధారియు సంజయుఁడును గూర్చుండిరి. ధర్మరా జందుఁ గూర్చుండి తెల్లని పువ్వులను, సర్వతోభద్రాదిచిహ్నములచే గు ర్తింపఁబడిన స్వ స్తికములను దేవతాపీఠములను, అక్షతలను భూమిని, బంగారమును, వెండిని, రత్నములను, స్పృశిం చెను. పిదపఁ బ్రజలందఱును బెక్కులు మంగళ ద్రవ్యముల నె త్తి కొని పురోహితుని మున్నిడికొని ధర్మపుత్రునిఁ గాంచిరి. అంత, భూమి బంగారము పలువిధము లయిన రత్నములును వెండి రాగి, మన్ను ననెడివీనిచేతఁ జేయఁబడినపూర్ణకుంభములు, పుష్పములు పేలాలు దర్భలు పాలు పెరుఁగు నేయి తేనె, జమ్మి రావి మోదుగుసమిధలు, మేడి మ్రానితోఁ జేసిన స్రువము, బంగారపుఁబనిగల శంఖము, మొదలుగా నభిషేకము నకువలయు నుపకరణములను దక్కిన సంభారములను సమ కట్టిరి. అంతఁ గృష్ణుని యాజ్ఞచొప్పునఁ బురోహితుండగు ధౌ మ్యుఁడు ఉత్తరపుఁదూర్పు వైపున గొంతపల్లముగా నుండు చోట లక్షణముచొప్పున వేది నమర్చి దానిపయిని సర్వతోభద్ర మను తెల్లని యాసనము నుంచిరి. దానికిఁ బాదములుగట్టిగా నెల కొనియుండెను. అది యగ్నివలె ధగధగ వెలుంగుచుండెను. దానిపయిని బులితోలుపఱవంబడి యుండెను. ధౌమ్యుఁడుసింహా సనమందు మహాత్ముం డయినధర్మరాజును ద్రౌపదిని గూర్చుండఁ జేసి విధ్యుక్తముగా మంత్రములు చెప్పుచునగ్నియందు హోమ ము గావించెను. అంతఁ గృష్ణుఁడులేచి పూర్ణమగు శంఖము నె త్తికొని యుధిష్ఠిరుని భూమికిఁ బతిగాఁ బట్టాభిషేకముచేసెను. అప్పు డు కృష్ణునియనుమతిని ధృతరాష్ట్రుఁడును బ్రజ లంద ఱును నభిషేకము గావించిరి. శ్రీకృష్ణుఁడు పాంచజన్య మను



184. శ్రీకృష్ణుండు ధర్మజుని పట్టాభిషిక్తునిగా జేయుట.

శంఖమునెత్తి యభిషేకము సేయఁగానే, తమ్ములతోడఁ గూడి యున్న ధర్మరాజు* మృతముఖుఁడై చూపఱ్ఱెను. పిదపఁ బణవములును, ఆనకములును దుందుభులు ననువాద్యములను వాయించిరి. ధర్మరాజు, నందుఁ జేయఁబడినకార్యములన్నియు ధర్మంబునఁ బరిగ్రహించెను; మఱియు నవ్వారిగా దక్షిణల నొసంగి విధ్యుక్తముగా వారలను బూజింపనుగూడఁ బూజించెను. అంతఁ జక్కఁగా వేదాధ్యయనము చేసినవారును ధృతిమంతులును శీలసంపన్నులు నగు బ్రాహ్మణులను వేయినిష్కములొసంగి సంతోషపెట్టి వారలచే నాశీర్వాదము చేయించుకొనెను. ఆ బ్రాహ్మణులు నుబ్బునొంది హంసములవలె నింపయిన యెలుంగుల స్వస్తియు జయమునుజెప్పి ధర్మరాజుంజూచి 'మహాబాహూ! భాగ్యవశమున జయముగలవాఁడవయితివి. మహాతేజా! నీ పరాక్రమముచేతనే స్వధర్మమును నీవు పడయుటయు భాగ్యము. పెక్కువీరుల క్షయముగావించి పగవారి నుఱుమాడి యొక కొఱంతయులేక కుశలముగానే యర్జునుఁడును భీముఁడును నకులుఁడును సహదేవుఁడును నీవు నామహాయుద్ధమునుండి విడివడి సుఖంబుండుటయు గొప్ప భాగ్యమే. భారతా! మీఁదఁ జేయవలయుకార్యములనెల్ల శీఘ్రముగానే చేయుము' అని పొగడుచుఁ దెలిపిరి. ఇట్లు సత్పురుషులెల్లఁ బ్రీతిగడలుకొనఁ బూజించుచుండఁగా ధర్మరాజు సుహృదులతోఁగూడ గొప్ప రాజ్యమును బడసినవాఁడయ్యెను. ఇది ముప్పదితొమ్మిదవయధ్యాయము.

---

* అనఁగా మిక్కిలియుఁ గనుఁబండువై.

రాజధర్మపర్వము.

ధర్మరాజు భీమాదులను వారివారికిఁ దగిన యువ రాజ్యము మొదలయిన యధికారములందు నియోగించుట.

ప్రజలు దేశకాలములకుఁ దగురీతిని జెప్పిన యప్పలుకులు విని ధర్మరాజు 'బ్రాహ్మణోత్తము లండఱును జేరి మాయందు గుణములను, గలవానినో లేనివానినో, చెప్పుచున్నారుగాన పాండవులు తప్పకగన్యులే. మీ రసూయ మాని మమ్ము నిట్లు గుణసంపన్నులనుగాఁ జెప్పుచున్నారుగాన మేమెల్ల మీదయకుఁ బాత్రులయిన వారమగుట నిక్కమని నా యభిప్రాయము. మా పెదతండ్రి ధృతరాష్ట్రమహారాజు మాకుఁ బరమదైవము. నాప్రియమును గోరినవా రందఱు నతనియాజ్ఞ చొప్పునను నిష్టముచొప్పునను నుండవలయును. గొప్పజ్ఞాతి వధమును గావించియు నితనికొఱకే జీవించియున్నాను. నేనెప్పుడును బ్రాలుమాలకయితనికి శుశ్రూష సేయఁ గోరుచున్నాను. సుహృదు లగుమీకు నాయం దనుగ్రహముకలిమి నిజమేని ధృతరాష్ట్రునియందుఁ దొంటివలెనే మీరు ప్రవర్తింపవలయును. లోకములకును మీకును మాకును నితఁడే రాజు. భూమియుఁ బొండవులండఱును నితనియనుగ్రహమందున్నవారు. నేను జెప్పిన యీమాట మీకెప్పుడును మీ మనసులం దుంచుకొనవలయు' నని చెప్పి పట్టణము నుండియుఁ బల్లెపట్టులనుండియు వచ్చినప్రజలనెల్ల నిచ్చలు పోవచ్చునని యనుమతియిచ్చి యువరాజ్యమునకు భీమసేనుని నియమించెను. అతఁడు బుద్ధిసంపన్నుండగు విదురుని మంత్రాలోచనమందును గార్యనిశ్చయమందును సంధివిగ్రహాదిషడ్గుణ

మూల యాలోచనమునందును బ్రీతిమీఱ నియోగించెను. సర్వ గుణసంపన్నుండును వృద్ధుండు నగుసంజయుని, చేసినదానిని జేయనిదానిని దెలిసికొనుటయందును, ఆదాయవ్యయము లాలో చించుటయందును, నేర్పఱిచెను. సేనలకొలఁది లెక్కించు కొనుటయందును వారు చేయుపనులను బరామర్శించుటయం దును వారలతండివేతనములఁ జూచుకొనుటయందును నకు లు నాజ్ఞాపించెను. ఇతరరాజ్యములవలని రాయిడులనును గర్వించినవారిని నడంచుటకు నర్జునుని నియమించెను. బ్రాహ్మ ణులను దేవతలను నారాధించుటయందును దక్కిన వైదిక కార్యములందును నెప్పుడును నుండునట్లు పురోహితుఁడగు ధౌ మ్యున కనుమతి యొసంగెను. సహదేవుని నెప్పుడును దనచెంత నుండున ట్లానతిచ్చెను. సహదేవుఁ డెట్టి సమయమందును రాజును గాపాడశక్తుండగును. మఱియు ధర్మరా జెవ్వరెవ్వ రేయేకార్య ములను జేయశక్తులో వారి నాయానియోగములం దుండునట్లు సంతోషంబున నియమించెను. ఆ ధర్మాత్ముఁడు విదురునిని సంజ యునిని మహామతియగు యుయుత్సునిని గుఱించి 'నాతండ్రియగు ధృతరాష్ట్రునిమహారాజుకార్యమును మీరు పాటించి పాటించి చేయవలయును. నా కార్యమునుంబోలె నతనికార్యమునంత యును బరాకువడక మీరు చేయవలయును. పురజనులకుఁ బల్లె టూరివారలకు నయినకార్యముల నన్నింటి నెప్పుడును నతని యనుజ్ఞగొని ధర్మంబునఁ జేయవలయును' అనెను. ఇది నలువది యవయధ్యాయము.

రాజధర్మపర్వము.

ధర్మరాజు మృతులయిన జ్ఞాతులు మొదలగు వారికి శ్రాద్ధాదులుగావించి వారిబంధువులను రక్షించుట.

అంత ధర్మరా జుదారబుద్ధిగావున యుద్ధంబున మృతులయిన జ్ఞాతులందఱకును వేఱువేఱ శ్రాద్ధములను జేయించెను. ధృతరాష్ట్రుఁడు తనపుత్రుల నుద్దేశించి మరణానంతర మిచ్చునట్టి పెక్కువస్తువులతోఁగూడిన వైచవు లొలుకుచున్నయన్నమును గోవులను ధనములను మిక్కిలి వెలపొడుగయిన నానావిధరత్నములను దానముచేసెను. ధర్మరాజు ద్రౌపదితోడి మహాత్ముఁడగు ధౌమ్యునిని, గర్గునిని, ధృష్టద్యుమ్ననిని, అభిమన్యునిని, ఘటోత్కచునిని, ఉపకారులును సుహృదులునయిన విరాటుఁడు మొదలగువారినిని, ద్రుపదునిని, ఉపపాండవులను గూర్చి వేఱువేఱ గోవులను ధనములను రత్నములను వస్త్రములను వేలకొలఁది బ్రాహ్మణులకొసంగి తృప్తిగావించెను. మఱియును యుద్ధమున హతులయినరాజులను, బంధువులుకాని వారినుద్దేశించి యుద్దేశించి వారలకు వలయు పరలోక క్రియలు గావించెను. అతఁడు మృతులయిన సుహృదుల నందఱ నుద్దేశించి వారల పరలోకమునకు వలయు పెక్కు సభలను బెక్కు సరస్సులను బెక్కు చలిపందిరులను జేయించెను. ఇట్లారాజుల విషయమై తాను ఋణములేనివాఁడునులోకులయాడికకు లోనుగానివాఁడునై ధర్మంబునఁ బ్రజలను బాలించుచు నతఁడు కృతకృత్యుం డయ్యెను. అతఁడు మునుపటివలెనే ధృతరాష్ట్రుఁడు గాంధారి విదురుఁడు మొదలుగాఁ బూజ్యులయిన కౌరవు

లనుఁ దక్కుఁగల భృత్యులను నందఱను బూజించెను. అతఁడు దయాపరుఁడుగాన యుద్ధంబునఁ బతులను బుత్రులను బాసిన స్త్రీల నందఱను గనికరంబునఁ బూజించి కాచుచు వచ్చెను. మఱియు నతండు మిక్కిలి కరుణయే ముఖ్యముగాఁ గలిగి బీద లు గుడ్డివారు మొదలయిన కష్టజనులకు గృహములు భోజ నము వస్త్రములు మొదలగువాని నొసంగి రక్షించుచుండెను. ఆ ప్రభుండు భూమినంతయు జయించి శత్రువులయెడ ఋణవిము క్తుఁడై విరోధియొక్కఁడును లేక సుఖముగా విహరించుచుండెను. ఇది నలువదియొకండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

ధర్మరాజు కృష్ణుని శతనామముల స్తోత్రము చేయుట.

ధర్మరా జిట్లభిషిక్తుఁడై రాజ్యమునుబొంది మహాప్రాజ్ఞుఁడు గాన పుండరీకాక్షునిఁ జూచి శుచియై చేతులు మోడ్చి 'కృష్ణా! యదుశార్దూలా! నీయనుగ్రహముచేతను, నీతిచేతను, బలము చేతను, బుద్ధిచేతను, నట్టి పరాక్రమముచేతను, బిత్రృపైతా మహామయిన యీరాజ్యమును మరలఁబొందితిని. పుండరీకాక్షా! అరిందమా! నీకు మాటిమాటికి నమస్కారము. పరిశుద్ధులయిన ద్విజులు నినొక్కనినే పురుషుండనియు *సాత్వతులకు పతియని యుఁ జెప్పెదరు; బహువిధములగు నామములచేత స్తుతించెదరు. విశ్వకర్మా! విశ్వాత్మా! విశ్వసంభవా! విష్ణూ! జిష్ణూ! హరీ! కృష్ణా! వైకుంఠా! పురుషోత్తమా! నీకు నమస్కారము. పురా

* భక్తులకుఁ బాలకుఁడని యర్థము.

ణుండవగు నీవదితియందు * నేడుమార్లు గర్భత్వమందుంటివి. నీ యొక్కఁడవే పృశ్నిగర్భుఁడవుగా నుండినవాఁడవు.నిన్ను† త్రియుగుఁడనియుఁ జెప్పెదరు. నీవొక్కండవే శుచిశ్రవుఁడు, హృషికే శుఁడు, ఘృతార్చిస్సు,వాంసుఁడు, త్రిచక్షువు, శంభుడు, విభుఁడు, దామోదరుఁడునని చెప్పఁబడుచున్నావు. నీవే వరాహుండవు, అగ్నివి, బృహద్భానుడవు, వృషభుఁడవు, తార్క్ష్యలక్షణుఁడవు, అనీకసాహుఁడవు, పురుషుఁడవు, శిపివిష్టుఁడవు,ఉరుక్రముఁడవు,వరిష్ఠుఁడవు, ఉగ్రసేనానివి, సత్యుఁడవు, వాజసనివి, గుహుఁడవు, అచ్యుతుఁడవు, శత్రువులకు చ్యుతిగలిగించువాఁడవు, సంస్కృతుఁడవు, వికృతివి, వృషుఁడవు, కృష్ణపర్ష్ణుఁడవు. ఆదివి, వృషదర్భుఁడవు, వృషాకపివి, సింధువవు, విధూర్మివి, త్రికకుప్పు, త్రిధాముఁడవు, త్రివృత్తు, అచ్యుతుఁడవు, సమ్రాట్టు, విరాట్టు, స్వరాట్టు, స్వారాట్టు, భూతమయుఁడవు, భవుఁడవు, విభుఁడవు, భువు (భూఃఁ),అతిభువు (అతిభూఃఁ) కృష్ణుఁడవు, కృష్ణనర్ష్ణుఁడవు. నీవే స్విష్టకృత్తు, భిషజావర్తుఁడవు, కపిలుఁడవు, వామనుఁడవును. నీవే యజ్ఞుఁడు, ధ్రువుఁడు, పతంగుఁడు, జయత్సేనుఁడనియును జెప్పఁబడుచున్నావు. నీవే శిఖండివి, నహుషుఁడవు, బభ్రువు, దివిస్పృక్కు, పునర్వ

---

* అదితియందు నేడుమార్లు గర్భమగుట యెట్లన- అదితియందు ఆదిత్యులలోఁ బండ్రెండవవాఁడగు విష్ణుఁడును వామనుండునని రెండుమార్లు అదితిరూపాంతరములగు పృశ్ని మొదలగు వారలందు పృశ్నిగర్భుఁడు పరశురాముఁడు దశరథరాముఁడు బలరాముఁడు కృష్ణుఁడనని యేనుమార్లు కానవెరసి యేడుమార్లని తెలియునది.

† త్రియుగుఁడు మూఁడు జంటలు అనగా జ్ఞానశక్తులు, బలైశ్వర్యములు, వీర్యతేజములు అను మూఁడు జతల గుణములు గలవాఁడని యర్థము.

నుప్పు,నుబభ్రువు, రుక్మయజ్ఞుఁడు,సుషేణుఁడు, దుందుభియు, నీవు గభస్తినేమి, శ్రీపద్ముఁడు, పుష్కరుడు, శుష్మధారణుడు, బుభువు, విభువు, సర్వసూక్ష్ముఁడు, ధరిత్రియనియుఁ జెప్పఁబడుచున్నావు. అంభోనిధియు నీవే. బ్రహ్మయు, పవిత్రంబగు ధామమును, ధర్మవిదుండును, హిరణ్యగర్భుండును, పురుషుండును, స్వధయు (స్వధా), స్వాహాయును, కేశవుండును నీవే. కృష్ణా! నీవే జగమునకు నుత్పత్తియుఁ బ్రలయమును. నీవే మొదట నీ విశ్వమును సృజించుచున్నావు. విశ్వయోనీ! ఈవిశ్వమును నీవశమందున్నది. శార్ఙ్గమును జక్రమును ఖడ్గమును పాణియందుఁ గలవాఁడా! నీకు నమస్కారము' అని స్తుతించెను. ఇట్లు ధర్మరాజు సభామధ్యమున స్తుతింపఁగాఁ బద్మాక్షుఁడగు యదుశ్రేష్ఠుఁడు కృష్ణుఁడు సంతోషముగడలుకొనఁ బాండవజ్యేష్ఠుఁడగు ధర్మపుత్రునిఁ బూర్ణంబగు శుభవచనంబుల నభినందించెను. ధర్మరాజు కీర్తించిన యీ విష్ణునామశతమును బఠించువాఁడును వినువాఁడును బాపములన్నింటినుండి విడివడును. ఇది నలువదిరెండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{ధర్మరాజు భీమాదులకు దుర్యోధనాదుల గృహముల నొసంగుట.}

అంత రాజు ధర్మపుత్రుఁడచట వచ్చిన ప్రజలనందఱను వీడుకొలుపఁగా వారు తమతమగృహములకుం బోయిరి. పిదప ధర్మరాజు భయంకరపరాక్రముం డగుభీమునిని అర్జునుని నకులసహదేవులనును జూచి తిన్ననిమాటల బుజ్జగించుచు 'భరతసింహములారా! మహాయుద్ధమందు శత్రుల వెక్కులాయుధములచేఁ

దేహములు గొట్టువడియున్నవి. శోకమునను గోపమునను దాపమునను మీరు మిక్కిలి యలసిసొలసి యున్నారు. నన్నుఁ బట్టి మీరు మిక్కిలి తక్కువవారలుంబోలె నడవికిం జని దుఃఖం బగు మనికి ననుభవించితిరి గదా? కాఁబట్టి యిఁకమీకు సుఖ మగునట్లును, మీయిచ్చనచ్చినట్లును, ఈజయమువలనిఫలమును ననుభవింపుఁడు. మీ రిలపుఁ జేస్కొని మీమీకార్యసటుత్వము లను మరలఁ బూర్ణముగా నొందుఁడు. రేపు వేకువను మిమ్ముఁ గలసెదను' అనెను. అంత నింద్రుఁడు తనమందిరమును బొంది నట్లు మహాభాహుం డగుభీముఁడు ధృతరాష్ట్రుని యనుజ్ఞగొని తనయన్న యొసంగినదుర్యోధనునిగృహమును బొందెను. అది యుప్పరిగలచేత నొప్పగులుకుచు, పలువిధనుల రత్నములచేఁ బర్వి దాకసిలును దాసులును నెరసి బెరసియుండ మొఱయు చుండెను. అర్జునుఁడు రాజు నాజ్ఞచేత దుశ్శాసను భవనమును బొందెను. అదియు నుప్పరిగల వదుసలతోఁగూడి బంగారుతోరణములచే రంగారుచు దాసీదాసులచే నిండి, ధనధాన్యము లవ్వారిగాఁ గలిగి దుర్యోధనునిగృహమువలెనే వెలుంగుచుండెను. మహారాజు ధర్మపుత్రుఁడు నకులునకు దుర్ధర్షుని భవనము నొసంగెను. అది దుశ్శాసనుని గృహమునకంటె మేలయినది. అది రత్నములచేతను బంగారముచేతను నలంకృతమై కుబేరుని భవనమువలెఁ జూపట్టుచుండెను. నకులుఁడు పేరడవియందు నలజడిచే స్రుక్కియున్న వాఁడుగాన యది యతనికే మిక్కిలి తగియుండుటంబట్టి రాజు ప్రీతిమీఱ నా భవనము నతనికొసం గెను. పిదపఁ దనకు నెప్పుడును బ్రియములాచరించుచుండు సహా దేవునకు దుర్ముఖుని మేటిభవనము నొసంగెను. అది కాంతివెం

పుసాంపారుచు, బంగారముచే సింగారింపఁబడి, తామరజోకుల వంటి వెడందఁగన్నుంగవలఁ జెన్నారుచిన్నారిపూన్పుఁబోండ్లను మేలిపూసెజ్జలును నెరయఁగలిగి యుండెను. నకులుఁడు దానిని, కుబేరుఁడు కైలాసముఁ బొందినట్లుంబోలెఁ,బడసి యెంతయు ముదమునొందెను. యుయుత్సుండును విదురుండును సంజయుండును సుధర్ముఁడును *ధౌమ్యుఁడును దమతమగృహములకుఁ బోయిరి. బురుషవ్యాఘ్రుండగు కృష్ణుండు సాత్యకిఁగూడి వ్యాఘ్రము పర్వతగుహంబోలె, యర్జునునిభవనమును బ్రవేశించెను. అందుఁ బలువిధములయిన భక్ష్యములచేతను నన్నములచేతను బానీయములచేతను వారందఱును ముదమొంది యారాత్రి మిక్కిలి సుఖంబుగా వసించియుండి వేకువను హాయిగా మేలుకొని రాజగుధర్మపుత్రునికడకు వచ్చినవారయిరి. ఇది నలువది మూఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

ధర్మరాజు ప్రజలకును బంధువులకును ధనాదులొసంగి కృష్ణునిఁ గుశలప్రశ్నము చేయుచు స్తుతించుట.

జనమేజయుఁడు వైశంపాయనునితో 'మహర్షీ ! ధర్మరాజు రాజ్యమును బడసినపిదప మతీయు నేమిచేసెను ? ముల్లోకములకును బరమగురుండయినభగవంతుఁడు కృష్ణుండేమిచేసెను?

* ఇట ధౌమ్యుఁ డెప్పటియట్ల హస్తినాపురమునఁ దనగృహమునకుఁ బోయెననుట యెట్లు ? అనినికి ముం దాపట్టణమున సుధర్మునకుంబోలె గృహముండుట విచార్యము.

వీనిని నాకు వివరించిచెప్ప'మనెను. వైశంపాయనుఁడు 'అనఘా! వానుదేవుని మున్నిడికొని పాండవు లేమిచేసిరో కలరూపునఁ జెప్పెదను వినుము. ధర్మరాజు రాజ్యమును బడిసినపిదప సకల వర్ణములవారిని నడంకువతోఁ దమతమధర్మంబులందు వర్తించునట్లు దిట్టపఱిచెను. అతఁడు మహోత్సవయినస్నాతకబ్రాహ్మణులను వేగురి నొక్కొక్కరికి వేయినిష్కము లిచ్చి, దృప్తిగావించెను. అక్లి కొలిచి బ్రతుకుభృత్యులను నాశ్రితులగు నతిథులను బీదలను గుఱిచెప్పువారలను(తార్కికులను) నందఱను వారికోరికలనెల్లనిచ్చి తృప్తులను గావించెను. అతఁడు పదునాలుగువేలగోవులను, ధనమును, బంగారమును, వెండిని, నానావిధవస్త్రములను, బురోహితుం డగుధౌమ్యునకు దానముచేసెను. మఱియుఁ గృపుఁడు విదురుఁడు మొదలయినవారిని దండ్రులంబోలెఁ బూజించి సంతుష్టులను గావించెను. ఆధర్మపుత్రుఁడు దాతలందు మిన్నగావునఁ దన్నాశ్రయించిన వారినందఱను బలువిధములయిన భక్ష్యములచేతను నన్నములచేతను బానములచేతను, వస్త్రములు శయనములు ఆసనములు మొదలయినవానిచేతను, సంతోషింపఁజేసెను. అంత నారాజు *లభించిన ధనాదులకు దానియందలి కొంతభాగము పుత్రులకునొసంగుటచేత శాంతికము గావించి యుయుత్సునిని ధృతరాష్ట్రునిని దగినట్లు సత్కరించెను. అతఁడు ధృతరాష్ట్రునికిని గాంధారికిని విదురునకును రాజ్యమును నివేదించి దాను నెమ్మదినొంది సుఖంబుండెను. అట్లు పట్టణమువారిని దక్కినవారినందఱను మనస్సుకలంక

* ఇందులకు 'లబ్ధప్రశమనం కృత్వా' అని మూలము. 'దీనికి రాజ్యమందు నిమ్మళపాటును లభించునట్లు చేసి' యని ప్రతాపచంద్రరాయల వ్యాఖ్య.

లేకుండునట్లుచేసి యంత ధర్మరాజు చేదోయి గీలించి మహాత్ముం డగుకృష్ణునికడకుఁబోయెను; అట మేరుపర్వతమున నున్నట్ల నిమేషుమువలె రత్నములుచాపిన పెద్ద బంగారుమంచముపయి నాసీనుండై యున్న కృష్ణునిఁగాంచెను. అతఁడు దివ్యాభరణ భూషితుండై తనదివ్యదేహముచేతనే యెంతయు తలతల మెఱయుచుండెను. అతఁడు పచ్చనిపీతాంబరము గట్టి, బంగారముచేతఁ బొదిఁగిన నీలమణివలె వెలుంగుచుండెను. అతని వక్షఃస్థలమునందున్న కౌస్తుభమణి యుదయపర్వతమునం దుదయించుచున్న సూర్యునివలెఁ దేజరిల్లుచు నతనికెంతయు సొంపుగూర్చుచుండెను. అతనికి ముల్లోకములందును సాటియేదియుఁగలుగదు. ఆధర్మరాజు పురుషోత్తముండును మహాత్ముండు నగువిష్ణువును జేరి చిఱునవ్వుదొలఁకు తియ్యనిపలుకుల నతనితో 'బుద్ధిమంతులయందు మేలుబంటీ! ఈరాత్రి నీకు హాయిగాఁ దెల్లవాఱెనే కదా? అచ్యుతా! నీజ్ఞానేంద్రియములన్నియుఁ దెలివినొందెనా? అట్లే నిన్నుఁబొంది ప్రకాశించుచున్న బుద్ధియుఁ దేటనొందెనా? *త్రిలోకములగతివైన వాఁడా! త్రివిక్రమా! నీ యనుగ్రహము చేత మేము రాజ్యమునొందితిమి. భూమి మావశమందున్నది. జయమును మేలయినకీర్తియుఁ గలిగినవి. ధర్మమునుండి చ్యుతులము కామయితిమి' అనెను. ధర్మరాజిట్లుచెప్పుచున్నను గృష్ణుఁడేమియుఁబలుకక ధ్యాననిష్ఠయందే యుండెను. ఇది నలువది నాలుగవయధ్యాయము.

---

* 'త్రిలోకగతివిక్రమ' అనిమూలము. 'త్రిలోకగతవిక్రమ' అను పాఠమున మూఁడులోకములను బొందిన పరాక్రమముగలవాఁడా యని యర్థము.

రాజధర్మపర్వము.

కృష్ణుఁడు ధర్మరాజును ధర్మములు వినుటకై భీష్ముని కడకుఁ బొమ్మని చెప్పి తాను నతనిప్రార్థనచే భీష్మునికడకుఁ బోవఁ బూనుట.

ధర్మరాజు, 'మహాపరాక్రమశాలీ ! నీవేమో ధ్యానించుచున్నావే ! ఇది యెంతో యాశ్చర్యముగా నున్నది. లోకపరాయణా ! ఈ మూఁడులోకములకును శుభమేకదా ! నీయింద్రియములును మనస్సును బుద్ధియందుఁ జొప్పింపఁబడి (లయించి) యున్నవి. * జాగ్రత్తు స్వప్నము సుషుప్తి యనెడు మూఁడవస్థలకు నవ్వలిదియైన నాలుగవధ్యానావస్థ నూఁది స్థూలసూక్ష్మకారణము లనుమూఁడుశరీరములకు నవ్వల నీజీవుఁడుండుటకు నామనసు మిక్కిలి యాశ్చర్యపడుచున్నది. శరీరమునందు నెలకొన్న యైదువిధములగు ప్రాణవాయువులును నడఁపఁబడియున్నవి. మీయింద్రియము లన్నియు మనస్సునందు నెలకొల్పంబడియున్నవి. వాక్కును మనస్సును మహత్తత్త్వమను సమష్టిబుద్ధియందుఁ జొనుపఁబడియున్నవి. శబ్దాదిగణములును దానిని దెల్లియు నింద్రియములు నాత్మయం దడంగియున్నవి.

---

* 'అపక్రాన్తో యతోజీవస్తేనమే విస్తరంమనఃఁ' అని (దా. మూ) 'యతోదేవ లేన'అని (జై. మూ). జాగ్రత్తు స్వప్నము సుషుప్తి అనుమూఁడవస్థలును సామాన్యజనులకుఁగలుగును. నాలుగవదియగు తురీయావస్థ యోగులకుఁ గలుగును. ఆయవస్థయందుఁ బ్రపంచమంతయు నెంతమాత్రముతోఁపక యాత్మ'యం తర్గతమగు తనయందో బ్రహ్మమునందో నెలకొనునని అద్వైతసిద్ధాంతము. మనస్సు ఇంద్రియముల కధిష్ఠానమయిన యొక యింద్రియము. బుద్ధి విమర్శన సాధనమయి యంతఃకరణచతుష్టయములో నొక్కటియగును.

యోగస్థితియం దున్ననీబుద్ధియు మనస్సును మేనియందలి రోమములను గదలక స్థిరములై యున్నవి. మాధవా! కట్టియవలెను గొండవలెను తాతివలెను నే చేష్టయులేక యున్నావు. అచ్యుతా! దేవా! గాలిలేనిచోటఁ గలదీపము కంపములేక వెలుంగునట్లు సమాధియందు స్థిరుఁడైకదలక మెదలక వెలుంగుచున్నావు. ఇది యెందులకో వినుటకు నేను దగుదునేని, నీకును నిది వెలిపుచ్చఁ దగునేని, నిన్నుఁజెంది వేఁడుచున్న నాకు నీ సందేహమును ద్రుంపుము. పురుషోత్తమా! నీ వీ లోకమును సృజించువాఁడవును; ద్రుంచువాఁడవును. నీవే *క్షరమును నక్షరమును. నీ వాదియు నంతమును లేనివాఁడవు. అన్నిటి కంటె నాద్యుఁడును నీ వొక్కఁడవే. ధర్మపాలకులందు మేటివి గదే! నిన్ను శరణొంది శిరస్సుచేఁ బ్రణతుండ నయిన నీభక్తునికి నాకు నీ యాధ్యాసము కలరూపును జెప్పుము' అనెను. అంతఁ గృష్ణుడు మనోబుద్ధీంద్రియములను, వానివాని పట్టుల యందుంచికొని చిఱునవ్వుతోడ ధర్మరాజుం జూచి 'ఆఱిపోవుచున్న యగ్నివలె శరతల్పగతుండై యున్నపురుషసింహుఁడు భీష్ముఁడు నన్ను ధ్యానించుచున్నాఁడు. కాన నామనస్సు నతని కడకుఁబోయినది. పిడుగుమోగ్గితవలె నులియునెవ్వని యల్లె త్రాటిధ్వనిని నింద్రుఁడు సయితము సయింపఁజాలఁడో యాభీష్మునియందు నామనస్సు పోయినది. ఎవ్వఁడు తొల్లి రాజసమూహమునంతయు బలిమిచే జయించి మువ్వురు కన్నియలను వరించి తెచ్చెనో వానికడకు నామనసుపోయినది. ఎవ్వఁడిరువది మూఁడురాత్రులు పరశురామునకుఁ బోరాటమిచ్చెనో, అప్ప

* నిత్యవస్తువులును అనిత్యవస్తువులును.

టికి నారాముఁడవనిని మీఱలేకపోయెనో, యట్టివానియెడకు నామనసుపోయినది. అయ్యా ! ఏభరతతిలకుని గంగ తన గర్భ మందుఁ దాల్చికనెనో యావసిష్ఠశిష్యునియెడకు నామనసుపోయి నది. ఏబుద్ధిమంతుఁడు మిక్కిలిఁయుఁ దేజంబురాజిల్ల దివ్యాస్త్ర ములను మఱిసాంగములగు చతుర్వేదములను దాల్చునో యా తనికడకు నామనస్సుపోయినది. అతఁ డింద్రియముల నొక్కటి గాఁజేసి మనస్సును బుద్ధితోఁగూర్చి నన్ను శరణుఁజొచ్చినాఁడు. కాఁబట్టి యతనికడకు నామనసుపోయినది.అతఁడుజరిగినదియు జరు గనున్నదియు నెఱుఁగును. అతఁడు ధర్మ విదులందు తలమున్న చు మీ; కాన యతనికడకు నామనసుపోయినది.పురుషసింహుండును మహాత్ముండు నయినయాభీష్ముఁ డడఁగిపోయెనేని భూమి చంద్రుఁడు లేని రాత్రివలెనగునుజుమీ. కాఁబట్టి ధర్మరాజా! గంగాపుత్రుం డయినయాభీమునికడకుఁ బోయి మ్రొక్కి పాదములు పట్టుకొని ధర్మార్థకామమోక్షములను, వైదికధర్మంబును, నాలుగాశ్రమ ములను క్షత్రియధర్మముల నన్నింటిని మఱియు నీమనసునందుఁ గలదానిని నడిగి తెలిసికొనుము. కౌరవులకెల్ల మునుపటివాఁడగు నాభీష్ముఁ డస్తమించెనా, లోకమందు జ్ఞానములు మిక్కిలికుఱుచ లగును.కాఁబట్టి యతనికడకుఁబొమ్మని నినుఁబురికొల్పుచున్నాను' అనెను. కృష్ణుఁడు చెప్పినయా మేలిమాటలను యథార్థములయిన వానిని విని ధర్మరాజు కన్నీటిచేనెలుంగు డగ్గుత్తికవడ నతనితో 'మాధవా ! భీష్ముని ప్రభావమునుగుఱించి నీవు చెప్పినదంతయు నిజమే. అందునాకు సందేహములేదు. మహాతేజా! భీష్ముని ప్రభా వమును నతనిమహాభాగ్యమును మహాత్ము లయినబ్రాహ్మణుల మూలమున నాకు వినికిగలదు. శత్రునిషూదనా ! లోకములకుఁ

గర్తవగునీవును నిట్లె చెప్పుచున్నావు. యదునందనా ! నీమాట నిజమాయని విచారింపను వలయునా ? మాధవా ! నన్నును గ్రహింపవలయునని తలంపు నీకుఁ గలదేని నిన్ను మున్నిడికొనియే మేము భీష్మునియొద్దకుఁ బోవుదుము. సూర్యుఁడు త్తరాయణము నకుఁ దిరుగఁగానే యతఁడు లోకాంతరము నొందఁగలఁడు. కాఁ బట్టి నీ దర్శనమతనికిఁ బడయఁదగును. లోకంబుల కాద్యుఁడును క్రూరాక్షరరూపుఁడును నగుదేవుని నీదుదర్శన మతనికిఁ బెద్దలా భము. నీవు బ్రహ్మమయంబగు నిధివేకదా' యనెను. అదివిని కృష్ణుఁడు ప్రక్కనున్న సాత్యకునిఁజూచి 'నా తేరి నాయిత పఱుపు' మనెను. తోడనే సాత్యకి కృష్ణునిపొంతనుండి శీఘ్రముగా వెలికి వచ్చి దారుకునితో 'శ్రీ కృష్ణులరథ మాయితపఱుపు' మనెను. అదివిని దారుకుఁడు కృష్ణుని రథమాయితపఱుచెను. అందలి యం గము లెల్ల బంగారుచే నలంకృతము లై యుండెను. మరకతమణుల చేతను జంద్రకాంత సూర్యకాంతమణులచేతను నందందు రచిత ము లై విభంగమ్ములు వెలుగుచుండెను. దానిచక్రములు బంగారు కట్లు గలిగియుండెను. అది సూర్యునికాంతివలె ధగధగ వెలుం గుచు నాశ్చర్యకరము లయిన పెక్కురత్నములచేత నలంకృత మగు మధ్యభాగముగలిగి క్రొత్తగా నుదయించిన సూర్యమండ లమువలెఁ బ్రకాశించుచుండెను. దానికి సొగసయిన గరుడధ్వజ మును బతాకలును గట్టంబడియుండెను. మిక్కిలియు వేగముగాఁ బఱచునట్టి యా మేటిరథమునకు బంగారుసొమ్ములుదాల్చినవై మ నోవేగములగు శైబ్య సుగ్రీవాదులగు నుత్తమాశ్వములను బూ న్చి తేరాయితమయ్యెనని దారుకుఁడు కృష్ణునికడకువచ్చి చేతులు

మోడ్చి నిలిచి విన్నవించినవాఁడయ్యెను. ఇది నలువదియైదవయ ధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు కృష్ణునిఁ బలుమాఱు స్తుతించుట. కృష్ణ ధర్మపుత్రాదులు భీష్ముని కడకుఁబచ్చుట. భీష్ముఁడు కృష్ణుని దర్శించి ముక్తినొందుట.

జనమేజయుఁడు వైశంపాయనునితోఁ 'పాండవుల పితామహుండు భీష్ముఁడు శరతల్పంబునం బరుండి యెట్టియోగసమాధి నొందెను? ఎట్లు దేహమునువిడిచెను? జెప్పుము' అని యడిగెను. వైశంపాయనుఁడు 'రాజా ! మహాత్ముండగు భీష్ముఁడు శరీరమును విడిచినవిషయమును శుచివై యాలించివినుము. సూర్యుఁడు దక్షిణాయణమునఁ బ్రవర్తింపఁగానే మాఘమాసమున శుక్లపక్షము నష్టమియందు మృగశీర్షానక్షత్రము నడిమిభాగమును సూర్యుఁడు పొందినపుడు భీష్ముఁడు సమాధినొంది మనంబు నాత్మయందే లయింపజేసెను. వందలకొలఁది బాణములు పర్వియున్న దేహముతో భీష్ముఁడు పెక్కులు కిరణములు పర్వుచున్న సూర్యమండలమువలె మిక్కిలి కాంతిగలిగి వెలుంగుచుండెను. వ్యాసుఁడు, దేవశ్రవుఁడు, నారదుఁడు, దేవస్థానుఁడు, వాత్స్యుఁడు, సుమంతుఁడు, అశ్మకుఁడు, జైమిని, పైలుఁడు, శాండిల్యుఁడు, దేవలుఁడు, మైత్రేయుఁడు, అసితుఁడు, వసిష్ఠుఁడు, కౌశికుఁడు, (విశ్వామిత్రుఁడు) హారీతుఁడు, లోమశుఁడు, ఆత్రేయుఁడు, బృహస్పతి, శుక్రుఁడు, చ్యవనుఁడు, సనత్కుమారుఁడు, కపిలుఁడు, వాల్మీకి, తుంబురుఁడు, కురుఁడు, మౌద్గల్యుఁడు, పరశురాముఁడు, తృణ

బిందుఁడు, పిప్పలాదుఁడు, వాయువు, సంవర్తుఁడు, పులహుఁడు, కచుఁడు, కాశ్యపుఁడు, పులస్త్యుఁడు, క్రతువు, దక్షువు, పరాశరుఁడు, మరీచి, అంగిరస్సు, కాశ్యుఁడు, గౌతముఁడు, గాలవుఁడు, ధౌమ్యుఁడు, విభాండుఁడు, మాండవ్యుఁడు, కృష్ణానుభౌతికుఁడు, ఉలూకుఁడు, మార్కండేయుఁడు, భాస్కరి, పూర్ణుఁడు, కృష్ణుఁడు, సుధర్ముఁడు మొదలయినవారును, శ్రద్ధ, శమము, దమము, మొదలగు సుగుణములు గలవారును, మహాత్ములునగు పెక్కుఋషుల సమూహములచేఁ బరివృతుం డయినభీష్ముఁడు, గ్రహనక్షత్రములచేఁ బరివృతుం డగుచంద్రునింబోలెఁ బ్రకాశించెను. ఆపురుషసింహుండు శరతల్పంబున నుండి శుచియై చేతులు మోడ్చికొని మనోవాక్కాయంబులచేత శ్రీకృష్ణుని ధ్యానించి జగత్పతియు,మధుసూదనుండును,యోగేశ్వరుండును, పద్మనాభుండును, జిష్ణుండును, అనాదినిధనుండును, ఆత్మయోనియు, సనాతనుండును, నగు వాసుదేవునిఁ గృష్ణుని నుబ్బునఁ జెలంగు నెలుంగున నిట్లుస్తుతింపఁ దొడంగెను. మాటకారులందు మిన్నయగు నాపరమధర్మాత్ముండు భీష్ముఁడు వాసుదేవు నిట్లుస్తుతించెను. 'శ్రీకృష్ణు నారాధింపఁగోరి సంగ్రహముగను విస్తరముగను నేను జెప్పఁదలంచుమాటకు నా పురుషోత్తముఁడు సంతోషించుఁగాక. శుచియు, శుచియగుపదము (స్థానము) గలవాఁడును, హంసుండును (ఉత్తమపదమందుండువాఁడును), తత్పరుండును (సమస్తమునకు నధికుఁడయినవాఁడును) పరమేష్ఠియు, ప్రజాపతియు నగు నాపరనూత్ముని నాయాత్మయంతటితో నొక్కటిగా యోగసమాధిచేఁ జేర్చి శరణమొందుచున్నాను. దేవతలును ఋషులును, ఆద్యంతములులేని పరబ్ర

మ్మామును నెఱింగినవారుగారు; లోకమును సృజించిన భగవంతుఁ డగునారాయణుఁ డొక్కఁడే యెఱుఁగును. దుఃఖములకు నౌషధ మయిన యాపరబ్రహ్మమును దేవతలును, దేవర్షులును, సిద్ధు లును, దక్కిన ఋషిసమూహములును, మహోరగులును, నారా యణునివలననుండి తెలిసికొనిరి. దేవతలును. అసురులును, గంధ ర్వులును, యక్షులును, రాక్షసులును, పన్నగులును, నందఱును 'ఇతఁడెవఁడు? ఎక్కడనుండి కలిగెను? భగవంతుఁడట్లయ్యె?' నని కలరూపును దెలిసినవారుగారు.* వలయందుఁ బిట్ట లడంగి యుండునట్లు, ఈలోకములును బ్రజలును నతనియం దడఁగి వె లుంగుచుండును. కాన యతఁడు జగమునకుఁ గోశమనఁబడు చున్నాఁడు. గుణ(శేష)భూతము లయినయీ లోకము లన్ని యును దారమునఁ గ్రుచ్చిన మణిగణములవలె భూతేశుండగు నతనియందు నెలకొనుచున్నవి; లయించుచున్నవి. అధ్యా త్మతత్త్వముల విచారించునిపుణు లతనిని విశ్వమున కంతయుఁ గర్తగాను స్థావరజంగమములకుఁ బతిగాను జగంబున కధ్య క్షునిఁగాను జెప్పెదరు. విశ్వము నంగములుగా (దేహముగాఁ) గలిగి, విశ్వమును బనిగానుగలిగి, నిత్యుఁడై, యంతట వ్యాప్తుఁ డై, యుండు నతనియందు గట్టిదారము పోఁగునందుఁ బూదండ పూలవలె, విశ్వమందలి చేతనాచేతనములు గ్రువ్వంబడియున్నవి.

---

* 'యమాహుర్జగతః కోశం యస్మింశ్చనిహితాఃప్రజాః । యస్మిల్లోకాఃస్థిరస్త్యేతే జాలే శకునయోయథా' అనిమూలము. ఔ. మూలమున 'జలే శకునయోయథా' యనిపాఠము. 'నీవుజగమునకుఁ గోశము. నీయందుప్రాణులుంపఁబడియున్నారు. జలమందు హంసాదిపక్షులవలె నీయందు లోకములు దేలుచున్నవి' అని యర్థము.

కిరీటములు గలవేయిశిరసులు గలవాఁడును, వేయికరములును జరణములును నేత్రములును గలవాఁడును, వేయిముఖముల వెలుంగువాఁడును, జగంబునకుఁ బరమగతియు నగు దేవుని నారాయణుండని పలుకుదురు. అతఁ డణువులలో మిక్కిలి యణువుగాను బెద్దవియగువానిలో మిక్కిలి పెద్దవాఁడుగాను, బరువయినవానిలో మిక్కిలి బరువైనవాఁడుగను, గొప్పవానిలో మిక్కిలి గొప్పవాఁడుగను నున్నాఁడు. వాకములందును (మంత్రములందును), అనువాకములందును (బ్రాహ్మణములందును), నిషత్తులందును (ఉపాసనావిధులందును), ఉపనిషత్తులందును, సత్యంబగు (అమోఘంబగు) కర్మములుగలవాఁడుగను సత్యప్రతిపాదకములగు సామములందు సత్యముగాను జెప్పఁబడుచున్నాఁడు. హృదయమందు నెలకొని, యుపాసకులగు భక్తులనుఁబాలించుచు (వాసుదేవసంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధులను) నాలుగురూపములు గలిగిన యద్దేవుని,దివ్యములును రహస్యములు నగునాలుగు పరమనామములచేతఁ బేరొక్కనుచున్నారు. తపము లతనియందే యెప్పుడు నలుపఁబడియుండును. తపము లతనియంగములందు నెలకొనియుండును. అతండు సర్వాత్ముఁడు, సర్వవ్యాపి, సర్వమయుఁడు, సర్వజ్ఞుఁడు, సర్వకర్త. భూమియందు బ్రహ్మవాచకములయిన వేదమును యాగములను గాంచుకొఱకు దేవకీయతనిని, అరణియగ్నినింబోలె, వసుదేవునివలనఁ గాంచినదయ్యె. అమృతత్వము (మోక్షము) నొందుకొఱకు నితరములను గొలువక యతనినే గొలుచువాఁడు మనస్సు నితరములనుండి మరల్చుకొని యాశలన్నియునువీడి కల్మషరహితుఁ డయినయాపరమాత్ముని, యోగముచే హృదయాకాశమందుఁ జూచుచున్నాఁడు.

ఇట్టట్టని తర్కింపను దెలిసికొనను నలవి గానివాఁడు; అం తటను వ్యాప్తుఁడయినవాఁడు; వాయువును నిద్రుని నతిశయిం చినకర్మములు గలవాఁడు; సూర్యాగ్నులను మించిన తేజము గలవాఁడు; బుద్ధికి నింద్రియములకును గోచరింపని స్వరూ పముగలవాఁడు; ప్రజలకుఁ బాలకుఁడు నగునట్టి నారాయణుని శరణుఁజొచ్చెదను. పురాణములందుఁ బురుషుఁ (సర్వవ్యాపి) డనియు, యుగాదులందు బ్రహ్మంబనియు, ప్రలయమందు సంకర్ష ణుండనియు, చెప్పఁబడినవాఁడును నుపాస్యుఁడు నగునతనిని నుపా సించుచున్నాను. ఒక్కండయ్యును బెక్కురూపముల నవత రించువాఁడును, అధోక్షజుండును, ఇంద్రియములచేఁ దెలియ రానివాఁడును, సమస్తకామములనొసంగువాఁడును, నగునతని నితరములను గొలువని భక్తులు విహితములగు కర్మముల నాచ రించుచు యజించుచున్నారు. సత్యుండును, ఏకాక్షరమగు నోం కారస్వరూపుఁడును, బ్రహ్మమును, సదసత్తులకుఁ బరుండును, ఆది మధ్యాంతములు లేనివాఁడు నయినయాయిశ్వరుని దేవత లును ఋషులు నిక్కముగా నెఱుంగరు. దేవతలును, అసురు లును, గంధర్వులును, సిద్ధులును, ఋషులును, ఉరగులును నంద ఱును ప్రయత్నులై సుఖమునకు భేషజమయిన యీపరమును నెప్పు డును నర్చించుచుందురు. ఆదియు నంతము లేనివాఁడును, దేవుఁ డును, సనాతనుఁడును, చూడను దెలియనివాఁడును, తనకుఁ దానే కారణమైనవాఁడును, ప్రభుండును, నారాయణుండు నగు హరి నందఱును బూజించుచున్నారు.

భీష్మస్తవరాజము.

దైత్యులను నాశముసేయఁగోరి యదితియందు బంగారు

వర్ణముగల నొకగర్భముగానుండి పండ్రెండువిధములుగా వెలికి వచ్చిన సూర్యుఁడుగా వెలుంగు నాభగవంతునికి నమస్కారము. శుక్లపక్షమందు దేవతలను కృష్ణపక్షమందుఁ బితరులను నమృతముచేఁ దృప్తులఁజేయించినవాఁడును, ద్విజులకు రాజును, సోమరూపుండు నగునాభగవంతునకు నమస్కారము. అగ్ని మొదలయిన దేవతలచేత ధరింపఁబడు నీజగమునందు మొదటి హవిస్సును భుజించు సూర్యుయను రూపముగల యీదేవునకు నమస్కారము. అజ్ఞానమనెడి పెనుచీఁకటికి నవ్వలయై యెందును నిండియున్నయపారతేజమై వెలుంగు నేపురుషునిఁ దెలిసినవాఁడు మృత్యువును గడచునో యీదెలియఁదగిన వస్తువు (జ్ఞేయము) అగువానికి నమస్కారము. సామగులు బృహత్తను సామమందును, ఋగ్వేదు లుక్థమనుమంత్రమందును, యజుర్వేదుల గ్నిచయనమను మహాయజ్ఞమందును, నుపాసించు నట్టివాఁడును, మిక్కిలి యురువైనవాఁడును, వేదస్వరూపుండు నగునతనికి నమస్కారము. పదములను గాలు మొదలయిన యంగములుగాను, ఆపదములసంధులను వ్రేలికణుపులుగాను, అచ్చులను హల్లులను భూషణములు గాను, గలయక్షరస్వరూపుఁడుగను వాగ్రూపుఁడుగను బ్రాహ్మణులుచెప్పునతనికి నమస్కారము. ముల్లోకముల హితముకొఱకు యజ్ఞాంగుఁడగు వరాహరూపుండై భూమి నుద్ధరించిన వీర్యస్వరూపుం డగునతనికి నమస్కారము. ఋగ్యజుస్సామములను మూఁడువేదముల నాధారముగాఁ గలదియు ధాన, కరంభము, పరివాపము, పురోడాశము, పాలనెడు పంచవిధహవిస్సులుగలదియు, గాయత్రిమొదలయిన యేడు ఛందస్సులుగలదియునుగాఁ గావింపఁబడు యజ్ఞము స్వరూపముగాఁ గలవానికి నమ

స్కారము. (ఆశ్రావయ) అని నాలుగును, (అస్తుశ్రౌషట్) అని నాలుగును, (యజ) అని మూఁడును. (యేయజామహే) అని యైదును, (వషట్) అని రెండును నక్షరములుగల మంత్రములచేఁ గావింపఁబడు హోమము రూపముగాఁగల యాతనికి నమస్కారము. గాయత్రి మొదలయిన ఛందస్సు లంగములుగాను, యాగమును శిరసుగాను, *రథంతరము బృహత్తు సామములు రెక్కలుగాను, గల యజుర్వేద మనుపక్షిరూపమున వెలుంగుచు స్తోత్ర రూపుఁ డగునా భగవంతునకు నమస్కారము. విశ్వసృజు లను ప్రజాపతులు వేయేండ్లు చేసినసత్రయాగమందు బంగారు రెక్కలు గలగరుడపక్షిగా నావిర్భవించిన ఋషియగు నాభగవంతునకు నమస్కారము. ధర్మార్థము ముక్తి హేతువగు వేదము నందలి యుపాయము సాధువు లింద్రియములనడంచి పొందఁదగు యోగధర్మ మనుసేతువును గట్టినసత్యరూపుఁడగు నాభగవంతునికి నమస్కారము. వేఱువేఱు ప్రయోజనములనుగోరి వేఱువేఱయినయాచారములతోడ వేఱువేఱుకర్మములచే నారాధింపఁబడు ధర్మరూపుండగు నాభగవంతునకు నమస్కారము. ప్రాణులు సమస్తములును గలుగుటకుఁగారణమును, అవితమయంగములందు మరులుగొని యున్నాదులగుటకుఁ గారణమును, నయినయా కామరూపియగు భగవంతునకు నమస్కారము. ఇంద్రియములకు గోచరించు శరీరమందుండియు మహర్షులకును వెదుకఁదగినంత సూక్ష్మరూపియై యీ దేహమునకు సాక్షియై బుద్ధివలన వెలుంగు క్షేత్రరూపియైన యాతనికి నమస్కారము. 'ఐదుజ్ఞా

*రథంతరబృహత్పక్షః అని (దా.మూ) 'రథంతరబృహత్సామ' అని (ఔ.మూ) రథంతర మనుగొప్పసామధ్వని గలదియని యర్థాంతరము.

నేంద్రియములు, ఐదుకర్మేంద్రియములు, మనసు, ఐదుభూతములు ననెడి యీ పదియాఱింటిచేతను నావరింపఁబడియుఁ దన స్వరూపమునుమాఱుక పదియేడవదియగు జ్ఞానరూపమై వెలుంగుచున్నాఁడు' అని సాంఖ్యులుచెప్పు సాంఖ్యరూపుఁ డయినయీ భగవంతునకు నమస్కారము. ఇంద్రియములనడంచి శ్వాసమును గెలిచి నిదురవీడి సంతోషమున యోగమును జేయువారలకు జ్యోతిగాఁజూపట్టు యోగరూపుఁ డయినయతనికి నమస్కారము. సమస్తమును దిగవిడిచి శాంతులయిన సన్న్యాసులు పుణ్యపాపములను రెంటిని విడిచి పునర్జన్మ మనుభయము లేక దేనిని బొందెదరో యామోక్షము రూపముగాఁగలభగవంతునకు నమస్కారము. అగ్ని ముఖమును, స్వర్గలోకము శిరసును, ఆకాశము నాభియు, భూమి పాదమును, సూర్యుఁడు కన్నును, దిక్కులు చెవులును, ఈలోకములు శరీరమునుగాఁగల యాభగవంతునకు నమస్కారము. నెల, ఋతువు, అయనము, సంవత్సరమునను పెక్కు లంశములచే యుగములందుఁ బుట్టుచుండువాఁడును, సృష్టిప్రలయములు చేయువాఁడును నగు కాలము రూపముగాఁ గలయతనికి నమస్కారము. వేయియుగములతుదిని మిక్కుటముగా జ్వలించుచున్నజ్వాలలు గలయగ్నియై లోకములను గాల్చు కఠోరరూపుఁ డయినయాతనికి నమస్కారము. సమస్తభూతములను దహించి లోకమంతయు నేకార్ణవముగాఁ జేసి తా నొక బాలునిరూపమున నిదురపోవు మాయారూపుఁ డయినయాతనికి నమస్కారము. నాలుగు సముద్రముల నడుమ వేయితలలుగలిగి సాటిలేని మేను గలపురుషుండయి యోగనిద్రసేయు నా భగవంతునికి నమస్కారము. లోకముల కునికిపట్టయినతామరపూవు

ను నాభియందుఁ గలపద్మము రూపముగాఁగలవాఁడయి పుట్టుక లే కుండునా తమ్మికంటికి నమస్కారము. కేశములందు మేఘ ములును, అంగసంధులఁదెల్లను నదులును, ఉదరమున నాలుగు సముద్రములునుగల జలరూపుఁడయిన యతనికి నమస్కారము. ఉత్పత్తి స్థితి ప్రలయము మొదలగు కార్యములను గలిగించు కారణరూపుం డయినయతనికి నమస్కారము. రాత్రి నిదుర పోవునపుడు నిదురింపనివాఁడును, పగట సంగములేని కర్తయు, ఇష్టానిష్టములు రెంటికిని సాక్షియునై యుండు నాత్మరూపియైన యాభగవంతునకు నమస్కారము. సాంత ప్రయోజనములేక ధర్మ కార్యము నిమిత్తమై సమస్త కార్యములందును నడ్డులేని యత్న ముగల యీశత్వమునుగలిగి కార్యరూపుఁ డగునాభగవంతునకు నమస్కారము. ముఖమందు బ్రాహ్మణజాతియు, భుజములందు క్షత్రియజాతియు, కడుపునందును దొడలందును వైశ్యజాతియు, పాదములందు శూద్రజాతియునుగల జాతిరూపుఁడయిన యాత నికి నమస్కారము. అన్నపానములను సాధనముగాఁగొని సార మయిన యింద్రియములను బెంచునదియు శరీరములను దాల్చు నదియునగు ప్రాణము రూపముగాఁ గలయతనికి నమస్కారము. ప్రాణములధారణమున కయినభక్ష్యభోజ్యలేహ్యచోష్యములను నాలుగువిధము లయినయన్నములును భుజించి పక్వము గా వించు జఠరాగ్నిపాకరూపుఁ డగునతనికి నమస్కారము. విష యములందు వర్తించు చున్నమనుష్యులకు వారికిఁ గలరాగ ద్వేషము లనుగుణములకుఁ దగినట్లు లావిషయములను గాచునట్టి రూపుగల యాభగవంతునకు నమస్కారము. ఇంతింతని కొలఁది యిడరాని శరీరముగలవాఁడును, అంతటను గలబుద్ధియు నింద్రి

యములును గలవాఁడును, దుది లేని పరిమాణముగలవాఁడును, దివ్యరూపుఁడునయిన యాభగవంతునకునమస్కారము. కాలము, యజ్ఞము, కార్యము, కారణమునను వీనికి మీఁదయినవాఁడును, కారణము లేనివాఁడును, లోకమున కాదియగువాఁడును నగు విశ్వరూపునకు నాతనికి నమస్కారము. విద్యుత్తునందుఁ గల దియు, జఠరమందుఁ గలదియు, జలమందుఁగలదియు (బొడ చొగ్నియు), వెలుపలఁగలదియునగుననన్నింటినిభక్షించునట్టియగ్ని రూపుండగు నతనికి నమస్కారము. అణిమాదులయిన యైశ్వర్య ములుగలవాఁడయి, పాతాళమునందుండి యీభూమిని మోచు ననంతుఁడనెడి యాదిశేషరూపుం డగునతనికినమస్కారము. దివ్య రూపులగు నగ్నిసూర్యుఁడు చంద్రుఁడు నక్షత్రము లనుజ్యోతు లకును బ్రకాశము నొసంగు తేజోరూపుం డయినయాభగవంతు నకు నమస్కారము. శబ్దము మొదలయిన యైదువిషయములతోడ వెలుంగు జ్ఞానమునందు నావిషయములను చొలంగించి శుద్ధ జ్ఞానమయిన యేయాత్మను శాస్త్రజ్ఞానముచేతఁ దెలియుదురో జ్ఞానరూపుఁడయిన యాభగవంతునికి నమస్కారము. కర్మనిష్ఠయు జ్ఞాననిష్ఠయుఁగల యుత్తమఋషులును, దేవతలును సందేహము తీఱ విచారించి యెవని తత్త్వమును దెలియుచున్నారో యాద హస్యరూపుండయిన భగవంతునకు నమస్కారము. జటలును దండమును దాల్చినవాఁడును, వేలుకాడు బొజ్జ గలమేనుగల వాఁడును, కమండలువు నంపపొదిగాఁ గలవాఁడును, నగు నా బ్రహ్మరూపియగు భగవంతునకు నమస్కారము. కేల శూలము గలవాఁడును, మూఁడుకన్నులవాఁడును, విబూదిపూసిన మేటి లింగమురూపము గలవాఁడును, దేవతల కీశుఁడును, మహాత్ముం

డును, రుద్రరూపుండు నగునా భగవంతునకు నమస్కారము. చంద్రకళచే వెలుంగొందు శీర్షనుగలవాఁడును, సర్పమును యజ్ఞోపవీతముగాఁగలవాఁడును, పినాకమను విల్లును శూలమును గేలందాల్చినవాఁడును, నుగ్రరూపుండును నగునా భగవంతునకు నమస్కారము. వసుదేవుఁడు దేవకియందు నవతరింపఁ జేసిన వాఁడును, గేల శంఖమును చక్రమును గదయుఁగలవాఁడును, నగు వాసుదేవరూపుం డగునతనికి నమస్కారము. తలపునుకల మాలికగలవాఁడును, బులితోలుగట్టినవాఁడును, బూదిపూసిన శరీరము గలవాఁడును నగురుద్రరూపి యగునాభగవంతునకు నమస్కారము. అన్నిటిని రక్షింపఁగోరి ప్రాణులందుఁ బెక్కు దెఱంగుల పాశబంధములచే మోహింపఁజేయు మోహరూపుం డగు నతనికి నమస్కారము. సమస్తప్రాణుల హృదయమందు నుండునదియు నన్నింటినివిడిచి నివర్తించినదియు నాశము లేని దియు సూక్ష్మమునగు చైతన్యము రూపముగాఁ గలయతనికిఁ నమస్కారము. క్రోధము దోహము మోహము మొదలయిన దోషములులేనివాఁడై, ఐదుభూతములును నాత్మయునాభూతము ల యాదియు నంతమునై శాంతి రూపముగాఁగలయతనికి నమస్కారము. అన్నియు నెవనియందుఁ గలవో, అన్నియు నెవని వలననుండి కలుగుచున్నవో, ఎవఁ డన్నియెడలనుండి వెలుం గుచున్నాఁడో, అన్నియు నెవ్వనిరూపమో, ఎవఁడు అన్నింటి రూపమో, యా సర్వరూపుఁ డయినభగవంతునకు నమస్కారము. వేయిపడగలు గలయాదిశేషుఁ డనుదివ్యసర్పముచేత నలంకృత మయినపాలసముద్రమునెడి మంచమునందుఁ బరుండి యున్న నిద్రారూపుం డయినయాతనికి నమస్కారము. విశ్వే

దేవతలు, మరుత్తులు, రుద్రులాదిత్యులు, అశ్వినీదేవతలు, వసువులు, సిద్ధులు, సాధ్యులు ననెడిదేవతలు రూపుగాఁగల భగవంతునకు నమస్కారము. ప్రకృతి, మహత్తు, అహంకారము, మనస్సు, బుద్ధి, యింద్రియములు, పంచభూతసూక్ష్ములు, విశేషములు, ననెడియీతత్త్వములరూపము గలయాభగవంతునకు నమస్కారము. భూతము, భవిష్యత్తు, వర్తమానమనెడి మూఁడు కాలములందు నుండునదియు, భూతముల యాదియు నంతము నైనదియు, సమస్తప్రాణులకును మున్నుగలదియు నగు (సత్య) రూపుం డయినయాతనికి నమస్కారము. సూక్ష్మజ్ఞులయిన జనులు సూక్ష్మమునకంటె సూక్ష్మమయిన యేపరబ్రహ్మరూపమును వెదకి యెఱుఁగుదురో యా సూక్ష్మరూపుండగు భగవంతునకు నమస్కారము. పాతాళమునకుఁబోయిన వేదములను మిక్కిలి వేగముగా నెత్తికొనివచ్చి బ్రహ్మదేవున కియ్యఁదగుమత్స్యావతారముఁబూనిన యా భగవంతునకు నమస్కారము. అమృతమును జిలుకు కాలమందు మంథరపర్వతమును వహింపఁదగినట్లు మిక్కిలి కఠినమైన శరీరముతోడ నమరినకూర్మరూపము గొన్న యతనికి నమస్కారము. వనపర్వతములతోడంగూడిన భూమిని యొక్కపేకోఅపంట నెత్తి వెలికి వచ్చినయద్భుత వరాహరూపుం డగునా భగవంతునకు నమస్కారము. లోకము నంతయు వడఁకించునట్టి నరసింహరూపము గొని హిరణ్యకశిపుం డనువానిని జంపిన యా సింహరూపుండగు భగవంతునకు నమస్కారము. బంగరువన్నెకన్నులును సటలుఁగలదియు గోఅపండ్లును నఖములును గలదియు, నసురరాజయిన హిరణ్యుని నాశమునకుఁ గారణమయినదియు నగుగర్వముఱూపము గల

యా భగవంతునకు నమస్కారము. దేవతలును గంధర్వులును దానవులును దైత్యులును గలరూపు దెలియరాని సూక్ష్మరూప ముగల యతనికి నమస్కారము. మాయచేత వామనరూపము దాల్చి బలిచక్రవర్తి నడంచి మూఁడులోకములను కాలియడు గులచేతఁ గడచిన శూరరూపుఁ డయినయాతనికి నమస్కారము. ఆయుధధారులందు మిన్నయైన జమదగ్నికుమారుఁడును భూమిని క్షత్రియరహితముగాఁ జేసినవాఁడును నయిన పరశురాముఁ డుగా నవతరించిన యాభగవంతునికి నమస్కారము. ధర్మమును మిక్కిలియు దిగవిడిచిన తప్పనకై యుద్ధమందుఁ దా నొక్కఁ డును నిరువదియొక్కమాఱు క్షత్రియులను వధించిన కోప రూపుండగు నా భగవంతునకు నమస్కారము. శరీరమునందుఁ దన్ను నయిదు విధములుగా విభజించుకొని ప్రాణులను చేష్ట గలవానినిగాఁజేయు ప్రాణవాయురూపుండయిన యా భగవంతు నకు నమస్కారము. దశరథకుమారుం డయినరాముఁడుగా నవ తరించి పులస్త్యకులమందుఁ బుట్టిన రావణుని యుద్ధమందుఁ జంపిన క్షత్త్రియరూపుం డయినయాభగవంతునకు నమ స్కారము. నాఁగేటిని రోఁకటినిదాల్చి నల్లని వస్త్రముగట్టి రోహిణీపుత్రుఁ డయినబలరాముఁడుగా నవతరించి యా భోగ రూపుండయిన భగవంతునికి నమస్కారము. శార్ఙ్గమను వింటిని శంఖమును చక్రమును ధరించినవాఁడును, పీతాంబరము ధరిం చినవాఁడును, వనమాలఁ దాల్చినవాఁడును నగు కృష్ణరూపుం డగు నతనికి నమస్కారము. కంసునిఁ జంపఁగోరి గోకులమందు వసుదేవుని కుమారుఁడుగా నవతరించి విహరించిన శ్యామంతుడును లీలారూపుఁడు నయిన యతనికి నమస్కారము. యదువంశము

నందుదయించి వసుదేవునిపుత్రత్వము నొంది భూమిభారము నడఁగించిన శ్రీకృష్ణరూపుండగు నతనికి నమస్కారము. యుద్ధమునం దర్జునునకు సారథియై మూఁడులోకములకును హితమున కై గీతామృతము నొసంగిన యాబ్రహ్మరూపుం డయినభగవంతునకు నమస్కారము. మరల లోకమును రక్షింపఁగోరి యసురులను వశముచేసికొని బుద్ధరూపమును దాల్చినయతనికి నమస్కారము. కలివచ్చినపిదప ధర్మమును నెలకొలుపుటకై గుఱ్ఱపువాహన మెక్కి మ్లేచ్ఛుల నున్మూలింపఁ గల్కిరూపమున నవతరింపఁబోవు నాభగవంతునకు నమస్కారము. తారవంశమందుఁబుట్టిన కాలనేమియను నసురవరుని వధించి యింద్రునకు రాజ్యము నొసంగిన సాంఖ్యరూపుఁ డయినయతనికి నమస్కారము. ఊరములయిన (నాశమునొందునట్టి) వస్తువులకు సాక్షియై సర్వప్రాణుల శరీరములందునుండి యక్షురుఁడై (నాశము లేనివాఁడై) వెలుంగు సాక్షిరూపుఁడయిన యాభగవంతునకు నమస్కారము. ఓమహాదేవా ! నీకు నమస్కారము. భక్తవత్సలా ! నీకుమ్రొక్కు. సుబ్రహ్మణ్యా ! (బ్రాహ్మణులకు హితముసేయువాఁడా!) నీకు నమస్కారము. పరమేశ్వరా! నన్ను నుగ్రహింపుము. ప్రభూ ! సర్వమును నీవు వ్యక్తావ్యక్త (స్థూలసూక్ష్మ)రూపముల వ్యాపించియున్నవాఁడవు. సహస్రనేత్రములు గలవాఁడును సర్వలోకమహేశ్వరుఁడును హిరణ్యనాభుండును(బంగారుపొక్కిలిగలవాఁడును),యజ్ఞాంగుఁడును, నాశరహితుఁడును నంతట ముఖములుగలవాఁడును నగు నారాయణునికినమస్కరించుచున్నాను. దేవేశుండును మంగళముల కునికిపట్టును నయిన హరిని మనంబున భావించు మనుష్యులకు, నెప్పుడును నేకార్య

మందును నమంగళము గలుగదు. భగవంతుఁడు విష్ణువే మంగళము. మధుసూదనుఁడే మంగళము. పుండరీకాక్షుఁడే మంగళము. గరుడధ్వజుఁడే మంగళము. విశ్వకర్మా ! నీకు నమస్కారము. విశ్వాత్మా ! నీకు నమస్కారము. విశ్వసంభవా ! నీకు నమస్కారము. పంచభూతములకు నవ్వలనుండు నిత్యముక్తుండయిననీకు నమస్కారము. మూఁడులోకములందు నున్న నీకు నమస్కారము. ఈ మూఁటికి నవ్వలనుండునీకు నమస్కారము. సకుల దిక్కులందును నుండు నీకు నమస్కారము. లోకములను సృజించువాఁడును నాశముసేయువాఁడును నగు విష్ణూ ! నీకు నమస్కారము. ఒకరిచేతను జయింపఁబడని నీవే లోకములకుఁ గర్తవు. నీవే హృషీకేశుఁడవు. నీవే సంహర్తవు. కాఁబట్టి మూఁడుకాలము లందును, దివ్యములయి విలసిల్లు నీ ప్రభావములను జూచుచున్నాను. సనాతనమయిన యీరూపమునుగల రూపును జూచుచున్నాను. నీశిరసుచేత దేవలోకమును, పాదములచేత భూదేవియును, నీకాలియడుగుచేత మూఁడులోకములును వ్యాప్తములయినవి. నీవు సనాతనపురుషుడ వగుదువు. దిక్కులుచేతులుగాను సూర్యుఁడు కన్నుగాను శుక్రుఁడువీర్యముగాను నీయందు నెలకొనియున్నారు. అమిత తేజుండయినవాయువురూపము గలనీచేత సప్తవిధములయిన వాయుమార్గములును వ్యాప్తములైనవి. ప్రభూ! వ్యక్తంబగు స్థావరజంగమరూపమును నవ్యక్తమగుబ్రహ్మరూపమును గలనీచేత జగమంతయు వ్యాప్తమైయున్నది.నల్లగిసె పూవంటి కాంతిగలిగినవాఁడును, పీతాంబరుండును, నచ్యుతుండును నగుశ్రీగోవిందునికి మ్రొక్కువారికి నెట్టి భయమునుగలుగదు. శ్రీకృష్ణునిఁ గూర్చి చేసిననమస్కార

మొక్కటియైనను బది యశ్వమేధయాగములుచేసి యవభృథ స్నానము గావించినందులకు సాటియగును. పది యశ్వమేధయాగములు చేసినవానికిఁ బునర్జన్మముకలదు. భగవంతునికి మ్రొక్కినవానికిఁ బునర్జన్మము గలుగదు. కృష్ణునిఁగూర్చి వ్రతము లాచరించువారును దేయుంబవలు కృష్ణమూర్తిని ధ్యానముచేయువారును నగ్నియందు మంత్రములచేత వేల్చినయేయుంబోలె కృష్ణస్వరూపులై కృష్ణునిఁబొందుదురు. నరకభయము నుండి రక్షించుటకుఁ గంకణము గట్టుకొన్నవాఁడును, సంసారమహానది యందలి సుడిగుండములకుఁ దెప్పకొయ్యవంటివాఁడును, నగు శ్రీవిష్ణువునకు నమస్కారము. వేదమును ధర్మమును రక్షించు దేవుండై గోవులకును బ్రాహ్మణులకును హితుండై లోకరక్షకుండును గోవిందుఁడునగు శ్రీకృష్ణునకు మ్రొక్కి నమస్కారములు. 'హరి!' యను రెండక్షరములు ప్రాణత్రాణమాత్రయనునడవినిబోవు వానికి దారిబత్తెమును సంసారమును గుదుర్చు నౌషధమును నగును. కష్టశోకములయందు రక్షకమగును. నారాయణుఁడే పరబ్రహ్మము. నారాయణుఁడే పరమతపము. నారాయణుఁడే పరమసత్యము. నారాయణుఁడే పరములందుఁ బరముఁడు. సత్యమును ధర్మమును సమస్తలోకమును విష్ణురూపముగా నుండుట నిజమగునేని నాపాపము నశించుఁగాక. అపారతేజుండయిన యజ్ఞవరాహుఁడగు శ్రీవిష్ణునిమ్రొక్కి భక్తులకునమస్కారము. సురోత్తమా ! పుండరీకాక్షా ! నిన్ను శరణముఁజొచ్చి సద్గతి నొందఁగోరుచున్న భక్తునకు నాకు నేది శ్రేయమో దాని నీవే యాలోచింపవలయును. ఇట్లు విద్యకును దపమునకును గారణ

భూతుండై తనంతఁ గారణరహితుఁడై యుండు విష్ణుఁడు స్తుతిం పఁబడెను. స్తుతిరూప మయినయజ్ఞముచేత నారాధితుండయిన శ్రీజనార్దనుండు నాయందుఁ బ్రీతిగలిగియుండుఁగాత" మనెను.

భీష్ముండు కృష్ణునియందు మనస్సు చెల్లించి యింతయుఁ జెప్పి యిప్పుడు 'కృష్ణునికి నమస్కారము' అనిచెప్పి నమస్కరిం చెను. భీష్ముఁ డట్లు స్తుతించుట విరమింపఁగానే యందుఁగల వేదవిదు లగుబ్రాహ్మణోత్తము లుత్తమతేజుం డయినయాభీ ష్ముని గన్నుల నీరుగన్పట్టఁ గొనియాడిరి. బ్రాహ్మణులంద ఱును పురుషోత్తముం డయినశ్రీకృష్ణునిని భీష్మునిని, మఱి లమఱలఁ గొనియాడిరి. శ్రీకృష్ణుఁడు యోగమహత్త్వముచేత భీష్మునిభక్తి నెఱింగినవాఁడుగాన ముల్లోకములకును దెలుపఁ దగిన దివ్యజ్ఞానమును నతని కొసంగి తనయున్నచోటికిఁ బోయెను. భీష్మునకుం గలయాభక్తియోగమును గృష్ణుఁ డెఱింగి వేగలేచి సంతోషముగ నా వాహనమం దారోహిం చెను. కృష్ణుండును సాత్యకియు నొక రథమునెక్కి పోయిరి. ధర్మరాజును నర్జునుఁడును నొకరథంబును, భీముండును నకు లుండును సహదేవుండును నొకరథంబును, గృపుడును యు యుత్సుండును సంజయుండును సూతుండును మఱియొక రథ ము నెక్కిపోయిరి. ఒకపట్టణమువలె విస్తరించినతేరులతోడ బయలువెడలిన యాపురుషశ్రేష్ఠులు, గంభీరములగు నేమిధ్వ నులచేఁ భూమిని వడంకించిరి. ఆకృష్ణుఁడు దారిని బోవునపుడు బ్రాహ్మణు లాడు పురుషోత్తమస్తుతివచనముల నల్ల వినెను. వానిని విని కృష్ణుఁడు మనంబునసంతసించి యంత నచటఁ జేతులు

కట్టికొని వినయంబుననున్న భీష్మునిఁగాంచిహర్షించెను.*ఇట్లుభీష్ముండుచెప్పిన శ్రీకృష్ణస్తుతిని భక్తితోడఁ బఠించువాఁడును వినువాఁడును శ్రీకృష్ణుని యనుగ్రహమువలనఁ బాపములన్నియువిడిచి తుదను శ్రీకృష్ణునిఁ బొందును.యోగులు ప్రాణము వెడలుకాలమందు మిక్కిలిప్రయత్నంబున మనంబున నేభగవంతునిఁ దిరముగా భావింతురో యాహరిని భీష్ముండెదుర్కొని కృతార్థుండై తన ప్రాణములు విడిచెను. తొల్లి భీష్మునిచేఁ జెప్పంబడినదియు మహాపాపములను నాశము సేయునదియు నాశ్చర్యమయిన కృత్యములుగలదియు శ్రీకృష్ణుం గూర్చినదియు నయినయీస్తవరాజము సమాప్తమయినది. పరిశుద్ధుఁడై ముముక్షు వగువాఁడు నింద్యము లగుపాపములను నపహరించునీ స్తవరాజమును జదివి తనంతటఁ గలిగినయనిత్యలోకములను గడచి మహాత్ముని నాశరహిత మగుపదవిని బొందుచున్నాఁడు. ఇది నలువదియాఱవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

{కృష్ణుఁడు పరశురాముని పరాక్రమము చెప్పఁగా భీష్ముడు దానిని వివరింపుమని కృష్ణుని వేఁడుట.}

అంత, ధర్మరాజును దక్కిన పాండవులు నలువురును కృష్ణుఁడు మొదలయిన వారందఱును నతివేగమునంబోవు గుఱ్ఱములు పూన్చినవియు ధ్వజములు మొదలయిన వానిచే నలంకృత మయినవియుఁ బట్టణములకు సాటియైనవియునగు రథ

* ఇదిమొదలు నీయధ్యాయముకడవఱకుఁ గలపాఠము డౌత్తరాహమూలమందుఁ గానిపింపదు. కానిపింపమియే సంగతముగా నున్నది.

ము లెక్కి వేగముగాఁ గురుక్షేత్రమునకుఁ బోయిరి. అందు కేశ ములు మజ్జ యెమ్ములు మొదలగునవి నెరసిబెరసియుండెను. వారా కురుక్షేత్రమందుఁ బ్రవేశించిరి. అది మహారథులయినరాజులుశరీర ములువిడిచినచోటు; అందు పర్వతములవంటి యేనుఁగులగుట్టము లయెమ్ములపోగులు గ్రిక్కిఱిసియు హంసలవంటి మనుష్యుల తలపునుక లెల్లెడల నావరించియు నుండెను; పెక్కులు కవచము లును బెక్కు లాయుధములును పెక్కువేల చితలును నిండియుం డెను; మఱి భూతరాక్షసగణము లందు సంచరించుచుండెను. ఇట్లు భుక్తశేష మయినయంతకునిపానశాలను బోలియున్నయా కురు క్షేత్రమును జూచుచు మహారథులువారు వేగముగాఁ బోయిరి. అట్లు పోవుచుండఁగా మహాబాహుండు కృష్ణుండు ధర్మరాజు నకుఁ బరశురాముని పరాక్రమమంతయుఁ జెప్పదొడంగెను. 'ఓ ! భారతా ! కొంతదూరమున నిదిగోఁ గానఁబడు నేడుకొల నులును, బరశురామునిచేఁ గావింపఁబడినవి. క్షత్రియుల రక్త ములచే నిండినయీమడుఁగులం దతఁడు పితరులకుఁ దర్పణము చేసెను. పరశురాముఁడుభూమి నిరువదియొక్కమాఱు క్షత్రి యులులేనిది గావించి యిచ్చట నిప్పు డక్కార్యమునుండి విరతి నొందెను" అనెను. ధర్మరాజు 'తొల్లి పరశురామునిచే నీ భూమి యిరువదియొక్కమాఱు క్షత్రియులు లేనిదిగాఁ జేయఁ బడినదని తాముచెప్పిన విషయమందు నాకుఁ బెనుసందేహము కలిగియున్నది. అపారపరాక్రమా ! రాముఁడు క్షత్రియజాతి బీజమును లేకుండునట్లు లోకమును దహించిన పిదప మఱల నెట్లు క్షత్రియజాతి యుప్పతిల్లినది. యదుసత్తమా! మహాత్ముం డగు పరశురాముఁడు క్షత్రియజాతి నెట్లు నాశముచేసెను? అది

మఱల నెట్లు పెరిఁగినది? గొప్పరథ యుద్ధంబునఁ గోట్లకొలఁదిని క్షత్రియులు హతులయిరి. అక్కట్లు మఱల భూమి క్షత్రియులచేత వ్యాప్తమయినది. యదుసింహమా! భృగువంశంబునఁ బుట్టిన వాఁడును మహాత్ముఁడును నయిన పరశురాముని చేత ము న్నీ క్షత్రియజాతి కురుక్షేత్రమున నెందులకై దహింపఁబడినది. వృష్ణికులతిలకా! గరుడధ్వజా! నాయీసందేహమును దీర్పుము. కృష్ణా! ఉపేంద్రా! వేదమును నీవచనమునకు మించినదిగాదు' అనెను. అంతఁ బ్రభుండగు కృష్ణుండు క్షత్రియులచే నాభూమి నిండినవిషయమునంతయుఁ గలరూపున ధర్మరాజునకు దారిని బోవుచునే చెప్పువాఁడయ్యె. ఇది నలువదియేడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

కృష్ణుఁడు ధర్మరాజునకు పరశురాముని వృత్తాంతమును జెప్పుట.

శ్రీకృష్ణుఁడు 'ధర్మరాజా! పరశురాముఁడు పుట్టినకారణమును, నతనిప్రభావమును, నతనిచేఁ గోట్లకొలఁదిని క్షత్రియులు హతు లగుటయు, మఱల నీభారతయుద్ధమందుఁ గొట్టువఁడు నట్లుగా క్షత్రియులు వర్ధిల్లుటయు, మహర్షులుచెప్పఁగా నేను విన్న తెఱంగున నీకుఁ జెప్పుచున్నాను విను' మని యిట్లుచెప్పెను. 'రాజా! బ్రహ్మపుత్త్రుఁడయిన యజునికి బలాకాశ్వుఁడను నొక పుత్త్రుఁడుండెను. అతనికిఁ గుశికుఁడని ప్రసిద్ధినొంది ధర్మవిదుండగు పుత్త్రుఁడొకఁడుండెను. లోకమునం దతఁ డింద్రునకు సాటి యైనవాఁడు. అతఁడు మూఁడులోకములకు నీశ్వరుండును నెవ్వరి చేతను జయింపఁ దరముగానివాఁడు నగు నొకపుత్త్రునిఁ బడ

యఁగోరి పెనుతపము గావింపఁదొడంగెను. భారతా ! పుత్రు నుత్పాదించుటకు వలంతియై కడింది తపంబూనిన యాకుశికునిఁ జూచి లోకపతులకును బతియైన సహస్రాక్షుం డింద్రుఁడు తానై వచ్చి యాకుశికునకుఁ గుమారుఁడై పుట్టెను. కుశికుఁడును గుమారుఁడయి పుట్టినయింద్రునకు గాధియను పేరుపెట్టెను. ఆగాధికి సత్యవతి యనుకూఁతురు పుట్టెను. గాధి యాకన్యను భృగుపుత్రుఁడయిన ఋచీకునకుఁ బెండ్లిచేసెను. పిదప సత్యవతి పుత్రునిఁగోరి ఋచీకుని ప్రార్థింపఁగా నతఁడు గాధికిని దనకును బుత్రుఁడుగలుగఁగోరి వేఱువేఱ రెండుచరువులను బక్వము గావించెను. అంత భృగుపుత్రుఁడాఋచీకుఁడు భార్యను బిలిచి 'ఈచరువు నీవును, మఱియొక చరువు నీతల్లియు నుపయోగింపవలయును. మీతల్లికి నామె చరువువలన దీప్తిమంతుండును క్షత్రియతిలకుండునగు పుత్రుండు పుట్టఁగలఁడు. వాఁడు లోకమున క్షత్రియులకెల్ల జయింపరానివాఁడు; మఱిమేటి క్షత్రియుల నుక్కుమడంచు నట్టివాఁడు. నీకో ధృతిమంతుఁడును శమసంపన్నుండును తపఃకలితుండునగు బ్రాహ్మణశ్రేష్ఠునిఁ బుత్రునిఁగా నీచరువుపుట్టించును' అనెను. అతఁడు భార్యకుఁజరువు లనిచ్చి యట్లుచెప్పి తపంబుగోరి యడవికిఁబోయెను. ఆసమయమునందె తీర్థయాత్రకై గాధిరాజు బయలువెడలి భార్యతోడ ఋచీకాశ్రమమునకు వచ్చెను. అప్పుడు సత్యవతి తనకుఁ బతిప్రసన్నుఁడై యొసంగిన రెండుచరువులనె త్తికొని సంతసంబునఁ దల్లియొద్దకుఁబోయి దానిని దెలిపెను. ఆబిడతల్లియో తనకయిన చరువును గూఁతునకిచ్చి దానిచరువును దెలియక తానుపయోగించుకొనెను. అంత సత్యవతి క్షత్రియుల కంతకరమయిన గర్భ

మునుదాల్చెను. అది ప్రకాశించుచున్న దేహముతోఁ జూచుటకు భయంకరముగానుండెను. ఋచీకుఁడు తనచెలువ యప్సరసయుం బోలె వెలుంగుచుండుటనుజూచి ధ్యానయోగమున జరిగిన దానిని గనుఁగొని 'కల్యాణీ! చరువులనుమార్చినీతల్లి నిన్నువంచించినది. అది కారణముగా నీయందు మిక్కిలి మచ్చరముగలవాఁడును క్రూరకర్ముండునగు పుత్రుఁడు పుట్టఁగలఁడు.నీతల్లి తపోధనుఁడయిన బ్రాహ్మణోత్తమునిఁ గాంచును. నీచరువునందు బ్రాహ్మణజాతి కగుసౌర్యమునంతయుఁ బదిలపఱిచితిని. క్షత్రియవీర్యమునంతయు నీతల్లిచరువునం దుంపఁబడినది. అయినను జరున్నుల మాఱుపాటువలన నిది నేనుసంకల్పించినట్లు కానేరదు. నీతల్లికి బ్రాహ్మణుఁడుపుట్టును. నీకు క్షత్రియుఁడుగలుగును" అనెను. పతియిట్లుచెప్పఁగా నాభాగ్యవతి సత్యవతి, వడవడవడంకుచుఁ దలవాంచి మ్రొక్కి– "ప్రభూ!నీవు 'బ్రాహ్మణజాతికి నింద్యుఁడయిన కొడుకు నీకుఁ గలుగు' నని యిట్టిమాట ననుబోఁటిదానికిఁ జెప్పఁదగునా ! తగదే !" యనెను. ఋచీకుఁడు 'పడఁతీ! నీయెడనే నిట్టికోరిక సంకల్పించినవాఁడనుగాను. చరువులు వీడ్వఁడుటంబట్టి యుగ్రకర్ముండయినకొడుకు నీకుఁగలుగు' ననెను. సత్యవతి 'మునీంద్రా ! నీవుకోరితివా లోకములనుగూడ సృజింతువు? ఇఁకఁబుత్రునిఁగలిగించుటఁ జెప్పనేల ? ప్రభూ ! కాఁబట్టి నాకై శమసంపన్నుఁడును జక్కటిగలవాఁడునగు పుత్రు నియ్యందగు' ననెను. ఋచీకుఁడు 'కల్యాణీ ! నేను నవ్వుటాలకు నింతవఱకు నబద్ధమయినమాట చెప్పినదిలేదు. ఇంక నగ్నిని మున్నిడికొని మంత్రపూర్వకముగా సమర్థించిన చరువువిషయమై నామాట పొల్లుకాదని చెప్పవలయునా ? నీతండ్రి కులమంతయు

బ్రాహ్మణకులమగునని తపశ్శక్తిచే మునుపేనాకుఁ దెలిసియున్నది చుమీ' యనెను. సత్యవతి 'నీవు మంత్రశక్తిగలవారలయందు మిన్నవుగదే ! నీయిచ్చచొప్పున పౌత్రఁ డిటువంటివాఁడగుఁ గాక. పుత్రుఁ డిట్టివాఁడువలదు. వలదు. శమసంపన్నుఁడును జక్కటిగలవాఁడునగు పుత్రుఁడు నాకుఁ గలుగనిమ్ము' అనెను. ఋచీకుఁడు 'వరవర్ణినీ ! పుత్రుఁడనియుఁ బౌత్రుఁడనియు నాకు భేదములేదు. నీవుచెప్పినట్లు యగుఁగాక.' యనెను. అంత సత్యవతి తపస్సక్తుండును శాంతుండును నియతవ్రతుండునగు జమదగ్ని యనుపుత్రునిఁగనెను. కుశికపుత్రుం డగుగాధికి బ్రహ్మతేజస్సంతయు నిండారి బ్రహ్మర్షికి సాటియగు విశ్వామిత్రుండను పుత్రుఁడుగలిగెను. జమదగ్ని మిక్కిలి భయంకరుఁ డయినపరశురామునింగాంచెను. అతఁడు సమస్తవిద్యలందును దుదముట్టి, ధనుర్వేదపారగుఁడయి యుండెను. అతఁడు మఱియు క్షత్రియాంతకుఁడయి యగ్నివలెఁ దేజరిలుచుండెను. అతండు గంధమాదనపర్వతమందు మహాదేవుండగు రుద్రుని సంతోషపఱిచి, యద్దేవునివలన మిక్కిలీయుఁ దేజంబుదొలఁకు పరశువును నస్త్రములును వరముగాఁబడసెను. ఆగండ్రగొడ్డలి జ్వలించుచున్నయగ్నివలె వెలుంగుచు, మొక్కవైనవాఁడిమొనగలిగియిట్టిదట్టిదని చెప్పరానిదై యుండెను. కాన యతండు దానిచే లోకములం దసమానుఁడై యుండెను. ఇట్లున్నకాలమున, హైహయదేశమునకు రాజర్జునుఁ డనువాఁడుండెను. అతఁడు కృతవీర్యునిపుత్రుఁడు, మిక్కిలితేజస్వి,మంచిబలవంతుఁడు. అతఁడు దత్తాత్రేయుని ప్రసాదమువలన వేయిబాహువులఁబడసి మహాతేజుం డయినచక్రవర్తియై యశ్వమేధ మనుయాగము చేసెను.

అతఁడు పరమధర్మవిదుండుగాన, యాయాగమందుఁ దనభుజబల ముచేతను నస్త్రబలముచేతను యుద్ధంబునజయించి భూమినం తయుఁ బర్వతములతోను సప్తద్వీపములతోను బ్రాహ్మణులకు దానముచేసెను. ఆపరాక్రమశాలి తన్నగ్నిదేవుఁడు దప్పిగొని యాచింపఁగా, వెక్కలుగ్రామములను బట్టణములను రాష్ట్రము లను గొల్లపల్లెలను నతనికి భిక్షగానొసంగెను. కాన యావురు షతిలకుని ప్రభావముచేత నగ్నియన్నింటిని దహింపఁగోరి యత నిబొణములవలననుండి దరికొని జ్వలించుచు నాయర్జునుని పర్వ తములను భూమినంతయు దహించివైచెను. అట్లాయగ్ని వా యువ్రచేత మిక్కిలి యెసరేఁగి యర్జునుఁడును దోడుపడఁగా మహాత్ముఁ డగువసిష్ఠమహర్షి యాశ్రమ మున్నయరణ్యమును, అందెవరును లేకుండఁగాఁ గాల్చివైచెను. అట్లు; తనయాశ్రమము దగ్ధముకాఁగానే, వసిష్ఠుఁడు మహాప్రభావుడుగాన యర్జునునియెడఁగోపముగొని యతనిని శపించువాఁడై 'అర్జునా! నీవు నాయా శ్రమవనమును గొప్పదానిని విడిచిపెట్టక కాల్పనేకాల్చితివిగా! కాఁబట్టి రణమున రాముఁడు నీచేతులను ఛేదించును బొమ్మని శపించెను. అర్జునుఁడో మిక్కిలితేజమును బలిమియుఁగలవాఁ డయ్యు నెప్పుడును శమముగలిగి బ్రాహ్మణులయందు భక్తియుఁ నార్తులకు శరణొసంగుటయుఁగలిగి మంచిదాతయు శూరుం డునై యుండును. అతఁడామహాత్ముఁడొసఁగిన శాపమును బాటిం చినవాఁడు గాఁడయ్యె. అతనికి మిక్కిలిబలవంతు లగుపుత్రులు గలరు; వారాశాపముచేతఁ దండ్రివధకు నిమిత్తభూతులగుటకై యెప్పుడును గర్వమున విఱ్ఱివీఁగుచుఁ గూరులైయుండిరి. వారొ కప్పుడు జమదగ్నిహోమధేనువుదూడనుబట్టి తీసికొనిపోయిరి.

బుద్ధిమంతుఁడగునర్జునుఁ డదియెఱుంగఁడు. అదికారణముగా జమ దగ్నికుమారుఁడును మహోత్సుఁడు నగుపరశురామునితోడ యుద్ధ ముకలుగఁగా నం దతఁడు రోషంబుమీఱి నర్జునునిచేతులను నఱికి వై చెను. అంత నా రాముఁడు గ్రమ్మఱుచున్న యాదూడను వారి యంతఃపురమునుండి తనయాశ్రమమునకుఁ దీసికొనిపోయెను. అర్జునునికొడుకులు బుద్ధిహీనులు గాన యపుడందఱు నొక్కటి గాఁగూడి జమదగ్న్యాశ్రమమునకుఁ బిలువంబడకయే పోయి భల్లపుమొనలచే నతనిశిరసును దేహమునుండి ద్రెస్సిపడఁ గూల్చిరి. అపుడు మహాయశుండు పరశురాముం డందులేఁడు; సమిధ లును దర్భలును దేరబయటఁ బోయియుండెను. అతండుతిరిగివచ్చి తనతల్లివలనను నాయాశ్రమవాసులవలనను జరిగినయాప్రవృత్తిని జక్కఁవిని క్రోధంబునొంది కాలాగ్ని సమానుఁడయ్యెను. అతండు ధనుర్వేదమం దద్వితీయుఁడు; దివ్యాస్త్రములచే నెంతయు భూషి తుఁడు. అర్ధచంద్రబింబమువలెఁ బరశు వతనికేలఁ గ్రాలుచుం డెను. అతఁడు పితృవధమున కెంతమాత్రము సయింపక మిక్కిలి యుగ్గోపమునొంది భూమియందు క్షత్రియుఁడొక్కఁడేనిలేకుండు నట్లుచేయుదునని ప్రతినచేసి యాయుధమును గయికొనెను. అంత నాభృగుసింహుఁడు పరాక్రమంబుమెఱసి మిక్కిలి వేగపోయి యర్జునుని పుత్రులను బౌత్రులను మిగతలేకుండఁ బడగూల్చి కోపంబుసందడింప హైహయదేశపువారగు క్షత్రియులను బెక్కు వేలమందినిజంపి భూమిని సముద్రమువఱకు రక్తమునఁ దొప్పఁ దోఁగునట్లు గావించెను. అతం డపారతేజంబురాజిల్ల భూమిని క్షత్రియులులేనిది గావించి యంతనెంతయు దయ పయికొనఁగా వనమునకే పోయెను. అతఁడు స్వభావముచేతనే కోపముగల

వాఁడు. అంతఁ గొన్నివేలసంవత్సరములు కడచినపిమ్మట నట్లూరకుండి పిదప నెప్పటియట్లు కోపంబునొందినవాఁడయ్యె. అది యెట్లనఁగా, యయాతిపతన మనుక్షేత్రమున యాగమానందు జనసమూహము గూడియుండెను. అగుంపునందు విశ్వామిత్రుని మనుమఁడును రైభ్యునికొడుకు నగుపరావసుఁ డనుమహాతపస్వి యొకండు రాముని జీఱి 'రామా! నీచేసినప్రతిజ్ఞపొల్లు; ఈజనుల కూటమునందు నిన్ను నీవే పొగడికొనుచున్నావు. ఈయాగము నకు వచ్చియున్న ప్రతర్దనుఁడు మొదలయినవారు నీకు క్షత్రియులు గారా ! ఈ భూమి పరల వందలకొలఁది క్షత్రియులచేత నంతట నెరసిబెరసియే యున్నదే ! క్షత్రియవీరులకు భయపడి యొకకొండయం దొదిఁగియున్నావే ' అని యెత్తిపొడిచెను.పరావసువు చెప్పినమాట వినఁగానే పరశురాముఁ డాయుధమును గేలంబూనెను.అతఁడు మున్ను వందలకొలఁది క్షత్రియులను జంపకవిడిచియుండెను. వారంతకు మిక్కిలి వృద్ధినొంది యెంతయుఁ బరాక్రమము మెఱయుచు భూమిని బాలించుచుండిరి.. అతఁడు మరల వారినందఱను బాలురను సయితము వేగ దునుమాడివైచెను. అపుడు గర్భస్థులగు క్షత్రియులచే మఱల భూమినిండిన దయ్యె. గర్భములు పుట్టుచుఁ బుట్టుచునుండఁగా, మరల నతఁడు వానిని జంపుచునుండెను.అప్పుడు క్షత్రియస్త్రీలుకొందఱుబిడ్డలను రక్షించిరి.ఇట్టులిరువదియొక్కమాఱు భూమినినిఃక్షత్రియముగా వించిరాముఁడంతఁ బాను జేసిన యశ్వమేధయాగము తుదను నీభూమినిఁగశ్యపునకు దక్షిణగా నొసంగెను. ఆకశ్యపుఁడును శేషించిన క్షత్రియులను గావంగోరి స్రుక్కును బట్టినచేత దక్షిణను గయికొని పరశురాముని జూచి 'మహామునీ! నీవు దక్షిణసముద్రంపుఁ

దీరమునకు బోవలయును. నీవు నాదేశమం దెక్కడను వసింప రాదు. నీవు భూమిని నశ్వమేధయాగమందు నాకు దక్షిణగా నొసంగితివి. ఇచ్చినభూమిని మరలఁబుచ్చుకొనుటకు నీకధికార ములేదు' అనెను. అంత పరశురాముఁడు సముద్రునికడకు బోఁగా నతఁ డతనికి భయపడి పడమటిదిక్కున శూర్పాకర మను దేశమునొకటి నిర్మించియిచ్చెను. కశ్యపుఁ డాభూమిని దానమునఁ గయికొని దానిని బ్రాహ్మణులయం దర్పించి తాను వనంబునకుఁబోయెను. పిదప నీలోక మరాజకము కాఁగా శూ ద్రులును వైశ్యులను విచ్చలవిడి నడచుచు మేలుజాతివారగు ద్విజులభార్యలయందుఁ వర్తింపఁ దొడఁగిరి. బలవంతులు బల హీనుల నడుపందొడంగిరి. అప్పు డొవ్వఁడును దనధనమునకే తా నేలిక గానేరఁడయ్యెను. మూర్ఖులయిన కొందఱుబ్రాహ్మణులు తాము పండితులమని విజ్రుంభింఁచుఁ గలుద్రావఁదలపడిరి. బ్రాహ్మణు లుక్షత్రియులు వైశ్యులుశూద్రులందఱును దుర్మార్గమునవ ర్తించుచు నొండొరుల నండగొని యొకరినొకరు చంపఁబూనిరి. బ్రాహ్మణులు తమధర్మమును విడిచి దుష్పథమును ద్రొక్కి పాషండులయిరి. అందఱును దొంగతనమును, కల్లలను మాయల నుబన్నిరి. కొందఱు దురాచారులు తమవర్ణధర్మములను నాశ్ర మధర్మములను దప్పక నడపుచు సన్మార్గమున వర్తించుచున్న బ్రాహ్మణుల్ను వైశ్యులను ధార్మికులగుశూద్రులను నెంతమా త్రమును భయములేక వధించిరి. మఱికొందఱు యాగములను నధ్యయనమును జేయువారిని, ఆశ్రమములందు నెలకొని తపము సలుపువారిని,గోవులను, బాలురను,స్త్రీలను, వృద్ధులను,నాశము చేసిరి. వేదములును ధర్మశాస్త్రములును రాజనీతియు నవుడడఁగి

పోయినవి. ఆచారములు తలక్రిందుగాఁ దప్పి నడచుచుండుట చేతఁ బెక్కండ్రు ద్విజు లపుడు ప్రాయికముగా వ్రాత్యులను మ్లేచ్ఛులనయిరి. అపుడు భూమిధర్మరక్షకులయిన క్షత్రియులు దన్ను విధ్యుక్తముగాఁ గాచుటకు లేకుండినందునఁ గ్రమమం తయుఁ దలక్రిందుకాఁగా నాతెఱపిని దురాత్ములు తన్నుఁ బీడిం చుచుండఁగాఁ జేయునది లేక వేగ రసాతలమును జొచ్చెను. అట్లు భూమిభయపడి పరువిడుచుఁ బాతాళమునకుం గ్రుంకుచుండుటం జూచి యంతఁ గశ్యపుఁడు గొప్పమనస్సుగలవాఁడుగాన తన తొడయందు దానినిదాల్చి యుద్ధరించెను. దానిచే నాభూమి 'ఉర్వి'యనుపేరు గలదయ్యెను. అప్పుడు భూదేవి కశ్యపుని సం తోషపెట్టి, తన్ను రక్షించు నుద్దేశముతో బాహుబలసంపన్ను లగు క్షత్రియులు కావలయునని యమ్మునిని యాచించునపై 'ము నీంద్రా! హైహాయవంశమువా రయినమేటిక్షత్రియులను స్త్రీల యందుఁ బదిలముగానుంచి రక్షించుచున్నాను. వారు నన్నురక్షిం తురుగాక. విదూరథునిపుత్రుఁ డయినయొకరాజు పూరువంశ మువాఁడు, ఋక్షవంత మనుపర్వతమున ఋక్షముల (ఎలుఁగు బంట్ల) చేత బెంపఁబడుచున్నాఁడు. అట్లె సౌదాసుని పుత్రుని, నపార తేజుం డయినపరాశరుఁడు దయగూరి రక్షించుచున్నాఁడు. వాఁడు క్షత్రియుఁడై యుండియు సాపరాశరునకు శూద్రునివలె సమస్తకార్యములును జేయుటచే సర్వకర్ముఁడని ప్రసిద్ధుఁడయ్యె ను. అతఁడు నన్నురక్షించుఁగాక. శిబిపుత్రుఁడు మహాతేజుండు. వాఁడరణ్యమునందు గోవులచేఁ బెంపఁబడినవాఁడుగాన గోపతి యను పేరొందెను, వాఁడు నన్ను రక్షించుఁగాక. ప్రతర్దనుని పుత్రుఁడు మహాబలుఁడు, పనులకొట్టమునందు వత్సము(దూడ)

లచేఁ బెంపఁబడినవాఁడు గాన, వత్సుండనుపేరుగలఁడు. ఆరాజు నన్ను రక్షించుఁగాక. దివీరథుని పౌత్రుఁడును దధివాహనుని పుత్రుండు నగునంగుఁడనురాజును గంగాతీరమున గౌతముఁడు రక్షించుచున్నాడు. గృధ్రకూటమను పర్వతమున మహాతేజుండయి గొప్పభాగ్యముచేఁ జెలువుగులుకుచుండు బృహద్రథుఁడనువానిని గొండముచ్చులు గాచుచున్నవి. మరుత్తుని వంశమునఁబుట్టినరాజులు పరాక్రమమున నింద్రునింబోనివారు క్షత్రియకుమారులు. సముద్రునిచేత రక్షితులైయున్నారు. అందందుఁ బ్రసిద్ధులైయున్నయాక్షత్రియకుమారులు శిల్పికంసాలి మొదలగు జాతుల నిప్పుడు నాశ్రయించియున్నారు. వీరు నన్ను రక్షింతురేని నేను నిలుకడగా నెలకొందును. వీరలతండ్రులును, తాతలును, రామునిచేత నానిమిత్తము యుద్ధమున హతులయిరి. మునిసత్తమా ! *వారలకు ఋణమోఁగుటకై పూజ నాకుఁజేయవలసియున్నది. కడచిపోయినరాజులచేత నాకు రక్షణమును నేను గోరలేదు. ఇప్పుడున్నక్షత్రియులచేత నేనుండఁగోరెద. దీనిని వేగయొడఁగూర్పవలయు' ననెను. అంతఁ గశ్యపుఁడు భూదేవి నిర్దేశించిన క్షత్రియులను రప్పించి వారినిరాజులుగా నభిషేకముగావించెను. వారలవంశములు పుత్రపౌత్రపారంపర్యము గలిగి భూతలంబునఁ బ్రతిష్ఠితములయ్యెను. ధర్మపుత్రా ! నీవు నన్నడి

---

* ఇట 'తేషా మపచితిశ్చైవ మయా కార్యా మహామునే' అని మూలము. వారలకు ను త్తరక్రియల చేయింపవలసినది నాకుఁగ ర్తవ్యమని ప్రతాపచంద్రుల వ్యాఖ్య. 'నవ్యాహం కామయే నిత్య మతిక్రాంతేనరక్షణమ్' అనుటకు ధర్మము నతిక్రమించినవారిచేత రక్షణను నేనెప్పుడును గోరనని నీలకంఠవ్యాఖ్య. నేనిప్పటిరాజులచేత రక్షణమును గోరలేదని ప్రతాపచంద్రవ్యాఖ్య.

గిన యీపురాతనకథ తొల్లి యిట్లు జరిగినదయ్యె' ననెను. ఇట్లు మహాత్ముఁడు కృష్ణుఁడు ధర్మరాజునకుఁ జెప్పుచు ముల్లోకములను సూర్యుండునుఁబోలె నిజకాంతులచేఁ బర్వుచు నారథంబుననే వేగముగాఁ బోయినవాఁడయ్యె. ఇది నలువదియెనిమిదవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

ధర్మరాజు మొదలగువారు భీష్మునాశ్రయించుట.
కృష్ణుఁడు భీష్మునకు నుపచారోక్తులుచెప్పి ధర్మరాజునకు ధర్మోపదేశమునకై వేఁడుట.

అంత ధర్మరాజు పరశురాముఁడు చేసినయద్భుతకర్మమును విని మిక్కిలి యాశ్చర్యమునొంది కృష్ణునితోఁ 'వృష్ణికులతిలకా! రాముని క్రోధమువలన భూమి క్షత్రియుఁడే లేనిదిగాఁ జేయం బడెనుగా! బొరా! ఆతనిపరాక్రమ మెమసవచ్చు! అది దేవేం ద్రుని పరాక్రమమునలె నున్నదే! ఆరామునివలన భయ మున నడుంకుచున్నక్షత్రియకులోద్ధారకులును గోవుచేతను, సముద్రునిచేతను, గొండముచ్చులచేతను, నెలుఁగుబంట్లచేతను, వానరములచేతను బదిలముగా రక్షితులయిరిగా! బొరా! ఏ మాశ్చర్యము! అచ్యుతా! బ్రాహ్మణోత్తములు ధర్మముక్త మయిన యిట్టి కార్యమును గావించినప ట్టయినయీమానుష్య లోకము ధన్యమైనది. భూమియందలి మనుష్యులును మిక్కిలి భాగ్యవంతులే' యనెను. ఇట్లు కథలుచెప్పికొనుచు నాధర్మరా జును గృష్ణుఁడును శరతల్పంబున భీష్ముండు పరుండియున్నయెడ కుఁబోయిరి. అట్లుచని వారు మిక్కిలి పవిత్రమయిన యాప్రదే

శమున, ఓఘవతీనదితీరమున శరతల్పముపయిఁ బరుండియున్న భీష్మునిం గాంచిరి. అతఁడు నిజకిరణసమూహముచేఁ బరివృతుఁడయిన సాయంకాలసూర్యునివలె వెలుంగుచు దేవతలు దేవేంద్రుఁడుంబోలె మునులు దన్నుఁ గొలుచుచుండఁగా వెలయుచుండెను. కృష్ణుండును ధర్మరాజును దక్కిన నలువురు పాండవులును గృపుఁడు మొదలయినవారును గొంతదవ్వునఁ జేరి భీష్మునిఁ గాంచి వాహనములనుండి దిగిపోయిరి. అంతఁ గృష్ణుండును సాత్యకియు ధర్మరాజు మొదలయినరాజులును, మిక్కిలి చలించుచున్న మనమును గుదుటంబెట్టి యింద్రియముల నొక్కటి గావించుకొని యందుఁగల వ్యాసుఁడు మొదలయిన ఋషిసత్తములకుసమీపమునకుఁబోయి వందనము లాచరించి పిదప భీష్మునికడకుఁబోయిరి. అంతఁ గృష్ణుండు భీష్మునితో 'తపస్సువర్ధిల్లుచున్నదా'? అని యడిగి కూర్చుండెను. తక్కిన పురుషవీరులందఱు నతనింగలసి కూర్చుండిరి. పిదపఁ గృష్ణుఁ డాఱుచున్నప్పటియగ్నియుంబోలె నున్న భీష్మునిఁగాంచి, కొంచెము మనంబున దుఃఖించుచు 'మాటకారులందుమేటీ! ఇంద్రియములెల్ల మునుపటివలెఁ జేటలయి యున్నవేకదా? నీదుబుద్ధియుఁ గలఁతలేకున్నదిగదా? బాణములు కొట్టువడి దుఃఖముచేఁ బీడితమయిన నీదేహము నొవ్వులేకున్నదా? మనస్సునందలి దుఃఖమొకన్న, మేనియందలి దుఃఖము మిక్కిలి పెద్దదిగదే! ప్రభూ! ధర్మనిత్యుండయిన నీతండ్రి శంతనునివలననుండి వరమునుబొందుటం బట్టి మరణము నీయిచ్చకులోనయి యున్నదిగదా! అయిన నిది శరీరవేదనను దొలఁగింపఁ గారణముగాదే! శరీరమునందున్న శల్యము, మిక్కిలి సూక్ష్మమయినను నెంతయు బాధగలిగించును. శరస

మూఢములచే శరీరమంతయు నిండియున్న నీదువేదన యేమని చెప్పుదు! భారతా! దేవతలకును వలయుహితము లుపదేశింప వలంతివి. ఇట్టి నీకుఁ బ్రాణుల జననమరణములనుబట్టి పరులు చెప్పవలసినది లేదేకదా! పురుషతిలకా! జరిగినదియు, జరుగఁ గలదియు, జరుగుచున్నదియు నగుననన్నియు జ్ఞానవృద్ధుండయిన నీకు నఱచేతియందలి యుసిరికవలె నగును. ప్రాణుల యిహసం సారమును, దానివలన ధర్మముచేఁ గలుగుఫలమును నీకుఁ దెలిసియున్నవి. మహాప్రాజ్ఞుండవుగదే! నీవు ధర్మమయమగు నిధివిగదా! నీవు బలువైనరాజ్యమునం దుండి యే తెవులును లేక యవయవముల నిండుఁదనముతోఁ గూడినవాఁడవై వేయి మంది సుందరీమణులచేతఁ బరివృతుండవయ్యుండియు నొక్కఁ డవూర్ధ్వరేతసుండవని నేను గనుఁగొనుచున్నాను. అమో ఘధర్మ్యుండును మహావీర్యుండును శూరుండును ధర్మైకపరాయ ణుండును శరతల్పగతుండును శంతనుపుత్రుండునగు భీష్ముం డొ క్కఁడు తక్క మూఁడులోకములందును దపోబలంబున మృత్యు వును జయింపఁగలరాజు కలిగివట్లు విన్నదిలేదు. అయ్యా! సత్య మందును, దపమందును, దానమందును, వేదమందును, యా గ మందును, ధనుర్వేదమందును, దర్కశాస్త్రమందును నీవలె ధర్మార్థకామములకుఁ గారణభూతుండగు మఱొక్కని నేనిది వఱకు విన్నదిలేదు. కూర్మరత్వములేక, పరిశుద్ధుఁడును, దాంతుఁ డును, సర్వభూతహితరతుండును, మహారథుండు నగు నిను బోఁటివానిని మఱొక్కనిని విన్నదిలేదు. దేవతలు, అసురు లు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు మొదలయినవారి నంద ును నేకరథుండవై నీవొక్కండవే జయింపశక్తుండ వనుటకు

సందేహము లేదు. మహాబాహూ! ఇంద్రసమానుఁడ వయిననీవు వసువులనెడి యెనమండ్రు దేవతల యంశములు నొక్కటిగాఁ జేరి తొమ్మిదవవసువుగాఁ బుట్టినవాఁడవనియు, గుణములం దెల్ల వారికి నుత్తముఁడ వనియు బ్రాహ్మణు లెప్పుడును జెప్పెదరు. పురుష వర్యా! నేనును నాయంతట నిన్నెఱుంగుదును. పురుషస త్తముండ వగునీవు దేవతలందును శక్తివలనఁ బ్రసిద్ధి కెక్కిన వాఁడవు. మనుజేంద్రా! భూమియందలి మనుజులగుణము లందు నీకు సమానుఁ డయినపురుషుని నెందును నేను జూడ లేదు; వినను లేదు. రాజా! నీవు సనుస్తగుణములచేతను దేవతల కును మిన్నవు. నీవు నీతిపోబలమువలన స్థావరజంగమములయిన లోకములను సృజింప శక్తుండవు. ఇఁక నుత్తమగుణములచే నీకు వలయు నుత్తమలోకములను బొందుటనుజెప్ప నేల? ఈ పాండవజ్యేష్ఠుఁడు ధర్మరాజు జ్ఞాతివధమునకు మిక్కిలి పొక్కు చున్న వాఁడు. నీ వితనిశోకమును బోకార్పవలయును. నాలుగు వర్ణములధర్మములును, నాలుగాశ్రమములధర్మములును, ధర్మార్థ కామమోక్షము లనునాలుగువిద్యలందుఁగల ధర్మములును వైది కులకుఁగల విశేషధర్మములును, యోగసాంఖ్యములతోఁ జేరిన సనాతనధర్మములును నన్నియు నీకుఁ జక్కఁగాఁ దెలిసియున్నవి. గాంగేయా! చతుర్వర్ణములకు వలయునదియు విరుద్ధముగా నిదియు ననుష్ఠింపఁబడుచున్నదియు నగు ధర్మశాస్త్రము సవ్యా ఖ్యానముగా నీకుఁ దెలియును. ప్రతిలోమజాతులకును మ్లేచ్ఛు లకును గలధర్మములు నాయాదేశజాతికులములకుఁ గలధర్మ లక్షణములును, వేదములందును శిష్యులచేతను జెప్పంబడు ధర్మ ములును నీకెప్పుడునుఁ జక్కఁగాఁ దెలియును. ప్రవృత్తి నివృత్తి

క్రమములును దెలియును. ఇతిహాసపురాణముల ధర్మములును ధర్మశాస్త్రమును గొఱంతలేక యన్నియు నీకు మనంబున నెల కొనియున్నవి. పురుషసత్తమా! ఈలోకమందు సంశయమును గలిగించు విషయములన్నియును నాసందేహము తీఱునట్లు విశద ముగా నుపదేశించుటకు నీవుదప్ప లోకమున మఱెవ్వఁడును లేఁడు. రాజా! అట్టి బుద్ధిమంతుఁడ వగునీవు ధర్మరాజు మనసు నందుఁగలిగిన శోకమును బుద్ధిచేతఁ బోఁకార్పుము. ఉత్తమంబుగ బుద్ధివిస్తరించియున్న నినుబోఁటి పెద్దలుగదా మోహము నొందు చున్న జనులకు శాంతిగలిగింపఁ జాలువారు' అనెను. ఇది నలు వదితొమ్మిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు కృష్ణునిఁ బ్రశంసించుట. కృష్ణుఁడు ధర్మోపదేశము చేయుమని చెప్పుట.

కృష్ణుఁ డట్లుచెప్పినవచనము విని భీష్ముండు మొగము కొంచెము పయికెత్తి చేతులు జోడించికొని యతనితో 'కృష్ణా! లోకములపుట్టుకకును నాశమునకును గారణమైనవాఁడా! హృషీకేశా! నీకు నమస్కారము. అపరాజితుండ వగునీవే లోకమునకుఁ గర్తవును సంహర్తవునుగా నున్నావు. పంచభూతములకును నవ్వల నున్ననీవు మోక్షపదమునం దున్నవాఁడవు. విశ్వమును నీకార్యము. విశ్వమునకు నీవాత్మవు. విశ్వమునకు నీవ పుట్టుచోటవు. ఇట్టి నీకు నమస్కారము. యోగీశ్వరా! నీకు నమస్కారము. సర్వమునకు ముఖ్యస్థానమైనవాఁడా! నమస్కారము. మూఁడులోకములందును మూఁడులోకముల కవ్వలను

నున్న నీకు నమస్కారము. పురుషస త్తమా ! నీవు నన్ను గుఱించి చెప్పిన మాటలచేత ముల్లోకములందును వెలుంగు నీదివ్య ప్రభావములును నేను గనుఁగొనుచున్నాను. సనాతనంబగు నీరూపము కూడ నాకుఁ దెలియుచున్నది. అమితమయిన తేజస్సు గలవాయువు స ప్తమార్గములను నీచేత నిరుద్ధములై యున్నవి. నీశిరసుచేత దేవలోకమును బాదములచేత భూమియు వ్యా ప్తములై యున్నవి. దిక్కు లు నీచేతులుగను, సూర్యుఁడు కన్నుగను, శుక్రుఁడు వీర్యముగను నెలకొనియున్నారు. నల్లని పూవన్నెగలిగి పచ్చని బంగారువలువగలదై యవ్యయం బగునీది వ్యవిగ్రహమును జూచి మెఱుపుతోఁగూడిన మబ్బును నూహించు చున్నారము. పుండరీకాక్షా ! సురో త్తమా ! భ క్తితోడ నిన్ను శరణుఁజొచ్చి యిట్లు బగుగతినిబొందఁ గోరుచున్న నాకు నీవు శ్రేయము నాలోచింపవలయును' అనెను.

కృష్ణుఁడు 'పురుషసింహమా ! నాయందు నీ కు త్తమమయిన భక్తియుండుటవలననే నాదివ్యరూపము నీకుఁ బ్రదర్శితమయ్యెను. రాజేంద్రా ! భ క్తిలేనివానికిని, భ క్తియుండియుఁ జక్కటిలేని వానికిని, భ క్తియుఁ జక్కటియునుండియు దమము లేనివానికిని, నేను దర్శన మొసంగుట లేదు. నీవే నాయందెప్పుడును భ క్తిగల వాఁడవును, జక్కటిగలవాఁడవును. దమమునను,దపమునను, సత్య మునను, దానమునను నిరతుండవు; పరిశుద్ధుండవు. కావునను నే నన్ను దర్శించుట కర్హుండవు. నీ తపముచేతఁ బునరావృత్తిలేని యుత్తమలోకములు నీరాక నెదురుచూచుచున్నవి. కురు ప్రవరా ! నీజీవితకాలము నేఁడు మొదలుగా నీక *ముప్పదినములున్నవి.

*ఇట 'షష్ట్యాశతం షట్చ కురు ప్రవీర, శేషందినానాం తవజీవితస్య' అని

అవి నూఱుదినములుకు సాటియైనవి. అటమీఁద నీదేహమును విడిచి నీవు నీ సత్కర్మములఫలము నొంది వెలుంగఁ గలవు. సూర్యుఁడు త్తరాయణమునఁ బోవుకాలము నెదురుచూచుచున్న నిన్ను జ్వలించుచున్న యగ్నికి సాటియైన యీదేవతలు వనువు లనువా రిదిగో నందఱును విమానముల నారోహించి మఱిఁగి యుండి నిన్నెదురుచూచుచున్నారు. పురుషప్రవీరా! జగత్తు కాలమునకు లోనయి భగవంతుఁడు సూర్యుఁడు త్తరాయణము నకుఁ దిరిగినంతమాత్రనే నీవువిద్వాంసులు దేనినిబొంది మరలి రారో యట్టి యు త్తమలోకములను బొందఁగలవు. భీష్మా! నీ విహ లోకమును విడిచిపోఁగానే లోకమునందు జ్ఞానములన్నియు

మూలము. 'ఇఁక నీజీవిత కాలము ఏఁబదియాఱు దినములున్నవి' అని యర్థము. అయినను భీష్ముఁడు 'అష్టపఞ్చాశతం రాత్ర్యఃశయాన స్యాస్యమే గతాఃఁ' అని తాను పరుండినది మొదలుకొని యేఁబదియెనిమిది దినములని చెప్పఁబోవు చున్నాఁడు. వానిలో నింతవఱకుఁ జెప్పిన దినములు ఇరువది యెనిమిది---ఎట్లన —భీష్ముండు శరతల్పమునఁ బడినపిదప యుద్ధము జరిగిన దినములు ఎనిమిది. పిదప దుర్యోధనుఁడు మృతినొందిన యాశౌచ దినములు పదునాఱు. ఇరు వదియేనవనాఁడు శ్రాద్ధము. ఇఱువదియాఱవనాఁడు పట్టణప్రవేశము. ఇరు వదియేడవనాఁడు పట్టాభిషేకము. ఇరువదియెనిమిదవనాఁడు ప్రజల శాస్వా సించుట. ఇరువదితొమ్మిదవనాఁడు భీష్ముని కడకు వచ్చుట. అది మొద లుగా ముప్పదిదినములు శేషించియుండునవి. కాఁబట్టి 'పఞ్చాశతంషట్' అనుట 'పఞ్చ ఆశతం షట్' పఞ్చషట్ అయిదు ఆర్లు=ముప్పది దినములు. ఆ ముప్పది దినములును 'ఆశతమ్=శతావధి' సూఱు దినములచేతఁ జేయఁదగి నంత ముప్పది దినములచేతను జేయంగూడునని యర్థము గ్రహించునదని మఱియొక వ్యాఖ్యానము. ప్రతాపచంద్రు లేఁబదియాఱు దినములు మిగతయని యర్థముచేసియున్నారు.

మిక్కిలి కీడ్వడిపోవును. ఆకారణమునుబట్టియే యందఱును ధర్మ వివేచనమునకై నీసమీపమునకు వచ్చియున్నారు. కాఁబట్టి, సత్య సంధుఁడగుయుధిష్ఠిరుఁడు జ్ఞాతిశోకమువలనఁ దెలివిచెడియున్న వాఁడుగాన, ధర్మార్థయోగములతోఁ గూడిన యథార్థవచనంబుల నతనిశోకము పోవునట్లుగా నుపదేశింపుము' అనెను. ఇది యే బదియవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు తనకు శస్త్రశాధ్చే ధర్మోపదేశము నకుఁ బటుత్వము లేదనఁగా కృష్ణుఁ డతనికి శరీరదార్ఢ్యము లొసంగుట. అంత సాయం కాలముకాఁగా వారువారు తమతమ నెలవుల కరుగుట.

అంతఁ గృష్ణుండు ధర్మార్థయుక్తముగాఁ జెప్పినయాహిత వచనమువిని భీష్ముఁడు చేమోడ్చి యతనితో 'లోకనాథా! మహా బాహూ! అచ్యుతా! నారాయణా! శివా! నీ వాక్యమును విని సంతసంబునఁ దెప్పలఁదేలితిని. వాక్పతీ! నీసన్నిధియందు నేనేమి చెప్పఁబోయెదను. వాక్కుచేతఁ జెప్పఁదగినదంతయు నీదువాక్కు యిన వేదమం దడఁగి యున్నది. ఇహలోకమందును, బుద్ధిమంతులకుఁ బ్రియమయిన దేవలోకమందును జేయఁబడినదియుఁ జేయ వలయునదియు నన్నియు బుద్ధిమంతుఁడగునీవలన వెలువడు చున్నవి. నీ మోల ధర్మార్థకామమోక్షముల స్వరూపములను జెప్పువాఁడు, దేవరా జయిన యింద్రునిమోల దేవలోకమును బట్టిచెప్పువానికి సాటియగును. మధుసూదనా! నామనసో బాణ

ములదెబ్బలచే వ్యథ నొందియున్నది. నాయంగములు విరవిరఁ బోవుచున్నవి. నాబుద్ధియుఁ దెలివిడిగాకున్నది. ఏదేని కొంచెము మాటలాడుటకు నాకు మతియుఁ బయిపయిఁ దోఁపకున్నది. గోవిందా ! విషాగ్నులకు సమానము లయినబాణములచే పీడింప బడుచున్న వాఁడనుగాన నాకు సత్వవ యుడిగిపోవుచున్నట్లున్నది. ప్రాణములును వేగిరపడుచున్నవి. నామర్మములు పురపురనెరియు చున్నవి. నామనస్సు తిరుగుడుపడుచున్నది. దౌర్బల్యమువలన పలుకు నాలుకకు రాకతెడఁబడుచున్నది. ఇట్టిస్థితియం దున్నవే నెట్లుచెప్ప నుత్సహింతును ? కృష్ణా ! నాయెడ చక్కఁగనను గ్రహింపుము. మహాబాహూ ! నన్నుక్షమింపుము. నేనేమియుఁ జెప్పఁజాలను. నీసన్నిధియందు బృహస్పతి యైనఁ బలుకఁదొడగెనా విరవిరఁబోవును. నాకు దిక్కులనియు నాకాశమనియు భూమియనియుఁ దెలియకున్నది. మధుసూదనా! వట్టినీబలము వలననే నిలిచియున్నాను. కాఁబట్టి సకలవేదములకును వేదమువై వెలుంగు నీవే ధర్మపుత్రునకు వలయుహితమును జెప్పవేఁడెదను. లోకములకుఁ గర్తయు శాశ్వతుండునయిన నీమాఁగల నను బోటి వాఁడొకఁడు గురువుమాఁగల శిష్యుండునుంబోలె నెట్లుహాటాడఁగలఁడు' అనెను.

అందులకుఁ గృష్ణుఁడు 'ఈ చెప్పఁబడినమాట కురుకులధురం ధరుఁడును మహావీర్యుండును మహాసత్యుండును స్థిరచిత్తుఁడును సర్వార్థదర్శియునగు నీకు నెంతయుఁదగును. గాంగేయా! బాణములదెబ్బలచే పీడ గలిగియున్నట్లు నాకుఁ జెప్పితివే! అందులకు నేనిదిగో ననుగ్రహించి నీకు వరమొసంగెదను. ప్రతి గ్రహింపుము. నీదేహమునం గలసొలయికయు మూర్ఛయుఁ

దావమును బీడయుఁగలుగవు. ఆఁకలిదప్పులును బొందవు. అన ఘూ! నీజ్ఞానేంద్రియములన్నియుఁ బరిపూర్ణములయి వెలుంగును. నీబుద్ధికి నించు కయినకీడ్పాటు తోఁపదు. నీమనస్సు మబ్బుల నుండి విడివడిన చంద్రునివలె రజస్తమస్సులవలన వీడి యెప్పుడు సత్యమునందే నెలకొనియుండును. ధర్మమును గుఱించినది గాని యర్థమును సంబంధించినదిగాని యేదేది నీవృతలంచుకొందువో యద్దానియందు నీదుబుద్ధిమిక్కిలి యొక్కుడుగాస్ఫురించును. రాజ సింహమా! జ్ఞానమనెడి దివ్యచక్షువుచేత నీలోకమునంగల నాలు గువిధములయిన ప్రాణిసమూహములను, తేటనీటియందుఁ జేపలం బోలెఁ, గలరూపునఁ జూడఁగలవు ! ' అనెను. అట్లుచెప్పినపుడు వ్యాసుఁడు మొదలయిన మహర్షులెల్లవారును ఋగ్యజుస్సామవేద వాక్యములశ్రీకృష్ణునర్చించిరి. పాండవులును, భీష్ముఁడును, శ్రీకృష్ణుఁడు నున్నప్రదేశమున సమస్తభూతువులందును బూచుదివ్యము లగుపువ్వులవాన యాకాశతలమునుండి కురిసెను. వాద్యములన్నియు మ్రోగెను. అప్సరసలు గుంపులుగూడి పాడిరి. అందహిత మయినదియు ననిష్టమైనదియు నేదియుఁ జూపట్టినదిగాదు. శుభ వాయువు సమస్తమయినవాసనలు గుబులుకొని నిర్మలమై హా యిగా వీచెను. దిక్కులు తెలివినొందెను. మృగములును బక్షు లును నిమ్మళముగా నిటునటు*పరుగిడుచును నఱచుచు నుండెను. అంత నొకముహూర్తమునకు సహస్రకిరణుండగుసూర్యుఁడు పడమటిదిక్కునందు † మహారణ్యము నొకకొనయందు నగ్ని

---

* ప్రాద్రవన్' అని (బొ.మూ.) 'ప్రాపదన్' అని (దా.మూలము)

† దివాకరః దసాన్వనమి వైకా స్తే ప్రతీచ్యాం ప్రత్యదృశ్యత' అని మూల ము. పశ్చాంతప్రదేశమున నడవినిగాల్చువానివలెనియర్థాంతరము. ఇదిసీరసము.

వలెఁ జూపట్టెను. అంత మహర్షులందఱును లేచి శ్రీకృష్ణుని భీష్ముని ధర్మపుత్రునిని వీడుకొనవేఁడిరి. అంతఁ బాండవులును కృష్ణుండును సాత్యకియు సంజయుండును గృపుఁడును మహర్షులకు నమస్కరించిరి. ఇట్లు వారిచేతఁ జక్కఁగాఁ బూజితులై ధర్మనిరతులగు నా మహర్షులందఱును 'ఱే పిచ్చటికి వచ్చెద'మని చెప్పి నిచ్చలువేగముగాఁ బోయిరి. అట్లె శ్రీకృష్ణుండును బాండవులును భీష్ముని వీడుకొని ప్రదక్షిణముచేసి సుందరములయిన యరదము లారోహించిరి. అంత బంగారుమయములయి చెలువగు కూబరములతోఁ గూడిన రథములును, పర్వతములవంటి మత్త గజములును, గరుడునిలీల వేగమునం బోవుతురగములును, చేత విలు మొదలగునాయుధములఁ దాల్చినపదాతులును, గూడిన సైన్యము ఋక్షవంత మనుపర్వతమునకు ముందును వెనుకను నర్మదానది ప్రవహించునట్లు రథములకు ముందును వెనుకను మితిమీఱిన వేగమునఁబొంగి పొరలిపోయినవి.అపుడు చంద్రుఁడా సైన్యమున కుబ్బుగలిగించుచును, సూర్యుఁడు రసములను బీల్చుకొన్న యోషధులకు మరలఁ దనగుణముచే వాని నెప్పటియట్లు రసవంతములనుగావించుచును,నుదయించెను.అంతఁ గృష్ణుండును బాండవులందఱును నమరావతికి సమం బగుపట్టణమునకుఁ బోయి బడలి, సింహములు గుహాలందుంబోలెఁ దమదమ భవనంబులం బ్రవేశించినవా రయిరి. ఇవి యేఁబదియొకండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

కృష్ణుఁడును ధర్మరాజు మొదలగు వారును గాల్య కరణీయములం దీర్చుకొని భీష్ముని కడకుఁ బోవుట.

అంతఁ గృష్ణుఁడు గృహమునకుఁబోయి పరుండి నిదుర గూర్కి తెల్ల వాఱుటకు నొకజాముండఁగా మేలుకాంచెను. ఆమాధవుఁడు ధ్యానసనిష్ఠయందుండి తెలియండిగినవానినెల్లఁ దెలిసికొని పిదప సనాతనం బగు బ్రహ్మమును ధ్యానించెను. చక్కఁగా శిక్షితులై యిం పయినకంఠములుగలిగి స్తుతులను పురాణములను దెలిసిన సూతులు ప్రజాపతియు విశ్వకర్తయు నగువాసుదేవుని స్తోత్ర ముచేసిరి. కొందఱుపాఠకులు చేతితాళములు వైచుచుఁ బాడిరి. కొందఱు శంఖము మృదంగము మొదలయిన వాద్యములు పెక్కువాయించిరి.వీణలువేణువులు పణవములుమొదలగు వాద్య ములధ్వని యతిమనోరమమై * యాకృష్ణునిగృహము నప్పుచున్నదోయన్నట్లు వెల్లివిరిసి వినఁబడెను. అంత రాజు యుధిష్ఠిరుని నగరునందును మధురము లయినవాక్కులు మంగళశబ్దము లతోఁ గూడినవై పాటలయు వాద్యములయు ధ్వనులచేతఁ బెచ్చుపెరిఁగి వినఁబడెను. పిదపఁ గృష్ణుఁడు లేచి స్నానముచేసి యంజలిగీలించి రహస్యముగా మంత్రముల జపించి యంత నగ్ని దరికొలిపి యాజ్యములవేల్చెను. అతఁడు చతుర్వేదవిదులగు బ్రాహ్మణులకు వేయిగోవులను దానముచేసి,యొక్కొక్కరివలనను మంగళాశీర్వచనము లొందెను. పిదప గోవు మొదలయిన మంగళ

* సహోసఇవ విస్తీర్ణ శ్రుత్వేవ తస్యవేశ్మని' అని మూలము. కృష్ణునివిన్నట్లున్న యాగృహమునందు వ్యాపించెనని యర్థాంతరము.

ద్రవ్యములను స్పృశించి విమల మయినయద్దమందుఁ దన్నుఁ జూచుకొని యంత సాత్యకినిజూచి 'శినిపుత్రా ! పొమ్ము. రాజ భవనమునకుఁబోయి మహాతేజుం డయినధర్మరాజు భీష్మునిఁ జూచుటకు నాయితముగా నున్నాఁడాయని తెలిసికొనుము" అనెను. సాత్యకియు నమ్మాటవిని త్వరితముగాఁబోయి ధర్మరాజును దారసించి 'రాజా ! కృష్ణునితే రాయితమై యున్నది. జనార్దనుఁడు భీష్మునియొద్దకుఁ బోవువాఁడై నిన్నెదురుచూచుచున్నాఁడు. మహాద్యుతీ ! ఇటమీఁదఁ జేయవలసిన కార్యమును తాము జేయఁదగును' అనెను. అందులకు ధర్మరాజు 'అర్జునా! నా తే రాయితపఱుపుము. మనము సైనికులతోఁబోరాదు. మన ముమాత్రమే పోవుదము సుమీ. ధార్మికాగ్రేసరుం డగుభీష్మునకు గుంపులచేఁ బీడకలిగింపరాదు. కాన ముంగలఁబోవు కావలివారుసైతము రాకనిలువవలయును. నేఁడుమొనలు భీష్ముఁడు మనకుఁ బరమరహస్యములను జెప్పఁగలఁడు. కాఁబట్టి పెఱుజనులు మనతోఁగూడవచ్చుట నాకిష్టముగాదు' అనెను. అదివిని పురుషసింహుఁడర్జునుఁడు వెంటనే మేలయినరథ మాయత్తముగానున్నదని యతనికిఁదెలిపెను.అంత రాజు యుధిష్ఠిరుఁడును నకులసహదేవులును భీమార్జునులును నేవురును నైదుభూతములవలె నొక్కటిగాఁజేరి కృష్ణునిమందిరమునకుఁ బోయిరి. అమ్మహాత్ములు పాండవులువచ్చుటయు ధీమంతుఁడు కృష్ణుఁడు సాత్యకితోడ రథమునెక్కెను. ఆపురుషసింహములు రథములందుండియొండొరులకు వందనములుగావించి 'రాత్రి హాయిగాజరిగెనా' యని యడిగి మేఘములవలె శబ్దించు నారథరాజములం దరిగిరి. దారుకుఁడు కృష్ణునియశ్వములను, వలాహకము, మేఘపుష్పము,

శై బ్యము, సుగ్రీవము నను వానిని దోలెను. అట్లు దోలఁగా నాకృష్ణునియ్యములు మిక్కిలివేగమును మహాబలమును గలవి గాన, గొఱజల మొనలచే భూమినిర్ధాటుచు నాకాశమును మ్రింగు నవియుంబోలె వేగమునం బోయెను. అంతవారు సమస్తధర్మములకును, క్షేత్రంబయిన కురుక్షేత్రమునకు వచ్చిదిగి దేవతలతోడంగూడిన బ్రహ్మదేవుఁడునుం బోలె మహర్షులతోడం గూడి శరతల్పంబున వెలుంగు చున్న భీష్ముఁడున్నయెడకుఁ బోయిరి. అచ్చటికిఁబోయి కృష్ణుండును సాత్యకియు ధర్మరాజును భీమసేనుండు నర్జునుండును నకులసహదేవులును రథమునుండి దిగి తమకుడిచేతులనెత్తి యందుఁ గలఋషులను బూజించిరి. ఆధర్మరాజు వారలచేతఁ బరివృతుండై నక్షత్రములచేఁ బరివృతుండగు చంద్రుఁడునుంబోలె వెలుంగుచు నింద్రుండు బ్రహ్మదేవునికడకు వచ్చునట్లు భీష్మునికడకు వచ్చెను. ఆకాశమునన్నుండి క్రిందఁబడిన సూర్యుండునుంబోలె శరతల్పంబునఁ బరుండి యున్నమహాభాహుని నాభీష్ముని ధర్మరాజు భయంబున నడుంకుచుఁ గాంచినవాఁడయ్యె. ఇది యేఁబదిరెండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

కృష్ణుఁడు భీష్మునితో ధర్మములను జెప్పమనుట.

జనమేజయుఁడు వైశంపాయనునితో 'మునీంద్రా ! సమస్తసైన్యములను హతములయినపిదప ధర్మాత్ముఁడగుమహాధీర్యుండును, సత్యసంధుండును, జితాత్ముండును, మహాభాగుండును, శంతనుపుత్రుండు నగు పురుషసింహుండు భీష్ముఁడు వీరశయనం

బగు శరతల్పంబునఁ బడుండియుండ, నతనిఁ బాండవులు బలసి కొలుచుచుండఁగా నట్లావీరులు సమాగమమొందినపుడు కథ లే మేమి జరిగెను ? నాకుఁ జెప్పుమని యడిగెను. వైశంపాయనుఁడు 'రాజా ! కురుపితామహుం డాభీష్ముఁడు శరతల్పగతుండై యుండఁగా తపస్సిద్ధులగు నారదాదిఋషులును హతశేషులయినధర్మ రాజుమొదలగురాజులును, ధృతరాష్ట్రుఁడును గృష్ణుఁడును భీముండును, అర్జునుఁడును నకులసహదేవులును మొదలగువా రతని యొద్దకువచ్చి కూడిరి. అమ్మహాత్ములందఱును భూమియందుఁబడిన సూర్యుండునుంబోలె వెలుంగుచున్న భీష్మునిఁ జూచి కొంతశోకిం చినవారయిరి. అంత దివ్యదృష్టిగలనారదుఁ డొకముహూర్తము సేపాలోచించి యంతఁ బాండవులను హతశేషులయిన రాజుల నందఱను జూచి 'రాజులారా ! కాలమునకుఁదగినది చెప్పెదను. ఈ భీష్ముని మీరు తెలియఁగోరునదెల్ల నడుగుఁడురుగాక. అందుల కిదియ తగినకాలము. ఏలన భీష్ముఁడు సూర్యునివలె నస్తమింప బోవుచున్నాఁడు. ఇతఁడు తనప్రాణముల విడువఁ దలఁచుచు న్నాఁడు. కాన మీరందఱు నితని నడుగుఁడు. నాలుగువర్ణముల వారికిని, గలనానాధర్మములనన్నింటిని బూర్ణముగా నితఁడెఱుం గును. ఈ వృద్ధుఁడు దేహమును, వీడి పరమంబులగు లోకము లను బొందనున్నాఁడు గాన శీఘ్రముగా మనసునందుఁ బొడు కొనియున్న సందేహముల నితనినడుగుఁడు' అనెను. నారదుఁడిట్లు చెప్పినదివిని, రాజులందఱును భీష్మునిపొంతకుఁబోయిరి; కాని యుచితవి నడుగఁజాలక యొకరినొకరు చూచుకొనిరి. అంత ధర్మ రాజు కృష్ణునిఁజూచి 'దేవకీనందనా ! పితామహునిఁ బ్రశ్నించుటకు నీవుదక్క వేఱొకఁడు శక్తుఁడుగాఁడు. సర్వజ్ఞుఁడవు నీవు

తిలకా ! ఇందుఁగల మాయందఱలోపల నీవేకదా యుత్తముండవు; సర్వధర్మవిదుండవును. కాఁబట్టి నీవేమొదటఁ బితామహునితో మాటాడుము' అనెను. అందులకుఁ గృష్ణుఁడప్పుడడ్డులేక భీష్ముని యెదుటఁబోయి 'రాజసత్తమా ! రాత్రి నీకుహాయిగాఁ గడచెనా ? నీకు బుద్ధి తేటఁదనముగలిగి తోఁచుచున్నదా ? జ్ఞానములన్నియుఁ జక్కఁగాఁ దెలియుచున్నవా? హృదయము గీడ్పడకున్నదిగదా? మనసునఁ గలంతలేదేకదా?' యనియడిగెను. అందులకు భీష్ముఁడు 'వృష్ణికులతిలకా ! నీ యనుగ్రహమువలన నాదేహమునందలి మఁటయు, బడలికయు, తబ్బిబ్బును, సత్తువలేమియు, తెవులును, నొవ్వును నన్నియు నప్పుడే తొలఁగిపోయినవి. మహాద్యుతీ ! జరిగినదియు జరుగనున్నదియు జరుగుచున్నదియు నన్నియును నఱచేతి యుసిరికవలె నాకుఁ గానవచ్చుచున్నవి. వేదోక్తములయిన యగ్నిహోత్రాదిధర్మములును, వేదాంతములందలి శమదమాది ధర్మములును, నీ విచ్చినవరమువలన, అచ్యుతా! యన్నింటిని కనుఁగొనుచున్నాను. శిష్టులు చెప్పిన ధర్మమును నాహృదయమునఁ దోఁచుచున్నది. జనార్దనా ! ఆయాదేశములకు జాతులకుఁ గులములకును దగిన యాయాధర్మములను దెలిసినవాఁడనైతిని. నాలుగాశ్రమములధర్మములును రాజధర్మములును నన్నిటిని జక్కఁగా నెఱుఁగుచున్నాను. ఏదేది యెప్పుడెప్పుడు చెప్పవలయునో నేను జెప్పఁగలను. నీప్రసాదమువలన నామనస్సునందు మంచితెలివి దొలఁకాడుచున్నది. నీమూర్తిని ధ్యానించినందున నేను బొటవము పెచ్చి వయసుకానివలె వయితిని. జనార్దనా ! నీప్రసాదమువలన లోకమునకు మేలెద్దియో చెప్పుటకు సమర్థుఁడనగుచున్నాను. నీయంతట నీవే పాండవునకు

మేలెద్దియో యేలచెప్పరాదు? మాధవా! ఈవిషయమైనయుద్దేశ మేమో వేగచెప్పుమా' అనెను.

అందులకుఁ గృష్ణుఁడు 'కురుసత్తమా! కీర్తికిని శ్రేయస్సునకును నేను మూలమని యెఱుంగుము. అన్నివస్తువులును మంచివిగాని చెడ్డవిగాని నావలననుండియే కలుగుచున్నవి. చంద్రుఁడు చల్లనికిరణములు గలవాఁడనఁగా నాశ్చర్యపడుమనుష్యుఁడు లోకమునందెవఁడేని గలఁడా? అట్లైనాకు యశస్సునిండియున్నదనఁగా నెవఁడాశ్చర్యపడును? కాఁబట్టి మిక్కిలియుద్యుతిచే రాజిల్లుచున్న నీకు మఱియునెక్కుడు యశస్సు గలిగింపవలయునని తలఁచి విపులమయినబుద్ధి నీకొడఁగూర్చితిని. ఈభూమి స్థిరముగా నెలకొని యుండునంతదాఁక నీదుకీర్తి కొఱవడక లోకములందుఁ బర్వి యెందును సంచరింపఁగలదు. పాండవుల ప్రశ్నములకు నీవు చెప్పను త్తరమంతము వేదవచనముంబోలె భూతలమున నెలకొనియుండుఁగాక. నీవచనమును బ్రమాణముగాఁగొని తనమనసుచేతఁ దన్నెఱుంగుమనుష్యుఁడు, శరీరముపోయినపిదప సమస్త పుణ్యములఫలము ననుభవించును. భీష్మా! నీకీర్తి మఱియునెట్లు వెచ్చువెరుఁగునని యందులకై నీకు దివ్యమతి నొసంగితిని. భూతలమున మనుష్యుని * యశస్సు వెలయునంతదాఁక వానికీర్తి యక్షయమై యుండును. ఇదినిజము. యుద్ధమునందుఁ జావఁగా మిగిలినరాజులందఱును బెక్కుధర్మములు వినఁగోరి నిన్నుబలసి నలుప్రక్కలఁ గూర్చుండియున్నవారు. వారలకు నీవుపదేశము సేయుము. నీవు వయసునందుఁ బెద్దవు, చదు

* యశస్సు పరచిత్తచమత్కారజనకమగు గుణసమూహము. కీర్తి పరులు సాధువుగాఁ జెప్పికొనుట యని రెంటికి భేదము తెలియునది.

వదివి, ఆచారవంతుఁడవు, రాజధర్మములందుఁగాఁ దక్కుఁగల ధర్మములందునుఁ గుశలుండవు. నీవు పుట్టినప్పాదిగాఁ బాపమును నది కొంచెమయినను నీయందుఁ గలుగఁజూచినదిలేదు. రాజులం దఱును నిన్ను సమస్తధర్మములును దెలిసినవాఁడని తెలియుదురు. రాజా ! తండ్రి కొడుకుల కుపదేశించునట్లు నీవు వారలకుఁ బరమం బయిననీతి నుపదేశింపుము. నీవు మహర్షులను దేవతలను నెల్లప్పుడు నుపాసించినవాఁడవు. కాన, వీరలకు నీధర్మములను నశేషముగాఁ దప్పకచెప్పవలయును. ధర్మమును వినవలయునని కోరి యడిగినవారికి నట్లడుగఁబడినవాఁడు తెలిసినవాఁడై యుండెనేని వారికిఁ దప్పక చెప్పవలయుటయే ధర్మమని బుద్ధిమంతులు చెప్పెదరు. ప్రభూ ! అట్లు బదులు చెప్పనియెడలఁ గడిఁదిదోషము కలుగునుజుమీ. కాఁబట్టి ! తెలిసినవాఁడవుగాన నీవలనఁ దెలిసికొనఁగోరి నీదుపుత్రులును బౌత్రులును నడుగుసనాతన ధర్మములను వారలకు నుపదేశింపుము " అనెను. ఇది యేఁబది మూఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

కృష్ణుఁడు భీష్మునితో ధర్మరాజుసంకుని చెప్పఁగా
భీష్ముఁడు ధర్మరాజునకు సదుపాధానముచెప్పి
ధర్మము నడుగ ననుమతియిచ్చుట.

అంత మహాతేజుఁడు భీష్ముఁడు 'గోవిందా ! నీవు సమస్త భూతములందు నుండునంతరాత్మవు. నీ ప్రసాదమువలన నాడు వాక్కును మనమును దృఢములుగా నున్నవి. ఇఁక ధర్మములను జెప్పెదను. ధర్మాత్ముఁడు యుధిష్ఠిరుఁడు నావలన ధర్మములు

వినునేని; మిక్కిలియు సంతోషంబున పానినెల్లఁ జెప్పెదను. ఏమహాత్ముఁడు, ఏధర్మాత్ముఁడు; రాజుగా నుండుటను దెలిసి మహర్షులందఱును మిక్కిలి వార్షించుచున్నారో, యాధర్మవ్రుత్తుఁడు నన్నడుగుఁగాక. ధర్మను లాచరించి యశంబులు వెలుంగుచున్న కురువు లెల్లవారి లోపలను నెవనికి సమానుఁ డొక్కండును గలుగఁడో యాయుధిష్ఠిరుఁడు నన్నుఁ బ్రశ్నించుఁగాక. ధైర్యమును, దమమును, బ్రహ్మచర్యమును, క్షమయును, ధర్మమును, ఓజమును, తేజమును, ననెడి యీగుణంబు లెప్పుడు నెవ్వనియందు నెలకొనియుండునో యాయుధిష్ఠురుఁడు నన్నడుగుఁగాక. సంబంధులను, అతిథులను, ఆశ్రితులను, భృత్యులను, నెవ్వఁడు మిక్కిలియు సత్కరించి బహూకరించునో యాయుధిష్ఠిరుఁడు నన్నడుగుఁగాక. సత్యము, దానము, తపము, శౌర్యము, శాంతి, సామర్థ్యము, లొట్టుపడమి యను నివియెల్లను నెవనియందుఁగలవో యాపాండవ్రుఁడు నన్నడుగుఁగాక. ఎవ్వఁడు కామమువలనఁగాని తొందరపడికాని, భయమువలనఁగాని, ధనమునుబట్టికాని, యధర్మమునుజేయఁడో యట్టి ధర్మాత్ముఁడు యుధిష్ఠిరుఁడు నన్నడుగుఁగాక. నిత్యము సత్యమును, నిత్యము క్షమయు, నిత్యము జ్ఞానమునుగలవాఁడును, అతిథులకుఁ బ్రియుఁడును, సజ్జనులకు నిత్యమును దానము సేయువాఁడును, నగునాయుధిష్ఠిరుఁడు నన్నడుగుఁగాక. ఎప్పుడును యజ్ఞములును నధ్యయనమును జేయుచుండువాఁడును, సదా ధర్మనిరతుఁడును, క్షమావంతుఁడును, రహస్యములెల్ల విన్నవాఁడును నగు నాయుధిష్ఠిరుఁడు నన్నడుగుఁగాక' యనెను. అందులకుఁ గృష్ణుఁడు 'రాజా! ధర్మరాజు మిక్కుటమయిన లజ్జచేతను శాపమగలుగునో యనుభయమువలనను జం

కుచు నీదగ్గఱకు రానేరకున్నాఁడు. తాను లోకనాథుం డయి యుండి లోకములను నాశము చేసినందుననను, పూజ్యులగు పెద్ద లనును, మాన్యులగు సంబంధులను, బంధువులను, రక్షింపఁదగిన భక్తులను, బూజ్యులయిన యాచార్యులను, బాణములచే భేదించి నందుననను, దనకు శాపము గలుగునోయని భయపడి నిన్నుఁ గదియరాకున్నాఁడు' అనెను. అందులకు భీష్ముఁడు 'కృష్ణా! దానమును, అధ్యయనమును, తపస్సును, బ్రాహ్మణులకు ధర్మ మగునట్లు క్షత్రియులకు యుద్ధమందు దేహమువిడుచుట ధర్మ మగును. తండ్రియుఁ, దాతయుఁ, దోఁబుట్టువులును, ఆచార్యుఁ డును, సంబంధులును, బంధువులును బొల్లయిన ప్రవర్తనముతో యుద్ధముచేయ వత్తురేని వారలను జంపుట ధర్మమే. కేశవా! కాఁబట్టి నెఱతిప్పి యుద్ధమునకువచ్చు లుబ్ధులగుపాపులు గురువు లయినను వారలను జంపు క్షత్రియుఁడు ధర్మము తెలిసినవాఁడే కాని వేఱుగాఁడు. పేరాసగొని ప్రాచీనము లగుధర్మముల మేరను బాటింపక వర్తించు మనుష్యుని యుద్ధంబునఁ జంపు రాజు ధర్మ మునుదెలిసినవాఁ డగును. యుద్ధములందు, రక్తము లనునీళ్లును, వెండ్రుక లనుతృణములును, గజము లనుకొండలును, ధ్వజము లనువృక్షములును గలదిగా భూమిని గావించు క్షత్రియుఁడే ధర్మము తెలిసినవాఁడు. యుద్ధమునకుఁ బిలువఁబడిన క్షత్రియుఁడు తప్పక యుద్ధము చేయవలయును. క్షత్రియున కిట్టియుద్ధము ధర్మ మనియు నిహపరములు రెంటియందును మంచిగతికిఁ గారణ మనియు మనువు చెప్పెను' అనెను.

భీష్ముఁ డిట్లు చెప్పఁగా యుధిష్ఠిరుఁడు మిక్కిలి వినయముతో నతని కన్నులకెదుటఁ జని యతని యడుగులను బట్టుకొని వంద

నముచేసెను. విలుకాండ్రందఱలోపలను మేటి యగునాభీష్ముఁడు, సంతోషంబున ధర్మరాజు శిరసు మూర్కొని గారాముసఁ గూర్చుండు మనిచెప్పి "కురుసత్తమా! నాయనా! భయపడకుము. మిక్కిలి చనవున నన్ను వలసినదడుగుము" అనెను. ఇది యేఁబదినాలుగవయధ్యాయము.

రాజధర్మపర్వము.


భీష్ముఁడు ధర్మరాజునకు రాజధర్మమును జెప్పుట.

ధర్మపుత్రుఁడు కృష్ణునకును బితామహుం డగుభీష్మునకును బ్రణామముచేసి, యందుఁ గల పెద్దలయందఱ యనుమతివడసి, ప్రశ్నము సేయువాఁడై 'రాజా! ధర్మవిదు లయినవారు రాజుల ధర్మమే పరమమైనదని చెప్పెదరఁట. ఇది పెద్దయు భారముగా నాకుఁ దోఁచుచున్నది. కాఁబట్టి పితామహా! క్షత్రియధర్మములు సవిస్తరముగా నాకుపదేశింపుము. రాజధర్మము జగమునందుఁ గలప్రాణిసమూహమునకెల్ల ముఖ్యాధారమయినది. ధర్మము, అర్థము, కామము ననుమూఁడుపురుషార్థములును రాజధర్మములందుఁ దగులుకొనియున్నవి. మోక్షధర్మమును మిక్కిలి స్పష్టముగా నిందడంగియున్నది. వాగెలు గుజ్జమును, అంకుశము గజమును నడంచునట్లు, రాజధర్మము లోకమునడంచునని చెప్పంబడుచున్నది. రాజర్షులు పరంపరఁగా జరుపుచు వచ్చుచున్న యీ రాజధర్మము తబ్బిబ్బు నొందునేని, లోకమంతయుఁ గుదురు తప్పిపోవును; సర్వమును వ్యాకులపడును. సూర్యుండుదయించి

యుశుభం బగుచీఁకటిని దొలఁగించునట్లు; రాజధర్మము లోక మున కశుభం బగుపోకడను బోఁకార్చును. కాఁబట్టి, భరత స త్తమా ! నీవు ధర్మపాలకులందు మేలుబంతివి గావున నా కొఱ కయి మొదట రాజధర్మములను జెప్పుము. పరంతపా ! మూకం దఱికును రహస్యశాస్త్రములు నీవలన నేర్పడుఁగాక. ఏలనఁ గృష్ణుఁడు నిన్నే బుద్ధియందు మిన్నగా నభిమానించు చున్నాఁడుగదే' అనెను.

భీష్ముని యుపదేశము ప్రారంభము.

భీష్ముఁడు 'మహానీయం బైనధర్మమునకు నమస్కారము. వేధయగు కృష్ణునకు నమస్కారము. బ్రాహ్మణులకును నమస్కరించి శాశ్వతము లయినధర్మములను జెప్పెదను. యుధిష్ఠిరా ! రాజధర్మములను, మఱియు నీవు గోరునట్టి యితరధర్మములను, వివరించుచున్నాను; నియమంబున వినుము. కురుతిలకా ! ప్రజలను రంజింపఁగోరు రాజు మొట్టమొదట విధిచొప్పున దేవతలను బ్రాహ్మణులను నారాధింపవలయును. దేవతలను బ్రాహ్మణులను నర్చింపఁగా రాజు ధర్మమును జేయకుండుటవలని దోషము నుండి విడివడుచున్నాఁడు; లోకము చేతను బూజింపఁబడు చున్నాఁడు. పుత్రా ! ధర్మరాజా ! ఎప్పుడును పౌరుషముగలిగి పాటుపడుచుండుము. రాజులకుఁ బౌరుషము లేక దైవమే కార్యమును సాధింపనేరదు. పౌరుషమును దైవమును రెండును బండికిఁ గన్నులుంబోలె సమస్తకార్యములకు సాధారణమయిన సాధనము లగును. ఈ రెంటియందుఁ బౌరుషము మేలయినదని నేను దలఁచుచున్నాను. తనపౌరుషముచేఁ జేసిన కార్యము తుదను, అది ఫలించినను ఫలింపకపోయినను దైవమునే దృఢముగాఁ



251. ధర్మపుత్రాదులు శరతల్పగతుఁడైన భీష్ముఁడిచ్చకుపచ్చి ధర్మోపదేశమును బడయుట.

వలచి దుఃఖము నుండికొని సుఖమునుండికాని మనుష్యుఁడు * విడిపడుచున్నాఁడు, నీవు చెల్లించు పాపపుణ్యము నిష్పలమయ్యను దానికై సంతాపపడవలదు. దానియందె తెలిసిపుడును బూనికగలిగి యుండవలయును. ఇట్టి విడువని పూనికయె రాజులకుఁ బరమమయిన నీతి. సత్యమువలె రాజులకు సిద్ధిగలిగించునది మఱొకటిలేదు. సత్యమందు నిరతుఁడయిన రాజీవము నందును బరమునందును సుఖంబుండును. రాజేంద్రా! ఋషులకు సయితము సత్యమే పరమమయిన ధనము. అట్లె రాజులయందు విశ్వాసము గలిగించునది వారి సత్యమునకంటె మఱొక్కటిగలుగదు. గుణవంతుఁడును, శీలవంతుఁడును, అడఁకువయు, నింద్రియనిగ్రహమును గలవాఁడును, † మెత్తదనము గలవాఁడును, ధర్మాత్ముఁడును, జూచుట కింపయినవాఁడును, మిక్కిలి దాతయు నగురాజెప్పుడును రాజ్యలక్ష్మిని విడిచి తొలఁగఁడు. కురునందనా! నీతిని జక్కఁగా విచారించి (స్వరంధ్రములనుగప్పి కొనుట, పరరంధ్రములను దానరయుట, నిజ మంత్రాలోచమున నడెయిన) మూఁటిని గప్పిపుచ్చికొని యివి తప్పఁ దక్కినసర్వకార్యములందుఁ జక్కటి నూఁదియుండుము. చక్కటి గలిగియున్న

---

* 'పౌరుషంబిహ పరంమేవ్యై దైవం నిశ్చిత్యై ముచ్యతే' అనే మూలము. ఆ రెంటిలో పౌరుషమే యెక్కుడని తలఁచుచున్నాను. వీలనేఁగా దైవము పౌరుషముచేత నయిన ఫలితములపలన నిశ్చయింపఁ బడియున్నది. కాని తనం తట దెలియునదిగాదు' అని యర్థాంతరము 'ముచ్యతే' అనుపాఠము గ్రహింపఁ బడెను.

† మృదుర్ధర్మ్యః అని (కొ. మూ) 'మృదుదండకః' అని (చా. మూ) మృదువయిన దండము గలవాఁడనీ యర్థము.

ఋషులు వెక్కండ్రు దేవలోకమునందు మోదంబునఁ దేలుచు న్నారు. రాజు మె త్తనై యుండునేని యందఱు నతని నుల్లంఘిం తురు; మిక్కిలి వేండ్రమైయుండునేని లోకు లతనికిఁ గలఁగుచుం దురు. కాఁబట్టి సమయముచొప్పున నతఁడు రెండువిధములనుం డవలయును. పుత్రా ! నీకు బ్రాహ్మణు లెప్పుడును దండింపఁదగిన వారు గారు. ఏలనఁగా లోకమున బ్రాహ్మణులు ప్రాణులం దు త్కృష్టులయినవారు. మహాత్ముం డయినమను వీవిషయమై రెం డుశ్లోకములను బాడియున్నాఁడు. నీ వా రెంటిని స్వధర్మము లను ష్ఠించునపుడు మనస్సునం దుంచుకొని యుండవలయును.అవియే వనఁగా-జలములనుండి యగ్నియు, బ్రాహ్మణునుండి క్షత్రియుఁడు ను,ఱాతినుండి యినుమును బొడమినవి.వాని తేజములు (శక్తులు) అన్నిటఁ జెల్లుచుండునుగానిఁ దమజన్మస్థానములందు నడఁగిపో వును. ఇనుము ఱాతినిగొట్టునపుడును,అగ్ని జలములను గాల్చు నపుడును, క్షత్రియుఁడు బ్రాహ్మణుని ద్వేషించునపుడును, నా మూఁడును గీడ్పడును - అనుటయే. మహారాజా ! కాఁబట్టి యిట్లుండుట తెలిసి నీవు బ్రాహ్మణుల కెప్పుడును మొక్కుచుండ వలయును. ఏలన శమసంపన్నులగు నాబ్రాహ్మణోత్తములు, వేదములను యజ్ఞములను దాల్చుచుందురు. సామాన్యముగా విధి యిట్లున్నను, లోకయాత్రకు విభూతుకు లగుబ్రాహ్మణులను, రాజు తన చేతులబలుపుచేతనే యడంపవలయును. తొల్లి మహా ర్షి శుక్రుఁడు రెండుశ్లోకములను బాడెను. దానిని మనసునం దె చ్చరికగలిగి వినుము. అవి యేవనఁగా-యుద్ధమం దాయుధమె త్తి కొని తన్నెదిరింప వచ్చుబ్రాహ్మణుఁడు వేదాంతవిదుఁ డయినను ధర్మము నపేక్షించు రాజు తనధర్మముచొప్పున నాయుధముచేత

నాతని నడంచి పుచ్చవలయును. ఏలనఁగా ధర్మవిదుం డగురాజు ధర్మము నశించుచుండఁగా దానిని రక్షింపఁబూనునేని దానిచే నతఁడు ధర్మమునకు హానిచేసినవాఁడుగాఁడు. ఏలనఁగా నక్లేది రించినవాని కోపమే యడంచువానికోపమును గలిగించినది. కాన, రాజుకోపము న్యాయ్యమగును - అనుటయే. రాజోత్త మా ! ఈవిధులచొప్పున బ్రాహ్మణులను రక్షించియే తీఱవలయు ను. వా రపరాధములు చేసిరేని వారిని నీదేశము నవ్వలికి వెడల నంపవలయును. వారు దండమునకుఁ దగియుండినను నీవు వారిని బీడింపరాదు. బ్రహ్మహత్య, భ్రూణహత్య, గురుతల్పగమనము, రాజును ద్వేషించుట యనెడియీదోషములు గలబ్రాహ్మణుని, దే శము వెలికి వెడలఁగొట్టవలయును. కాని, వారికి శరీరదండనము విధించుట యెప్పుడును నీతిగాదు. బ్రాహ్మణులందు భక్తిగలవా రియెడను నీవు మక్కువగలిగి యుండుము. *రాజులకు నిట్టిపురుషు లను జేర్చుకొనుటకంటె మించిన బొక్కసము మఱొక్కటిలేదు. మహారాజా ! శాస్త్రములందుఁ జెప్పఁబడిన భూమి, జలము, మరుభూమి, వనము, పర్వతము, మనుష్యులు, ననెడి యీయిదు ర్గములందును, ఇవి యేల, సమస్తదుర్గములందును, మనుష్యదు ర్గమే పగవారికి నెంతమాత్రము భేదింప నలవిగానిది. కాఁబట్టి వివేకజ్ఞానము గలరాజు నాలుగువర్ణములవారియందును నెప్పు డును దయఁజూపవలయును. ధర్మాత్ముఁడును, సత్యసంధుఁడు నగు

---

* 'న కోశో పరమో నృణాం స్తి రాజ్ఞాం పురుషసంచయాత్' అని మూలము. 'నకోశః పరమా తుష్టీ రాజ్ఞాం భవతిసంచయాత్' అని (దా.మూ) జనులను జేర్చుకొనుటవలన రాజులకు శోకములేక మిక్కిలి సంతోషము కలుగునని యర్థము.

రాజు ప్రజలను రంజింపును. పురుషస త్తమా ! అయినను నీ వెప్పుడును వారిదెసఁ దృష్టిగలిగి యుండరాదు. వీలవ రాజు మెత్త నివాఁడై యుండునేని మొత్తంబడిన యేనుంగువలె * నధముఁడే యగును. ఈవిషయమై బృహస్పతిరచితమైన శాస్త్రమునం దీయెక్క-శ్లోకము చెప్పఁబడియున్నది. అది చెప్పెదవినుము. "రాజెప్పుడును తృష్ణగలిగియుండునేని నీచుఁడయినమనుజుఁడు సయిత మతనిని, మావంతు డేనుఁగుతలపయినే యెక్కు-నట్లు, కీడ్పఁ బుచుచున్నాఁడు" అనుటయె. కాఁబట్టి శ్రీమంతుఁడగురా జెప్పుడును మృదువుగాను నెప్పుడును వేఁడ్రముగాను నుండక మిక్కి-లి చల్లఁగను మిక్కి-లి వేఁడిగను లేకుండు వసంతకాలపు సూర్యునివలె నుండవలయును. మహారాజా ! రాజు తన వారిని బరులను వారుచేయు కార్యములను బ్రత్యక్షముగాఁ జూచుటచేతను, ముఖవికారాదులయిన యనుమానములచేతను, ధక్కి-నయెడల వారిచేతల నుపమానముగాఁ గొనుటచేతను, బురుషుల లక్షణములను జెప్పు సాముద్రికాదిశాస్త్రములచేతను, నెప్పుడును బరీక్షింపవలయును. † సమస్తములయిన వ్యసనములను నీవు దిగవిడువవల,

---

* 'అధమోహి మృదూరాజా' అని మూలము. 'అధర్మోహి మృదూరాజా' అని(దా.మూ) రాజు మృదువుగా నుండునేని ధర్మవిరోధి యగునని యర్థము.

† వ్యసనములు పదునెనిమిది—వానియందు వేట, జూదము, పగలు నిద్రించుట, పరులనిందించుట, స్త్రీలోలత్వము, మదము, వ్యర్థప్రయత్నము, ఆట, వాద్యము, అనెడి యీషదిత్యును గామమున్ జేఁ గలుగునవి. తెలియనితప్పును వెలిపుచ్చుట, తప్పులేనివానిని దండించుట, కపటముగాధించుట, పరులయొ, న్న త్తి చూచుట, పరులగుణములను దోషముగాఁ జెప్పుట, పరులద్రవ్యము నపహరించుట, పరుసంపుమాటలు, క్రూరమయిన దండనము అనెడి యీ రెండు,

యున్ను, * వాని నీ వెంతమాత్ర ముపయోగింపఁదగదని కాదు; వానియందు మిక్కిలి తగులుమాత్రము గూడదు. † వ్యసనముగలవాఁడు లోకమునఁ గీడ్పాటునొందుచున్నాఁడు. మిక్కిలి ద్వేషించునట్టి రాజు ప్రజలమనస్సు గలంచుచుండును. రాజెప్పుడును ‡ గర్భిణీభర్తృమునం దుండవలయును. ఇట్లు చెప్పుటకుఁ గారణమును వినుము. గర్భిణి తనమనసునకును నాలుకకును నింపయినవస్తువును భుజియింపక యాగర్భమునకు హిత వయినదానిని గయికొనునట్లు, ధర్మము ననువర్తించు రాజు తనకుమాత్ర మింపయినదానిని విడిచి ప్రజలకేది హిత మ్రో దానియందే యెప్పుడును దప్పక వర్తింపవలయును. పాండవా! నీ వెప్పుడుగాని ధైర్యమును విడువరాదు. ఏలనఁగా రాజు ధైర్య

మిది క్రోధముచేఁ గలుగునవి. మొదటితెగయందలి పాపము, జూదము, స్త్రీలోలత్వము, అను నాలుగును, రెండవతెగయందలి పరులసొమ్ము నపహరించుట, పరుసనిమాట, క్రూరదండనము అనెడి యీమూఁడును మిక్కిలి కష్టములయినవి.

* ఇందులకు 'నచైవ న ప్రయుంజీత సంగంతు పరివర్జయ' అని మూలము. 'న చైతాని ప్రయుంజీథాఃసంగంతు పరివర్జయ' అని (దా. మూ) దానిని ప్రయోగింపవలదు. వానియందు సంగము దిగవిడువుమని యర్థము. ఇది యంత సరళముగాదు.

† 'వ్యసనీ యస్తులోకేఽస్మిన్పరిభూతోభవత్యుత' అని మూలము. 'లోకస్య వ్యసనీ నిత్యం పరిభూతోభవత్యుత' అని (జై. మూ) వ్యసనముగలవానికి లోకులందఱవలనను నెపుడుఁ గీడ్పాటు నొందుచుండునని యర్థము.

‡ అనఁగా తల్లి కడుపునందలి బిడ్డయందుంబోలె, రాజు ప్రజలయందు వర్తింపవలయును.

ముగలిగి దండమును స్పష్టముగాఁ గావించుచుండునేని * యతని యాజ్ఞకు నడ్డులేక చెల్లుచుండును. పనివాండ్రతో మితిమీఱి పరిహాసమాడరాదు. అందుఁ గలదోషమును జెప్పెదనువినుము. ఒడయుఁడు తన్నుఁగొలిచి బ్రతుకువారితో మిక్కిలికలయికగా నుండెనేని వా రతని నంతగా † సరకుసేయరు; మఱి తమతమకు నియతములయిన పదములయందు నిలువరు. ఒడయనిమాటను మీఱి నడుతురు. ఒకపనికిఁ బుచ్చినయెడల వారుపోవఁ గొంకుట యేకాక; పోయినను నధిపతి రహస్యములను వెలిపుత్తురు. (అడుగరాని రహస్యమునైన నడుగుదురు.)యాచింపరాని దానినయిన యాచింతురు. ఒడయుఁడు భుజింపఁదగినవస్తువులను భుజింతురు. రాజు తమపయిఁ బ్రభుత్వమునెఱపెనేని కోపించి మండిపడుదురు. అతనికంటె మించి వెలుంగఁజూతురు. లంచములు దీసియు, మోసపుచ్చియు నతనికార్యములు చెఱుపుదురు. రాజు న్తరువులంబోని కల్ల పత్రికలను గల్పించి రాజ్యము నిస్సారమును జేయుదురు. అంతపురపునాఁడు కావలివారితో తగులు గలిగియుందురు. రాజువలెనే వేషములు వేసికొందురు. రాజు సన్నిధియందే లజ్జవిడిచి యోకిలించుట, యూవులించుట, యుమియుటయుఁ జేయుదురు; అతనిని గుఱించిన మాటలను నితరులు తోడఁ గొంకులేక ముచ్చటింతురు. రాజు మెత్తనై యుండెనే

---

* 'ధీరస్య స్పష్టదండస్య నహ్యాజ్ఞా ప్రతిహన్యతే' అని (దా. మూ.) 'నభయం విద్యతేక్వచిత్' అని (జై. మూలము) ఎచ్చటను భయముగలుగదని యర్థము.

† 'అవమన్యంతి భర్తారం సంహర్షా నుపజీవినః' అని మూలము 'సనార్ష ముపజీవినః' అని (దా. మూ) పరియాచకమాడు నొడయని పాటింపరని యర్థాంతరము.

నియు బరియాచక మాడువాఁడేనియు నతనిభృత్యు లతనిసెంత మాత్రము గణింపక యతఁడొక్కఁడగినగుఱ్ఱమునుగాని, యేనుఁగునుగాని, రథమునుగాని యుబ్బున నారోహింతురు. అతని నిసుహృదులు కొలువునండే, 'రాజా! ఇది నీకుఁ జేయనలవిగాదుపో, ఇట్లుచేయుట చెడ్డపని' యని యిట్టిమాటలు పలుకుదురు. అందులకు రాజు కోపించునేని వారు నవ్వనే నవ్వుదురు. రాజు వారిని మరియాదలఁ బూజించినను వారు*సంతోషమునొందరు. ఒకరినొకరు మించఁగోరి యొండొరుల రారాపుచేయుచుందురు. మంత్రాలోచనమును భేదింతురు. రాజ్యమందలి చెడుగులను బయలుపుత్తురు. రాజు నుత్తరువులను నంతగా సరకుసేయక యవజ్ఞతో వేడుకగాఁ జేయుదురు; కాని వెఱపుచేతఁగాదు. †రాజునలంకారములు, భోజనవస్తువులును, స్నానద్రవ్యములును, చందనాద్యనులేపనములు రాజు వయినవనియొన్నక యతని నెగతాళి సేయుచునే జంకుమాలి తా మనుభవింతురు. మఱి తమ కిచ్చినయధికారము లేపాటివని నిందించుచు వానిని దిగవిడుతురు.

---

* 'సంహర్షశీలాశ్చ తదాభవన్త్యన్యోన్యకారణాత్' అని మూలము. 'సంహర్షశీలాశ్చ' అని (బొ. మూ) ఇతరకారణములనుబట్టి వారు సంతోషపడుదురు.

† 'అలంకారాణిభోజ్యాని తథాస్నానానులేపనే। హేలయావా నరవ్యాఘ్ర స్వస్థాస్తస్యోపభుఞ్జతే' అని మూలము. దీనికి 'అలంకారేచ భోజ్యేచ తథాస్నానానులేపనే। హ్రియమాణే నరవ్యాఘ్ర స్వస్థాస్తస్యోపశేరతే' అని (బొ. మూలము) రాజున కలంకారములు భోజనద్రవ్యములు మొదలయినవి తేఁబడుకున్నను నతని యెదుటనే సెమ్మదిగ నూరకుందురుగాని తెచ్చియియ్యరు అని యర్థాంతరము.

న్యాయముగా తము కయినవస్తువులతో నెంతమా త్రము తనిని నొందక రాజున కయినవస్తువులను బలిమిని గయికొందురు. మఱి పక్షిని ద్రాడుగట్టి యాడించునట్లు రాజుతో వేడుకలాడ నిచ్చ గింతురు. లోకులకు 'రాజు మేముచెప్పనట్లు నడచువాఁడు' అని చెప్పి కొనుచుందురు. యుధిష్ఠిరా ! రాజు మె త్తనివాఁడై పరి యాచకము లాడుచుండునేని యీచెప్పిన దోషములును నింకను వేఱయినవియు నుప్పతిల్లుచుండును' అనెను. ఇదియేఁబదియైదవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు రాజధర్మములను జెప్పుట.

భీష్ముఁడు 'ధర్మరాజా ! రా జెప్పుడును బూనికగలిగి యుండ వలయును. ఆఁడుదానివలెఁ బూనిక లేకుండు రాజును బ్రజలు గొనియాడరు. ఈవిషయమై మహాత్ముఁడు శుక్రుఁ డొకశ్లోకము చెప్పియున్నాఁడు. దానిని నీకుఁ జెప్పెద నాలించి వినుము. అది యేమనఁగా—'యుద్ధమునకు నొల్లనిరాజును, అధ్యయనమునకై బయటఁబోని (లేక యాలుబిడ్డలయందే తగులుగలిగిన) బ్రాహ్మ ణునిని, నీభూమి, సర్వమెలుకలునుంబోలె మ్రింగుచున్నది' యని యె. ఈవిషయము నెప్పుడు నీవు మనస్సునం దుంచుకొనవల యును. నరోత్తమా ! సంధిచేసికొనఁదగినవారితో సంధిచేయు ము. విరోధింపఁదగినవారితో విరోధము పెట్టుకొనుము. రాజ్య ముసప్తాంగములకు నెవఁడొమ్మని పనిచేయునో వాఁడు నీకు గురు వయినను మిత్రుఁడయినను, వానిని దప్పక చంపియే తీఅవలయు ను. మరుత్తుఁడను రాజు పాడిన యొకపురాతనశ్లోకముగలదు. అది

బృహస్పతిమతముచొప్పున రాజు నధికారమునుగుఱించి తొల్లి చెప్పఁబడినది. అది యేదనఁగా 'ఇది చేయఁదగును; ఇది చేయఁదగదని తెలియక గర్వించి చెడుదారిని ద్రొక్కినవాఁడు గురువయినను వానికి * దండము చేయవలసిన దెప్పుడును తప్పరాదు' అనియె. బాహుని పుత్త్రుం డగుసగరమహారాజు బుద్ధిమంతుఁడుగాన పురజనుల హితమునే కోరి తనవెడ్డకొడు కయినయసమంజసుని దిగవిడిచెను. ఆ యసమంజసుఁడు పురజనుల బాలురను బట్టికొనిపోయి సరయువునందు ముంచుచువచ్చెను. కావునసే తండ్రి సగరుఁడు మాటికిఁ దెగడి యూరు వెడలఁగొట్టెను. ఉద్దాలకుం డనుఋషియు బ్రాహ్మణులకుఁగపటోపచారము చేసినాఁడని, మహాతపస్విని శ్వేతకేతుఁ డనుతనగారాబుపుత్త్రుని దిగనాడెను. లోకమునందుఁ బ్రజలను రంజింపుటయు, సత్యమును రక్షింపుటయు, కపటములేక వ్యవహరింపుటయు ననునివి రాజునకు సనాతనధర్మము. (కప్పమునకై ధాన్యములనెత్తికొనుట మొదలయిన విధముల) రాజు పరులధనమునకు హాని కలిగింపరాదు. తానియ్యవలసిన కూలి మొదలగునవి కాలమున నిప్పింపవలయును. పరాక్రమమును, సత్యవాక్కును, క్షమయును, గలరాజు పదవినుండి తొలఁగఁడు. రాజు తనమంత్రములను వెలిపుచ్చరాదు. క్రోధమును జయింపవలయును. తాను నీతిశాస్త్రముల యర్థము ననుసరించి నిశ్చయములు చేయవలయును. ధర్మార్థకామమోక్షములు నాలుగింటియందును

---

* 'ఉత్పథం ప్రతిపన్నస్య దండోభవతి శాశ్వతః' అని మూలము. 'పరిత్యాగో విధీయతే' అని (దా. మూ.) దిగవిడుపవలయునని యర్థము.

నాసక్తుఁ డై యుండవలయును. * మూఁటియందుఁ దన మంత్రాలోచనము గప్పిపుచ్చుకొని యుండవలయును. రాజ్య మంత్రములను వెలువడనట్లు రక్షింపకుండుటకంటె, రాజు లకుఁ జెడుగు వేఱెద్దియులేదు. రాజు నాలుగువర్ణములధర్మము లను బాలింపవలయును. ధర్మములు సంకరము గాకుండునట్లు రక్షించుట రాజులకు సనాతనధర్మము. తనవారినిదక్క పరుల యం దొక్కనిని నమ్మరాదు. తనవారిని సయితము మితిమీఱి నమ్మరాదు. (సంధి, విగ్రహము, యాగము, ఆసనము, ద్వైధీ భావము, ఆశ్రయము) అనెడి యాఱుగుణములయందుఁ గల గుణములను దోషములను నిత్యమును బుద్ధిఁగొని కనుఁగొను చుండవలయును. రాజు తన పగవారియందలి ఛిద్రములు గనుఁ గొనుచు, రాజ్యము వృద్ధి హాని సమస్థితుల తత్త్వములను దెలి యును. తగిన వేగులవారినిగొని పరులమర్మములు గనుఁగొను చునుండునేని లోకు లట్టివాని నెప్పుడును గొనియాడుచుందురు. రాజు యమునివలె దండమునెఱపుచుఁ, గుబేరునివలె బొక్కసము నార్జించుచుండవలయును. మంత్రి, రాజ్యము, కోట, ధనశాల, గజ తురగాదిచతురంగ,మని తనరాజ్యమునంగల యీయైదింటికిని బరరాజ్యమునం గలయీయైదింటికిని స్థానవృద్ధి క్షయములను దెలియుచుండవలయును. అతఁడు పోషింపఁబడనివారిని బోషించుచుఁ, బోషింపఁబడిన వారిస్థితి నరయుచును, బ్రసన్న మయినముఖము గలిగి చిఱునవ్వుదొలఁకఁ బలుకుచుండవల యును. మఱియుఁ బెద్దల నుపాసించుచు, ప్రాలుమాలికను

* స్వామి, అమాత్య, సుహృత్, కోశ, రాజ్య దుర్గ బలము లేడును రాజ్యాంగములు. మూఁటియందనఁగా న్యాయలాభభోగములు మూఁడు.

విడిచి యితరులవస్తువులకుఁ బేరాసపడక సజ్జనులనడవడియందే బుద్ధినిలిపి వారి యాచారములను నూటిగాఁ బాటించుచుండవలయును. సజ్జనులచేతనున్న ధనముల నెప్పుడుగాని దీసికొనరాదు. ఆ సత్పురుషలవలన ధనముదీసికొని సత్పురుషులకు నొసంగవలయును. రాజు తనంతటనే దండించువాఁడై దాతయై యాత్మనిగ్రహము గలవాఁడును, దన పరివారమునడంచి యేలువాఁడును, గాలమెఱిఁగి యిచ్చువాఁడును, గాలమున భుజించువాఁడును, బవిత్రమయిన నడవడిగలవాఁడునై యుండవలయును. సత్కులమునఁ బుట్టినవారును, రోగములేనివారును, బగవారిచే వంచింపఁదరముగానివారును, మంచికుటుంబములతోడి సంబంధము గలవారును, దనయందు భక్తిగలవారును, శూరులును, మానులును, శిష్టుల నవమానింపనివారును, శిష్టులును, సాధువులును, విద్యావిదులును, లోకము నెఱిఁగినవారును, బరలోకమును బాలించువారై ధర్మములందుఁ దగిలి పర్వతములవలెఁ జలింపకుండువారునునగువారిని, సంపదచే నలంకృతుఁడు కాఁగోరురాజు తనకు నెప్పుడుసహాయులుగా నుంచుకొనవలయును. తనకును వారికిని భోగములందు భేద మెంతమాత్రము లేక సమానతగలిగియుండవలయును. శ్వేతచ్ఛత్రము, ఆజ్ఞయును నీరెంటియందే వారికంటె తనకతిశయ ముండవలయును.తక్కిన భోగములన్నియు వారికిని దనకును సమానములై యుండవలయును. తాను వారియెడ నడచుకొనురీతి యెదుటఁగాని మఱుఁగునఁగాని యొక్కతీరుననే యుండవలయును. ఇట్లుచేయు రాజు దుఃఖమెంతమాత్రమును బొందఁడు. ఏ రాజు లోభియుఁ గపటవర్తనుఁడునై యందఱియెడలను శంకించుచు నందఱిసొమ్ములను హరించుచుండునో వానిని వాని

జనులే వేగ * వధించిపుత్తురు. పరిశుద్ధవర్తనము గలవాఁడై †లోకుల మనంబుల రంజించుటయందే యాసక్తి గలిగియుండు రాజు శత్రువులకుఁ జిక్కినను గాని క్రిందుపడఁడు. ఒకవేళఁ గ్రిందుపడినను తోడనే పెరిఁగినిలుచును. కోపము మిక్కిలియు లేక వ్యసనంబులకుఁ బొలుగాకయు క్రూరముగా దండింపకయు నింద్రియములగెలిచియు వెలయునట్టిరాజు, సమస్తప్రాణులకును హిమవత్పర్వతముం బోలె, సకలప్రజలకును నమ్మి యండగొనం దగినవాఁడగును. అతఁడు ప్రాజ్ఞుండై న్యాయగుణముతోఁగూడి పరరాజుల రంధ్రములను గనుఁగొనుటయందే కనుగలిగి,చూచుటకు నింపయి యుండవలయును. మఱియు సమస్తవర్ణములవారికిఁ గల నీతిని అనీతిని జక్కఁగాఁ దెలిసి వలయుకార్యములు వేగముగాఁ జేయువాఁడై కోపమునడంచి యెంతయుఁ బ్రసన్నతగలిగి గొప్పమనస్సుతో నుండవలయును; ‡ రోగప్రకృతిగాకయుఁ బ్రయత్నపరుఁ డయ్యు, యజ్ఞాదికర్మములందుఁ దత్పరుఁడయ్యు నుండవలయును; తన్నుఁ దాను బొగడికొనరాదు; § అతఁ డారంభించిన కార్యము లన్నియు లెస్సగా ముగింపునొందియే చూపట్టుచుండవలయును. అట్టిరాజే రాజు

---

* 'ఏధ్యతే' అనిమూలము. 'బాధ్యతే' అని (దా. మూ.) బాధింపఁబడునని యర్థము.

† 'లోకచిత్త ప్రహారతః' అని మూలము. 'లోకస్యాను(గ్రహారతః' అని (దా. మూ.)

‡ 'అరోమప్రకృతిః' (జౌ.మూ)

§ అరబ్ధాన్యేవకార్యాణి సుపర్యవసితాన్యపి । యస్యరాజ్ఞఃప్రదృశ్యన్తే' అనిమూలము. 'న పర్యవసితాన్యపి' అని (దా. మూ)

లుండుమిన్న; ఎవని దేశమందు మనుష్యులు, తండ్రియింటఁ బుత్రులుంబోలె నిర్భయముగాఁ జరించుచుందురో యారాజే రాజులందుమిన్న; ఎవని దేశమందు వసించుజనులు తమధనములను దాఁచికొనక తెల్లముగా పెంపుసొంపు లనుభవించుచు నయాపనయములను నెఱింగియుందురో యారాజే రాజులందు మిన్న; ఎవ్వని దేశమందుఁ గాఁపున్నజనులు తమతమ ధర్మములందుఁ దప్పక వర్తించుచు దేహమాత్ర సుఖములందు మిక్కిలి ప్రీతి లేక యంతరింద్రియనిగ్రహమును గలిగియుందురో; విధ్యుక్తముగాఁ బరిపాలింపఁబడి రాజునకు వశ్యులై వినయసంపన్నులయి జగడ గొండితనములులేక, దానమునందు రుచిగలిగియునుందురో యతఁడే రాజనఁదగును. ఎవనిరాజ్యమునందు, డంభమును గపటమును మాయలును మత్సరమును గలుగవో యారాజునకే సనాతనధర్మము సిద్ధించును; ఎవ్వఁడు జ్ఞానవంతుల జ్ఞానములను గారవించుచుఁ, దెలియవలసిన *బరహితములగు శాస్త్రములందాసక్తుఁడై, సజ్జనులమార్గముననుసరించుచు, దానశీలుఁడై యొప్పునో యారాజు రాజ్యమున కర్హుఁడగును; ఎవ్వనిచారులును మంత్రాలోచనములును జేసినవియుఁ జేయకుండునవియును నతని శత్రువులకుఁ దెలియరాకుండునో యారాజే రాజ్యమునకర్హుఁడు. మున్ను మహాత్ముఁడయినశుక్రుఁడొకరాజునుగూర్చి రాజధర్మములను జెప్పినప్పుడీ శ్లోకమును బాడియున్నాఁడు. అది యేదనఁగా—'మొదట రాజునుబడయవలయును. పిదపభార్యను, బిదపధనమునుబడయవలయును. రాజులేకుండినచో నీలోకమునందు

* 'శ్లోకోపరహితేరతః' అని మూలము. 'శ్రేయఃపరహితేరతః' అని (దా.మూ)

భార్యయెక్కడిది ? ధనమెక్కడిది ' అనియే. * కాఁబట్టి రాజ్యమునుగామించువారికి స్పష్టముగాఁ బ్రజలనురక్షించుటకంటెను సనాతన మయినధర్మము మఱొక్కటి రాజ్యమందుఁ గలుగదు. ప్రజారక్షణమే లోకమును ధరించునది. ప్రచేతసునిపుత్రుఁడగు మనువు రాజధర్మమునుగూఱించి యీరెండుశ్లోకములు నుదాహరించియున్నాఁడు. దాని నెచ్చరికతో వినుము. అవియేవనఁగా- 'సముద్రమునందుఁబగిలిన యోడను దిగవిడుచునట్లే యీయుగురను మనుష్యుఁడు విడిచిపెట్టవలయును. వారెవ్వరన-చదివింపని యాచార్యునిని, అధ్యయనముచేయని ఋత్విజుని, రక్షింపని రాజును, ప్రియముగాఁ బలుకనిభార్యను, గ్రామమునందే గ్రుమ్మఱు పసులకాపరిని, అడవికిఁబోవు మంగలినిని, విడువవలయును' అనుటయె. ఇది యేఁబదియీఅవయధ్యాయము.

---

* ఇట ఔత్తరాహకోశములందు 'శ్లోకశ్చాయం పురాగీతో భార్గవేణ మహాత్మనా, ఆఖ్యాతేరామచరితే నృపతింప్రతి భారత'అని యొక్క శ్లోకముగాఁ జెప్పఁబడియున్నది. 'ఆఖ్యానే రామచరితే' అనుటకు రామచరిత్రమనెడి యాఖ్యానమందని యర్థము. దాక్షిణాత్యకోశములందు 'శ్లోకద్వయం పురాగీతం భార్గవేణమహాత్మనా, ఆఖ్యాతే రాజచరితే' అని రెండుశ్లోకములుగానున్నది. 'ఆఖ్యాతే రాజచరితే నృపతింప్రతి' అనుటకు ఒకరాజునకు రాజధర్మము చెప్పినపుడని యర్థమగుచున్నది. ఇందు భార్గవుఁడనుటకు శుక్రుఁడని కొందఱును పరశురాముఁడని కొందఱును నర్థముచేసియున్నారు. ఆశ్లోకములు 'రాజానం ప్రథమంవిన్దేత్తతో భార్యాంతతో ధనమ్ । రాజన్యసతి లోకేఽస్మిన్ కుతోభార్యాకుతో ధనమ్ ॥ 'తద్రాజ్యేరాజ్యకామానాం నాన్యో ధర్మ: సనాతన:, ఋతేరక్షాంతు విస్పష్టాం రక్షాలోకస్య ధారిణీ ॥' ఇందు మొదటిదిమాత్రమే, భార్గవుఁడుచెప్పెనని ఔ-కోశములును, రెండును జెప్పెనని దాకోశములును, ప్రతిపాదించుచున్నవని తెలియునది.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు మొదటినాఁడు ధర్మరాజునకు రాజధర్మములు చెప్పుట. వాటిసాయింకాలము కృష్ణాదులు తమతమ నెలవులకుఁ బోవుట.

భీష్ముఁడు 'యుధిష్ఠిరా ! ప్రజలనురక్షించుట రాజధర్మములందుఁ జిలికిదెత్తిన వెన్నచుమీ. భగవంతుఁడు బృహస్పతి దీనిని దప్ప మఱొక్కధర్మమును గొనియాడఁడు.మహాత్ముండగు విశాలాక్షుండును, శుక్రుండును, దేవేంద్రుడును, మనువును, భరద్వాజుండును, గౌరశిరుం డనుమునియు, ననెడియీ బ్రహ్మవాదులును బ్రాహ్మణులును రాజధర్మములను రచించినవారు.వీరందఱును నీప్రజారక్షణ ధర్మమునే కొనియాడిరి. రాజులకీరక్షణము నొడఁగూర్చు సాధనమెద్దియో వినుము. 'బాహాటముగానుండుచారులను రహస్యముగనుండు చారులను నియోగించుట, వారికిఁ దగినకాలములందు వేతనాదుల నిచ్చుట, మచ్చరములేమి, మెలపుతోఁబన్ను పుచ్చుకొనుట, ఉపాయముమాలిపన్ను పుచ్చుకొనకుండుట, సజ్జనుల నేర్పఱచుకొనుట, శూరత్వము, నేర్పు, సత్యము, ప్రజలకు హితముసేయుట, శత్రుపక్షమును జక్కటిచేతఁగాని చక్కటిమాటిగాని వృద్ధినొంద నీకుండుట, ప్రాతగిలికూలుట కున్నగృహములను జక్కఁజూచుకొనుట,కాలమునకుఁదగిన శరీరదండనమో ధనదండనమో విధించుట, సాధువులనుగూడిన విడువకుండుట, సత్కులమునఁబుట్టినవారిని బోషించుట, సంతరించుకొనవలసినధాన్యాదులను సేకరించుకొనుట, బుద్ధిమంతులను గొలుచుట, సేనలనెప్పుడును సంతోషపెట్టుచుండుట, ప్రజలను బరామర్శించుచుండుట, కార్యములందు మేల

యక దిటగలిగియుండుట, బొక్కసమును వృద్ధిఁబొందించుట, *శత్రుపురజనులకలయికను భేదించుట, పట్టణమును బదిలముగాఁ గావలియుంచికాచుట, †కావలివారియందుమిక్కిలి నమ్మికయుంప కుండుట, శత్రువు మిత్రుఁడు మధ్యస్థుఁడను మువ్వురకలరూపులను బాటించుచుండుట, భృత్యులందు నమ్మికయుంపకయుండుట, తన పట్టణము నప్పుడప్పుడు తానై చూచుకొనుచుండుట, శత్రువులను దానునమ్మకయే తానుమాత్రము వారలకు నమ్మికలుగలిగించు చుండుట, నీతిమార్గము ననుసరించుచునే యెప్పుడును బ్రయత్న పరుఁడై యుండుట, శత్రువుల నలక్ష్యముచేయకుండుట, యెప్పు డును నయోగ్యులను గూడకుండుట యనునివియే. వీనియందు రాజులకుఁ బ్రయత్నపరతయే రాజధర్మములకెల్ల మూల' మని బృహస్పతిచెప్పెను. దీనినిగుఱించిన శ్లోకములను జెప్పెదను వినుము. ' ప్రయత్నముచే నమృతము (దేవతలకు) లభించినది. ప్రయత్నముచేత నసురులు హతులయిరి. ప్రయత్నముచేత మహేంద్రుఁడిందును దేవలోకమందును శ్రేష్ఠత్వమొందెను. ప్రయత్నశూరుఁడగువాఁడు మాటలందు శూరుఁడగువానికి నెక్కువయి యుండును. ప్రయత్నశూరులగువారిని వాక్శూరులగువారు రంజించుచుఁ గొలుచుచుందురు. ప్రయత్నములేక యుండువాఁడెంతబుద్ధిమంతుఁడయ్యును వాఁడెప్పుడును శత్రువు

---

* ' శత్రువులు తమపక్షము గావించుకొన్న పురజనులను వారినుండి వేఱు పఱుచుట. ' శత్రుపక్షస్యవిధ్వంసమ్ ' (దా. మూ) ' శత్రుపక్షస్యభేదనమ్ (బొ. మూలము) శత్రుపక్షమువారిని భేదించుటయని యర్థము.

† 'పురగోపురవిశ్వాసః ' అని మూలము. 'పురగుప్తిరవిశ్వాసః' అని పా ఠాంతరము.

లకు విషము లేనిసర్పముంబోలె చుల్కఁగా ధర్షింపఁగూడినవాఁ డై యుండును. మిక్కిలి బలీయుఁడయినరాజుగూడ తనశత్రువు బలహీనుఁడయు యున్నను వాని నుపేక్షించియుండరాదు. అగ్ని యించుకయినను గాల్చుచున్నది. శత్రువు చతురంగములలో నేదేని యొకయంశమే గలవాఁడయియుండినను, జొరరాని కోట మొదలయినదుర్గము నాశ్రయించియుండునేని, యట్టివాఁడు సమస్తములయిన యంగములు సమృద్ధముగాఁ గలరాజు దేశమును సయిత మంతటిని (ఆదుర్గము బలిమిచే) తపింపఁ జేయును. రాజు రహస్యముగాఁ దానాడినమాటయు, శత్రువులను జయించుటకై జనులసమకూర్చుకొనుటయు, అందులకై తాను మనస్సునందుఁగల కపటతంత్రములును, వేఱుకారణములను బట్టియుఁగల యట్టికార్యమును బయికిఁ * జక్కటిచేతను మెత్తదనము చేతను ముసుఁగువైచి కప్పి యుంచుకొనవలయును. రాజు లోకమును † రంజించుటకై మిక్కిలి ధర్మ్యములయిన కార్యములు నాచరింపవలయును. రాజ్యమో మిక్కిలి గొప్పదియగు తంత్రము .దానిని మనస్సు పరిపక్వము గానివారల కెంత మాత్రమును వహింప శక్యముగాదు. రాజ్యమును సకల జనులును నామిషమునుంబోలెఁ గామింతురు. అది పెక్కు సంకటములకుఁ గందువపట్టు; మిక్కిలియు గొప్పదికాన దానిని

---

* 'ఆర్జవేనేహ నిర్జయేత్' (బొ. మూ) 'మార్దవేనైవ ధారయేత్'(దా. మూ). రెంటికిఁజూర్థములు నిట వ్రాయంబడియున్నవి.

† 'రంజనార్థ' మ్మని (దా. మూ.) దంభనార్థ' మ్మని (బొ. మూ). జనులను లోకువ నుంచుకొనుటకై రాజు ధర్మ్యుక్తముగా నడచుకొనవలయునని యర్థాంతరము. దంభనార్థమనఁగా సంఘాతార్థమని యర్థము.

* మె త్తఁ దనముచేతను భరింపఁ దరముగాదు. పరుసనయిన చక్కటిచేతను వహింప శక్యముగాదు. కాన మె త్తని కపటము చేతను బిరుసనిచక్కటిచేతను నెప్పుడును రాజు ప్రవ ర్తింప వలయును. అట్లు రాజు ప్రజలను రక్షించుచుండు నపుడు దాని వలన నతని కేదేని విప త్తి కలిగినను నది యతనికి విపులమయిన ధర్మము దొరకొనుఁటే యగును. ఇట్టినడవడిగల వా రే రాజులు. కురుకులతిలకా ! ఇప్పుడు రాజధర్మములం దించుక మాత్రమును నీకుఁ జెప్పితిని. నీకు సం దేహము గలవిషయమును మరల నడుగుము' అనెను.

అంత, వ్యాసుండును, దేవస్థానుండును, అశ్మ్మఁడును, కృష్ణుండును, కృపుండును, సాత్యకియు సంజయుండును మొదలగు వారందఱును, †నె మ్మొగములు దద్దయుఁ బూవ్వులవ లె వికసించుచుండ, సంతోషము పిక్కటిల్ల, పురుషసింహుండును ధార్మిక శ్రేష్ఠుండునగు భీష్ముని 'బాగుబాగు' అని పొగడిరి. అంత ధర్మ రాజు విన్ననయిన మనంబునఁ గన్నుఁగవఁ గన్నీరు చిప్పిలు చుండ, భీష్ముని పాదములను మెల్ల నంటుచు, మ్రొక్కి 'పితా మహా! నేను రేపటికి నాకుఁగల సం దేహముల నడిగెదను. ఏలన నిపుడు సూర్యుఁడు భూమియందలి రసమును బీల్చుకొని య స్త

---

*నశక్యం మృదునా సోఢుం మాఘతస్థాన ముల్బణమ్। రాజ్యం సర్వామిమం నిత్యమార్జవే నేహ ధార్యతేః' అని (దా. మూ). సోఢుం మాయూసంస్థాన ముత్త మమ్' ...నిత్యంనార్జవే నేహ...అని (భా. మూ) ఉ త్తమమయిన పదవిని కష్టల భ్యమయిన దానిని మృదువయినవాఁడు వహింప నేరఁడని యర్థము.

†'ప్రుష్యమాణమి వాననైఃఁ' అని (భా.మూ;)'ఘుష్యమాణమి వాననైఃఁ'అని (దా. మూ) ఇది సరసముగాదు.

మించుచున్నాఁడు' అనెను. అంతఁ గృష్ణుఁడును గృపుఁడును ధర్మరాజు మొదలగువారును నందుఁ గలబ్రాహ్మణులకు మ్రొక్కి భీష్మునికిఁ బ్రదక్షణము గావించి ముదంబున రథంబుల నారోహించిరి. ఆవీరులు, నియమముల నెంతమాత్రమును దప్పనివారు గాన దృషద్వతీయను నదియందు జలకమాడి, జలాంజలులు విడిచి మంగళములగు మంత్రములను జపించి విధిచొప్పున సంధ్యావార్చి యంత హస్తినాపురమును బ్రవేశించినవారయిరి. ఇది యేఁబదియేడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముండు ధర్మరాజునకు రాజులయుత్పత్తిని బ్రహ్మగావించిన దండనీతి శాస్త్రవృత్తాంతమును పృథురాజు చరిత్రమును జెప్పుట.

అంతఁ బౌండ్రులును యాదవులును దెల్లవాఱఁగా లేచి ప్రాతఃకాలకరణీయములను గావించి పట్టణములవలెఁ జూపట్టుచున్న రథముల నెక్కిపోయిరి. వారు కురుక్షేత్రమును జేరి యనఘుండగుభీష్ముని దగ్గఱకుఁబోయి 'రాత్రి హాయిగాఁ గడచెనా' యని యూరథికవర్యు నడిగిరి; మఱియు వ్యాసాదులగు ఋషులకు మ్రొక్కి, వారు తమ్ము నభినందింపఁగా, భీష్ముని నలు ప్రక్కలను బరివేష్టించి కూర్చుండిరి. అంత ధర్మరాజు భీష్ముని యథావిధిగఁ బూజించి యంజలిగీలించి యతనితో "రాజు" అనెడి యీశబ్దమొకటి వాడుకయం దున్నది. ఇది యెక్కడనుండి పుట్టినదని నాకుఁ జెప్పుము. తక్కిన మనుష్యులకుంబోలెనే రాజునకును జేతులును, బుజములును, గుత్తుకయు నున్నవి. బుద్ధియు

నింద్రియములు మనస్సు నున్నవి. సుఖమును దుఃఖమును, ద్వేషమును, ముఖమును, గడుపును, శుక్లమును, నెమ్ములును, ఋజ్జయును, కండయు నెత్తురును, దక్కిన వారివలెనే యున్నవి. మఱియు నిశ్వాసములు నుచ్ఛ్వాసములును, ప్రాణములును దేహమును నతనికిఁ దక్కిన మనుష్యులకుఁబోలెనే యున్నవి. ఇతర మనుష్యులకు వలెనే నతనికి జననమరణము లున్నవి. మనుష్యులకుఁ గలగుణము లన్నియు నతనికిని సమముగా నున్నవి. ఇట్లుండియు రాజొక్కఁడే విశేషించిన బుద్ధిగల వారలును శూరులును నగువెక్కండ్రకు నెట్లధిపతిగా నున్నాఁడు. ఒక్కండే వెక్కండ్రు శూరులును వీరులును నార్యులు నెరసి బెరసియున్న మహీమండలమునంతయు నేలుటయెట్లు? మఱియు లోకులెల్ల నతని ప్రసాదమును గోరుచుండుట యెట్లు? ఒక్కఁడు తెలివినొందియుండినా లోకమంతయుఁ దెలివి గలిగియుండుటయు, ఒకఁడు కలఁతనొందినా యందఱును గలఁగుచుండుటయు నిశ్చయముగా నున్నదే! ఇది యెట్లు? నీవలన నిది విసఁ గోరుచున్నాను. నీవు మాటకారులందు మిన్నవు. దీని నంతయుఁ గలిగినది గలిగినట్లు నాకుఁ జెప్పుము. ఇందులకుఁ గారణము మిక్కిలి యల్పముగా నుండనేరదు. ఏలనఁగా నొకనికి దేవునివలె జగమంతయు మ్రొక్కుచున్నది చుమీ' యనెను.

భీష్ముఁడు 'పురుషసింహమా! రాజ్యమెట్లుప్పతిల్లెనో యది యంతయుఁ గడమవడకుండ నెచ్చరికగలిగి వినుము. మొదటఁ గృతయుగమం దది కలిగెను. అంతకు మున్ను మొట్టమొదట రాజ్యమును రాజును లేరు. దండమును దండించువాఁడును గలుగఁడు; ప్రజలందఱును ధర్మముచేతనే యొకరినొకరు రక్షిం

చుచు వచ్చిరి. అట్లు వారు ధర్మముచేత నొండొరుల రక్షించు కొనుచు రాఁగాఁ గొంతకాలమునకు వారికి దాని పటుత్వము మిక్కిలియుఁ దప్పి యెంతయు దీనత్వము గలిగెను, ఆదైన్యము వలన వారిని మోహము (అవివేకము) ఆవేశించెను. అట్లు మనుష్యులు మోహముచేరింబడి యెఱుక రూపుమాసినవారయిరి. దానివలన వారికి ధర్మము నశించినదయ్యె. ఇట్లెఱుక నశించి మోహమునకు లోనై యుండుటచే నపుడు లోభము వారి నండఁ గయివసముచేసికొనెను. అంత మనుష్యులు తమకు దొరకొనని వస్తువులను గయికొనుటకుఁ బూనఁగా కామమును నది మఱియొకటి వారిని బొండెను. అట్లు కామమునకుఁ జిక్కిన యామనుష్యులను రాగము పయికొనెను. రాగమునకు లోనై జనులు 'ఇది చేయఁదగును ఇది చేయఁదగ'దని తెలియు వివేకము మానినవారయిరి. అంతఁ బొందరాని పడఁతులను బొందిరి; చెప్పరానిమాటలు చెప్పంబూనిరి. భక్ష్యమా! అభక్ష్యమా! దోషమా!నిర్దోషమా! యని విచారించుటను దిగవిడిచిరి. అన్ని యును గయికొనిరి. మనుష్య లోకమిట్లు కలగుండు నొం దఁగా నపుడు వేదములు నశించెను; వేదము నశింపఁగా, దాని వలన వెడలిన ధర్మమును నాశము నొందెను. ఇట్లు వేదమును ధర్మమును నశింపఁగా దేవతలుకు దిగులు గలిగెను. వారట్లు దిగులుగొని బ్రహ్మదేవుని శరణుచొరంబోయి యాలోకపితా మహునిఁ జేరి,యందఱును దుఃఖము నురవడిచేఁగొట్టువడి చేతులు మోడ్చి యద్దేవునితో 'మహాత్మా! మనుష్యలోకమం దున్నస నాతనమగువేదము లోభమోహాదిదోషములవలనఁ గబళిత మయినది. కాన మాకు భయ మావేశించినది. వేదము నశిం

చుటచేత (యజ్ఞాది రూపమగు) ధర్మమును నశించెను; దాని చేత ముల్లోకముల నధిపతులుగా నుండుచుండవి నొందిన దేవత లందఱును (స్వాహాదులు లేనందున) మనుష్యులకు సమానులగు గతి నొందిరి. మేము క్రిందుగా వర్షించువారము, మనుష్యులు (యజ్ఞాదిద్రవ్యము లర్పించు రూపమునఁ) బైకి వర్షించువారలు. వారలు యజ్ఞాదికర్మము లుడుగుటవలన మాగతి సందేహముగా నున్నది. కాఁబట్టి మాకేది మేలో యాలోచింపుము. *నీవను గ్రహించి మాకుఁగలిగించిన యీ మహిమ మఱల మాకుఁ గలుగుఁగాక' యనిరి. అంత బ్రహ్మ వారిం జూచి 'దేవోత్తములారా! మీకు మేలెద్దియో యాలోచించెదను, భయపడవలదు' అనెను. అంత నద్దేవుఁడు, తన బుద్ధిచేత లక్షయధ్యాయములుగల శాస్త్రమును రచించెను. అందు ధర్మమును, అర్థమును, కామమును వివరింపఁబడెను. ఆమాఁటికిని మొత్తమున బ్రహ్మ త్రివర్గ మని పేరొడెను. ఈమూఁడుగాక నాలుగవది మోక్షమును బ్రతిపాదించెను. దాని ప్రయోజనములు వేఱు, గుణములును వేఱు. మఱియునా శాస్త్రమందు మోక్షమును గుఱించిన మఱియొక త్రివర్గము, సత్త్వము, రజస్సు, తమము అనియు (నాలుగవది నిష్కామ ధర్మమును) జెప్పంబడినవి. అందు దండమును గుఱించిన త్రివర్గము మఱొకటి, †స్థానము వృద్ధి క్షయ మను నవియుఁ గలవు. మనస్సు, దేశము, కాలము, సాధనములు, కార్యప్రయోజన

---

* 'త్వత్ప్రభావ సముత్థోఽ సౌప్రభావో నోభవ త్వయమ్' అని (దా. మూ)'స్వభావోనో వినశ్యతి' అని (ఔ. మూ).

† స్థానము=వర్తకుల సమత్వము, వృద్ధి=తపస్సుల వృద్ధి, క్షయము=చోరుల క్షీణతయని తెలియునది. ఇవియ మూఁడును.

ములు, (సుహృదాది) సహాయులు, (కారణములు) నని నీతిని సంబంధించి యీ షడ్వర్గమును జెప్పంబడినవి. (ధర్మకాండము జ్ఞానకాండములని రెండువిధముల) వేదమును(వ్యవసాయము వర్తకము మొదలయిన బ్రతుకు) వృత్తియు, విపులమయిన దండనీతియు మఱియుఁ దక్కిన విద్యలు నందు నిదర్శితము లయినవి. రాజా! మంత్రము, వాంఛితములను దెలియుట, అందులకయిన రహస్యపు వేగులవాండ్రును రాజపుత్రుల లక్షణములును, నానావిధములయిన యుపాయములుగల చారులను బన్నుటయు, స్నేహము, సామము దానము భేదము దండము ఉపేక్షయ నెడి యైదుపాయములును,బూర్ణముగానం దుదాహరింపఁబడినవి. మంత్రాలోచనము లన్నియు, మంత్రములను భేదించుటయు, మంత్రముల తడఁబాటును, వానిసిద్ధివలనను నసిద్ధివలనను గలుగు ఫలములును, నందు సాంతముగా వర్ణింపఁబడియున్నవి. భయముచేతను, మరియాదచేతను, ధనమునుబట్టియు నేర్పడునవై, అధమము, మధ్యమము, ఉత్తమమున నెడి మూఁడువిధములయిన సంధియు దానియందు వివరముగా రూపింపఁబడినవి. యాత్రాకాలములు *నాలుగును, త్రివర్గము విస్తారమును, ధర్మజయమును, అర్థముచేతనయిన జయమును, ఆసుర(వంచనాదిప్రయుక్తమైన) జయమునని మూఁడుదెగలజయమును, నందు సాకల్యముగా నుపదేశింపఁబడియున్నవి. మంత్రము,రాజ్యము, దుర్గము, సైన్యము, కోశమనెడి యీపంచవర్గమునకుఁగలయుత్తమమధ్య మాధమము

* తనరాజ్యమందు మిత్రవృద్ధి, కోశసంచయమును, బరరాజ్యమందు మిత్రనాశము,కోశహానియు, నని నాలుగుయాత్రాకాలములని యొక వ్యాఖ్య చూపట్టుచున్నది.

లనెడిభేదములును, లక్షణములును జెప్పఁబడియున్నవి. ప్రకాశము అప్రకాశము నని దండము రెండువిధములు గలవు. అందు ప్రకాశమును రహస్యమునగుదండమువిధములు సవిస్తరముగాఁ జెప్పంబడియున్నవి. రథములు గజములు, గుఱ్ఱములు, పదాతులు, పనివాండ్రు, ఓడదండు, వేగులవాండ్రు, శత్రుదేశమునకు దారిచూపువారు అని ప్రకాశదండ మెనిమిదివిధములు. రహస్యదండమున, వస్త్రములందును ఆహారములందును సర్పాదిజంగమవిషములను, వత్సనాభాదిస్థానరవిషములను విషచూర్ణములను బ్రయోగించుటయు, అభిచారాదు లయినవివిధ దండములును జెప్పఁబడియున్నవి. వేడుక కయిన యుద్ధము నందును జూదమునందును నమ్మికతోఁ గూడినదియుఁ దొమ్మిదవయుపాయమని పండితులు చెప్పునదియు నగు కైతవమును జెప్పఁబడియున్నది. ధర్మార్థకామములను నాశము సేయునదియు, ఇష్టానిష్టములగు సమస్తకార్యము లందును గలుగునదియు నగు నుపేక్షయు,ఇంద్రజాలాదికమగు మాయయు, మంచిశకునములును, జెడుశకునములును, వేషమూని పగవారియెడఁ జరించుడంబమును,వంచనయు,చిత్తదోషముచేతఁ జెడుపుటయు,చేష్టలేకుండఁ జేయుటయు, నందుఁ జెప్పఁబడుచున్నవి. శత్రువు, మిత్రుఁడు, ఉదాసీనుఁ డనుమూఁడువిధములమనుష్యులును, నవగ్రహములు నక్షత్రములు మొదలగువాని మార్గములగుణములు (విడిపట్టులు గావించుకొనుట) భూమిగుణములు, మంత్ర యంత్రాదులచేఁ దన్ను రక్షించుకొనుటయు, సమాధానపఱచుటయు, రథములు మొదలయిన యుద్ధపరికరములు కొత్తగానిర్మించుటను బరామర్శించుటయు, రథగజ తురగపదాతులకు బలపుష్టికరము లగు

నానావిధములయిన కల్పసిద్ధులును, చక్రము, క్రౌంచము మొదలయిన నానావిధనామములు గలవ్యూహములును, విచిత్రయుద్ధముచేయు కౌశలమును, (గ్రహయుద్ధము ధూమకేతువులు మొదలయిన) యుత్పాతములను, (ఉల్కలుపడుట భూకంపము మొదలయిన) నిపాతములును, చక్కగా యుద్ధముసేయు రీతియు, చక్కగా పలాయనమొందు పద్ధతియు, ఆయుధములజ్ఞానమును, వానిని బదునుజేయు రీతులును, సేనల వ్యసనములును, వానిని జక్కంబఱచుటయు, వానిని సంతోషపెట్టుటయు, రోగపీడలును, ఆపత్కాలములును, భయకాలములును నందుగలవు. మఱియు భేరిమొదలయిన వాద్యముల ధ్వనిచేతఁ బ్రయాణాదులను జెప్పుటయు, పతాకలు మొదలయినవానిచేత వలయునవి తెలుపుటయు, వానిని జూపియు వినిపించియు శత్రువులను మోహింపఁజేయుటయు, క్రూరులయిన చోరులును, అడవిజనులును, నగ్గిని విషమును బెట్టువారును, ప్రతిరూపములను జేయువారును, నను వీరినిగొని శత్రురాజ్యమును బీడించుటయును జెప్పఁబడియున్నవి. శత్రుసైన్యమందలి సేనాపతులను భేదించుటయు, ధాన్యములు చెట్లుచేమలు మొదలగువానిని ద్రుంచివైచుటయు, ఏనుఁగులను మంత్రాదులచేఁ జెఱిపివైచుటయు, మఱియుం గలయాతంకములు పన్నుటయు, పరసైన్యమునందుఁ దనయెడభక్తిగలవానిని మిక్కిలి పూజించుటయు, * పరరాజునకు నమ్మికగలిగించుటయు, రాజ్యము సప్తాంగములు తఱుఁగుటను బెరుఁగు

---

* 'ప్రత్యయోపార్జనేచ' అని (క్షే. మూల). పత్యుశ్చోపగ్రహేణచ' అని (దా.మూ). పతినిజేపట్టుటచేత ననియర్థము. ఈ పాఠ మసంగతము.

టను సమస్థితియం దుండుటను బాటించుటయు, *ఫ్రానినకార్య ములు సాధించుటకయిన యుపాయములును, రాష్ట్రమును వృద్ధిఁ బొందించుటయు, శత్రువు మిత్రుఁడు మధ్యస్థు లనువారి విస్తరించి చెప్పుటయు, శత్రుదేశమండలి జనుల వశీకరించుకొను నుపాయమును, బలవంతులగువారిని మర్దించుటయును, బొడవడంచుటయును, మిక్కిలి సూటిగా న్యాయమును వ్యవహరించుటయును, కంటకులను దొలఁచిపుచ్చుటయు, మల్లయుద్ధమును, ఆయుధప్రయోగముల సాదనయు, దానముచేయు పద్ధతులును, వలయుసంభారముల సేకరించుతెఱంగును, పోషణము లేనివారిని బోషించుటయుఁ, బోషితులగువారిని బరామర్శించికొనుటయు, దగినకాలముతుదిని ధనము లొసంగుటయు, వ్యసనములందుఁ దగులులేకుండుటయు, రాజులకువలయు గుణములును, సేనాపతికి వలయుగుణములను, † ఆయాయుపకరణములయు వానినిగొని పనిచేయుకర్తలయు గుణదోషములనును, దుష్టములగు నానా విధములయిన యింగితములును, అనువర్తించువారికి వలయు నడనడియు, అందఱియెడలను శంకగలిగియుండుటయు, పరాకు మానుటయు, తనకు దొరఁకొననివానిని బడయఁగోరుటయు, దొరఁకొన్నవాని వృద్ధిఁబొందించుటయు, అట్లు వృద్ధినొందినదానిని పాత్రములకు విధ్యుక్తముగా నొసంగుటయు, ధర్మముకొ

---

* 'కృతసామర్థ్యయోగశ్చ' అని (బొ. మూ) 'దూతసామర్థ్య యోగశ్చ' అని (దా. మూ).

† కారణస్యచ కర్తుశ్చ గుణదోషాః' అని (దా.మూ) కారణంచ త్రివర్గస్య గుణదోషాః' అని (దా. మూలము) త్రివర్గములకుఁ గారణములయిన వాని గుణదోషములునని యర్థాంతరము.

అకును నర్థమునకును గామమునకును, అపాయమును దొలఁగిం చుటకును ధనము నుపయోగించువిధమును నందు జెప్పఁబడియు న్నవి. కామమువలనను క్రోధమువలనను బుట్టు నుగ్రములగు వ్యసములుపదియు నందుఁ జెప్పఁబడియున్నవి. అందుఁ గామ ముపలనఁబుట్టినవి-*వేఁట, జూదము, పానము, స్త్రీలని యందు బ్రహ్మచెప్పినవి నాలుగుగా నాచార్యులు చెప్పెదరు. మాటపరుస దనము, ఉగ్రత్వము, దండముపరుసఁదనము, నీతిమాలినశరీరదం డనము, ఆత్మహత్య, (లేక దేశము వెడలఁగొట్టుట), అర్థదూష ణము (అనఁగా ఒకరిప్రయోజనములనుగాని ధనములనుగాని జెఱుపుట) అని యీమూఁఁడు క్రోధమువలనఁ బుట్టు వ్యసనము లును, పలువిధములయినయంత్రములుసేయుటయును, వానివ్యా పారములును జెప్పఁబడియున్నవి. పరరాష్ట్రమునుబీడించుట, పగ వారిపైఁ దలపడుట, పొలిమేరల గుఱుతు లగుచెక్కములు మొదలగు వాని నాశముసేయుట, (పగవారికి విడియు నీడ లేకుండుటకై) పెద్దవాగులను గూల్చుట, (కోటలు మొదల గువాని) ముట్టడి, † కృషిమొదలగువాని ఫలములను బాడు సేయుట, ఆయుధాదు లయినయుపకరణములను భోగించుసేయు టలు, ¶సైనికులకుఁ గవచములు మొదలగు తొడుగువస్త్రములును,

---

* 'మృగయాక్షస్తథాపానం స్త్రియశ్చభరతర్షభ। కామజాని...వాక్పారుష్యంతథోగ్రత్వం దండపారుష్యమేవచ। ఆత్మనో నిగ్రహస్త్యాగోవ్యర్థదూషణమేవచ' అనునివి క్రోధజములగు వ్యసనములు వెరసి పది తెలియునది.

† 'కర్మాంతినాశనమ్' కృషికర్మాదుల, అంత=ఫలమును, నాశముసేయుటయని (దా.మూ). 'కర్మానుశాసనమ్' కృషిమొదలయినకర్మములనుఁ బరామర్శించుటయని యర్థాంతరము.

¶ 'అవప్కారోఽథవమనంతథో పాయాశ్చ పర్ణితాః' (ఔ.మూ)'వమనం

దానినిజేయునట్టి మేలియుపాయములును వర్ణింపఁ బడియున్నవి. పణవము, శంఖము, ఆనకము, భేరు లనువాద్యములును, (మణులు, పశువులు, భూమి, వస్త్రము, బంగారము, దాసికలనెడి) యీయువిధములగు ద్రవ్యములను (తనకై) సంతరించుకొనుట, (పరులను బాధించుటకై) వానిని నాశముసేయుట, క్రొత్తగా లభించిన రాజ్యములను నిష్కళముగావించుట, సజ్జనులను బూజించుట, విద్వజ్జనులతోడి కలయిక, జపహోమవిధులను దెలిసియుండుట, మంగళద్రవ్యములను (బంగారుమొదలగు వానిని) స్పృశించుట, శరీరము నలంకరించుకొనుట, భోజనవిధి, ఎప్పుడును ఆస్తిక్యము, * ఒక్కఁడే చేయుప్రయత్నము, సత్యసంధత్వము, తియ్యనిమాట, ఉత్సవములయందు జనులు సభగూడునపుడును గృహములయందును (పెక్కేములు గట్టుట) మొదలయిన కార్యములు, అన్నిరచ్చపట్టులను మనుష్యులు ప్రత్యక్షముగను మఱుఁగునను జేయుకార్యములు, మనుష్యుల నడవళ్లును నెప్పుడును బరికించుచుండుటయును, బ్రాహ్మణులను దండింపరామియు, యుక్తియుక్తముగా దండించుటయు, కొలిచి బ్రతుకువారిని తనతోడి చుట్టఱికమును బట్టియు వారిగుణములనుబట్టియు గాగవించుట, పురజనులను రక్షించుట, రాష్ట్రమును వృద్ధినొందించుట, † ఒకొక్కదిక్కునందును శత్రువు మిత్రుడు

తథోపాస్యాచ వర్ణితాః' అని (దా.మూ) ఇది సంగతముగాదు.

* ఏకేన యథోక్తేయం' అనిమూలము. ఒక్కదారినే వృద్ధినొందువిధమును' అని యర్థాంతరము. ఇది ప్రతాపచంద్రరాయల యర్థము ననుసరించి వ్రాయంబడినది.

† యుద్ధమునకెక్కినరాజును 'విజిగీషు' అందురు. వాని నలుప్రక్కలనున్న

దాసీనుఁడని ముగ్గురేసిగా నలుదిక్కులందును గలపండ్రెండు రాజుల మండలమునడుమ నున్నరా జాపన్నిద్దఱ రాజులను గుఱించి చేయవలసిన యాలోచనము, దేహమునకైన శౌచము అభ్యంగనము మొదలయినవానినిగుఱించి వైద్యశాస్త్రమునందుఁ బ్రసిద్ధములై యున్న *డెబ్బదిరెండు సంస్కారక్రియలును, ఆయా దేశములయు జాతులయు కులములయు ధర్మములును, వర్ణింపఁబడినవి. అందు ధర్మార్థకామమోక్షములును వర్ణింపఁబడినవి. ధనములను గోరుట్టయు, దానికయిన నానావిధములగు నుపాయములును కృష్యాదులను జేయువిధములును, పన్నువచ్చుబడికి మూలమయినకార్యములను, మాయలను బన్ను తెఱఁగులును, ప్రవహింపక నిలుకడగా నున్ననీటిపట్టుల నీళ్లను జెఱువువిధములును నందుఁగలవు. లోకులు పూజ్యమగు పెద్దల నడవడినుండి చలింపకుండుటకు వలయునుపాయము లన్నియు నానీతిశాస్త్రమందు వర్ణింపఁబడియున్నవి. ఆ భగవంతుఁడు బ్రహ్మ, శుభంబయినయీశాస్త్రమునురచించి యంత సంతసంబున నింద్రాదులగు దేవతలం జూచి 'లోకమున కుపకారముకొఱకును ధర్మార్థకామములను స్థాపించుకొఱకును జిలికియెత్తిన వెన్నవలె వాక్కునందలి సారమయిన యీ శాస్త్రమును రచించినాఁడను. ఇది

రాజులనలువురును శత్రులనఁబడుదురు. ఆనలువుర కవ్వలనున్న నలువురుమిత్రులనియు వారికవ్వలి నలువురు ఉదాసీనులనియు రాజశాస్త్రమునఁ జెప్పొక్కనఁ బడుదురు. కానవెరసి చుట్టును పన్నిద్దరు అగుదురు.

*'ద్వాసప్తతివిధా చైవశరీరస్య ప్రతిక్రియా' అని మూలము. 'ద్విసప్తతి పుత్రేభ్యశ్చ ప్రోక్తాయాచ స్వయం భువా'యని (దా. మూ.) ఇది యసంగతముగా నున్నది.

డండనీతితోఁగూడి లోకరక్షణమును గావించును. ఇది నిగ్ర హములను అనుగ్రహములను జరుపుచు లోకులయందుఁ జరించుచుండును. దండముచేత నీలోకులు (తమతమ పురుషార్థములయందు) జరుపఁబడుటచేతను, లేక దండమె యెల్ల వారిని నడపుచుండుటచేతను, ఈశాస్త్రము మూఁడులోకములందును దండనీతియని ప్రసిద్ధినొందును. షడ్గుణముల గుణములసారము యినయిది యిఁకమీఁద మహోత్సలయం దెంతయు నెలకొని యుండును. ఏలనఁగా ధర్మార్థకామమోక్షములన్నియు నిందుఁ జెప్పఁబడియున్నవి సుఁడీ' యనెను.

అంత నుమాపతియు బహురూపుఁడును విశాలాక్షుండును నగు శివుం డాశాస్త్రమును మొట్టమొదటఁ గయికొనెను.*(ఆతం డాద్యంతములులేనివాఁడు. జ్ఞానశక్తి మొదలయినశక్తులును, తా రకము మొదలయిన విద్యలు నన్నియు నతనివశమందు వర్తించు చుండును.అతఁడణిమాదిగుణసంపన్నుండు.అతనియైశ్వర్యముపర మార్థమైనది. అతండుజగంబులకుఁ బతి;బ్రహ్మాండమునునిర్మించిన ప్రభుండు. అయినను బ్రహ్మదేవుని సంతోషముకొఱకుఁ దనపుత్రు డయినయతనిని పితగాను, పితయగు తానతనిపుత్రునిఁగాను,గొ ని యతనిలలాటమునుండి వెడలివచ్చి బాలునివలె బెట్టిదముగా రోదనముచేసెను. సమస్తలోకమునకుఁ గర్తయు లోకపితామ హుండు నగుబ్రహ్మ యతనికి బంగారంచగాఁ బొడకట్టెను. లెక్క లేని వేలకొలఁదిరుద్రులకు నవ్యయంబగు స్థానమయినవాఁడును, సమస్తప్రాణులకును దేవుండును, నిత్యుఁడునగు నమ్మహాదేవుఁడు)

---

* ఈకుండలీకరణములోని పాఠము దౌత్తరాహ ప్రతులందులేదు.

శివుఁ *డొక్కొక్కయుగమందును బ్రజలకు నాయువు తగ్గుచుండుటనుజూచి, మహార్థమును బ్రహ్మరచితము నయిననీతిశాస్త్రమును బదివేలయధ్యాయములు గలదిగా సంగ్రహించెను. మహాతపస్వియు మిక్కిలియు బ్రహ్మణ్యుండు నయినదేవేంద్రుఁడు వైశాలాక్షమనిప్రసిద్ధమగు నాసంగ్రహమును మహేశ్వరునివలనఁబడసెను. అట్లుపడసి యాయింద్రుఁడు ప్రజలహితముఁగోరి యాశాస్త్రమును బాహుదంతక మనుపేర నైదువేలయధ్యాయములుగలదిగా సంక్షేపించెను. అంత బృహస్పతి దానినే తనబుద్ధిచేత మూఁడువేల యధ్యాయములుగా సంగ్రహించెను. ఈసంగ్రహమే బార్హస్పత్యమనఁబడును. అమితప్రజ్ఞుండును యోగాచార్యుండును మహాయశుండునగు శుక్రుఁడాశాస్త్రమును వేయియధ్యాయములుగలదిగా సంగ్రహించెను. ఇట్లు మహర్షులు లోకము ననుసరించియుఁ బ్రజలయాయువులు దగ్గుచుండుటఁ దెలిసియు నీశాస్త్రమును సంగ్రహించినవారయిరి. అంత దేవతలు, ప్రజాతియగు విష్ణువుకడకుంబోయి 'మనుష్యులనండఱి నొక్కండుమేటియై యడంచియేలునంతటి యతిశయము గలవాని నొక్కనిని దెలుపు' మని యడిగిరి. ఆనారాయణుండు కొంచె మాలోచించి తనమనస్సునందుండి మిక్కిలి తేజస్సుగల విరజుండను పుత్రునిఁ బుట్టించెను. మహాభాగుఁడా విరజసుఁడు భూమియందుఁ బ్రభుత్వము నొల్లఁడయ్యె. అతనిబుద్ధి శాస్త్రపరిశ్రమము గలదిగాన సన్న్యాసమందే చెల్లెను. అతనికిఁ గీర్తిమంతుఁ డనుపుత్రుఁ

---

* యుగానామాయుషోహ్రాసమ్ ' అనిమూలము. '(ప్రజానా మాయుషో హ్రాసమ్' అని కొ. మూలము.

డు పుట్టెనుగాని, వాఁడును * బంచేంద్రియముల నతిక్రమించి మోక్షమందాసక్తుఁడయ్యెను. కీర్తిమంతునికిఁ గర్దముఁడు పుట్టెను. కర్దముఁడును గొప్పతపముగావించెను. ప్రజాపతియగు నా కర్దమునికి అనంగుఁడుపుట్టెను. అతఁడు ప్రజలనురక్షించుచు సాధువృత్తిగలిగి దండనీతియందుఁ బండితుఁడై యుండెను. అనంగునకు నతిబలుం డనుపుత్రుఁడుగలిగెను. వాఁడు తండ్రికిఁ బిదప గొప్పరాజ్యమునుబడసి నీతితోడఁగొంతకాలమురాజ్యముచేయుచువచ్చెను. ఒకప్పుడతఁడొకతయు నీతిమెఱయుచు నంత నింద్రియములకు లోనయ్యెను.అతఁ డొకప్పుడు చక్కఁదనముచే నిక్కుచూపుచున్నదియు గుణములందెంతయు మేలుబంతియుఁ బతివ్రతయునగు సునీథయను దానిని మృత్యువు మానసపుత్రిని భార్యఁగాఁ బడసి యింద్రియములకుఁజిక్కి కామమోహితుఁడయ్యెను. ఆబిడ ముల్లోకములందు వాసికెక్కినది. అది వేనునిఁగాంచెను. ఆ వేనుఁడు రాగద్వేషములవెంటం బడి ప్రజలందు ధర్మము తప్పి వర్తించుచు నుండఁగా బ్రహ్మవాదులగుఋషులు వానిని మంత్రపూతములగు దర్భలచేఁ జంపిరి. మును లావేనునికుడితొడను జిలుకఁగా నందుండిఁ గురూపియు నశుచియుఁ బొట్టివాఁడును నెఱ్ఱని కన్నులును నల్లనివెండ్రుకలును గలవాఁడునై, కాలినమ్రోడువలెనున్న యొకఁడుగలిగెను. వానిని ఋషులు 'నిషీద' అనుపదముచేఁ గూర్చుండుమనిరి. అదికారణముగా వానివలననుండి పర్వతములును వనములును వసతిగాఁ గలకూరులగు నిషాదులును వింధ్యపర్వతమున వసించు మ్లేచ్ఛులును వందలవేలకొలఁదిని బు

* 'పంచాతిగోఽథవత్' (బొ. మూ.) 'మర్త్యాధికోఽథవత్' అని (దా. మూ.) మర్త్యుల కధికుఁడు అనఁగా మోక్షాసక్తుఁడయ్యెననుట.

ట్టిరి. ఆమునులు మఱల నావేనుని కుడిచేతిని దఱచిరి. దాననుండి రూపమున మఱియొకయింద్రునింబోనివాఁడై కవచమును దాల్చి ఖడ్గమును మొలఁగట్టికొని కేలవిలు నమ్ములుదాల్చినయొక పురుషుఁడుపుట్టెను. వాఁడు వేదవేదాంగవిదుఁడు, ధనుర్వేదపారఁగుఁడు. ఆపురుషతిలకునిదండనీతి సమస్తమునాశ్రయించినది. అంత నతఁడుచేతులుమోడ్చి యాఋషులనుజూచి 'నాబుద్ధి మిక్కిలియు సూక్ష్మమై ధర్మార్థములను గనుఁగొనుచున్నది. ఇట్టిబుద్ధిని గొని నేనేమిచేయవలయునో కలరీతినిజెప్పుఁడు. మీరు నాకుఁ బ్రయోజనవంత మగునేపనినిజెప్పెదరో దానిని మీకుఁ దప్పకచేసెదను. ఈవిషయమై విచారమువలదు' అనెను. ఆమహర్షులును దేవతలు నతనితో 'నీవెందెందు ధర్మముగలదో దానినంతయు జంకులేక యాచరింపుము. సమస్తప్రాణులందు నిది ప్రియ మిది యప్రియ మను పక్షపాతమువిడిచి సమముగా నర్తింపుము. కామమును గోపమును లోభమును మానమును దూరమున విడువుము. నీ వెప్పుడును ధర్మమునందే కనుగలిగి లోకమునందెవఁడు ధర్మమునుండి చలించునో వానిని నీచేతులార నెవ్వఁడయిననుగాని దండింపవలయును. మఱియు భూమియందు వెలసినవేదమతమును మూటికిఁ బాలించెదనని నీవు మనోవాక్కాయములు మూటిచేతను బ్రతినపట్టుము. మఱియును నీవు 'నేనెంతమాత్రమును జంకులేక వేదమందుఁ బ్రతిపాదింపఁబడిన ధర్మమును దండనీతిని సహాయముగానూఁది యాచరించెదను. ఒకప్పుడు నింద్రియములకు లోఁకువగాను. బ్రాహ్మణులనునాకు దండింపఁగూడదు. లోకమును వర్ణసంకరమునుండి కాచెదను' అనియుఁ బ్రతిజ్ఞ సేయు" మనిరి. ఆఋషులను దేవతలనుజూచి వేనుని పుత్రుఁడు 'దేవోత్తము

లారా!*బ్రాహ్మణులసాహాయ్యము నాకుండునేని యక్లేయగుఁగాక' యనఁగా నా బ్రహ్మవాదులందఱును 'అక్లే యగుఁగాక' యని యతని ననుగ్రహించిరి. వేదనిధి యగుశుక్రుఁ డతనికిఁ బురోహితుఁడయ్యెను. వాలఖిల్యులు మంత్రులయిరి. సారస్వత్యులు గణములయిరి. మహర్షిగర్గుఁ డతనికి జ్యోతిష్కుఁడయ్యెను. విష్ణుని స్వశరీరమునుండి † యెనిమిదవవాఁడు పృథుఁడనిలోకమునం దెంతయు వినికి. (శ్రుతులయందు నెంతయుఁ బ్రతిపాదితమై యున్నది.) అతనికిఁ గొంతముందుసూతులును మాగధులును బుట్టియుండిరి. వారిపుడితనికి వందిజనులయిరి. పృథురాజు వారియెడఁ బ్రీతుండయి వారలయందు సూతునకు సముద్రతీరమందలి చవుకుఁ బట్టును, మాగధునకు వానిసేరవెలయు మగధదేశమునొసఁగెను. భూమిమన్ను మిక్కిలి మిట్టపల్లముగా నుండెనని మనకుఁ మిక్కిలి వినికిగలదు. అతఁడు దానిని జక్కఁగా సమముగావించెను. ఒక్కొక్కమన్వంతరమందును భూమివిషమమగుచున్నది. పృథుఁడు తనవింటికోపుచేఁ గొండలను బగిల్చి నలుప్రక్కలనుగల శిలలప్రోవుల నెత్తివైచి యీభూమిని సమముగాఁ గావించెను. దేవేంద్రుఁడును బ్రహ్మయు విష్ణుండును, దక్కిన దేవతలును ఋషులును బ్రజలను బాలించు నధికారమం దతనికి నభిషేకముగా

---

* బ్రాహ్మణా మేసహాయాశ్చేదేవమస్తు' (దా. మూ.) 'బ్రాహ్మణా మే మహాభాగా నమస్యాః పురుషర్షభాః' అని(జౌ. మూ.) 'నమస్యాః' క్రియక్కుఁ దగినవారు

† విష్ణువు, విరజసుఁడు, కీర్తిమంతుఁడు, కర్దముఁడు, అనంగుఁడు, అతిబలుఁడు, వేనుఁడు, పృథువు అని విష్ణువునుండి పృథుఁ డెనిమిదవవాఁ డగుట తెలియునది. ఇందులకు 'ఆత్మనాష్టమ ఇత్యేవ శ్రుతిరేషా పరానఘ' అని మూలము. ఇట శ్రుతియనఁగా జనశ్రుతియనికాని వేదమనికాని యర్థము గ్రాహ్యము.

వించిరి. భూదేవి రత్నములనుగొని పృథుమహారాజును దానై వచ్చిచూచెను. నదీపతి యగుసముద్రుడు పర్వతరాజగు హిమవంతుండును రత్నములనుగొని యతనిని సేవించిరి. ఇంద్రుడు నతడు య్యంబగుధన మతని కొసంగెను. బంగారుకొండ యగుమేరువును సువర్ణము నొసంగెను. యక్షరాక్షసపతి యగుకుబేరుడు తనకి ధర్మార్థకామముల సమర్థింపఁ జాలినధనము నొసంగెను. పృథురాజు సంకల్పముచొప్పునఁ గోటానకోట్లు గుఱ్ఱములును నేనుంగులును రథములును మనుష్యులును గలిగిరి. అతని కాలమందు దుర్భిక్షమును ముసలితనమును మనోవ్యథలును గలుగవయ్యె. దొంగలవలనను సర్పాదులవలనను మఱి తక్కినవానివలనను భయము నొకప్పుడుఁ గలుగదయ్యె. భూమియందుఁ బంటలు విప్పివీఁగుచుఁ బండెను. అతఁడు సముద్రమున కెదురుచనునపుఁడు దవలీజలములు స్తంభించియుండెను. పర్వతములును దొలఁగి యతనికి దారియిచ్చెను. అతని ధ్వజ మెందును భంగమొందినది గాదు. అతఁడు, గొల్లవాఁడావునుండి పాలుపిదుకునట్లు భూమినుండి పదునేడువిధము లయినపసులను బిండెను యక్షరాక్షసనాగులు దెవ్వరెవ్వరె కేదేదియిష్టమో వానివాని కాయాదానిని బిండి యిచ్చెను. అమ్మహాత్ముఁ డీమనుష్యలోకమందు ధర్మమును మిక్కిలి యుత్తమమైనదిగాఁ గావించెను. ప్రజలెల్ల నతనిచేరంజీతులగుటచేత నతఁడు 'రాజు' అని పిలువఁబడెను. బ్రాహ్మణులకుఁ గలక్షతములను దొలఁగించి త్రాణముగావించుటచే 'క్షత్రియుం'డనియుఁ జెప్పఁబడెను. అతనిచేత భూమి ధర్మంబున వాసికెక్కినందున, సాధువు లతనిపేర దానికి 'పృథివి'యని పేరిడిరి. సనాతనుండగు విష్ణుఁడు తానే వీనిని నెలకొలిపి వీనితో 'రాజా !

నిన్నెవరు నతిక్రమింపఁజాలరు' అని చెప్పెను. అంత నాభగవం తుఁడు తనతపంబుచేత నంశమున నారాజునం దావేశించెను. అది కారణముగా నీజగము రాజులకు దేవతలకుంబోలె మొ క్కుచు వచ్చుచున్నది. రాజు చారులను బంపి వారిగతులవలన లోకవృత్తాంతములను గనుఁగొనుచు *దండనీతిచేత నెప్పుడును రాజ్యమును రక్షించుచుండును గాన యతనినెవ్వఁడుగాని ధర్షిం పరాదు. శుభమయిన కార్యమును శుభమునే కలిగించునదిగావ లయును. (మంచిసేయురాజునకు మంచియే చేయవలయును గాని చెఱుపు దగదు.) † రాజు దేహముచేతను నింద్రియములచేతను దక్కినవారివలె సమానుఁడుగా నుండఁగా నతనివశమందు లో కమంతయు నిలిచియుండుటకు నతని దేవత్వగుణము తప్ప వేఱు కారణ మేమున్నది? అపుడు విష్ణుదేవుని లలాటమునుండి బంగా రుతామర పుట్టెను. పిదప నాతామరనుండి లక్ష్మీదేవి కలిగి ధర్మ్మ నకు దేవి (పత్ని) యయ్యెను. ధర్మ్మున కాశ్రీవలననుండి యర్థము పుట్టెను. అంత ధర్మ్ము నర్థమును శ్రీయును రాజ్యమందుఁ బ్రతి

---

* 'దండనీత్యాచ సతతం రక్షితారం నరేశ్వరమ్' అని దా.మూ. 'రక్షిత వ్యం నరేశ్వర' అని బొ.మూలము. ఇట సామాన్యముగా రాజమహత్వవర్ణనము గాన ప్రథమపాఠమే యంగీకార్యము.

† ఆత్మనాకరణైశ్చైవ సమత్వేహ మహీక్షితః । తోహేతుర్యద్వశేతిష్ఠే ల్లోకోదైవా దృతేగుణ' అనిమూలము. 'సమస్యేహమహీక్షితః' అని యుభయ పాఠము. తనబుద్ధిచేత నప్రజపుడు పొడకట్టు అవకాశములు మొదలయినసాధ నములచేతను రాజు తన నడపడి జరుపుకొనవలయునని ప్రతాపచంద్రరాయల యర్థము. ఇది యంత సరనముగాకున్నది. పూర్వోక్తమైన యర్థమే యిట యుపపన్నము.

ష్టితులయిరి. మనుష్యుఁడు తాను జేసినపుణ్యము క్షీణింపఁగా స్వర్గలోకమునుండి భూమికివచ్చి దండనీతియందు విన్నాణియగు రాజుగా పుట్టుచున్నాఁడు. అట్టివానికి శ్రీవిష్ణువు మాహాత్మ్యము గలుగుచున్నది. వానికి మంచిబుద్ధియుఁ గూడుచున్నది. వాఁడు తక్కినవారికంటెను మహత్త్వమును బొందుచున్నాఁడు. వాఁడు దేవతలచేత స్థాపితుఁడుగాన వానినెవ్వరు నతిక్రమింపనేరరు. దీనినిబట్టియే యొక్కనివశమందు లోకమంతయు నిలిచియున్నది. దీనినిబట్టియే యాయొక్కని లోకమంతయు మీఱుకున్నది. మంచియగుకార్యము మంచిదేయగును. దీనినిబట్టియే లోకులం దొక్కొక్కఁడును, ఆయొక్కఁడు తమవలెనే దేహాదులుగలిగి యుండినను, ఆయొక్కని మాటచొప్పున నడచుకొనుచున్నాడు. ఆరాజు సాంపయినముఖమును జూచినవారెల్ల నతనికి వశులయిరి. కాఁబట్టి వారతనిని రూపవంతునిగను ధనవంతునిగను భాగ్యవంతునిఁగను నెన్నుచున్నారు. అతనిదండము మహత్త్వమువలన నీతి, భూమియందు స్పష్టముగా వెలసినదయ్యె. న్యాయప్రవర్తనమును విస్తరించినదయ్యె. ఈకారణముచేతనే యీజగమంతయు నీతిచేత వ్యాప్తమయ్యెను.

యుధిష్ఠిరా! పురాణముల యాగతియు, మహర్షుల యుత్పత్తియు, తీర్థముల యుత్పత్తియు, *క్షత్రియుల పరంపరయు, చతుర్వర్ణములును, చతురాశ్రమములును, చతుర్వేదములును, వైదికధర్మములును, ఉపవేదములును, ఇతిహాసములును, న్యాయమును, దపమును, జ్ఞానమును, అహింసయు, సత్యమును, దాన

* 'వంశశ్చక్షత్రియాణాం'అని (దా.మూ) 'వంశశ్చ నక్షత్రతారాణామ్' క్షత్రియులుగానివారి యుత్పత్తియని యర్థము.

మును, మాత్సర్యము లేమియు, పెద్దలసేవయు, శుద్ధియు, ప్రయత్నశీలతయు, సర్వభూతములందును దయయు, భూమియందు వ్యవహరింపఁ బడునవి తక్కినవియన్నియును, సందేహముతీఱనం దుపదేశింపఁ బడియున్నవి. కావున, యుధిష్ఠిరా! లోకమునఁదు రాజులు దేవతలకు సమానులని యెప్పుడును బ్రాహ్మణులు చెప్పుదొడంగిరి. రాజులమహాత్మ్యమునుగుఱించి యంతయు సంపూర్ణముగాఁ జెప్పితిని. ఈవిషయమై మఱియు నేమి చెప్పవలసియున్నది?' అనెను. ఇది యేఁబదియెనిమిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు చతుర్వర్ణముల ధర్మములను జెప్పుట.

అంత యుధిష్ఠిరుఁడు పితామహుండగు భీష్మునకు మఱల నభివాదనముచేసి యంజలిగీలించి 'పితామహా! సకలవర్ణముల వారికిని సామాన్యములయిన ధర్మములేవి? చతుర్వర్ణములకు వేఱువేఱనున్న ధర్మములేవి? చతుర్వర్ణముల యాశ్రమము లెవ్వి? రాజధర్మము లనఁబడునవి యెవ్వి? రాష్ట్రము దేనిచే వృద్ధినొందును? రాజెట్లు వర్ధిల్లును? పురజనులును భృత్యులును నెట్లు వృద్ధినొందుదురు? కోశము, దండము, దుర్గము, సహాయులు, మంత్రులు * ఋత్విజులు, పురోహితులు, ఆచార్యులు, నెట్టివారుగా నుండినయెడ రాజు వారిని దిగవిడువవలయును? రాజెవ్వ

* ఋత్విజుఁ డనఁగా ఆయానియత సమయములందు నియోగింపఁబడువాఁడు. పురోహితుఁ డెప్పుడును నియుక్తుఁడై యుండువాఁడు.

లెవ్వరిని నేయేయాపదయందు నమ్మవలయును? దేనినుండి తన్ను దృఢముగా రక్షించుకొనవలయును? (ద్వైధీభావమందు భృత్యుల కెటువంటి శపథ ముండవలయును? ఆశపథము నుల్లంఘించిన యధర్మమునకు ఫలమేమి? వీనినంతయును వీని వ్యవహారమును నాకు సంగ్రహముగను సవిస్తరముగను జెప్పవలయును' అనెను.

అందులకు భీష్ముఁడు 'మహనీయమగు ధర్మమునకును వేధయగు కృష్ణునకును నమస్కారము. (ఇట గూడియున్న) బ్రాహ్మణులకును నమస్కరించి శాశ్వతములగు ధర్మములను జెప్పెదను. కోపము లేకుండుట, సత్యము పలుకుట, సంచికుడుచుట (లేక పాడియును) ఋజుమయు, తన భార్యయందుఁ బ్రజలనుగనుటయు, పరిశుద్ధియు, ద్రోహము లేకుండుటయు, చక్కటియు, భృత్యులను బోషించుటయు, ననునివి సమస్తవర్ణములకును సామాన్యములయిన ధర్మములు. బ్రాహ్మణులకు మాత్రముగల ధర్మములును నీకుఁ జెప్పెదను. మహారాజా! (అందు మొదటి యాశ్రమమందున్న బ్రహ్మచారికి) దమమే (ఇంద్రియనిగ్రహమె) పురాతనమయినధర్మము. మఱియు * వేదాధ్యయనమును, వేదమును జదివించుటయు ధర్మములే. వీనిచేతనే యతఁడనుష్ఠింపవలసిన కర్మములు †సమాప్తమగుచున్నవి. అట్లు స్వధర్మమునందు వర్తిం

* 'స్వాధ్యాయాధ్యాపనంచైవ' అని (బా.మూ) 'స్వాధ్యాయాభ్యసనంచైవ' అని బౌ.మూలము. వేదమును జదువుట, తపములు మొదలగునవి యథ్యసించుటయునని యొక వ్యాఖ్య.

† అనఁగా నివిచేసినవే యతఁడు కృతార్థుఁడగుచున్నాఁడు గాన, తక్కిన కర్మము లంతగా నావశ్యములు గావనుట.

చుచు, విధర్మములను జేయక, శాంతుఁడయి, జ్ఞానముచేఁ దృప్తి నొందియుండు నా (వటుఁడగు) బ్రాహ్మణునికిఁ దనంతట ధనము లభించెనేని, యతఁడు విధ్యుక్తముగాఁ బెండ్లాడి సంతానమును బడయవలయును. మఱియు దానములును యాగములును జేయ వలయును. ఆధనము నతిథులు బంధువులు మొదలగువారికిఁ బంచి కుడువవలయునని సాధువులు చెప్పెదరు. బ్రాహ్మణునకు వేదా ధ్యయన మొకటిచేతనే యతనికి విహితములయిన కర్మానుష్ఠా నములన్నియుఁ జేసి ముగించిన ట్లగుచున్నది. అతఁడు మఱి యితర మేమిచేసినను జేయకున్నను వేదాధ్యయన మొకటిచే నతఁడు *మైత్రుఁడనఁ బడుచున్నాఁడు. క్షత్రియునకుఁ గూడ ధర్మ ములను జెప్పెదను. రాజునకిచ్చుట తగుననుగాని పుచ్చుకొనరాదు; యాగము చేయఁదగునేకాని ఋత్విజుఁడై యాగము చేయుఁ బడ రాదు; వేదాధ్యయనము చేయవచ్చునుగాని యొకరిని జది వింపరాదు. ప్రజలను బరిపాలింపవల యును. దొంగలను వధిం చుటయం దెప్పుడును బూనికకలిగి యుద్ధమునందుఁ బరాక్రమము మెఱయవలయును. యాగముల నాచరించుచు మిక్కిలియుఁ జదువరులై యుద్ధములందు గెలుపొందుచుండునట్టి రాజులే పుణ్య లోకములను జయించినవారిలో నున్నలు. క్షత్రియుఁడు యుద్ధ మునందుండి దేహమున గాయపడక మరలివచ్చునేని యట్ల కార్యమును బురాణవిదులు కొనియాడరు; ఇది నీచులగు క్షత్రి

---

*'మైత్రుఁడనఁగా భూతములకెల్ల మిత్రుఁడని వ్యాఖ్యలు చూపట్టుచున్నవి. కాని, మీఁదక్షత్రియునకు 'ఐంద్రుఁ'డనుటచే నిట 'మైత్రుఁ'డనఁగా మిత్రుఁడు. సూర్యుఁడు అధిదేవతగాఁ గలవాఁడని యర్థము చేయుట మతిం తిసంగతి ముగా నున్నది.

యుల ధర్మమే ముఖ్యముగా నగునని చెప్పుదురు. దొంగల నడం చుటకంటె నెక్కుడుకృత్యమయినది యతనికి వేఱెద్దియులేదు. దానము, అధ్యయనము, యజ్ఞమును రాజులకు క్షేమమునుగలి గించును. కాబట్టి ధర్మమును గోరినట్టి రాజు విశేషించి * యుద్ధ ము చేయవలయును. రాజు ప్రజలనందఱను వారి వారి ధర్మము లందు నెలకొలిపి, యొక్కొక్క కార్యమును ధర్మముచొప్పు న శమము గుదురుగాఁగలిగి చేయునట్లు గావింపవలయును, రాజు, మ ఱేకార్యముచేసినను జేయకపోయినను, తన ప్రజలను బాలించుట యొక్కటిచేసెనేని, యతఁడు విహితకర్మముల నెల్లఁ జేసి తీర్చినవాఁ డగుటయేకాక యట్టిరాజు † 'ఐంద్రుఁడు' అని పిలువఁబడుచున్నాఁడు. వైశ్యులకు సనాతనములగు ధర్మములను నీకుఁ జెప్పెదను. దానము, అధ్యయనము, యజ్ఞము, మంచి మార్గములచేత ధనముగూర్చుట,తండ్రి బిడ్డలనుంబోలె బశువుల నన్నింటిని గాపాడుటయు వైశ్యుని ధర్మములు; ఇవితప్ప వేఱే కర్మము నాచరించినను నది యతనికి విరుద్ధ ధర్మమగును. అతఁ డాపశువులను గాపాడుటచేత గొప్పసుఖము నొందును. బ్రహ్మ యే, పశువులను వైశ్యునికొఱకు సృజించియిచ్చెను; బ్రాహ్మణు నకు రాజునకును ప్రజల నందఱను నొప్పించెను. వైశ్యునివృత్తిని వాని జీవనమును జెప్పెదను. వాఁ డితరుల పశువులను నాఱేం టిని మేపునేని వానిలో నొక్కదానిపాలును దాను వేతనముగాఁ గ్రాగవచ్చును. ఇతరుల పశువులు నూఱేంటిని మేపునేని వాని

---

* యుద్ధములేనిచో రాష్ట్రము పెరుఁగనుగాన ధనము దానాదులకు పలయునంత దొరకదుగాన ధర్మమును సిద్ధింపదని యర్థము.

† 'ఐంద్రుఁడు' ఇంద్రుఁడు దేవతగాఁ గలవాఁడు అని యర్థము.

యం దొకయూళ్ళు నెద్దులజతను సంబళముగాఁ దీసికొనవచ్చును. ఇతరుల సంచిమొసలుతో వ ర్తకము చేసినచో లాభమునం దే డింట నొకపాలు దాను బుచ్చుకొనవచ్చును. (గవయము మొద లగువాని) కొమ్ముల వ ర్తకమునం దందలిలాభములం దేడవ పాలును గొనవచ్చును. (కొన్ని మృగముల వెలపొడుగయిన) గొరిజిల వ ర్తకమునందుఁ బదునాఱవపా లే లాభమె త్తి కొనవల యును. ఇతరుల వి త్తనములను గొని సేద్యముసేయునేని పంట లో నేడింట నొకపాలు పొందవలయును. ఇది వీనికి సంవత్సర మున కయిన వేతనము. వై శ్యున కెప్పుడును బశువులను మేప నవెడి కోరిక యుండరాదు. వై శ్యుఁడు పశువులను మేపి కాపా డుఁ గోరునేని మఱియొకరిచే వానిని నెంతమా త్రమును గాపింప రాదు. శూద్రుని ధర్మములను జెప్పెదవినుము. బ్రహ్మతక్కిన వర్ణములకు దానునిఁగా శూద్రునిఁ గల్పించెను. కాఁబట్టి తక్కిన వర్ణములవారికిఁ బరిచర్య చేయుటయే శూద్రునకు ధర్మముగా విధింపఁబడియున్నది. కాన వారలకు శుశ్రూషచేయుటవలన నే వాఁడు మిక్కిలి సుఖము నొందును. కనుక వాఁ డీమూఁడువర్ణ ములవారికిని * వారి పరువులచొప్పునఁ బరిచర్య చేయవల యును. శూద్రుఁ డెప్పుడుగాని యేవిధమునను ధనములను గూర్పరాదు. ఏలన దానివలన వాఁడు పాపమొందును. వాఁడు ధనమును బొందెనేని తనకంఁటె నెక్కుడగు తక్కినవర్ణములవా రిని దనకు లోకువఁజేసికొనఁజూచును. అయినను వాఁడు ధర్మము చేయఁగోరి రాజు ననుజ్ఞఁబొంది ధనమును జేర్చుకొనవచ్చును. వాని

---

*'పరిచరేత్తీ) స్వర్ణానను పూర్వశః' అని (బొ. మూ) 'వర్ణాననసూయక:' అని (దా. మూ,) అసూయమాలి పరిచర్య చేయవలయునని యర్థము.

వృత్తియు జీవించు విధమును జెప్పెదవినుము. మూఁడువర్ణముల వారును శూద్రునవశ్యము భరింపవలయును. వారు తమకుఁ బరిచర్యచేయు శూద్రునకుఁ బ్రీతిగిలిగొన గొడుగు, వీవనలు, పావలు, తలగుడ్డలు, పడుకలు, ఆసనములు, చినిఁగిపోవుటచే తమకుఁ గట్టఁదగని వస్త్రములును నీయవలయును. ఏలన నవి ధర్మముచొప్పున వాని ధనములు. ఎవఁడేని శూద్రుఁడు ద్విజాతులం దొకనిని శుశ్రూషచేయుటకై యాశ్రయించెనేని యతఁ డాశూద్రునకుఁ దగినవృత్తి నేర్పఱుప వలయునని ధర్మవిదులగు వారు చెప్పుదురు. శూద్రుఁడు సంతానములేక మృతుఁడయ్యెనేని వానికి నొడయఁడగు ద్విజుఁడే పిండమొసఁగవలయును. శూద్రుఁడు వృద్ధుఁడయినను దుర్బలుఁడయినను నాద్విజుఁడు వానిని బోషింపవలయును. శూద్రుఁడు తన్నుఁ బోషించునొడయునికి నెట్టియాపద వచ్చినపుడును దిగవిడువరాదు. భర్తకు ధనము నశించెనేని శూద్రుఁడు * తన కుటుంబపోషణమునకుఁ బోఁగా నెక్కువగా మిగిలిన ధనము చేత నతనిని బోషింపవలయును. శూద్రునకు సొంతమయిన ధనములేదు. వానిధనమేదియు వానిఁ బోషించువానికే చెల్లును. యజ్ఞము మూఁడువర్ణముల వారికిని ధర్మముగాఁ జెప్పఁబడినది. †అది శూద్రునకునుగూడ విధింపఁబడి యున్నది.

---

* 'అతిశేషేణ' అని మూలము. మిక్కిలి యక్కఱతోనని దీనికర్థము.

† 'ఉక్తస్త్రియాణాం వర్ణానాం యజ్ఞస్తస్యచ భారత' అని (జై. మూ) 'త్రయ్యేవభారత' అని (దా. మూ) దీనిచే శూద్రునకు యజ్ఞము లేదని యర్థము. తక్కిన ప్రతులన్నిటను 'తస్యచ' అని యుండుటంబట్టియు, వెంబడినే 'పాకయజ్ఞైర్యజేత' యని మంత్రములు జపించుట 'స్వాహా' 'వషట్' అని

అయినను శూద్రునకు స్వాహాకారమును వషట్కారమును మంత్రమును లేదు. కాఁబట్టి శూద్రుఁడు, వేదములందుఁ జెప్పఁబడిన వ్రతములను విడిచి * పాకయజ్ఞములను యజింపవలయును. పాకయజ్ఞమునందు దక్షిణ పూర్ణపాత్రమేయగును; మఱొక్క దక్షిణ యీరాదు. తొల్లి వైజివనుఁడనుశూద్రుఁడు †ఐంద్రాగ్న మనుయాగవిధానముచేఁ బ్పసన్న లక్ష పూర్ణపాత్రముల నిచ్చెనని మేము వినియున్నారము. ‡యజ్ఞము తక్కిన మూఁడువర్ణముల వారికెట్లో యట్లే శూద్రునకు విధింపఁబడియున్నది. సమస్తములయిన యజ్ఞములందును, శ్రద్ధాయజ్ఞము మొట్టమొదటిదిగా విధింపఁబడియున్నది. శ్రద్ధ పరమదైవతము. అది యజించు

చెప్పటయు లేక యజ్ఞములు చేయవచ్చునని విధించి యుండుటంబట్టియు, యజ్ఞములు శూద్రునకును గలవని యర్థము సేయఁబడెను.

* పాకయజ్ఞమనఁగా స్వల్పయజ్ఞములు. దుష్టగ్రహశాంతియు శూద్రదేవత లగు విశ్వేదేవాదుల నారాధించుటయు నిందలి విధులు. పూర్ణపాత్ర మనఁగా 256 పిడికిళ్ల బియ్యము నింపిన పెద్దపాత్ర లేక గంప. శూద్రుఁ డీ పూర్ణపాత్రమును దప్ప మఱేదక్షిణనుగాని తన యజ్ఞమునం దీయరాదు.

†ఐంద్రాగ్న విధానమందు లక్షపశువులను గోవులు గుఱ్ఱములు మొదలగు వంటివానిని దక్షిణ యీవలయును. ఈ శూద్రుఁడును ఆవిధానమును అనుష్ఠించినవాఁడు కాని యందు మంత్రములేదు. మఱి లక్షపశువులకు బదులుగా లక్ష పూర్ణపాత్రముల ఏర్పఱుపఁబడినవని తెలియవచ్చు.

‡ 'యతోహి సర్వవర్ణానాం యజ్ఞస్తస్యైవ భారత' అని మూలము. దీనికి 'బ్రాహ్మణులు మొదలయిన యేవర్ణములవారి యజ్ఞమును వారికి శుశ్రూష చేయు శూద్రునిని జేరినదగును. అనఁగా శూద్రుఁడు వారికి శుశ్రూష చేయుటచేతనే వారియజ్ఞమునుదానుజేసిన యజ్ఞముగానే పొందుచున్నాఁడు. అనఁగా నాయజ్ఞమందుఁ దాను జేయకున్నను శుశ్రూషనుబట్టి చేసినవానివలె

వారిని బవిత్రము చేయునది. బ్రాహ్మణులును పరమదైవము వా రాయాకోర్కులతోఁ గూడికొన్నవా రై యొకరినొకరు తమ తమకయిన యాగములను బెక్కులను గావింతురు. తక్కిన మూఁడు వర్ణములవా[illegible] బ్రాహ్మణులు సంతానము లను గాంచిరి. *మూ[illegible] సంతానములే. బ్రాహ్మణులు దేవతలకును చనఁ [illegible] స్పనను నీకది పరమ హితమగును. సకలనవర్ణములును వారివలనఁ బుట్టుటచేతను, వారుచేయు యజ్ఞములన్నింటిలోను నన్నివర్ణములవారికిని సంబంధము కలిగియున్నది. అట్లు సంబంధము కలిగియుండుట తమ యిచ్ఛవొప్పనఁగాదు. బ్రాహ్మణులవలనఁ బుట్టియుండు విధిని బట్టి కలిగినది. ఋగ్యజుస్సామముల నెఱింగిన ద్విజుఁడు దేవత వలె నెప్పుడును బూజ్యుఁడగును. శూద్రుఁడు ఋగ్యజుస్సామములు లేనివాఁడు గాన †ప్రాజాపత్యుఁడగును. మానసికయజ్ఞము

భాగము నొందున్నాఁడని భావము. ఎట్లన శ్రద్ధాయజ్ఞము యజ్ఞములందు మొట్టమొదటిదగాన, శూద్రుఁడు బ్రాహ్మణాదులయందు శ్రద్ధగలిగి వర్తించుటచే తాను వారియజ్ఞములను జేయకపోయినను వారియందలి తనశ్రద్ధయొక్క మహిమచే ఆయజ్ఞము చేసినట్టి వాఁడగుచున్నాఁడని భావము.

* తక్కిన మూఁడువర్ణములవారును బ్రాహ్మణుల వలననుండియే పుట్టినవారనుటచే శూద్రుఁడు యజ్ఞమునం దధికారమునొందుచున్నాఁడని తెలియునది.

† ప్రజాపతి అధిదేవతగాఁ గలవాఁడు గాన ప్రాజాపత్యుఁడని యర్థము. బ్రాహ్మణుఁడు ఆగ్నేయుఁడును క్షత్రియుఁడు ఐంద్రుఁడునయినట్లు శూద్రుఁడు ప్రాజాపత్యుఁడగునని తెలియునది. ఋగ్యజుస్సామాదులు తెలిసిన బ్రాహ్మణుఁడు సాక్షాద్దైవము. శూద్రుఁడన్నవో ఋగ్యజుస్సామాదుల నధిగమించుటకును వేదమంత్రములను బఠించుటకు నర్హత లేకపోయినను ప్రజాపతిని అధిదేవతగాఁగలిగి ఆదేవతను వేదోక్తములుకాని యితరవిధానములచేత నారాధించుచున్నాఁడని తెలియునది.

సకలవర్ణములవారికిని విహితమైయున్నది. ఈ *మానసికయజ్ఞము చేయువానియెడ వాఁడు శూద్రుఁడయిననుగాని దేవతలుగాని యితరులగు గొప్పవారుగాని (హవిర్భాగాదులు పుచ్చుకొనుటకు) కోరకుందురనుట యెంతమా[illegible] లేదు. కాఁబట్టియే శ్రద్ధా యజ్ఞము సకలవర్ణములవా[illegible] పఁబడుచున్నది. బ్రాహ్మణు లు వాఁడువర్ణములవా[illegible] ర్హులగుదైవము. కాఁబట్టి యీ తెగవారు తక్కిన మూఁడు తెగలవారినిగూర్చి (యీ కామమునుగోరి యీ వర్ణమువాఁడు నన్ను వరింపఁగా నీ యజ్ఞమును యజించుచున్నానని) యుద్దేశించి వారియజ్ఞములు చేయకుండిన వారుగారు; చేసియే యున్నారు. అయినను నట్టి యాగమునందు వైదికమయిన యగ్నికిఁ దక్కువయగు వితానమును (లౌకికాగ్నిని) ఆధారముగాఁ జేసిరి. అది కారణముగా బ్రాహ్మణుఁడు మూఁడు వర్ణములవారికిని యాగము చేయించినవాఁడగుచు

---

* యజ్ఞములు, శారీరకములు, వాచికములు, మానసికములు-అనఁగా శరీరము చేతను, వాక్కుచేతను మనస్సుచేతను జేయఁబడునవని మూఁడువిధములు. బ్రాహ్మణుఁడు మూఁడువిధముల యజ్ఞములును జేయవచ్చును. క్షత్రియుఁడును వైశ్యుఁడును తమ శరీరముచేత యజ్ఞములు చేయరాదు. కాఁబట్టి తమయజ్ఞములందు బ్రాహ్మణులను నియోగించుకొనవలయును. అయినను ఈ యిరుదెగలవారును వాక్కుచేతను మనస్సుచేతను యజ్ఞములు చేయవచ్చును. అనఁగా వాచికములగు మంత్రములను జపించవచ్చును. మానసయజ్ఞములు చేయవచ్చును. శూద్రుఁడన్నచో తనయజ్ఞములందుఁ దనదేహము నుపయోగింపరాదు. వాక్కుచేత మంత్రములు జపింపఁబడు. కాన వానికిఁ గలది మానసికయజ్ఞ మొక్కటియే. మానసిక యజ్ఞమనగా వేదవిధిలేకయే యొకదేవతకుఁగాని దేవతలకుఁగాని మనస్సుచేత నిచ్చునట్లు నిశ్చయించుట. నిశ్చయించినవెంటనే నిజముగా సంకల్పించినది యిచ్చి తీఱవలయునని తెలియునది.

న్నాఁడు. ఈ కారణమునుబట్టి చూడఁగా నాలుగువర్ణములును, యజ్ఞయోగమునుబట్టి సరిగానే (అనఁగా ధర్మమందు సమానులుగానే) యుండుటకాక, జక్క నొకరికొకరు జ్ఞాతులుగాను సంబంధపడి యున్నారు. [illegible] వారందఱును బ్రాహ్మణుని వికారమే యగుదురు. బ్రాహ్మణుఁడు క్షత్రియాది కన్యల యందుఁ బుట్టించిన పరంపరనుండి కలిగిన వారేయగుదురు. *సృష్టియందు మొదటఁగలిగినవాఁ డొవ్వఁడని నిజమును గనుఁగొనఁగా వర్ణములన్నింటియందును బ్రాహ్మణుఁడే మొదట (బ్రహ్మదేవరూపమున) సృజింపఁబడినాఁడని తెలియుచున్నది. సామము యజుస్సు ఋక్కులును మొదటనొకవేదముగానుండి పిదప వెక్కులయినట్లు బ్రాహ్మణుఁడొక్కఁడే మొదటఁ గలిగియుండి యతనినుండి తక్కిన వర్ణములు గలిగినవి. ఈవిషయమై పురాణజ్ఞులగువారు మున్ను వైఖానసమునులు యజ్ఞముసేయుచుండు

---

* ఇట 'అధరో వితానస్సంసృష్టః స్త్వథ తత్రసృష్టో బ్రాహ్మణ స్త్రిషు వర్ణేషు యజ్ఞ సృష్టః' అని మూలము గ్రహింపఁబడెను. ఇందులకు దాక్షిణాత్య కోశములందు 'అధరో వితాన స్త్వథ తత్రసృష్టో, నబ్రాహ్మణ స్త్రిషువర్ణేషు రాజన్' అనియు ఔ త్తరానాకోశములందు 'అధరోవితాన స్సంసృష్టోవైశ్యో బ్రాహ్మణ స్త్రిషువర్ణేషు యజ్ఞ సృష్టః' అనియుఁ బాఠాంతరములు. రెండవ దానికి "వితానమనెడి యగ్ని వైశ్యులనలననుండి గ్రహింపఁబడినను మంత్రములతోఁ గూడియున్నను తక్కువేయగును. బ్రాహ్మణుఁడే మూఁడువర్ణములవారినిని యజ్ఞములు చేయించువాఁడగును' అని యర్థము. హోమాగ్నులన్నియు ప్రాయికముగా వైశ్యుల గృహములనుండియే ప్రణయింతురు. వితానమనఁగా శూద్రుని హోమాగ్నియనియు అగ్ని విస్తారమనియు నర్థము. ఇట పాఠములు తెలివిడిగాకున్నవి.

నపుడు *యజ్ఞములనుగుఱి చి పాడినగాథలను జెప్పెదరు. అవి యేవనఁగా 'సూర్యుఁ డుదయించుటకు మునుపుగాని పిమ్మటఁగాని జితేంద్రియుఁ డగుపురుషుఁడు శ్రద్ధగలవాఁడై ధర్మముచొప్పున నగ్నిహోత్రము వేల్చుచున్నాఁడు. ఇందులకు శ్రద్ధయే గొప్ప కారణము. అగ్నిహోత్రవిధులలో నక్కన్నమనునది మొదటిది; అక్కన్నమనునది కడపటిది; సర్వోత్కృష్టమైనదియు. యజ్ఞములబహువిధములు. వాని కర్మములును ఫలములును నానావిధములు. ఏద్విజుఁడు శ్రద్ధగలవాఁడై వానినన్నింటని శాస్త్రజ్ఞానముచే నిశ్చయించి తెలిసికొనుచున్నాఁడో యా పురుషుఁడే యజ్ఞముసేయుట కర్హుఁడు. ఎవఁడు దొరగైనను, పాపుఁడయినను, పాపాత్ములందు మిన్నయైనను, ‡యజ్ఞమును నుఱింపఁగోరునో వానిని సాధుపురుషుఁడనియే చెప్పదురు. ఋషులు నట్టివానిని గొనియాడుదురు. ఇది సరియే. ఇందుల కెంతమాత్రము సందేహములేదు. సర్వవర్ణములవారును, సర్వకాలములందును, సర్వవిధములచేతను యజ్ఞము సేయవలయుననుట నిర్ణయము. ఏలనఁగా మూఁడులోకములందును యజ్ఞమునకు సాటియైన దొక్క-

---

* ఇట 'యజ్ఞగీతాః' అనియున్నది. ఇందులకు కృష్ణగీతలను యొక్క వ్యాఖ్య. యజ్ఞములను గుఱించిన గీతలనివ్యాఖ్యానము. మఱొకటి. అయినను బూర్వార్థమే ప్రకృతముగా నుండుటంబట్టి గయకొనఁబడెనని తెలియనది.

† బహ్వృచ బ్రాహ్మణమందు అగ్నిహోత్రములు. పదియాఱుచెప్పఁబడినవి. అందు 'మారుతం విష్యన్దమానమ్' అని యక్కన్నముకూడ ఆద్యమగు అగ్నిహోత్రముగాను అక్కన్నమనఁగా యథావిధిగా వేల్పంబడి సర్వోత్కృష్టమైనది గాను జెప్పంబడియున్నది.

‡ యజ్ఞ మనుటకు విష్ణువును యజించుట యని వ్యాఖ్య.

టియు లేదు. కాఁబట్టి పురుషుండసూయమాలి, శ్రద్ధగలిగి, పరిశుద్ధితో తన శక్తికొలఁదిని దన యిష్టముచొప్పన యజ్ఞము చేయవలయునని పెద్దలు చెప్పుదురు. ఇది యేఁబదితొమ్మిదవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు నాలుగాశ్రమముల ధర్మములను జెప్పుట.

భీష్ముఁడు 'యుధిష్ఠిరా' ఆశ్రమములు నాలుగింటి నానుములును వాని కర్మములును వినుము. వానప్రస్థము, భైక్ష్యము, (సన్న్యాసము), గార్హస్థ్యము, బ్రహ్మచర్యమని * బ్రహ్మదేవుఁడు చెప్పిన యాశ్రమములు నాలుగుగలవు. †చౌలమనెడు సంస్కారమునొంది, యుపనయననిధిచేత ద్విజత్వమునుబొంది వేదముల నధిగమించి, అగ్న్యాధానము మొదలయిన కర్మములనుగావించి, గృహస్థాశ్రమమును దీర్చికొని యింద్రియముల నడంచి యాత్మశుద్ధితో నడఁకువగలిగి భార్యనుగూడియో భార్యలేకయో వానప్రస్థాశ్రమమును బొందవలయును. ధర్మవిదుండగువాఁడు, ఆయాశ్రమమందు ‡వానప్రస్థునకు వలయుశాసనముల ననుష్ఠించి

---

* 'బ్రహ్మణేరితెమ్' (దా.మూ.) 'బ్రాహ్మణైర్వ్యతెమ్' (బౌ.మూ.) బ్రాహ్మణులనుష్ఠించు నాశ్రమములనుట.

† 'చూడాకరణ సంస్కారమ్' (దా.మూ.) 'జటాధారణ సంస్కారమ్' అని (బౌ.మూ.) ఉపనయనమునకుఁ బూర్వము చూడాకరణమే (చౌలమే) యుపపన్నముగాన నదియే గ్రాహ్యము.

‡ 'తత్రారణ్యకశాస్త్రాణి సపధీత్య' అని మూలము. అరణ్యకములను నైదికశాస్త్రముల నధిగమించియని ప్రతాపచంద్రులయర్థము.

యూర్ధ్వరేతసుఁడై * సన్యాసమునొంది, బ్రహ్మసారూప్యము నొందుచున్నాఁడు. రాజా ! ఊర్ధ్వరేతసులయిన (సన్యాసులయిన) మునులగుటకుఁ గారణములగు లక్షణము లివియే. ఎఱుకగల బ్రాహ్మణుఁడు మొదట పీనిని జేయవలయును. బ్రాహ్మణుఁడు బ్రహ్మచర్యాశ్రమమును జరపినపిదప మోక్షమును గోరి భైక్షచర్యము (సన్న్యాసము)ను బొందుట ప్రశస్తము. క్షేమంబగు నాలుగవ యాశ్రమమును బొందిన బ్రాహ్మణుఁడు గృహమును, నగ్నిని విడిచి, తనంతట దొరకినదానితో కడుపుఁ బ్రోచికొనుచు, బ్రొద్దు గ్రుంకినచోటనే పరుండుచు, మననశీలుఁడై, అంతరింద్రియములనడంచి, బహిరింద్రియములను గెలిచి, యాశలనుమాని, పెద్దఱికమునువదలి, భోగములను వికారములును లేక యుండునేని బ్రహ్మసారూప్యము నొందుచున్నాఁడు. మునులుగూడ ధర్మమున సేవించునట్టిదియు నాచరించుటకుఁ గష్టమైనదియు నగు గృహస్థధర్మమునం దుండువాఁడు వేదముల నధిగమించి వైదికకృత్యములనెల్ల నిర్వర్తించి సంతానములను గని యీ యాశ్రమమండలి సుఖములననుభవించి మిక్కిలి యెచ్చరికతోడ దీని నాచరింపవలయును. అట్లు చేయునేని యతఁడును బ్రహ్మసారూప్యము నొందును. మఱియు నాగృహస్థుఁడు కపటములేక తనభార్యచేతనే తృప్తుఁడై ఋతుకాలములందే భార్యను బొందవలయును. మఱియు దుఃఖమును మోసమును లేక శాస్త్రవిధుల ననుష్ఠించుచుండవలయును. మఱియు మితముగాఁ గుడుచుచు, దేవతలందుఁ దత్పరుఁడై నెనరుగలిగి, సత్యము పలుకుచు, క్రూరుండుగాక మెత్తనిమనస్సుగలిగి,

* 'ప్రవ్రజిత్వా' అని (బొ.మూ.) 'ప్రజాహిత్వా' (దా.మూ.)

తిమతోఁగూడి యుండవలయును. అతడు దమముగలిగి, గురువు మొదలగువారి యాజ్ఞలకులోనై హవ్యకవ్యములయందుఁ బరాకు వడకుండవలయును. బ్రాహ్మణుల కెప్పుడును నన్నము పెట్టుచుండవలయును. మత్సరము లేక యన్ని యాశ్రమములవారికిని దానము లొసఁగుచుండవలయును. శ్రౌతకర్మముల నెప్పుడును విడువకుండవలయును. ఈ విషయమై మహానుభావులగు మహర్షులు నారాయణుఁడు పాడిన గీతము నొకటిని జెప్పుచున్నారు. అది మిక్కిలి యర్థవంతమై యెంతయుఁ దపఃప్రయుక్తమయినది. అది నేనుజెప్పెదను వినుము. 'సత్యము, ఆర్జవము, అతిథిపూజనము, ధర్మము, అర్థము, స్వభార్యలతోడి రతి యను వీనిచేత నొకఁడు సుఖము లీహమందును బరమందును ననుభవింపవలయును. ఇది నామతము' అనియే. మహర్షులీ యాశ్రమమునందలి వారికి దారపుత్రాదులను భరించుటయు, వేదములను బరిపాలించుటయు మిక్కిలి శ్రేష్ఠములని చెప్పెదరు. ఈ విధము చొప్పున బ్రాహ్మణుఁడెవ్వఁడు యజ్ఞములనాచరించుచు గృహస్థధర్మమును గలరీతిని జరుపుచున్నాఁడో యతఁడు గృహస్థాశ్రమమును జక్కఁగా నిర్వర్తించి స్వర్గమునందుఁ బవిత్రంబగు ఫలమునొందును. ఆ గృహస్థుఁడు దేహమును విడిచినపిదప వాఁడు కోరిన కామములన్నియు నేదేశమునను నేకాలమునను నాశము నొందక భృత్యుఁడొడయునింబోలె *నతిమాత్రమయిన యెచ్చరికతోఁ గలకాలము నతనినెదురుచూచుచుండును. యుధిష్ఠిరా! బ్రహ్మచారి యొంటిమెయి నుండి యన్ని వేదములను జపించుచు,

* 'సర్వతోక్షిశిరోముఖాః' అన్నిప్రక్కల కన్ను తల మొగము గలిగినవాఁ అని యర్థము-అనఁగా అంత యెక్కుడు ఎచ్చరికతోనుట.

నొక్క యాచార్యునికే శుశ్రూషసేయుచు, దేహమును వస్త్ర ములును మన్ననుఁ ముఱికియుఁ గలిగియుండ, నిత్యవ్రతమును నిత్యదీక్షయుఁ గలిగి యింద్రియముల జయించి గురువుతోడి నీడ వలెఁ ననుసరించుచు నతనికెంతయు నడఁగి మడిఁగి యధ్వ్యయనము చేయుచు వ్రతమునుండి యెంతమాత్రము చలింపక విహితకృత్య ముల నెప్పుడు ననుష్ఠించుచు నుండవలయును. మఱియు గురువు నకు మ్రొక్కి యెప్పుడును బరిచర్యసేయుచు యజనయాజనాధ్య యనాధ్యాపనాదు లనెడియీ యాఱుకర్మములందును బట్టుదల కలిగి, యన్ని కార్యములందును నాసక్తితోఁ బ్రవర్తింపక, యెవరియందును నిగ్రహానుగ్రహములు చూపక, విరోధులకయి నను మంచి సేయవలయును. ఇవన్నియు, బ్రహ్మచర్యాశ్రమము నఁ దున్నవానికి ధర్మములగును' అనెను. ఇది యఱువదవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

{ భీష్ముఁడు ధర్మరాజునకు బ్రాహ్మణ ధర్మములను జెప్పుట. }

ధర్మరాజు 'ననుబోఁటివారికి మంగళకరములును మోద మిక్కిలియు సుఖప్రదములును హింసారహితములును లోకసమ్మ తములును సులభము లయినయుపాయములు నగు ధర్మములను మరలఁ జెప్పుము' అనెను.

భీష్ముఁడు 'ప్రభూ! బ్రాహ్మణునకు నాలు గాశ్రమములును విధింపఁబడియున్నవి. వానిని దక్కిన మూఁడువర్ణములవా రనుస రింపరు. రాజా! స్వర్గప్రదములును రాజులకు ముఖ్యముగా నాధా

నములయినవియు నగుకర్మములు పెక్కులింతవఱకే చెప్పఁబడి యున్నవి. *అయిన నవియెల్ల నీవిపుడడిగినదానికి నుత్తరముగా నుదాహరింపఁ గూడదు. ఏలన నవియెల్ల క్షాత్ర (క్షౌర్య) ధర్మ ములం దాసక్తులయిన రాజులకు విహితములు గనుక. క్షాత్రకర్మములును వైశ్యకర్మములును శూద్రకర్మములును మంకుబుద్ధి యగు బ్రాహ్మణుఁ డెవఁడు సేవించునో వాఁ డిహలోకమున నిందితుఁ డగుటయే కాక పరలోకమును నరకమునొందును. లోకమందు పనివాఁడు, కుక్క, తోఁడేలు, పశువు వీని కేపేళ్లు వెట్టఁ బడియున్నవో యా పేళ్లే తనకు విరుద్ధకర్మముల నాచరించు బ్రాహ్మణునికిఁ బెట్టును. ప్రాణాయామ ప్రత్యాహార ధ్యానధార ణాతర్కసమాధులనెడి యీయుత్తమకర్మములందుఁ బ్రవృత్తుఁడై నాలుగాశ్రమములందును పరిఢంచుచు సమస్తధర్మముల నాచ రించుచు, ఱవిశ్రాంతుఁడు గాక, యాత్మజయము గలిగి, పరి శుద్ధుఁడై, తపమునం దాసక్తుఁడై, యాశదిగిడిచి, దాత్మత్వము గలిగి యున్నబ్రాహ్మణునకు నాశరహితము లయినలోకములు గలుగును. ‡ ఏమనుష్యుఁ డేప్రాయమున నేకాలమం దేప్రదేశ మున నేకారణమునుబట్టి యెట్టికర్మముచేయనో యుఁ మను

---

* ‘నేమాని దృష్టాంతవిధోస్మృతాని। క్షౌత్రేహింకర్మం విహితం యథావత్’ అని(బౌ.మూ.) ‘శాస్త్రస్య సర్వస్య విధోస్మృతాని క్షౌత్రేహి సర్వం విహితం యథావత్’ అని (దా.మూ.) ఈ పాఠ మొంతయు సంగతము గాకున్నది కాన త్యాజ్యము.

† ‘సంప్రవృత్తస్య’ అని మూలము. ‘తమూఢాత్తస్య’ అని దాక్షిణాత్యపాఠము. పూర్వపాఠమే యిట గ్రహింపఁబడినది.

‡ ‘యోయస్మి న్కురుతే కర్మ యాదృశం యేన యత్రచ। తాదృశంతా

ష్యం డాకారణమునుబట్టి యాకర్మమును (దానియందలి లోభ
మువలనను నభ్యాసమువలనను) గుణవంతమయినదని తెలంచు నే
కాని నింద్యమని దానినుండి విరమింపఁడు. (ఎవఁ డేస్వాయమున
నెచ్చట నెప్పు డేఫలమునుబట్టి యెట్టికర్మమును జేయునో వాఁ
డట్టిదానిచే నటువంటి గుణమునే పొందుచున్నాఁడు). రాజేంద్రా!
వడ్డిగొనుటయు, ఏర్తకమును, సేద్యమును, వేఁటయు, వేదాధ్యయ
నమునకు సాటియైనవని తెలియుము. కాలము మనుష్యునిఁ బురి
కొలుపుచున్నది. పూర్వజన్మకాలపు వాసనలంబట్టి వానిని సంబం
ధించిన విషయము లేర్పడుచున్నవి. కినుక వాఁ డాకాలమునకు
లోనై యుత్తమ మధ్యమాధమ కార్యములు చేయుచున్నాఁడు.
పూర్వజన్మమునందుఁ జేసిన మంచికర్మములందు ముఖ్యములయి
నవి, మీఁద నెంతయు శ్రేయస్కరము లయినవి; అవి యంతయు
నొందఁగలవియే కాని యెన్నఁడు నుండుగవిగావు. మనుష్యులు
దమతమ పూర్వవాసనలను బురికొలుపు పనులయందే యెప్పు
డును దగిలియుందురు. ఆవాసనలును మనుష్యుని నన్ని దెసలను
బురికొలుపు చుండును.' ఇది యఱువదియొకండవయధ్యాయము.

పృశ్నేశ్చ సగుణం ప్రతిపద్యతే' అని మూలము. ఎవఁ డెచ్చట నెప్పు డెట్టి కర్మమును జేయునో యటువంటి గుణమునే పొందునని ప్రతాపచంద్రరాయల యర్థము, 'సగుణమ్' అనుచో సః+గుణమ్ అని నిచ్ఛేద మీయర్థముఁ దెలియునది. ఇది భాగు.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు బ్రాహ్మణునికిఁ ద్యాజ్యములగు ధర్మములనుజెప్పి రాజధర్మమును బ్రశంసించుట.

భీష్ముఁడు 'అల్లెత్రాటి నీడ్చుటయు, శత్రువుల నుక్కుమడంచుటయు,* సేద్యమును, వర్తకమును. పశువుల మేపుటయు, ధనము గోరి పరులకుఁ బనులుసేయుటయు ననునివి బ్రాహ్మణునకు మిక్కిలియఁ జేయఁదగనివి. బుద్ధిమంతుఁడును గృహస్థుఁడునగు బ్రాహ్మణుఁడు వేదము నధిగమించి, యజనాదు లయినయాఱుకర్మములను గావింపవలయును. గృహస్థ కృత్యములన్నియుఁ జేసి వీడినపిదప బ్రాహ్మణుఁ డడవికిఁబోయి వసించుట యెంతయుఁ దగును. రాజున కూడిగముచేయుటయు, దున్ని ధనము సంపాదించుటయు, వర్తకముచేసి బ్రదుకుటయు, కపటవృత్తియు, అంకు తనమును, కుసీదమును బ్రాహ్మణునకు మిక్కిలి నింద్యములు, తన ధర్మమునుండి తప్పి దుష్టం బగునడవడి నెవఁడుగైకొనునో యా చెడుబ్రాహ్మణుఁడు. శూద్రుఁడగును. శూద్రస్త్రీని నిల్లాలుగఁ జేసికొని కొండెములు జెప్పుటయు, నట్టుఁదనమును, గలిగి గ్రామమువారి కూడిగము చేయుట మొదలగు విరుద్ధకర్మములు

---

* 'వృద్ధ్యాకృషి వణిక్పథ్యేన జీవసంజీవనేనచ, వేత్తు మర్హసి రాజేంద్ర స్వాధ్యాయగణితం మహత్' (బొ. మూ.) (స్వాధ్యాత్మగుణితేనచ' అని (దా. మూ.)

* 'అన్తవన్తి ప్రధానాని పురాశ్రేయస్కరాణిచ' అని (బొ. మూ.) 'అన్తవన్తి ప్రదానాని పరంశ్రేయస్కరాణిచ' అని (దా. మూ.) ప్రథమ పాఠమే సాధువుగాన యుంగీకృతమైనది.

చేయునేనియు శూద్రుఁడగును. బ్రాహ్మణుఁడు తొలఁగి మంద బుద్ధియై మంచినడక విడిచి యిట్టివాఁడగునేని యతఁడు వేదమును గఱచినను గఱవకున్నను, శూద్రునకు సాటిగాను దానునకుసాటిగాను దొలఁగించి పెట్టిభోజన మిడవలయును. ఇట్టివారందఱును శూద్రునకు సాటియగుదురుగాన వైదికములయిన దేవకార్యములందు వర్జింపవలయును. మరియుఁబలేనివాఁడును, వంచన మాటలాడువాఁడును, క్రూరంపు నడవడిగలవాఁడును, హింసిఁపఁదివురువాఁడును, మంచినడవడిని స్వధర్మమునుదిగవిడిచినవాఁడును, నగు బ్రాహ్మణునకు, హవ్యములు కవ్యములును మఱియుఁదక్కినవి యియ్యఁదగినవి యెల్ల నియ్యరాని వగుచున్నవి. కాఁబట్టియే, బ్రాహ్మణునకు, దమము, శౌచము, ఆర్జవము ననుధర్మములును విధింపఁబడియున్నవి. అట్లు నాలుగాశ్రమములును బ్రహ్మ (వేదము)చే బ్రాహ్మణునకు మునుపే విధింపఁబడియున్నవి. దమమును బూజ్యమయిన శీలమును గలిగి, సోమపానము చేసినవాఁడును, ఆశలేనివాఁడును, అన్నిటిని సైఁచువాఁడును, దయయు నోర్పును గలవాఁడును, బఱులకుఁగీడుదలంపనివాఁడును, క్రూరుఁడు కానివాఁడును, కపటము లేనివాఁడును నగువాఁడే బ్రాహ్మణుఁడగునుగాని పాపకర్ముఁడగువాఁడు బ్రాహ్మణుఁడుగాఁడు. * ధర్మమునుగోరు జనులు శూద్రులయు వైశ్యులయు క్షత్రియులయు సాయము గోరుచున్నారు. కాఁబట్టి యీ

---

* 'మాద్రంవైశ్యం రాజపుత్రం చరాజన్, లోకాస్సర్వే సంశ్రితా ధర్మకామాః, తస్తాద్వర్ణాఁశాంతి ధర్మేష్వసక్తాఁ, మత్వావిష్ణోర్నేచ్ఛతి పాండుపుత్ర' అని (ఔ. మూ.) 'విప్రంవైశ్యం...వర్ణాఁజాతి ధర్మేష్వసక్తాఁ, జేతుంవిష్ణోర్నేచ్ఛతి...' అని దా.మూలము. ధర్మమునుగోరు లోకములు,బ్రాహ్మ

మూఁడువర్ణములవారును శాంతియుక్తములగు ధర్మములందుఁ దగులు లేకుండి రేని (తక్కినవారి ధర్మప్రాప్తికి సహకారులు లేకపోవునుగాన) విష్ణుఁడు వారియెడ ననుగ్రహము చూపఁగోరఁడు. విష్ణుఁడనుగ్రహింపఁ గోరఁడేని, స్వర్గలోకమునంగల యెల్లవారల సుఖమును, చతుర్వర్ణ ధర్మఫలములును, వేదవాదములును, సమస్తములయిన యజ్ఞములును, లోకుల సమస్త క్రియలును సమస్తములయిన యాశ్రమ ధర్మములును దొడగనే లేకపోవును. తన రాజ్యమందుఁ గలమూఁడువర్ణములవారును తమతమ యాశ్రమ ధర్మములను సరిగా నడపుచు రావలయు నని కోరురాజు తెలియవలయు ధర్మములను వినుము. ఎక్కుడు కులమువారికి పనిపాటులుచేసి, తన కృత్యమును దీర్చుకొని, సంతానములను గని, తక్కిన వైదికులకును దనకును నంతగా నాచారశుద్ధియందు భేదము లేనివాఁడును దేశాచారమును బొందినవాఁడు నగుశూద్రునకు, రాజు ననుమతినొంది యాశ్రమే కుండుట యొకటి తక్కఁదక్కిన యాశ్రమములన్నియు విహితములై యున్నవి. ఆ ధర్మములనుజెప్పఁ బెద్ద లిట్టిధర్మముల నాచరించు శూద్రునకును వైశ్యునకును క్షత్రియునకును నటమీఁద* భైక్షచర్యము (సన్న్యాసము) విధించియున్నారు. వైశ్యుఁడు తనయాశ్రమకృత్యముల నెల్లఁదీర్చి, రాజునకుఁ

ణుని, వైశ్యుని, క్షత్రియుని నాశ్రయించియున్నవి. కాఁబట్టి తమతమధర్మములందుఁ దప్పకయుండునట్టి వర్ణములను విష్ణువు విడనాడఁగోరఁడు' అని యర్థము.

* 'భైక్షచర్యాం తతః ప్రోహుః' అని (బొ. మూ.) 'భైక్షచర్యాం నచైవాహుః' అని (దా. మూ.)

గొలువుగొలిచి వయసుచెల్లినపిదప రాజు ననుమతినొంది మఱి యొక యాశ్రమమును బొందవచ్చును. ధర్మము చొప్పున వేదముల నధిగమించి, రాజశాస్త్రములను దెలిసి సంతానాదులను బడసి, సోమపానముచేసి, ధర్మమునఁ బ్రజలనెల్లఁ బాలించి, బ్రాహ్మణులకు దక్షిణలొసంగి రాజసూయము, అశ్వమేధము మొదలయిన యాగములను, మఱియుఁ దక్కినవానిని గావించి యుద్ధమందు గొంచెముగానో యెక్కువగానో జయమునొంది, రాజ్యమందుఁ బ్రజలను బాలించు దిట్టయగు పుత్రునినో పుత్రుఁడులేనిచో నితరగోత్రమువాఁడును బ్రశస్తుఁడనయినమఱి యొక క్షత్రియునో నెలకొలిపి, పితరులను శ్రాద్ధములచేతను పితృయజ్ఞములచేతను యథావిధిగ నర్చించి యజ్ఞములచేత, దేవతలను, వేదాధ్యయనముచేత ఋషులను, ప్రయత్నంబునఁ బూజించి యంత్యకాలమున మఱియొక యాశ్రమమును బొందఁగోరు క్షత్రియుఁడు *క్రమముగా నాశ్రమములనుబొంది సిద్ధిపొందును. గృహస్థాశ్రమమును విడిచి తొలఁగిన క్షత్రియుఁడు, ఋషివృత్తినుండునేని భైక్షము నాచరింపవచ్చును. కాని విషయసుఖము లనుభవించుటకై యట్లు చేయరాదు. గృహస్థధర్మమునువిడిచి తన బ్రతుకుటకుమాత్రము వలయునంత భిక్షించుచు, భైక్షము నాచరింపవచ్చును. ఈ భైక్షచర్యము క్షత్రియులు వైశ్యులు శూద్రులనెడి యీ మూఁడువర్ణములవారికిని నిర్బంధముతోఁ గూడినవిగావు. వారి కిచ్ఛయుండినయెడల వరింపవచ్చునుగాన నాలుగు వర్ణములవారికిని నిది చెల్లును.మను

---

* 'అనుపూర్వ్యాశ్రమాన్' అని (దా. మూ.) 'ఆనుపూర్వ్యాశ్రమాన్' వై. మూలము.

ష్యులయందు, మిక్కిలి శ్రేష్ఠమయిన ధర్మములు రాజు లాచరించునవియె యగును. లోకమంతయు వారి బాహులబలిమికి లోనయియున్నది. మూఁడువర్ణముల వారి ధర్మములు నుపధర్మములును జీవిత బడుటకై క్షత్రియధర్మమునూఁది యున్నవని వేదములవలన వినుచున్నాను. ఏనుఁగు నడుగులోపలఁ దక్కిన జంతువుల యడుగులన్నియు నడఁగి యిముఁడునట్లు, తక్కిన వర్ణములవారి సమస్తధర్మములును సకల సందర్భములందును రాజధర్మములం దిమిడిపోయి యున్నవి. ధర్మవిదులగు మనుష్యులు, తక్కిన మూఁడువర్ణములవారి ధర్మములును, నల్పములయిన యాధారములును నల్పములయిన ఫలములు నొసంగుచున్నవని చెప్పెదరు. పెద్దలు, క్షత్రియులధర్మము గొప్ప యాధారమును గొప్పఫలములను నొసంగునుగాని తక్కిన వట్లు లొసంగవని చెప్పెదరు. సమస్తధర్మములకు రాజధర్మములు ప్రధానములయినవి. సమస్తవర్ణములవారును రాజులవలననే పాలింపఁబడుచున్నారు. సమస్తమయిన త్యాగములును రాజధర్మములందున్నవి. త్యాగమును శ్రేష్ఠమయిన పురాతన ధర్మముగాఁ జెప్పుదురు; దండనీతి హతమయినచో మూఁడువేదములును మునిఁగిపోవును; మనుష్యధర్మశాస్త్రములు నన్నియు నశించును. పురాతనమగు క్షత్రియధర్మము నశించెనా సకలమయిన యాశ్రమములు *(ధర్మములునశించును. సమస్తభోగములును రాజధర్మములందుఁ జూపట్టుచున్నవి. సమస్తవిషయములును రాజధర్మములందుఁ జెప్పఁబడియున్నవి. సమస్తములయిన విద్యలును రాజధర్మములందే కూడియున్నవి.) సమస్తములయిన లోకములు

* ఈకుండలీకరణములలోనిది ఔత్తరాహ్నికప్రతులందులేదు.

రాజధర్మములం దడఁగియున్నవి. సర్వధర్మములును, సర్వభోగములును, సర్వయోగములును, రాజధర్మములందు నెలకొనియున్నవి. కాఁబట్టి రాజధర్మమునకంటె విశేషించిన ధర్మము మఱియొకటి లోకమునం గలుగదు. సకలములయిన యీకర్మములును సమస్తములయిన ప్రాణిసమూహములును రాజధర్మమునందుఁ బ్రతిష్ఠింపఁబడియున్నవి. ప్రాణులు నీచులచేత వధింపఁబడునేని, వారలధర్మములను వైదికకర్మములను నాశమునొందునట్లు, సమస్తధర్మములును రాజధర్మముల సహాయము వీడినచో నాశమొందుటయేకాక మనుష్యులును బెక్కులు విఘ్నములచేఁ దమతమ ధర్మములను బాలింపనివారగుదురు. ఇది యఱువది రెండవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు రాజధర్మమును బ్రశంసించి యింద్రునకు మాంధాతకు నయిన సంవాదమును జెప్పుట.

భీష్ముఁడు 'పాండవా ! నాలుగాశ్రమముల ధర్మములును (విశేషించిన) యతిధర్మములును లోకమునను వేదమునందును నుత్తమములని వాసికెక్కిన ధర్మములును రాజధర్మములం దడఁగియున్నవి. రాజధర్మము నెలకొనియున్నచో నీకర్మములన్నియు సార్థకములగుటయేకాక ప్రాణిసమూహములును కలఁకలేక సుఖంబుండును. రాజధర్మము నెలకొనక పోయెనా జీవలోకమం

* 'అప్రత్యక్షం బహుఫలం ధర్మాశ్రమవాసినామ్ । ప్రరూపయన్తి

ష్యుల ధర్మములు ప్రత్యక్షములుగావు. మటివానికి ఫలములును ద్వారములును బెక్కులు; వారట్టిధర్మముల శాశ్వతమయినస్వరూపమును నాగమములచేతనే యిట్టివని నిరూపించుచున్నారు; కాని, ప్రత్యక్షముగా నెట్టిదో తెలియలేదు. మటికొందఱు లోకములు చేసిన సిద్ధాంతములే సరియని మంచిమాటలచే వాదించుచు ధర్మములకలరూపును శాస్త్రములందు నిశ్చయింపఁబడియున్న రీతిని నెఱుంగక తుదకు నేసిద్ధాంతమునందును బర్యవసింపనిపర ధర్మమందుఁ బడి కలగుండు నొందుచున్నారు. క్షత్రియుల ధర్మ మోయట్లుగాదు. అదిప్రత్యక్షమైనది; మిక్కిలి ఫలముగలది; తనకుఁ దానే సాక్షియైనది; కపటములేనిది; సర్వలోకహిత మైనది. గృహస్థాశ్రమమం దున్న బ్రాహ్మణుల ధర్మమునందుఁ దక్కిన మూఁడువర్ణములవారి ధర్మములును నడంగియున్నట్లు రాజధర్మములందు లోకములన్నియును వానిపుణ్యకర్మములును నడంగియున్నవని మునుపేమెత్తి చెప్పియున్నాను. శూరులయిన రాజులు పెక్కండ్రు తొల్లి దండనీతి(నిగుఱించి సందేహములడఁగు) కొఱకు సర్వభూతేశ్వరుండును మహాతేజుండును నారాయణుండునగు విష్ణుకడకుఁ బోయిరని ముందే నీ కుదాహరించి యున్నాను. ఆరాజులు తమదండనీతి కర్మము నొక్కొక్కటిని నాశ్ర

తద్భావ మగమై రేఖాశాశ్వతమ్' అని మూలము'ప్రకోపయన్తి తద్భావమ్' అని బొ. మూలము. వా రధర్మముల స్వరూపమును విరుద్ధములయిన యాగమముల చేతఁ జెఱుపుచున్నారు. ఆయాగమములవలన వాని యెప్పటిస్వరూపమును దాఱుమాఱుగాఁ దెలియుచున్నారు; కాని,కలరూపునఁ దెలియఁజాలరనుట ఇట యితరధర్మముల స్వరూపమంతగాఁ దెలియమిని జెప్పుప్రకరణము ; నీ పాఠమే గ్రాహ్యముగానున్నది.

మధర్మములతోఁదులదూఁచియేదియెక్కుడో యద్దేవుఁడు సిద్ధాం తముచేసి చెప్పఁగా వినుటకు నతని నుపాసించియుండిరి. అయ్యా దిదేవుండు తొల్లి సృజించిన సాధ్యులు, దేవతలు,వసువులు, అశ్వి నులు, రుద్రులు, విశ్వేదేవతలు, మరుద్గణములు, సిద్ధులు నంద ఱును ఋత్రియధర్మమందుఁ బ్రవర్తించుచున్నారు. ఈవిషయమై నీకు నిజము నిరూపించుటకు నొకధర్మమును దెలిపెదను. తొల్లి యీలోకమున నసురులొకటే సముద్రమువలె నావరించి యుం డుటవలన మరియాదదక్కి యుండఁగా మాంధాత యని వీర్య వంతుఁడయిన యొకరాజుండెను. అక్కాలమునం దీభూమినేలు చుండినయారాజు, అనాదిమధ్య నిధనుండును సర్వేశ్వరుండునగు నారాయణుని జక్కఁగాఁ జూడఁగోరి యమ్మహాత్మునిపాద ములను శిరసునుంచి మ్రొక్కి యొకయాగమును జేయఁదొడం గెను. విష్ణుదేవుం డవ్వఁ డింద్రరూపంబున నతనికి దర్శనమొసం గెను. మాంధాతయు, రాజులు పరివేష్టించియుండ నాప్రభునిఁ బూజించెను. ఆరాజునకును మహత్తుఁ డయినయాకల్లయింద్ర నకునుమహాద్యుతియగు విష్ణుదేవునిఁగూర్చి యీగొప్పసంవాద ముకలిగెను. ఇంద్రరూపుఁడగు భగవంతుఁడు 'ధార్మికో త్తమా! నీకోర్కియేమి ? నీ వానారాయణునిఁ జూడఁగోరుచున్నావు. అతఁడప్రమేయుఁడు. అతని మాయ యనంతము.అతనిమంత్ర శక్తి యమితమైనది. అతఁడాదిదేవుఁడు, పురాణుఁడు, విశ్వ రూపుఁడు. అట్టిదేవునిని జూచుటకు నాకు సంయత మలవికాదు. నాకేకాదు; సాక్షాద్బ్రహ్మకును నలవిగాదు. రాజా ! నీయుల్లం గల తక్కినకామములు వేనినయినను నీకొసంగెదను. ఏలన మనుష్యులందు రాజవు.నీవు సత్యమునందును శమమందును

నెలకొన్నవాఁడవు. ధర్మపరుఁడవు; జితేంద్రియుఁడవు; శూరుఁడవు. కావున నీయందు దృఢమయిన ప్రీతికలదు. మతియును భక్తిచేతను బుద్ధిచేతను, శ్రద్ధచేతను,నీవు త్తముఁడవైయున్నాఁడవు. కావున నేను నీకు వలచినట్లు వరము లొసంగుచున్నాను' అనెను. అందులకు మాంధాత 'నీప్రసాదమునకై శిరసు సోఁక మ్రొక్కుచున్నాను.మహాత్మా! అయిన నయ్యాదిదేవునిఁదప్పక చూడఁగోరుచున్నాను. కామములన్నియు దిగవిడిచి ధర్మమును గోరి సాధువులు వర్తించు సత్పథమందు మెలఁగఁదలఁచి యడవికిఁ బోవఁదలఁచుచున్నాను. విపులమును నప్రమేయమునయిన క్షత్రియధర్మమువలన మంచిలోకములు నాకుఁ బ్రాప్తములయినవి,నా యశస్సును స్థాపితమయినది. అయిన నాదిదేవుని వలననుండి * ప్రవర్తించినదియు లోకమందెల్ల శ్రేష్ఠమయినదియునగు ధర్మమును నేను జేయనెఱుంగను' అనెను.

అందుల కింద్రుఁడు 'రాజులుకానివా రెంత ధర్మపరులుగా నుండినను ధర్మమునకుఁ గలుగుపరమం బయినగతిని సులభముగాఁ బొందనుగాని పొందింపనుగాని శక్తులుగారు. ఆదిదేవుని వలననుండి మొదట వెలువడినది రాజధర్మమొకటియే. తక్కిన ధర్మములన్నియు దానికంగములుగాఁ బిదపవెలువడినవి. తక్కిన యనంతములయిన ధర్మములును వానప్రస్థధర్మములును బిదప సృజింపఁబడినవి. వానిఫలము లంతముగలవి. క్షాత్రధర్మ

---

* అరణ్యమిచ్ఛేగస్తం సత్పథం సాధుజుష్టమ్' అని (దా.మూ.) వరేణ్యమిచ్ఛేగస్తం సత్పథం లోకజుష్టమ్' అని బొ. మూలము. లోకులంబడుమును గారవించునట్టిదియు సజ్జనులు మెలఁగునట్టిదియు శ్రేష్ఠమయిన మార్గమును బొందఁగోరుచున్నాను.

ములో వానికంటె విశిష్టములయినవి. ఈధర్మమునందు సమ స్త ములయిన ధర్మములు నడఁగియున్నవి. కాన క్షత్రియధర్మ ముసే మిక్కిలి శ్రేష్ఠమయిన ధర్మముగాఁ జెప్పెదరు. లొంటి కాలమందు మహావిష్ణువు రాజధర్మముచేత శత్రువులనోర్చి ఋషులను దేవతలను నందఱను రక్షించెను. ఈభగవంతుఁడు లోకవిరోధులయిన యసురులనందఱను హతులం గావింపకపోయి నచో బ్రాహ్మణులును లోకకర్తయగు బ్రహ్మదేవుఁడును నీధర్మ మగు ననాదిధర్మమును లోకమునందుండి యుండవు. దేవశ్రే ష్ఠుండును నాదిదేవుండునగు నారాయణుఁ డసురులతోఁగూడిన యీభూమిని బరాక్రమంబున జయింపకపోయినచో బ్రాహ్మ ణులు నశించిపోవుటచే నాలుగువర్ణములును నాలుగాశ్రమము లును వానిధర్మములును నన్నియు లోకంబున లేకపోవును. ఒక్కొక్కయుగమందును శాశ్వతములయినయీధర్మములుపలు విధములుగా నాశమొందుచు రాజధర్మముచే మరల నవి వర్ధిల్లు చున్నవి. కాఁబట్టి రాజధర్మము లోకమందు శ్రేష్ఠమయినదని చెప్పెదను. యుద్ధమునందు దేహమువిడుచుట,సమ స్తభూతముల యందును దయ,లోక విషయములందు జ్ఞానమును, బ్రజలనుబా లించుటయు, కారినపాయమునుండి విడిపించుటయు, పీడితులయి దుఃఖించుచుండు జనులకు విడుమర కలిగించుటయు, ననునివి రాజులాచరించు క్షత్రధర్మములం దుండునవి. కామ క్రోధము లందు వర్తించుచు మరియాదల నతిక్రమించి నడచునట్టి మను ష్యులు రాజవలని భయముచేత పాపముఁ జేయకుందురు. సహా జముగా శిష్టులయి సదాచార పరులగువా రాకారణమునసే సమ స్తధర్మములు నిర్వహింపఁగలుగుదురు.కావున నే రాజధర్మమును

మంచిదిగాఁ జెప్పుదురు. రాజులు, తండ్రిపుత్రులంబోలెఁ, బాలించుచుండఁగా లోకమునం గలసమస్తప్రాణులు తమతమ ధర్మములతోడఁ జరించుచుందురనుట కెంతమాత్రమునం దేహము లేదు. కాన క్షత్రియధర్మము సమస్తధర్మములకంటె నతిశయించినది; సనాతనమైనది; లోకమందు శ్రేష్ఠమయినది. అది సర్వప్రాణుల రక్షయందునువర్తించునది.తనంతట నాశరహితమైయది శాశ్వతముక్తియందుఁ బర్యవసించును. " ఇది యఱువది మూఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు నింద్రరూపియగు విష్ణువు మాంధాతకుఁ జెప్పినరాజధర్మాదులను జెప్పుట.

ఇంద్రుఁడు 'ఇటువంటి ప్రభావముగలదై సర్వధర్మములును దనయం దడంగినదై సర్వధర్మములందును శ్రేష్ఠమునై యొప్పు రాజధర్మమును నినుబోఁటి యుదారులగు లోకపాలురు పరిపాలించుచు రావలయును. ఈనెఱి తప్పినయెడల ప్రజలకు నాశముగలుగును. రాజు భూమిని బంటలచే సంపన్నముగావించుట, రాజసూయము మొదలయిన యాగములుచేయుట, * దీక్షనొందుట, ప్రజలను బాలించుట, సమస్తప్రాణులందును దయగలిగియుండుట, యుద్ధమునందు దేహమువిడుచుటయు, తనకు శ్రేష్ఠమయినధర్మమని తెలియవలయు. వీనియందు యుద్ధమున

* 'దీక్షాచర్యామ్' అని (దా.మూ) 'ఆర్జిక్షచర్యాం' అని (బొ.మూ.).

దేహములవిడుచుట మిక్కిలి యుత్తమధర్మమని మునులు చెప్పుచున్నారు. అదికారణముగా *రాజధర్మమందు వర్తించు రాజులందఱును మిక్కిలియుఁ జదువుచదివి గురువులకు శుశ్రూషయు సేసి తుదకు నొండొరులను యుద్ధమునఁ దారొక్కని తమదేహములను విడుచుట నీవు కన్నారఁజూచి నదియే. ధర్మమునుగోరు క్షత్రియుఁడు, బ్రహ్మచర్యము జరిపినపిదప నిత్యధర్మయుక్తమగు గృహస్థాశ్రమము నాచరింపవలయును. సామాన్యములగు జనుల వ్యవహారములందు రాజు 'వీఁడుప్రియుఁడు వీఁడప్రియుఁ'డను పక్షపాతములేక వర్తింపవలయును. మఱియు నాలుగువర్ణములను నాయాయుపాయములచేతను గట్టుపాట్లచేతను † పౌరుషములచేతను సమస్తములయిన పూనికలచేతను వారివారి ధర్మములందు నిలిపి పరిపాలించుటవలనను, సమస్తధర్మములు నడఁగియుండుటవలనను క్షత్రియధర్మము మిక్కిలిశ్రేష్ఠమని చెప్పెదరు. తమతమధర్మముల నేవర్ణములవా రాచరింపరో మఱియు నాయాధర్మములను విపరీతములుచేసి చెప్పుదురో వారు మర్యాదమాలి యెప్పుడును ధనమందే తగులు గలిగినవారుగాన యట్టి మనుష్యులను బళుపులని చెప్పెదరు. ధనసంపత్తి పెంపుచేత నీతిని నెలకొలిపి లోకము శ్రేయమును బొందించునుగాన క్షత్రియధర్మము తక్కిన యాశ్రమములకన్న నుత్తమమగును. మూఁడువేదములును జదివిన బ్రాహ్మణులకేర్పఱిచిన నడవడియు, సామాన్యముగా బ్రాహ్మణులకేర్పఱిచిన యాశ్రమములును బ్రాహ్మణు

---

* 'నిత్యంవ్యక్తం రాజధర్మేషుసర్వే' అని దా.మూ. 'నిత్యంయుక్తా రాజధర్మేషుసర్వే' అని బొ. మూలము.

† 'పౌరుషైఃసై' అని మూలము. 'పౌరుషైర్థైఃసై' అని దా. మూల.

నకు నన్నింటికినిలోముఖ్యమయినది. *దానినిగాక మఱొకటిని జేయు బ్రాహ్మణుని శూద్రునింబోలె నాయుధముచేత వధింపవలయును. నాలుగాశ్రమముల ధర్మములును వేదోక్తవిధానములును బ్రాహ్మణుఁడనువర్తింపవలయును. ఇది తప్పనతనికి మఱెద్దియును నెప్పటికిని లేదని తెలియునది. బ్రాహ్మణునకు వేఱువిధముగ రాజు మనుగడఁ గలిగింపరాదు. అతని కర్మములచేత నతనిధర్మము పెరుఁగుచున్నది. బ్రాహ్మణుఁడు ధర్మమెట్లో యట్లె. ధర్మమే యతఁడు. తనకు విహితములు కాని ధర్మములందు వర్తించుబ్రాహ్మణుఁడు సమ్మానమున కెంతమాత్ర మర్హుఁడుగాఁడు. అతఁడు తన స్వకర్మములను బ్రయోగింపనియెడల నతఁడెవ్వరి నమ్మికకును బాత్రుఁడుగాఁడు. † తమధర్మములను మాలినయేవర్ణములవారినిగాని మేలయిన పదవికిఁ దేవలసినది క్షత్రియుని ధర్మముగాన రాజధర్మమే తక్కినవానికంటె శ్రేష్ఠమయినది. ‡రాజధర్మమే ప్రభావమం దన్నిటికంటె నతిశయించినదని నామత'మనెను. అందులకు మాంధాత 'యవనులును, కిరాతులును, గాంధారు

---

* 'ఏతత్కర్మబ్రాహ్మణస్యాహురగ్ర్యమ్' అని జౌ.మూ.'క్షత్రియస్యాహురగ్ర్యమ్' జౌ.మూ.అదిగాక మఱియొకటిని జేయు క్షత్రియుని శూద్రునింబోలె నాయుధముచేత జంపవలయును నని యర్థము.

† 'ఏతేవర్ణా స్సర్వధర్మైశ్చహీనాఃఊత్కృష్టవ్యా క్షత్రియైరేవధర్మాఃఅని (దా.మూ) ఏతేధర్మా స్సర్వవర్ణేషులీనా।ఉత్కృష్టవ్యాక్షత్రియైరేషధర్మాఃఅని జౌ.మూ. 'ఆయాధర్మములం దడంగియున్న ధర్మములివియే.క్షత్రియులే వానిని ముందుగఁదేవలయును. ఇది వారికి ధర్మమగును' అనియర్థము.

‡ 'వీరజ్యేష్ఠాఃవీరధర్మామతామే' జౌ.మూ. అదివీరులధర్ముగాన వీరులే ముందాచరించుచున్నవారు.

లును, చీనులును, శబరులును, బర్బరులును, శకులును, తుషా రులును, కంకులును, పల్లవులును, ఆంధ్రులును, మద్రకులును, ఉష్ట్రికులును, పులిందులును, అరట్టులును, కాంచులును, మ్లేచ్ఛు లును, బ్రాహ్మణక్షత్రియులవలనఁ బుట్టిన జాతులును, వైశ్యులు ను, శూద్రులును నిట్లు రాజులదేశమందు వసించువారందఱు ను ధర్మముచేయుట యెట్లు పొసఁగును? వీర లాచరింపవలసిన ధర్మము లెట్లు? దొంగతనము వృత్తిగాఁ గలయిట్టివారల నంద ఱను ననుబోటివారికి ధర్మమునందు నిలుపవలసిన విధమెట్లు? దేవేశ్వరా! క్షత్రియులమగు మాకు నీవు బంధుభూతుండవుకాన, దీనినివి నఁగుతుక పడెడు నాకుఁ దెలియఁజెప్పుము' అని యడిగెను.

ఇంద్రుఁడు 'దొంగవృత్తి గల తెగలవారందఱును తలి దండ్రులకును, పెద్దలకును, ఆచార్యులకును, ఆశ్రమముల వసించు వారికిని శుశ్రూషఁ సేయవలయును. ఆ దొంగలందఱును రాజు లకును శుశ్రూషఁ సేయవలయును.* దేశమునకు సామాన్యముల యిన ధర్మకార్యములును వారికి ధర్మముగా విధింపఁబడియున్నవి. వారు పితృకర్మములు చేయవలయును. (లోకమున కుపయుక్త మగు కొఱకు) బావులు త్రవ్వవలయు. చలిపందిరులు వెట్టవల యును. బ్రాహ్మణులకు శయనములునుఁ గాలమునకుఁ దగిన దానములు నొసంగవలయును. అహింసయు, సత్యమును, అక్రో ధముఁ లేమియు బ్రాహ్మణులకును దాయలకును వలయునవి యొసంగి రక్షించుటయు, దారపుత్రులను బోషించుటయు, పరి శుద్ధియు ద్రోహముఁ లేమియు, సమస్త యజ్ఞములందు బ్రాహ్మ

* 'దేశధర్మ క్రియాశ్చైవ' అని (దా.మూ) 'వేదధర్మ క్రియాశ్చైవ' అని (బొ. మూలము.) వేదములందుఁ జెప్పఁబడిన ధర్మకార్యములు అని యర్థము.

ణులకు దక్షిణల నొసంగుటయు, నీతెగలలో ధర్మము గోరువాఁ డొక్కొక్కఁడు నాచరింపవలసినవి. అట్టివి వారందఱును జేసి మిక్కిలి ధనములను నొసంగవలయును. ఇవియు నిట్టి కర్మములును తొల్లి యీతెగలవారికి విధింపఁబడెను. ఇవియేకాక తక్కిన లోకులకెల్ల విహితములయిన కర్మములుగూడ నీతెగ వారికిని గర్తవ్యములగును' అనెను. మాంధాత 'మనుష్యలోక మందు సమస్త వర్ణములయందును సమస్తములయిన యాశ్రమములందును నట్టి దొంగబ్రతుకుగలవారు మాఱుధర్మముల మటేఁగి చూపట్టుచున్నారు' అనెను. అందులకు నింద్రుఁడు, 'రాజుల దుర్బుద్ధివలన దండనీతి నశించియు రాజధర్ములేకయుఁ బోవఁగా ప్రాణులన్నియు మిక్కిలియుఁ దడఁబాటు నొందుచున్నవి. ఈకృతయుగము గడచిపోవఁగా నాశ్రమములు తాఱుమాఱగును. అప్పుడు లెక్కలేని సన్న్యాసులు, నానావిధములయిన తెగచిహ్నములను ధరించి చూపట్టుదురు. జనులు సనాతనములయిన ధర్ములకుఁ బెడచెవులంబెట్టి వందలకొలఁదిని కామక్రోధములచేఁ బ్రేరితులై తప్పుదారిని ద్రొక్కుదురు. మహాత్ములయినరాజులు దండనీతినిగొని పాపమును దొలఁగఁ బుచ్చఁగా నపుడు శాశ్వతమయిన పురాతనధర్ము వర్ధిల్లి చలింపక కుదురుకొని యుండును. లోకుల కందఱికిను బెద్ద యగురాజు నెవఁ డవమానించునో వాని * దానములును కర్ములును జదువును నెందును గొంచెమేనియు ఫలింపదు. మను

*'నతస్యద త్తం నకృతం నశ్రుతం ఫలతిక్వచిత్' అని (దా.మూ.) 'నతస్య దత్తం నహుతం నశ్రాద్ధం ఫలతేక్వచిత్' అని (ఔ.మూ.) వాని దానములును హోమములును బిత్ర్యకర్ములును ఫలింపవు.

మ్యులకధిపతియు దేవతలర జోనివాఁడును,మహాకాంతిఁ దళుకొత్తువాఁడును,ధర్మకామండు నగురాజును దేవతలునుమిక్కిలిగా గౌరవింతురు. భగవంతుఁడు బ్రహ్మ, లోకము నంతయు సృజించి ధర్మములు ప్రవృత్తి నివృత్తులఁ బాలించుకొఱకు క్షత్రియునిఁ గోరెను. ఎవఁడు తన బుద్ధిచేత జనులు జరపుచున్న ధర్మము గతిని బాలించుచుండునో యట్టిపురుషుఁడు నాకు మాన్యుఁడును బూజ్యుఁడునగును. అట్టివాఁడే క్షత్రియుఁడు. అట్లు చేయుటయే క్షత్రధర్మము' అనెను.

ఇట్లావిష్ణుదేవుండు చెప్పి యంత దేవతాగణములు పరివేష్టింప శాశ్వతంబును నవ్యయంబు నగుతన పదంబునకు వేంచేసెను. ఇట్లు ధర్మము చక్కఁగా నాచరింపఁబడినదై ప్రవర్తించుచుండఁగా తెలివియు మిక్కిలి చదువును గలవాఁడెవఁడు క్షత్రియుని నతిక్రమింపఁగలఁడు?.దారియందుఁ బోవు గ్రుడ్డివారివలె, నీతిమాలిన ప్రవృత్తియు నివృత్తియు నడుమనే నాశమునొందును. ఆదికాలమందు బ్రహ్మదేవునివలననుండి వెలువడి ప్రవర్తించుచున్నదియు, పూర్వులకెల్లఁ బెనుప్రాపయినదియు నగు ధర్మచక్రమందు నీవు వర్తింపుము. నీవందుల కెంతయుఁ దగుదువని యెఱుంగుదును' అనెను. ఇది యఱువదిమూఁడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు వర్ణాశ్రమ ధర్మములను జెప్పుట.

ధర్మరాజు 'పితామహా! మనుష్యుల కందఱికిను నాలుగాశ్రమములున్నవని మునుపు చెప్పఁగా వింటిని. దానిని విశ

దముగా మీఁదు మిక్కిలి తెలియఁగోరుచున్నాను. దానినిగుఱించి సవిస్తరముగా నుపన్యసింపుము' అని యడిగెను.

భీష్ముఁడు 'యుధిష్ఠిరా! ఈలోకమునందు సజ్జను లాచరించు ధర్మములన్నియు నాకుఁ దెలిసియున్నట్లే నీకును దెలిసియున్నవి. ధార్మికోత్తమా! ఇతరములయిన లింగములను (ఆశ్రమములను) ఆచరించువారలవలనరాజునకుఁ గలుగుధర్మము నడుగుచున్నావు. అది చెప్పెదను వినుము. ఈ నాలుగాశ్రమములవారి ధర్మములియన్నియును సదాచారపరులయిన రాజులను సంబంధించుచున్నవి. యుధిష్ఠిరా! కామద్వేషములు లేనివాఁడై సమస్తప్రాణులయందును సమదృష్టిగలిగి దండనీతిని జెల్లించురాజు భైక్ష్యాశ్రమఫలమును (అనఁగా బ్రహ్మచర్యఫలమును) బొందుచున్నాఁడు. దానమును విసర్గమును నిగ్రహానుగ్రహములును దెలిసి శాస్త్రోక్తములగు విధులచొప్పున నడచుకొనుధీరుఁడగురాజు, గృహస్థాశ్రమము ఫలమునొందును. అర్హులయిన వారిని వేఱువేఱ విభజించి తెలిసికొని పూజించుమ వారికి వలయునవి పంచియిచ్చుచు నుండురా జెచ్చటను భైక్ష్యాశ్రమము ఫలమునొందును. జ్ఞాతులను సంబంధులను మిత్రములను నాపరులనుండి తనశక్తికొలఁది నుద్ధరించుచుండురాజు వానప్రస్థాశ్రమము ఫలము నొందును. మనుష్యులయందు ముఖ్యులయినవారిని యతులందు మిన్నలయినవారిని మాటిమాటికి సత్కారము చేయుచుండురాజు వానప్రస్థాశ్రమఫలమునొందును. పితృయజ్ఞమును భూతయజ్ఞమును మనుష్యయజ్ఞమును దేవయజ్ఞమును ననెడి వీనిని విపులముగాఁ బ్రతిదినమును జేయుచు నతిథులను దక్కినప్రాణులను నంతరువులకొ

లఁదిని వేఱువేఱనెఱింగి యర్చించునట్టి రాజు వానప్రస్థాశ్రమఫల మును బొందుచున్నాఁడు. శిష్టులను గాచుకొఱకు పరరాజ్యము లను మర్దించురాజును దానినే పొందును. ప్రాణుల నన్నింటిని బరిపాలించుటవలనను,తనరాజ్యమును జక్కఁగా నేలుటవలనను, రాజు తానెందఱను బాలించెనో యన్నియజ్ఞములు చేసిన ఫల మునే కాక సన్న్యాసాశ్రమఫలము నొందును. వేదాధ్యయన మం దెడతెగని ప్రీతికగలిగి, ఋమయు, నాచార్యునిఁ బూజిం చుటయు, ఉపాధ్యాయులకు శుశ్రూషసేయుటయు, బ్రహ్మచర్యా శ్రమఫలము నొసఁగును. ప్రతిదినమును వలయుమంత్రములను జపించుచు, నెప్పుడును దేవతలను బూజించుచు నుండురాజు య త్యాశ్రమఫలమును బొందును. ప్రాణమును బందెముగా నొడ్డు యుద్ధ మనెడిజూదమందు మరణమో లేక రక్షణమో యని నిశ్చయించు కొన్న రాజు సన్న్యాసాశ్రమఫలము నొందును. ఎప్పు డు నేప్రాణులయందును వంచనయు ధూర్తత్వమును నెఱ పనిమార్గమందు వర్తించునట్టి రాజు సన్న్యాసికి సముఁడగును. మూఁడువేదములను నధిగమించినవానప్రస్థు లగుబ్రాహ్మణుల యందు విస్తారములగు ధనములనొసంగు రాజు వానప్రస్థపదవి నొందును. * సమస్తభూతములందు దయఁజూపుచు క్రూరత్వ మెంతమాత్రమును లేకుండురాజు సమస్తాశ్రమములపదవినిబొం

---

* 'సర్వభూతేష్వనక్రోశం కుర్వత స్తస్యభారత । అనృశంస్య ప్రవృత్త స్య సర్వావస్థంపదం భవేత్' అని బౌ. మూ. 'ఏవం కుర్వత స్తవ భారత । అనృశంస్యే ప్రవృత్తస్య నియతః పుణ్యసంచయః' అని (దా. మూ) ఇట్టి వాఁడ వగునీకు పుణ్యములు తప్పక ప్రోవుగొనుననియర్థము. అయిన నీపాఠ మ ప్రస్తుతము.

దును.*భిన్నలయందుఁగానిబెడ్డలయందుఁగాని యేయవస్థయందును గనికరముచూపురాజుసర్వాశ్రమములపదవిని బొందును.బలవంతముగాఁ బీడింపఁబడి,†తన్నుశరణుఁజొచ్చినప్రాణులను రక్షించురాజు గృహస్థాశ్రమపదవిని బొందును. స్థావరజంగమము లగుప్రాణుల నెల్లవిధములను రక్షించుటయు యోగ్యతకుఁ దగురీతిని బూజించుటయు గృహస్థధర్మపదవి నొసంగును. అన్నలభార్యలను, దమ్ములను భార్యలను, అన్నదమ్ములను బుత్రులను, మనుమలను, శిక్షించుటయు రక్షించుటయు రాజునకు గృహస్థధర్మములగును. మఱియు నది యపారమయిన తపంబునగును. సాధువులును బూజనీయులు నగువారిని బూజించుటయు నాత్మజ్ఞానసంపన్నులయినవారిని బాలించుటయు గావించురాజు గృహస్థాశ్రమపదవినిబొందును. ఒక్కొక్కయాశ్రమమందును గలమనుష్యులకుఁ దనయింట నవ్వారిగా భోజనము పెట్టించుట రాజునకు గృహస్థధర్మమగును. బ్రహ్మ సృజించిన ధర్మములందు యథార్థముగా వర్తించుచుండు నట్టిరాజు, సమస్తాశ్రమముల పుణ్యఫలమును బొందుచున్నాఁడు. సుగుణము లెప్పుడు నేరాజునందు నశింపకుండునో యతనిని సమస్తాశ్రమములపదవి గలవానినిగాఁ జెప్పుదురు. పూజ్యము లయినయధికారస్థానములు గలవారిని, పూజ్యములయిన కులములవారిని, వయసుచేతఁ బూజ్యులయిన

---

*'బాలవృద్ధేషు కాంతేషు సర్వానస్థంయుధిష్ఠిర। అనుక్రోశక్రియాపార్థ సర్వానస్థంపదంభవేత్' అని బొ.మూలము. 'పార్థ ధర్మ ఏషసనాతనః' అని దా. మూలము. ఈపాఠమును బ్రకృతముగాదు.

†'శరణాగతేషు కారవ్య కుర్వక్ గార్హస్థ్యమావసేత్' అని బొ. మూ. 'కుర్వక్ కారుణ్య మాచర' అని దా.మూలము.ఇది ప్రకరణానుగుణముగాదు.

వారిని, దగురీతిని గారవించు రాజు సర్వాశ్రమముల నాచరించి నట్టి వాఁడగును. దేశధర్మములను గులధర్మములను బాలించు చుండురాజు, సర్వాశ్రమఫలముల నొందును. తగినకాలములం దు సాధువులయినవారికి సంపదలను గానుకలను నొసంగురాజు సకలాశ్రమముల పదవులను బొందును. అపాయమును భయ మును బయికొన్నను సకలమనుష్యుల ధర్మములందుఁ గన్ను గలిగియుండు రాజు, సకలాశ్రమముల ఫలమునొందును. లోకమం దేరాజుపాలనమందుఁ గలజనులు ధర్మమందు సమర్థు లై ధర్మమును జేయుదురో యామనుష్యుల ధర్మములందుఁ బాతికపా లారాజునుజేరును. ధర్మమునందే యిక్కిలియాసక్తు లై ధర్మపరులగు మనుష్యులను రక్షింపనిరాజు వారల పాప మును బొందును. జగమును బరిపాలించుటయందు రాజునకు సహాయులై యుండువారందఱును లోకులు చేయుధర్మము నం దొకపాలును బొందుదురు. మనము సేవించుచున్న గృహా స్థాశ్రమమును, ఆశ్రమములందు నిక్కిలియు నెక్కుడయిన దని చెప్పెదరు. ఈనిర్ణయము నిక్కిలి స్పష్టముగానే యు న్నది; మఱి పావనమునగును. ప్రాణులను దన్నుంబోలె నెన్నికోపమును గెలిచి దండమును జెల్లించు రాజిందు సం దును సుఖమొందును. * సత్యమనెడు జలమును, శీలమనెడి

---

* 'ధర్మోచ్ఛ్రితా సత్యజలా శీలయష్టిర్దమధ్వజా । త్యాగవాతాధ్వగా శీఘ్రా నౌస్తయా సన్తరిష్యతి' (దా. మూలము) 'ధర్మేస్థితా సత్త్వదీర్ఘా ధర్మ సేతుపరాటకా । త్యాగవాతాధ్వగా శీఘ్రా నౌస్త్వాం సంతారయిష్యతి' అని జె. మూలము. ధర్మముల (సెడుజల మ)ందున్నదియు సత్త్వమే ఓడనడపు వాని బలముగాఁగలదియు, ధర్మసేతువులను (అనఁగా కాస్తరీములనెడు) కట్టు

త్రెడ్డును, దమమనెడి ధ్వజముగలిగి, త్యాగమనెడు వాయువుచే దారిని బోవునదియు వేగముగలదియు నగుధర్మమనెడు నావనెక్కి సంసారసముద్రమును రాజు దాఁటఁగలఁడు. సమస్త విషయములందు సంగముపీడి కామము మనస్సునందు లేక మంచి నడవడులతోఁగూడి సత్యసంధుం డగుమనుష్యుఁ డీబ్రహ్మనుఁనొందును; మనంబునడంచి నిష్కలంకమయిన భావముతో నీవు ప్రజలను బాలించితివేని యుత్తమధర్మము నొందుదువు. అనఘా! సమస్తలోకులను, విశేషించి వేదాధ్యయనముచేయువారును సత్కర్మపరులు నగుబ్రాహ్మణులను రక్షించుటయందు బ్రియత్నము గలిగియుండుము. రాజు ప్రజలనుబాలించుటవలన నడవులం దాశ్రమములనుండి సాధువు లాచరించు ధర్మమున కంటె నూఱుమడుంగు లెక్కుడు ధర్మమును బొందుచున్నాఁడు. ఇట్లు నీకు ధర్మమునకుం గలపలుదెఱుంగులను జెప్పితిని. శాశ్వతములును బూర్వమునుండి యాచరింపఁబడుచు వచ్చునవియునగు * రాజధర్మముల ననుష్ఠింపుము. నీవు ప్రజలను బాలించుటయం దాసక్తుఁడవగుదువేని నాలుగువర్ణములయు నాలుగాశ్రమములయు ధర్మముల నంతయుఁ బొందుదువు' అనెను. ఇది యఱువదియేనవయధ్యాయము.

మోక్షులుగలదియు, త్యాగమనెడు గాలిచే దారినిపోవునదియునగు రాజధర్మమనెడి నావనెక్కఁగా, అది నిన్ను (అనఁగా రాజును) సంసారసముద్రమును దాఁటించును' అని యర్థము.

* 'అనుతిష్ఠత్వమేనం వైపూర్వదృష్టంసనాతనమ్' (బొ. మూ) యుధిష్ఠిర త్వమేనం వైపూర్వం దృష్టం' అని(దా. మూ).

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు లోకమునకు రాజుండుట వలని గుణమును లేమి వలని దోషమును నిరూపించుట.

ధర్మరాజు 'పితామహా! నాలుగాశ్రమములును నట్లేనాలుగు జాతులును జెప్పితివి. రాష్ట్రమునందలి జనులకు ముఖ్యమయిన కార్యమేమియో చెప్పుము' అనెను. అందులకు భీష్ముఁడు 'రాజు నభిషేకముచేయుటయే రాష్ట్రమునకు మిక్కిలి ముఖ్యమయిన కృత్యము. రాజును, సైన్యమును లేనిరాజ్యమును, దొంగలు కీడ్పఱుతురు. అరాజకము లయినరాజ్యములందు ధర్మము నెలకొనియుండదు. మఱియు జనులు నొకరినొకరు భక్షింతురు. అరాజకమగు రాజ్య మేవిధమునను నిందింపఁదగినది. రాజును మొక్కుట యింద్రుని మొక్కుటయె యగునని శ్రుతులు చెప్పుచున్నవి. సంపదనుగోరిన మనుష్యుఁడు రాజు నింద్రునిం బోలె నారాధింపవలయును. అరాజకమయిన రాజ్యములందు వసింపరాదని వేదము విధించుచున్నది. అరాజకమయిన రాజ్యమందగ్నియు హవిస్సును వహింపవు. రాజును వీరులును లేనియొక రాజ్యముండఁగా మిక్కిలి బలవంతుఁ డగువాఁడొకఁడు వాని నేలుటకై వచ్చెనేని యతని నెదుర్కొని పూజించుట మిక్కిలియు మంచిది. ఇదియేమంచి యాలోచనము. అరాజకముగా రాజ్యముండుటకంటె పాపము మఱొక్కటిలేదు. కాఁబట్టి యాశూరుఁడు దీనిని జక్కఁగాఁ బాలించినయెడ సమగ్రమయిన క్షేమముగలుగును. ఇట్లుగాక బలవంతుఁ డయినయాశూరునకుఁ గోపము కలిగించినయెడల రాజ్యమును నిశ్శేషముగా

నతఁడు నశింపఁజేయును. పాలుపిదుకుటకుఁ గష్టమైన యావు మిక్కిలియు కాటీయపడుచున్నది. సులువుగా పిదికెడి యావు ను జనులు హింసింపరు. వేఁడిచూపకయే వంగునట్టి వస్తువునకు జనులు వేఁడిమిచూపరు. తానే వంగెడు మ్రాఁకును వంచుటకై జనులు కష్టపెట్టరు. ఈ యుపమానమును దెలిసిన బుద్ధిమంతుఁడు బలవంతుని యెడఁ దానే నమ్రుఁడై యుండవలయును. బలవంతునికిఁజూపు మొగ్గుకు నింద్రునికిఁ జూపిన మ్రొక్కే యగును. కాఁబట్టి క్షేమమునుగోరు మనుష్యుఁడెప్పుడును రాజు నేర్పఱుచుకొనవలయును. రాజులేని జనులు, ధనవాంఛయు, దారభోగమును బడయుఁజాలరు. అరాజకమయిన రాజ్యమందు పాపుఁడగువాఁడు పరులసొమ్ము నపహరించి సంతోషించును. వీని ధనమును దక్కినపాపు లాక్రమించుకొందురు. ఇట్లుండఁగా రాజ్యమునకు రాజునుగోరక పాపాత్ములగు మనుజులును క్షేమమును బడయుట యేసమయమందును సాధ్యముగాదు. ఒకని ధనము నిరువురును, నిరువురదానిని వేఱొకెక్కండ్రును నపహరింతురు. దాసత్వమునకుఁ దగనివానిని దానునిఁగాను జేయుదురు. బలవంతముగా స్త్రీల నపహరింతురు. ఈ కారణమును బట్టియే దేవతలు రాజుల నేర్పఱిచిరి. దండమును జెల్లించు రాజులోకమున లేనిచో నీటియందుఁ జేపలుంబోలె బలవంతులు బలహీనులను మ్రింగివైతురు. పూర్వకాలమునఁ బ్రజలు రాజులేని కారణముంబట్టి, నీటియందలి చేపలు కృశించిన చేపలంబోలె నొకరినొకరు భక్షించి నాశమునొంది రని వినియున్నారము. పిదప నాజను లొక్కటిగాఁజేరి 'కటువుగాఁ మాటలాడు వానిని, కటువుగా దండించువానిని, పర

భార్య నపహరించువానిని, తొలఁగఁ బుచ్చువలయును. మనము చేసికొన్న యీ యొడంబడికను మీఱి నడచువానిని దొలఁగఁ బుచ్చువలయును' అని గట్టిగా నిర్ణయించుకొనిరి. ఇట్లు భేదము లేక యన్ని జాతులవారికిని నమ్మిక కలుగఁగోరి తాము చేసి కొన్న సమయమునకుఁ దగునట్లుగా నా ప్రజలు నడచుకొనుచు వచ్చిరి. ఇట్లుండియు ప్రజలు, సుఖమునొందక యూ ర్తులై యంద ఱు నొక్కటిగాఁగూడి బ్రహ్మకడకుఁబోయి 'మహాత్మా! రాజు లేని కారణమున నాశము నొందుచున్నారము. మమ్ము బరిపా లించుటకుఁ దగిన రాజును బంపుదువేని మేమందఱు మతనిని పూజించుచు వచ్చెదము' అని ప్రార్థించిరి. బ్రహ్మయు, మనువును వారలకు రాజుగా నుండునట్లు లాజ్ఞాపించెను. మను వందులకు సంతోషము నొందక, 'రాజ్యమునేలుట మిక్కిలియు దుష్కర ము; అందును నెప్పుడును దప్పనడకలుగల మనుష్యులయెడ విశేషించి యిది దుష్కరముగాన యీ పాపకార్యమునకు నేను భయపడుచున్నా'నని యా ప్రజలకుఁ జెప్పెను. ప్రజ లామను వునుజూచి ' మనూ ! నీవు భయపడవలదు, మేము నీకు వలయు ధనము వృద్ధిఁ బొందించెదము. పసులందును బంగారమందును నేబదింట నొక పాలును, ధాన్యమందుఁ బదింట నొక పాలును, బొక్కసమును బెంపొందించుటకుఁగాను నిచ్చెదము. వివాహ ములు పొసఁగినపుడు శుల్కముమాట కలిగెనేని, మిక్కిలి చక్కని కన్నియను నీకు నిచ్చెదము. ఇంద్రుని దేవత లను సరించునట్లు, మాయందు ముఖ్యులయినమనుష్య లాయుధము లను వాహనములనుగొని నీవెంట ననుసరించి రాఁగలవారలు. రాజా! ఇట్లు పరు లెదిరింపఁ దగనిబలమును బొంది, ప్రతా

పము మెఱసి వెలుంగునీవు, కుబేరుఁడు రాక్షసులనుంబోలె మమ్ము నెల్ల సుఖముండఁ జేయుము. నీచేత సురక్షితులమై మేము చేయు సకలధర్మములందును, నాలుగింట నొకపాలు మిమ్మే జేరవల యును. రాజా! ఏశ్రమయులేక యిట్లుచేరు వెనుధర్మముచేత వేరిమినొంది రాజుగా వెలుంగునీవు, ఇంద్రుఁడు దేవతలంబోలె, మమ్ము సకల కార్యములందును బరిపాలింపుము. తపింపఁ జేయు సూర్యునివలె శత్రువులజయింప వెలువడి వారలకావరము నడంచి యెప్పుడును మాకు ధర్మమును గలిగింపుము' అని చెప్పిరి. ఇట్లు వారు చెప్పఁగా మహాతేజుండును మహాకుల ప్రసూతుండును మహాపరాక్రముండునై తేజంబున జ్వలించు చున్నట్లున్న యామనువు, ఆమహాజన సమూహము బలసికొలువఁ బయనమయ్యెను. ఇంద్రుని మహత్వము గాంచిన దేవతలుం బోలె నామనువు మహిమను గాంచిననాలుగువర్ణములవారును నాశ్రమములవారును మ్లేచ్ఛులును, మ్రిచ్చులును మొదలుగాఁ గలవారు వడఁకుచుఁ దమ మనస్సును స్వధర్మముం దుంచినవా రయిరి. పిదపఁ బాపములనుబోఁగొట్టి ప్రాణులను స్వధర్మము లందుఁబూనికగలవారిం గావించి వర్షించుమేఘముంబోలె మను వు భూమిచుట్టు సంచరించెను. క్షేమమునుగోరిన భూమియందలి మనుష్యులు, జనులకు హితముగోరి యిట్లు మొదట రాజునే యేర్పఱుప వలయును. దేవత లింద్రునివలెను, శిష్యు లాచార్యుని వలెను, సమీపమందున్న ప్రజలు రాజు నెప్పుడు భక్తితోడఁగొని మ్రొక్కవలయును. ఈలోకమందు, తన జనముచేతఁ బూజి తుండగు మనుష్యునిఁ బరులును బహుమానింతురు. తనవారి చేత నవమానింపఁబడిన వానిని పరులును బరిభవింతురు. రాజు

నకుఁ బగవారిచేఁ గలుగుపరిభవ మెల్లవారికిని దుఃఖము గానే యుండును. కాఁబట్టి, ఛత్రములు, వాహనములు, వస్త్ర ములు, ఆభరణములు, భోజనము, పానములు, గృహములు, ఆస నములు, శయనములు, మఱియుఁ దక్కిన యుపకరణముల నన్నిం టిని రాజున కొసంగవలయును. అట్లు సేయుటవలన రాజు, ప్రజలను మఱింతఁ గాపాడ శక్తుండగును; ఎదిరికిఁ జెనకరాని వాఁడునగును. అతఁడు చిఱునవ్వుదొలఁక మాటాడవలయును. తనతో మాటాడువారితో మధురముగా ప్రతి మాటాలాడ వలయును. మఱియు నెనరుగలిగి, పెద్దలయందు దృఢభక్తితోఁ గూడి, జితేంద్రియుఁడై వారివారికి నీఁదగినది పంచియిచ్చు వాఁడై యుండవలయును. తన్నుఁ జూచువాని మృదువుగను నింపుగను జక్కఁగను జూడను వలయును' అనెను. ఇది యఱు వదియాఱవయధ్యాయము:

రాజధర్మపర్వము.

భీష్ముఁడు వసుమనస్సునకు బృహస్పతిచెప్పిన రాజ గుణములను ధర్మరాజునకుఁ జెప్పుట.

ధర్మరాజు 'పితామహా! మనుష్యుల కధిపతియైన రాజును బ్రాహ్మణులు దైవమని చెప్పుటయేల?' అని యడుగఁగా, భీష్ముఁడు 'ఈ విషయమందు వసుమనస్సు బృహస్పతి యనుపీరికి జరిగిన సంవాదమగు పురాతనమయిన యితిహాసము నుదాహ రింతురు. వసుమనసుఁడను రాజొకఁ డుండెను. అతఁడు కోసల దేశాధిపతి; మిక్కిలి బుద్ధిమంతుఁడు. అతఁ డొకప్పుడు ప్రజ్ఞా సంపన్నుండగు బృహస్పతిని బ్రశ్నముసేయుటకుఁ బోయెను.

ఆరాజు వినయవిధి నెఱింగినవాఁడుగాన బృహస్పతి కడకుఁబోయి ప్రదక్షిణముచేసి యథావిధి నమస్కరించి యభివాదనాదులయిన మర్యాదల నెల్లఁ గావించి సర్వలోకహితపరుఁడై రాజ్యపరిపాలన విధి నడుగఁజొచ్చెను. ఆరాజు ప్రజలసుఖము నరసి యూ ధర్మశీలుం డగుబృహస్పతితో 'మహాప్రాజ్ఞా ! ప్రాణులు దేని చేతఁ బెరుఁగుచున్నవి ? దేనిచేత నశించుచున్నవి ? ఎవని నర్చించినయెడ నవి యవ్యయంబగు సుఖమునొందును ? దేవర్షి ! ఈ విషయమును ధర్మార్థకామములను గుఱించిన సందేహములు తొలఁగునట్లు నాకుపదేశింపవలయును' అని యడిగెను. అందులకు నా మహాప్రాజ్ఞుఁడు బృహస్పతి రాజులయెడఁ జూపవలయు గౌరవమును రాజ్యమును వృద్ధిఁబొందించు విధమును దండనీతి చొప్పున నతనికిఁ జెప్పవాఁ డయ్యెను.

'రాజా ! లోకుల ధర్మమునకెల్ల మూలము రాజుగాఁ జూపట్టుచున్నాఁడు. రాజువలని భయ మొకటిచేతనే ప్రజ లొకరి నొకరు భక్షింపకున్నారు. మర్యాదమాలి పరుల ధనమునకై యువ్విళ్ళులూరుచు లోకమంతయు నుండును; రా జట్లు గానీక వానిని ధర్మముచే శుద్ధముగావించి తానును బరిశుద్ధుండయి వెలుంగుచున్నాఁడు. రాజా ! చంద్రుఁడును సూర్యుఁడును నుదయింపనియెడల, ప్రాణు లొకరినొకరు గాననేరక వెనుఁజీఁకటి యందు మునుంగునట్లును, నీరు సరిగినచోటఁ జేపలును, కలకలములేని (జంకులేని) చోటఁ బిట్టలును విచ్చలవిడిఁ గ్రీడించుటయేకాక, కొంతవడికి నొండొంటి నెదిరించికొట్టుకొని పలువిధముల హింస గావించుకొనుచు సందేహములేక నాశమునొందునట్లును; ఈ ప్రజలును రాజులేనిచో, మేపు గొల్లవాఁడు

లేని పసులుంబోలె, దిక్కుమాలి చీఁకటిని మునిఁగి నాశ మొందును. రాజు రక్షింపనిచో బలహీనుల ద్రవ్యమును బల వంతు లపహరించుటయే కాక, యెదిరించి వచ్చువారిని జంపి వైతురు. రాజు పరిపాలింపనిచో, పుత్రులు, భార్యలు ధనమును దక్కుంగల వస్తువులును, నశించుటేకాక యీలోకమందు 'ఇది నాది' అనుతలంపు నెలకొనఁజాలదు. ఎచ్చటను దొంగతనము జరుగును. రాజు పరిపాలింపనిచో, వాహనములును, వస్త్రములు నాభరణములును, పలువిధములయిన రత్నములును, పాపాత్ములు బలవంతముగా నపహరింతురు. రాజు పరిపాలింపనిచో, ధర్మము నాచరించువారిని బెక్కువిధములయిన యాయుధములచేతఁ గొట్టుటయే కాక, యధర్మమునుగూడఁ జేయుదురు. రాజు పరి పాలింపని యెడ, తల్లి, తండ్రి, పెద్దలు, ఆచార్యులు, అతిథి, గురువు ననుపీరిని గష్టపెట్టుదురు; చంపను జంపుదురు; కూపెట్టు తక్కిన జనులను గొట్టుదురు. ఈలోకము దొంగలమయ మగును. రాజు పరిపాలింపనియెడల, ధనవంతులగు జను లకు క్లేశమును బంధమును వధమును నేసమయమందైనను గలుగును. ఎవరును 'నాది' యను స్వతంత్రత నెఱఁగ జాలరు. రాజు పరిపాలింపనియెడ రాజ్యము పలువిధముల నశిం చును; ఈ లోకము దొంగలకు లోనగును. జను లకాలమున నశింతురు. రాజు పరిపాలింపనియెడ, వర్తకమును గృషియు నడవనేరదు; స్త్రీల వ్యభిచారమును దోషముగాదు. మూఁడు వేదములును ధర్మమును మునిఁగిపోవును. రాజు పరిపాలిం పనిచో, సంపూర్ణదక్షిణలు గలయాగములు యథావిధిని వర్తింపవు. వివాహములును సభయు జరుగవు. రాజు పరిపాలిం

పనియెడ నెద్దులును నావులయందు వర్తింపవు. పెరుఁగు కుండలును జిలుకఁబడవు. గొల్లపల్లెలును రూపుమాయును. రాజు పరిపాలింపనిచో, క్షణంబున లోకమంతయు భయమునొంది మనంబుల నడుంకుచు, బ్రజలను పూలి 'హా! హా!' యని నశించిపోవును. రాజు రక్షింపనియెడల, వత్సరముల కొలఁదిని జేయు సత్రయాగము లెట్టిభయమును లేక, విధ్యుక్తములగు దక్షిణలతో జరుగవు. రాజు పాలింపనియెడల, తపంబు చేయఁదగు బ్రాహ్మణులు, విద్యలందును వ్రతములందును దీక్షితులై నాలుగు వేదములను యథావిధిని నభ్యసింపరు. రాజు రక్షింపనియెడల జనులు మోహముచేత నెంతయుఁ గొట్టువడి ధర్మములను దిగవిడుతురు; మఱియు జంకుమాలి పరులధనముల నపహరింపనుంకింతురు. రాజు పాలింపనియెడల, మనుష్యులచేతనున్న ధనమును, వారిచేతనుండి దొంగలు మ్రుచ్చిలింతురు; ఎట్టి కట్టుపాటులును మాఱిపోవును; ఎవ్వరును భయముచేత బీడితులయి పరులెత్తుదురు. రాజు రక్షింపనియెడల నీతిమాలి తోఁచినట్లెల్ల జనులు నడతురు. వర్ణసంకరము కలుగును. రాజ్యమున దుర్భిక్షము పట్టును. రాజుచేత సురక్షితులగు మనుజు లెందును నెట్టి భయమును లేక యింటివాకిటి తలుపులను దెఱచికొని యిష్టము చొప్పునఁ బరుండి నిదురింతురు. ధర్మము తప్పనిరాజు భూమిని జక్కఁగా బాలింపనియెడ నెవఁడును బరుని చెడుపలుకులకే సైఁపఁడు. ఇఁక నేతితోఁ దాఁకుటను సోర్చుటయెక్కడిది? రాజు రక్షించినచో, నబలలగు పడఁతులు భయముమాలి సర్వాభరణములఁ గయిసేసి పురుషునిసహాయము లేక యెంటిమెయిదారిని బోవుదురు. రాజు రక్షించు కాలమందు, జను లొకరినొకరు

బాధింపక యాదరించుటయేకాక ధర్మమార్గంబునఁ బ్రవర్తింతురు. రాజు రక్షించుకాలమున బ్రాహ్మణులు మొదలయిన మూఁడువర్ణములవారును నియమముగలిగి విద్యలను గఱచుటయేకాక, నానావిధములయిన మహాయజ్ఞములను గావింతురు. వేదమును జీవనము మూలముగాఁ గొని జీవించెడి యీలోకమంతయు రాజు రక్షణమందు నెలకొనవలయును. రాజు తనవెనుబలముచేత, గొప్పదియగు భూభారమునుదాల్చి ప్రజలను రక్షించునేని, లోకము దోషములేక తెలివి దొలఁకుచుండును. ప్రాణుల యునికికిని లేమికిని రాజునునికియు లేమియునే వరుసగా బలీయమయిన కారణములు. కాన యట్టిరాజును బూజింపని వాఁడెవఁడు? లోకమునకంతయు సుఖము నొసంగునట్టి రాజు భారమును దాల్చుటయేకాక యతని హితమందును బ్రియమందును నెలకొనియుండువాఁ డీరెండులోకములను జయించును. రాజునకు మనస్సుచేతనయినను గీడుదలంచు మనుజుఁడు సందేహములేక యిహమందు దుఃఖపడుటయే కాక మృతుం డయిన పిదపను నరకమొందును. రాజుకూడ నొక మనుష్యుఁడేకదా యనియతని నెప్పుడుగాని యవమానించుట దగదు. 'రాజు' అని మనుష్యరూపముతో నొక పరమదైవమున్నదని తెలియవలయును. కాలమునకుఁ దగినట్లు, ఐదురూపములను జేయురాజు క్రమముగా అగ్ని, ఆదిత్యుఁడు, మృత్యువు, కుబేరుఁడు, యముఁడను నైదుదేవరూపములు గలవాఁడగును. దాపుననున్న దుర్మార్గులగు పాపులును, కటు వయిన తేజస్సుచేతఁ గాల్చునపుడు, అగ్నియగును; చారుల మూలమునఁ బ్రజల నెల్లవారిని గనుఁగొని వారల క్షేమములను గావించుకొని వర్తించునపుడు ఆదిత్యుఁ

డగును. రాజు మిక్కిలి కోపముతోడ నపరిశుద్ధులగు (దుష్టవర్తులగు) మనుష్యులను వారలపుత్రులతోడను, పౌత్రులతోడను, మంత్రులతోడను బలువిధములుగా నాశము సేయునపుడు మృత్యువగుచున్నాఁడు. అధర్మమున వర్తించు మనుష్యుల నెల్లవారిని క్రూరమయిన దండనములచే శిక్షించి ధార్మికులను రక్షించుచు వచ్చునపుడు యముఁడగును. ఎప్పుడును రాజుపకారపరులయిన జనులకు ధనములను వర్ధించి తృప్తిగావించియు విరోధుల పలుదెఱంగుల రత్నములను నపహరించియు, ఒక్కనికి సంపదనొసంగియు, నొకనివలననుండి ధనము నపహరించుచువచ్చునో యప్పుడు తఁడు లోకమునఁ గుబేరుఁడగును. క్రూరమయిన నడవడిలేక ధర్మమునుగోరుచు సమర్థుండగువాఁడు లోకమున రాజునందసూయలేకయు రాజుతోడ విరోధముచేయకయు నుండవలయును. పుత్రుఁడుగా నుండినను, చెలికాఁడుగా నుండినను, తోడఁబుట్టినవాఁడుగా నుండినను ప్రాణసముఁడుగా నుండినను రాజునకు విరోధముచేయుమనుజుఁడు సుఖము నొందఁజాలఁడు. గాలితోఁ గూడినదై మండుచున్న యగ్నియందు నగపడినను మిగతపడవచ్చును. రాజుకోపము బారిఁబడినవాఁడు కొంచెమైనను మిగతపడఁడు. మనుష్యుఁడు రాజు పాలనమందుఁగల యెట్టి వస్తువులనయినను మిక్కిలిదూరమున దిగవిడువవలయును; (కాని పొంతఁబోవరాదు). మృత్యువునెడ భయపడునట్లు రాజుధనమును గయికొనుటకు భయపడవలయును. వంచనమెయిఁజంపు జంత్రమునఁజిక్కిన మృగములవలె రాజుధనము నెత్తికొనఁ దొడంగు మనుష్యుఁడు తోడనే చంపఁబడును. ఈ లోకమందు బుద్ధిగలవాఁడు తన ధనమువలె రాజధనమును నెచ్చరికతో రక్షింపవలయును.

బుద్ధిమాలి రాజధనము నపహరించు మనుజులు, పలువిధమయి ఘోరమగు మహానరకమందుఁ జిరకాలము పడుదురు. రాజు, భోజుఁడు, విరాట్టు, సమ్రాట్టు, క్షత్రియుఁడు, భూపతి, నరపతి యనెడి యీపదములచేత స్తుతింపఁబడును. రాజును బూజింపఁద గనివాఁడెవఁడు? కాఁబట్టి క్షేమమునుగోరు మనుజుఁడు మనసును నింద్రియములును నడంచుకొని, మంచిబుద్ధియు ధైర్యమును సామర్థ్యమును గలవాఁడై యవశ్యము రాజు నాశ్రయింపవలయును. మంచిబుద్ధియుఁగృతజ్ఞతయుఁ గలిగి, పదవియు నింద్రియ జయమును బెద్దఱికమును దృఢభక్తియుఁ గలిగి, ధర్మమున నెలకొన్నవాఁడై తనస్థానమం దున్నట్టివాఁ డగుమంత్రిని రాజు పూజింపవలయును. దృఢభక్తిగలవాఁడును, ప్రజ్ఞాసంపన్నుఁడును, ధర్మజ్ఞుఁడును, జితేంద్రియుఁడును, గఱువతనము గలవాఁడును, శూరుండును బ్రసిద్ధుండు నయినమనుష్యుని రాజు పడయవలయును. *ప్రజ్ఞ మనుష్యుని గర్వితునిఁగాఁ జేయును. రాజు మనుష్యులను లోఁకువయినవారినిగాఁ జేయును. రాజు తనాశ్రయింప సుఖముఁజేయును. రాజు నెదిరించినవాని కెందును సుఖముగలుగదు. ప్రజలు రాజును దమ మొదటిశరీరముగాను రాజు ప్రజలను తనయెనలేనిశరీరముగాను భావింపవలయును. రాజులేని దేశమును దేశములేని రాజును నెలకొనియుండనేరరు. రాజు ప్రజలకు మనసును మంచిగతియు ప్రతిష్ఠయు పరమసుఖము

---

* ప్రజ్ఞా ప్రగల్భం కురుతేమనుష్యం । రాజాకృశానౌ వ్య కురుతే మనుష్యాన్' అని జౌ. మూలము. రాజా ప్రగల్భం పురుషంకరోతి । రాజాభృశం బృంహయతే మనుష్యాన్' అని దా. మూలము. రాజు మనుష్యులను ప్రగల్భులఁగాను గొప్పవారినిగాను జేయునని యర్థము.

నగుచున్నాఁడు. రాజును జక్కఁగా నాశ్రయించిన జనులీలోకమును బరలోకమును జయింతురు. తమము, సత్యము, సౌహృదము నను వీనితోడ భూమిని బరిపాలించుచు వచ్చు రాజును గొప్ప యాగములుచేసి మిక్కిలి పొగడ్తలొందిన స్వర్గమందు శాశ్వతమయిన పదమును బొందును' అనెను. బృహస్పతి యిట్లుపదేశింపఁగా రాజనత్తముఁడా కోసలాధిపతి వసుమనుండు ప్రజాపాలనమనెడు నుత్తమధర్మమును మిక్కిలి జతనంబుతోడఁ జేయుచువచ్చెను' అనెను. ఇది యఱువదియేడవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు ధర్మరాజునకు రాజనీతిని చెప్పుట.

ధర్మరాజు 'భారతా! రాజు విశేషించి చేయవలసిన కార్యమేమున్నది? జనపదము నెట్లు రక్షింపవలయును? శత్రువులను జంపవలసిన విధమెట్లు? వేగులవారి నెట్లు ప్రయోగింపవలయును? నాలుగు జాతులవారికిని భృత్యులకును భార్యలకును బుత్రులకును నమ్మిక గలిగింపవలసిన రీతియెట్లు?' అని యడిగెను.

అందులకు భీష్ముఁడు 'మహారాజా! మొదట రాజునుగాని రాజకృత్యము వహించువాఁడుగాని, జేయవలసిన రాజకృత్యముల నన్నింటి నాలించి వినుము. రాజెప్పుడును మొదటఁ దన్నును బిదపఁ దనశత్రువులను జయింపవలయును. తన్ను జయింపని రాజు శత్రువులను జయించుట యెక్కడిది? ఐదు విధములయిన యింద్రియములను నడంచుటయే తన్ను జయించుట యగును. ఇంద్రియములును జయించిన రాజే, శత్రువులను జయింప నమ

ర్థుఁడగును. కోటలయందును, ఎల్లలయందును, బట్టణపు నుపవ
నములందు, నుద్యానవనములందును, జనులుగూడు చోటు
లందును, రహస్యములయిన పెక్కుకందువ పట్టులయందును,నగ
రము నడుమను, అంతఃపురమునందును, గావఁదగు పదాతులను
నుంపవలయును. జడులవలెను, అంధులవలెను, బధిరులవలెను
బయికిఁ గనఁబడునట్టివారిని వేగులవారుగా నుపయోగింపవల
యును. వారందఱను(వారి శక్తులంబట్టి) చక్కఁగాఁ బరీక్షింపఁ
బడిన వారుగను, బుద్ధిమంతులుగను, ఆఁకలిదప్పులను శ్రమ
ములను సోర్చువారుగను, నుండవలయును. రా జెచ్చటికగలిగి
మంత్రులందఱయెడలను మూఁడువిధములగు మిత్రులయం
దును, బుత్రులయందును, బట్టణమందును, గ్రామమందును,
సామంతరాజులయందును, ఒకరినొకరు తెలిసికొనని విధమునఁ
జారులను నుంపవలయును.సమర్థుండగురాజు,అంగడులయందును,
విహారస్థానములందును, జనులు గూడుపట్టులందును, వీథులం
దును, తోఁటలందును, చిన్నతోఁటలందును, పండితులసం
ఘములందును, బోగమువాటికలందును, చత్వరములందును,
(రచ్చ చావడులందును) పసివాండ్లపట్టులందును, ధనవంతుల
యిండ్లయందును, బరులచేఁ బంపఁబడిన చారులను, దన చారు
లనుగాని వెదకి తెలిసికొని కొట్టి పుచ్చవలయును. * చారుఁడు
తెలియఁబడెనా రాజునకది మిక్కిలి హితమగును. రాజు తాను
తక్కువవాఁడుగాఁ దనకుఁ దోఁచినపుడు, మంత్రులతోడ నాలో

* ' చారేతువిడితే పూర్వం హితం భవతిభారత' అని మూలము. చారేచ
విహతే సర్వంహితం భవతిభారత' అని (దా. మూ.) చారుఁడు కొట్టుపడెనా
అన్నియుఁ గొట్టుపడునని యర్థము.

చించికొని తనకంటె నెక్కుడు బలముగల రాజుతోడ సంధిచేసి కొనవలయును. పెక్కులు శాస్త్రములుచదివినవారును విద్వాంసులును దండనీతిఁ జక్కఁగా నధిగమించినవారునునయిన బ్రాహ్మణులును క్షత్రియులును, వైశ్యులును రాజునకు మంత్రులుగా నుండవలయును. నీతియందు సందేహముగలరాజు, వీరలయందు మొదట నీతితత్త్వముల నెఱింగిన బ్రాహ్మణునిఁ, బిదప నీతినిపుణుండయినక్షత్రియునిని, పిదప శాస్త్రజ్ఞులును దనకుహితకారులు నగు వైశ్యశూద్రులనును నడుగవలయును. తనకే తక్కువయు నున్నట్లు తెలియకుండినను, సమర్థుండగురాజు పగరాజుతో సంధిని, దానివలనఁ దన కేదేని గొప్పప్రయోజనము కలుగఁగూడునేని, త్వరితముగాఁ జేసికొనవలయును. ధర్మమున రాజ్యమును రక్షించురాజు, సద్గుణము గలవారును మంచియుత్సాహము గలవారును, ధర్మజ్ఞులును, సాధువులునగు రాజులతోడను సంధి చేసికొనవలయును. తన్ను నపాయము పొరయుటయుఁ దాను నాశమునొంద నుండుటయు రాజు గనుఁగొనునేని, లోకమునకు విరోధులును మున్ను దన కపకారము చేసినవారును నగువారిని నేవిధమునను జంపవలయును. ఉపకారమును గాని లేక యపకారమును గాని చేయుటకు శక్తిలేనివాఁడును, ద్రోసిపుచ్చరానివాఁడును నగు రాజునెడ నుదాసీనుఁడై యుండవలయును. సమర్థుండును, వీరుండును, విద్వాంసుండును, సేనలబలిమిచే సుఖంబుండువాఁడును నగు రాజు, దండయాత్రయందుఁ గోరికగలఁడేని మొదటఁ దన పట్టణమును రక్షింపవలసినయుపాయములను బన్ని బంధువులు సుహృదులును లేనివాఁడును, వీరులచే నెదిరింపఁబడినవాఁడును,

ప్రయత్నశూన్యుఁడును బలహీనుఁడునుగాఁ దెలిసినరాజును గూర్చి దండ్రయాత్రకు నాజ్ఞ సేయవలయును. బలవీర్యములు తక్కువ యగురాజు, ఎక్కుఁడు వీర్యవంతుఁ డగురాజునకు లోప డక యెప్పుడును వానినిబట్టి లాగుటకు, వీలు చూచుచుండవల యును. వాని రాజ్యమును, శస్త్రములచేతను, అగ్నిచేతను, విషముచేతను, మూర్ఛనములచేతను బీడింపవలయును. ఆరాజు లకును వతనికి ననుంగు లయినమంత్రులకును, వివాదములను గలిగింపవలయును. రాజ్యము గోరునేని బుద్ధిమంతుఁ డగురాజు, బలవంతునితోడ నేసమయమందుఁగాని యుద్ధము వర్జింపవల యును. ఎప్పుడును సామమును, దానమును, భేదమును నెడుమూ డు పాయములచేఁ బడయందగినవస్తువును బండితుఁ డగురాజు పడసి సంతోషింపవలయు'ననియు బృహస్పతి చెప్పెను. అమితమయిన బుద్ధి గలరాజు ప్రజలనుగావంగోరునేని వారివలననుండి యూ తీంట నొకపాలు పన్ను పుచ్చుకొనవలయును. దండింపఁదగిన వాని వలననుండియు, నున్నత్తుఁడు మొదలగువారల నుండియు కొంచెమో యెక్కువగనో దండుగను, ప్రజలను రక్షింపఁగోరియే బలిమిని దీసికొనవలయును. ప్రజలను సందేహములేక తనబిడ్డల వలెఁజూచుకొనవలయును. వ్యవహారమునుజూచునపు, డేమనుజుని యందును, స్నేహబుద్ధిని బచరింపరాదు. రాజు సమస్తములయిన యర్థములను నెఱింగిన ప్రాజ్ఞులను వ్యవహారములను విచారిం చుటకు నేర్పఱుపవలయును. ఏలన రాజ్యము వ్యవహారముల యం దెప్పుడును, నెలకొనియున్నది. బంగారును రత్నములును నెత్తు గనులందును, ఉప్పు అళములందును, సుంకపు చావడి యందును, లేక ధాన్యములు మొదలయినవి యమ్ముచోట్లను,

ఎగుమతిచేయుచోట్లను, ఏనుఁగుల గుంపు లున్నచోట్లను, మంత్రులను, లేక యాప్తులను హితులు నయినమనుష్యులను, రాజు నియమింపవలయును. ఎప్పుడును లెస్సగా దండమును జెల్లించుచుపచ్చు రాజు, ధర్మమును బడయును. దండము రాజున కెప్పుడును తమ ధర్మమని పొఁగడఁబడుచున్నది. రాజు వేద వేదాంగములఁ గఱచినవాఁడును, జ్ఞానసంపన్నుఁడును,మహాతప స్వియు, నెప్పుడు దానపరుఁడును యాగశీలుండును నయి యుండ వలయును. ఈ గుణము లన్నియు రాజునం దెప్పుడును నెలకొని యుండవలయును. వ్యవహారమునకు హానికలుగునేని, రాజునకుఁ గీర్తియు, స్వర్గమును నెక్కడనుండి కలుగును? బుద్ధిమంతుఁడగు రాజు తనకంటె బలవంతుఁడయినరాజుచేతఁ బీడితుఁడగునపుడు, దుర్గమును బ్రాపునొందవలయును. విధిచొప్పున స్నేహితుల నాశ్రయించి పగవానిని గెలువనుంకించి సామము భేదము ననెడియుపాయములను దక్కుఁగల మార్గములను, వచ్చునట్లు చేయవలయును. రాజమార్గములందు, నడవివారి నుంపవలయును. వలసెనా గ్రామముల నున్న జనములనెల్ల వెలువరించి సమీప మందున్న పేఁటలయందు, వసింపఁ జేయవలయును. ధనవంతు లగు ప్రజలనును సేనాపతులనును బలుమాఱు నమ్మికగలుగఁ బుజ్జగించి వెలిదేశముల నున్న ప్రజలను చక్కఁగా రక్షితము లయిన కోటపట్టులందుఁ జొప్పింపవలయును. వెలుపలనున్న ధాన్యపురాసులను కోటలలోపలికి రాజు తానేతెప్పించుకొనవల యును. అది సాధ్యముకానియెడల వానినెంతయు నగ్నిచేతఁ గాల్చివేయవలయును. రాజు, (పగవారి ప్రజలయందు భేదము పుట్టించి) యతనిక్షేత్రములందుఁ గలపంటలను నాశముసేయుట

నైన పగవారిజనులను వశపఱచుకొనవలయును. లేదా, తనసేనల చేతఁగాని యూపంటలనెల్ల నాశముసేయింపవలెను. నదీమార్గ ములందు (శత్రువులు రాఁగూడిన) వంతెనలను బడఁగూల్పవల యును. తనరాజ్యమున కొలంకులందలి జలములనెల్ల వెలుపలికిఁ బాఱించి వ్యయింపవలయును. అట్లు చేయందరముగాని బావి మొదలగువానిని విషాదులచేఁ జెఱుపవలయును. ఆసమయ ము, రాఁగల కాలమును బరామర్శించి * మిత్రులకుఁ జేయవల సినకార్యము పొసఁగియున్నను దానిని బాటింపక, తనపగ వానికిఁ బగవాఁడును వానిని యుద్ధరంగమున మార్కొనఁజాలిన వాఁడునగు ననంతరదేశపురాజుతోఁ జెలిమిచేసికొని యుండవల యును. కోటలకుఁ జుట్టునున్నవియు నైత్యవృక్షములుకాక తక్కి నవియునగు చిన్నమ్రాఁకులనెల్ల వేఱుతోడ నఱికి వేయవల యును. ముదిరినమ్రాఁకుల కొమ్మలను గోయించి వైవవలయును. నైత్యవృక్షముల యాకులను నేవిధమునను గ్రిందఁబడకుండునట్లు వర్జింపవలయును. నైత్యవృక్షములు, దేవతలు, యక్షులు, రాక్ష సులు, భోగులు, పిశాచములు, పన్నగులు, గంధర్వులు, అప్స రసలు, రుద్రపరివారము లయినభూతములు, ననెడి వీనికి నునికి పట్టులయిన మ్రాఁకులను నఱికి కూల్పక వర్జింపవలయును. వార ణాసి యనుదేశమందు ప్రమథగణముల యధిపతియగు నికుం భునిచే సోదాసుం డనురాజు సేన చంపఁబడినట్లు వినుచు

---

* 'మిత్రకార్యే ప్యుపస్థితే' అని మూలము. 'యుద్ధకాలే ప్యుపస్థితే' అని (ఏదా. మూలము.)

న్నాము, *ప్రగండిక లనుపట్టులనును †ఆకాశజనను లనుపట్టు లను జక్కఁగాఁ జేయింపవలయును. శూలములుగల స్థాణువుల చేతను, మొసఁడులచేతను, తిమింగిలములచేతను, అగడ్త నిండింపవలయును. ప్రాకారపుగోడలందు కోటనుండి వెలుపలికిఁ బాఱు తెంచి పయిఁబడుటకై చిన్నచిన్నరంధ్రము లుంపవలయును. వానిని బెద్దద్వారములంబోలెఁ బదిలముగాఁ గాపాడుటకు వలయు జతనములు చేయింపవలయును. ఒక్కొక్కద్వారమం దును బెద్ద యంత్రములను శతఘ్నియనెడి యాయుధముల నెక్కించుటయేకాక వానిని గైవసముగా నుంచుకొనవలయును. కట్టియలను జేర్చిపెట్టుకొనవలయును. అల్లె బావులను ద్రవ్వింప వలయును. నీళ్లుగోరి పూర్వులు త్రవ్వినబావులను నల్లె శుద్ధము చేయవలయును. గడ్డిపులుతోఁ జేయబడిన యిండ్లనెల్లను మన్నుఁ బూయింపవలయును. చైత్రమాసముగా నుండినచో నగ్నిభయ ము లేకుండుటకై యాపచ్చికను గడ్డిరాసులను ముందుగానే యెత్తి వేఱొక పదిలమయినచోటఁ జేర్పింపవలయును. రాజు అగ్నిహోత్రము నొకటినిదప్పఁ బగటిపూఁట వేఱుగ్గిని దరికొల్ప నీయక యన్నము మొదలగువానిని సయితము రాత్రియందే పాకము చేయింపవలయును. దేశమును బలాబలములను నెఱిం గి కూడినంతవఱకు శూలచేతను, నిటికలచేతను, మంటిచేతను,

---

*'ప్రగండికలనఁగా బహుదూరమున వచ్చు జనులు చూడఁగూడునదియు వెలుపలి ప్రాకారపు గోడలయం దమర్పఁబడినదియునగు శూరస్థానము.

†ఆకాశ జననులనఁగా శూరులు తమ్మురక్షించుకొనఁ గూడినదియు వెలుప లనున్న శత్రువులను గూర్చి పెట్టను బ్రయోగింపఁ గూడిన ద్వారములు గల దియునగు, వెలుపలి ప్రాకారమందలి స్థానము.

నిండ్లనుగట్టుకొనునట్లు చేయవలయును. కమ్మరకొట్టములందును బురుటిండ్లయందును, నిండ్ల తక్కిన గదులందును నగ్ని సురక్షితముగా వెలుఁగవచ్చును.పగటిపూఁట నగ్నిని దరికొలిపెడివానికి మరణదండనము విధింపవలయును. మఱినగరమును రక్షించుటకై యట్టిదండనము నందఱుకుఁ దెలియునట్లు చాటింపను వలయును. బిచ్చగాండ్రను బండివాండ్రను, నపుంసకులను పిచ్చివాండ్రను, పయిరువృత్తిగలవారిని (కుశీలవులను) పట్టణము వెలుపలికిఁ దఱిమివేయవలయును. ఏలన వారు శత్రులు గాన వారలు లోపలనుండుట కీడునకేయగును. చత్వరములందును, (మంత్రి మొదలయిన సదునెనిమిది) తీర్థములందును, సభలందును, పౌరులగృహములందును రాజు తగినచారుల నుంపవలయును. రాజు,రాజమార్గములను విరివిగావింపవలయును. చోటునకుఁ దగినట్లు దుకాణములను జలిపందిరులను, నేర్పఱచునట్లు నాజ్ఞాపింపవలయును.ఆయుధములును ధాన్యములును భాండములును గజములును నశ్వములును సేనలును నుండునట్టి పట్టులనును, నగ డ్తలను, వీథులను,రహస్యమార్గములను, నెవ్వరు నొకప్పుడు నెఱుంగకుండునట్లు రహస్యముగా నుంచుకొనవలయును. పరసేనలచేతఁ బీడితుం డగురాజు ధనములను బోగ్యముచేసికొనవలయుటయేకాక నూనె, నేయి, తేనె, ధాన్యము, మందులు, అగ్ని, దర్భలు, ముంజిగడ్డి, ఆకులు, తెల్లు, లేకరులును, కరణములు, పచ్చిక, కట్టెలు, విషముపూసిన బాణములు, శక్తులు, యష్టులు,ప్రాసములు,పలుకలు, మఱి వీనినింబోని వెక్కువస్తువులనును, పోగ్యముచేసి యుంచుకొనవలయును. సమస్తములయిన యౌషధములను, మూలములను ఫలములను (విషవైద్యులు

శల్యవైద్యులు, వ్యాధివైద్యులు, మంత్రవైద్యులనెడి) నాలుగు విధముల వైద్యులను, విశేషముగా వెదికియుంచవలయును. నట్టువులను, నర్తకులను, మల్లులను మాయావులను చేర్చవలయును. వీరలుపట్టణము నలంకరింతురు; సమస్తజనులను సంతోషపఱతురు ఏమంత్రులవలననుండియు సేవకులవలననుండియు పట్టణజనులవలననుండియు, రాజువలననుండియు శంకగలుగుచున్నదో వారిని రాజు తనకు వశులను గావించుకొనవలయును. వారు తమ పనులునెఱవేర్చినంతనె రాజువారలను మిక్కుటమయిన ధనములచేత, సంతోషపెట్టవలయును. ఒక మనుష్యునికి, తగినకారణము లేకగాని, కోపముగొనికాని, శిక్షవిధించికాని, ద్వేషము కలిగించియుండినయెడల దగినధనములచేతను బలుదెఱంగుల మంచిమాటలచేతను వానిని సంతుష్టునిఁ గావించి శాస్త్రోక్తవిధిని రాజు తన ఋణమునీఁగికొనవలయును. రాజు రక్షింపవలసిన యేడంగములను నీవు తెలిసికొనుము—అవి, తాను, మంత్రి, బొక్కసము, దండము, మిత్రులు, నగరము, జనపదము అనునవి. ఈ యేడింటిమయమైనరాజ్యమును రాజు విశేషప్రయత్నమున రక్షించుచు రావలయును. షాడ్గుణ్యమును, త్రివర్గమును, త్రివర్గమునకంకె నెక్కుడయినదానిని దెలిసిన రాజీభూమి ననుభవించును. పరునితోడ సంధిచేసికొనుట, పరునెదుర్కొనఁ బోవుట, పరునితోఁబోరాడుట, పరునకు భయమును గలిగించు యాత్రను బ్రకటించుట, పరునిచోటను దనచోటను సంధిచేసికొనుట, కోటనుగాని శత్రువునుగాని యాక్రమించుట, యని యీయాఱుయును షాడ్గుణ్యమని చెప్పఁబడినవని తెలియుము. త్రివర్గమని చెప్పఁబడినదియు సావధానముగ వినుము

ము. రాజ్యమునకు క్షయము,(హీనత) స్థానము, (సమస్థితి) వృద్ధి (అధికత్వము) అను నీమూఁడును త్రివర్గమని చెప్పఁబడును. ధర్మము, అర్థము, కామము, అనునీమూఁడును, సనాతనమగు త్రివర్గమని చెప్పఁబడును. శాస్త్రప్రోక్తమయిన మంత్రశక్తి, ప్రభుశక్తి, ఉత్సాహశక్తి అను నీమూఁడు శక్తులును త్రివర్గమునకు నెక్కుడయిన సనాతనముగాఁ జెప్పంబడినవి. కార్యము, కారణము, కర్తయనెడి మూఁడును, త్రివర్గమునకంటె మిక్కిలిమేలయినవిగాఁ జెప్పఁబడునని తెలియుము. ఇవి యన్నియుఁగొఱత పడినను సత్త్వము, రజస్తమములనెడి మూఁడు గుణములును, శాశ్వతమును మోక్షకారణమును నగు త్రివర్గమని చెప్పఁబడును. ఈత్రివర్గమునుండి మిక్కిలియు విడివడిన మనుష్యుఁడు ముక్తుఁడని చెప్పఁబడుచున్నాఁడు. సమస్తకార్యముల నాశమును మోక్షమని చెప్పఁబడుచున్నది. కాబట్టియే, మోక్షకామియై దేవదేవుండగు పితామహుఁడెప్పుడును లోకయాత్ర నెలకొనియుండునట్టిదియు సంతుష్టికి సాధనమయినదియు నగు త్రివర్గమునకైనరక్షావిధిని జగమున కుపదేశించెను. ధర్మము, అర్థము, కామము ననెడి యీమూఁటిని గాలమునకుఁ దగునట్లు లనుష్ఠింపవలయును. కార్యముల కన్నిటికిని ధర్మము మూలము. రాజు ధర్మముచేతనే భూమిని జిరకాలము రక్షించుచున్నాఁడు. అర్థకామములు లేనివాఁడయినను దుఃఖము గలవాఁడయినను, ధర్మవర్తనుండగురాజు చిరకాలము భూమిని బరిపాలించుచు వచ్చును. ఈవిషయమై అంగిరస్సు (బృహస్పతి) రెండు శ్లోకములను పాడియున్నాఁడు వానిని వినుము. — రాజు ధర్మముచొప్పునఁ గార్యములను జేసి భూమిని నగరమందలి జనులను జక్కఁగాఁ

బరిపాలించి పరలోకమున సుఖముగా వెలుంగును. ప్రజలను లెస్సగాఁ బరిపాలించు రాజు ధర్మము లెల్లఁ జేసినట్టివాఁడగును. తపముచేతను యాగములచేతను వానికిఁ బనయేమి?' అనుటయే. [శుక్రుఁడుపాడిన గీతములను వినుము. ఇవి దండనీతికిని త్రివర్గమునకును మూలములయినవి. రాజు తనసిద్ధికిఁ గారణమయిన పదియాఱంగములుగల సేనను, విషమును, మాయను, దైవమును, పౌరుషమును, తూర్పును త్తరపు(ఈశాన్యపు)భాగమందుఁదగ్గియు నదియు మూఁడు విధములయిన త్రివర్గములచేత నిండినదియునగు కోటనుబడిసి వెట్టుకొని యుండవలయును. (సంధి మొదలయిన) యాఱును,(శత్రువు,పదార్థము,స్త్రీ,వాక్కు, అపరాధములను వీని చేతనైనవైరములు) ఐదును,(లోభము,కోపము,ఆలస్యము,అసత్యము, అజాగ్రత్త,భయము, చాంచల్యము,మూఢత్వము, అన్యాయము, అవమానము అనెడు) పదియును, (కృషి, వ్యాపారము, కోట, అనకట్ట, ఏనుఁగులు పట్టుచోటు, రత్నము లున్నచోటు, పన్ను దీయుచోటు, నాథుఁడులేనిచోటనెడి) యెనిమిదిని జయించి, పదివిధములయిన త్రివర్గములతోడఁ గూడిన రాజును దేవతలకును గెలువనలవిగాదు. రాజు, స్త్రీలును, వివేకశూన్యులును, దైవముచేఁ బుద్ధిగొట్టువడిన వారును, వేదాధ్యయనము చేయని వారును, నగువారల బుద్ధిని నెంతమాత్రము వినరాదు. వీరల బుద్ధి ఋజువుగాఁ జెల్లుటకుఁ దగినదిగాదు. చదివిన వారులు లేనివియు, స్త్రీలు ప్రధానరాఁడుగాఁ గలవియు, మూర్ఖుఁడు మంత్రిగాఁగలవియు, అగ్నులచేత దహింపఁబడినవియు నగురా

[ ] దీనిలోని పాఠము ఔత్తరాహ్నికులందుఁ జూపట్టదు. మఱియును అధ్యాయ విచ్ఛేదమును లేదు.

జ్యములు (వేసవియందలి) జలబిందువులవ లె పాడుపడిపోవును. ప్రసిద్ధులయిన విద్వాంసులును,ఆపు లయిన సుహృదులును, గ ర్త వ్యములను జెప్పునవిగాఁ జూపట్టు సమ స్తకార్యములందును వారి మాటలు రాజువినవలయును. ధైవమును బౌరుషమును ద్రివర్గము ను నాశ్రయించిన రాజు దేవతలకును బ్రాహ్మణులకును మొక్కిక్కి జయసంపన్నుఁ డగును " అనెను.] ఇది యఱువదియైనిమిదవ యధ్యాయము.

రాజధర్మపర్వము.

{ భీష్ముఁడు ధర్మరాజునకు కృతము మొదలయిన నాలుగు యుగముల గుణము లు నిరూపించుట. }

ధర్మరాజు 'పితామహా ! దండనీతిగలదు, రాజుగలఁడు, ప్రజ లునుగలరు. (లేక యూరెంటిచేరికయుఁగలదు)* ఈమూటియందు నేది కారణముగా నెవరికి నెట్టిసిద్ధికలుగునో నాకుపదేశింపుము' అని యడిగెను.

భీష్ముఁడు "దండనీతివలననుండి రాజునకును బ్రజలకును గలు గు మహా త్త్వమును దానికిఁ గారణమును గలరూపునఁ జెప్పె దను వినుము. రాజుచేతఁ జక్కఁగాఁ జెల్లింపఁబడు దండనీతి, నా లుగువర్ణములవారిని స్వధర్మములందు నిలుపుటయేకాక య ధర్మములందుఁ బ్రవర్తింపకుండునట్లును గావించును ప్రాణుల కు దండనీతియే భయమును లేకుండునట్లు గావించు క్షేమము

* 'ఈమూటియందు నొకరివలన దక్కినవారికిఁ గలుగు ప్రయోజన మేమి చెప్పుము', అని ప్రతాపచంద్రరాయల వ్యాఖ్య.

తోడ నాలుగువర్ణములును దమదమ ధర్మములందుండునేని మరి యాదలకు మాఱుపాటులేక మొదటి మూఁడుజాతులవారునుయథావిధిని సోమాదులయిన యాగములందుఁ బ్రయత్నపడుదురు] నాలుగు వర్ణములవారును దమతమ ధర్మములందు వర్తించుచుండఁగామరియాదలు గజిబిజినొందక వర్తింపఁగా, దండనీతి వలన నెమ్మదియు, క్షేమమును గొనసాఁగుచుండఁగా, ప్రజలు చేనివలనను భయమునొందుటకు వీలులేకుండఁగా, మొదటి మూఁడువర్ణములవారును దమతమ విధిచొప్పున * స్వస్థతకై పాటుచుండఁగా, నట్టికాలములందు మనుష్యులు నిక్కముగా సుఖమునొందుదురని తెలియుము. కాలము రాజునకుఁ గారణమా! రాజు కాలమునకుఁ గారణమా! యని యీవిషయమై నీకు సంశయమువలదు. రాజేకాలమునకుఁ గారణమనుట నిజము. రాజు పరిపూర్ణముగా దండనీతి చెల్లించుచుఁ బరిపాలించునపుడు కాలములందు శ్రేష్ఠంబయిన కృతయుగము లోకమునందుఁ బ్రవర్తించును. కృతయుగమందు సకలవర్ణముల మనములును నధర్మమునందు వర్తింపవు; కావున నెచ్చటను నధర్మములేక ధర్మమే వెలుంగును. ప్రజలయోగక్షేమములు సందేహములేక సాగును; వైదికములయిన కర్మములన్నియు కొంచెమేనియుఁ గొఱవడక విలసిల్లును. సకలబుుత్తువులు నేరోగమునులేక సుఖముగానుండును. మనుష్యులకు నెలుంగును, చాయయు, మనసును తెలివితేట దొలఁకుచుండును. మనుష్యులే తెవులును లేక దీర్ఘా

* 'స్వామ్యేప్రయత్నం కుర్వన్తి త్రయోవర్ణా యథావిధి' (ఔ.మూ.) స్వామ్యమనగా స్వాస్థ్యము. కుదురుపాటు. 'సోమేప్రయత్నమ్?' అని (దా.మూ.)సోమాదులయిన యాగములందని యర్థాంతరము.

యుష్మంతులై యుందురు. ఆకాలమందు విధవలు కలుగరు. కూ్రగురులుపుట్టరు. భూమియు దున్నుటలేకయే పంటలుపండును. ఓషధులు నశ్లిఫలించును; పట్టయు, ఆకులును, పండ్లును, వేళ్లును, వీర్యము (సత్తువ) గలవిగా నుండును. అక్కాలమందు, అధర్మమను మాటలేక ధర్మమొక్కటియే యొక్కడను నుండును. ఇవి కృతయుగము గుణములని తెలియుము. రాజు దండనీతియం దొకభాగమును దో్రసిపుచ్చి తక్కినమూఁడుభాగముల ననుసరించి నిలుచునప్పుడు త్రేతయనెడు యుగమునడచును. అక్కాలమందు ధర్మము మూఁడుభాగములతో నధర్మము నొక్కభాగము కలసియుండును. భూమియు నోషధులును దున్నినచే ఫలించును. రాజుదండనీతియందు సగభాగమును వర్జించి సగభాగము ననుసరించి నిలువఁగా నపుడు ద్వాపరమనెడుకాలము లోకమునవర్తించును. అక్కాలమందు పాపము రెండుభాగములును బుణ్యము రెండుభాగములును గలసియుండును. భూమిదున్నుట మొదలయిన పాట్లవలనను సగభాగము ఫలించును. రాజు పూర్ణముగా దండనీతిని విడిచి దుర్మార్గంబునఁ బ్రజలను బాధించునపుడు కలియుగమువర్తించును. కలియుగమందెచ్చటఁ జూచినను నధర్మము పెచ్చుపెరిఁగి నిండారుటేకాక ధర్మ మెచ్చటను గానరాదు. సమస్తవర్ణముల వారిమనసులును దమదమ ధర్మములనుండి భ్రష్టములొందును. శూద్రులు భిక్షావృత్తిచేతను బ్రాహ్మణులు సేవావృత్తిచేతను జీవింతురు. యోగక్షేమములు నశించును. జాతులు సంకరమునొందును. వైదికకర్మమును మిక్కిలి తగ్గిపోవును. ఋతువులన్నియును ప్రాణులకు సుఖముగాక వ్యాధులను గలిగించుచుండును. మనుష్యుల గర్వములును వర్ణములును మన

సులును మిక్కిలి తగ్గిపోవును. ఈకలియందుఁ బెక్కులువ్యాధులు గలుగుటచే మనుష్యులు నూఱేండ్లునిండకమునుపే మరణింతురు. స్త్రీలు విధవలగుదురు. క్రూరములయిన ప్రజలుపుట్టుదురు. మేఘములు వర్షించుటయు, పయిరులు కలుగుటయుఁ గొన్నియెడల మాత్రమేయుండును. రాజులెన్నఁగా దండనీతినిజెల్లించి ప్రజలను గావఁ గోరకుండునపుడు రసములన్నియు నాశము నొందును. కాఁబట్టి రాజే కృతము, త్రేత, ద్వాపరము, కలియను నాలుగుయుగములకును గారణమగును. కృతయుగమును జేయుచుండురాజు అవ్యయంబగు స్వర్గలోకమునొందును. త్రేతాయుగమును జేయురాజించుక తక్కువయగు స్వర్గమునొందును. ద్వాపరమును సాగించురాజు తనకుఁదగినట్లుగా స్వర్గమందలి యొకి భాగమును బొందును. కలినిబ్రవర్తింపఁజేయు పాపకర్ముండగురాజు మిక్కిలియుం బాపుఁడై యప్పాపమునకుఁ దగిననరకమందు నెలకొని పెక్కేండ్లు వసించియుండును. మఱియుఁ బ్రజలపాపములందు మునింగి యపకీర్తియును బాపమునుబడయును. కాఁబట్టి ప్రాజ్ఞుండగురాజు దండనీతిని మున్నిడికొని పడయనిదానినిబడయుటయుఁ బడసినదానిని రక్షించుటయు వలయును. అపుడు ప్రజలయోగక్షేమములడ్డిలేక కొనసాగును. రాజుదండనీతిని జక్కఁగాఁ జెల్లింపఁగా నది తలిదండ్రులుంబోలె లోకములకు మేరలేర్పఱచుమర్యాదలను రక్షించుటయేకాక లోకములను భావనములుగను గావించును. ప్రాణులన్నియును దండనీతియందే నెలకొనియున్నవని తెలియుము. ఈదండనీతియొక్కటె రాజునకుఁ బరమధర్మమగును. కాఁబట్టి నీతిచొప్పున ధర్మంబునఁ బ్రజలను బరిపాలింపుము. ఇట్టి వృత్తముతోడ ప్రజలను రక్షించుచుందువేని నీవుజయింపరాని

స్వర్గమును * జయింపఁ గలవు" అనెను. ఇది యఱువదితొమ్మిదవయధ్యాయము.

రాజధర్మపర్వము.

{భీష్ముఁడు ధర్మరాజునకు రాజునకు వలయు ముప్పది యాఱు గుణములను జెప్పుట.}

ధర్మరాజు 'పితామహా ! నీవు నుంచినడవడులనెల్ల నెఱుంగుదువుగదే ! రాజిందును బరలోకమందును సుఖప్రదములయిన ప్రయోజములను సుఖముగాఁ బడయుట యేనడవడిచేత?' నని యడిగెను.

భీష్ముఁడు † 'అది ముప్పదియాఱు గుణములతోఁ గూడినది. ఆముప్పదియాఱుగుణములును ననుష్ఠించు సుగుణములుగలరాజు శుభమునొందును. ఆగుణములెవ్వియనఁగా:—రాజు రాగద్వేషములులేక ధర్మమూలాచరించుట, ఆస్తికత్వముగలిగి స్నేహముచేయుట, కూర్మమార్గంబులేకయే ధనమునొందుట, ధర్మార్థములకు హానిలేకుండునట్లు కామమునుబొందుట, పిన్నఁదనములేకయింపుగా మాటలాడుట, తన్నుఁదాను బొగడుకొనని శూరుఁడుగానుండుట, అపాత్రముల కొసఁగని దాతగానుండుట, దయతోఁ

---

* జేతాసి దుర్జయమ్' అని మూలము. జయింపరాని స్వర్గమును జయింతువని యర్థము.

† 'ఇమంగుణానాం షట్త్రింశీ షట్త్రింశద్గుణ సంయుతా' అనిమూలము. అది ముప్పదియాఱు గుణములు; ఇవి మఱివేఱు ముప్పదియాఱుగుణములతోఁ గూడియున్నవని ప్రతాపచంద్రవ్యాఖ్య.

గూడిన సమర్థుఁడుగానుండుట, పెద్దవాఁడుకాఁడని తెలిసి పొత్తు చేయుట, శత్రువని చక్కఁగానిర్ణయించినపిదప యుద్ధముసేయుట, హితులుకానివారితో దూతలను జేరనీకుండుట, పరులకు బాధ కలుగనట్లు పనులుచేయుట, అసత్తులుకానివారితో ప్రయోజన మెఱింగించుట, తన గుణములనుగాక పరులగుణములను జెప్పు ట, సాధువులుగానివారివలనఁ బన్నుదీయుట, అసత్తుకాని మను జునాశ్రయించుట, చక్కఁగాఁ బరీక్షింపక దండము విధింపకుం డుట, మంత్రమును వెలిపుచ్చకుండుట, లోభులుకానివారి కొసం గుట, అపకారముచేసినవానిని నమ్మకుండుట, అసూయలేక భార్యనురక్షించుట, అఱమఱలేక పరిశుద్ధుఁడై యుండుట, అధి కముగా స్త్రీలను గూడకుండుట, అహితముకాని రుచిగలదానిని భుజించుట, పూజింపఁదగినవారిని గర్వములేక పూజించుట, కపటములేక పెద్దలకు శుశ్రూషసేయుట, డంబులేక దేవతలను బూజించుట, నిందకు వీలుగానియట్లు సంపదనుగోరుట, అడఁకు వతోఁ బనిచేయుట, కాలమెఱింగి సమర్థుఁడుగానుండుట, పస మాలీనదికాని మంచిమాటలాడుట, అడ్డుచెప్పక యుపకరించుట, తప్పను దెలియక యెదిరింపకుండుట, పగవారిని జంపినపిదప దుఃఖింపకుండుట, కారణములేకయే కోపింపకుండుట, అపకార ముచేసినవారియెడ మృదువుగా నుండకుండుట, అనునివియె. నీవు రాజ్యమందుండి యీలోకమందు క్షేమమును గోరుదువేని యీవిధమున నుండవలయును. ఇట్టిగుణములకు వ్యతిరిక్తముగా నుండురాజు కొలఁదిలేని భయమునొందును. ఇట్లు చెప్పఁబో యీగుణముల నన్నిటిని జెప్పినరీతి ననుష్ఠించుగా

క్షేమము లనుభవించి మృతుఁడయినపిదప స్వర్గలోకమందును మహిమనొందును'' అనెను.

భీష్ముఁ డిట్లుచెప్పఁగావిని యుధిష్ఠిరుఁడు భీమాదులచేఁ బరివృతుండై పితామహుం డగునతని కప్పుడు వందనముచేసెను. బుద్ధిమంతుండగు ధర్మరాజు నతఁ డుపదేశించినయాపద్ధర్మములను నక్లె కావించెను. ఇది డెబ్బదియవయధ్యాయము.

రాజధర్మపర్వము.

భీష్ముఁడు చింతలేకుండుటకు ధర్మముతప్పట లేకుండుటకును నుపాయము నుపదేశించుట.

ధర్మరాజు 'పితామహా! ప్రజలను రక్షించురాజు మనస్సునందుఁ జింత యనుబంధము లేకుండుట యెట్లు? ధర్మమునందుఁ దప్పకుండుట యెట్లు? ఈరెంటిని నాకుపదేశింపుము' అని యడిగెను.

అందులకు భీష్ముఁడు 'రాజా! శాశ్వతములయిన ధర్మములను నీకు సంగ్రహముగానే యుపదేశించెదను; ధర్మములను విస్తరించిచెప్పినచో నవి యెప్పుడును ముగియవు. ధర్మనిష్ఠులును శాస్త్రజ్ఞులును, నియమంబున దేవతల నుపాసించువారును, గుణవంతులును, పూజ్యులునయిన బ్రాహ్మణులను నీవు నీగృహమందు వసించునట్లు చేయవలయును. మొదట వారి నీవెదుర్కొనిచని యడుగులనుబట్టుకొని మ్రొక్కినపిదప బురోహితుని మున్నిట్టుకొని కార్యములన్నియును జేయవలయును. ధర్మకార్యములను శుభకర్మములను జరిపి బ్రాహ్మణులనుగొని కార్యసిద్ధిని జయమును ననుగ్రహించునట్లు చేయవలయును. కప

టము లేనియు ధైర్యమును దెలివియును బొంది కామక్రోధము లనువర్జించి * ధర్మార్థములను రెంటిని బడయవలయును. కామ క్రోధములను మున్నడికొని ధనమును వెదకఁగోరునట్టి మూఢుం డయినరాజు ధర్మమును బోఁగొట్టుకొనుటయే కాక ధనమును బడయనేరఁడు. ఇది ధర్మము తప్పకుండుట కుపాయమగును. లోభులనును మూర్ఖులనును నర్థకామముల విషయములందు నియోగింపకుము. లోభము లేనివారును బుద్ధి సంపన్నులు నగ వారినేసమ స్తకార్యములందునునియమింపవలయును. మూర్ఖునకు కార్యములం దధికారము కలిగించినచో వాఁడు కార్యములందు సామర్థ్యము లేనందునను, కామక్రోధములతోఁ గూడియుండు టనలనను, దనయిచ్చ కొఱకుఁ దప్పుదారినిబడి బ్రజలను గుందిం చును. పంటయం దాటింట నొకపాలు పన్నుచేతను, నపరా ధులకు విధించు దండుగులచేతను, శాస్త్రమునందుఁ జెప్పఁబడిన రీతిని వర్తకులు మొదలగువారివలన రక్షణమునకుఁ బ్రతిగాఁ గయ్యొను వేతనములచేతను, సుంకములచేతను తెసవచ్చు బడిని గలిగించుకొని బొక్కసము నించుకొనవలయును. [పన్ను లిచ్చినమిగత ప్రజలకుఁ జాలకున్న కాలములందు న్యాయ యథావిధిని దీసినదియు ధర్మయుక్తంబుగను మరలనిప్పించి రాజు ప్రాలుమాలికలేఁ – నడపుచు రావలయును.] లముగా సంతరించి

---

* 'ధర

గ్రహీ

రాజు ప్రాలుమాలికలేక ప్రజలకు యోగక్షేమములఁ గల్పించు చుండవలయును. రక్షించువాఁడును, వలయునది యొసంగువాఁ డును, ధర్మమునం దెప్పుడును వ ర్తించువాఁడును, సోమరితనము లేనివాఁడును, గామమును ద్వేషమును లేనివాఁడును నగు రాజు నందు మనుష్యులు రంజిలుచుందురు. కాఁబట్టి, యధర్మముచే తను, లోభముచేతను, నీవు * ధనమువచ్చుబడిని బొందరాదు. ధర్మయుక్తంబగు లాభముచేత ధనముగాకను గోరవలయును. శాస్త్రపరుఁడుగాని రాజునకు ధర్మార్థములు రెండును నిలుకడ గావు. కేవల మాధనము నార్జించు విషయమందే తగులుగల రాజు తుదకు ధర్మమును ధనమును రెంటిని బొందఁడు. అతఁడు గడించిన ధనమునంతయుఁ దగనిచోటఁబడి నశించును. మోహ మున (అవివేకమున) ప్రజలను శాస్త్రవిహితములుకాని పన్నుల చేతఁ బీడించునట్టి రాజు, ఆధనము మూలమునఁ దనకుఁ దానే గీడుకలిగించుకొనును. పాలునుగోరిన మనుష్యుఁ డావుపొదుఁ గును గో[illegible] బాలును బడయనేరఁడుగదా. అట్లు నీతికి విరుద్ధముగా [illegible] ద్యమును నలఁపినచో నది ఫలమును నొసంగఁ కు. పులువై చి నీరు త్రాగించి మంచిమాటలచేత మెల్లనబు నిసుకునట్టి యావును గాచుచు వచ్చుమనుష్యుఁ [illegible] రాజ్యమును బరిపాలించుచువచ్చు [illegible] ను న్యాయంబున రక్షించి [illegible] సములను సాటిలేని

---

* బొ. మూల [illegible] ము.

రీతిని వృద్ధినొందించును రాజు చక్కఁగాఁ బరిపాలించిన భూమి, తృప్తినొందినతల్లి పాలు మిక్కిలి చేఁపునట్లు ధాన్యమును సువర్ణమును స్వజనులవలననుండియుఁ బరులవలననుండియు నెప్పుడును బిదుకుచుండును. రాజా! చెట్టునఁ బువ్వులుగోయువానిని బోలియుండుము. బొగ్గులు చేయువాఁడవు గాకుమా! ఆరీతినుండి పరిపాలించుచు వచ్చినచోఁ జిరకాలము రాజ్యము ననుభవింపశక్తుండవగుదువు. శత్రువుల సేనలను మార్కొనఁ బోనీకు ధనక్షయము గలుగునేని, యప్పుడు బ్రాహ్మణులకావలన మంచిమాటలచేత ధనమును బడయఁగోరవలయును. క్కిలియు సంకటమునఁ జిక్కియున్ననుగాని, ధనవంతులగు బ్రాహ్మణులనుజూచి నీమనస్సు పేరాశచేఁ జలింపకుండవలయును ఇఁక నీవు సొంపు వెంపారునప్పు డిది చెప్పనలయునాఁ నీవు నీ శక్తికిని బ్రాహ్మణుల యర్హతకును దగినంతని వారలకు ధనవనొసంగవలయును. ఇట్లు మంచిమాటల బుజ్జగించుచు నీవు పాలించుచు వత్తువేని గెలువనలవిగాని స్వర్గమును బొందుదు ఇట్లు ధర్మయుక్తంబగు నడవడితోఁ బ్రజలను బరిపాలించినవలన స్వర్గప్రదమును బుణ్యంబును శాశ్వతయశంబునొందుదువు. నీవు ధర్మయుక్తం
నెచ్చరికగలిగి ప్రజలను బాలిం
గలిగి నిన్నుఁగటు
నకుఁ బరమ
యెడ మీ
కాఁ

తలంచుచున్నారు. రా జొకనాఁటికిఁ బ్రజలను భయమునుండి రక్షింపక పోయెనేని యతఁడు వేయేండ్లు నరక మనుభవించియే యాపాపము తీర్చుకొనును. ఒకనాఁటికి ధర్మంబునం బ్రజలను బా లించుట యనెడుపుణ్యమును గావించినరాజు దేవలోకమునకుం బోయి పదివేలసంవత్సరములు నాపుణ్యమువలని ఫలము ననుభవించును. చక్కఁగా యజ్ఞములు చేయువాఁడును, చక్కఁగా నమము చేయువాఁడును, జక్కఁగా తపముచేసినవాఁడును కములను జయించునో యన్నింటిని ధర్మంబునఁ బ్రజల ణము పాలించినరాజు పొందును. ఇట్టిధర్మమును బ్రయ ంబునఁ బరిపాలింపుము. ఇట్లు చేయుటవలన పుణ్యంపు ఫల ంబడసి మనస్సునొవ్వునకుఁ గట్టువడకయుందువు; స్వర్గలోక ందు మిక్కిలియు గొప్పసిరిని బొందుదువు. ఇటువంటి యుత్త ధర్మములు రాజు కానివారికి సంభవింపవు; కావున రాజొ ఁడుతప్పఁ దక్కినవా రిట్టిధర్మఫలము నొందఁదరముకాదు. బట్టి యట్టిరాజవగు నీవు ధైర్యంబున రాజ్యంబును బొంది ంబునఁ బరిపాలింపుము. సోదరంబున నింద్రునికిఁ దృప్తి గా నోరినవెల్లనిచ్చి సుహృదులగు జనులకుఁ దృప్తిగావిం దిడెబ్బదిరెండవయధ్యాయము.